# INDIAN HISTORY AND CULTURE. FROM 1526-1964AD

# (DHIS21)

# (BA – HISTORY)


## ACHARYA NAGARJUNA UNIVERSITY

CENTRE FOR DISTANCE EDUCATION

NAGARJUNA NAGAR,

GUNTUR

ANDHRA PRADESH

పాఠము - 1

# మొగల్‌సామ్రాజ్య స్థాపనకు పూర్వం భారతదేశ రాజకీయ పరిస్థితులు

## మొగల్ నామము - అర్థము - ఆధారాలు

విషయసూచిక


**1.0 లక్ష్యం**

**1.1 ఉపోద్ఘాతం**

**1.2 క్రీ.శ. 1526 నాటి భారతదేశ రాజకీయ పరిస్థితులు**

**1.3 బాబరు సామ్రాజ్య స్థాపనకు దోహదపడిన పరిస్థితులు**

**1.4 మొదటి పానిపట్టు యుద్ధం (21 ఏప్రియల్, 1526)**

**1.5 మొగల్ నామము మరియు అర్థము**

**1.6 మొగల్ చరిత్రను తెలుసుకొనుటకు గల ఆధారములు**

**1.6.1 వాఙ్మయ ఆధారము**

**1.6.2 పురావస్తు ఆధారము**

**1.6.3 విదేశీ రచనలు**


### 1.0 లక్ష్యం :

క్రీ.శ. 16వ శతాబ్దమున మొగలులు మనదేశంపై దండయాత్రచేసి, మొగల్ సామ్రాజ్యమును స్థాపించుకొనుటకు దోహదపడిన అంశములు లేదా మొగల్ సామ్రాజ్య స్థాపనకు పూర్వం వారికి అనుకూలించిన భారతదేశ రాజకీయ పరిస్థితులు, మొగల్ నామము, అర్థము మరియు మొగల్ చరిత్రను తెలుసుకొనుటకు గల ఆధారాలు మొదలగు అనేక విషయాలు తెలుసుకోవటం ఈ పాఠం యొక్క ప్రధానలక్ష్యం.

### 1.1 ఉపోద్ఘాతం :

సుదీర్ఘమైన చరిత్ర, అపూర్వమైన సంస్కృతికల్గి, ప్రపంచమున విశిష్టమైన స్థానమును అలంకరించిన భారతీయులు, చారిత్రక గుణపాఠములు నేర్చుకొనకపోవుట అత్యంతశోచనీయం. భారతీయులలోని అనైక్యత, అంతఃకలహములు విదేశీయులు మనపై దాడిచేసి, మనదేశమును స్వాధీనపరచుకొనుటకు దోహదపడెను. విదేశీయులైన గ్రీకులు, కుషాణులు, హూణులు, అరబ్బులు మొదలగువారు మనదేశమును జయించి, పరిపాలించిరి. క్రీ.శ. 13వ శతాబ్దములో (క్రీ.శ. 1206) మనదేశమున ముస్లింలు రాజ్యస్థాపన గావించుటకు దోహదపడిన రాజకీయ పరిస్థితులే మరలా క్రీ.శ. 16వ శతాబ్దము (క్రీ.శ. 1526)న బాబర్ మనదేశంపై దండయాత్రచేసి, మొగల్ సామ్రాజ్యమును స్థాపించుకొనుటకు దోహదపడెను. కనుకనే ఆచార్య శ్రీవాత్సవ పండితుడు 'చరిత్ర పునరావృత్తమగునన్న' నానుడి పేర్కొన్నట్లు సత్యమైయ్యెను.

## 1.2 క్రీ.శ. 1526 నాటి భారతదేశ రాజకీయ పరిస్థితులు :

బాబర్ దండయాత్ర సమయమున భారతదేశం అనేక చిన్న, చిన్న రాజ్యములుగా విభక్తమై అంతఃకలహములతో, స్వార్ధపర, సంకుచిత భావములతో మునిగిఉండెను. ఇట్లు చిన్నా, భిన్నముగానున్న రాజ్యములను నాలుగు ముఖ్య మండలములుగా విభజించవచ్చును. అవి ఏమనగా :

(ఎ) రెండు మహమ్మదీయ మండలములు

(బి) రెండు హిందూ మండలములు

**ఎ) 1) మొదటి మహమ్మదీయ మండలము :** మొదటి మహమ్మదీయ మండలము సింధునది ముఖద్వారము నుండి బంగాళాఖాతము వరకు అర్ధవర్తులాకారములో వ్యాపించియున్నది. ఇందు సింధు, పంజాబ్, ఢిల్లీ, జోన్‌పూర్, బీహార్, బెంగాల్ ప్రాంతాలు కలవు.

**(1) సింధు :** మహమ్మద్‌బిన్ తుగ్లక్ పరిపాలనానంతరము సింధు మండలము సుమ్రా వంశీయుల నాయకత్వమున స్వతంత్రమయ్యెను. కానీ క్రీ.శ. 16వ శతాబ్ది ఆరంభమున సింధు అశాంతి, అలజడులకు ఆలవాలమగుటచే క్రీ.శ. 1520లో కాందహార్ పాలకుడైన 'షాబేగ్ సింధూపై దాడిచేసి 'సుమ్రా' పరిపాలకుని ఓడించి సింధును ఆక్రమించెను. క్రీ.శ. 1526 బాబర్ దండయాత్ర కాలము నాటికి సింధును 'షాబేగ్' కుమారుడైన 'హుస్సేన్‌షా' పరిపాలించుచుండెను.

**(2) పంజాబ్ :** పంజాబ్ ఢిల్లీ సుల్తానత్‌లోని ఒక రాష్ట్రము. దీనిని ఇబ్రహీంలోడి బంధువగు దౌలత్‌ఖాన్‌లోడి పాలించుచుండెను. ఇతడు అధికార కాంక్షాపరుడు, ఇబ్రహీంలోడికి బద్ధ శత్రువు. ఇతడు ఇబ్రహీంలోడి ఆధిపత్యము నుండి స్వతంత్రుడు కాదలచి అతనిని పదవీ నుండి తొలగించుటకు, ఇబ్రహీంలోడి పినతండ్రియగు ఆలమ్‌ఖాన్‌తో చేతులుకలిపి, బాబరును భారతదేశముపై దండెత్తి రావలసినదిగా ఆహ్వానించెను.

**(3) ఢిల్లీ :** ఢిల్లీ సుల్తానత్‌ను కడపటిలోడి చక్రవర్తియైన ఇబ్రహీంలోడి పాలించుచుండెను. ఇతడు అసమర్థుడు, కార్యదీక్షాపరుడు గాకపోవుటచే ఇతని అధికారం ఢిల్లీ, ఆగ్రా, పరిసర ప్రాంతములకు మాత్రమే పరిమితమై ఉండెను. ఇతడు ఆవేశపరుడు, గర్వి, రాజనీతిజ్ఞత లేనివాడు మరియు ఢిల్లీ సర్దారులకు విరోధి. ఇతని పాలనను సమీప బంధువులేకాక అన్ని వర్గముల వారు కూడా ద్వేషించిరి. ఢిల్లీ సర్దారులు సమయం దొరికినపుడు తిరుగుబాటు చేయుచు, అతని పతనమునకై వేచియుండిరి. ఇతని పినతండ్రియైన 'ఆలంఖాన్‌లోఢి' అధికార దాహముతో ఢిల్లీ సింహాసనమును కబళింపనెంచి, బాబరును భారతదేశముపై దండెత్తి రావలసిందిగా ఆహ్వానించెను.

**(4) జోన్‌పూర్ :** జోన్‌పూర్ నందు ఇబ్రహీంలోడి సర్దారులైన నజీర్‌ఖాన్ లోహనీ, మరూఫ్ ఫర్మూలీ స్వాతంత్ర్యము ప్రకటించిరి.

**(5) బీహార్ :** జోన్‌పూర్ వలె బీహార్‌నందునూ ఇబ్రహీంలోడి సర్దారైన బహర్‌ఖాన్ స్వాతంత్ర్యము ప్రకటించెను.

**(6) బెంగాల్ :** బెంగాల్‌ను హుస్సేన్ వంశీయుడైన నస్రత్‌షా పరిపాలించుచుండెను. ఇతడు బాబర్ సమకాలికుడు.

**ఎ) 2) రెండవ మహమ్మదీయ మండలము :** రెండవ మహమ్మదీయ మండలమున గుజరాత్, మాల్వా, ఖాందేష్, బహుమనీ రాజ్యములను నాలుగు ముస్లిం రాజ్యములు కలవు.

**(1) గుజరాత్ :** బాబర్ దండయాత్రా కాలము నాటికి గుజరాత్‌ను 'రెండవ ముజఫర్ షా' పాలించుచుండెను. ఇతనికి మేవాడ్ రాజైన రాణాసంగ్రామ్‌సింగ్‌నకు వైరము కలదు. రెండవ ముజఫర్‌షా 1526లో మరణింపగా అతని కుమారుడైన 'బహదూర్‌షా' సింహాసనమధిష్టించెను. ఇతడు సామ్రాజ్య కాంక్షాపరుడు.

**(2) మాల్వా :**

ఫిరోజ్‌షా తుగ్లక్ కాలమున స్వతంత్రమైన మాల్వాను తుర్కీ ఖిల్జీ వంశీయుడైన రెండవ మహమ్మద్‌షా పాలించుచుండెను. ఇతడు బలహీనుడు, అసమర్ధుడగుటచే, ఇతని హిందూ మంత్రియగు 'మేధినీరామ్' సర్వాధికారములు వహించి పాలనా బాధ్యతలను నిర్వహించుచుండెను. క్రీ.శ. 1531లో గుజరాత్ పాలకుడైన బహదూర్‌షా మాల్వాను జయించెను.

**(3) ఖాందేష్ :**

తపతీ నదీతీరమునన్న ముస్లిమ్ రాజ్యము ఖాందేష్, బాబర్ దండయాత్ర కాలమున ఖాందేష్‌ను 'మిరన్ మహమ్మద్' పాలించుచుండెను. అధికార కాంక్షాపరుడైన గుజరాత్ సుల్తాన్ ఖాందేష్‌ను ఆక్రమించాలని ప్రయత్నించుటచే గుజరాత్, ఖాందేష్‌ల మధ్య తరచు యుద్ధములు జరుగుచుండెను.

**(4) బహమనీ రాజ్యము :**

క్రీ.శ. 1347లో 'హసన్‌గంగూ' స్థాపించిన బహమనీ రాజ్యము క్రీ.శ. 1481లో 'మహమ్మద్ గవాన్' మరణముతో క్షీణించి అహమ్మద్‌నగర్, బీజపూర్, బీదర్, గోల్కొండ, బీరార్ అను ఐదు స్వతంత్ర రాజ్యములుగా చీలిపోయెను. ఈ ఐదు రాజ్యములు అంతః కలహములతో మునిగి ఉండుటవలనను, విజయనగర పాలకులతో పోరాడుచుండుట వలన వారు ఉత్తరాపథ రాజకీయములలో ఎట్టి పాత్రను వహింపలేదు.

**బి) 1) మొదటి హిందూ మండలము :**

**(1) మేవాడ్ రాజ్యము :**

ఆర్యావర్తమున పేరుగాంచిన రసపుత్ర రాజ్యమైన మేవాడ్ మొదటి హిందూ మండలము. దీని రాజధాని 'చిత్తోడ్' దీని పాలకుడు 'రాణాసంగ్రామ్‌సింగ్', ఇతడు అసమాన శౌర్య, ధైర్యములు కలవాడు. ఇతడు రసపుత్ర వీరులందరిని తన నాయకత్వములో సమైక్యపరచి ఆర్యావర్తమున నున్న ముస్లింలను ఎదిరించుటకు సంసిద్ధుడైయ్యెను. భారతదేశమున మహమ్మదీయుల అధికారమును అంతముచేసి, హిందూ సామ్రాజ్యమును స్థాపించుటయే ఇతని ప్రధాన ఆశయము. ఈ ఆశయ సాధనకు విజ్ఞతతో బాబరును ఢిల్లీపై దండెత్తి రావలసినదిగా కోరెను. కాని బాబరు మొదటి పానిపట్టు యుద్ధములో ఇబ్రహీంలోడిని ఓడించి, తదుపరి కాణ్వాహ యుద్ధమున రాణాసంగ్రామ్‌సింగ్‌ను ఓడించి అతని ఆశలను అడియాశచేసి నేలకూల్చెను.

**(2) బుందేల్ ఖండ్, గొండ్వానా :**

బుందేల్ ఖండ్, గొండ్వానాలు చిన్న హిందూ రాజ్యాలు. ఇవి కూడా స్వతంత్ర రాజ్యములే.

**బి) 2) రెండవ హిందూ మండలము :**

రెండవ హిందూ మండలము దక్షిణ భారతదేశమునందు కలదు. ఇందు విజయనగర, ఒరిస్సా రాజ్యములు కలవు.

**విజయనగర సామ్రాజ్యము :**

(1) క్రీ.శ. 1336లో హరిహర బుక్కరాయ సోదరులు విద్యారణ్యుని ప్రేరణతో తుంగభద్ర నదీతీరములో విజయనగర సామ్రాజ్యమును స్థాపించిరి. బాబరు దండయాత్ర కాలమునాటికి తుళువ వంశజుడైన శ్రీకృష్ణదేవరాయులు పరిపాలించుచుండెను.

శ్రీకృష్ణదేవరాయులు, బహమనీ సుల్తానులతో నిరంతర యుద్ధములు సాగించి, వారి ఉత్తరాపథ విస్తరణను అరికట్టి, మొగల్‌సామ్రాజ్య స్థాపనకు దోహదపడెను.

**(2) ఒరిస్సా :**

క్రీ.శ. 1526 నాటికి ఒరిస్సాను ప్రతాపరుద్రగజపతి పాలించుచుండెను. బెంగాల్ నందలి ముస్లిము రాజ్యము దక్షిణముగా విస్తరించుటకు గజపతులు అడ్డుగోడలుగా నిలచిరి.

## 1.3 బాబరు సామ్రాజ్య స్థాపనకు దోహదపడిన పరిస్థితులు :

(1) భారతదేశము అనేక చిన్న, చిన్న రాజ్యములుగా విడివడి, రాజకీయ అనైక్యతతో, అంతఃకలహాలతో మునిగి ఉండుట.

(2) ఈ రాజ్యములన్నింటిని సమైక్యపరచి, విదేశీదాడుల నెదుర్కొనుటకు శక్తివంతమైన రాజ్యముగాని, బలీయమైన చక్రవర్తిగాని లేకుండుట.

(3) విచ్ఛిన్నకరశక్తుల నరికట్టగల బలీయమైన కేంద్ర ప్రభుత్వము లేకుండుట.

(4) నాడు హిందూ, ముస్లిమ్ మండలమునందలి పాలకుల మధ్య స్నేహపూరిత వాతావరణ పరిస్థితులు లేకపోవుటయేగాక, వారు పరస్పర సంఘర్షణలతో మునిగిఉండుట.

(5) భారతదేశమందలి రాజ్యములకు విశాల సైన్యమున్నను క్రమశిక్షణ లేకపోవుట, పురాతన యుద్ధ పద్ధతులను అనుసరించుట.

(6) స్థానిక పాలకులైన హిందువులు, మహమ్మదీయులు స్వార్ధపరత్వముతో, అవివేకముగా బాబరును దండయాత్రను ఆహ్వానించుట.

ఈ విధముగా "క్రీ.శ. 16వ శతాబ్ది ఆరంభమున భారతదేశము ఒక కుప్పగా పోసిన రాజ్యముల దొంతరయై, దానిని జయింపవలెనడి దృఢసంకల్పము, శక్తి సామర్ధ్యములు గల విజేతకు సునాయాసముగా వశమగునని" ఆచార్య ఈశ్వరప్రసాద్ నుడివెను.

"India was a congeries of states at the opening of the 16th century and hence likely to fall an easy prey before an invader who had the strength and the will to attempt her conquest" - Iswari Prasad.

## 1.4 మొదటి పానిపట్టు యుద్ధము (21 ఏప్రియల్, 1526) :

స్థానిక పాలకుల ఆహ్వానమును పురస్కరించుకొని, బాబరు 21 ఏప్రియల్ 1526న మొదటి పానిపట్టు యుద్ధమున కడపటి ఢిల్లీ సుల్తాన్‌అగు ఇబ్రహీంలోడిని ఓడించి, వధించి, ఢిల్లీ, ఆగ్రాలను ఆక్రమించెను. ఈ యుద్ధమున లోడి వంశము పతనముకాగా, భారతదేశమున మొగల్ సామ్రాజ్యంను స్థాపించబడెను.

## 1.5 మొగల్ నామము మరియు అర్ధము :

'మొగల్' అనుపదము ఒక వంశనామము. ఇది 'మంగోల్' అను పదమునుంచి వచ్చినది. మంగోల్ అనే పదం నుండి మొగల్ అనే పదము రూపొందుటకు కారణమేమనగా, మొగల్ వంశమువారు మనదేశాన్ని పాలించే రోజులలో ఐరోపా దేశీయులు అనేకమంది వ్యాపారస్థులుగా వచ్చి మొగల్ దర్బార్‌ను సందర్శించిరి, మొగల్ వంశము వారి సహజ నామమైన 'మంగోల్' అనే పదం వారి, వారి భాషలలో వేరు, వేరు రూపాలుగా పేర్కొనిరి.

## 1.6 మొగల్ చరిత్రను తెల్సుకొనుటకు గల ఆధారములు :

మన దేశచరిత్రలో మొగల్ చరిత్రకు లభ్యమగు ఆధారములు ఏ యుగమునకు లేవు. ఇందుకు ముఖ్యకారణములు ఏమనగా

1) మొగల్ చక్రవర్తులలో పెక్కురు సాహితీవేత్తలగుట, వారిలో అధికులు అనేకమంది కవులను, పండితులను పోషించుట
2) మనదేశమున ఇస్లామ్ ఆవిర్భవించిన నాటి నుండి, ఇస్లాం పాలనను గూర్చి సాధారణ చరిత్రలు రాయబడుట.
3) చక్రవర్తుల ఫర్మానాలు, ప్రభుత్వ ఆజ్ఞాపనా పత్రాలు.
4) కార్యదర్శులు సేకరించిన చారిత్రక లేఖలు. వీటిని 'మున్షీలు' అని పిలిచేవారు.
5) మత వాఙ్మయము
6) మతప్రచారకులుగా, యాత్రికులుగా భారతదేశమును సందర్శించిన పెక్కు విదేశీయుల రచనలు.
7) పురావస్తు ఆధారములు.
8) విమర్శకుల రచనలు.

మొగల్ చరిత్రకు లభ్యమగు ఆధారములను మూడు శీర్షికలుగా విభజించవచ్చును. అవి ఏమనగా

(1) వాఙ్మయ ఆధారములు
(2) పురావస్తు ఆధారములు
(3) విదేశీ రచనలు

### 1.6.1 వాఙ్మయ ఆధారములు :

### (ఎ) బాబరు - హుమాయూన్‌ల కాలము :

'తుజుక్ - ఇ - బాబరీ' ను మొగల్ యుగమున రాయబడిన తొలి చారిత్రక గ్రంథము. బాబరు టర్కి భాషలో రాసిన స్వీయచరిత్ర 'తుజుక్-ఇ-బాబరీ' ద్వారా బాబర్ కాలమును, హుమాయూన్ తొలి జీవిత విశేషములను తెలుసుకొనుటకు వీలగుచున్నది.

'తారీఖ్ - ఇ - రషీద్' : దీనిని బాబరు బంధువగు 'మీర్జా మహమ్మద్ హైదర్ దుఘ్లాత్' రాసెను. ఇందు బాబర్ దిగ్విజయములు, షేర్షా - హుమాయూన్‌ల సంఘర్షణ, కాశ్మీర్ చరిత్ర వర్ణింపబడెను.

హబీబ్ - ఉస్ - సియర్ : దీనిని 'ఖ్వాంద్ అమీర్' రాసెను. బాబరు గురించి, హుమాయూన్ మొదటి 3 సంవత్సరముల పాలనను గురించి రచించబడెను.

'అహ్సన్-ఉస్-సియర్' : దీనిని 'మీర్జా బర్ఖుర్దార్ టర్క్‌మాన్' రాసెను. ఇందు 16వ శతాబ్దంలో భారత, పారశీక దేశముల మధ్య సంబంధములు, పారశీ చక్రవర్తియగు షా ఇస్మాయిల్‌కు బాబరుకు గల సంబంధము వర్ణింపబడెను.

'తారీఖ్-ఇ-షాహి' : దీనిని 'అహమ్మద్ యాద్గర్' రాసెను. ఇందు అఫ్ఘనులు బాబరు, హుమాయూన్‌లతో పోరాడి, తిరిగి అధికారమును పొందిన విధమును తెలుపబడెను.

**'షైబానీ నామా' :** దీనిని 'మహమ్మద్ సాలిహ్' రాసెను. ఇందు బాబర్‌కు, ఉజ్బెక్ పాలకులకు మధ్య గల సంబంధములు వర్ణింపబడెను.

**'హుమాయూన్ నామా' :** దీనిని బాబరు కుమార్తెయగు 'గూల్‌బాదన్ బేగమ్' రాసెను. ఇందు బాబరు, హుమాయూన్‌లు తమ బంధుమిత్రులతో వ్యవహరించినతీరు, వారి మనోగత భావములు వర్ణింపబడెను.

**'తజ్కిరాత్-ఉల్-వాకిఆత్'** దీనిని హుమాయూన్ ప్రవాస జీవితములో అతనిని అనుసరించిన 'జౌహర్' అను సేవకుడు రాసెను. ఇందు హుమాయూన్ పాలన, అతని ప్రవాసజీవిత విశేషములు రాయబడెను.

ఇంకను హుమాయూన్ గూర్చి తెలిసికొనుటకు తారీఖ్-ఇ-హుమాయూన్, కానూన్-ఇ-హుమాయూన్ మొదలగు రచనలు తోడ్పడుచున్నవి. షేర్షాను గూర్చి తెల్సుకొనుటకు 'అబ్బాస్ సర్వానీ' రాసిన 'తారీఖ్-ఇ-షేర్‌షాహి' ముఖ్యమైనది.

## బి) అక్బరు కాలము :

'తారీఖ్-ఇ-అక్బరుషాహి' : దీనిని అక్బరు రెవిన్యూశాఖ ఉద్యోగియైన 'హాజీ మహమ్మద్ ఆరిఫ్‌కందాహారీ' రాసెను. ఇందు అక్బరు వ్యక్తిత్వము, అతని పరిపాలన సవిస్తరముగా వర్ణింపబడెను.

'అక్బరునామా' 'అయినీ-ఇ-అక్బరీ' ఈ రెండు గ్రంథములను అక్బరు ఆస్థాన పండితుడు, అతని ప్రియమిత్రుడగు 'అబుల్‌ఫజల్' రాసెను. మొగల్‌యుగ చరిత్ర ఆధారములలో ఈ గ్రంథములు తలమానికవంటివి. కనుకనే 'మొగల్ చరిత్ర రాసే ఏ చరిత్రకారుడైనా ఈ గ్రంథములను పఠించకుండా ఎట్టి రచన చేయలేడని 'లూనియా' (Luniya) పండితుడు పేర్కొనెను.

'రుక్-ఆల్-అబుల్ ఫజిల్' : ఇది అక్బరు తన బంధువులకు, కుటుంబ సభ్యులకు రాసిన లేఖల సంకలనము. దీనిని 'అబుల్‌ఫజల్' సంతరించెను.

'తబ్‌కాత్-ఇ-అక్బరీ' ఇది ఒక సామాన్య చారిత్రక గ్రంథము. దీనిని "మీర్‌బక్షి ఖ్వాజీ నిజాముద్దీన్" రాసెను. ఇందు మూడు సంపుటములు గలవు. ఇందు ఢిల్లీ సుల్తానత్ యుగము, బాబరు, హుమాయూన్, అక్బరుల పాలనాకాలము, ప్రాంతీయరాజ్యాల చరిత్ర వివరింపబడెను. గుజరాత్ చరిత్రకు ఇది ఒక అమూల్యమైన ఆధారము.

"తారీఖ్-ఇ-బదీనీ" : దీనిని సుప్రసిద్ధ చరిత్రకారుడైన "అబ్దుల్ కాదిల్ బదేనీ" రాసెను. ఇతడు సున్నీమతస్థుడు. అందుచే ఇతడు అక్బరు లౌకిక విధానమును విమర్శించెను.

## (సి) జహంగీర్ పాలనా కాలము :

'తారీఖ్-ఇ-ఫెరిస్తా' : దీనిని 'మహమ్మద్ కాశిం ఫెరిస్తా' రాసెను. ఇందు జహంగీరు సింహాసనమధిష్టించువరకు భారతదేశ ముస్లిం పాలనను గూర్చి, మరియు దక్కను సుల్తానుల గూర్చి వర్ణింపబడెను.

'తుజుక్-ఇ-జహంగీర్' : ఇది జహంగీర్ స్వీయచరిత్ర. దీనిద్వారా జహంగీరు వ్యక్తిత్వము, అతని పాలనా విశేషములు తెలుసుకొనుటకు ఇది ఒక అమూల్యమైన గ్రంథము.

ముతమిద్‌ఖాన్ రచించిన 'ఇక్బాల్ - నామా ; మహమ్మద్ హరీ రాసిన 'వాకిఆత్-జహంగీర్'; ఖ్వాజా నియామతుల్లా హరవి రాసిన "తారీఖ్-ఇ-ఖాన్-జహనీ"; ఖ్వాజా కాప్‌గార్ ఫైరత్ ఖాన్ రచించిన "మఆసిర్-ఇ-జహంగీర్" మొదలగు ఇతర రచనలు కూడా జహంగీరు కాలమునకు సంబంధనలే.

**(డి) షాజహాన్ కాలము :**

షాజహాన్ ఆస్థానము నలంకరించిన జగన్నాథ పండితుడు, జనార్ధనభట్టు రచనలు, అబ్దుల్ హమీర్ లహౌరీ రాసిన 'పాదుషానామా' అమీనాయీ కజ్వీనీ రాసిన 'పారూషానామా', మహమ్మద్ సాలీ గ్రంథమగు 'అమల్-ఇ-సాలీ'; 'ఇనాయాత్‌ఖాన్'; 'మహమ్మద్ సాదికోల 'షాజహాన్ నామా' మొదలగునవి షాజహాన్ కాలమునకు సంబంధించిన రచనలు. మొగల్ చరిత్ర ఆధారముగా ఉపకరించుచున్నవి.

**(ఇ) ఔరంగజేబు కాలము :**

ఔరంగజేబు చరిత్ర రచనను నిషేధించిననూ, అతని కాలమున పెక్కు చారిత్రక గ్రంథములు వెలువడుట అబ్బురము. అందు ముఖ్యమైనవి 'ఆలంఫిర్ నామా' దీనిని 'మీర్జామహమ్మద్ కాజిమ్' రాసెను. ఇందు ఔరంగజేబు తొలిపది సంవత్సరముల పాలనా కాలము వర్ణింపబడెను.

"మ అసిర్-ఇ-ఆలంఘ" దీనిని 'మహమ్మద్ సాకేముస్తయిద్' రాసెను.

హకీరీ రాసిన 'ఔరంగజేబ్ నామా'; ఖాఫ్‌ఖాన్ రాసిన "ముస్తాఖాబ్-ఉల్-బబాబ్"; అకిల్‌ఖాన్ రాసిన "జఫర్-నామా-ఇ-ఆలంఘర్"; ఔరంగజేబు రాసిన "ఫతావా-ఇ-ఆలంఘర్" మొదలగు గ్రంథములు కూడా ఔరంగజేబు కాలమునకు చెందినవే.

**(ఎఫ్.) స్థానిక రచనలు :**

స్థానిక రచనలు కూడా చరిత్ర ఆధారములుగా ఉపకరించుచున్నవి. అట్టివానిలో ముఖ్యమైనవి. 'ఈశ్వరదాసు' రాసిన 'ఫతూహత్-ఇ-ఆలంఘర్' (రాజస్థాన్ చరిత్ర); 'కల్నల్‌టాడ్' రాసిన "Annls and Antiquities of Rajasthan"; కృష్ణాజీ అనంత్ సుభాసద్" రాసిన "శివ ఛత్రపతిబెన్ చరిత్ర" మొదలగునవి.

**1.6.2 పురావస్తు ఆధారములు :**

**ఎ) శాసనములు :** మొగల్ చక్రవర్తులు శాసనములను పెద్దగా వేయించలేదు. వేయించిన కొద్ది శాసనములు వారి చరిత్రకు ప్రామాణికముగా ఉపయోగపడవు.

**బి) నాణెములు :** మొగల్ చక్రవర్తులు ముద్రించిన నాణెములు చరిత్ర రచనకు బాగుగా తోడ్పడతాయి. జహంగీర్, నూర్జహాన్ నాణెములు నాటి ఆర్థిక పరిస్థితులను తెల్సుకొనుటకు ఉపయోగపడుచున్నవి.

**సి) భవన నిర్మాణము :** మొగల్ చక్రవర్తులు నిర్మించిన అసంఖ్యాక కట్టడములు వారి కళాపోషణకు నిదర్శనముగా ఈనాటికి నిలిచిపోయినాయి. అట్టివానిలో ముఖ్యమైనవి ఆగ్రాకోట, ఎర్రకోట, ఫతేపూర్‌సిక్రి, తాజ్‌మహల్, మయూర సింహాసనము, కోహినూరు వజ్రము మొదలగునవి.

**1.6.3 విదేశీ రచనలు :**

మొగల్ యుగమున పెక్కు ఐరోపావాసులు భారతదేశమును సందర్శించి తమ అనుభవములను, నాటి కాలపరిస్థితులను, తమ రచనలలో వర్ణించిరి.

**ఎ) ఆంగ్లేయులు :**

రాల్ఫ్‌ఫిష్ (1583 - 1591); జాన్ మిల్డెన్‌హల్ (1599 - 1606); విలియమ్ హాకిన్స్ (1608 - 1613); విలియం ఫించ్ (1608 - 1614); నికోలస్ విల్లిగ్టాన్ (1612 - 1616); థామస్ కార్యత్ (1612 - 1617); ఎడ్వర్డ్ టెర్రీ (1616 - 1619); సర్ థామస్‌రో. వీనిలో థామస్‌రో రచనలు జహంగీరు కాలమునకు, ఆంగ్ల వర్తక కేంద్ర స్థాపనా చరిత్రకు అమూల్యమైన ఆధారములు.

బి) డచ్ : డిలిట్ (DELAET)

సి) ఇటలీ : పీట్రో డెల్లా వల్లీ, పీటర్‌మండీ.

డి) జర్మనీ : మాండెల్లో (MANDELSLO)

ఇ) ఫ్రెంచి : బార్నియర్, టావెర్నియర్, దీవెనాట్ (THEVONOT)

ఎఫ్) వెనిస్ : మనూస్సి (MANUCCI)

మొదలగు విదేశీ రచయితలు తమ అనుభవములను, పేర్కొనిరి. విదేశీ రచనలలో మత, జాతిపరమైన పక్షపాత వైఖరి, కొన్ని అభూత కల్పనలు చోటుచేసికొనినను, వాని నుండి లభించు సమాచారము అత్యంత అమూల్యమైనది.

**మాదిరి ప్రశ్నలు :**

**1. ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలు వ్రాయుము**

1) బాబరు దండయాత్ర సమయమున భారతదేశ రాజకీయ పరిస్థితులను వర్ణించుము ?
2) మొగల్ చరిత్రకు గల ఆధారములను వివరింపుము ?

**2. లఘు వ్యాసరూప ప్రశ్నలు :**

1) ఢిల్లీ
2) మేవాడ్ రాజ్యము
3) బాబరు సామ్రాజ్య స్థాపనకు దోహదపడిన పరిస్థితులు
4) బాబరు - హుమాయూన్‌ల కాలమునాటి వాజ్మయ ఆధారములు

**చదువదగిన గ్రంథాలు :**

1. The Mughal Empire in India - S.R. Sarma
2. The Mughal Empire - A.L. Srivastava
3. The Mughal Rule in India - Edwards & Garrat
4. Medieval India - Iswari Prasad
5. Indian History and Culture Vol. II - Dr. B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao
6. An advanced History of India Vol. II & III - R.C. Mujundar, Raya Chowdari & K.K.Datta

**C. RAVINDRA RAJU,**
**M.A.,**

పాఠం - 2.2

# హుమాయూన్ (క్రీ.శ. 1530 - '40, క్రీ.శ. 1555 - '56)

**విషయసూచిక**


2.2 లక్ష్యం

2.2.1 ఉపోద్ఘాతం

2.2.2 తొలిజీవితం

2.2.3 హుమాయూన్ పట్టాభిషేకం

2.2.4 హుమాయూన్ ఎదుర్కొనవలసిన సమస్యలు

2.2.4.1 అంతర్గత సమస్యలు

2.2.4.2 బాహ్యమైన సమస్యలు

2.2.5 హుమాయూన్ వ్యక్తిగత లోపములు

2.2.6 హుమాయూన్ సామ్రాజ్య విస్తరణ కార్యక్రమము లేదా అతడు చేసిన యుద్ధములు

2.2.7 హుమాయూన్ ప్రవాస జీవితం (1540 - '55)

2.2.8 హుమాయూన్ మొగలు సింహాసనమును తిరిగిపొందుట (1955)

2.2.9 హుమాయూన్ మరణము

2.2.10 హుమాయూన్ ఓటమికి గల కారణములు

2.2.11 గుణశీలములు


## 2.2 లక్ష్యం :

హుమాయూన్ తొలిజీవితం, అతడు సింహాసనమునకు వచ్చునాటికి మొగల్‌సామ్రాజ్య పరిస్థితులు, హుమాయూన్ చేసిన యుద్ధములు, హుమాయూన్ ఓటమికి గల కారణాలు మొదలగు అనేక విషయములు తెలుసుకొనుటయే ఈ పాఠం యొక్క ప్రధానలక్ష్యం.

## 2.2.1 ఉపోద్ఘాతము :

మొగలాయీ వంశ పాలకులలో రెండోవాడు హుమాయూన్. "హుమాయూన్ జీవితమునకు భగవంతుడు ప్రసాదించిన అమూల్య కానుక అతని వ్యక్తిత్వములో ఇమిడియున్న పట్టుదల, ఈ విశిష్ట లక్షణమే అతనిలో లేకపోయిన యెడల అతడు హిందూస్థాన్‌ను తిరిగిపొందుట అసంభవమయ్యేడిది" అని ఆచార్య ఈశ్వరప్రసాద్ పేర్కొనెను.

## 2.2.2 తొలిజీవితం :

హుమాయూన్ పూర్తిపేరు నసీరుద్దీన్ మహమ్మద్ హుమాయూన్. ఇతడు బాబరు పెద్ద కుమారుడు. బాబరుకు అత్యంత ప్రియమైన 'మహమ్‌బేగమ్'కు క్రీ.శ. 1508 మార్చి 6వ తేదీన కాబూల్‌లో జన్మించెను. బాబరు కాబూలును జయించిన తదుపరి పుట్టిన వాడగుటచే ఇతనికి హుమాయూన్ (టర్కిభాషలో హుమాయూన్ అనే పదమునకు 'అదృష్టవంతుడు' అని అర్థము.) అని పేరు పెట్టెను.

సహజముగా పాండిత్య ప్రియుడైన బాబరు తన కుమారునికి మంచి పండితులైన 'ఖ్వాజాకలాన్' 'షేక్‌జైనుద్దీన్' ల వద్ద విద్యాభ్యాసము గావించెను. వారి శిక్షణలో తుర్కి, అరబ్బీ, పారశీక భాషలలో మంచి పాండిత్యమును గడించెను. చరిత్ర, భూగోళము, గణిత, జ్యోతిష, తాత్విక శాస్త్రములందు ప్రవేశము పొందెను. గుర్రపుస్వారీ, కత్తియుద్ధము, తుపాకీ పేల్చడం, అనేక యుద్ధ విద్యలలోను, వేటాడటంలోను కొండచరియలలో, అడవులలోను మార్గాలను వెదకి పట్టుకోవడంలోను హుమాయూన్ శక్తి, సామర్థ్యాలను సంపాదించెను. క్రీ.శ. 1520 నుండి 1529 వరకు 'బదక్షాన్' కు గవర్నర్‌గా పనిచేసి, ఉద్రేకపూరితులు, ఆవేశపరులు అయిన ఉజ్బేగ్‌లను చాకచక్యంతో అణిచి, మంచి పరిపాలనానుభవాన్ని గడించెను. పానిపట్, కణ్వా, గోగ్రా యుద్ధములలో పాల్గొని తండ్రి విజయాలకు కారకుడైనాడు. ఇట్లు యుద్ధానుభవం, రాజ్య పరిపాలనానుభవం గడించి, అన్ని సమయములలో బాబరుకు అత్యంత అండదండలుగా నిలిచి, 1529లో 'శంభాల్'లో గవర్నర్‌గా పనిచేసినాడు. ఈ కాలంలోనే భూగోళ, జ్యోతిష శాస్త్రములలో తనకున్న పాండిత్యముపై నమ్మకమును పురస్కరించుకొని హుమాయూన్ అనేక రకాల పరిశోధనలు, ప్రయోగాలు చేసెను.

## 2.2.3 హుమాయూన్ పట్టాభిషేకం :

క్రీ.శ. 1529లో హుమాయూన్ భయంకరమైన వ్యాధికి గురియైనాడు. అతనిని వ్యాధి నుండి రక్షించుటకు బాబరు దీక్ష పూనటమేకాక, తన ప్రాణమునైనా తీసుకొని, తన కుమారుని ప్రాణములు నిలుపుమని అల్లాని ప్రార్థించెను. అల్లా కృపవలన క్రమముగా హుమాయూన్ ఆరోగ్యము కోలుకొనుచుండగా, బాబరు వ్యాధిగ్రస్తుడైనాడు. క్రీ.శ. 1530లో బాబరు తన మంత్రుల సమక్షములో హుమాయూన్‌ను తన వారసునిగా ప్రకటించి, మరణించెను. తండ్రి చనిపోయిన నాలుగో రోజున అంటే క్రీ.శ. 1530లో డిశంబరు 29న హుమాయూన్ పట్టాభిషేకం చేసుకొని రాజ్యాధికారము స్వీకరించినాడు.

సింహాసనము కొరకు హుమాయూన్‌తో పోటీపడినవారు అతని సోదరుడు 'క్రమాన్', బాబర్ అల్లుడు 'మహమ్మద్ జమాన్ మీర్జా' అయి ఉండవచ్చును.

## 2.2.4 హుమాయూన్ ఎదుర్కొన వలసిన సమస్యలు :

పట్టాభిషేకం వలన కలిగిన ఆనందం అట్టేకాలం నిలవలేదు. హుమాయూన్ అనేక సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చెను. ఢిల్లీ సింహాసనము పూలపానుపు వలెగాక ముళ్ళశయ్యగా ఉండెను. చక్రవర్తి వ్యక్తిగత గుణగణములపైనే ఏ రాజ్య మనుగడయైనను ముఖ్యముగా ఆధారపడి యున్నదనుటకు హుమాయూన్ జీవితము ఒక నిదర్శనము. ఎటు చూచినను శత్రుపరివేష్టితుడై జీవితాంతము అనేక కష్టములనెదుర్కొనుచు దాని నుండియే బయటపడెను. హుమాయూన్ ఎదుర్కొన్న సమస్యలను రెండుగా విభజించవచ్చు. ఎ) అంతర్గత సమస్యలు, బి) బాహ్యమైన సమస్యలు.

### ఎ) అంతర్గత సమస్యలు :

### 1) భౌగోళిక విభిన్నత్వము :

భౌగోళికంగా బాబరు సామ్రాజ్యం విభిన్నమైంది. వివిధ దేశాలలోని ప్రాంతాలతో కూడియున్న రాజ్యం. దీనిలో మధ్య ఆసియాలోని బాల్క్, బదక్షాన్‌లు, ఆఫ్ఘనిస్తాన్‌లోని కాబూల్, ఘజనీ, హిరటీలు, హిందూదేశంలోని పంజాబ్, సింధు, ముల్తాన్, రాజస్థాన్ మొదలగునవి మొగల్ సామ్రాజ్యములోని భాగాలు.

### 2) విచ్ఛిన్న పరిపాలన :

బాబర్‌చే నియమించబడిన జాగీర్దారులు, ఇతర అధికారులు, బాబరు మరణాంతరము సింహాసనమధిష్టించుటకు మొగలు శత్రువులతో చేతులు కలిపి హుమాయూన్‌ను పదవీచ్యుతుని గావించుటకు ప్రయత్నించుచుండిరి.

### 3) ఖాళీ ఖజానా :

హుమాయూన్ రాజ్యానికి వచ్చేనాటికి రాజబొక్కసమంతా ఖాళీయైనది. బాబరు చేసిన యుద్ధాలు, కట్టిన భవనాలు, చేసిన దానధర్మాలు ఇందుకు కారణం. హుమాయూన్ రాజ్యం చేపట్టిన తరువాత కూడా తగిన చర్యలను తీసుకొనకపోగా విపరీతంగా పట్టాభిషేకానికి, 'దిన్‌ఫణానగర నిర్మాణానికి' హిందాల్ వివాహానికి ఖర్చుచేసినాడు.

### 4) సైన్యము :

హుమాయూన్‌కు సంక్రమించిన మొగల్ సైన్యము క్రమశిక్షణకు కట్టుబడి ఉండక కలహ ప్రియంగా మారిపోయింది. మొగల్ సైన్యంలో తుర్క, ఆఫ్ఘనిస్తాన్, పర్షియా, బదక్షాన్, మంగోలియా మొదలగు దేశాలకు చెందిన అనేక తెగలవారున్నారు. వీరు పాదుషా పట్ల విశ్వాసపాత్రులై ఉండక, బాబర్ మరణానంతరము మరింత రెచ్చిపోయిరి. వీరు తమ స్వస్థలములకు వెళ్ళవలెనని వాంఛించుచుండిరి. ఇట్టి సైన్యమును క్రమశిక్షణలో ఉంచుట హుమాయూన్‌కు పెద్ద సమస్యగా తయారయ్యెను. దానితో మొగల్ సైన్యము తన పూర్వపు యుద్ధ పద్ధతులను విడిచి, సామాన్యంగా తయారైంది.

### 5) పితృరాజ్య విభజన :

హుమాయూన్ తన తండ్రి కోరిక ప్రకారం పిత్రార్జితమైన రాజ్యమును తన సోదరులైన కమ్రాన్‌కు కాబూల్, కాందహార్, ఘజనీ, బదక్షాన్ ప్రాంతాలను, అస్కరీకి శంభాల్‌గెను, హిందాల్‌కు అల్వార్ ప్రాంతాలను ఇచ్చెను. కనుక రాజ్యము చిన్నాభిన్నమై రాజకీయ ఐక్యత నశించెను. కమ్రాన్ స్వతంత్రుడుగా ఉండాలని కాంక్షిస్తూ, హుమాయూన్ అధికారాన్ని ధిక్కరించసాగెను. అతని సోదరులే అతని పతనమును కోరిరి. రాజ్యమునకు శత్రువులుగా మారిరి.

### బి) బాహ్యమైన సమస్యలు :

1) బాబరు పానిపట్టు, గోగ్రా యుద్ధములందు అఫ్ఘనుల నోడించినను, వారి ప్రాబల్యమును సంపూర్తిగా నాశనము చేయలేదు. అందుచే వారు బాబరు మరణానంతరము తమ సార్వభౌమత్వమును పునరుద్ధరించుటకు తీవ్రముగా ప్రయత్నించుచుండిరి. ఇట్లు బెంగాల్ నందు నస్రత్‌షా, జోన్‌పూర్ నందు మహమ్మద్‌లోడి, గుజరాత్‌లో బహుదూర్‌షా, బీహార్‌లో షేర్‌ఖాన్‌లు బలవంతులై హుమాయూన్ అధికారమునకు సవాలుగ నిలిచిరి.

2) బాబరు కాణ్వాహ యుద్ధమున రసపుత్రకూటమి నాయకుడైన రాణాసంగ్రామసింగుని, అతని అనుచరులను ఓడించినను, వారి ప్రాబల్యమును సంపూర్తిగా అణచలేదు. వారు తమకి జరిగిన అవమానమును మరువలేదు. వారి బలము నశింపలేదు. ఢిల్లీ యందు హిందూ రాజ్యమును స్థాపించవలెనను కోరికను విడనాడలేదు.

## 2.2.5 హుమాయూన్ వ్యక్తిగత లోపములు :

ఇట్టి క్లిష్ట పరిస్థితులలో కార్యదీక్ష, ధైర్యసాహసములు, సమయస్ఫూర్తి, రాజనీతిజ్ఞత కలిగిన యోధాగ్రేసరుడవసరము. కాని దురదృష్టవశాత్తు ఈ స్వభావములన్నియు హుమాయూన్ నందు లేవు. పైగా హుమాయూన్ విషయ లోలుడు. నల్లమందుకు బానిస, యుద్ధము చేయాల్సిన సమయములో త్రాగిత్రుళ్ళేవాడు, శత్రువులను నిర్లక్ష్యము చేసి, వారి బలాధిక్యతను తక్కువగా అంచనా వేసెడివాడు. అందుచేతనే పిత్రార్జితమైన రాజ్యమును తన స్వీయ తప్పిదముల వలన కోల్పోయి నిరాశ్రయుడుగ కొంతకాలము గడుపవలసి వచ్చెనని చరిత్రకారులు పేర్కొనిరి.

ఇట్టి గుణగణములుండుట వలన పరిపాలకుడుగా విఫలమై, రాజ్యమునే పోగొట్టుకొనెను. హుమాయూన్ అనుమాటకు అదృష్టవంతుడని అర్థము. అయినను హుమాయూన్ అంతటి దురదృష్టవంతుడు మొగల్ చక్రవర్తులలో లేనేలేడు.

## 2.2.6 హుమాయూన్ సామ్రాజ్య విస్తరణ కార్యక్రమము (లేదా) అతడు చేసిన యుద్ధములు :

### ఎ) రాజపుత్రులతో యుద్ధం (1531) :

పట్టాభిషేకమయిన తరువాత హుమాయూన్ రాజుగా చేసిన మొదటి యుద్ధం కలింజరు దండయాత్ర. మొదటి నుండి రాజపుత్రులు మొగలులతో కలహించుచుండిరి. బుందేల్ ఖండ్‌కు అధిపతి రాణాప్రతాపుడు. ఇతడు తనబద్ధ శత్రువులైన ఆఫ్ఘన్‌లకు ఆశ్రయమిచ్చినాడనే నెపముతో క్రీ.శ. 1531లో కలింజర్‌పై దండయాత్ర చేసెను. ఈ యుద్ధములో విజయమును సాధించిన హుమాయూన్ కలింజర్ పాలకుని నుండి యుద్ధనష్టపరిహారమును మాత్రమే వసూలుచేసెను గాని కలింజర్‌ను పూర్తిగా వశపరచుకొనకపోవుట, లేదా అతనిని సామంతునిగా చేసుకొనకపోవుట హుమాయూన్ చేసిన పొరపాటు. దీనివలన అతనికి రాజనీతిజ్ఞతగాని లేక దూరదృష్టిలేదని విశదమగుచున్నది. ఈ దండయాత్ర వలన తుదకు మిగిలినది కలింజరు ప్రభువు శత్రుత్వమే.

### బి) ధౌరా యుద్ధము (1532) :

హుమాయూన్ కలింజరు దండయాత్రలో నిమగ్నుడై యున్నప్పుడు మహమ్మద్‌లోడి మొగల్‌రాష్ట్రమైన జోన్‌పూర్‌పై దాడిచేసెను. అంతట హుమాయూన్ అతనిని దౌరా (Dourah) యుద్ధమున 1532లో ఓడించి తరిమివైచెను.

### సి) చునార్‌పై దాడి (1532) :

దౌరా విజయానంతరము హుమాయూన్ బీహార్‌లో షేర్‌ఖాన్ అధీనములో ఉన్న చునార్ దుర్గంపై దాడిచేసి, దాదాపు నాలుగు నెలలపాటు అతికష్టముతో యుద్ధముచేసి, దానిని ముట్టడించి, వశపరచుకొనక, అవివేకముగా షేర్‌ఖాన్‌తో సంధి చేసికొనెను. ఇట్లు శత్రుశేషమును నిర్మూలింపక నిర్లక్ష్యముగా తన రాజ్యమును సైతము పోగొట్టుకొనెను. షేర్‌ఖాన్ లొంగుబాటులోని ఆంతర్యమును హుమాయూన్ గ్రహింపలేదు.

ఈ తొలి విజమయులనంతరము సుమారు 1 1/2 సం॥లు హుమాయూన్ విందులు, వినోదములతో కాలము వృధా చేసెను. ఈ లోపల అతని శత్రువులు బహదూర్‌షా (గుజరాత్) షేర్‌ఖాన్ (బీహార్) తమశక్తి సామర్థ్యములను పెంపొందించుకొని, హుమాయూన్ అధికారమును సవాలు చేయుచూ ఢిల్లీపై దాడులు సాగింపసాగిరి.

### డి) బహదూర్‌షాతో యుద్ధము (1535) :

గుజరాత్ పాలకుడు బహదూర్‌షా. ఇతడు గొప్పయోధుడు, పరాక్రమవంతుడు. అధికార వ్యామోహపరుడు. పోర్చుగీసువారి సహాయంతో ఫిరంగిదళాన్ని కూడా ఏర్పాటుచేసుకున్నాడు. ఇతడు మాల్వాను ఆక్రమించుటతో తృప్తిచెందక రసపుత్ర రాజ్యమైన 'మేవాడ్'నందు ప్రవేశించి చిత్తూర్ దుర్గమును ముట్టిడించెను.

అంతట చిత్తూర్ రాణియగు కర్ణావతి, హుమాయూన్ సహాయమును కోరెను. కాని హుమాయూన్ ఆసంఘర్షణ హిందూ - ముస్లిం సంఘర్షణయని, తాను ముస్లింయై హిందువులకు మద్దతుగా ముస్లింపై దండెత్తుటకు ఇస్లామ్ మత సంప్రదాయమునకు విరుద్ధమని భావించి ఆమె కోరికను తిరస్కరించెను. ఈ ఉదాసీనత వైఖరి వలన హుమాయూన్ రాజపుత్రుల సానుభూతిని కోల్పోవుటయేగాక, తనకు శత్రువైన బహదూర్‌షా చిత్తూర్ దుర్గమును దోచుకొని బలాధిక్యతను పెంపొందించుకొనుటకు అవకాశము కల్పించెను. హుమాయూన్ రాజనీతి విజ్ఞతాలోపమునకు ఇదియొక నిదర్శనము.

బహదూర్‌షా చిత్తూర్‌ను ఆక్రమించిన తదుపరి హుమాయూన్ బహదూర్‌షాను ప్రతిఘటింపనెంచి, అతనిని 'మాండ్' దగ్గర ఓడించెను. అంతట బహదూర్‌షా 'డయ్యూ' ద్వీపానికి పారిపోయెను. హుమాయూన్ గుజరాత్, అహమ్మదాబాద్, రాంచీలను జయించెను. కాని హుమాయూన్ ఇచ్చటకూడా తన శత్రువులను పూర్తిగా నాశనము చేయలేదు. ఇది అతడు చేసిన మరొక రాజకీయ తప్పిదము. తదుపరి హుమాయూన్ తన సోదరుడైన 'ఆస్కరీ'ని గుజరాత్‌నకు పాలకునిగా నియమించి, తాను రాజధాని వెళ్ళెను.

హుమాయూన్ మరలిన వెంటనే బహదూర్‌షా విజృంభించి అసమర్థుడు, వ్యసనలోలుడైన 'అస్కరీ'ని పారద్రోలి, ప్రజల మద్దతుతో గుజరాత్‌ను తిరిగి ఆక్రమించెను. ఇట్లు హుమాయూన్ సాధించిన గుజరాత్ విజయము లేక దండయాత్ర ఎటువంటి సత్ఫలితముల నొసంగలేదు.

### ఇ) షేర్‌ఖాన్‌తో యుద్ధము (1537 - 1540) :

హుమాయూన్ గుజరాత్ ముట్టడిలో ఉన్న సమయమున బీహార్‌లో షేర్‌ఖాన్ తన శక్తిని పెంపొందించుకొని, బలీయుడై క్రీ.శ. 1537లో బెంగాల్‌ను ఆక్రమించి, హుమాయూన్‌కు పూర్వపు ఒప్పందము ప్రకారము చెల్లించవలసిన కప్పమును చెల్లించుటను నిలిపివేసెను. షేర్షా విజృంభణ మొగలు సామ్రాజ్య మనుగడకే ప్రమాదమని గుర్తించిన హుమాయూన్ బెంగాల్ రాజధానియైన 'గౌర్'గాక చూనార్ దుర్గమును ముట్టడించెను. చూనార్ ఆక్రమణ తదుపరి 'గౌర్'ను కూడా స్వాధీనము చేసుకొనెను. ఈ ఆక్రమణ తదుపరి దాదాపు 8 నెలలపాటు తన కర్తవ్యమును విస్మరించి 'గౌర్'లో విలాస జీవితమును గడిపెను. "దాదాపు 8 నెలలు తన రాజధానిలో ఏమి జరుగుతున్నదో విస్మరించి, అంతా సవ్యముగా ఉన్నదని భావించిన చక్రవర్తులు చరిత్రలో మరొకరు లేరు" అని ఆచార్య ఏ.ఎల్. శ్రీవాత్సవ పండితుడు పేర్కొనెను.

("There could be any monarch in History who would not receive any news from his Capital for eight months and yet think all was safe" - A.A. SRIVASTAVA).

ఈ లోపల షేర్షాఖాన్ బీహార్ నుండి కనూజ్ మధ్యగల ప్రాంతమును వశపరచుకొని, హుమాయూన్‌కు ఢిల్లీతో ఎటువంటి సంబంధములు లేకుండా చేసెను. ఇదే సదవకాశముగా భావించిన అతని సోదరుడు 'హిందాల్' ఢిల్లీ నాక్రమించి పాదుషాగా వ్యవహరింపసాగెను. ఇట్టి విషమ పరిస్థితులను గ్రహించి హుమాయూన్ రాజధానికి తిరుగు ప్రయాణము కట్టెను.

### ఎఫ్) చౌసా యుద్ధము (1539 జూన్, 26) :

'గౌర్' నుండి రాజధానికి తిరుగు ప్రయాణమైన హుమాయూన్ సేనలు గంగానది ఒడ్డున చౌసా దగ్గర విడిదిచేసి యుండగా, షేర్‌ఖాన్ హఠాత్తుగా 1539, జూన్ 26న ఒక అర్థరాత్రి దాడిజరిపి, మొగల్ సైన్యమును చావు దెబ్బతీసెను. హుమాయూన్ ప్రాణములతో బ్రతికి బయటపడి రాజధాని చేరెను. షేర్‌ఖాన్ స్వతంత్రుడై ఢిల్లీ, ఆగ్రాలపై దండెత్తుటకు సన్నాహములు చేయసాగెను.

### జి) కనూజ్ యుద్ధము (లేక) బెల్‌గ్రామ్ యుద్ధం (1540) :

షేర్షాఖాన్ ప్రాబల్యమును నాశనము చేయనిదే మొగలు సామ్రాజ్య మనుగడ దుస్సాధ్యమని గ్రహించిన హుమాయూన్ దాదాపు 40 వేల సైనిక బలమును సమకూర్చుకొని 1540 మే నెలలో కనూజ్‌కు సమీపములో గల 'బెలాగ్రాం' అనే ప్రదేశమున షేర్షఖాన్‌తో యుద్ధమునకు తలపడెను. ఈ యుద్ధమున హుమాయూన్ పరాజితుడు కాగా, ఢిల్లీ, ఆగ్రాలు షేర్షా వశమయ్యెను.

### 2.2.7 హుమాయూన్ ప్రవాస జీవితము (1540 - '55) :

కనూజ్ యుద్ధమున షేర్షాఖాన్ చేతిలో పరాజితుడైన హుమాయూన్ రాజ్యభ్రష్టుడై పారిపోయెను. పారిపోయిన హుమాయూన్ అనేకచోట్ల తిరిగి చివరకు సింధూరాజ్యములో అమరకోట ప్రభువు సహాయమర్థించెను. ఇచ్చట ఉండగానే క్రీ.శ. 1542లో 'హమీదా బేగం'కు అక్బరు జన్మించెను. అక్బరు జన్మించునాటికి హుమాయూన్ దగ్గర ఒక్క చిల్లిగవ్వకూడా లేదు. అంతటి కష్టములో హుమాయూన్ సోదరుల సహాయమర్థించగా వారు తిరస్కరించుటతో, నిరాశా నిస్పృహలతో కాంధహార్, బెలూచిస్తాన్‌లు దాటి హెల్మండ్ మీదుగా పర్షియా చేరెను. నాటి పారశీక చక్రవర్తియైన తహ్‌మాస్ప్ ఆదరించి, ధన, సైనిక సహాయము చేసెను.

### 2.2.8 హుమాయూన్ మొగలు సింహాసనమును తిరిగిపొందుట (1555) :

పారశీక చక్రవర్తి అందించిన సైనిక సహాయముతో హుమాయూన్ మొదట కాందహార్‌పై దాడిచేసి, దానిని ఆక్రమించెను. తదుపరి తన సోదరుడైన కామ్రాన్‌ను ఓడించి కాబూల్‌ను స్వాధీనపరుచుకొనెను. కాందహార్‌ను 'తహ్‌మాస్ప్'కు అప్పగించుటయేగాక, తన రాజ్యములో 'షియా' మతమును స్థాపించగలనని అతనికి వాగ్దానము చేసెను. తదుపరి తన సేనలతో ముందుకునడచి, పెషావరు, లాహోరు, దీపాల్‌పూర్ ప్రాంతములను వశపరుచుకొని ఢిల్లీపై దండెత్తెను. నాడు షేర్షా మరణానంతరము, షేర్షా మనుమల మధ్య ఢిల్లీ సింహాసనము కొరకు వారసత్వ యుద్ధము చెలరేగెను. ఢిల్లీ సికిందరుషా అధీనములో ఉండెను. ఈ అంతఃకలహములను అవకాశముగానెంచి హుమాయూన్ ఢిల్లీపై దండెత్తి 'సికిందరుషా సూర్' ను సర్‌హింద్ యుద్ధమున (1555) ఓడించి, ఢిల్లీ, ఆగ్రాలను పునరాక్రమించెను. ఇట్లు హుమాయూన్ తిరిగి 15 సంవత్సరముల తదుపరి ఢిల్లీలో మొగలాయీ అధికారమును పునరుద్ధరించెను.

### 2.2.9 హుమాయూన్ మరణము (1556) :

ఇట్లు అనేక కష్టములుపడి తిరిగి సంపాదించిన రాజ్యమును హుమాయూన్ ఎక్కువ కాలము అనుభవింపలేదు. ఒక సంవత్సరము పూర్తిగాకముందే క్రీ.శ. 1556 జనవరి 26న తన గ్రంథాలయ భవన మేడమెట్లు దిగుచూ, కాలుజారిపడి మరణించెను.

### 2.2.10 హుమాయూన్ ఓటమికి గల కారణములు :

పేరుకు హుమాయూన్ అదృష్టవంతుడేకాని దురదృష్టం అతనిని జీవితాంతము వెంటాడుచునే ఉన్నది. ఏది ఏమైనను చక్రవర్తిగా హుమాయూన్ ఘోరముగ వైఫల్యమును పొందెను. ఇట్టి వైఫల్యమునకు ప్రధాన కారణములు ఏమనగా

1) హుమాయూన్ తన తండ్రి నుండి పొందిన రాజ్యమును దయార్ద్ర హృదయముతో తన సోదరులకు భాగము పంచియిచ్చెను. కాని వారు స్వార్ధపరులై ద్రోహచింతనతో, హుమాయూన్‌కు కష్ట సమయములలో సహాయము చేయుటకు నిరాకరించుట, దానికితోడు హుమాయూన్‌కు తన సోదరులకు ఇవ్వగా మిగిలిన రాజ్యము నిస్సారమైన ప్రాంతము.

2) హుమాయూన్ తన పది సంవత్సరముల పాలనాకాలంలో ఎటువంటి ప్రజాసంక్షేమ చర్యలు గైకొనక, తన కాలమునంతటిని దండయాత్రలకు వెచ్చించెను. తత్ఫలితంగా ఖజానా ఖాళీ అయ్యెను. అందుచే ప్రజలు క్లిష్టపరిస్థితులలో హుమాయూన్‌కు అండగా నిలచి పోరాడుటకు సంసిద్ధులు కాలేదు.

3) హుమాయూన్ యుద్ధములందు విజయము సాధించినను, జయించిన రాజ్యములను సుస్థిరపరచక భోగలాలసుడై, అమూల్యమైన కాలమును వృధాచేసెను.
ఉదా : 1532లో చూనార్, తదుపరి 'గౌర్' దండయాత్రలు ఇందుకు నిదర్శనము.

4) రాజకీయ వివేచనాశక్తి, దూరదృష్టి లేక బహదూర్‌షా, షేర్షాలను పూర్తిగా నిర్మూలింపక వారు బలవంతులగుటకు అవకాశము కల్పించెను. అనగా శత్రుశేషమును నిర్మూలింపక నిర్లక్ష్యము చేసెను.

5) హుమాయూన్ వైఫల్యమునకు మరొక ప్రధాన కారణం మేవాడ్, కలింజరు రసపుత్రువీరుల స్నేహసహకారములు పొందుటకు ప్రయత్నించకపోవుట. ముఖ్యముగా బహదూర్‌షా మేవాడ్‌పై దండెత్తినపుడు, కర్ణావతి సాయమర్థించినపుడు హుమాయూన్ ఉదాసీనత వహించుట.

6) హుమాయూన్ గొప్ప యుద్ధవీరుడు కాదు. షేర్‌ఖాన్‌పై రెండవసారి దాడిచేసినపుడు బెంగాల్ రాజధానియైన 'గౌర్'ను వశపరుచుకొనక చునార్‌పై దండెత్తి దానిని ఆక్రమించి 6 నెలలు వృధాచేసెను. గౌర్‌ను ఆక్రమించిన తదుపరి యుద్ధమందు తన సైన్యమును పల్లపు ప్రాంతములందు సమీకరించెను.

7) హుమాయూన్‌లోగల మరొక వింతస్వభావము, తాను ప్రారంభించిన పనిని లేక కార్యక్రమమును, కార్యదీక్షతో సంపూర్తిచేయక,

దానిని అసంపూర్తిగ వదిలిపెట్టెడివాడు. అంతేకాక రాజ్యమునుగడకు అవసరమైన శక్తివంతమైన క్రమశిక్షణతో కూడుకున్న సైన్యమును రూపొందించుకొనకపోవుట, అతని పాలనా వైఫల్యమునకు మరొక కారణము.

### 2.2.11 గుణశీలములు :

హుమాయూన్ సార్థక నామధేయుడు. ఇతడు సుకుమారుడు. దయార్ద్ర హృదయుడు. బాబరు అంతటి సమర్థుడు, కార్యదీక్షాపరుడు, దూరదృష్టిగల పాలకుడు కాకపోయినను, పట్టుదల కలిగిన వ్యక్తి. తండ్రిపై భక్తి, సోదరులు యెడల ప్రేమ కలవాడు. మంచి పండితుడు. ధైర్యశాలి కూడా. మంచితనం, ఓర్పు ఇతని ప్రత్యేక లక్షణములు. అందుచేతనే 15 సంవత్సరములు రాజ్యమును కోల్పోయి, ప్రవాస జీవితమును గడిపి, అనేక కష్టములననుభవించి, తిరిగి ఢిల్లీ సింహాసనమధిష్టించుట జరిగెను.

భగవంతునిపై అమిత భక్తి కలవాడు, పేదలకు విరివిగా దానధర్మములు చేసేవాడు. విలాసవంత జీవితమన్నా, సంగీత, సాహిత్యమన్నా మక్కువ ఎక్కువ. అందువలననే విలాసాలకు అధికంగా ధనం వ్యయపరిచేవాడు. యుద్ధమన్నా, రక్తపాతమన్నా ఏహ్యాభావము కలవాడు. అందుచేతనే ప్రతిసారి సాధ్యమైనంతవరకు యుద్ధం జరగకుండా ఉండవలెనని ప్రయత్నించెడివాడు.

గొప్ప రచయిత. ఢిల్లీలో పెద్ద గ్రంథాలయమును స్థాపించెను. అయితే విపరీతంగా తాగటం, నల్లమందు సేవించటం, కఠినత్వం లేకపోవడం, అందరిని నమ్మటం, శత్రువుల యెడల దయ, సోదరులపై అధికప్రేమ, విలాసాలకు బానిస అగుట, అశ్రద్ధ మొదలగునవి అతని లోపములు. హుమాయూన్ సున్ని మతస్థుడైనను, పరమత ద్వేషి కాదు.

ఏది ఏమైనప్పటికీ పరిస్థితుల ప్రభావంవల్ల హుమాయూన్ చరిత్రలో కళంకం వచ్చిందని, వస్తుతః చేతకానివాడు కాదని, కొన్ని లోపాలు ఉన్నప్పటికీ మంచి స్వభావము కలవాడని చరిత్రకారుల అభిప్రాయం.

### వ్యాసరూప ప్రశ్నలు :

### 1. ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలు వ్రాయుము.

1. బాబరు మొగలు సామ్రాజ్య స్థాపకుడని ఎట్లు చెప్పగలవు ?
2. హుమాయూన్ చక్రవర్తిగా విఫలుడగుటకు గల కారణములను పేర్కొనుము?

### 2. లఘు వ్యాసరూప ప్రశ్నలు

1. కాణ్వాహ యుద్ధము
2. గోగ్రా యుద్ధము
3. హుమాయూన్ అంతర్గత సమస్యలు
4. హుమాయూన్ ఓటమికి గల కారణములు

### చదువదగిన గ్రంథాలు :


1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం) - పాటిబండ్ల ఝాన్సీలక్ష్మి, డా॥ శ్రీమతి అల్లాడి వైదేహి.
2. Indian History and Culture Vol. II - Dr. B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao
3. The Mughal Empire - A.L. Srivastava
4. The Mughal Empire in India - S.R. Sharma
5. The Life and time of Humayun - Ishwara Prasad
6. India since 1526 - V.D. Mahajan



**C. RAVINDRA RAJU**
**M.A.**

పాఠము - 3

# షేర్షా (SHERSHAH) (1540 - '45 A.D.)

## సూర్ వంశస్థాపన

విషయసూచిక


3.0 లక్ష్యము

3.1 ఉపోద్ఘాతం

3.2 సూర్ వంశము

3.3 హసన్‌ఖాన్‌సూర్

3.4.1 షేర్షా తొలిజీవితం

3.4.2 ససరామ్ జాగీర్ నిర్వహణ

3.4.3 దక్షిణ బీహార్ కొలువులో చేరుట

3.4 .4 బాబరు కొలువులో చేరుట

3.4.5 జలాల్‌ఖాన్‌కు అంగరక్షకుడుగా - దక్షిణ బీహార్ రాజప్రతినిధిగా

3.4.6 చునార్ దుర్గాధిపతియగుట (1531)

3.4.7 బెంగాల్ ఆక్రమణ - సూరజ్‌గర్ యుద్ధము (1534)

3.4.8 హుమాయూన్‌తో యుద్ధము

ఎ) చౌసా యుద్ధము (1539)

బి) కనూజ్ యుద్ధము (1540)

3.4.9 హిందూస్థాన్ సార్వభౌముడుగా షేర్షా సాధించిన విజయములు

3.4.10 సామ్రాజ్య విస్తీర్ణము

3.5 షేర్షా పరిపాలనా వ్యవస్థ (Administrative System of Shersha)

3.5.1 కేంద్ర ప్రభుత్వము

3.5.2 రాష్ట్ర ప్రభుత్వము - సర్కార్‌పాలన లేక జిల్లాపాలన

3.5.3 పరగణాపాలన లేక తాలూకా పాలన

3.5.4 గ్రామపాలన

3.5.5 సైనికపాలన

3.5.6 భూమిశిస్తు విధానం లేదా రెవిన్యూ సంస్కరణలు

3.5.7 ఆర్థిక విధానం

3.5.8 న్యాయపాలన

3.5.9 పోలీస్ సంస్కరణలు - గూఢచారి శాఖ
3.5.10 నాణెముల ముద్రణ
3.5.11 ప్రజాహిత కార్యములు - ధర్మదాత
3.5.12 భవన నిర్మాత
3.5.13 మత విధానం
3.5.14 అక్బరుకు మార్గదర్శకుడు
3.5.15 ఘనత
3.6 షేర్షా వారసులు - సూర్ వంశ పతనం
3.7 ముగింపు

## 3.0 లక్ష్యము :

షేర్షా ఎవరు ? అతని తొలిజీవితం, అతడు చేసిన యుద్ధములు, సూర్ వంశస్థాపన, అతని పరిపాలన విధానం, మధ్యయుగ చరిత్రలో షేర్షాకుగల ప్రాధాన్యత మొదలగు అనేక విషయములను తెలుసుకొనుట ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 3.1 ఉపోద్ఘాతం :

షేర్‌షా ఆఫ్ఘనులలో గొప్పవాడు, సాటిలేని వీరుడు, పైగా గొప్ప యోధుడు, కనూజ్ (బిల్‌గ్రాం) యుద్ధంలో (1540) మొగలు చక్రవర్తియైన హుమాయూన్‌ను ఓడించి, ఢిల్లీ, ఆగ్రాలను వశపరచుకొని 'సూర్' వంశమును స్థాపించి, పరిపాలనను ప్రారంభించెను. మొగలులను ప్రతిఘటించి భారతదేశం నుండి వారిని తరిమి వేయవలెనని ప్రయత్నించిన ఆఫ్ఘనులకు షేర్షా నాయకుడు.

## 3.2 సూర్ వంశము :

సూర్ వంశస్థులు ఆఫ్ఘనిస్తాన్‌లోని 'రోహి' అనే ప్రాంతానికి చెందినవారు. మనదేశంలో ఈ వంశానికి మూలపురుషుడు ఇబ్రహీంఖాన్ సూర్. ఇతడు షేర్‌షాకు తాతగారు. గుర్రాల వ్యాపారంచేస్తూ అది లాభసాటిగా జరగనందువల్ల ఆర్థికంగా నష్టపడి మనదేశంచేరి 'హిస్సార్ ఫిరోజా' రాష్ట్రంలో జమాల్‌ఖాన్ అనే పెద్ద జాగీర్‌దారు వద్ద సైనికుడిగా చేరినాడు. అతడు మరణించగానే అతని కుమారుడైన హసన్‌ఖాన్ సూర్ తండ్రి పదవిని పొందినాడు.

## 3.3 హసన్‌ఖాన్ సూర్ :

జమాల్‌ఖాన్ సేవలో కొద్దికాలానికే హసన్‌ఖాన్ సూర్ అతని ప్రేమకు పాత్రుడైనాడు. సికిందర్‌ఖాన్ లోడి పాలనలో తూర్పు దండయాత్రలకు జమాల్‌ఖాన్‌తోపాటు హసన్‌ఖాన్ జాన్‌పూర్ వచ్చినాడు. జమాల్‌ఖాన్ జాన్‌పూర్ రాష్ట్రగవర్నర్ కాగానే హసన్‌ఖాన్ శోణ నదీతీరాన ఉన్న ససరామ్, ఖనాస్‌పూర్, టాండాలకు జాగీర్దార్‌గా నియమింపబడెను. ఇతనికి నలుగురు భార్యలు, ఎనిమిది మంది కుమారులు కలరు. వారిలో మొదటి భార్య కుమారుడు షేర్షా. క్రీ.శ. 1520లో హసన్‌ఖాన్ మరణించెను. అప్పటివరకు అనామకంగాఉన్న సూర్ వంశము, షేర్షా గొప్పతనంవల్ల ఒక రాజవంశముగా మారింది. ఈ వంశస్థులు క్రీ.శ. 1530 నుండి స్వేచ్ఛా జీవనం సాగించి, క్రీ.శ. 1540 నుండి 1555 వరకు భారతదేశాన్ని పాలించిరి.

### 3.4.1 షేర్షా తొలిజీవితం :

స్వల్ప కాలవ్యవధిలో విజేతగా, పరిపాలనాదక్షునిగా మహోన్నత విజయములు సాధించి, మధ్యయుగ భారతదేశ చరిత్రలో విశిష్టమైన స్థానము నలంకరించినవాడు షేర్షా. "చరిత్రలో వెలుగొందు సుప్రసిద్ధ చక్రవర్తులలో నొకడైన షేర్షా మట్టినుండి ఉద్భవించిన మనోహర పుష్పరాజము'' అని ఆచార్య త్రిపాఠి పండితుడు వర్ణించెను.

("One of the greatmen of History who blossmed out of dust into glory" - R.P. Tripathi)

కేవలం స్వశక్తి సామర్థ్యము వలననే షేర్షా చిన్న జాగీర్‌దార్ పదవినుండి సార్వభౌముడు కాగల్గెను. రాజనీతి చతురత యందును, యుద్ధ నిర్వహణయందును నాటి సమకాలీన చక్రవర్తులలో మేటియని గణనకెక్కెను.

షేర్షా అసలు పేరు ఫరీద్. క్రీ.శ. 1472 సంవత్సరమున బజ్వారా (Bajwara) పరగణాయందు హసన్‌ఖాన్ దంపతులకు ఫరీద్ జన్మించెను. హసన్‌ఖాన్ సూర్ తన మొదటి భార్యపట్ల, ఫరీద్‌పట్ల ఉదాసీనుడై యుండుటవలన, చిన్న భార్య వ్యామోహములో పడుట వలన ఫరీద్ చిన్ననాడే ససరామ్‌ను వదలి జోన్‌పూర్‌చేరి అచట అరబ్బీ, పారశీక భాషలను క్షుణ్ణంగా అభ్యసించెను. తన సహజమైన తెలివితేటలు, పట్టుదల, సమర్థతతో జోన్‌పూర్‌లోని అందరి ఆదరాభిమానాలను పొందెను.

### 3.4.2 ససరామ్ జాగీర్ నిర్వహణ :

ఫరీద్ కుశాగ్రబుద్ధిని, శక్తి సామర్థ్యములను గమనించిన జమాల్‌ఖాన్ తండ్రి కుమారుల మధ్య సామరస్యమును చేకూర్చెను. తత్ఫలితముగా ఫరీద్ ససరామ్ జాగీర్ నిర్వహణ బాధ్యతను స్వీకరించెను. ససరామ్ జాగీర్దారుగా ఫరీద్ - అవిధేయులైన జమీందారులను, ప్రభుత్వోద్యోగులను అదుపులోఉంచి, శాంతిభద్రతలు నెలకొల్పి రైతుల శ్రేయస్సును కాపాడెను. ససరామ్ పాలనానిర్వహణయందే ఫరీద్ హేతుబద్ధమైన భూమిశిస్తు విధానమును, నిష్పక్షపాతమైన న్యాయపాలన ప్రవేశపెట్టి ప్రజల ప్రేమాభిమానములు చూరగొనుటమేగాక, మంచి పాలనా అనుభవములు కూడా పొందెను. ససరామ్ జాగీర్ నిర్వహణ ఫరీద్ భావిజీవితమునకు చక్కని పునాదులు వేసెను.

### 3.4.3 దక్షిణ బీహార్ కొలువులో చేరుట :

ససరామ్‌నందు ఫరీద్ గావించిన సంస్కరణల వలన అతని కీర్తిప్రతిష్టలు మిన్నుముట్టి, అతని సవతితల్లి అసూయకు గురికాగా, మరల ఫరీద్ ససరామ్ జాగీర్‌ను వదలి ఆగ్రా చేరెను. ఈ లోపల తండ్రి హసన్‌ఖాన్ చనిపోవుటతో ససరామ్ జాగీర్‌ను పొందే హక్కును ఢిల్లీ సుల్తానగు ఇబ్రహీంలోడి నుండి పొందినను, తన సోదరుల వ్యతిరేకత వలన దానిని వశపరచుకోలేక పోయెను.

అంతట ఫరీద్ దక్షిణ బీహార్ పాలకుడైన బహార్‌ఖాన్‌లోహనీ కొలువులోచేరి, తన ప్రజ్ఞా విశేషములతో అతని మెప్పును పొందెను. ఇచటనే ఒకసారి వేటకు వెళ్ళినపుడు ఫరీద్ నిస్సహాయుడై, తానొక్కడే పులితో పోరాడి దానిని వధించెను. ఈ సాహసమునకు మెచ్చి బహార్‌ఖాన్‌లోహనీ అతనికి 'షేర్‌ఖాన్' అను బిరుదు నిచ్చి సత్కరించి, తన కుమారుడైన 'జాలాల్ ఖాను'కు భోధకునిగా నియమించెను.

మొదటి పానిపట్టు యుద్ధానంతరము బహార్‌ఖాన్ స్వతంత్రుడై 'సుల్తాన్ మహమ్మద్‌షా' అను బిరుదు ధరించెను. సుల్తానైన పిమ్మట, బహార్‌ఖాన్ చెప్పుడుమాటలు విని, షేర్‌ఖాన్ తనకు వ్యతిరేకమని భావించి అతనికి ససరామ్ జాగీరు పొందకుండా చేసెను. దీనితో విసిగి షేర్‌ఖాన్ బీహారును వదిలిపెట్టి మొగల్ కొలువులో చేరెను.

### 3.4.4. బాబరు కొలువులో చేరుట :

షేర్‌ఖాన్ బాబరు కొలువులోచేరి అనతికాలములోనే సుల్తాన్ ప్రేమాభిమానములు పొందెను. బాబర్ తూర్పు దిగ్విజయ యాత్రలో సాయపడి, అతని మన్ననపొంది, తన తండ్రి జాగీర్ ససరామ్‌ను తిరిగిపొందెను.

మొగల్ కొలువులో పనిచేయుట వలన, మొగలు సైన్యములోని గుణదోషములను గ్రహించి, పరిస్థితులు అనుకూలించిన, మొగలులను పారద్రోలి, ఆఫ్ఘన్ అధికారమును పునరుద్ధరించుట ఏమంత కష్టముకాదని గ్రహించెను. అందుచేతనే బాబరు "షేర్‌ఖాన్ ప్రతిభావంతుడు, రాజత్వఛాయలు అతని నుదుట కలవని, అతనిని ఒక కంట కనిపెట్టి ఉండవలసినదని, మొగల్ అధికారమునకు ప్రమాదకరముగా పరిణమించగలడని" తన ఉద్యోగులను హెచ్చరించెను.

### 3.4.5 జలాల్‌ఖాన్‌కు అంగరక్షకుడుగా - దక్షిణ బీహార్ రాజప్రతినిధిగా :

షేర్‌ఖాన్ కొన్ని అనివార్య కారణముల వలన బాబరు కొలువు వీడి మరల దక్షిణ బీహారు సుల్తానైన మహమ్మద్‌షా కొలువులో చేరెను. మహమ్మద్‌షా మరణానంతరము అతని కుమారుడగు జలాల్‌ఖాన్‌కు సంరక్షకుడై, రాజప్రతినిధిగా సర్వాధికారములు పొంది, సుభిక్షమైన పాలనను ప్రవేశపెట్టెను.

జలాల్‌ఖాన్ గోగ్రా యుద్ధానంతరము మొగలు సామంతుడైనను, (1529) షేర్‌ఖాన్ మాత్రము మొగలులను పారద్రోలవలయునను ఆశయమును మరువలేదు. షేర్‌ఖాన్ తన అనుచరులను కీలక స్థానములో నియమించి, తన అధికారమును సుస్థిర పరచుకొనెను. అజ్ఞాతవాసములో ఉన్న ఆఫ్ఘను సర్దారులందరిని సమైక్యపరచి షేర్‌ఖాన్ బలవంతుడు కాజొచ్చెను. ఇది సహింపని బెంగాల్ సుల్తానైన నస్రత్‌షా బీహారుపై దాడిచేయగా, షేర్‌ఖాన్ చేతిలో చిత్తుగా ఓడిపోయెను. ఈ విజయముతో షేర్‌ఖాన్ కీర్తిప్రతిష్టలు మిన్నుముట్టెను. షేర్‌ఖాన్ బలవంతుడగుట తమకు ప్రమాదకరమని భావించి జలాల్‌ఖాన్, అతని సర్దారులు, అతనిపై హత్యాప్రయత్నంచేసి విఫలులైరి. దీనిలో భీతిచెందిన జలాల్‌ఖాన్, తన అనుచరులతో బెంగాల్‌కు పారిపోయెను. షేర్‌ఖాన్ మకుటములేని రాజయ్యెను.

### 3.4.6 చునార్ దుర్గాధిపతి యగుట (1531) :

చునార్ దుర్గాధిపతి అయిన తాజ్‌ఖాన్ మరణానంతరము షేర్‌ఖాన్ అతని భార్యయైన 'లాడ్‌మాలిక' (Lad Malika) ను వివాహమాడి, శత్రుదుర్భేధ్యమైన చునార్ దుర్గముతోపాటు అపార ధనరాశులను కూడా పొందెను. ఇట్టి సమయముననే హుమాయూన్ చునార్‌పై దండెత్తిరాగ, షేర్‌ఖాన్ తెలివిగా అతని సంధిచేసుకొని, కప్పమును చెల్లించుటకు అంగీకరించెను.

### 3.4.7 బెంగాల్ ఆక్రమణ - సూరజ్‌గర్ యుద్ధము (1534) :

షేర్‌ఖాన్ బలాధిక్యతను అణచనెంచి బెంగాల్ సుల్తానగు ఘియాస్‌ఉద్దీన్ మహమ్మద్ (నస్రత్‌షా కుమారుడు) బీహార్‌నుండి పారిపోయి వచ్చిన జలాల్‌ఖాన్‌తో కలసి యుద్ధమునకు సిద్ధపడిరి. వీరిని షేర్‌ఖాన్ క్రీ.శ. 1534లో సూరజ్‌గర్ యుద్ధమందు ఓడించెను. సూరజ్‌గర్ విజయము షేర్‌ఖాన్ జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు.

"సూరజ్‌గర్ విజయము పొందని యెడల, షేర్‌ఖాన్ చీకటి నుండి వెలుగులోనికి అనగా భారత రాజకీయ రంగముపై కాలిడువాడు కాదు" - అని ఆచార్య 'కానుంగో' పేర్కొనెను.

(But for the victory of Surajgarh he would never have emerged from obscurity into arena of Indian Politics" - Quanungo).

ఈ యుద్ధ విజయము షేర్‌ఖాన్‌లో సామ్రాజ్యకాంక్షను పెంపొందించెను. తదుపరి 1536, 1537 సంవత్సరములో రెండు పర్యాయములు బెంగాలుపై దండెత్తి ఘియాస్‌ఉద్దీన్ మహమ్మద్ నోడించి, బెంగాల్‌ను ఆక్రమించెను. దీనితో బెంగాల్, బీహార్‌లు పూర్తిగా షేర్‌ఖాన్ వశమయ్యెను. బెంగాల్ నందలి బలిష్టమగు రోటాస్ దుర్గము ఈ విజయములో లభించెను.

### 3.4.8 హుమాయూన్‌తో యుద్ధము :

షేర్‌ఖాన్ విజయపరంపరలకు భీతిచెందిన హుమాయూన్ అతనిని అణచనెంచి, బెంగాల్ రాజధానియైన గౌర్‌నుగాక, బెనారస్, చునార్ దుర్గములను ముట్టడించెను. చునార్ దుర్గమును వశపరచుకొనేలోపల షేర్‌ఖాన్ తన ఖజానాను రోటాస్ దుర్గమునకు తరలించెను. చునార్ ముట్టడి అనంతరము హుమాయూన్ గౌర్‌నాక్రమించి అచ్చట 8 నెలలపాటు విలాసజీవితము గడిపెను. ఈ లోపల షేర్‌ఖాన్ బీహార్ నుండి కనూజ్ వరకు గల మొగల్ సామ్రాజ్యమును ఆక్రమించి, హుమాయూన్‌కు ఆగ్రాకు ఎట్టి సంబంధము లేకుండా చేసెను. ఈ విషమ పరిస్థితిని గ్రహించిన హుమాయూన్ బెంగాల్ నుండి రాజధానికి తిరుగుముఖము పట్టెను.

### ఎ) చౌసా యుద్ధము (1539) :

నాటికే నీరసించిన మొగలు సైన్యము తిరుగు ప్రయాణములో గంగానది ఒడ్డున చౌసా (బక్సార్) దగ్గర విడిది చేసియుండగా షేర్‌ఖాన్ హఠాత్తుగా దాడిజరిపి, మొగల్ సైన్యమును చావుదెబ్బతీసెను. హుమాయూన్ ఓడి ప్రాణములతో బయటపడి రాజధాని చేరెను. ఈ విజయానంతరము షేర్‌ఖాన్ పూర్తి స్వతంత్రాధికారమును సూచించు 'షేర్షా' అను బిరుదును ధరించెను.

### బి) కనూజ్ యుద్ధం (1540) :

చౌసా యుద్ధములో పరాజితుడైన హుమాయూన్ ప్రతీకారవాంఛతో, సైన్యమును సమీకరించుకొని క్రీ.శ. 1540లో షేర్షాను 'బెల్‌గ్రాం' యుద్ధమున (కనూజ్ యుద్ధం) ఎదుర్కొనెను. ఈ యుద్ధములో షేర్షా విజయమును సాధించి, ఢిల్లీ, ఆగ్రాలను వశపరచుకొనెను. హుమాయూన్ దేశాంతర గతుడయ్యెను. ఈ యుద్ధములో షేర్షా హిందూస్థాన్‌కు సుల్తాన్ అయ్యెను. ఢిల్లీ నందు తిరిగి ఆఫ్ఘనుల అధికారము పునరుద్ధరింపబడెను. మొగలు అధికారము తాత్కాలికముగా నిలపుదల చేయబడెను.

### 3.4.9 హిందూస్థాన్ సార్వభౌముడుగా షేర్షా సాధించిన విజయములు :

ఢిల్లీ, ఆగ్రాలను ఆక్రమించిన షేర్షా తన అధికార ప్రాబల్యమును ఉత్తరాపథమున నెలకొల్పుటకు అనేక దిగ్విజయయాత్రలు సాగించెను.

ఎ) పారిపోయిన హుమాయూన్‌ను వెంటాడుతున్నా షేర్షా పంజాబ్ నుండి హుమాయూన్‌ను తరిమివేస్తూ, సింధు, జీలం నదుల మధ్యనున్న 'ఘుక్కర్లను' అణచి 'రోటాస్ దుర్గమును' నిర్మించెను.

బి) బెంగాల్‌లో ఖాజీర్‌ఖాన్ నాయకత్వమున తిరుగుబాటు చెలరేగగా, షేర్షా తిరుగుబాటునణచి, అచటనున్న సైనిక పాలనను రద్దుచేసి, పౌర పాలనను ప్రవేశపెట్టెను.

సి) క్రీ.శ. 1542లో గ్వాలియర్, మాల్వార్‌లను జయించెను.

డి) మార్వారు పాలకుడైన మల్‌దేవుని ఓడించి, అజ్మీరు నుండి అబూ శిఖరము వరకు గల ప్రాంతాలను జయించి, ఆక్రమించెను.

ఇ) 'రైజిన్'ను చౌహాన్ వంశస్థుడైన పూరన్‌మల్ పరిపాలించుచుండెను. చందేరిలోని తురకులను చంపినాడనే నేరంపై షేర్షా రైజిన్ కోటను 1543లో ముట్టడించి, తనకు లొంగిపోయిన వారిని కూడా హత్యచేసెను. ఇదిషేర్షా చరిత్రలో మాయని మచ్చ.

ఎఫ్) మేవాడ్‌పై దండెత్తి 'జహజ్‌పూర్'ను, 'రణతంభోరు' 'బీకనీరు'లను ఆక్రమించి తన రాజ్యములో కలిపివేసెను.

జి) తుదకు క్రీ.శ. 1545 సంవత్సరములో కలింజరు కోటను ముట్టడించుచుండగా దురదృష్టవశాత్తు మందుగుండి సామాగ్రి పేలి తీవ్రముగా గాయపడి షేర్షా వీరమరణము పొందెను. తాను మరణించినను, కలింజరు షేర్షా పాదాక్రాంతమయ్యెను. ఈ దండయాత్రలో ఉత్తర ఇండియా పూర్తిగా షేర్షా ఆధీనములోనికి వచ్చెను.

### 3.4.10 సామ్రాజ్య విస్తీర్ణము :

షేర్షా సాగించిన దిగ్విజయుల వలన అతని సామ్రాజ్యము ఉత్తరమున రోటాస్ దుర్గము నుండి, దక్షిణమున నర్మదానది వరకు, తూర్పున సోనార్‌గావ్ నుండి, పశ్చిమాన సింధు, జీలం నదుల మధ్య వరకు విస్తరించెను.

ఇట్లు షేర్షా తన స్వయంకృషి వలన విశాల సామ్రాజ్యమును స్థాపించి, దాని ఫలితములను ఏమాత్రము అనుభవింపక దుర్మరణము పాలయ్యెను. షేర్షా ఘనతను ఆచార్య వి.ఎ. స్మిత్ ఇట్లు పేర్కొనెను. "షేర్షా అకాల మరణము పొందకపోయినచో భారతదేశ చరిత్రలో మొగలాయిలకు స్థానముండెడిది కాదు".

("If Shersha had been spared the great Mughals would not have appeared on the stage of History" - V.A. Smith)

### 3.5 షేర్షా పరిపాలనా వ్యవస్థ :

షేర్షా గొప్ప యుద్ధవీరుడేగాక అంతకుమించిన పరిపాలనాదక్షుడు. "ప్రజాభీష్టమునే ఆధారముగా చేసికొని ప్రభుత్వ యంత్రాంగమును నిర్మించుటకు ప్రయత్నించిన ప్రప్రథమ భారతీయ ముస్లిం చక్రవర్తి షేర్షాయని" ఆచార్య క్రూక్ పండితుడు పేర్కొనెను.

("He was the first who attempted to found an empire broadly based upon the peoples will" - Prof. Crooke).

తన 5 సంవత్సరముల పాలనా కాలములో విప్లవాత్మక సంస్కరణలు గావించి, అత్యధిక సంఖ్యాకులైన హిందువుల సహకార, సానుభూతి తన రాజ్యమునుగడకు, సుస్థిరతకు అవసరమని తలంచి, వారి శ్రేయస్సును కాంక్షించి పాలించెను. ప్రజల క్షేమము, వారి తృప్తిపైనే తన ఔన్నత్యము ఆధారపడిందని భావించి సమర్థవంతమైన పాలనా వ్యవస్థను ప్రసాదించి భారత జాతీయ నిర్మాణమునకు అవసరమైన పునాదులు వేసిన ఘనత భారతదేశ మధ్యయుగ చరిత్రలో షేర్షాదేనని చెప్పిన అబ్బురము కాదు. షేర్షా పరిపాలనా వ్యవస్థలో సరిక్రొత్త సంస్థలనుగాని, నూతన సంస్కరణలుగాని సృష్టించలేదు. కాని అంతకు ముందున్న పాలనా విధానములోని లోపములను సరిదిద్ది, నూతన ప్రక్రియల ద్వారా సంస్కరణలు గావించి, కాలానుగుణముగ పాలనా వ్యవస్థలో కొన్ని మార్పులుచేసి ప్రజాసంక్షేమము పెంపొందించుటకు కృషిచేసెను.

షేర్షా సైనిక సంస్కరణలలో అల్లాఉద్దీన్ ఖిల్జీని, కట్టడములలో, ప్రజాహిత సంస్కరణలలో ఫిరోజ్‌షా తుగ్లక్‌ను, మత విషయములలో జీన్-ఉల్-అబ్దిన్‌ను అనుసరించెను. పరిపాలనలో షేర్షా ప్రాజ్ఞ నిరంకుశత్వ విధానమును (ప్రాజ్ఞ నిరంకుశత్వ విధానమనగా పరిపాలనలో తెలివిగలవాడై, నిరంకుశ అధికారణులు కల్గిఉన్నను, ప్రజాశ్రేయస్సును దృష్టిలోనుంచుకొని పరిపాలించుట) అనుసరించెను. నిర్విరామకృషి, ఆర్థికాభ్యుదయము, నిష్పక్షమైన న్యాయపాలన, పరమత సహనము, ప్రజాసంక్షేమము మొదలగునవి అతని పాలనా విధానమునకు మూలస్థంభాలు. షేర్షా పాలనా విధానమును "ఏ ప్రభుత్వము తుదకు బ్రిటీష్‌వారు కూడా షేర్షా అంతటి వివేకమును ప్రదర్శించలేదని" 'కినే' పండితుడు వర్ణించెను.

("No Government not even the British has shown so much wisdom as this pathan" - Prof. Keene").

అటులనే ఆచార్య ఎస్.ఆర్. శర్మ, షేర్షాను ఏడవ హెన్రీతోను, ఫ్రెడరిక్ విలియమ్‌లతోను, చాణక్య, అశోకులతోను" పోల్చెను.

## షేర్షా పాలనా వ్యవస్థలోని ముఖ్యాంశములు :

### 3.5.1 కేంద్ర ప్రభుత్వము :

దేశమున కంతటికి రాజు అధిపతి. ఇతడు సర్వాధికారి. ప్రజాసంక్షేమమును కాంక్షించి, పౌర, రాజకీయ అధికారములను నిర్వహించెను. పౌర, సైనిక విషయములలోను, శాసనాధికారమందును, న్యాయ నిర్వహణలోను అంతిమ నిర్ణయము ప్రభువుదే. షేర్షా నిరంకుశాధికారమును కల్గినను ప్రజారంజకుడుగా పాలించెను. పాలనా నిర్వహణలో సుల్తానుకు సలహానిచ్చి సాయపడుటకు నలుగురు సభ్యులు గల ఒక మంత్రిమండలి కలదు. ఈ మంత్రిమండలిలోని సభ్యులెవరనగా :

**ఎ) వజీర్** (Wazir) **:** ఇతడు ప్రధానమంత్రి, మరియు ఆర్థికమంత్రి. ఇతడు ఆదాయ, వ్యయములను తనిఖీ చేయడమేకాక, మిగిలిన ప్రభుత్వ శాఖలను పర్యవేక్షించుచుండెను. ఇతర మంత్రులపై అజమాయిషీ చేయు అధికారము కూడా కలదు.

**బి) అరీజ్** (Ariz) : ఇతడు సైనిక వ్యవహారములను చూచు రక్షణశాఖమంత్రి.

**సి) రసాలత్** (Rasalat) **:** ఇతడు విదేశీ వ్యవహారముల మంత్రి.

**డి) ఇన్షా** (Insha) : ఇతడు రాజ శాసనములను ఉత్తర, ప్రత్యుత్తరములను పరిశీలించు మంత్రి.

ఈ మంత్రి మండలి సభ్యులకు తోడుగా 'దివాని-ఇ-క్వాజా' (Diwani - I - Qaza) అనే న్యాయశాఖ, దివానీ-ఇ-బరీద్ (Diwani - I - Barid) అను సమాచార శాఖలు కలవు. వీరికి ఉన్నతోద్యోగుల మంత్రిహోదా కలదు. వీరితోపాటు రాజాంతఃపుర విషయములను నిర్వహించుటకు ప్రత్యేక ఉద్యోగ బృందం కలదు.

### 3.5.2 రాష్ట్ర ప్రభుత్వము - సర్కార్ పాలన లేక జిల్లా పాలన :

పరిపాలనా సౌలభ్యము కొరకు షేర్షా తన రాజ్యమును **47** సర్కారులుగా విభజించెను. సర్కార్ పాలనను నిర్వహించు అధికారులు : ఎ) ప్రధాన షిక్దార్, బి) ప్రధాన మునిసిఫ్.

**ఎ) ప్రధాన షిక్దార్ :** ఇతడు శాంతిభద్రతలను కాపాడుట, రాజశాసనములు అమలుపరచునట్లు చూచుట, శిస్తు వసూలుయందు రెవిన్యూ అధికారములతో సహకరించుట, షిక్దార్ కార్యకలాపములను పర్యవేక్షించుట మొదలగు విధులను నిర్వహించును.

**బి) ప్రధాన మునిసిఫ్ :** న్యాయ విషయములను నిర్వహించుట, రెవిన్యూ వివాదములను పరిష్కరించుట మొదలగు విధులను నిర్వహించును

### 3.5.3 పరగణా పాలన లేక తాలూకా పాలన :

సర్కార్‌లను తిరిగి పాలనా సౌలభ్యము కొరకై పరగణాలుగా (తాలూకాలు) విభజించెను. పరగణాలలో షిక్దార్, మునిసిఫ్, (అమీన్ అను పేరు కూడా కలదు) పోద్దార్, కానుంగో అనే నల్గురు ఉద్యోగులు కలరు. షేర్షా ఏర్పరిచిన పాలనావ్యవస్థలో తొలి ప్రమాణదశ (Primary Administrative Unit) ఇది.

**ఎ) షిక్దార్ :** ఇతడు సైనిక ఉద్యోగి, శాంతిభద్రతలు కాపాడుట, రాజశాసనములు అమలుపరచుట, పన్నులు వసూలునందు, న్యాయ నిర్వహణయందు మునిసిఫ్‌కు సహాయపడుట ఇతని ముఖ్య విధులు.

**బి) మునిసిఫ్ (అమీన్) :** భూమిశిస్తు లెక్కలు తయారుచేయుట, శిస్తు నిర్ణయించుట మొదలగు విధులు నిర్వహించును

**సి) పోద్దార్** (Treasurer) **:** ఇతడు కోశాధికారి.

**డి) కానుంగో :** పాలనా యంత్రణానికి పునాది పరగణా అయితే, దానిలో 'కానుంగో'లు మూలస్తంభాల వంటివారు. వీరు భూమిశిస్తు వసూలు చేయటంలో, ఎటువంటి అత్యాచారాలు జరగకుండా చూసేవారు. కానుంగోలు షేర్షా షా పాలనా రక్షతకు ప్రత్యక్ష నిదర్శకులు.

వీరుకాక భూమిశిస్తు లెక్కలు తయారుచేయుటకు, ఇద్దరు గుమస్తాలు కలరు. వీరిలో ఒకడు హిందువు, మరియొకడు మహమ్మదీయుడు.

### 3.5.4 గ్రామపాలన :

పాలనావ్యవస్థలో చివరి అంశము గ్రామము. గ్రామములోని గ్రామపెద్దలు గ్రామ పాలనను నిర్వహించెడివారు. వీరికి పట్వారీ, చౌకీదారు, ముకద్దం అను ప్రభుత్వ ఉద్యోగులు సహాయపడెడివారు.

షేర్షా ఉద్యోగుల నియామకములో ప్రత్యేకశ్రద్ధ వహించెడివాడు. ప్రభుత్వ ఉద్యోగులు ఎటువంటి అవినీతికి పాల్పడకుండా రెండు లేక మూడు సంవత్సరములకు ఒకసారి ఉద్యోగులను బదిలీచేయు పద్ధతి ప్రవేశపెట్టెను.

### 3.5.5. సైనికపాలన :

ప్రజాసంక్షేమం కోసం, తన అధికార సుస్థిరతకు షేర్షా బలమైన సైన్యంను పోషించెను. సైనికపాలనలో షేర్షా అల్లాఉద్దీన్‌ఖిల్జీ అడుగుజాడలలో నడిచెను. జాగీర్దారులు సరఫరాచేయు సైన్యమేగాక, షేర్షా కేంద్రప్రభుత్వ యాజమాన్యమున ప్రత్యేక సైన్యమును రాజధానియందు ఏర్పాటు చేసెను. ఇందులో 1,50,000 కాల్బలము, 2,500 అశ్వదళము, 300 గజబలము, శతఘ్ని దళములు కలవు. సైన్యము నంతటిని తన అధీనములో ఉంచుకొని, అనేక సైనిక సంస్కరణలు చేసెను.

ఎ) సైనికులను ఎన్నిక చేయుటలోను, శిక్షణ గరుపుటలోను, జీతములు నిర్ణయించుటలోను, తానే స్వయంగా ప్రత్యేకశ్రద్ధ వహించెను.

బి) పురాతన సాంప్రదాయమైన సైనికులకు జాగీరునిచ్చు పద్ధతిమాని, నగదు రూపమున జీతములిచ్చెను.

సి) గుర్రములను అక్రమ మార్పిడి నిరోధించుటకు గుఱ్ఱములకు రాచముద్రికను ఆనవాళ్ళుగా వేయించెను.

డి) సైనికుల వివరములు తెలియజేయు పట్టికలను తయారుచేయించెను.

ఇ) హిందువులను సైతము సైన్యము నందు చేర్చుకొని మిగిలిన వారితో సమానంగా చూచెను.
ఉదా : 'బ్రహ్మజిత్‌గౌర్' అను హిందువు చక్రవర్తి విశ్వాసపాత్రులైన సేనానులలో ఒకడు.

ఎఫ్) ఉన్నతోద్యోగులకు శక్తిసామర్థ్యాలే ప్రధానమైనవిగా ప్రకటించెను. సైనికుల జీతాలు కోశాగారం నుండి ముట్టునట్లు ఏర్పాటుచేసి, సైనికులకు, చక్రవర్తిపై విశ్వాసం పెరుగునట్లు చేసెను.

### 3.5.6 భూమిశిస్తు విధానం లేక రెవిన్యూ సంస్కరణలు :

పాలనా వ్యవస్థలో షేర్షాకు శాశ్వత కీర్తిప్రతిష్టలకు కారణమైన అంశము అతడు రూపొందించిన భూమిశిస్తు విధానం. తుగ్లక్ వంశీయుడైన ఫిరోజ్‌షాతుగ్లక్ వలె రైతుల ఆర్థిక ప్రగతికి దోహదపడు అనేక భూమిశిస్తు సంస్కరణలు చేసెను. భూమిని సర్వేచేయించి, భూసారమునుబట్టి, పండే పంటనుబట్టి, భూమిని మూడు తరగతులుగా విభజించెను. అవి ఏమనగా ఉత్తమ, మధ్యమ, అథమ. సాధారణముగా ప్రతి తరగతి భూమిలో పండిన పంటలో 1/3 వంతు శిస్తుగా నిర్ణయించి వసూలుచేసెను. ఈ శిస్తును రైతులు ధనరూపమునగాని, లేదా ధాన్యరూపమునగాని చెల్లించవచ్చును. శిస్తు నిర్ణయములో రైతుపట్ల సానుభూతి చూపవలయుననియు, కాని

శిస్తు వసూలులో కఠినముగా నుండవలయుననియు షేర్షా తన ఉద్యోగులను ఆదేశించెను. రైతులు ఈ శిస్తులు జమీందారుల వంటి మధ్యవర్తులకుగాక, నేరుగా ప్రభుత్వోద్యోగులకు చెల్లించెడివారు. ఇట్టి పద్ధతినే 'రైత్వారీ పద్ధతి' అందురు.

షేర్షా రైతులకు గల భూమి హక్కును గుర్తించి, వారికి 'పట్టాలు' ఇచ్చెను. అటులనే రైతులకు ప్రభుత్వము యెడలగల బాధ్యతలను తెలియచేయుటకు వారివద్ద నుండి 'కబూలియత్' (ఒప్పంద పత్రము) తీసుకొనెను. దుర్భిక్షసమయములో రైతులకు అప్పులిచ్చుట, శిస్తు మినహాయింపుచేయుట, మొదలగు సౌకర్యములను ఏర్పాటుచేసెను. దండయాత్రల కాలంలో పంటపొలములు నాశనము చేయరాదని తన సైనికులను ఆదేశించెను.

### 3.5.7 ఆర్థిక విధానం :

ప్రభుత్వానికి ముఖ్య ఆదాయము భూమిశిస్తు. షేర్షా, పైన పేర్కొన్న చక్కటి భూసంస్కరణల ద్వారా వ్యవసాయ రంగమును అభివృద్ధిపరచెను. అటులనే వర్తకులపైనున్న అనేక చిల్లర పన్నులను రద్దుచేసి వాణిజ్యమును ప్రోత్సహించెను. వస్తువులు ధరలపై 2 1/2 శాతం సుంకము విధించెను. ఎగుమతి, దిగుమతి సుంకము, జిజియా పన్ను మొదలగునవి ఇతర ఆదాయ మార్గములు, వారసులు లేనివారి ఆస్తి ప్రభుత్వానికి చెందుతుంది అని షేర్షా ప్రకటించెను.

షేర్షా ఆదాయ వ్యయాలను ఎ) కేంద్ర సంబంధమైనవి (Central), బి) స్థానిక సంబంధమైనవి (Local) అని రెండు రకాలుగా విభజించెను.

**ఎ) కేంద్ర సంబంధమైన ఆదాయాలు :** భూమిశిస్తు, నిర్వారసుల ఆస్తి, వ్యాపారపన్ను, టంకసాలలు, ఉప్పు పన్ను, ఎగుమతి, దిగుమతి సుంకాలు, జిజియా పన్ను, ఖాంస్ (అంటే యుద్ధంలో కొల్లగొట్టే ధనంలో మూడోవంతు) మొదటగునవి ఇందు ముఖ్యమైనవి.

**బి) స్థానిక సంబంధమైన ఆదాయాలు :** వృత్తి పన్ను, రవాణా పన్ను, అమ్మకపు పన్ను మొదలగునవి.

**సి) వ్యయాలు :** షేర్షా ప్రభుత్వ వ్యయపట్టికను ప్రజా ఉపయోగ వ్యవస్థల నిర్వహణ వ్యయం, వ్యవసాయము - నీటిపారుదల వ్యయాలు, ప్రజాసంక్షేమ కార్యాలకు అగు వ్యయం అని మూడు రకాలుగా విభజించెను. ఈ పట్టికనే స్థానిక ప్రభుత్వాలు కూడా అనుకరించినవి.

### 3.5.8 న్యాయపాలన :

రాజ్యమంతటికి అత్యున్నత న్యాయస్థానము రాజదర్బారు. ఉన్నత న్యాయమూర్తి చక్రవర్తి. న్యాయ నిర్వహణలో చక్రవర్తి మత, వర్గ, తర, తమ, పెద్ద, చిన్న, ధనిక, బీద మొదలగు ఎట్టి విచక్షణ చూపక నిష్పక్షపాతముగా న్యాయమును ఆదరించెను. ఒక స్వర్ణకారుని భార్య స్నానమాడుచుండగా దారిన ఏనుగుపైబోవు షేర్షా మేనల్లుడు తమలపాకు విసిరినందుకు - షేర్షా అతనిని శిక్షించెనట. అందువలననే షేర్షా 'న్యాయసింహుడు' అని కీర్తింపబడెను. చక్రవర్తిగాక, సర్కార్ నందు ప్రధాన మున్సిఫ్, పరగణాయందు అమీన్, గ్రామములందు గ్రామసభలు న్యాయవిచారణ చేయుచుండెడివి. వీరికి 'ఖాజీ'లు సహాయపడెడివారు. నాడుశిక్షలు కఠినముగా ఉండేవి. ప్రయాణీకులకు దొంగల బెడదలేదు. నాడు ప్రయాణీకులు ఏ చీకుచింతా లేకుండా నిర్భయముగా తన నగలు, బంగారములతో భయంలేకుండా తిరుగుచుండెడివారు.

### 3.5.9 పోలీస్ సంస్కరణలు - గూఢచారిశాఖ :

దేశంలో శాంతిభద్రతల పరిరక్షణకు షేర్షా పోలీసుశాఖను రూపొందించెను. సర్కారులో ప్రధాన షిక్దార్, పరగణాలలో షిక్దార్, గ్రామములలో ముకద్దం పోలీసు విధులను నిర్వహించెడివారు. నేరముల సంఖ్య తక్కువగా ఉన్నట్టు నాటి ముస్లిం రచనలు తెల్పుచున్నవి.

షేర్షా సమర్థవంతమైన గూఢాచారి శాఖను నెలకొల్పి, తద్వారా రాజ్యమందు జరుగు సకల విషయములు తెలుసుకొని తదనుగుణముగా పాలనను నిర్వహించెడివారు. ఈ శాఖ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల కార్యకలాపములు ఎప్పటికప్పుడు తెలుసుకొనేవాడు.

### 3.5.10 నాణెముల ముద్రణ :

భారతీయ నాణెముల ముద్రణా చరిత్రలో షేర్షా కాలము ఒక ప్రముఖ అధ్యాయము. నాణెముల విషయంలో షేర్షా కొన్ని మార్పులు చేసెను. పురాతన నాణెములను రద్దుచేసి, వాటి స్థానంలో బంగారు, వెండి, రాగి నాణెములను సరియైన తూకంతో క్రొత్త నాణెములు ముద్రించెను. షేర్షా ప్రవేశపెట్టిన నాణెములలో 'దామ్' (DAM) అనే వెండి రూపాయి ముఖ్యమైంది. షేర్షా ప్రవేశపెట్టిన ఈ వెండిరూపాయి క్రీ.శ. 1835 వరకు అమలులో ఉన్నది. "ఈ రూపాయే 1947 సంవత్సరము వరకు బ్రిటీష్ కరెన్సీకి ప్రాతిపదికయని" స్మిత్ పండితుని అభిప్రాయము. ఈ నాణెముపై నున్న లేఖనములు అరబిక్‌తోపాటు దేవనాగరి లిపిలో ఉండుట మరో ఒక విశేషము.

### 3.5.11 ప్రజాహిత కార్యములు - ధర్మదాత :

షేర్షా రాజ్యములోని వివిధ ప్రముఖ పట్టణములను కలుపుచూ అనేక బాటలను వేయించెను. వీనిలో ముఖ్యమైనది బెంగాల్ నుండి సింధు వరకు గల 1500 కి.మీ. రహదారి. ఇది అన్నిటికంటె పొడవైనది. ఆగ్రా నుండి జోధాపూర్ వరకు, ఆగ్రా నుండి బుర్హాన్‌పూర్ వరకు, లాహోర్ నుండి ముల్తాన్ వరకు, రాచబాటలు వేయించి, హిందూ చక్రవర్తులవలె బాటల కిరుప్రక్కల చెట్లు నాటించెను. బావులు త్రవ్వించెను.

ప్రాచీన భారతీయ చక్రవర్తులను గుర్తుకు తెచ్చునట్లు షేర్షా అనేక దాన ధర్మములు చేసెను. ఢిల్లీలోని ఒక్క అన్నసత్రమునకే రోజుకు 500 తులముల బంగారము వెచ్చించెడివాడట. సుమారు నాడు 1700 సత్రములు నిర్మించబడెను. అంచె తపాలా పద్ధతి ప్రవేశపెట్టబడెను.

### 3.5.12 భవననిర్మాత :

షేర్షా గొప్ప భవన నిర్మాత. ఢిల్లీలోని 'పురానాకిలా' జీలంనదిపై నిర్మించబడిన 'రోటస్‌దుర్గము' ససరామ్‌లోని 'అతని సమాధి' షేర్షా భవన నిర్మాణ కౌశలమునకు నిదర్శనము. ఇతని సమాధి భారతదేశ ముస్లిం భవనములలో మణిపూస వంటిదని విమర్శకులు అభిప్రాయం. "ససరామ్‌లోని షేర్షా సమాధి తాజ్‌మహల్ కంటెను సుందరమైన కట్టడమని" 'కనింగ్‌హామ్' పండితుడు తలచెను.

### 3.5.13 మతవిధానం :

షేర్షా సున్నీ మతస్థుడు. అతని పరమతసహన విధానమును గురించి, చరిత్రకారులలో భేదాభిప్రాయాలు కలవు. ఆచార్య కనుంగో షేర్షా పరమతసహనమును గురించి ప్రశంసింపగా, ఆచార్య శ్రీరాంశర్మ షేర్షా పరమతద్వేషియని దూషించెను. నిష్పక్షపాతముగా చెప్పవలెనన్న షేర్షా మతవిధానంపై రెండు అభిప్రాయాలకు అవకాశమిచ్చుచున్నది. షేర్షా హిందువులపట్ల సహనభావమును ప్రదర్శించి, వారికి సైన్యమందును, ప్రభుత్వ యంత్రాగమందు ఉద్యోగములిచ్చెను. హిందువుల మతస్వాతంత్ర్యమునందు జోక్యము చేసుకొనలేదు. కాని జోధ్‌పూర్, రైజిన్ దండయాత్రలను మత యాత్రలుగా ప్రకటించి, హిందువుల యెడ అతిక్రూరముగ వ్యవహరించెను. జోధ్‌పూర్ దాడిలో అచ్చటి హిందూ దేవాలయమును నేలమట్టము గావించి, దాని శిథిలములపై మసీదును నిర్మించెను. ఈ చర్య అతని మత మూర్ఖత్వముగా చెప్పుచున్నారు. సాధారణముగా షేర్షా, హిందువులయెడ సహనము పాటించి, దండయాత్ర సమయములలో ముస్లిమ్‌లను ఉత్తేజపరచుటకు 'జీహాద్'లు (పవిత్ర యుద్ధము)గా ప్రకటించి, హిందువులను సైతము హింసించి ఉండవచ్చును.

### 3.5.14 అక్బరుకు మార్గదర్శకుడు :

షేర్షా పాలనావిధానమందలి ముఖ్యాంశములను అక్బరు అనుకరించి, వానికి నూతన రూపురేఖలు దిద్ది పాలనా విధానమును కొనసాగించెను.

**ఎ) భూమిశిస్తు విధానం :** రెవిన్యూ విధానములో అక్బరు ఆర్థికమంత్రి రాజాతాడర్‌మల్ షేర్షా భూమిశిస్తు విధానమును కొద్దిమార్పులతో సంస్కరించి, మన దేశమున ప్రఖ్యాతిగాంచిన "రైత్వారీ విధానము"ను ప్రవేశపెట్టెను.

**బి) రాజ్య విభాగములు :** షేర్షా ప్రవేశపెట్టిన పాలనా విభాగములైన సర్కారులు, పరగణాలు అక్బరు సుభాలుగా, సర్కారులుగా మార్పుచేసెను. షేర్షా ప్రభుత్వ యంత్రాంగమందలి షిక్దార్, ముకద్దం పట్వారీ, ఖాజీ మొదలగు ఉద్యోగులు మాత్రము మొగలు పరిపాలనా విధానంలో కూడా కొనసాగిరి.

**సి) మతవిధానం :** షేర్షా అనుసరించిన మత విధానమును అక్బరు కూడా అనుసరించి, అసంఖ్యాకులైన హిందువుల ప్రేమానుభిమానములు పొందనిదే తన రాజ్యమనుగడ దుర్లభమనితలంచి, హిందువులకు తన ఆస్థానమున ఉన్నత పదవులు ఇచ్చి, వారితో వివాహ సంబంధములు పెంపొందించుకొని, వారి సహకారముతో సువిశాల సామ్రాజ్యమును నిర్మించెను. అటులనే హిందువుల మత స్వాతంత్ర్యములో జోక్యము చేసుకొనక, షేర్షావలె జీహాద్‌లు ప్రకటింపక, తాను మతమూర్ఖుడు కాదని తెలియజేయుటకు 'దిన్-ఇ-ఇలాహి' (అనగా మతసామరస్యము) అను నూతన మతమును స్థాపించెను.

**డి) ఇతర అంశములు :** షేర్షావలె అక్బరు ప్రజాసంక్షేమమునకై అనేక ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టెను. అటులనే షేర్షా అధికార కేంద్రీకరణ వ్యవస్థను, న్యాయపాలనను సైతము అక్బరు షేర్షా నుండి గ్రహించెను. అందువలననే "షేర్షా అక్బరుకు మార్గదర్శకుడని" వి.ఎ. స్మిత్ పండితుడు పేర్కొనెను.

### 3.5.15 ఘనత :

ఆఫ్ఘనులలో షేర్షా సాటిలేని మేటివీరుడు, గొప్ప పరిపాలనాదక్షునిగా, ప్రజల మన్ననలను పొంది, అక్బరుకు పరిపాలనా వ్యవస్థలో మార్గదర్శకుడయ్యెను. "భారతదేశ ముస్లిం చక్రవర్తులలోకెల్ల గొప్పవాడని" 'సర్‌వుల్ స్లీ హైగ్' చే అభివర్ణించబడెను.

"సైనిక, పౌర విధానములలో తన రాజనీతిజ్ఞతను ప్రదర్శించెను. నిరంతర కృషివలన, తన 5 సంవత్సరముల స్వల్పపాలనా వ్యవధిలో హిందూస్థాన్‌నందు శాంతిభద్రతలు నెలకొల్పి, తన పాలనా సామర్థ్యమును నిరూపించుకొనెను' అని 'హావెల్' (Havall) పండితుడు పేర్కొనెను.

## 3.6 షేర్‌షా వారసులు, సూర్‌వంశ పతనం :

చరిత్రలో సమర్థులైన పాలకుల తదుపరి, అసమర్థులైన పాలకులు సింహాసనమునకు వచ్చుట సర్వసాధారణముగా జరుగుచున్నది అని 'కినే' పండితుడు నుడివెను. షేర్షా మరణానంతరము అతని రెండవకుమారుడు 'జలాల్‌ఖాన్' 'ఇస్లామ్‌షా' అని బిరుదుతో సింహాసనమునకు వచ్చెను. సాధారణముగా ఇస్లామ్‌షాను 'సలీమ్‌షా' అని పిలిచెడివారు. ఇతడు క్రీ.శ. 1545 - '54 మధ్యకాలమున రాజ్యపాలన చేసెను. ఇతడు సమర్థుడైన పాలకుడు.

సలీమ్ పాలనను వ్యతిరేకించుచూ అతని సోదరులు, అనుయాయులు తిరుగుబాట్లు చేయుచుండిరి. ఈ తిరుగుబాట్లను తన తండ్రి షేర్షావలె సమర్థవంతముగా అణచివేసెను. ఇతని మరణానంతరము బాలుడైన ఇతని కుమారుడు ఫిరోజ్‌షా వారసుడు కాగా, ఫిరోజ్‌షాను అతని మేనమామయగు 'ముభారిజ్‌ఖాన్' చంపి 'మహమ్మద్ అదిల్‌షా' అను పేరుతో సింహాసనమధిష్టించెను.

'మహమ్మద్ అదిల్‌షా' పరిపాలన అస్తవ్యస్తముగా ఉండెను. అతడు 'అందాలీ' (గ్రుడ్డివాడు) గా పిలువబడెను. ఇతని మంత్రి హేము సర్వాధికారములు వహించి రాజ్యవ్యవహారములు చూచుచుండెను. తదుపరి ఇబ్రహీంఖాన్ సూర్, అహమ్మద్‌ఖాన్ సూర్ (ఇతనికి సికిందర్‌షా సూర్ అను పేరు కూడ కలదు) అధికారం కొరకు పోటీపడిరి. ఈ సంఘర్షణలో బెంగాల్ గవర్నర్ మహమ్మద్‌ఖాన్ సూర్ కూడా పాల్గొనెను. చివరకు ఉత్తర భారతదేశము నాల్గు భాగములుగా విభజింపబడి, పంజాబ్ సికిందర్‌షా సూర్‌కు, ఢిల్లీ, ఆగ్రాలు ఇబ్రహీంఖాన్‌సూర్‌కు, ఆగ్రా నుండి బీహార్ వరకు గల ప్రాంతము ఆదిల్‌షాకు, బెంగాల్ మహమ్మద్‌షాకు లభించెను.

## 3.7 ముగింపు :

ఇట్లు షేర్షాచే నిర్మింపబడిన సూర్ సామ్రాజ్యము ఛిన్నాభిన్నముగా ఉండుటవలన మొగల్ చక్రవర్తి అయిన హుమాయూన్ అవకాశముగా ఎంచి ఆఫ్ఘన్ అధికారమును తుదముట్టించి, తిరిగి మొగల్ అధికారమును హిందూస్థాన్‌లో పునః ప్రతిష్టించుటకు అవకాశం ఏర్పడెను.

### మాదిరి ప్రశ్నలు :

**ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలు వ్రాయుము.**

1. షేర్షా సూర్‌వంశ సామ్రాజ్యమును ఎట్లు స్థాపించెను ?
2. షేర్షా గొప్ప పరిపాలనాదక్షుడు అని ఎట్లు చెప్పగలవు ?

**ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానాలు వ్రాయుము.**

1. హుమాయూన్‌తో యుద్ధము
2. భూమిశిస్తు విధానం
3. అక్బరుకు మార్గదర్శకుడు 'షేర్షా'
4. షేర్షా వారసులు - సూర్‌వంశ పతనం

### ఉపయుక్త గ్రంథాలు :


1. Medieval India - Iswarai Prasad
2. The Mughal Empire in India - S.R. Sharma
3. The Mughal Empire - A.L. Srivastava
4. Indian History and Culture Vol. II - B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao
5. భారతదేశ చరిత్ర, సంస్కృతి (ద్వితీయ భాగం) - పాటిబండ ఝాన్సీలక్ష్మి మరియు శ్రీమతి అల్లాడి వైదేహి
6. Sher Shah And His Times - K. R. Qanungo
7. India since 1526 - V.D. Mahajan



**C. RAVINDRA RAJU**
**M.A.**

పాఠం - 4

# మొగలు సామ్రాజ్య స్థాపన - విస్తరణ - అక్బరు

విషయసూచిక


4.0 లక్ష్యం

4.1 ఉపోద్ఘాతం

4.2 బాల్యజీవితం

4.3 పట్టాభిషేకం

4.4. రాజకీయ పరిస్థితులు

4.5 రెండవ పానిపట్టు యుద్ధం

4.6 బైరంఖాన్ పతనం

4.7 దండయాత్రలు 1560 - 1605

4.8 రాజ్య సరిహద్దులు

4.9 రాజపుత్ర విధానం

4.10 అక్బరు మతవిధానం

4.11 అక్బరు పరిపాలన

4.12 ముగింపు


## 4.0 లక్ష్యం :

బాబరుచే స్థాపించబడిన మొగలు సామ్రాజ్యాన్ని, ఏయే మార్గాలద్వారా అక్బరు విస్తరింపజేశాడో వివరించడమే ఈ పాఠం లక్ష్యం. హిందువల పట్ల అక్బరు అనుసరించిన విధానాన్ని కూడా వివరించటమైనది. అక్బరు యొక్క పరిపాలనా పద్ధతులు ఏవిధంగా మొగలు సార్వభౌమాధికారాన్ని పటిష్టం చేశాయో ఈ పాఠంలో తెలియజేయటం జరిగింది.

## 4.1 ఉపోద్ఘాతం :

బాబరుచే స్థాపించబడిన మొగలు సామ్రాజ్యాన్ని అక్బరు వినూత్న పోకడలతో పటిష్టం చేశాడు. భారతదేశమంతా మొగలు సార్వభౌమాధికారాన్ని స్థాపించాడు. సుమారు అర్ధశతాబ్దిపాటు భారతదేశాన్ని పాలించి ఒక గొప్ప చక్రవర్తిగా విలసిల్లాడు. సమర్ధవంతమైన పరిపాలనా యంత్రాంగాన్ని నిర్మించిన ఒక గొప్ప చక్రవర్తి అక్బరు. మతసామరస్యాన్ని సాధించి ముస్లింలను రాజపుత్రులను ఏకత్రాటిపై నడిపించిన ఘనత అక్బరుకు దక్కుతుంది. అందుకే అతడు గొప్ప చక్రవర్తిగా పేరుపొందాడు.

## 4.2 బాల్య జీవితం :

అక్బరు 1542లో సింధు రాష్ట్రంలోని అమర్‌కోటలో జన్మించాడు. ఆ సమయంలో అతని తండ్రి హుమాయూన్ అనేక కష్టాలనెదుర్కొంటున్నాడు. హుమాయూన్ అక్బరుకు ఐదవ ఏట విద్యాభ్యాసం చేయించాడు. అక్బరుకు చదవటం రాకపోయినా మంచి జ్ఞాపకశక్తి వుండేది. రాచ విద్యలన్నీ నేర్చుకున్నాడు. 9వ ఏట గజనీకి గవర్నరుగా నియమించబడ్డాడు. హుమాయూన్ భారత ఆక్రమణ సందర్భముగా మొగలు సైన్యాలకు అక్బరు నాయకత్వం వహించాడు. గెలుపొందిన తర్వాత హుమాయూన్ అక్బరును పంజాబు గవర్నరుగా నియమించాడు. అక్బరు సంరక్షకుడిగా బైరంఖాన్ నియమించబడ్డాడు.

## 4.3 పట్టాభిషేకం :

హుమాయూన్ మరణించగానే ఫిబ్రవరి 14, 1556న బైరంఖాన్ అక్బరును పాదుషాగా ప్రకటించాడు. అప్పుడతని వయస్సు కేవలం 13 సంవత్సరములు. అందువలన అధికారం బైరంఖాన్ నిర్వహించేవాడు.

## 4.4. రాజకీయ పరిస్థితులు :

ఆ సమయంలో భారతదేశంలో రాజకీయ పరిస్థితులు అస్థవ్యస్థంగా వుండటం వలన అక్బరు అనేక సమస్యల నెదుర్కొన్నాడు. కాబూలులో వున్న సోదరుడు స్వతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నాడు. ఉత్తర భారతదేశంలో తిరుగుబాట్లు బయలుదేరాయి. ఇంకొకవైపు షేర్షా వారసులు అక్బరును ఎదుర్కొనటానికి సిద్ధంగా వున్నారు. సూర్ వంశస్థుడైన సికందర్ సూర్ పంజాబులో స్వతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు. మేవారు, జైసల్మీరు, జోధపూర్ మొదలైన రాజపుత్ర రాజ్యాలు మొగలులను వ్యతిరేకిస్తున్నాయి. వీటితోపాటు షేర్షా ఏర్పాటుచేసిన పరిపాలనా యంత్రాంగం దెబ్బతింది. వీటన్నిటికి తోడు కరువుకాటకాలు సంభవించాయి.

ఆఫ్ఘన్లు అక్బరును తరిమివేయటానికి సిద్ధమయ్యారు. వారిలో ముఖ్యుడు మహమ్మద్ అదిల్‌షా సూర్. కానీ ఇతను అసమర్ధుడు, పరిపాలన అతని హిందూ మంత్రి హేమూ చేతిలో కేంద్రీకృతమైంది.

## 4.5 రెండవ పానిపట్టు యుద్ధము (1556) :

హేమూ నాయకత్వములో ఆఫ్ఘన్ సైన్యం ఢిల్లీమీద దండెత్తింది. మొగలు గవర్నరు టార్డీబేగ్ యుద్ధంలో వోడిపోయి పారిపోయాడు. ఢిల్లీ, ఆగ్రాలను ఆఫ్ఘన్లు ఆక్రమించారు. ఈ లోపల హేము 'విక్రమాదిత్య' అని బిరుదుతో తానే చక్రవర్తిగా ప్రకటించుకొని సింహాసనాన్ని అధిష్టించాడు.

అక్బరు ఈ వార్త విని సైన్యంతో ఢిల్లీ బయలుదేరాడు. దారిలో టార్డీబేగ్ అతనిని కలియగా, బైరంఖాన్ అతనిని విచారించి ఉరితీయించాడు. బైరంఖాన్‌కు టార్డీబేగ్ అంటే పడదని, ఈ విధంగా అడ్డుతొలగించుకున్నాడని అబుల్‌ఫజల్ వ్రాశాడు. మొగలు అధికార్లంతా అక్బరును ఆఫ్ఘనిస్థాన్ వెళ్ళిపోవల్సిందిగా కోరారు. కాని అక్బరు ధైర్యంతో హేమూను ఎదిరించటానికే నిశ్చయించుకున్నాడు. బైరంఖాన్ ఆధిపత్యంలో 20 వేల సైన్యంతో దండయాత్ర సాగించాడు. చారిత్రాత్మకమైన పానిపట్టు దగ్గర నవంబరు 5, 1556లో ఇరు సైన్యాలు తలపడ్డాయి. మొదట హేము గజదళం శత్రువులను భయంకరంగా వెంటాడింది. ఈ లోపల హేము కంటికి గాయమై స్పృహతప్పగా అతని సైన్యంలో గందరగోళం ఏర్పడింది. సైన్యం హేమూ మరణించాడనుకొని పారిపోయింది. మొగల్ సైన్యం హేమూను బంధించి శిరచ్ఛేదం చేయటం జరిగింది. ఈ విధంగా అక్బరు రెండవ పానిపట్టు యుద్ధంలో విజయం సాధించాడు.

**ఫలితాలు :** రెండవ పానిపట్టు యుద్ధం నిర్ణయాత్మకమైన యుద్ధం. మొదటి పానిపట్టు యుద్ధంతో మొగలు సామ్రాజ్య స్థాపన జరగగా రెండవ యుద్ధం దాన్ని పటిష్టం చేసింది.

## 4.6 బైరంఖాన్ పతనం :

అక్బరు చిన్నవాడైనందువలన బైరంఖాను పరిపాలనా బాధ్యత నిర్వహించాడు. బైరంఖాన్ హుమాయూన్ రాజ్యాన్ని కోల్పోయిన కాలంలో అండగా వున్నాడు. అందువలన అతనిని అక్బరు సంరక్షకుడిగా హుమాయూన్ నియమించాడు. అక్బరు కూడా అతనంటే చాలా ప్రేమగావుండి 'ఖాన్ బాబా' (Khan Baba) అని పిలిచేవాడు. మొగలు రాజ్యాన్ని కాపాడటానికి బైరంఖాన్ చాలా కృషిచేశాడు. అతను షియా కావటంవలన సున్నీ మతస్థులు ద్వేషభావాన్ని ప్రదర్శించేవారు. దానికి తగ్గట్టు బైరంఖాన్ ఆశ్రిత పక్షపాతంతో వ్యవహరించేవాడు. అక్బరు పరిపాలనలో జోక్యం చేసికోకపోవటం వలన ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించడమేకాక, చివరకు అక్బరుపై కూడా పెత్తనం చెలాయించడానికి సిద్ధమయ్యాడు. అక్బరు పెంపుడుతల్లి మహం ఇతనిని వ్యతిరేకించి అక్బరుకు అతనిమీద ద్వేషాన్ని

కల్గించింది. అక్బరు ఆవిడ సహాయంతో బైరంఖాన్‌ను పదవినుండి బర్తరఫ్ చేశాడు. తర్వాత అతనిని బంధించాడు కాని శిక్షించకుండా వదలివేశాడు. బైరంఖాన్ మక్కా వెళ్తూ దారిలో ఒక ఆఫ్ఘన్ సైనికుని చేతిలో మరణించాడు.

బైరం పతనం తర్వాత అక్బరు పెంపుడుతల్లి మహం అధికారం చెలాయించటానికి పూనుకుంది. 'అక్బరు బైరంఖాన్ నుండి ఆడవాళ్ల ఆధీనంలోకి వచ్చాడని' వి.ఎ.స్మిత్ వ్రాశాడు. కాని త్వరలోనే అక్బరు పెంపుడుతల్లి ఆధిపత్యం నుండి విముక్తిచెంది, స్వతంత్రపాలన మెదలుపెట్టాడు.

## 4.7 దండయాత్రలు :

అక్బరు గొప్ప సామ్రాజ్యవాది. అతనికి భారతదేశమంతా జయించాలనే కోర్కె వుంది. తన ఆశయ సాధనకు అనేక యుద్ధాలు చేశాడు. మొట్టమొదట ఢిల్లీ చుట్టుప్రక్కల రాజ్యాలైన మాళ్వ, జాన్‌పూర్‌లను ఆక్రమించాడు.

### 4.7.1 గోండ్వానా (1564) :

మధ్యప్రదేశ్ ఉత్తరభాగంలో గోండ్వానా అనే హిందూరాజ్యంవుంది. రాజు వీరనారాయణ పసివాడైనందున పాలన రాణి దుర్గావతి ఆధీనంలో వుంది. దుర్గావతి రాజపుత్ర స్త్రీ. వారి పరాక్రమాన్ని పుణికి పుచ్చుకుంది. 1564లో అక్బరు కారా గవర్నరైన అసఫ్‌ఖాన్‌ని గోండ్వానా ఆక్రమణకు పంపాడు. దుర్గావతి అమిత ధైర్యసాహసాలతో ఎదుర్కొంది. కాని ఫలితం లేకపోయింది. మొగలుల ఆధీనమవటం ఇష్టంలేక దుర్గావతి ఆత్మహత్యకు పాల్పడింది. తర్వాత వీరనారాయణ కూడా సాహసంతో పోరాడాడు కాని వోడిపోయి చనిపోయాడు. గోండ్వానా మొగలు రాజ్యంలో కల్సిపోయింది.

### 4.7.2 రాజపుటానా :

అక్బరు రాజపుత్ర రాజ్యాలను ఆక్రమించటానికి పూనుకున్నాడు. రాజపుత్రులను ఓడించనిదే భారతసార్వభౌమాధికారం నెలకొల్ప సాధ్యమవదని తెల్సుకున్నాడు. అందువలన బలమైన రాజపుత్ర రాజ్యాలయిన మేవారు, మార్వారు మొదలైన వాటితో యుద్ధం చేశాడు. జయపూరు రాజైన బీహారీమల్ అక్బరు సార్వభౌమాధికారాన్ని అంగీకరించి, తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. బీహారీమల్ అక్బరు ఆస్థానంలో మున్సబ్‌దారుగా నియమించబడ్డాడు. కాని తన సార్వభౌమాధికారాన్ని అంగీకరించని రాజపుత్ర రాజులతో అక్బరు అనేక యుద్ధాలు చేసి వారి రాజ్యాలను స్వాధీనపరచుకున్నాడు.

#### 4.7.2.1 మేవారు :

అక్బరు కాలంలో మేవారు రాజు ఉదయసింగ్. ఇతను సంగ్రామసింగు కొడుకు, శిశోదియా వంశానికి చెందినవాడు. ఉదయసింగు చాలా పరాక్రమవంతుడు. బీహారీమల్ ప్రవర్తన కూడా ఉదయసింగుకు నచ్చలేదు. రాజపుత్ర రాజులలో అగ్రగణ్యుడైనందున అక్బరు ముందుగా ఉదయసింగు నెదుర్కొన్నాడు. అక్బరు మొగలు సైన్యానికి తానే స్వయంగా నాయకత్వం వహించి చిత్తోడ్‌ను ముట్టడించాడు. దాదాపు ఐదు నెలలపాటు ముట్టడి కొనసాగింది. ఇరుపక్షాలు నష్టపోయాయి. కోట రక్షణకు జయమల్ నియమించబడ్డాడు. మొగలు సైన్యాలు రహస్య దుర్గాలను నిర్మించి కోట బురుజులను ధ్వంసం చేశాయి. యుద్ధంలో జయమల్ మరణించగా సైన్యం నిర్వీర్యమైంది. ఆ తర్వాత కూడా ఫతేసింగు నాయకత్వంలో రాజపుత్రులు మొగలులను ఎదుర్కొన్నారు. కాని ఉపయోగం లేకపోయింది. కోటను మొగలులు ఆక్రమించారు. అక్బరు రాజపుత్రులందరినీ హతమార్చవలసిందిగా ఆజ్ఞాపించాడు. దాదాపు 30 వేల మంది రాజపుత్రులను హతమార్చటం జరిగింది.

### 4.7.2.2. హల్దీఘాట్ యుద్ధం (1576) :

చిత్తోడ్‌రాజు ఉదయసింగ్ మరణం తర్వాత అతని కుమారుడు రాణాప్రతాప్ మొగలుల అధికారాన్ని ధిక్కరించాడు. 1576లో మొగలు సైన్యాలు రాణాప్రతాప్‌పై యుద్ధాన్ని ప్రకటించాయి. హల్దీఘాట్ కనుమవద్ద మాన్‌సింగ్ నాయకత్వంలో మొగలు సైన్యాలు విజయాన్ని సాధించాయి. కాని రాణా లొంగలేదు. 1597కు రాణాప్రతాప్ తాను కోల్పోయిన చాలాభాగాలను తిరిగి సంపాయించాడు.

### 4.7.3 గుజరాత్ :

1572లో అక్బరు గుజరాత్‌పై దండెత్తాడు. గుజరాత్ గొప్ప రేవుపట్టణాలతో, సిరిసంపదలతో తులతూగేదేశం. వ్యాపారాభివృద్ధికి అక్బరు దీనిని ఆక్రమించాలనుకున్నాడు. అంతేకాక మక్కా వెళ్ళే ముస్లింలను వేధిస్తున్న పోర్చుగీసు వారిని అదుపులోకి తీసుకురావటానికి కూడా అక్బరు దీని ఆక్రమణకు పూనుకున్నాడు. అలాగే గుజరాత్ అనేక తిరుగుబాటుదార్లకు ఆశ్రయమిచ్చింది. స్థానిక నాయకుడైన ఇత్తిమాద్‌ఖాన్ ఆహ్వానంపై 1527లో అక్బరు దండయాత్రకు పూనుకున్నాడు. చక్రవర్తిని చూడగానే గుజరాతు నాయకులంతా లొంగిపోయారు. అక్బరు రాజధానికి వెళ్ళగానే మీర్జాలు తిరుగుబాటు చేశారు. అక్బరు తిరిగివచ్చి మీర్జాలను వోడించటమేకాక, పోర్చుగీసువారిని కూడా అదుపులోకి తీసుకువచ్చాడు. ఇంత శీఘ్రగతిలో సాగిన యుద్ధం మరొకటిలేదని వి.ఎ.స్మిత్ వర్ణించాడు. అంతేగాక ఈ యుద్ధం అక్బరు చరిత్రలోనే నూతన శకాన్ని సృష్టించాడని వర్ణించాడు.

### 4.7.4 బెంగాలు :

బీహారు గవర్నరు సులేమాన్ కరాని బెంగాలును ఆక్రమించుకున్నాడు. తెలివైనవాడు కావటం వలన అక్బరు సార్వభౌమాధికారాన్ని గుర్తించాడు. కాని అతని కొడుకు దావూద్ స్వతంత్రాన్ని ప్రకటించుకున్నాడు. మొగలు ప్రాంతాలను కొల్లగొట్టాడు. అక్బరు 1574లో బయలుదేరివచ్చి దావూద్‌ను ఓడించి, బెంగాలును స్వాధీనపరచుకొన్నాడు.

### 4.7.5 కాబూల్ :

చక్రవర్తి సవతి సోదరుడు మహమ్మద్ కాబూలును పాలిస్తున్నాడు. ఇతను అక్బరును వ్యతిరేకించి శత్రువులకు ఆశ్రయం ఇచ్చాడు. ఢిల్లీని ఆక్రమించాలని 1581లో పంజాబు మీద దండెత్తాడు. అక్బరు ఇతనిని ఓడించి కాబూలును ఆక్రమించాడు.

### 4.7.6 దక్షిణదేశ దండయాత్రలు :

### 4.7.6.1 అహమ్మద్ నగరు :

ఉత్తరదేశాన్ని అదుపులోకి తీసుకువచ్చాక, దక్షిణాన్ని కూడా ఆక్రమించటానికి నిశ్చయించుకున్నాడు. 1593లో మురాద్‌ను, రహీంఖాన్ ఆధ్వర్యంలో అహమ్మద్‌నగర్ మీదికి పంపాడు. అప్పుడు రాజు బహదూర్ కాని పరిపాలకురాలు చాంద్‌బీబీ. చాంద్‌బీబీ వీరోచితంగా పోరాడింది కాని ఫలితం లేకపోయింది. బీరారును మొగలులకు స్వాధీనపరచి సంధి కంగీకరించింది. కాని సంధి షరతులు పాటించనందున తానే స్వయంగా బయలుదేరాడు. చాంద్‌బీబీ యుద్ధంలో మరణించింది. అహమ్మద్‌నగర్ అక్బరు స్వాధీనమైంది.

### 4.7.6.2 ఖాందేష్ (1599) :

ఖాందేష్ పాలకుడు ముబారక్‌షా మొగలు సార్వభౌమాధికారాన్ని అంగీకరించాడు. కాని అతని కుమారుడు ఆలీఖాన్, మనుమడు బహదూరు మొగలులను ఎదిరించారు. అక్బరు 1599లో ఖాందేష్ పై యుద్ధాన్ని ప్రకటించి బూర్హాన్‌పూరుని ఆక్రమించి, ఆశీరుఘర్ కోటపై దండెత్తాడు. నెల రోజుల ముట్టడి తర్వాత దానిని ఆక్రమించాడు. బహదూర్‌ని గ్వాలియర్‌కు బందీగాపంపి, ఖాందేష్‌ను రాజ్యంలో కలుపుకున్నాడు. విజయ చిహ్నంగా అక్బరు ఫతేపూర్ సిక్రిలో "బులంద్ దర్వాజా" కట్టించాడు.

ఈ విధంగా అక్బరు తన విజయాలతో భారతదేశానికి తిరుగులేని చక్రవర్తిగా నిరూపించుకున్నాడు.

## 4.8 రాజ్య సరిహద్దులు :

అక్బరు దండయాత్రలతో మొగలు రాజ్యం కాందహారు నుంచి కాబూలు వరకు, కాశ్మీరు నుంచి అహమ్మద్‌నగరు వరకు విస్తరించింది.

## 4.9 రాజపుత్ర విధానం :

తన సార్వభౌమాధికారాన్ని పటిష్టం చేసికోవటం కోసం, అన్ని వర్గాల వారి సహకారం, అవసరమని అక్బరు భావించాడు. రాజపుత్రుల ధైర్యసాహసాలు, వారి దేశభక్తి పట్ల ఆకర్షితుడై, వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాడు. అంతేకాక కణ్వాయుద్ధం తర్వాతకూడ రాజపుత్రుల పరాక్రమం క్షీణించలేదని గ్రహించాడు. అటువంటివారి సహకారం లేనిదే రాజ్యం మనలేదని తెల్సుకున్నాడు. ఇదే సమయంలో రాజపుత్రుల మధ్య కలహాలు ఎక్కువైనాయి. వారినందరినీ కలపటానికి రాణాసంగ లాంటి నాయకుడు లేడని గ్రహించారు. అందువలన అక్బరుకు సహకారం అందివ్వటానికి ముందుకువచ్చారు. అలా వచ్చిన వారితో అక్బరు మైత్రిని ప్రదర్శించాడు. తనకు లొంగనివారితో అనేక యుద్ధాలు చేశాడు.

అక్బరు తనకు సహకరించిన రాజపుత్రులతో వైవాహిక సంబంధాలు నేర్పరచుకొన్నాడు. అంబరు రాజగు బీహారీమల్ కుమార్తెను, బికనీరు, జైసల్మీరు రాజకుమార్తెలను వివాహమాడాడు. అంతేకాక బీహారీమల్ కుమార్తె జోధబాయి సంతానానికే వారసత్వపు హక్కును కల్పించాడు. ఇంకా అనేకమంది రాజపుత్ర రాజులకు ఆస్థానంలో ఉన్నతపదవులిచ్చి గౌరవించాడు. వారిలో రాజా భగవాన్‌దాస్, రాజా మానసింగ్, తోడరుమల్ ముఖ్యులు. వీరు అనేక యుద్ధాలలో అక్బరుకు సహాయపడ్డారు.

### ఉపయోగాలు :

అక్బరు, రాజపుత్రుల మైత్రి ఇరువురకు కూడా అనేక ప్రయోజనాలు కల్గాయి. రాజపుత్రులు వారి పరాక్రమాన్ని ప్రదర్శించి మొగలు అధికారం విస్తరించటానికి కృషిచేశారు. వారి ధైర్య శౌర్యాలన్నీ యుద్ధాలలో వెచ్చించారు. అలాకాకపోయినట్లయితే రాజపుత్రులు నిరంతరం, కొండలలో, అడవులలో పోరాడవలసి వచ్చేది. వారి పరాక్రమాలు తెలిసేవికావు. అక్బరు మైత్రి, అంతకుముందు, వారు పొందిన అవమానాలను మరపింపజేసింది. ఇంకొకవైపు అక్బరుకు కూడా రాజపుత్రుల సహకారం లాభించింది. అక్బరు ఆస్థానంలో ఉన్నత పదవులలో వున్న ముస్లిములు అక్బరుపట్ల అసూయతో అనేక కుట్రలు పన్నటానికి పూనుకొన్నారు. అక్బరు సోదరులతోచేరి తిరుగుబాట్లకు సన్నాహాలు చేశారు. వీరిపట్ల నమ్మకంలేని అక్బరు హిందువులను ఆదరించాడు. మరొకవైపు రాజపుత్రులు నమ్మకస్తులు. అవసరమైతే చక్రవర్తి రక్షణకు ప్రాణత్యాగానికైనా సిద్ధపడేవారు.

ఈ విధంగా అక్బరు రాజపుత్రుల సహకారంతో మొగలు సార్వభౌమాధికారాన్ని స్థాపించాడు.

## 4.10 అక్బరు మతవిధానం :

అక్బరుకు చిన్నప్పటినుండి మతంపట్ల, తాత్విక విషయాలపట్ల ఆసక్తి వుండేది. విద్యాభ్యాసం లేకపోయినా కేవలం వినటం వలననే అన్ని మతాలను అధ్యయనం చేశాడు. బైరంఖాన్, అబ్దుల్ లతీఫ్ మొదలగువారి సిద్ధాంతాలను, ఆకళింపు చేసుకున్నాడు. ముఖ్యంగా సూఫీ మతబోధనలు అక్బరును ఆకర్షించాయి. ఇస్లాం మతం పట్ల అపారమైన అభిమానం ఉన్నప్పటికీ మతద్వేషాన్ని పాటించలేదు. ఇస్లాం మతాన్ని తు.చ. తప్పకుండా అనుసరించాడు. రోజుకు 5 సార్లు నమాజు చేసేవాడు.

అక్బరు ఇతర మతాలపట్ల సహనాన్ని ప్రదర్శించాడు. అన్ని మతాల వారిని కలుసుకొని వారితో తాత్విక చర్చలు జరిపేవాడు. తద్వారా మతంపట్ల నిర్దిష్టమైన అవగాహన ఏర్పడింది. మతవిధానాన్ని ఆచరణలో పెట్టటానికి అనేక సంస్కరణలు చేశాడు.

1563లో హిందూ యాత్రికులపై పన్ను రద్దు చేశాడు. 1564లో జిజియాపన్నును రద్దుచేశాడు. యుద్ధాలలో దొరికిన బందీలను బలవంతంగా ఇస్లాం మతంలోనికి మార్చరాదని శాశించాడు. హిందువుల ఆచారవ్యవహారాలపట్ల ఆసక్తి చూపాడు. ఇవన్నీ కూడా సంతృప్తిపరచనందువలన, 'ఇబాదత్ ఖానా' అనే ప్రార్ధనా మందిరాన్ని, దీన్-ఇల్లాహీ అనే కొత్త మతాన్ని స్థాపించాడు.

## 4.10.1 ఇబాదత్ ఖాన్ (1575) :

మొదట అక్బరును సూఫీ సిద్ధాంతాలు ఆకర్షించాయి. భగవంతుడొక్కడే, అన్ని మతాల సారాంశమొక్కటే అనే సూఫీ సూత్రాలను అక్బరు ఆచరణలో పెట్టాడు. ఇందుకు అబుల్ ఫజుల్, అబుల్ ఫైజాలు ముఖ్యకారకులు. వారి సలహాపై 1575లో ఫతేపూర్ సిక్రీలో ఇబాదత్ ఖానా అనే ప్రార్ధనా మందిరాన్ని నిర్మించాడు. అక్కడ తాత్విక చర్చలు మతపరమైన చర్చలు కొనసాగేవి. మొదట్లో కేవలం ముస్లిం మతాధికారులే పాల్గొనేవారు. భిన్నశాఖలకు చెందిన ముస్లిం మతగురువులు ఒకరితో ఒకరు తీవ్రంగా విమర్శించుకోవటంతో, విసుగుచెందిన అక్బరు మిగిలిన మతాధికారులను కూడా ఆహ్వానించాడు. హిందు, బౌద్ధ, శిక్కు, క్రైస్తవ, జోరాష్ట్రియన్ మతాధికారులంతా చర్చలలో పాల్గొనేవారు.

జైనమత సిద్ధాంతాలను అవగాహన చేసుకున్న అక్బరు మాంసాహారాన్ని, వేటను మానివేశాడు. పార్సీ మత పరిచయంతో సూర్య, అగ్ని దేవతలను ఆరాధించేవాడు. అలాగే హిందూ సిద్ధాంతాలైన, కర్మ, పునర్జన్మల పట్ల నమ్మకాన్ని వ్యక్తపరచాడు. అన్ని మతాలను అధ్యయనం చేసి అన్నింటిలో కొంత సత్యముందని తెల్సికున్నాడు. హోలి, దీపావళి, రాఖి మున్నగు హిందూ పండుగలలో పాల్గొనేవాడు. నుదుట తిలకాన్ని ధరించేవాడు. అన్ని మతాచారాలను ఎంతగా పాటించేవాడంటే, అన్ని మతాలకు చెందినవారు అక్బరు తమ మతాన్ని స్వీకరిస్తాడనే అభిప్రాయానికి వచ్చారు.

## 4.10.2 అమోఘుత్వ ప్రకటన (1579) :

వివిధ మతాచార్యులతో జరిపిన చర్చలు అక్బరులో ఎన్నో మార్పులు తీసుకువచ్చాయి. సర్వమానవ సమానత్వమే మానవ శ్రేయస్సుకు మూలమని గ్రహించాడు. మొదటచర్యగా ఉలేమాల ఆధిక్యతను తగ్గించాడు. అబుల్ ఫజుల్ సలహాపై అక్బరు ఈద్ పండుగనాడు ఫతేపూర్ సిక్రీలోని జుమ్మామసీదులో ఖుత్బాను చదివాడు. రాజ్యవ్యవహారాలలో ముస్లిం మతాచార్యులకు ఎటువంటి జోక్యం వుండకూడదని ప్రకటించాడు. అంతేకాక, 1579, సెప్టెంబరు 2న అమోఘుత్వ ప్రకటనను జారీచేశాడు. దీనిప్రకారం అక్బరు రాజ్యాధికారికాక మతాధికారిగా కూడా గుర్తింపబడ్డాడు. మల్లేశన్ ఈ ప్రకటనను మాగ్నాకార్టాకా వర్ణించాడు. స్మిత్ "ఇన్‌ఫాలియబుల్ డిక్రీ"గా వర్ణించాడు.

## 4.10.3 దీన్-ఇ-ల్లాహీ :

సర్వమతాలసారంతో అక్బరు నూతన మతాన్ని ప్రకటించాడు. ఒక్కొక్క మతంలోంచి ఒక్కొక్క సూత్రాన్నిజేర్చి, తన స్వంత అభిప్రాయాలను జోడించి ఒక నూతన మతాన్ని 'దీన్-ఇల్లాహీ' అనే పేరుతో ప్రకటించాడు. దాని ప్రధానలక్ష్యం 'సులే-ఇ-కుల్' అంటే విశ్వమానవ శాంతి.

### మత సిద్ధాంతాలు :

1) భగవంతుడు ఒక్కడే.
2) సూర్యుడిని, అగ్నిని ఆరాధించాలి.
3) మాంసాహారాన్ని విసర్జించాలి.
4) నీతిగా ఉండాలి.
5) చక్రవర్తి కోసం త్యాగం చేయాలి.

ఈ మతాన్ని అనుసరించేవారు కొన్ని నియమాలను పాటించాలి. ఒకరినొకరు 'అల్లాహో అక్బరు' అని సంభోదించుకోవాలి. రాజు తర్వాత పురోహితుడు అబుల్‌ఫజుల్. అక్బరు తన మతాన్ని స్వీకరించమని ఎవరినీ బలవంతం చేయలేదు. ఈ మతంలో కొద్దిమంది మాత్రమే చేరారు. ఇది అక్బరుతోనే అంతమొందింది. దీన్-ఇ-ల్లాహి గురించి చరిత్రకారులు భిన్న అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ముస్లిం చరిత్రకారులు, అక్బరును ఇస్లాం వ్యతిరేకిగా చిత్రించారు. దీన్-ఇల్లాహి అక్బరు అవివేకాన్ని తెలుపుతుందని, అక్బరు ఇస్లాం మతాన్ని విసర్జించాడని వి.ఎ. స్మిత్ అభిప్రాయపడ్డాడు.

ఏది ఏమైనప్పటికి తన క్రొత్త మతం వలన అక్బరు మతస్వేచ్ఛను పెంపొందించగల్గాడు.

## 4.11 అక్బరు పరిపాలన :

అక్బరు సామ్రాజ్య నిర్మాతేకాక, గొప్ప పరిపాలనాదక్షుడు కూడా. అసలు మొగల్ పాలనకు పునాదివేసినదే అక్బరు. అక్బరు ప్రవేశపెట్టిన పరిపాలనా సంస్కరణలు అతని వారసులంతా అనుసరించారు.

### 4.11.1 కేంద్ర ప్రభుత్వము :

సామ్రాజ్యానికి చక్రవర్తి సర్వాధికారి అని భావించి సార్వభౌమాధికారాన్ని స్థిరంగా పాదుకునేటట్లు చేశాడు. రాజు మతాధికారి, న్యాయాధికారి, రాజుకు పాలనలో సలహా ఇవ్వటానికే వకీలు, వజీరు, మీర్‌బక్షి, సదర్ అనే నలుగురు మంత్రులుండేవారు. తర్వాత వారి సంఖ్యను క్రమంగా పెంచాడు. పరిపాలన విషయాలను ఒక్కొక్క దానిని ఒక్కొక్కరికి కేటాయించాడు. అక్బరునాటి పరిపాలనా శాఖలు 1) న్యాయశాఖ, 2) సైన్యం, 3) మతం, 4) దానధర్మాలు, 5) ఖల్సా భూమి, 6) ధరవరలు, 7) రహదారులు, 8) ఆస్తులు - వారసత్వ హక్కులు, 9) భవన నిర్మాణం, 10) సివిల్ న్యాయశాఖ, 11) ఖనిజాలు. ఈ శాఖలను ఒక్కొక్కరి అధీనంలో వుంచాడు. వీరికి సహాయపడేందుకు అనేకమంది అధికారులను నియమించాడు.

### 4.11.2 రాష్ట్ర ప్రభుత్వం :

అక్బరు కొత్తగా జయించిన భూభాగాన్ని కలిపి 12 సుబాలుగా రాజ్యాన్ని విభజించాడు. వీటిపై అధిపతులుగా దివాన్, ఖాజీ, భక్షి మొదలైన వారిని నియమించాడు. సుబాలను సర్కారులుగా, సర్కారులను పరగణాలుగా విభజించాడు. సర్కారు, పరగణాలు షేర్షా సృష్టించినవి. కాని సుబా మాత్రం అక్బరు రూపొందించాడు. వీటి పాలనకు, అధికార్లను చక్రవర్తి నియమించేవాడు. పట్టణాలకు కొత్వాలు ఉండేవారు.

### 4.11.3 భూమిశిస్తు విధానం :

అక్బరు అధికారంలోకి వచ్చేటప్పటికే షేర్షా భూమిశిస్తు విధానం రద్దయింది. హుమాయూన్ జాగీర్దారీ పద్ధతిని అనుసరించాడు. బైరంఖాన్ అప్పుడున్న ధరనుబట్టి శిస్తు నిర్ణయించే పద్ధతిని ప్రవేశపెట్టాడు. కాని దీనిలో అనేక లోపాలున్నాయి. అక్బరు ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్తలను రెవిన్యూ మంత్రులుగా నియమించాడు. వీరు 'నస్క్' అనే కొత్త పద్ధతిని రూపొందించారు. దీని ప్రకారం శిస్తును ముందే నిర్ణయించి అంత మొత్తాన్ని జమీందార్ల నుండి వసూలు చేసేవారు. కాని దీనివలన రైతులకు అనేక ఇబ్బందులెదురైనాయి. అక్బరు ఆర్థికశాస్త్ర వేత్తలతో ఒక కమిటీని నియమించి, దాని సలహాపై రాజ్యాన్ని 182 'కరోరీ'లుగా విభజించాడు. భూమినంతా సర్వే చేయించాడు. ఈ భూమిని 'పట్టా'ల ద్వారా రైతులకు పంచాడు. 1580లో తోడరుమల్ వజీరు అయినాడు. ఇతను 'దస్-సాలా' అనే విధానాన్ని ప్రవేశపెట్టాడు. దీనిప్రకారం భూమిని నాలుగు భాగాలుగా విభజించాడు. ఒక్కొక్క భాగాన్ని మంచి, మధ్యమ, చెడు అని మూడు భాగాలుగా చేశాడు. వీటిపై ప్రతి సంవత్సరం సరాసరి పంటలో 1/3వ వంతు శిస్తుగా నిర్ణయించాడు. దీనినే 'జప్తి' అని కూడా అంటారు. శిస్తు వసూలుకు 'కనుంగో'లను నియమించాడు. రైతుల బాగోగులు చూడ్డం, భూమి సర్వే చేయించటం కూడా వీరి విధులు. ఈ రెవిన్యూ సంస్కరణలలో అక్బరు షేర్షా విధానాన్ని అనుసరించాడు. అక్బరు భూమిశిస్తును నగదు రూపంలోనే చెల్లించాలన్నాడు.

### 4.11.4 న్యాయశాఖ :

న్యాయ పరిరక్షణకు అక్బరుస్వయంగా కొంతకాలం వెచ్చించేవాడు. కఠినమైన శిక్షలను నిషేదించాడు. న్యాయపాలనకు 'ఖాజీ'లను నియమించాడు.

### 4.11.5 సైనిక సంస్కరణలు :

మున్సబ్‌దారీ విధానం ముఖ్యమైనది. ఇది కేవలం అక్బరు సృష్టి. తన సార్వభౌమాధికారాన్ని సుస్తిరం చేసికొనటంలో, సైన్యం ఆవశ్యకతను గుర్తించి, దాని సంస్కరణల విషయంలో స్వయంగా శ్రద్ధ తీసుకొన్నాడు. అక్బరు సైన్యాన్నంతా 5 భాగాలు చేశాడు. 1) ఫిరంగిదళం, 2) అశ్వదళం, 3) గజదళం, 4) కాల్బలం, 5) నౌకాదళం. అశ్వదళానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి అశ్వపోషణకు మున్సబ్‌దారీ విధానాన్ని ప్రవేశపెట్టాడు. మున్సబ్‌దారులు సైనికోద్యోగులు. వీరికి అశ్వాలను కేటాయించి వాటి పోషణ నిమిత్తం జీతాలను నిర్ణయించాడు. మున్సబ్‌దార్ల క్రిందవుండే సైనికుల సంఖ్య 10 మొదలు, లక్ష వరకు వుంటుంది. అక్బరు మున్సబ్‌దార్లను 66 రకాలుగా విభజించాడు.

**జాత్ - సవారీ పద్ధతి :** మున్సబ్‌దారీ విధానంలో జాత్ - సవారీ పద్ధతిని అనుసరించాడు. జాత్ హోదాను తెలియజేయగా సవార్ అదనపు అలవెన్సును తెలుపుతుంది.

**అశ్వక ముద్రణ :** మున్సబ్‌దారులు ప్రభుత్వాన్ని మోసగించకుండా వుండటానికి ఒకవైపు రాజముద్రను, మరొకవైపు మున్సబ్‌దారు ముద్రను వేసేవారు. అశ్వకుల వివరాలతో పట్టికను తయారుచేయించాడు. ప్రతిఏటా సైనిక కవాతులను ప్రవేశపెట్టాడు.

అక్బరు నదులను దాటటానికి నౌకలను నిర్మించాడు. ఓడరేవులను నిర్మించాడు.

### 4.11.6 భవన నిర్మాణము :

అక్బరు ఎన్నో కోటలను, భవనాలను నిర్మించాడు. ఆగ్రా, లాహోరు, అలహాబాదులలో కోటలను కట్టించాడు. అక్బరు నిర్మాణాలలో ముఖ్యమైనది ఫతేపూర్ సిక్రీ. అక్బరు హిందు, ముస్లిం, పర్షియన్ పద్ధతులను మేళవించి నూతన నిర్మాణాలు కావించినాడు.

ఫతేపూర్ సిక్రీ 1570-80 మధ్య నిర్మించాడు. దాని చుట్టుకొలత 11.2 కి.మీ. దానిలో మొత్తం 9 దర్వాజాలు ఏర్పాటుచేశాడు. ఆగ్రా, గ్వాలియర్, ధోల్‌పూర్ దర్వాజాలు ముఖ్యమైనవి. ఆగ్రా దర్వాజా నుండి ప్రవేశిస్తే మొదట నౌబత్ ఖాన్ అనే సంగీత భవనము, తర్వాత టంకశాల, ఖజానా భవనాలు వస్తాయి. వీటి తర్వాత దివాన్-ఇ-ఆమ్ అనే దర్బారు గది. తర్వాత అక్బరు నివాసభవనము వున్నాయి. ఇంకా దివాన్-ఇ-ఖాస్, మోతీ మసీదు, షేక్ సలీం చిష్టి సమాధి, జోధ్‌బాయి భవనము ముఖ్యమైనవి. ఇంకా రాజా బీర్బలు నివాసము, స్థంభ సింహాసనము కూడా వున్నాయి. ఫతేపూరు సిక్రీ, అక్బరు కాల్పనిక శక్తికి ప్రత్యక్ష నిదర్శనమని పురావస్తు శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.

అక్బరు కాలంలోని ఇంకొక నిర్మాణము, జహంగీరు మహల్. దీనిలో ముస్లిం, హిందు పద్ధతులు అనుసరించటం జరిగింది.

### 4.11.7 సాహిత్యం :

అక్బరుకు సాహిత్యమంటే చాలా ప్రీతి. అక్బరు గొప్ప గ్రంథాలయాన్ని పోషించాడు. దీనిలో 24,000 పుస్తకాలున్నాయి. అక్బరు ఆస్థాన కవులలో ముఖ్యులు 'ఫైజీ, అబుల్ ఫజుల్, బదాయుని'' ముఖ్యులు. అబుల్ ఫజుల్ ఆస్థానకవి. అక్బరు పారశీకంతోపాటు హిందీని కూడా ఆదరించాడు. సుప్రసిద్ధ హిందీ రామాయణకర్త తులసీదాసు అక్బరుకు సమకాలీనుడు.

సంగీతం, చిత్రలేఖనమన్నా అక్బరుకు ప్రీతి. రామదాసు, సూరదాస్ ఇతని ఆస్థాన గాయకులు.

## 4.12 ముగింపు :

అక్బరు భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు. సంస్కరణల ద్వారా ఏకత్వాన్ని, జాతీయతను నెలకొల్పినాడు. అక్బరు దైవచింతన గలవాడు. బలహీనులపట్ల ఔదార్యం, శత్రువుల పట్ల దయ చూపెట్టేవాడు. అక్షరాజ్ఞానం లేకపోయినా అద్భుతమైన జ్ఞాపకశక్తి వుంది. అసమాన్యమైన రాజనీతిజ్ఞతను చూపెట్టాడు. గొప్ప పరిపాలకుడు, సేనాని. ముఖ్యంగా చక్రవర్తి కుండవలసిన అన్ని లక్షణాలు ఇతనిలో మూర్తీభవించినాయి.

అక్బరు 1605 అక్టోబరు 17వ తేదీన మరణించాడు.

## మాదిరి ప్రశ్నలు :

### 1. ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. అక్బరు దండయాత్రలను పేర్కొనుము ?
2. అక్బరు పరిపాలనా విధానమును వర్ణింపుము ?

### 2. సమస్యాపూరిత ప్రశ్నలు

1. అక్బరు మతవిధానమును వివరింపుము.
2. అక్బరు దక్షిణదేశ దండయాత్రలను వర్ణింపుము.
3. అక్బరు రాజపుత్ర విధానమను వర్ణింపుము.
4. అక్బరు గొప్ప సామ్రాజ్య నిర్మాత - వివరింపుము.

## ఉపయుక్త గ్రంధాలు :

1. శ్రీవత్సవ - మొగలు ఎంపైర్
2. మల్లేశన్ - అక్బరు
3. స్మిత్ - అక్బరు, దిగ్రేట్ మొగలు
4. బి.ఎస్.ఎల్. హనుమంతరావు, కె. బసవేశ్వరరావు, - ఇండియన్ హిస్టరీ అండ్ కల్చరు
5. తెలుగు అకాడమి - భారతదేశ చరిత్ర సంస్కృతి.

**ప్రమీల గోగినేని**

**గుడివాడ.**

పాఠము - 5

# జహంగీర్ (1605 - 1627)

**విషయసూచిక**


5.0 లక్ష్యం

5.1 ఉపోద్ఘాతము

5.2 జహంగీరు బాల్యము

5.3 తండ్రిపై తిరుగుబాటు

5.4 పట్టాభిషేకము - పరిపాలన

5.5 ఖుస్రూ తిరుగుబాటు

5.6 నూర్జహానుతో వివాహము

5.7 దండయాత్రలు

5.8 షాజహాను తిరుగుబాటు

5.9 మహబత్‌ఖాన్ తిరుగుబాటు

5.10 బొబ్బల ప్లేగు

5.11 ఆంగ్లేయుల రాక

5.12 జహంగీరు మరణం

5.13 ముగింపు


## 5.0 లక్ష్యం :

మొగలు సామ్రాజ్య స్థాపన, విస్తరణలో జహంగీరు గురించి ప్రత్యేకముగా వివరించడమే ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యము. ఇందులో జహంగీరు జీవితములో నూర్జహాను ప్రభావం గురించి కూడా ప్రస్తావించబడినది.

## 5.1 ఉపోద్ఘాతము :

అక్బరు మరణానంతరము మొగలు సామ్రాజ్య విస్తరణను జహంగీరు కొనసాగించెను. కాని జహంగీరు కాలంలో అనేక పరిణామాలు ఏర్పడెను. కాందహారును మొగలులు శాశ్వతముగా కోల్పోయిరి. శిక్కులతో వైరము మొదలయ్యెను. వారసత్వ యుద్ధములు ప్రారంభమయ్యెను.

## 5.2 జహంగీరు బాల్యము :

అక్బరు మరణానంతరము సలీమ్ "జహంగీర్" అనే బిరుదుతో సింహాసనమదిష్టించెను. చాలాకాలంగా సంతానంలేని అక్బరుకు అజ్మీరులోని షేక్ సలీమ్ చిష్టి అనుగ్రహం వలన ఆగస్టు 30, 1569న సలీమ్ జన్మించినాడు. అక్బరు కుమారుణ్ణి గారాబంగా "షేకుబాబా" అని పిలిచేవాడు. సలీమ్ విద్యాభ్యాసం గురించి అక్బరు ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. సలీమ్ తుర్కీ, అరబ్బీ, పారశీకము, గణితము, చరిత్ర, భూగోళం, జంతు, వృక్ష శాస్త్రాలను సమగ్రంగా నేర్చుకున్నాడు. సంగీతం, చిత్రలేఖనంలో నైపుణ్యాన్ని సాధించాడు. వీటితోపాటు స్వారీ, కత్తిసాము, ఫిరంగులు పేల్చటం మొదలైన రాచవిద్యలలో కూడా ఆరితేరాడు.

పరిపాలనలో కూడా అక్బరు శిక్షణ ఇప్పించాడు. 1577లో అక్బరు 10,000 గుర్రాలకు మున్సబ్‌దార్‌గా సలీమ్‌ని నియమించాడు. యుద్ధాలలో అనుభవం కోసం అనేక దండయాత్రలకు పంపాడు. జహంగీరు కాబూలు దండయాత్ర స్వయంగా నిర్వహించాడు. అజ్మీరుకు, అల్హాబాదుకు గవర్నరుగా పనిచేశాడు.

## 5.3 తండ్రిపై తిరుగుబాటు :

తన కుమారుని శిక్షణలో అక్బరు ఎన్నిజాగ్రత్తలు తీసికొన్నా సలీమ్ అనేక దురలవాట్లకు లోనయినాడు. చిన్నప్పటినుండే మద్యపానం, విలాస జీవితానికి అలవాటుపడినాడు. తండ్రిపై మొత్తం మూడుసార్లు తిరుగుబాటు చేశాడు. 1599లో సలీమ్ తండ్రి ఆజ్ఞను ఉల్లంఘించి మేవాడ్ దండయాత్రకు వెళ్ళకుండా అజ్మీరులోనే ఆగిపోయాడు. ఖజానా సొమ్ము కొల్లగొట్టి సైన్యాన్ని సమీకరించుకొని తండ్రిమీద దండెత్తాడు. కాని తండ్రిని చూడగానే క్షమాభిక్ష వేడుకున్నాడు. అక్బరు కుమారుణ్ణి క్షమించి బెంగాలు గవర్నరుగా నియమించాడు. బెంగాలు చేరుకొని పూర్వంలాగే తండ్రికి వ్యతిరేకంగా పోర్చుగీసువారితో మంతనాలు సాగించాడు. తన పేరుతో దర్బారును నిర్వహించాడు. తండ్రీ కొడుకుల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. సయోధ్యకోసం అబుల్‌ఫజుల్‌రాగా, తండ్రికి తనపై ద్వేషము కల్గించడంలో అతనే కారకుడని అనుమానించి అబుల్‌ఫజుల్‌ని చంపించాడు. ఈ చర్య అక్బరుకు ఎంతో క్రోధ కారణమయ్యింది. ఈసారి అంతఃపుర స్త్రీలు సలీంను కాపాడటానికి పూనుకున్నారు. అక్బరు నాయనమ్మ మర్యం ఇద్దరికీ సంధి కుదిర్చింది. సలీం తండ్రికి 770 ఏనుగులు, 1000 బంగారు నాణాలు బహుకరించాడు. అక్బరు క్షమించి యువరాజుగా ప్రకటించాడు. చివరిసారిగా సలీం 1603లో తండ్రిని వ్యతిరేకించాడు. కుమారుణ్ణి శిక్షించటానికి అక్బరు బయలుదేరాడు కాని గంగానది వరదల వలన అవతలి తీరం వద్ద నిలిచిపోయాడు. ఈ లోపల తల్లి అనారోగ్య వార్త విని వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. 1604లో ధన్యాల్ రాకుమారుడు మరణించాడు. అక్బరు, తన మనవడు సలీం పెద్దకొడుకు ఖుస్రూకు పట్టాభిషేకం చేయాలనుకున్నాడు. కానీ, మరణించేముందు సలీంనే చివరకు వారసుడిగా పేర్కొన్నాడు.

## 5.4 పట్టాభిషేకము - పరిపాలన :

అక్బరు చనిపోయిన ఎనిమిదిరోజుల తర్వాత 1605 నవంబరు 3వ తేదీన సలీం "నూరిద్దీన్ మహమ్మద్ జహంగీర్ పాదుషా ఘాజీ" అనే బిరుదుతో పట్టాభిషిక్తుడయ్యాడు. నూరుద్దీన్ అంటే ఇస్లాం మతానికి వెలుగు, ఘాజీ అంటే ఇస్లాం వ్యతిరేకులను అణిచేవాడు అని అర్థం. జహంగీరు అంటే ప్రపంచాన్ని మోసేవాడు అని అర్థం. స్వీయచరిత్రలో తన బిరుదుల గురించి స్వయంగా చెప్పుకున్నాడు. జహంగీరు పట్టాభిషేక సమయంలో ఎన్నో సంస్కరణలు ప్రకటించాడు.

1) జఖత్, మీర్‌బహ్రీన్ వంటి పన్నులను రద్దుచేశాడు.
2) మత్తు పదార్థాలను తయారుచేయడం, అమ్మటం నిషేదించాడు.
3) రహదార్ల పొడవునా మసీదులను, సత్రాలను నిర్మించాడు.
4) చనిపోయిన జాగీర్దార్ల ఆస్థి హక్కులను గుర్తించాలని ఆజ్ఞాపించాడు.
5) రాజాజ్ఞాలేనిదే జాగీర్‌దార్లు పరస్పరం వివాహసంబంధాలేర్పరచుకోరాదు.
6) కొన్ని ప్రత్యేక రోజులలో జంతువధను నిషేదించాడు.
7) చిత్రహింసలు, అంగ విచ్ఛేదంలాంటి శిక్షలు నిషేదించాడు.
8) జైళ్ళలోని ఖైదీల శిక్షలు తగ్గించాడు.
9) తండ్రి కాలంనాటి ఉన్నతోద్యోగులను తిరిగి పదవులలో నియమించాడు.
10) వ్యవసాయదార్ల నుండి పట్టాలను, సామాగ్రిని స్వాధీనపరచుకోరాదని ప్రకటించాడు.
11) ప్రతి పట్టణంలో పేదలకు వైద్యశాలలు ఏర్పాటుచేశాడు.

12) వర్తకుల అనుమతిలేకుండా వారి పెట్టెలు బ్రద్దలు కొట్టడం నిషేదించాడు.

న్యాయ నిర్వహణ చురుగ్గా అమలుజరగటానికి ఆగ్రాలో ఒక పెద్ద బంగారుగంట కట్టించాడు.

## 5.5 ఖుస్రూ తిరుగుబాటు :

జహంగీరుకు తన తండ్రిపై ఎంత కోపం వుందో సింహాసనాన్ని ఆశించిన ఖుస్రూపై కూడా అంతేకోపం వుంది. రాజామాన్‌సింగ్ వంటివారి మద్దతువున్నందున తనకు ఎప్పటికైనా ప్రమాదకారి అని ఖుస్రూ మీద అనేక ఆంక్షలు విధించాడు.

ఖుస్రూ 1606, ఏప్రిల్ 6న తన తండ్రి సమాధిదర్శించే నెపంమీద 350 మంది అనుచరులతో ఆగ్రానుండి బయలుదేరాడు. బీహారు చేరుకొని ఖజానా కొల్లగొట్టి 12 వేల సైన్యాన్ని సమకూర్చుకొని పంజాబు చేరుకున్నాడు. శిక్కుల గురువైన అర్జునసింగ్ ఆశీర్వాదంతో లాహోరును ముట్టడించాడు. అయితే భైరోవల్ యుద్ధంలో ఖుస్రూని వోడించి బంధించాడు. ఖుస్రూను ఆశీర్వదించిన శిక్కుగురువు అర్జునసింగ్‌ను మరణదండనకు గురిచేసాడు. 1607లో జహంగీరు హత్యకు ఖుస్రూ, అనుయాయులు ప్రయత్నించగా, అది తెల్సికొని జహంగీరు కుట్రదారులను తీవ్రంగా శిక్షించడమేకాకుండా ఖుస్రూని శాశ్వతంగా అంధుణ్ణి చేశాడు. 1622లో ఖుర్రం రాకుమారుడు విషప్రయోగంచేసి ఖుస్రూని చంపించాడు.

## 5.6 నూర్జహాన్‌తో వివాహం (1611) :

జహంగీర్ చరిత్రలో నూర్జహాన్ పాత్ర చాలా ముఖ్యమైంది. ఈమె అసలు పేరు మెహరున్నీసా. తండ్రి ఘియాజ్‌బేగ్ తల్లి అస్మత్ బేగం. ఈమె తండ్రి జీవనోపాధికోసం భారతదేశం వస్తున్నప్పుడు, దారిలో కాందహారులో జన్మించింది. ఘియాజ్ అక్బరు ఆస్థానంలో ఉన్నత పదవిని పొందాడు. మెహరున్నీసాకు యుక్తవయస్సు రాగానే తండ్రి షేర్ ఆఫ్‌గన్‌కిచ్చి వివాహం చేశాడు. అక్బరు కాలం లో షేర్ ఆఫ్‌గన్ ఒక ఉద్యోగి. జహంగీర్ ఇతనిని బెంగాలులోని బర్ద్వాను జిల్లాకు ఫౌజుదారుగా నియమించాడు. దురదృష్టవశాత్తు షేర్ ఆఫ్‌గన్ 1607లో మరణించాడు. జహంగీరు మెహరున్నీసాకు, ఆమె కుమార్తె లాడ్లీబేగంకు అంతఃపురంలో ఆశ్రయం కల్పించాడు.

1611లో నౌరోజు పండుగ సందర్భముగా చక్రవర్తి మెహరున్నీసాను చూసి వివాహం చేసికున్నాడు. అప్పటినుండి ఆమె నూర్జహాన్ అని పిలువబడింది. చక్రవర్తి ఆమెను కొద్దిరోజులలోనే ప్రధాన రాజ్ఞిగా చేసికొన్నాడు.

నూర్జహాను-జహంగీరుల వివాహ విషయములో చరిత్రకారులు భిన్నాభిప్రాయములు వ్యక్తం చేశారు. స్మిత్, లేన్‌పూర్ మొదలగువారు నూర్జహాను జహంగీరుకు చిన్నప్పటినుండే తెలుసునని, వివాహానికి తండ్రి అడ్డుపడ్డాడని వ్రాశారు. తండ్రి మరణం తర్వాత షేర్ అఫ్‌గన్‌ని చంపించి నూర్జహాన్‌ని వివాహం చేసుకున్నాడని వ్రాశారు. కానీ బేణీప్రసాద్ "జహంగీర్ చరిత్ర'' అనే గ్రంథంలో వివాహానికి పూర్వము ఇరువురికీ ఎటువంటి సంబంధములేదని షేర్ అఫ్‌గన్ మరణంతో జహంగీర్‌కు ఎటువంటి ప్రమేయం లేదని వ్రాశాడు. ఈశ్వరీప్రసాద్ కూడా నూర్జహాన్ జహంగీర్‌కు ముందే తెలుసని షేర్ ఆఫ్‌గన్ మరణంతోకూడా అతనికి పాత్రవుందని వ్రాశాడు. బేణీప్రసాద్ వ్రాసింది సమర్థనీయంకాదు. నూర్జహాన్‌లో జహంగీరుకు పూర్వపరిచయం వున్న విషయం నిర్వివాదాంశము.

## నూర్జహాన్ పాలన :

ఈమె అపురూప సౌందర్యవతి. వివాహ కాలానికి 36 సంవత్సరములు. ఈమెలో అసాధారణ మేధాశక్తి వుంది. మరెన్నో ప్రత్యేక గుణాలున్నాయి. దయార్ద్ర హృదయురాలు. అనాధలంటే జాలి. లలితకళలలో అభిరుచి వుంది. కాని అత్యాశ, అధికారకాంక్ష అధికం. పరిపాలనలో జోక్యం చేసుకొని అనేక కుట్రలు, కుతంత్రాలు నడిపింది.

జహంగీర్‌తో వివాహమైన కొద్దికాలానికే పరిపాలనలో జోక్యము చేసికొంది. గవర్నర్లను, సైన్యాధిపతుల నియామకాలు, ఉన్నతోద్యోగుల బదిలీట మొదలగు విషయాలలో తలదూర్చింది. క్రమంగా అంతఃపురంలో కూడా ప్రముఖ స్థానాన్ని సంపాదించి ప్రాబల్యం పెంచుకుంది. ఈ లోపల జహంగీరు ఆరోగ్యం క్షీణించటం, వ్యసనాలకు బానిసకావడం ఈమెకు మిక్కిలి తోడ్పడింది. రాజాజ్ఞలపై చక్రవర్తితోపాటు నూర్జహాను సంతకాలు కూడా ఉండేవి. చక్రవర్తి బదులు తానే దర్బారు నడిపింది.

### నూర్జహాన్ ముఠా :

అతికీలకమైన పదవులలో తన అనుచరులను నియమించింది. తన తండ్రి ఘియాజ్‌బేగ్‌ను వజీర్‌గా నియమించింది. సోదరుడు అసఫ్‌ఖాన్ గొప్ప ఆర్థికశాస్త్రవేత్త. తోడర్‌మల్‌తో సరితూగగల సామర్థ్యం గలవాడు. ఇతనిని ఆర్థికశాస్త్రవేత్తగా నియమించింది. అసఫ్‌ఖాన్ కూతురు ముంతాజ్‌ను ఖుర్రం రాజకుమారిడికిచ్చి వివాహం చేసింది. దీనితో అసఫ్ రాజకుటుంబంలో ప్రముఖస్థానం పొందాడు. నూర్జహాను తల్లి అస్మత్‌బేగం. గొప్పరాజకీయ చతురత గలది. కుమార్తెవలే అత్యాశగలది. కాని నూర్జహాన్ అధికార వ్యామోహాన్ని కొంతవరకు అరికట్టగలిగింది. ఇక జహంగీరు కుమారుడైన ఖుర్రం యుద్ధతంత్రంలో ఆరితేరినాడు. దక్కను యుద్ధాలలో తన ప్రజ్ఞను ప్రదర్శించాడు. ఖుర్రం సహాయంతో సామంతులను, జాగీరుదార్లను అదుపుచెయ్యాలని నూర్జహాను ప్రయత్నించింది.

మొదట్లో ముఠా సభ్యులంతా ఏకాభిప్రాయంతో వుండేవారు. కాని కొద్దికాలంలోనే అభిప్రాయభేదాలు వచ్చాయి. నూర్జహాన్ వారి సలహాలు తీసికున్నట్లే తీసికొని తన ఇష్టమొచ్చినట్లు చేసేది. ఖుర్రం వివాహం జరిగాక విభేదాలు తీవ్రమయ్యాయి. ఘియాజ్ బేగ్, అస్మత్‌బేగ్ మరణించాక నూర్జహాను ఒంటరిదయ్యింది. నూర్జహాను ఖుర్రం అధికారాన్ని తగ్గించటానికి తన కూతురు లాడ్లీబేగంను జహంగీరు ఇంకొక కొడుకైన షహ్రియార్‌కిచ్చి వివాహంచేసింది. దీనివలన నూర్జహాను ముఠా రెండుగా చీలింది. నూర్జహాను షహ్రియార్ ఒకవర్గంగాను, అసఫ్‌ఖాన్ ఖుర్రం మరొక వర్గంగాను ఏర్పడ్డారు. నూర్జహాను తనకు సింహాసనం రాకుండా చేస్తుందని భావించి **1622**లో ఖుర్రం తిరుగుబాటు చేశాడు. నూర్జహాను ఖుర్రం నెదుర్కొనుటకు మహబ్బత్‌ఖాన్‌ను ఉన్నతసేనానిగా నియమించింది. కాని మహబ్బత్‌ఖాన్ ఈమె కంటే దురాశపరుడు.

ఈ విధంగా నూర్జహాన్ చక్రవర్తిని కీలుబొమ్మనుచేసి అధికారాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకుంది.

## 5.7 రాజ్యవిస్తరణ - యుద్ధాలు :

జహంగీరు రాజ్యవిస్తరణ, యుద్ధాలలో తండ్రి విధానాలను అనుసరించాడు. వంశ ప్రతిష్ఠ, శాంతిభద్రతల కోసం అనేక యుద్ధాలు చేశాడు.

### 5.7.1 బెంగాల్ :

జహంగీర్ మొదటి యుద్ధము బెంగాల్‌పై చేశాడు. బెంగాలులో ఆఫ్ఘన్‌లు ఎక్కువ. అవకాశం లభించినప్పుడల్లా తిరుగుబాటుచేసి స్వతంత్ర్యం ప్రకటించుకునేవారు. ఖుస్రూ తిరుగుబాటు నాధారం చేసికొని బెంగాలులోని ఆఫ్ఘన్‌లు తిరుగుబాటు చేశారు. ముసాఖాన్ దీనికి నాయకుడు. ఇతనికి **12** మంది అనుచరులున్నారు. వీరితోపాటు చిన్నచిన్న ముస్లిమ్ హిందూరాజులు కూడా తిరుగుబాటులో పాల్గొన్నారు. పోర్చుగీసువారు కూడా తిరుగుబాటుదార్లకు సహాయంచేశారు.

జహంగీరుకు ఈ తిరుగుబాటును అణచటానికి **6** సంవత్సరములు పట్టింది. రాజామాన్‌సింగ్, కుతుబుద్దీన్, అజీజ్‌కోకా, ఆలీఖీలో వంటి ప్రముఖ సేనానులను నియోగించాడు. కాని వుపయోగం లేకపోయింది. చివరకు షేక్‌సలీమ్ చిష్టీ కుమారుడైన షేక్ అల్లాయుద్దీన్‌కు అప్పగించాడు. ఇతను యువకుడు. ఇదివరకు వారిలాగా కాకుండా నూతన పద్ధతులను ప్రవేశపెట్టాడు. సైన్యాన్ని ఒకేచోట కాకుండా అనేకచోట్ల నిలిపాడు. శత్రువుపై యుద్ధం ప్రకటించి హఠాత్తుగా వారిపై ముట్టడించేవాడు. తిరుగుబాటుదార్లమీద ఒకేసారి కాకుండా ఒక్కొక్కరినీ లొంగతీసుకొని వారి రాజ్యాలను ఆక్రమించాడు. తిరుగుబాటు నాయకుడు ఉస్మాన్‌ఖాన్ మరణంతో తిరుగుబాటుదార్లు బలహీనులయ్యారు. జహంగీరు ఈ విధంగా తిరుగుబాటును అణచటమే కాకుండా బెంగాలుపై మొగలు సార్వభౌమాధికారాన్ని నిలబెట్టినాడు.

### 5.7.2 రాజపుత్రులు - మేవాడ్ :

రాజపుత్రులతో జహంగీర్‌కు రెండురకాలుగా రక్తసంబంధం వుంది. తల్లి రాజపుత్ర స్త్రీ. భార్య కూడా రాజపుత్ర వనితే.

అందుకే వీరంటే చక్రవర్తికి ప్రేమాభిమానాలు ఎక్కువే. అక్బరు కాలంలో మేవాడ్ ఆక్రమణ విఫలమయ్యింది. తన తండ్రి సాధించలేనిదాన్ని తానైనా సాధించాలనే పట్టుదలతో మేవాడ్ ఆక్రమణకు పూనుకున్నాడు. సైన్యాన్ని ఉత్సాహపరచడానికి రాజపుత్రులపై జీహద్ ప్రకటించాడు. 1605 - 1615 ల మధ్య మొత్తం మూడుసార్లు దండెత్తాడు.

1605లో జరిగిన మొదటి దండయాత్రకు పార్వీజు రాకుమారుణ్ణి నియమించాడు. 20,000 అశ్వకులతో పార్వీజ్ దేవార్ కనుమవద్ద మేవాడ్‌రాజు అమర్‌సింగ్‌ను ఎదుర్కొన్నాడు. ఇంతలోనే ఖుస్రూ తిరుగుబాటు వార్తవిని మొగలు సైన్యము వెనక్కు తిరిగింది.

1608లో రెండవ దండయాత్ర మహబత్‌ఖాన్ నాయకత్వంలో జరిగింది. 12000 గుర్రాలు, 2000 తుపాకులు, 60 ఏనుగులు, 80 ఫిరంగులతో మహబత్‌ఖాన్ యుద్ధం ప్రారంభించాడు కాని రాజపుత్రుల ధాటికి నిలువలేక వెనుక్కుతిరిగాడు.

1613లో ఆఖరు దండయాత్ర ఖుర్రం ఆధిపత్యంలో జరిగింది. ఎలాగైనా మేవాడ్‌ను ఆక్రమించాలని ఖుర్రం యుద్ధనీతిని వదలి విచక్షణారహితంగా పోరాడాడు. దారిపొడుగునా గ్రామాలను, పట్టణాలను ధ్వంసంచేస్తూ దేవాలయాలను నేలమట్టం చేశాడు. రహదార్లను అన్నింటినీ ఆక్రమించి శత్రువుకు ఆహారపదార్థాల సరఫరా నిలిపివేశాడు. ప్రజాక్షేమం కోసం అమర్‌సింగ్ తలయొగ్గాడు.

### సంధి - షరతులు :

రాణా మొగలుల సార్వభౌమాధికారాన్ని అంగీకరించాడు. చక్రవర్తి రాణాకు మేవాడ్ ప్రాంతాన్ని తిరిగిఇచ్చి అతనిని పరిపాలకుడిగా గుర్తించాడు. క్రొత్త కోటలు కట్టకుండా వుండటానికి అంగీకరించాడు. అమర్‌సింగ్ మిగిలిన సామంతులలాగా దర్బారుకు హాజరు కానక్కరలేదు. శిశోదియా వంశం వారిని ఎటువంటి వివాహ సంబంధాలకు బలవంతంచేయమని చక్రవర్తి హామీ ఇచ్చాడు. ఈ సంధి వలన రాజపుత్రుల వంశ ప్రతిష్టకు భంగం కలుగలేదు. జహంగీరుకు కూడా రాజపుత్రులను ఓడించిన ఘనత లభించింది.

### 5.7.3 కాంగ్రా (1600) :

కాంగ్రా ఉత్తర పంజాబులోని పర్వతసానువుల మధ్య నిర్మించబడిన బలమైన కోట. చాలాకాలంగా హిందువుల ఆధ్వర్యంలో వుంది. ఇంతవరకు ముస్లిము రాజులు అడుగుపెట్టలేదు. జహంగీరు మొదట ముర్తాజా, సూరజ్‌మల్‌లను పంపాడు. ఉపయోగంలేకపోయింది. ఆ తర్వాత ఖుర్రం దండయాత్ర నిర్వహించాడు. మొగలు సైన్యాలు కోటను నలుమూలలా ముట్టడించి అన్ని మార్గాలను స్వాధీనపరచుకున్నాయి. ఆహారపదార్థాల సరఫరాకు ఆటంకం కల్గింది. 14 నెలలు ముట్టడి తర్వాత కోట మొగలు సైన్యాధిపతి సందరదాస్ స్వాధీనమైంది. కాంగ్రాను మొగలు రాజ్యములో కలిపివేయటం జరిగింది.

### 5.7.4 కాందహార్ :

జహంగీర్ రాజ్యానికి రాగానే ఖుస్రూ తిరుగుబాటు చేశాడు. ఈ అలజడిని ఆధారంచేసికొని ఫర్షియారాజు షా అబ్బాస్ కాందహారు ఆక్రమణకు ప్రయత్నించాడు. కాని ఇతని సేనలు మొగలు గవర్నరు షారూస్‌ఖాన్ చేతిలో పరాభవం పొందాయి. చేసేదేమీలేక షా అబ్బాస్ జహంగీరుకు క్షమాపణ పత్రాన్ని పంపాడు. కాని సమయం కోసం వేచివున్నాడు. నూర్జహాను ముఠా తగాదాలను ఆధారముగా చేసికొని స్వయముగా తానే బయలుదేరి కాందహారును ఆక్రమించాడు. కాందహారును తిరిగి ఆక్రమించాలని, జహంగీరు ఎంతో ప్రయత్నం చేశాడు. ఖుర్రంను కాందహారు ఆక్రమణకు నియోగించాడు. కాని ముఠాతగాదాల వలన, నూర్జహాను మీద కోపంతోను ఖుర్రం నిరాకరించాడు. దీనితో కాందహారు మొగలాయీల చేతినుండి శాశ్వితముగా జారిపోయింది.

### 5.7.5 అహమ్మద్‌నగర్ రాజ్యము :

అహమ్మద్‌నగర్‌లో చాంద్‌బీబీ మరణం తర్వాత మాలిక్ అంబర్ నాయకత్వంలో నిజామ్‌షాహీల పాలన మొదలైంది. 1610లో అహమ్మద్‌నగర్‌ని మాలిక్ అంబర్ ఆక్రమించాడు. అంబర్ గొప్ప యోధుడు. పాలనలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. భూమిశిస్తు విధానంలో తోడర్‌మల్‌ను అనుసరించాడు. స్థానికులైన, మహారాష్ట్రులను సైన్యంలో చేర్చుకొని గెరిల్లా పద్ధతిలో శిక్షణ ఇచ్చాడు.

1611 నుండి 21 వరకు 5 సార్లు మొగలు దాడులను మాలిక్ అంబర్ త్రిప్పికొట్టాడు. 1616లో నూర్జహాన్ కోరికమీద ఖుర్రం అహమ్మద్‌నగర్ మీద దండెత్తాడు. నూర్జహాను ఈ దండయాత్రకు కోటి రూపాయలు వినియోగించింది. మాలిక్ అంబర్ కూడా యుద్ధానికి సన్నద్ధం అయ్యాడు. ఖుర్రం తన సైన్యాన్ని 3 భాగాలుగా చేసి కొత్త రాజధాని ఖిడ్కిని మూడువైపుల నుండి ఎదుర్కొన్నాడు. ఖిడ్కిని సర్వనాశనం చేసి దౌలతాబాదును, అహమ్మద్ నగరాన్ని ముట్టడించాడు. మొగలాయీలను గెలవటం కష్టమని మాలిక్ అంబరు సంధికి అంగీకరించాడు.

## అహమ్మద్ నగర్ సంధి (1616) :

ఈ సంధి ప్రకారము మాలిక్ అంబరు తాను ఆక్రమించుకొన్న ప్రాంతాలను తిరిగి ఇచ్చేశాడు. 8 లక్షల రూపాయలు కప్పం కట్టటానికి 3 లక్షల రూపాయలు యుద్ధ నష్టపరిహారం చెల్లించటానికి అంగీకరించాడు. ఈ విజయం వలన ఖుర్రం ప్రతిష్ట పెరిగింది. జహంగీరు ఖుర్రంకు 'షాజహాన్' అనే బిరుదునిచ్చి దక్కనుకు గవర్నరుగా నియమించాడు.

1620 - 21లో మాలిక్ అంబర్ సంధిని అతిక్రమించి దక్కను సుల్తానులయిన బీజపూరు, గోల్కొండ నవాబుల సాయంతో తిరిగిదాడులు ప్రారంభించాడు. షాజహాను మరొకసారి 1622లో పెద్దసైన్యంతో దక్కన్ చేరుకొన్నాడు. కాని దక్కను రాజ్యాలు యుద్ధం లేకుండానే సంధికి అంగీకరించాయి. అహమ్మద్‌నగర్ 12 లక్షలు జీజపూర్ 15 లక్షలు, గోల్కొండ 20 లక్షలు కప్పం కట్టటానికి అంగీకరించాయి.

## దక్కను దండయాత్ర ఫలితాలు :

జహంగీరు కాలంలో దక్కను దండయాత్రల వలన లాభంకన్నా నష్టమే ఎక్కువ జరిగింది. 1626-27లలో దక్కను గవర్నరుగా వచ్చిన మొహబ్బత్‌ఖాన్ నిజామ్ షాహీ వారినుండి డబ్బుతీసికొని బాలాఘాట్ ప్రాంతాన్ని ఇచ్చేశాడు. 1622లో దక్కన్ సుల్తానులలో షాజహాను చేసికొన్న సంధికూడా ఎటువంటి ఫలితం ఇవ్వలేదు. కాని మొట్టమొదటిసారిగా దక్కను రాజుల నుండి కప్పం తీసికున్న ఘనత మాత్రం జహంగీరుకు దక్కింది.

## 5.7.6 రాజ్య విస్తరణ :

జహంగీరు కాలంలో వాయువ్య సరిహద్దులలోని కాందహారును కోల్పోవటం జరిగిందికాని ఈ లోటు దక్షిణ ఆక్రమణతో పూర్తి అయ్యింది. కొత్తగా స్వాధీనపరచుకొన్న ప్రాంతంలో దక్షిణ సుభాను ఏర్పాటుచేశాడు. కాశ్మీరు, కాంగ్రా రాజ్యాలు మొగలు సామ్రాజ్యంలో అంతర్భాగమయ్యాయి. బెంగాలు గవర్నరు ఇస్లామ్‌ఖాన్‌ని ఓడించి సముద్రవర్తకులకు దొంగలబెడద లేకుండా చేశాడు. త్రిపుర, నాగాలాండ్ వరకు మొగలు సామ్రాజ్యం తూర్పున విస్తరించింది.

## షాజహాన్, మొహబ్బత్‌ఖాన్‌ల తిరుగుబాటు :

నూర్జహాన్ అధికార వ్యామోహము, షాజహాను, మొహబ్బత్‌ఖాన్ తిరుగుబాటుకు కారణమయింది.

## 5.8 షాజహాను తిరుగుబాటు :

లాడ్లీబేగం వివాహం షహియర్‌తో జరిగాక, షాజహానుకు నూర్జహాను మీద అనుమానం పెరిగింది. పైగా షహియార్ మున్సబ్‌దారీని పెంచింది. దీనితో నూర్జహాన్ షహియర్‌ను వారసుడిగా చేయటానికి ప్రయత్నిస్తుందని గ్రహించాడు. కాందహార్ ఆక్రమణ నిరాకరించడానికి ఇదియే కారణము. జహంగీరు కాశ్మీరులో విశ్రాంతి తీసుకొంటున్న సమయంలో షాజహాను 1622 - 23లో మామగారైన అసఫ్‌ఖాన్ సమాయంతో తిరుగుబాటు లేవదీసి ఆగ్రాపై దండెత్తాడు. ఈ వార్త ముందుగానే జహంగీరుకు తెల్సి షాజహానును ఫతేపూర్ సిక్రీవద్ద ఓడించాడు. షాజహాను దక్కను పారిపోయాడు. సైన్యం వెన్నంటింది. చేసేదేమీలేక షాజహాను తండ్రికి లొంగిపోయాడు. భార్యాబిడ్డలను హామీగా తండ్రి వద్ద వుంచి బాలాఘాటాకు గవర్నరుగా వుండటానికి అంగీకరించాడు.

ఎన్నో విజయాలను సాధించిన వీరుడు చివరకు ప్రభుత్వాధికారానికి తలవంచాడు. ఎన్ని అలజడులున్నా ప్రభుత్వ యంత్రాంగం పతనమవలేదు. ఇది అక్బరు పరిపాలనా సైనిక, సంస్కరణల గొప్పదనాన్ని తెల్పుతుంది.

## 5.9 మహబ్బత్‌ఖాన్ తిరుగుబాటు (1626) :

జహంగీరు కాలంనాటి ప్రముఖ సేనాని మహబ్బత్‌ఖాన్. ఇతని పుట్టుపూర్వోత్తరాలు తెలియవు. ఆఫ్ఘన్ జాతీయుడు. తనశక్తి సామర్థ్యాల వలన మొగలు సేనాధిపతిగా నియమించబడ్డాడు. షాజహానుతో సమానంగా గుర్తించబడ్డాడు. అనేక యుద్ధాలలో సైన్యాధిపతిగా నియమించబడి, బెంగాలు, దక్కనులలో గవర్నరుగా పనిచేశాడు. నూర్జహాను ఇతనిని స్వలాభానికి ఉపయోగించుకోవాలని ప్రయత్నించిందికాని, మహబ్బత్‌ఖాన్ లొంగలేదు. షాజహానుతో విభేదాల తర్వాత షాజహాన్ మీద మహబత్‌ఖాన్‌ను ప్రయోగించింది. షాజహాను దండయాత్రనణచటానికి చక్రవర్తికి సహాయపడ్డాడు. చివరకు రాజాజ్ఞను కూడా తిరస్కరించటం మొదలుపెట్టాడు. అసఫ్‌ఖాన్ ప్రోత్సాహంతో నూర్జహాను మహబ్బత్‌ఖాన్‌ను అవమానించటానికి పూనుకుంది. 1625లో షాజహానును ఓడించినప్పుడు దొరికిన ధనాన్ని ఖజానాకు ఇవ్వలేదని, రాజానుమతిలేకుండా తన కుమార్తెను మరొక మన్సబ్‌దార్‌కిచ్చి వివాహం చేశాడని, వీటికి సంజాయిషీ చెప్పవల్సిందిగా కోరింది. నూర్జహాను కుతంత్రాన్ని పసిగట్టిన మహబ్బత్‌ఖాన్ 5000 సుప్రసిద్ధ రాజపుత్ర సైనికులతో లాహోరులో వున్న చక్రవర్తిని దర్శించటానికని బయలుదేరాడు. ఈ లోపల చక్రవర్తి కాబూలు యాత్రకు బయలుదేరి జీలంనది ఒడ్డుకు చేరుకున్నాడు. నదిని దాటే సమయంలో మహబ్బత్‌ఖాన్ సైనికులు చక్రవర్తిని బంధించారు. చక్రవర్తి మౌనందాల్చాడు. నూర్జహాను కూడా చక్రవర్తితోపాటు బందీ అయింది.

### శతదిన పాలన :

జహంగీరు, నూర్జహానులు 3 నెలలు, మహబ్బత్‌ఖాన్ ఆధీనంలో వున్నారు. దీనినే శతదినపాలన అంటారు. దర్బారుకు ఆధిపత్యం వహించి తానే దర్బారు నడిపాడు. మహబ్బత్‌ఖాన్ గొప్ప యోధుడేకాని పాలనాదక్షుడు కాదు. అనుచరులతో తగాదాపడి అల్లరిపాలైనాడు. జహంగీరు మహబ్బత్‌ఖాన్ అధికారాన్ని గుర్తిస్తున్నట్లు నటిస్తూ సైన్యాన్ని లాహోర్ రప్పించాడు. ఈ సైన్యాన్ని చూసి మహబత్‌ఖాన్ భయపడి లొంగిపోయాడు.

## 5.10 బొబ్బల ప్లేగు :

1616లో పంజాబులో బయలుదేరిన ప్లేగు అనే వ్యాధి వేలాదిమందిని నాశనం చేసింది. అనేక పశువులు కూడా నాశనం అయ్యాయి.

## 5.11 ఆంగ్లేయుల రాక :

మొదటిసారిగా ఆంగ్లేయులు జహంగీరు కాలంలో అతని ఆస్థానాన్ని దర్శించారు. వీరిలో విలియమ్ హాకిన్స్, సర్‌థామస్‌రో ముఖ్యులు. మొదటి జేమ్స్ పంపగా 1615లో వచ్చిన సర్‌థామస్‌రో జహంగీరు ఆస్థానంలో 1618 వరకూ వున్నాడు. ఆసఫ్‌ఖాన్ ప్రాపకం సంపాయించి వర్తకానికి అనుమతి సంపాయించాడు. సర్‌థామస్‌రో మొగలు వర్తక వ్యాపారాల గురించి ఇంకెన్నో ఇతర విషయాల గురించి విపులంగా వ్రాశాడు.

## 5.12 జహంగీరు మరణం :

మొహబ్బత్‌ఖాన్ తిరుగుబాటు తర్వాత క్రమంగా చక్రవర్తి ఆరోగ్యం క్షీణించింది. ఉబ్బసం వ్యాధి ప్రవేశించింది. విశ్రాంతి కోసం కాశ్మీరు వెళ్ళాడు. అక్కడి చలికి తట్టుకోలేక లాహోరు బయలుదేరాడు. లాహోరు చేరకముందే జారీరా అనుచోట 1627

అక్టోబరు 28న మరణించాడు.

## 5.13 ముగింపు :

జహంగీరులో మంచి, చెడు లక్షణాలు రెండు మేళవించివున్నాయి. గొప్ప విద్వాంసుడు, యోధుడు, చాలా తెలివిగలవాడు. అయితే స్త్రీ లోలత్వం, మధ్యపానము ఇతనిని నాశనం చేశాయి. అందుకే నూర్జహాన్‌కు బానిస అయ్యాడు. ఇన్ని లోపాలువున్నా రాజ్యాధికారాన్ని అమలుజరిపి శాంతిభద్రతలను అమలుపరచటంలో కృతకృత్యుడయ్యాడు. ఖుస్రూ, షాజహాను, మహబ్బత్‌ఖాన్‌ల తిరుగుబాటులను అణచటమే దీనికి నిదర్శనం. కాని కాందహారును సాధించుటలో విఫలమయ్యాడు. కాందహారును కోల్పోవటం తనకు ఎంతో వ్యధ కల్గించినదని స్వీయచరిత్రలో వ్రాసుకున్నాడు.

డా. బేణీ ప్రసాద్ జహంగీరు దయార్ద్ర హృదయుడని వర్ణించాడు. తిరుగుబాటు చేసిన ఖుస్రూని క్షమించలేకపోయినా అతని దురదృష్టాన్ని గురించి దుఃఖించాడు. రాజపుత్రులతో చేసుకొన్న సంధి అతని మత ఔదార్యాన్ని తెలుపుతుంది. కాని శిక్కులు విషయంలో ఉదారత్వం కనపరచలేదు.

జాఫర్ అనే రచయిత జహంగీరు గొప్ప పరిపాలనాదక్షుడని, నూర్జహానుకు లోబడనట్లయితే రాణించేవాడని వ్రాశాడు. దురదృష్టవశాత్తు అక్బరు షాజహాను వంటి గొప్ప చక్రవర్తుల మధ్య వుండటం చేత ఇతని పరిపాలన అంతగా ప్రకాశించలేదని వ్రాశాడు.

## మాదిరి ప్రశ్నలు :

### ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.

1) జహంగీరు జీవితమును, ఆయన సాధించిన విజయములను వివరింపుము.
2) జహంగీరు జీవితములో నూర్జహాను పాత్ర.

### లఘుటీక ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.

1) ఖుస్రూ తిరుగుబాటు
2) ఖుర్రం తిరుగుబాటు
3) మహబ్బత్‌ఖాన్
4) నూర్జహాన్ ముఠా
5) జహంగీరు దండయాత్రలను వివరింపుము.
6) నూర్జహాను

## ఉపయుక్త గ్రంథాలు :


1. R. Tripathi - Rise and Fall of Mughal Empire
2. A.L. Srivatsava - The Mughal Empire
3. F.Bernier - Travels in Mughal Empire
4. V.D. Mahajan - India since 1526
5. Iswari Prasad - History of Medieval India
6. Beni Prasad - Jahangir
7. Cambridge history of India Vol. IV & V
8. Tujeki Jahangiri - Auto Biography by Jahangir.

పాఠము - 6

# షాజహాను (1628 - 1658)

విషయసూచిక

6.0 లక్ష్యం
6.1 ఉపోద్ఘాతము
6.2 బాల్య జీవితము
6.3 వారసత్వ యుద్ధాలు
6.4 పట్టాభిషేకము
6.5 తిరుగుబాట్లు అణచుట
6.6. దండయాత్రలు
6.6.1 మధ్యఆసియా దండయాత్రలు
6.6.2 చిన్నటిబెట్టు ఆక్రమణ
6.6.3 శిక్కులు
6.6.4 పోర్చుగీసువారు
6.6.5 కాందహారు
6.6.6 దక్కను దండయాత్రలు
6.6.6.1 అహమ్మద్‌నగర్ దండయాత్ర
6.6.6.2 బీజపూరు
6.6.6.3 గోల్కొండ
6.7 సామ్రాజ్య విస్తరణ
6.8 స్వర్ణయుగము
6.9 అంతిమదశ
6.10 ముగింపు

## 6.0 లక్ష్యం :

షాజహాను కాలంలో మొగలు సామ్రాజ్యం ఎంతో పురోభివృద్ధి సాధించింది. కళా, సాంస్కృతిక రంగాలలో షాజహాను యుగం స్వర్ణయుగంగా పేర్కొనటం జరిగింది. ఇతని నిర్మాణాలైన తాజ్‌మహల్, నెమలి సింహాసనాలు, ఇతని కీర్తి ప్రతిష్టలను పెంచాయి. షాజహాను కాలంనాటి పురోభివృద్ధిని వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 6.1 ఉపోద్ఘాతము :

జహంగీరు అనంతరం వారసత్వ యుద్ధాల తర్వాత షాజహాను అధికారంలోకి వచ్చాడు. ఎన్నో యుద్ధాలు చేసి దక్కనును అదుపులోకి తీసికొన్నాడు. కాని ఇతనికి శాశ్విత ప్రతిష్టను చేకూర్చిపెట్టినది ఇతని కట్టడాలు. కళలలో ఇతను సాధించిన అభ్యుదయాన్ని చరిత్రకారులు స్వర్ణయుగంగా వర్ణించారు. మొగలు చరిత్రలో స్వర్ణయుగాన్ని సాధించిన ఘనత షాజహానుకే దక్కుతుంది.

## 6.2 బాల్య జీవితము :

షాజహాను లాహోరులో 1592 జనవరి 5న జన్మించాడు. తల్లి రాజపుత్ర వనిత. షాజహాను జననవార్త విని సంతోషించిన వారిలో అక్బరు, అతని భార్య రుఖియా ముఖ్యులు. రుఖియాకు సంతానం లేదు. పసివాడిని చూసి సంతోషపడింది. ఇరువురికి సంతోషం కలిగించటం వలన అక్బరు, ఖుర్రం అని నామకరణం చేశాడు.

మనుమని విద్యాభ్యాసం గురించి అక్బరు శ్రద్ధ తీసికొన్నాడు. ప్రముఖ పండితులను విద్యాబోధనకు నియమించాడు. చరిత్ర, భూగోళం, రాజనీతి, వైద్య శాస్త్రాలను అభ్యసించాడు. సైనిక శిక్షణ కూడా పొందాడు. విద్యాభ్యాస కాలంలో సామ్రాజ్య వ్యవహారాలలో కూడా తర్ఫీదు పొందాడు. రాజ్య ప్రాతినిధ్య సభలో స్థానం పొందాడు. ఖుస్రూ తిరుగుబాటు అణిచేకాలంలో జహంగీరు పాలన కోసం 9 మంది సభ్యులతో ఒక సభను ఏర్పాటు చేశాడు. ఖుర్రం అందులో ఒకడిగా నియమించబడ్డాడు. 1607లో 8 వేల జాట్, 5000 సవారీలకు మన్సబ్ దారయ్యాడు. జండా, డప్పులతో వూరేగే అదృష్టాన్ని పొందాడు. దర్బారులో జరిగిన ఉత్తమ అశ్వకుల పోటీలో గెలుపొంది వీరుడిగా పేరుపొందాడు. 1608, 1616లో రెండుసార్లు తులాపురుషదానం చేశాడు. దండయాత్రలలో తండ్రికి తోడుగా నిలిచి అనేక విజయాలు సాధించాడు. దక్కనును అదుపులోకి తెచ్చాడు.

## 6.3 వారసత్వ యుద్ధాలు :

జహంగీరు జీవించి వున్న కాలంలోనే, సింహాసనం కోసం కలహాలు ప్రారంభమయ్యాయి. జహంగీరు మరణించగానే ఇవే వారసత్వయుద్ధానికి దారితీశాయి. నూర్జహాను, అసఫ్‌ఖాన్ ఇరువురు, తమ అల్లుళ్ళను చక్రవర్తిని చెయ్యటానికి పూనుకున్నారు. కాశ్మీరులో వున్న షహ్రియార్, జహంగీరు మరణవార్త తెలిసి, లాహోరు చేరుకొని అక్కడే చక్రవర్తిగా ప్రకటించుకొని నాణాలను ముద్రించుకున్నాడు. షాజహాను దక్కనులో వున్నాడు. అందువలన అతని మామగారు అసఫ్‌ఖాన్ ముందుగా ఆగ్రా చేరుకొని, సైన్యాన్ని, ఖజానాను స్వాధీనపరచుకొన్నాడు. తాత్కాలికంగా ఖుస్రూ పెద్దకొడుకైన దవార్‌బక్షను రాజుగా ప్రకటించాడు.

షాజహాను ఢిల్లీ చేరుకునేలోపల అసఫ్‌ఖాన్ సైన్యంతో షహ్రియర్ మీద దండెత్తి, అతనిని ఓడించి అంధుణ్ణి చేశాడు. ఈ లోపల షాజహాను రాజధానికి చేరుకున్నాడు. దవార్‌బక్షను తొలగించి, అతని సోదరులను, ధనియాల్ రాకుమారుణ్ణి, వారసత్వానికి సంబంధమున్న ప్రతి ఒక్కరిని చంపి సింహాసనం ఆక్రమించుకున్నాడు.

షాజహాను గావించిన రక్తపాతం చరిత్రకారుల విమర్శకు గురైంది. ఎందుకంటె ఎటువంటి రక్తపాతం లేకుండా చక్రవర్తి అయ్యే అవకాశం ఒక్క షాజహానుకే వుంది. జహంగీరు పెద్దకుమారుడు ఖుస్రూ ఎప్పుడో మరణించాడు. రెండవ కుమారుడు పార్వీజ్ వ్యసనపరుడు. మూడు షాజహాను. నాలుగు షహ్రియర్. అందువలన అన్నివిధాలా షాజహానే అర్హుడు.

## 6.4 పట్టాభిషేకము :

శత్రువులను వధించి 1628 ఫిబ్రవరి 14న షాజహాను "అబ్దుల్ ముజఫర్ షిహబుద్దీన్ మహమ్మద్ సాహిబి ఖిరాన్‌సాని షాజహాన్ పాద్‌షా ఘాజీ" అనే బిరుదుతో సింహాసనం అధిష్ఠించాడు. అసఫ్‌ఖాన్‌ను వజీరుగా నియమించాడు. మహబ్బత్‌ఖాన్‌ను ఉన్నత పదవిలో నియమించాడు. తన అనుయాయులను, గవర్నర్లుగా నియమించాడు. షేక్ సలీమ్ చిష్టి సమాధిని కాలి నడకన దర్శించాడు. రాజ్యం కొరకు కాఠిన్యం వహించినా నూర్జహానుపట్ల దయతో వ్యవహరించాడు. ఆమెకు సాలుకు లక్ష రూపాయలు మనోవర్తి కల్పించాడు.

## 6.5 తిరుగుబాట్లు అణచుట :

షాజహాను రాజ్యానికి వచ్చిన కొద్దిరోజులకే తిరుగుబాట్లు మొదలయ్యాయి. వీరిలో దక్కను గవర్నరు ఖాన్ జహాను, బుందేల్ ఖండ్ రాజైన జూజర్‌సింగ్ ముఖ్యులు.

### ఖాన్ జహాన్ (1628-31) :

ఇతను ఆఫ్ఘన్ జాతీయుడు. వారసత్వ యుద్ధాలలో నూర్జహాను పక్షం వహించినా షాజహాన్ క్షమించి దక్కను గవర్నరుగానే వుంచాడు. కాని అహమ్మద్‌నగర్ రాజుతో చేరి చక్రవర్తి ఆజ్ఞను ధిక్కరించాడు. చక్రవర్తి స్వయంగా బయలుదేరి ఖాన్ జహాన్‌పై దండెత్తి యుద్ధంలో చంపేశాడు.

### జూజర్ సింగ్ :

బుందేల్‌ఖండ్ రాజపుత్ర రాజ్యాలలో ఒకటి. రాజైన జూజర్ సింగ్, కొడుకు విక్రమ్‌సింగ్ రెండుసార్లు చక్రవర్తికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. షాజహాను ఈ తిరుగుబాటును అణిచివేశాడు.

## 6.6. దండయాత్రలు :

మొగలు సామ్రాజ్యాన్ని విస్తరించి సార్వభౌమాధికారాన్ని స్థాపించాలనే కోరికతో షాజహాను అనేక దండయాత్రలు చేశాడు. దేశంతోనే కాకుండా కాందహార్, బదక్షణ, చిన్నటిబెట్టు మొదలైన విదేశాలతో కూడా యుద్ధాలు చేశాడు. పోర్చుగీసు వారితో కూడా వైరం పూనాడు.

### 6.6.1 మధ్య ఆసియా దండయాత్రలు :

మధ్య ఆసియాలోని ట్రాన్స్-ఆక్సియానా ప్రాంతానికి ఛంఘిజ్‌ఖాన్ వంశస్థుడైన ఇమాంకులీ రాజు. ఇతను 1611 సామర్‌ఖండ్‌ను జయించాడు. జహంగీరు కాలంలో ఢిల్లీకి రాయభారులను పంపాడు. షాజహాను రాజ్యానికి వచ్చాక స్వయంగా చక్రవర్తిని దర్శించాడు. 1614లో ఇమాం సోదరుడు నాజర్ మహమ్మద్ అన్నను చంపి అధికారానికి వచ్చాడు. ఇతను క్రూరుడు. ప్రజలితనిపై తిరుగుబాటు చేశారు. పరిస్థితిని చూసి షాజహాను మధ్య ఆశియా జయించాలని రెండుసార్లు ట్రాన్స్-ఆక్సినాకు సైన్యాన్ని పంపాడు. 1646-47లో బదక్షన్ ఆక్రమించాడు. రెండవసారి ఔరంగజేబు నాయకత్వంలో మొగలుసైన్యం 1647లో ఆక్సస్ నదీతీరాన జరిగిన భయంకర యుద్ధంలో విజాయాన్ని సాధించాయి. షాజహాను ఘనవిజయాలలో ఇదొకటి.

### 6.6.2 ఈశాన్య ప్రాంతం :

చిన్న టిబెట్టు ఆక్రమణ (1637-38). భారతదేశానికి ఈశాన్యంగా బల్కిస్థాన్ అనే ప్రాంతం వుంది. దీన్నే చిన్న టిబెట్టు అంటారు. ఇది కాశ్మీరుకు కూడా సరిహద్దు. బల్కిలు కలసి మొగలుల నెదిరించారు. కాశ్మీరు మొగలుల వశమయ్యాక, బల్కిస్థాన్ కూడా లొంగిపోయి కప్పం కట్టటానికి అంగీకరించింది. షాజహాను కాలంలో బల్కి పాలకుడు అబ్దాలీ కప్పం చెల్లించనందున కాశ్మీరు గవర్నరు జఫర్‌ఖాన్ బల్కిమీద దండెత్తాడు. అబ్దాలి లొంగిపోయి కప్పం కట్టటానికి అంగీకరించాడు.

### 6.6.3 శిక్కులు (1628-31) :

1628లో శిక్కులకు షాజహానుకు మధ్య వైరం ప్రారంభమయ్యింది. చక్రవర్తి వేట సందర్భంగా నీటికొంగ శిక్కుల ప్రార్థనా మందిర ప్రాంగణంలో వాలింది. దీన్ని అప్పగించాలని షాజహాను కోరగా మతాధికారులు నిరాకరించారు. దీనితో షాజహాను 3 సార్లు సైన్యాన్ని పంపాడు. శిక్కులు తీవ్రంగా ప్రతిఘటించినా విజయం సాధించలేకపోయారు.

### 6.6.4 పోర్చుగీసువారు (1629 - 30) :

షాజహాను పరిపాలన కాలానికి పోర్చుగీసువారు భారతదేశ వివిధ ప్రాంతాలలో స్థావరాలు స్థాపించారు. సూరత్, హుగ్లీ, గోవాలలో కోటలు కట్టారు. ఉప్పు వ్యాపారంలో గుత్తాధిపత్యం సంపాయించారు. వారు స్థానికులను క్రైస్తవులుగా మార్చటం, భారతీయుల్ని బానిసలుగా అమ్మటం, స్త్రీలను బలవంతంగా తీసుకువెళ్ళటం చేస్తున్నారు. ముంతాజ్‌బేగం సేవకురాళ్ళిద్దరిని బలవంతంగా క్రైస్తవులుగా మార్చారు. ఈ కారణంచేత వీరిని శిక్షించాలనే కోరిక షాజహానుకు గల్గింది. అంతేకాక వారసత్వ యుద్ధాలలో పోర్చుగీసువారు పార్వీజు రాకుమారుణ్ణి సమర్థించారు.

ఈ సమయంలోనే హుగ్లీలో వున్న పోర్చుగీసు వారికి గోవాలో వున్న పోర్చుగీసు వారికి భూమి విషయంలో తగాదా ఏర్పడింది. గోవాలోని పోర్చుగీసువారు బెంగాల్‌లోని మొగలు గవర్నరు ఖాసింఖాన్ సహాయం అడిగారు. మొగలు సైన్యం హుగ్లీని ఇతర పోర్చుగీసు స్థావరాలను ముట్టడించాయి. యుద్ధం 3 1/2 నెలలు కొనసాగింది. 3 వేల పోర్చుగీసు వారు కాందిసీకులైనవారు. ఇస్లాం మతం స్వీకరించుటకు ఇష్టపడనందున 4000 మందిని ఖైదు చేశారు. పోర్చుగీసువారు చేసేదేమీ లేక చక్రవర్తికి క్షమాపణ చెప్పుకొని విధేయులైనారు.

### 6.6.5 కాందహారు :

తన తండ్రి కాలంలో కోల్పోయిన కాందహారును తిరిగి పొందాలని షాజహాను ఎంతో ప్రయత్నం చేశాడు. కాని సఫలీకృతుడు కాలేకపోయాడు. పర్షియారాజు మొదటిషా అబ్బాస్ మరణించాక షాషఫీ సుల్తాన్ అయ్యాడు. కాందహారుకు గవర్నరుగా వున్న ఆలీమర్దన్ షాషఫీని వ్యతిరేకించి కోటలు మొగలులకు స్వాధీనం చేసి వారి ఆస్థానంలో చేరాడు. కాని రెండవ షా అబ్బాస్ కాలంలో కోటను తిరిగి పర్షియన్లు ఆక్రమించుకొన్నారు. షాజహాను దానిని తిరిగి పొందలేకపోయాడు.

### 6.6.6. దక్కను దండయాత్రలు :

షాజహాను యుద్ధాలలో దక్కను దండయాత్రలు ముఖ్యమైనవి. దక్కనులో కూడా మొగలు సార్వభౌమాధికారాన్ని స్థాపించాలనే ప్రయత్నం, తన పూర్వీకుల ఆశయసాధన కోసం ఈ దండయాత్రలు నిర్వహించాడు. అంతకుముందే దక్కనుతో పరిచయం వుండటం వలన దక్కను నైసర్గిక స్వరూపము, అక్కడి రాజుల మధ్య అంతః కలహాలు, కుట్రలు, కుతంత్రాలు షాజహానుకు బాగా తెలుసు. ఇంతేకాక సిరిసంపదలతో నిండినవాటిని ఓడించి అక్కడి ధనరాసులను స్వాధీనపరచుకోవాలని అతని కోరిక. షాజహాను మతోన్మాది కాకపోయినా షియాశాఖకు చెందిన దక్కను సుల్తానులను ద్వేషించాడు. తిరుగుబాటుదారుడు ఖాన్ జహన్‌కు అహమ్మద్‌నగర్ సుల్తాను ఆశ్రయం ఇవ్వటం కూడా షాజహానుకు కోపకారణమైంది. నిజాన్‌షాహీ వారిని పరాభవించటానికి, మొదటిసారిగా స్థానికులైన మహారాష్ట్రులను సైన్యంలోకి తీసికొన్నాడు.

### 6.6.6.1 అహమ్మద్‌నగర్ దండయాత్ర :

షాజహాను మొదట అహమ్మద్‌నగర్ మీద దండెత్తాడు. మొత్తం 3 దండయాత్రలు చేశాడు. మొదటిది 1629 ఖాన్ జమాన్ నాయకత్వంలో జరిగింది.

#### దారూర్‌కోట పతనం :

దారూర్‌కోట బలమైన దుర్గము. ఇది బాలాఘాట్ పర్వత ప్రాంతంలో వుంది. బాలాఘాట్ బీజపూర్ గోల్కొండ సరిహద్దులలో వుండటం వలన యుద్ధ తంత్ర దృష్టిలో ముఖ్యమైనది. ఎలాగైనా ఈ కోటను ఆక్రమించాలనే పట్టుదల కల్గింది. దీనిని

ఆక్రమించాలని మొదట ఖాన్ జహాన్‌ను ఆజ్ఞాపించాడు. ఖాన్ జహాన్‌ని దక్కను గవర్నర్‌గా నియమించాడు. ఖాన్ జహాన్ చక్రవర్తి ఆజ్ఞను పాటించక తిరుగుబాటు చేశాడు. నిజామ్ షాహీ వారు మొదట ఖాన్ జహానుకు ఆశ్రయం ఇచ్చినా తర్వాత తరిమివేశారు. చక్రవర్తి సైన్యం ఒకవైపు ఖాన్ జహాన్‌ను తరుముతూ, మరొకవైపు అహమ్మద్‌నగర్‌పై దండయాత్ర ప్రారంభించింది. చక్రవర్తి స్వయంగా కుటుంబంతో ఖుర్హానాపూర్‌లో విడిది చేశాడు. 1631లో ధారూర్‌కోటను స్వాధీనపరచుకున్నాడు.

ధారూర్‌కోట పతనంతో నిజామ్‌షాహీ వారు భయపడి బీజపూరు సహాయాన్ని అర్థించారు. బీజపూరు రణదుల్లా ఖాన్ నాయకత్వంలో సైన్యాన్ని పంపింది. మొగలు సైన్యాధికారి తన సేనలను నాల్గు భాగాలు చేసి పరేండాను నాల్గువైపులా ముట్టడించాడు. నిజామ్‌షాహీలు ధైర్యాన్ని ప్రదర్శించి పోరాడారు కాని విజయం మొగలులనే వరించింది. 1631లో ముంతాజ్ మరణం వలన, దక్షిణాదిలో క్షామం వలన దక్కను దండయాత్రలను ఆపివేశారు.

### దౌలతాబాద్ ముట్టడి (1633 - 36) :

1633లో మహబ్బత్‌ఖాన్ దక్కను గవర్నరుగా నియమించబడ్డారు. నిజాంషాహీ రాజ్యంలో మాలిక్ అంబర్ చనిపోయాడు. ఫతేఖాన్ హుసేన్‌షాను రాజుగా ప్రకటించి అధికారం హస్తగతం చేసికొన్నాడు. ఈ పరిస్థితులలో మహారాష్ట్ర నాయకుడు షాజీ భాన్‌స్లే, బీజపూర్ సహాయంతో అహమ్మద్‌నగర్ పరిస్థితిని చక్కదిద్దాలని పూనుకున్నాడు. ఫతేఖాన్ మొగలుల సహాయాన్ని అర్థించాడు. కాని మాట నిలుపుకోలేకపోయాడు. మహబ్బత్‌ఖాన్ 1633లో దౌలతాబాద్‌ను ముట్టడించాడు. ఫతేఖాన్ కోటను మొగలుల ఆధీనంచేసి వారి సేనలో చేరాడు. సుల్తాను హుసేన్‌షా గ్వాలియర్ కోటలో బంది చేయబడ్డాడు. దౌలతాబాద్ యుద్ధంలో మహబ్బత్‌ఖాన్ ప్రదర్శించిన ధైర్యసాహసాలు అపూర్వమైనవని బనారసీదాసు అభిప్రాయబడ్డాడు. షాజహాను మహబ్బత్‌ఖానుకు, అనేక బహుమతులతో పాటు, రత్నఖచిత ఖడ్గం, బంగారు వెండి జీనులు గల రెండు గుర్రాలు 'ఖాన్ దురానీ' అనే బిరుదుతో సత్కరించటం జరిగింది. అహమ్మద్‌నగర్ పతనంతో బీజపూరు పరేండాను ఆక్రమించింది. ఉద్‌గర్ ప్రాంతంలో నిజామషాహీలు స్వతంత్ర రాజ్యం స్థాపించారు.

దౌలతాబాద్ పతనం తర్వాత నిజామ్‌షాహి నాయకుడైన షాజీ బాంస్లే ముర్తుజాఖాన్ అనే బాలుణ్ణి రాజుగా చేసి వంశాన్ని పునరుద్ధరించాడు. తిరిగి ఏర్పడిన అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని అదుపులో పెట్టటానికి 1635లో షాజహాను స్వయంగా బయలుదేరాడు. ఫిరంగిదళంతో కందార్, నాందేడ్, కొంకణ్ జున్నార్ ప్రాంతాలను ఒకేసారి ఆక్రమించాడు. మహాలీ దగ్గర జరిపిన యుద్ధంలో షాజీ లొంగిపోయి, ముర్తాజాఖాన్‌ను షాజహానుకు అప్పగించి తాను కూడా మొగల్ సైన్యంలో చేరిపోయాడు. నిజామ్‌షాహి వంశం అంతరించింది.

### 6.6.6.2 బీజపూరు :

బీజపూరు, ఆదిల్‌షా వారికి షాజహానుకు ఏవిధమైన శతృత్వము లేదు. మొగలుల దక్కను విస్తరణ చూశాక అహమ్మద్‌నగర్ రక్షణకు శాయశక్తులా ప్రయత్నించారు.

అహమ్మద్‌నగర్ పతనం తర్వాత షాజహాను రెండుసార్లు బీజపూరు మీద దండెత్తాడు. అసఫ్‌ఖాన్ నాయకత్వంలో మొగలు సైన్యం బాల్కివద్ద బీజపూరు సైన్యాన్ని ఓడించి బీదరును కొల్లగొట్టి బీజపూరు చేరుకున్నారు. ఆదిల్‌షా సంధికి అంగీకరించాడు. సంధి కంగీకరించటంతో మొగలు సైన్యం నిరాయుధులై బీజపూరు ప్రవేశించారు. స్థానిక సేనలు వారిని పట్టి హతమార్చాయి. దీనితో చక్రవర్తి స్వయంగా 1636లో బయలుదేరాడు. ఈ లోపల బీజపూరులో ముస్తాఫాఖాన్ అధికారంలోకి వచ్చి చక్రవర్తితో సంధికంగీకరించాడు. యుద్ధవ్యయం క్రింద 20 లక్షల రూపాయలనిచ్చి మొగలు సార్వభౌమాధికారాన్ని గుర్తించాడు. మొగలులు ఆక్రమించుకొన్న భూభాగాలు తిరిగి ఇవ్వటం జరిగింది.

### 6.6.6.3 గోల్కొండ :

షాజహాను కాలంలో గోల్కొండకు అబ్దుల్లా కుతుబ్‌షా సుల్తానుగా వుండేవాడు. మొగలులకు వీరికి ఎటువంటి తగాదాలు లేవు. షాజహాను తిరుగుబాటులో సహాయం కూడా చేశారు. 1636లో కుతుబ్‌షా షాజహానుతో సంధి చేసికొని కప్పం చెల్లించటానికి, చక్రవర్తి పేరుతో కుత్బా చదవటానికి అంగీకరించాడు.

## 6.7 సామ్రాజ్య విస్తరణ - సరిహద్దులు :

షాజహాను యుద్ధాల వలన మొగలు సామ్రాజ్య సరిహద్దులు పెరిగాయి. మధ్య ఆశియాలో ఆక్సస్ వరకు సరిహద్దు విస్తరించింది. దక్షిణాన కొంకణ్ బాలాఘాట్ ప్రాంతాల నుంచి ఉత్తరాన మధ్య ఆశియాలోని ఆక్సస్ వరకు, హిమాలయ ప్రాంతమంతా, తూర్పున హుగ్లీ వరకు షాజహాను సామ్రాజ్యం విస్తరించింది.

## 6.8 స్వర్ణయుగము :

యుద్ధాలలోనే కాక షాజహాను పరిపాలనలో సాహిత్య, కళాపోషణలోను శ్రద్ధ వహించాడు. అక్బరు సంస్కరణలు సత్ఫలితాలనిచ్చి చక్రవర్తి విధి నిర్వహణ, ఉద్యోగి విధి దినచర్యలుగా మారిపోయాయి. రాజు దైవాంశ సంభూతుడని నమ్మకం ప్రతిఒక్కరిలో బలపడింది. ముంతాజ్ బేగం ప్రేమను శాశ్వతం చేయటానికి తాజ్‌మహల్ కట్టించాడు. ఇంకా అనేక దివ్య భవనాలు నిర్మించాడు. ఇతని కాలాన్ని సాహిత్య పోషణలో, భవన నిర్మాణంలో, కళారంగంలో స్వర్ణయుగంగా పేర్కొనబడింది. కాని అధికారుల స్వార్థం వలన, అధిక సైనిక వ్యయం వలన నిర్మాణ వ్యయం పెరిగి ఖజానాపై భారం ఎక్కువైంది. అయినా ఈ కాలంలో సాహిత్య కళారంగాలలో సాధించిన అభ్యుదయం సామ్రాజ్యాన్ని పరాకాష్ఠకు చేర్చింది.

### 6.8.1 భవన నిర్మాణం :

షాజహాను ప్రసిద్ధి చెందిన అనేక సుందర భవన సముదాయాన్ని నిర్మించాడు. అన్నిటిలోకి ముఖ్యమైనది ఎఱ్ఱకోట. షాజహాను ఆగ్రా రాజధానిగా అనుకూలంగా లేదని షాజహానాబాద్‌ను కట్టించాడు. దాని నిర్మాణం 1639లో మొదలయి 1648లో పూర్తయింది. ఈ కోటలోని ముఖ్య భవనాలు రంగమహల్, ముంతాజ్‌మహల్, దివాన్-ఇ-ఆమ్, దివాన్-ఇ-ఖాస్. వీటి నిర్మాణాలలో పాలరాయి, ఎఱ్ఱరాళ్ళను విరివిగా వాడాడు. ఆగ్రాకోటలోని ముసల్మాన్ బర్జ్, మోతీ మసీదు, జూమా మసీదులు అత్యంత ప్రశంశా పాత్రమైనవి. దేశంలోనే అత్యంత పెద్దదైన 'జహాన్‌నామా' మసీదును కట్టించాడు.

ఎఱ్ఱకోటలోని భవనాలు వాటిమీద కళాకౌశలం ఎంతో ప్రశంసనీయం. మంచినీటి సరఫరాకు మురుగునీటి పారుదలకు గోడల మధ్య చేసిన ఏర్పాటు అద్భుతమైనది. దివాన్-ఇ-ఖాస్, దివాన్-ఇ-ఆమ్ భవనాలు ప్రపంచంలోనే అత్యంత సుందరమైనవి. గోడలమీద చేసిన అద్దాలపని, లోకప్పులోని చిత్రలేఖనం ప్రతిఒక్కరిని తన్మయపరుస్తాయి. "భూలోకంలో స్వర్గం అనేది వుంటే అదే ఇది'' అని, చక్రవర్తి తన సంతోష సంభ్రమాలను వ్యక్తం చేసినాడు.

చక్రవర్తి అజ్మీరులో కూడా ఎన్నో భవనాలు నిర్మించాడు.

షాజహాను నిర్మాణాలన్నింటిలోకి, తనమానిక వంటిది తాజ్‌మహల్. తన ప్రియమైన భార్య ముంతాజ్ బేగం స్మృతి చిహ్నంగా షాజహాను దీనిని యమునానది ఒడ్డున నిర్మించాడు. ప్రపంచంలోనే అద్భుత వింతలలో ఒకటైన తాజ్‌మహల్ నిర్మాణానికి అత్యంత శ్రద్ధ వహించాడు. దీని నిర్మాణానికి పర్షియా, అరేబియా, టర్కీ దేశాలనుండి కళాకారులను రప్పించాడు. ముఖ్య శిల్పి ఉస్తాద్ ఇశా. ఇతనికి నెలకు 1000 రూ॥ల జీతం. 2 కోట్ల రూపాయల ఖర్చుతో 22 సంవత్సరాలలో దీని నిర్మాణాన్ని పూర్తిచేశాడు. తెల్లని పాలరాయితో సజీవ శిల్పంగా, నిర్మించిన దీనిని చక్రవర్తికి భార్యపట్ల గల ప్రేమాభిమానాలకు చిహ్నంగా

వర్ణించవచ్చు. యమునానది అవతలి ఒడ్డున ఇంకొక భవనాన్ని నిర్మించపూనుకున్నాడు గాని వారసత్వ యుద్ధాల వలన సాధ్యపడలేదు.

షాజహాను నిర్మాణాలలో మరొక ముఖ్యమైనది నెమలి సింహాసనము. దీని పొడవు 2.96 మీటర్లు, వెడల్పు 2.28 మీటర్లు, ఎత్తు 5.5. మీటర్లు. దీనిని మేలిమి బంగారంతో తయారుచేసి, పై భాగాన్ని రత్నాలతో పొదిగినారు. దీనిని ఎక్కటానికి, రత్నఖచితమైన 3 మెట్లున్నాయి. దీనికి రెండువైపులా సజీవంగా కనిపించే మణి ఖచితమైన నెమళ్లున్నాయి. దీని నిర్మాణానికి లక్షతులాల బంగారం, 8 లక్షల ఖరీదు చేసే నవరత్నాలు వుపయోగించారు. దీనిని పూర్తి చేయుటకు 7 సంవత్సరములు పట్టింది. దీనిని కోహినూరు వజ్రంతో అలంకరించడం జరిగింది. దీని మొత్తం ఖర్చు 19 కోట్లు.

### 6.8.2 సాహిత్య చిత్రలేఖనాలు :

షాజహాను పార్శీ, హిందీ సాహిత్యాలను సమానంగా ఆదరించాడు. ఇతని పెద్ద కుమారుడు దారా ఆధ్వర్యంలో సంస్కృతం కూడా పోషించబడింది. రసగంగాధరం, గంగాలహరి రచించిన జగన్నాథ పండితుడు ఇతని ఆస్థాన కవి అని ప్రతితి. రవీంద్రాచార్య, మహాకవి సుందరదాసు, చింతామణి మొదలైన వారు ఇతని ఆస్థాన పండితులు. షాజహాను కాలంలో హిందూస్థానీ గాత్రం, వాద్యం కూడా ఉన్నతస్థాయి నందుకున్నాయి. తాన్‌సేన్ లాంటివారు ఇతని ఆస్థానంలో వుండేవారు. క్రొత్త రాగాలను ప్రోత్సహించడం జరిగింది. షాజహాను చిత్రలేఖనాన్ని కూడా ఆదరించాడు.

### 6.8.3 పరిపాలన :

షాజహాను జహంగీరు కంటే పాలనాదక్షుడు. జాద్-సవారీల మధ్య తేడాలను తొలగించాడు. నీలిమందు వ్యాపారాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చాడు. వ్యాపారంలో పోర్చుగీసువారి ఆధిపత్యాన్ని తగ్గించాడు. వ్యవసాయాభివృద్ధికి, కాలువలను త్రవ్వించాడు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచటం కోసం పన్నులను పెంచాడు. ఇవన్నీ షాజహాను ప్రత్యేకతను చాటి చెప్పినప్పటికి, పరిపాలనలో లోపాలు కూడా వున్నవి. ఉన్నతోద్యోగులు నియంతలై పన్ను వసూలులో ప్రజలను పీడించేవారు. ప్రభుత్వోద్యోగులలో లంచగొండితనం పెరిగింది. షాజహాను కాలంలో సామాన్య ప్రజల పరిస్థితి దుర్భరంగా వున్నదని, నిత్యావసర వస్తువులు కూడా లభ్యమయ్యేవి కావని బెర్నియర్ వ్రాశాడు.

### 6.8.4 మతం :

షాజహాను సున్నీ మతస్థుడు. ఆ కారణం చేత దక్కనులోని షియాలను ద్వేషించాడు. హిందూ మతస్థులను కూడా భాదించాడు. బెనారస్‌లోని హిందూ దేవాలయాలను నిర్మూలించాడు. క్రైస్తవ మతస్థులైన పోర్చుగీసువారి ప్రార్థనా మందిరాలను నాశనం చేశాడు. శిక్కులతో కూడా విభేదించాడు. ఇతను అనుసరించిన ఈ మతవిధానమే తరువాతి వారి మత విద్వేషానికి దారితీసింది.

## 6.9 అంతిమదశ :

షాజహాను చివరి దశలో అనేక కష్టాలను అనుభవించాడు. 1657లో అస్వస్థుడయ్యాడు. అప్పటి నుండే కుమారుల మధ్య వారసత్వ యుద్ధం ప్రారంభం అయ్యింది. పెద్దకొడుకు దారాషుకో షాజహానుకు ప్రీతిపాత్రుడు. రాజధానిలోనే తండ్రితోపాటే వుండేవాడు. షుజా బెంగాలుకు, ఔరంగజేబు దక్కనుకు, మురాద్ గుజరాత్‌కు గవర్నర్లుగా వుండేవారు. వీరందరిలోకి ఔరంగజేబు

ధైర్యసాహసాలు, పట్టుదల, కుటిలనీతి కలవాడు. ఇతనికి దారా అంటే కోపం. తండ్రి అస్వస్థత వార్త విని మురాద్, షుజాలతో స్నేహాన్ని నటించి, వారి సహాయంతో దారాను ఓడించి తరిమివేశాడు. తర్వాత షుజా, మురాద్‌లను చంపి తండ్రిని బంధించాడు. షాజహాను ఆగ్రా కోటలో 1659 నుండి 1666 వరకు ఖైదీగా వుండి 1666 జనవరి 31న మరణించాడు.

## 6.10 ముగింపు :

మొగలు చక్రవర్తులలో అక్బరు ప్రజల భయభక్తులను, జహంగీరు ప్రేమాభిమానాలను పొందితే, షాజహాను ప్రజల మన్ననలను పొందాడు. ఇతను అక్బరులాగా రాజ్య విస్తరణ ప్రజా సంక్షేమం కోసం కాక, తన వ్యక్తిత్వ వికాసానికే వుపయోగించాడు. రాజుకోసమే రాజ్యం అన్నట్లు ప్రవర్తించేవాడు. తాతగారి ఔదార్యం ఇతనిలో ఎక్కడా కన్పించదు. కాని తండ్రిలాగా భోగలాలసుడు, విలాసజీవి కాదు. రాజ్య వ్యవహారాలపై కడు శ్రద్ధ చూపించేవాడు. రాజపుత్రుల మైత్రిని నిలబెట్టుకొన్నాడు. ఇతని పొరుగు రాజ్యాలతో స్నేహాన్ని పెంపొందించుకున్నాడు. విదేశీ రాయబారులను ఆహ్వానించాడు. తండ్రిలాగ కాక ఏకపత్నీవ్రతుడు. భార్య వియోగాన్ని భరించలేక తాజ్‌మహల్‌ని సృష్టించిన ప్రేమైక జీవి.

## మాదిరి ప్రశ్నలు :

## ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు వ్రాయుము.

1. మొగలు చరిత్రలో షాజహాను యుగమును స్వర్ణయుగముగా ఎందుకు పరిగణింతురు ?
2. మొగలు చరిత్రలో షాజహాను స్థానమును పేర్కొనుము ?
3. షాజహాను దక్కను విధానమును వివరింపుము ?
4. మొగలు సామ్రాజ్య విస్తరణకు షాజహాను చేసిన యుద్ధములను పేర్కొనుము
5. షాజహాను అహమ్మద్‌నగర దండయాత్రలను వివరింపుము.
6. షాజహాను మధ్య ఆసియా దండయాత్రలు
7. 'షాజహాను పరిపాలన కాలం మొగలు సామ్రాజ్య పతనానికి నాంది' - చర్చించుము.

## చదువదగిన గ్రంథాలు :

1. బెర్నియార్ - మొగలు సామ్రాజ్యంలో యాత్రలు
2. ఆర్.పి. త్రిపాఠి - మొగలు సామ్రాజ్య స్థాపన - పతనం
3. తెలుగు అకాడమి - భారతదేశ చరిత్ర 1524 నుండి 1964 వరకు
4. వి.డి. మహజన్ - ఇండియాలో ముస్లింపాలన
5. డా. ఎ.ఎల్. శ్రీవాత్సవ - మొగలు సామ్రాజ్యము
6. ఆర్.సి. ముజుందార్ - భారతదేశ సంస్కృతి - చరిత్ర
7. బి.ఎస్.ఎల్. హనుమంతరావు, కె. బసవేశ్వరరావు - భారతదేశ సంస్కృతి - చరిత్ర Vol. II : 1206 నుండి 1761 వరకు

పాఠము - 7.

# ఔరంగజేబు

విషయసూచిక

7.0 లక్ష్యం
7.1 ఉపోద్ఘాతము
7.2 బాల్యము - విద్యాభ్యాసం
7.3 వారసత్వ యుద్ధాలు
7.4 పట్టాభిషేకం
7.5 తొలి సంస్కరణలు
7.6 తిరుగుబాట్లు
ఎ) జాట్‌లు
బి) సత్‌నామీలు
సి) శిక్కులు
డి) రాజపుత్రులు - మార్వారు - మేవారు
7.7 అక్బరు రాకుమారుడి తిరుగుబాటు
7.8 ఉత్తరదేశ దండయాత్రలు
7.9 దక్షిణదేశ దండయాత్రలు - మహారాష్ట్రులు - బీజపూరు - గోల్కొండ
7.10 ఆంగ్లేయులు
7.11 రాజ్య విస్తరణ
7.12 ముగింపు

## 7.0 లక్ష్యం :

మొగలు సార్వభౌమాధికారాన్ని భారతదేశమంతటా విస్తరించటానికి ఔరంగజేబు అనుసరించిన విధానాన్ని వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం. ఔరంగజేబు యొక్క భయంకరమైన వారసత్వ యుద్ధాలు, దండయాత్రలు హిందూ వ్యతిరేకత ఈ పాఠంలో వివరించబడినది.

## 7.1 ఉపోద్ఘాతము :

భారతదేశమంతటా మొగలు సామ్రాజ్యాధికారాన్ని విస్తరించినవాడు ఔరంగజేబు. జాధూనాధ్ సర్కార్ ఔరంగజేబు చరిత్రే ఆనాటి భారతదేశ చరిత్రని, షుమారు అర్థశతాబ్దం పరిపాలించిన ఇతని పరిపాలనా కాలం భారతదేశ చరిత్రలోనే ప్రధాన ఘట్టమని వర్ణించాడు.

## 7.2 బాల్యము - విద్యాభ్యాసం :

షాజహాను తిరుగుబాటు సందర్భముగా ఉజ్జయినీ సమీపములో దోహర్ అనుచోట ఔరంగజేబు 1618 నవంబరు 3న జన్మించాడు. తండ్రితో అంగీకారానికి వచ్చి షాజహాను హామీగా తన పిల్లలను నూర్జహాను సంరక్షణలో ఉంచాడు. ఔరంగజేబు పసితనం నుంచి తల్లిదండ్రుల ప్రేమకు కరువై నూర్జహాను వద్ద కఠినంగా పెంచబడ్డాడు. సరైన విద్యను కూడా నేర్వలేదు. సైనిక శిక్షణలో మాత్రమే నైపుణ్యం సాధించాడు. మిగిలిన విద్యల పట్ల ఆసక్తి కనపరచలేదు. లలితకళలపట్ల మక్కువలేదు. ఖురాన్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. కేవలం మత విద్యే ఇతనికి అబ్బింది.

షాజహాను కాలంలో ఎన్నో ఉన్నత పదవులను నిర్వహించి పాలనానుభవాన్ని పొందాడు. చిన్నప్పుడే ఏనుగులతో పోరాడి బహదూర్ అనే బిరుదును పొందాడు. 1634లో మన్సబ్‌దార్ అయ్యాడు. దక్కను గవర్నరుగా నియమించబడ్డాడు. అక్కడ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి పాలనాదక్షుడిగా పేరుపొందాడు. అనేక యుద్ధాలలో పాల్గొని గొప్ప వీరుడిగా ప్రసిద్ధికెక్కాడు.

## 7.3 వారసత్వ యుద్ధం :

ముంతాజ్‌బేగంకు 14 మంది సంతానం. అందులో దారాషికో, షాషుజా, ఔరంగజేబు, మురాద్‌బక్షి అనే నల్గురు కుమారులు, జహానారా, రోషనారా, గౌహర్‌లు అనే ముగ్గురు కుమార్తెలు జీవించారు. అందరిలోని పెద్ద దారా. చిన్నవాడు మురాద్. నూర్జహాను శిక్షణలో పెరిగిన ఔరంగజేబు చిన్నప్పటినుండి కాఠిన్యానికి అలవాటుపడ్డాడు. సోదరీ సోదరులపట్ల ఎటువంటి అభిమానము లేదు. ఒక్క రోషనారా ఔరంగజేబు నిష్టపడేది. తండ్రి అన్నా అతనికి సదభిప్రాయం ఉండేది కాదు. షాజహాను తాను అస్వస్థుడుగా నున్నప్పుడే దారాను యువరాజుగా ప్రకటించాడు. తండ్రి జబ్బుపడగానే నల్గురు సోదరులు ఆగర్భశత్రువులుగా ప్రవర్తించారు. మొగలు వంశ చరిత్రలోనే ఈ వారసత్వ యుద్ధం అత్యంత భయంకరమైనది, హేయమైనది.

### 7.3.1 దారషుకో :

ఇతను 1614 మార్చి 23న అజ్మీరులో జన్మించాడు. బహుమేధాసంపత్తిగలవాడు. సరళ స్వభావుడు. హిందువులును, క్రైస్తవులను ఆదరించాడు. గొప్ప పండితుడు. అనేక సంస్కృత గ్రంథాలను, పారశీకములోకి, అరబ్బీలోకి అనువదించాడు. తండ్రికి పరిపాలనలో సహాయపడి ఇష్టుడిగా మారాడు. ఆ కారణంచేత మిగిలిన సోదరులితనిని ద్వేషించారు. తనను గురించి గొప్పగా ఆలోచించేవాడని ఏపనైనా చేయగల సామర్థ్యం తనకుందని భావించేవాడని బెర్నియర్ వ్రాశాడు.

షాజహాను అనారోగ్య వార్త వినగానే స్వతంత్రం ప్రకటించుకున్నాడు. దక్కను, గుజరాత్‌ల నుండి వస్తున్న సోదరుల నెదుర్కొనటానికి జస్వంత్‌సింగ్‌ను పంపాడు. బెంగాలులో స్వాతంత్ర్యం ప్రకటించుకొన్న షాజహాను ఎదుర్కొనటానికి తన పెద్దకొడుకు సులేమాన్ షుకోను పంపాడు. 1658 ఏప్రియల్ 15న ధర్మాత్ యుద్ధంలో జస్వంత్‌సింగ్ ఓడిపోయి పారిపోయాడు. ఈలోగా ఔరంగజేబు సేనలు సమూఘర్ చేరుకున్నాయి. దారా స్వయంగా తమ్ముణ్ణి ఎదుర్కొన్నాడు. సమూఘర్ యుద్ధంలో రాజపుత్రులు ప్రముఖ పాత్ర వహించారు. దారా స్వయంగా సైన్య మధ్య భాగానికి నాయకత్వం వహించాడు. ఈ లోపల సులేమాన్ షుకో షాషుజాను వోడించిన వార్త వచ్చింది. దారా, సులేమాన్‌ను సైన్యంతో రావలసినదిగా కోరాడు కాని సులేమాన్ రాకుండానే యుద్ధాన్ని ప్రారంభించాడు. రాజపుత్రుల పరాక్రమం కూడా ఉపయోగం లేకుండాపోయింది. దారా ఏనుగు దిగి గుర్రం ఎక్కడం వలన రాజు కనపడక సైన్యం చెల్లాచెదరైంది. దారా చేసేదేమీ లేక ఆగ్రా పారిపోయాడు. తర్వాత అనేక కష్టాలపాలై ఆఫ్ఘనిస్థాన్ బయలుదేరి మాలిక్ జీవన్ అనే బెలూచీ నాయకుని వద్ద విశ్రాంతి కోసం ఆగాడు. ఇక్కడే భార్య మరణించింది. మాలిక్‌జీవన్ దారాను ఔరంగజేబుకు అప్పజెప్పినాడు. ఔరంగజేబు దారాకు మరణశిక్ష విధించాడు. మరణశిక్ష అమలు పరిచేవేళ వేలాది ప్రజలు, స్త్రీలు, పురుషులు, వృద్ధులు అంతా వెక్కివెక్కి ఏడ్చారని బెర్నియర్ వ్రాశాడు. అలాగే సులేమాన్ షుకోను కూడా చంపేయడం జరిగింది.

## 7.3.2 షాషుజా :

ఇతను షాజహాను రెండవ కుమారుడు. తెలివైనవాడు. పట్టుదల కలవాడు. కాని భోగలాలసుడు. దర్బారులో పర్షియన్‌లు ఎక్కువమంది ఉండటం వలన పర్షియన్ భాషను రాజభాష చేశాడు. షియా మతాన్ని అభిమానించాడు. ఈవిధంగా ఎంతోమంది అభిమానాన్ని సంపాయించాడు. కాని బెంగాలు గవర్నరుగా నియమించబడిన తర్వాత పరిపాలనను నిర్లక్ష్యం చేశాడు. తండ్రి అనారోగ్యం విని బెంగాలులో తనను చక్రవర్తిగా ప్రకటించుకొని, రాజధాని బయలుదేరాడు. దారిలో బహదూర్‌పూర్ వద్ద సులేమాన్ షుకో చేతిలో ఓడిపోయి ఔరంగజేబుతో చేరాడు. ఢిల్లీ ఆక్రమించగానే ఔరంగజేబు షాషుజాను ఎదుర్కొన్నాడు. షాషుజా ఓడిపోయి బర్మా పారిపోయి అక్కడే మరణించాడు.

## 7.3.3. మురాద్ బక్ష్ :

షాజహాను సంతానంలో చివరివాడు. తెలివితేటలున్నాయి కాని వివేకం లేదు. అసమర్థుడు. రాజకీయాలంటే ఇష్టం లేదు. అతనిలో రహస్యం ఎంతమాత్రం దాగదు. యుద్ధాలలో సాహసాన్ని ప్రదర్శించేవాడు. తండ్రి అనారోగ్యవార్త విని స్వతంత్రాన్ని ప్రకటించుకొన్నాడు తర్వాత ఔరంగజేబుతో చేరి అతనికి సహాయపడ్డాడు. ఔరంగజేబు ఢిల్లీ ఆక్రమించిన తర్వాత అతని చేతిలోనే దుర్మరణం పాలైనాడు.

## 7.3.4 ఔరంగజేబు :

ఔరంగజేబు తండ్రి అనారోగ్యవార్తకు ఏవిధంగాను చలించలేదు. దారా హిందూమతాభిమాని కాబట్టి రాజ్యార్హత లేదని, అందుకు తగినవాడు మురాద్ అని మురాద్‌కు చెప్పాడు. తనకు సింహాసనంపై ఎటువంటి కోరికలేదని మురాద్‌ని నమ్మించాడు. షాషుజాకు కూడా ఇదేవిధంగా తెలియజేశాడు. తన సైన్యంతో సహాయం చేస్తానని, ఇరువురినీ రమ్మని వర్తమానం పంపాడు. వారి సహాయంతో సమూఘర్ యుద్ధంలో దారాను ఓడించాడు. తర్వాత మురాద్‌ని, షాషుజాని కూడా హతమార్చాడు.

ఈ యుద్ధం ఔరంగజేబు ప్రతిష్ట పెంచింది. దారా వారసత్వం ఆశించాడు కాని తగిన సన్నాహాలు చేయలేదు. ఔరంగజేబు ఒకవైపు సింహాసనంపై కోరికలేదని చెప్తూనే తగిన ఏర్పాట్లు చేసికొన్నాడు. ధర్మాత్, సమూఘర్ యుద్ధాలు మొగలు వారసుణ్ణి నిర్ణయించడమే కాక, భారతదేశ చరిత్రగతినే మార్చివేశాయి.

## 7.4 పట్టాభిషేకము :

సమూఘర్ విజయం తర్వాత ఔరంగజేబు ఆగ్రా చేరుకొని తండ్రిని బంధించి 1658 జులై 31న పట్టాభిషేకం చేసికొన్నాడు. శత్రువులను నాశనం చేశాక శాస్త్రబద్ధంగా 1639 మే, 15న నెమలి సింహాసనాన్ని "అబుల్ ముజఫర్, బహదూర్, అలంఫీర్, పాదుషాఘాజీ" అనే బిరుదుతో అధిష్టించాడు. 50 సంవత్సరాలపాటు మొగలు రాజ్యాన్ని పరిపాలించి మొగలు సార్వభౌమాధికారాన్ని భారతదేశంలో నెలకొల్పాడు. ఇతని కాలంలో మొగలు సరిహద్దులు ఘజనీ నుండి చిటగాంగ్ వరకు, కాశ్మీరు నుండి కర్ణాటక వరకు విస్తరించాయి.

## 7.5 తొలి సంస్కరణలు :

వారసత్వ యుద్ధాల వలన రాజ్య ఆదాయం తగ్గింది. వాణిజ్యం, పరిశ్రమలు దెబ్బతిన్నాయి. యుద్ధకాలంలో రైతుల పంటలు నాశనమయ్యాయి. రైతులను ఆదుకునేందుకు 14 రకాల పన్నులను తగ్గించాడని కాఫీఖాన్ వ్రాశాడు.

తన పూర్వీకులంతా ఇస్లాంను వదిలివేశారని భావించి రాజ్యాన్ని ఇస్లాం రాజ్యంగా ప్రకటించాడు. ఖురాన్ ప్రకారం విగ్రహారాధనను అణచివేయాలని జీహాద్ ప్రకటించాలని భావించాడు. హిందువులను అణచటానికి అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాడు.

ఔరంగజేబు సున్నీ మతస్థుడు. మొదట సున్నీ మతేతర సాంప్రదాయాలను రద్దుచేశాడు. నాణాల మీద 'కలీమా' మత సూక్తులను ముద్రించటం ఆపేశాడు. పర్షియా సంవత్సరాదిని నౌరోజ్ పండుగను హిందూ పండుగలను బహిష్కరించాడు. తులాపురుష దానాలను 'ఝు రోకాదర్శన్' లను నిలిపివేశాడు. మూఢాచారాలు హిందూమతానికి చెందినవనే వుద్దేశ్యంతో జాతక, సాముద్రిక శాస్త్రవేత్తలను దర్బారు నుండి తొలగించాడు. సంగీత విద్వాంసులను, నాట్యకత్తెలను బహిష్కరించాడు.

చక్రవర్తి కాక పూర్వమే అనేక హిందూ దేవాలయాలను పడగొట్టించాడు. పట్టాభిషేకానంతరము 1659 మార్చిలో కాశీ నుండి ఒక ఫర్మానా జారీచేశాడు. దీని ప్రకారం క్రొత్తదేవాలయాలను నిర్మించకూడదు. ఆ తర్వాత పాతవాటిని బాగు చేయించరాదని ఆజ్ఞాపించాడు. 5 శాతం దిగుమతి సుంకాన్ని హిందువుల మీద విధించాడు. 1669 ఏప్రియల్ 19న హిందూ దేవాలయాలు, పాఠశాలలు పడగొట్టాలని ఇంకొక ఫర్మానా విడుదల చేశాడు. దీని ప్రకారం కాశీలో విశ్వేశ్వర ఆలయాన్ని, గుజరాత్‌లో సోమనాధ దేవాలయాన్ని, మధురలో కేశవాలయాన్ని పడగొట్టించాడు. రాజస్థాన్‌లో 239 దేవాలయాలనూ, ఒక్క జయపూర్‌లోనే 66 దేవాలయాలను పడగొట్టించాడు. 1631లో ఖాల్సా భూముల నుండి హిందువులను తొలగించాడు.

అక్బరు నిషేదించిన జిజియాను హిందువులపై తిరిగి విధించాడు. ప్రయాణాలలో హిందువులు పల్లకీని, ఏనుగును, గుర్రాన్ని ఉపయోగించడంపై ఆంక్షలు విధించాడు. హిందూసంతలు జాతరలు, తిరునాళ్ళను నిషేదించాడు. ఇస్లాం మతం స్వీకరించిన హిందువులను ప్రభుత్వోద్యోగాలలో నియమించాడు.

**ఫలితాలు :**

ఈ సంస్కరణల వల్ల ఔరంగజేబు హిందూ వ్యతిరేకతేకాకుండా షియా, శిక్కుల అభిమానాన్ని కూడా కోల్పోయాడు. అప్పటివరకు మొగలు విస్తరణలో ప్రముఖ పాత్ర వహించిన రాజపుత్రులు ప్రబల విరోధులయ్యారు. హిందూమతోద్ధరణ కోసం దక్కనులో మహారాష్ట్రులు, శిక్కులు, జాటులు, సత్నామీలు తిరుగుబాట్లు చేశారు.

## 7.6 తిరుగుబాట్లు :

### 7.6.1 జాటులు (1668 - 1689) :

వీరు మధుర ప్రాంతంలో జీవించేవారు. ఔరంగజేబు హిందూ వ్యతిరేక చర్యల ఫలితంగా ఇక్కడి అధికారులు దేవాలయాలను పడగొట్టించడమే కాకుండా, హిందూ స్త్రీలను చెరపట్టారు. జాట్‌లు, గోకుల్‌దాసు నాయకత్వంలో ముస్లిం అధికారి అబ్దుల్ నబీని ఎదుర్కొన్నారు. ముస్లింలు గోకుల్‌ని బంధించి బలవంతంగా ఇస్లాం ఇప్పించి ఈ తర్వాత చంపేశారు. జాట్‌లు గోకుల్ వధతో పోరాటాన్ని తీవ్రం చేశారు. మట్టికోటలు కట్టుకొని ముస్లింలతో పోరాడారు. సికింద్రాలోని అక్బరు మసీదును కొల్లగొట్టారు. ఔరంగజేబు తన మనవడు బీదర్‌భక్త్, అంబరు రాజు బిషన్ సింగ్‌లను పంపాడు. సిన్‌సానీ దగ్గర జరిగిన యుద్ధంలో 1800 జాట్‌లు మరణించారు. దీనితో జాట్‌ల తిరుగుబాటు అణిగిపోయింది.

### 7.6.2 సత్‌నామీలు 1672 :

సత్‌నామీలు మేవాడ్, నార్నాడ్ ప్రాంతాలలో నివసించేవారు. వీరికి 'ముండియా'లు అనికూడా పేరుంది. వ్యవసాయం వీరి ముఖ్యవృత్తి. ఆధ్యాత్మిక చింతన గలవారు. అనవసర విషయాలలో జోక్యం చేసికొనేవారుకాదు. 1672లో ఒక సత్‌నామీకి మొగల్ సైనికుడికి మధ్య వచ్చిన ఘర్షణ తిరుగుబాటుకు దారితీసింది. ఒక సత్‌నామీని మొగలు సైనికుడు కొట్టగా, అంతా కలసి ఆ సైనికుణ్ణికొట్టి నార్నాల్ ఫౌజుదారీని ముట్టడించారు. ఔరంగజేబు సైన్యాన్ని పంపి ఈ విప్లవాన్ని అణిచివేశాడు.

### 7.6.3 శిక్కులు 1670 - 1675 :

శిక్కు గురువులు హరరాయ్, హరకిషన్, తేజ్‌బహదూర్, గోవింద్‌సింగులు ఔరంగజేబుకు సమకాలీనులు. చివరి ఇద్దరు గురువులతో ఔరంగజేబు తగాదాకు దిగటం జరిగింది.

9వ గురువైన తేజబహదూరు 6వ శిక్కు గురువు హరగోవిందసింగు కుమారుడు. ఆనందపూర్ ఇతని నివాసము. ఔరంగజేబు మతవిధానాన్ని నిరసించి, శిక్కులను, హిందువులను చక్రవర్తిని వ్యతిరేకించవలసిందిగా ప్రోత్సహించాడు. ఔరంగజేబు ఇందుకు కోపగించి తేజ్‌బహదూర్‌ను ఢిల్లీ రప్పించి, ఇస్లాం మతం స్వీకరించవలసిందిగా నిర్బంధించాడు. నిరాకరించినందుకు అనేక చిత్రహింసలకు గురిచేసి చివరకు 1675లో శిరచ్ఛేదం జేయటం జరిగింది.

గోవిందసింగ్ తేజ్‌బహదూర్ కుమారుడు. శిక్కు గురువులలో చివరివాడు. ఇతను శిక్కుల జీవన విధానాన్ని మార్చివేసి గొప్ప సైనికులుగా తీర్చిదిద్దాడు. మొగలులను ఎదుర్కొను సైన్యాన్ని తయారు చేశాడు. వారితో నిరంతరం పోరాడాడు. ఈ యుద్ధాలలో కుమారులను ఆనందపూర్‌ను కోల్పోయాడు. చివరకు దక్కను పారిపోయి ఒక ఆఫ్ఘన్ చేతిలో మరణించాడు.

### 7.6.4 రాజపుత్రులు :

అక్బరు కాలం నుండి రాజపుత్రులు మొగలు రాజ్యానికి ఉక్కు కవచంలాగా రక్షణగా వున్నారు. ఔరంగజేబు మతవిధానం, జిజియా పన్ను విధింపు, దేవాలయ నిర్మూలన, ఈ చర్యలు రాజపుత్రులను ప్రబల విరోధులుగా మార్చివేశాయి. అక్బరు రాకుమారుణ్ణి తండ్రిమీద తిరుగుబాటుకు ప్రోత్సహించారు. రాజపుత్రులను అణిచివేయాలని ఔరంగజేబు నిశ్చయించుకొని ప్రధానపాత్ర వహించిన మార్వార్ మేవార్ రాజ్యాలను నిర్మూలించటానికి పూనుకున్నాడు.

#### 7.6.4.1 మార్వార్ :

మార్వార్‌కు భౌగోళికతంగా చాలా ప్రాధాన్యత వుంది. ఢిల్లీ నుండి పశ్చిమ తీరానికి వెళ్ళే రహదార్లన్నీ మార్వార్ మీది నుంచి వెళ్ళాలి. అందుకని దీనిని ఆక్రమించాలని పూనుకున్నాడు. మార్వార్ రాజు జస్వంత్‌సింగ్. వారసత్వ యుద్ధాలలో దారాపట్ల సానుభూతి చూపెట్టాడు. అలాగని ఔరంగజేబు బలవంతుడైన జస్వంత్‌ను శత్రువుగా చేసికోలేకపోయాడు. 1678 డిసెంబరు 20న జస్వంత్‌సింగ్ హఠాత్తుగా మరణించాడు. అతనికి ఇంకా సంతానం లేదు. ఔరంగజేబు వెంటనే మార్వారుని స్వాధీనపరచుకొని, జస్వంత్ మేనల్లుడు ఇంద్రసింగ్ నుండి 36 లక్షలు వసూలు చేసి అతనిని జోధపూరు రాజుగా గుర్తించాడు. ఈ లోపల జస్వంత్ భార్యలు ఇరువురు మగబిడ్డలను ప్రసవించారు. ఒకడు మరణించగా అజిత్‌సింగ్ జీవించాడు. రాజపుత్రులు అజిత్‌సింగ్‌నువారసుడిగా గుర్తించి రాజ్యాన్ని ఇవ్వవలసిందిగా ఔరంగజేబును కోరారు. ఔరంగ్‌జేబు జస్వంత్ భార్యాబిడ్డలను ఖైదుచేశాడు. రాజపుత్రులు దుర్గాదాసు నాయకత్వంలో మొగలులను వ్యతిరేకించారు. దుర్గాదాసు గొప్ప మేధావి - వీరుడు. 25 సంవత్సరములపాటు మొగలులతో పోరాడాడు.

### పుష్కర యుద్ధము 1679 :

ఢిల్లీలో బంధింపబడిన జస్వంత్ భార్యాబిడ్డలను నూర్‌ఘర్‌కు పంపే సందర్భముగా దుర్గాదాసు వీరిని రక్షించటానికి పూనుకున్నాడు. సైన్యాన్ని రెండు భాగాలుచేసి రఘునాథ్ భట్ నాయకత్వంలో కొంత సైన్యాన్ని దారి మధ్యలో వుంచి తాను మాత్రం మొగలు సైన్యాన్ని రహస్యంగా వెంటాడాడు. దుర్గాదాసు ఎలాగో రాణులను చేరుకొని వారికి మగదుస్తులు వేసి బాలునితోసహా బయటపడ్డాడు. ఈ వార్త తెల్సికొని చక్రవర్తి కోపితుడై నిజమైన రాణులు తనవద్దే బందీగా వున్నారని ప్రచారం చేశాడు. పెద్ద సైన్యాన్ని మార్వారు పంపాడు. రాజపుత్ర సైన్యానికి మొగల్ సైన్యానికి మధ్య పుష్కర్ దగ్గర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో రాజపుత్రులు ఓడిపోయారు. ఔరంగజేబు మార్వారును ఆక్రమించుకొని అక్బరు రాకుమారుణ్ణి తన ప్రతినిధిగా నిలిపాడు. ఓడిపోయిన రాజపుత్రులు ఔరంగజేబు జీవితకాలమంతా పోరాడుతూనే వున్నారు.

### 7.6.4.2 మేవారు :

అజిత్‌సింగ్ తల్లి సిసోదియా వంశ స్త్రీ. సిసోదియా రాజు రాజ్‌సింగ్ మేనకోడలు. ఆమె మొగలులకు వ్యతిరేకంగా రాజ్‌సింగ్ సహాయాన్ని కోరింది. ఔరంగజేబు హిందూవ్యతిరేకత, జిజియా విధింపుల వలన అసంతృప్తుడైన రాజ్‌సింగ్ ఆమెకు సహాయం చేయటానికి అంగీకరించాడు.

### ఉదయ్‌పూర్ యుద్ధం 1680 :

ఔరంగజేబు సైన్యాన్ని సమకూర్చుకొని 1680 ఫిబ్రవరి 1న మేవారు చేరాడు. ఫిరంగి దళాన్ని ఐరోపావారి ఆధీనంలో వుంచాడు. ఉదయపూర్ వద్ద జరిగిన యుద్ధంలో రాజ్‌సింగ్ ఓడిపోయాడు. మొగలు సైన్యం చిత్తోడ్, ఉదయపూరులను నాశనం చేసి, దేవాలయాలను నేలమట్టం చేశాయి. మేవారును అక్బరు రాకుమారుడికి అప్పజెప్పాడు.

రాజపుత్రులు యుద్ధం ఆపకుండా మెరుపు దాడులు నిర్వహించారు. మొగలు సైన్యం ఆ దాడులను ఆపలేకపోయింది. మరొక వైపు ఆహార పదార్థాల సరఫరా ఆగిపోయింది. చక్రవర్తి అక్బరును తొలగించి ఆజం, మౌజం, రాకుమారులను తన ప్రతినిధులుగా నిలిపాడు.

### 7.7. అక్బరు తిరుగుబాటు 1681 :

రాజపుత్రుల పరాక్రమము అక్బరును ఆకర్షించాయి. తనను తొలగించి తన సోదరులను ప్రతినిధులుగా పంపటం అవమానంగా భావించాడు. రాజపుత్రుల సహాయం అర్థించి తిరుగుబాటుకు పూనుకున్నాడు. తహ్వర్‌ఖాన్ మధ్యవర్తిత్వంతో వారి మైత్రి పొంది 1681 జనవరి 11న తనను చక్రవర్తిగా ప్రకటించుకున్నాడు. రాజపుత్రులు సంధికోరుతున్నారని చక్రవర్తిని దర్శించటం కోసం వారితో కూడా బయలుదేరుతున్నానని చక్రవర్తికి వర్తమానం పంపాడు. అక్బరు చర్యలను గూఢచారుల ద్వారా తెలిసికొంటూనే వున్నాడు. మోసంతో అక్బరును లొంగదీసుకోవాలని తానుకూడా నమ్మినట్లు ప్రవర్తించాడు. తర్వాత నెమ్మదిగా రాజపుత్రులను అక్బరు నుండి వేరుచేశాడు. అక్బరు మీద రాజపుత్రులకు లేనిపోనివి ప్రచారం చేయించాడు. రాజపుత్రులు కోపంతో అక్బరు శిబిరం వదలి వెళ్ళిపోయారు. తెల్లవారేటప్పటికి 350 సైనికులతో అక్బరు మిగిలాడు. భార్యాపిల్లలు చక్రవర్తికి బందీలయ్యారు. నిజం తెలిసికొన్న దుర్గాదాసు చింతించి అక్బరును రక్షించి మహారాష్ట్రరాజు శంభాజీ దగ్గరకు పంపాడు. అక్కడి నుండి పర్షియా వెళ్ళి అక్కడే 1704లో మరణించాడు.

### 7.8 ఉత్తరదేశ దండయాత్రలు :

### 7.8.1 అస్సాం :

ఇచ్చట ప్రజలను 'ఆహోం'లు అంటారు. మంగోలాయిడ్ జాతికి చెందినవారు. 1639లో వీరికి బెంగాలు రాష్ట్ర గవర్నరుతో విభేదాలు ఏర్పడ్డాయి. 1658లో గౌహతిని ముట్టడించి 140 ఏనుగులను, 40 ఫిరంగులను కొంతధనాన్ని దొంగిలించారు. చక్రవర్తి వీరిని అణచటానికి మీర్‌జుమ్లాను పంపాడు. మీర్ జుమ్లా పర్షియా దేశస్థుడు. గోల్కొండ చేరుకొని తన శక్తిసామర్థ్యాలతో డబ్బు సంపాయించి దర్బారులో వున్నతోద్యోగాన్ని పొందాడు. స్వంత జాగీరును ఏర్పరచుకొన్నాడు. 1661లో మీర్‌జుమ్లా అస్సాంపై దండెత్తి కుచ్ బీహారు అస్సాంలను ఆక్రమించాడు. అస్సాం నుండి తిరిగి వస్తూ దారిలో మరణించాడు. అప్పుణ్ణి ప్రమాదకర స్నేహితుణ్ణి కోల్పోయానని ఔరంగజేబు చెప్పుకున్నాడు. ఆహోంలు 1666లో మరొకసారి దాడిచేసి బెంగాలు గవర్నరు షాయిస్థఖాన్ చేతిలో ఓడిపోయారు.

### 7.8.2 చిటగాంగ్ :

బెంగాలు రాష్ట్ర సరిహద్దుల్లో 'మాఘులు' అనే బర్మా జాతివారున్నారు. వీరు సముద్రపు దొంగలు. వీరిని అరికట్టటానికి ఔరంగజేబు షాయిస్థఖాన్‌ని పంపాడు. షాయిస్థఖాన్ 1666లో చిటగాంగ్‌ను ఆక్రమించి దానిని ఇస్లామాబాద్‌గా పేరు మార్చాడు.

### 7.8.3 ఆఫ్ఘన్ల తిరుగుబాటు :

ఆఫ్ఘన్లు వాయువ్య ప్రాంతంలో నివసించేవారు. వీరు నివసించే ప్రాంతం కొండప్రాంతం. అందుకని దారిదోపిడీలు చేసి బ్రతికేవారు. ప్రభుత్వాధికారాన్ని లెఖ్ఖచేసేవారుకాదు. వీరిని గెలవటం కష్టమని ఔరంగజేబు వీరికి లంచం ఇచ్చి సంతృప్తిపరచేవాడు. కాని ఆఫ్ఘన్లు ఆ డబ్బు చాలక మొగలు ప్రాంతాలను తరచూ కొల్లగొట్టేవారు. మొదటి 'భగు' లనే తెగవారిని మొగలు సేనానులు అదుపులోకి తీసికొచ్చారు. తర్వాత అఫ్రిడీలనే తెగవారు అక్మల్‌ఖాన్ నాయకత్వంలో స్వతంత్రం ప్రకటించుకొన్నారు. చక్రవర్తి స్వయంగా జోక్యం చేసికొని దౌత్యం ద్వారా వీరిని లొంగతీసికొన్నాడు.

## 7.9 దక్షిణదేశ దండయాత్రలు 1681 - 1707 :

అఖిల భారత సామ్రాజ్యం స్థాపించాలనే కోరికతో ఔరంగజేబు దక్కను రాజులతో రెండు దశలలో యుద్ధం చేశాడు. మొదటి దశ 1660 - 65 మధ్య జరిగింది. దీనిలో మొగలు సేనానులే పాల్గొన్నారు. రెండవదశ 1681 నుండి ప్రారంభమైంది. ఈసారి చక్రవర్తే స్వయంగా పాల్గొన్నాడు. చక్రవర్తి దాదాపు 25 సంవత్సరములు దక్కనులో గడిపాడు. రాజధానిని వదలి 25 సంవత్సరములు దక్కనులో గడిపినా సాధించినది స్వల్పమని చరిత్రకారులు అభిప్రాయబడ్డారు. మహారాష్ట్ర రాజ్యాన్ని నిర్మూలించాలని గోల్కొండ, బీజపూరులను ఆక్రమించాలని చక్రవర్తి పథకం.

### 7.9.1 మహారాష్ట్రులు :

ఔరంగజేబు హిందూవ్యతిరేక విధానం మహారాష్ట్రలో శివాజీ ఆధ్వర్యంలో హిందూరాజ్య స్థాపనకు దారితీసింది. ఔరంగజేబు సింహాసనంకు రావటం శివాజీ స్వాతంత్ర్య సమరం ఇంచుమించూ ఒకేసారి జరిగింది. శివాజీ పశ్చిమ తీరంలో సూరత్ నుండి కొంకణ్ వరకు, దక్షిణాన తుంగభద్ర వరకు తూర్పుకోస్తాలో జింజి, తంజావూర్ వరకు తెలంగాణాలో చాలభాగం ఆక్రమించి స్వతంత్ర మహారాష్ట్ర రాజ్యాన్ని స్థాపించాడు.

చక్రవర్తి మహారాష్ట్రులతో చేసిన యుద్ధాలు మూడు దశలలో వర్ణించవచ్చు. 1660 నుంచి 65 వరకు శివాజీతో చేసిన యుద్ధాలలో ఔరంగజేబు ఏవిధంగానూ విజయాన్ని సాధించలేకపోయాడు. 1691 - 89 వరకు శంభాజీతో జరిగిన యుద్ధంలో ఔరంగజేబు ఘనవిజయాన్ని సాధించాడు. అక్బరు రాకుమారుడికి ఆశ్రయం ఇచ్చాడన్న నెపంమీద శంభాజీని ఘోరంగా చంపించాడు. 1689 - 1707 మధ్య జరిగిన యుద్ధాలలో శంభాజీ వారసులను ఎదుర్కొన్నాడు. శంభాజీ కుమారుడైన రాజారామ్‌తోనూ, అతని తర్వాత తారాభాయి మొదలగు మహారాష్ట్ర యోధులతో యుద్ధాలు చేశాడు. ఈ యోధులను ఎదుర్కొనలేక మొగలాయీలూ అనేక అవస్థల పాలయినారు. మొగల్ సేనాని జుల్ఫికర్‌ఖాన్, రాజారాంను పట్టుకొనడానికి రెండుసార్లు తంజావూరును ముట్టడించాడు కాని విఫలమయ్యాడు. ఈ విధంగా మహారాష్ట్రులను ఔరంగజేబు ఎదుర్కొనలేక నిరాశ నిస్పృహలకు లోనయినాడు.

ఔరంగజేబు హిందూమతస్థులనే కాకుండా షియాలను కూడా ద్వేషించాడు. అందువలన దక్కనులో బీజపూరు గోల్కొండ రాజ్యాలను ఆక్రమించటానికి పూనుకున్నాడు. ఇది ఔరంగజేబు చేసిన పొరపాట్లలో ఒకటి అని, వీరి సహాయం తీసికొనివున్నట్లయితే మహారాష్ట్రలో శివాజీని ఓడించగలిగివుండేవాడని చరిత్రకారులు వ్రాశారు. కాని జాదూనాథ సర్కారు అవసాన దశలో వున్న బీజపూరు, గోల్కొండ ఔరంగజేబు ఎటువంటి సహాయంచేయలేదని కాబట్టి దక్కను రాజ్యవ్యవహారాలలో చక్రవర్తి ప్రవర్తన సరైందని భావించాడు.

### 7.9.2 బీజపూర్ ఆక్రమణ 1686 :

1672లో ఆలీ ఆదిల్ షా మరణించాడు. తరువాత వచ్చిన సికిందర్‌షా చిన్నవాడు కావటం వలన మంత్రులు రాజప్రతినిధులుగా నున్నారు. కాని వీరు స్వార్థపరులు. అవినీతిపరులు. దేశపరిస్థితులన్నీ క్షీణించాయి. 1684లో మౌజం, ఆజంల ఆధ్వర్యంలో మొదటి దండయాత్ర జరిగింది. 2 సంవత్సరాల పోరాటం తర్వాత రాకుమారులు బీజపూరు కోటను స్వాధీనపరచుకొన్నారు. సికిందర్ షాకు సాలుకు రెండు లక్షల రూపాయల భరణమేర్పాటు చేశాడు.

### 7.9.3 గోల్కొండ 1685 - 87 :

కుతుబ్ షాహీ వంశంలో అబుల్‌హసన్ తానీషా ఆఖరి ప్రభువు. షియా మతస్థుడు. హిందువులను కూడా ఆదరించేవాడు. హిందువులను ద్వేషించే ఔరంగజేబుకు తానీషా విధానం కోపాన్ని కలిగించింది. మొగలాయీ దండయాత్రల సందర్భముగా గోల్కొండ బీజపూర్‌కు సైనిక సహాయం చేయటము, శివాజీతో చేరటమూ నచ్చని ఔరంగజేబు గోల్కొండ మీద దండెత్తాడు. 1685లో మౌజం రాజకుమారుని ఆధ్వర్యంతో మొగలులు దండెత్తి హైదరాబాద్‌ను ఆక్రమించారు. గోల్కొండ కోటలో అరాచకం, కుట్రలు బయలుదేరాయి. మతాభిమానులైన సుల్తాను అనుయాయులు అక్కన్న మాదన్నలను వీధులలో పట్టపగలే చంపేశారు. తానీషా మొగలు సైన్యాన్ని ఎదుర్కొన్న విధానం చక్రవర్తి సైన్యంలో ఆశ్చర్యం కలిగించింది. చక్రవర్తి స్వయంగా వచ్చి యుద్ధాన్ని నిర్వహించాడు. ఎంతకీ కోట స్వాధీన పడకపోతే చక్రవర్తి కపటోపాయం పన్నాడు. గోల్కొండ ఉద్యోగి సహాయంతో కోట తలుపులు తెరిపించాడు. అయినా తానీషా మిగిలిన సైన్యం చివరి వరకూ పోరాడారు. అబ్దుల్‌రజాక్ అనే తానీషా విశ్వాసపాత్రుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒక్క ముఖంపైనే 70 గాయాలు తగిలాయి. చివరకు తానీషా ఓడిపోయి బందీ గావించబడ్డాడు. ఔరంగజేబు తానీషాను దౌలతాబాద్ కోటలో బందీచేసి సాలుకు 50 వేల రూపాయల భరణం చెల్లించాడు.

### 7.10 ఆంగ్లేయులు 1684 - 1690 :

జహంగీరు కాలంలో వ్యాపారానుమతి పొందిన ఆంగ్లేయులు ఔరంగజేబు కాలం నాటికి దేశమంతటా స్థావరాలను ఏర్పరచుకొన్నారు. నిరంతర యుద్ధాలు, అరాచకత్వం వలన ఆంగ్లేయులు తమ స్థావరాలలో బలమైన కోటలు కట్టుకొని, సైన్యాలను సమకూర్చుకున్నారు. తర్వాత మొగలాయిలనే ఎదిరించటానికి పూనుకున్నారు. సూరత్‌లోని ఆంగ్లేయాధికారి సర్‌జాన్ బైల్డ్ పశ్చిమ తీరంలో మొగలు నౌకలను పట్టుకొన్నాడు. బెంగాలులో షయుస్తఖాన్ దిగుమతి సుంకం విధించగా, దానిని చెల్లించటానికి నిరాకరించారు. ఔరంగజేబు ఆంగ్లేయ స్థావరాలపై దాడి జరుపను నిర్ణయించగా ఆంగ్లేయులు సంధికి అంగీకరించారు. దీని ప్రకారం ఆంగ్లేయులు మొగలులకు నష్టపరిహారం క్రింద 1,50,000 నిస్తే, చక్రవర్తి వారికి కలకత్తాలో ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతినిచ్చాడు.

### 7.11 రాజ్య విస్తరణ :

ఔరంగజేబు కాలంనాటికి సామ్రాజ్యం ఎంతో విస్తరించింది. ఉత్తరాన కాశ్మీరు నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు పడమట కాబూలు నుండి తూర్పున చిటగాంగ్ వరకు రాజ్యం విస్తరించింది.

ఔరంగజేబు కాలంలో అనేక విదేశీ రాయబారులు ఆస్థానాన్ని సందర్శించి అనేక విలువైన బహుమతులు సమర్పించారు. మక్కా నుండి షరీఫ్ ప్రతినిధి, పర్షియా, బాల్క్, బదల్ షాన్, ఉర్‌గంజే, బస్రా, అబిసీనియా, ఇథియోపియా మొదలగు ప్రాంతాలనుండి రాయబారులు మొగలు దర్బారుకు వచ్చారు.

### 7.12 ముగింపు :

26 సంవత్సరములు చక్రవర్తి దక్కన్‌లో గడపటం వలన ఉత్తర దేశంలో అరాచకత్వం పెరిగింది. రాజపుత్రులు తిరుగుబాట్లు చేశారు. మాళ్వా, గుజరాత్, గొండ్వనాలలో హిందువులు తిరుగుబాటు లేవదీశారు.

యుద్ధాల వలన చక్రవర్తి పరిపాలనను నిర్లక్ష్యం చేశాడు. రాజ్య విస్తీర్ణం వలన సుబాల సంఖ్య 21కి పెరిగింది. ఇస్లాం మతేతరులను ఉద్యోగాల నుంచి తొలగించటం వలన పరిపాలనలో ప్రతిభ తగ్గిపోయింది. రహదార్లలో భద్రత లోపించినందున వ్యాపారం క్షీణించింది. ఆదాయం తగ్గింది.

ఔరంగజేబు ఆజానుబాహుడు, స్ఫురద్రూపి. సాధారణ జీవితాన్ని గడిపినాడు. ఖురాన్‌ను, కంటస్థం చేసి, మధువును, మానిని, విసర్జించాడు. ఖురాన్ ప్రతులను వ్రాసి, టోపీలను కుట్టి, వాటిని అమ్మి, తన వ్యక్తిగత ఖర్చులకు వాడుకొనేవాడు. ఇతని దస్తూరి ముత్యాలకోవ వలె వుండేది. ముస్లిములకు ఇతను ఋషి వంటివాడు. 'జిందాపీర్' అనే బిరుదు పొందాడు.

ఇన్ని సుగుణాలు వున్నా ఔరంగజేబులో కొన్ని దుర్గుణాలు కూడా వున్నాయి. పరమత ద్వేషి, ముక్కోపి. ఇతరులను నమ్మేవాడు కాదు. కుమారులను కూడా అనుమానించేవాడు. అక్బరు ఎంతో పటిష్టంగా నిర్మించిన మొగలు సామ్రాజ్యము ఔరంగజేబు కాలంలో బీటలు వారింది. ఔరంగజేబు పరిపాలన ఎవ్వరినీ తృప్తిపరచలేకపోయింది.

**మాదిరి ప్రశ్నలు :**

## ఈ క్రింది ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.

1. ఔరంగజేబు దండయాత్రలను వివరింపుము.
2. ఔరంగజేబు మతవిధానమును వివరించి మొగలు సామ్రాజ్య పతనానికి ఎంతవరకు కారకుడో పేర్కొనుము.
3. ఔరంగజేబు రాజపుత్రులపట్ల అనుసరించిన విధానము.
4. ఔరంగజేబు దక్కను విధానము.
5. ఔరంగజేబు - మహారాష్ట్రులు
6. ఔరంగజేబు కాలంనాటి వారసత్వ యుద్ధాలు
7. మొగలు సామ్రాజ్య పతనానికి ఔరంగజేబు ఎంతవరకు కారకుడో వివరింపుము.
8. శిక్కుల పట్ల ఔరంగజేబు అనుసరించిన విధానము.

**చదువవదగిన గ్రంథాలు :**

1. బెర్నియర్ - మొగలు సామ్రాజ్యంలో యాత్రలు
2. లేన్‌పూల్ - ఔరంగజేబు
3. జె.యన్. సర్కార్ - ఔరంగజేబు చరిత్ర
4. జి.ఎన్. శర్మ - మేవారు - మొగలాయీలు
5. ఆర్.పి. త్రిపాఠి - మొగలు సామ్రాజ్య స్థాపన పతనం.
6. మనుచీ - మోగోర్ చరిత్ర
7. తెలుగు అకాడమి - భారతదేశ చరిత్ర (1524 నుంచి 1964 వరకు)
8. వి.డి. మహాజన్ - ఇండియాలో ముస్లిం పరిపాలన
9. డా. ఎ.ఎల్. శ్రీవాత్సవ - మొగలు సామ్రాజ్యము

పాఠం - 8

# కడపటి మొగల్ చక్రవర్తులు - విదేశీ దండయాత్రలు

## క్రీ.శ.1707 - 1857) - క్రీ.శ.1738 - '39, 1748 - '69)

విషయసూచిక


8.0 లక్ష్యం

8.1 ఉపోద్ఘాతం

8.2 కడపటి మొగల్ చక్రవర్తులు

8.3 విదేశీ దండయాత్రలు

8.3.1 నాదిర్‌షా దండయాత్ర క్రీ.శ. 1738 - '39

1. తొలిజీవితం
2. భారతదేశంపై దండయాత్ర
3. కర్నాల్ యుద్ధం (క్రీ.శ. 1739)
4. నాదిర్‌షా ఢిల్లీని దోచుకొనుట
5. నాదిర్‌షా దండయాత్ర ఫలితాలు

8.3.2 అహమ్మద్‌షా అబ్దాలి దండయాత్ర క్రీ.శ. 1748 - '69

1. తొలిజీవితం
2. భాదతదేశంపై దండయాత్రలు
3. అబ్దాలీ దండయాత్ర ఫలితములు


### 8.0 లక్ష్యం :

మొగల్ చరిత్రలో ఔరంగజేబు మరణానంతరము సింహాసనమధిష్టించిన మొగల్ చక్రవర్తులు ఎవరు, వారికి మొగల్ చరిత్రలో గల ప్రాధాన్యత, కడపటి మొగల్ చక్రవర్తుల పాలనలో సంభవించిన విదేశీ దండయాత్రలు మొదలగు అనేక విషయములు తెలుసుకొనుట ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

### 8.1 ఉపోద్ఘాతం :

ఔరంగజేబు మరణానంతరము (క్రీ.శ. 1707) నుండి రాజ్యాధికారాన్ని వహించిన మొగల్ చక్రవర్తులందరినీ కడపటి మొగలాయీలని అంటారు. కడపటి మొగలాయీ చక్రవర్తుల కాలంలో మొగల్ సామ్రాజ్య కీర్తిప్రతిష్టలు సైతము అడుగంటినను, మొగలాయీ చక్రవర్తులు మాత్రము 1857 తిరుగుబాటు వరకు ఢిల్లీని పాలించిరి. ఇట్లు క్రీ.శ. 1707 నుండి క్రీ.శ. 1857 వరకు ఢిల్లీని పాలించిన మొగలాయీ చక్రవర్తులందరూ బలహీనులు, అసమర్థులు, నామమాత్రపు పాదుషాలు. వీరి పాలనా కాలమందు జరిగిన పెక్కు సంఘటనలలో వీరెట్టి ప్రముఖపాత్ర వహింపకపోగా, కేవలము చూపరులుగా మాత్రమే నిలిచిపోయిరి.

## 8.2 కడపటి మొగల్ చక్రవర్తులు :

1) బహదూర్‌షా క్రీ.శ. 1707 - 1712
2) జహందర్‌షా క్రీ.శ. 1712 - 1713
3) ఫరుక్ సియార్ క్రీ.శ. 1713 - 1719
4) మహమ్మద్‌షా క్రీ.శ. 1719 - 1748
5) అహమ్మద్‌షా క్రీ.శ. 1748 - 1754
6) అజీజ్‌ఉద్దీన్ (లేక) రెండవ అలంఘీర్ క్రీ.శ. 1754 - 1759
7) రెండవ షా ఆలమ్ క్రీ.శ. 1759 - 1806
8) రెండవ అక్బరుషా క్రీ.శ. 1806 - 1837
9) రెండవ బహదూర్‌షా క్రీ.శ. 1837 - 1857

ఈ కడపటి మొగలాయి చక్రవర్తులు పేరుకు మాత్రం క్రీ.శ. 1857లో జరిగిన తిరుగుబాటు వరకు పాలించినప్పటికి, వీరిపాలన క్రీ.శ. 1761తోనే అంతరించిందని చెప్పవచ్చును. అందుచేతనే క్రీ.శ. 1707 నుండి 1761 వరకు మొదటి భాగంగాను, క్రీ.శ. 1761 నుండి 1857 వరకు రెండో భాగంగానూ చరిత్రకారులు విభజించినారు.

మొదటి భాగంలో రాజులు అసమర్థులైతే, రెండో భాగంలో కేవలం నామమాత్రపు పాలకులుగా గుర్తింపుపొందిరి. తొలిభాగంలో మహారాష్ట్రులు విజృంభణ, రాజోద్యోగుల అధికార దుర్వినియోగం, విదేశీ దండయాత్రలు, రెండవ భాగంలో అనేక స్వతంత్ర రాజ్యాల అవతరణ, పరదేశీయులైన ఫ్రెంచి, బ్రిటిష్‌వారు, స్వదేశీరాజుల అంతః కలహములలో జోక్యం కల్పించుకొనుట మొదలగు అంశాలు కలవు.

## (1) బహదూర్‌షా (క్రీ.శ. 1707 - 1712) :

ఔరంగజేబు తన చివరిదశలో ఒక వీలునామా వ్రాశెను. ఈ వీలునామా ప్రకారం మొగల్ సామ్రాజ్యము తన ముగ్గురు కుమారులైన 1) "మౌజమ్" 2) "మహమ్మద్ ఆజమ్" 3) "కామ్‌బక్ష్" లకు సమానంగా పంచెను. కాని ఔరంగజేబు మరణానంతరము అతని కుమారులు వీలునామాను కాదని వారసత్వ యుద్ధమునకు దిగిరి. వీరిలో పెద్దవాడైన 'మౌజమ్' (Mauzzam) 'బహదూర్‌షా' అను బిరుదుతో పాదుషాగా ప్రకటించుకొనెను. తన సోదరులను ఓడించి, ఢిల్లీ సింహాసనమధిష్టించెను. బహదూర్‌షాకు 'మొదటి షా ఆలమ్' అను బిరుదు కూడా కలదు. బహదూర్‌షా శాంతిస్వభావుడు. తన 5 సంవత్సరముల పాలనాకాలములో అందరిని సమన్వయపరచి, అందరిని మంచి చేసుకొనవలెనని ప్రయత్నించెను. తండ్రి కాలమున చెలరేగిన విచ్ఛిన్నకర శక్తులను నిర్మూలింపలేక, మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నతను నిరోధింపలేక పోయినను, బహదూర్‌షా రాజ్యమున తిరుగుబాట్లను అణిచి, శాంతిని నెలకొల్పెను.

ఎ) సాహుని బంధవిముక్తిని చేయుట వలన మహారాష్ట్రలో సాహు, తారాబాయ్‌లకు వారసత్వ యుద్ధము ప్రారంభమయ్యెను. తత్ఫలితముగా మొగల్ సామ్రాజ్యమునకు మహారాష్ట్రుల బెడద తొలగెను.

బి) బందా నాయకత్వములో శిక్కులు విజృంభింపగా, వారి కీలకస్థానమైన లోహఘడ్‌ను ముట్టడించి, వారినణచెను.

సి) రాజపుత్ర స్థానమున మార్వార్, మేవాడ్ పాలకుల తిరుగుబాటు చేయగా బహదూర్‌షా వారిని (1710)లో ఓడించి, మొగల్ సార్వభౌమత్వమును అంగీకరించునట్లు చేసెను.

ఇట్లు రాజ్యమున చెలరేగిన తిరుగుబాటుల నణచినను, నాటికే వృద్ధుడైనందున, కడు దయార్ద్ర హృదయుడై మసలుట వలన మొగల్ సామ్రాజ్యమునకు ఎట్టి శాశ్వత రక్షణలను ప్రసాదించలేకపోయెను.

### 2) జహందర్‌షా (క్రీ.శ. 1712 - 1713) :

బహదూర్‌షా మరణానంతరము అతని నల్గురు కుమారులైన జహందర్‌షా, అజీమ్, రఫి, జహన్‌ల మధ్య వారసత్వ యుద్ధము చెలరేగెను. వీరిలో పెద్దవాడైన జహందర్‌షా 'జుల్ షికారాఖాన్' అను సర్దారు సహాయముతో తన తమ్ములను వధించి, ఢిల్లీ సింహాసనమధిష్ఠించెను. జహందర్‌షా విషయలోలుడు. ఇతడు 'లాల్‌కుమారి' అను ఉంపుడు కత్తెకు బానిసయై ఆమెయే తన రాజ్యముగా భావించి, విలాస జీవితములో మునిగి ఉండెడివాడు. ఇతని బలహీనతను ఆసరాగా తీసుకొని అజీమ్ కుమారుడైన 'ఫరూక్ సియార్' సయ్యద్ సోదరుల సహాయముతో జహందర్‌షాను, అతని అనుయాయులను ఓడించి, వధించి, మొగల్ సింహాసనమును అధిష్టించెను. ఇట్లు జహందర్‌షా పాలించిన పదినెలలు కాలములో మొగలు సామ్రాజ్యము అరాచకములకు ఆలవాలమై దివాలా తీసెను.

### (3) ఫరూక్ సియార్ (క్రీ.శ. 1713 - 1719) :

ఫరూక్ సియార్ చక్రవర్తి అయ్యేనాటికి 30 సంవత్సరాల యువకుడు. ఇతడు చక్రవర్తి అయిన వెంటనే సయ్యద్ సోదరులను అనగా 'అబ్దుల్లాఖాన్' ను వజీరుగా, 'హుస్సేన్ ఆలీ'ని సేనాపతిగా నియమించెను. ఈ సయ్యద్ సోదరులు క్రమముగా బలవంతులై తనకు ఇష్టులైనవారిని కీలక స్థానములలో నియమించి, అధికారమును హస్తగతము చేసికొనిరి. సయ్యద్ సోదరుల ప్రాబల్యము నుండి విముక్తి పొందుటకు ఫరూక్ సియార్ మీర్‌జుమ్లాతోను, నిజాంఉల్‌ముల్క్‌తోను కుట్రలు పన్నెను. కాని ఫరూక్‌సియార్ చపలచిత్తుడు అగుటవలన మీర్‌జుమ్లా, నిజాం ఉల్‌ముల్క్‌లు సయ్యద్‌సోదరుల పక్షం వహించిరి. నాటి దక్కన్ రాజప్రతినిధి 'హుస్సేన్ ఆలీ' 'పేష్వా బాలాజీ విశ్వనాథ్' (మహారాష్ట్ర నాయకుడు) తో సంధిచేసుకొని, ఢిల్లీపై దండెత్తి, ఫరూక్ సియార్‌ను వధించెను. ఆ తదుపరి సయ్యద్ సోదరులు రాజ్యనిర్మాతలై రఫిఉద్దారజత్‌ను, రఫిఉద్దేలాను, మహమ్మద్ ఇబ్రహీంలను ఒక సంవత్సర కాలములోనే ఒకరి తరువాత ఒకరిని చక్రవర్తులుగా చేసిరి. తుదకు బహదూర్‌షా చిన్నమనుమడైన 'రోషన్ అఖ్తార్' ను మహమ్మద్‌షా అని బిరుదముతో సింహాసనమెక్కించింది.

### (4) మహమ్మద్‌షా ( క్రీ.శ. 1719 - 1748) :

ఇతడు కూడా విలాస జీవితమునకు బానిస. బలహీనుడు. ఇతని పాలనా కాలమున ప్రముఖ సంఘటనలేమన

### ఎ) సయ్యద్ సోదరుల పతనము :

పాదుషా అయిన తదుపరి ఇతనికి సయ్యద్ సోదరులకు ప్రతి విషయంలోను భేదాభిప్రాయాలు ఏర్పడెను. వారి అధికారదాహం చక్రవర్తికి ఏమాత్రం నచ్చలేదు. పాదుషాను తుదముట్టించుటకు సయ్యద్ సోదరులు ప్రయత్నించుట, నిజామ్‌ను శిక్షించుటలో హుస్సేన్ ఆలీ మరణింపగా, అబ్దుల్‌ఖాన్ భిలాస్‌పూర్ వద్ద మహమ్మద్‌షా చేతిలో పరాజితుడయ్యెను. ఇట్లు సయ్యద్ సోదరులు ప్రభావం అంతరించెను.

### బి) రాష్ట్ర పాలకులైన సుబేదారులు స్వతంత్రులగుట :

మహమ్మద్‌షా బలహీనుడగుట వలన, మొగల్ సర్దారులలో ముఠాతత్వములు పెచ్చు పెరుగుటవలన, మొగల్ రాకుమారులలో వారసత్వ యుద్ధములు ప్రభలుట వలన, రాష్ట్ర పాలకులైన సుబేదారులు స్వతంత్రులై మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నతకు దోహదపడిరి.

### సి) నాదిర్‌షా దండయాత్ర :

పై పరిస్థితులను ఆసరాగా తీసుకొని పారశీక చక్రవర్తి అయిన నాదిర్‌షా దండెత్తి పంజాబ్ ఆక్రమించి, మహమ్మద్‌షాను 1739లో 'కార్నాల్' వద్ద ఓడించెను. ఇతడు మొగల్ సిరిసంపదలను కొల్లగొట్టెను. ఇట్లు శిధిలావస్థలోనున్న మొగల్ సామ్రాజ్యమునకు నాదిర్‌షా దండయాత్ర గొడ్డలి పెట్టయ్యెను.

### 5) అహమ్మద్‌షా (క్రీ.శ. 1748 - '54) :

మహమ్మద్‌షా మరణానంతరము అతని కుమారుడైన అహమ్మద్‌షా మొగల్ సింహాసనమధిష్టించెను. ఇతని కాలములోనే ఆఫ్ఘన్ చక్రవర్తియైన అహమ్మద్‌షా అబ్దాలీ దండయాత్రలు ప్రారంభమయ్యెను. 1752లో అబ్దాలీ పంజాబ్‌నాక్రమించి, ఢిల్లీవైపు పురోగమింపగా, అహమ్మద్‌షా పంజాబ్, ముల్తానుల నిచ్చి, సంధి చేసుకొనెను. అబ్దాలీ మరలిన వెంటనే మొగల్ వజీరైన ఇమద్-ఉల్-మల్క్, అహమ్మద్‌షా గ్రుడ్లుపీకించి, అతనిని పదవి నుండి తొలగించి, జహందర్‌షా కుమారుడైన అజీజీ ఉద్దేన్‌ను "రెండో అలంఘర్" అను బిరుదుతో సింహాసనమెక్కించెను.

### 6) అజీజ్ ఉద్దీన్ (లేక) రెండవ ఆలంఘిర్ (క్రీ.శ. 1754 - 1759) :

అజీజ్‌ఉద్దీన్ ఔరంగజేబు వలె ఆలంఘర్ అని బిరుదును దరించుటచే, ఇతడు రెండవ అలంఘర్‌గా ప్రసిద్ధికెక్కెను. ఇతడు సింహాసనానికి వచ్చేనాటికి 55 ఏండ్లవాడు. బాగా చదువుకొన్నవాడైనప్పటికీ పరిపాలనా అనుభవం లేనివాడు.

ఇతని కాలమున సైతము అబ్దాలీ దండెత్తి ఢిల్లీ, మధురా నగరములను దోచుకొనెను. ఇతడు తన వజీరైన ఇమద్-ఉల్-ముల్క్ చేతిలో కీలుబొమ్మయై, అతని ద్రోహచింతకు బలిఅయ్యెను. తుదకు వజీర్ అలంఘిర్‌ను వధించి, 'కాంబక్' మనుమడైన 'మహి-ఉల్-మిలత్' అను రాకుమారుని 'మూడో షాజహాన్' అనే బిరుదుతో చక్రవర్తిగా ప్రకటించెను.

కాని రెండో ఆలంఘిర్ కుమారుడైన 'అలీగాహార్' తూర్పు రాష్ట్రంలో 'రెండవ షా ఆలమ్' అని బిరుదుతో, తనకు తానే చక్రవర్తిగా ప్రకటించుకొనెను. అయితే వీరిద్దరిమద్య అంతరయుద్ధము అబ్దాలీ దండయాత్రల వలన చెలరేగలేదు. అబ్దాలీ దండయాత్రను ఎదుర్కొనుటకు 'సదాశివరావు' నాయకత్వంలో మహారాష్ట్ర సైన్యము వచ్చి, ఢిల్లీ ఆక్రమించి, మూడవ షాజహాను పదవినుండి తొలగించి, 'రెండో షా ఆలం'ను మొగల్ చక్రవర్తిగా ప్రకటించెను.

### 7) రెండవ షా ఆలమ్ (క్రీ.శ. 1759 - 1806) :

రెండవ షా ఆలమ్ కాలంలో జరిగిన ప్రముఖ సంఘటన (1761) మూడవ పానిపట్టు యుద్ధం. తదుపరి మొగల్ పాదుషా నామమాత్రపు పాలకుడయ్యెను. ఆంగ్లాధికార విస్తరణ నరికట్టుటకు చక్రవర్తి, అయోధ్య నవాబు 'షుజా ఉద్దేలా', బెంగాల్ నవాబు మీర్‌ఖాసిమ్‌లతో కలసి 1764లో బక్సారు యుద్ధమున ఆంగ్లేయులను ప్రతిఘటించెను. కాని ఈ యుద్ధమున పరాజితుడైన షా ఆలమ్ ఆంగ్లేయులతో 1765లో 'అలహాబాదు' సంధి చేసుకొనెను. ఈ సంధి వలన షా ఆలమ్ ఆంగ్లేయుల రక్షణలో ఉండి, వారికి బెంగాల్, బీహార్, ఒరిస్సాలందు రెవిన్యూ వసూలు చేసికొను దివానీ అధికారమిచ్చెను. రోహిల్లులు షా ఆలమ్‌ను అంధుని గావింపగా, చివరకు ఆంగ్లేయుల రక్షణలో అతడు మరణించెను.

### 8) రెండవ అక్బరు (క్రీ.శ. 1806 - 1837) :

షా ఆలమ్ మరణానంతరము అతని కుమారుడు "రెండో అక్బరు" అనే బిరుదును ధరించి, ఆంగ్లేయుల అనుమతితో మొగల్ పాదుషాగా ఎర్రకోటలో, ఆంగ్లేయులు ఇచ్చు భరణంతో జీవితమును గడిపెను.

### 9) రెండవ బహదూర్‌షా (క్రీ.శ. 1837 - 1857) :

మొగల్ చక్రవర్తులలో కడపటివాడు రెండవ బహదూర్‌షా. రెండవ అక్బర్ మరణానంతరము, బహదూర్‌షా ఆంగ్లేయుల అనుమతితో చక్రవర్తిగా ప్రకటించుకొనెను. ఇతడు ఆంగ్లేయుల విస్తరణను ప్రతిఘటించవలెనని తలంచి 1857 సిపాయిల తిరుగుబాటులో ప్రధానపాత్ర వహించెను. కాని ఆంగ్లప్రభువు 'కానింగ్' ఈ తిరుగుబాటును అణిచి, బహదూర్‌షాను ఖైదీగా పట్టుకొని రంగూన్‌కు

పంపెను. అతని కుమారులు, మనుమడు, ఆంగ్లేయులచే కాల్చి చంపబడిరి. తుదకు బహదూర్‌షా రంగూన్ జైలులో 1862వ సంవత్సరమున మరణించెను. ఇతని మరణముతో మొగల్ రాజవంశము నామరూపాలు లేకుండా అంతరించెను.

## 8.3 విదేశీయుల దండయాత్రలు (క్రీ.శ. 1738 - '39) (క్రీ.శ. 1748 - '69) :

ఔరంగజేబు మరణానంతరము పాలించిన మొగల్ చక్రవర్తులందరూ కనీసం వాయువ్య సరిహద్దు రక్షణ గురించి అంతగా పట్టించుకొనలేదు. తత్ఫలితముగా అరాచక పరిస్థితులేర్పడెను, నాదిర్‌షా, అహమ్మద్‌షా అబ్దాలీ అనే పారశీక రాజులు భారతదేశంపై దండెత్తి, మొగల్ ఖజానాను దోచుకొనిరి. వీరు దండెత్తి రావటానికి ప్రధాన కారణములు అసమర్ధులైన చక్రవర్తులు, స్వార్ధపరులైన రాజ్యఉద్యోగులు, మరియు మొగల్ ఆస్థానంలో ప్రబలిన ముఠా రాజకీయాలుగా చెప్పవచ్చును.

### 8.3.1 నాదిర్‌షా దండయాత్రలు (క్రీ.శ. 1738 - '39) :

నాదిర్‌షా పర్షియా దేశపురాజు. అతి సామాన్య కుటుంబంలో జన్మించి, స్వశక్తి సామర్థ్యాలలో పారశీక చక్రవర్తి అయి 'ఇరాన్ దేశపు నెపోలియన్'గా (Nepolean of Iran) ప్రసిద్ధికెక్కినాడు. యుద్ధ నిర్వహణలోను, రాజనీతి చతురతలోను సమర్ధుడు. స్వదేశాన్ని ఆఫ్ఘన్ పాలన నుండి విముక్తి చేసి, 'సఫవీ' వంశాన్ని పునఃప్రతిష్టించి, రాజ్య నిర్మాతగా, చక్రవర్తిగా, రాజ్య విస్తరణను చేసెను.

### 1) తొలిజీవితం :

నాదిర్‌షా అసలుపేరు 'నాదిర్‌కులి', ఖోరసాన్ ప్రాంతంలో నివసించు ఆఫషార్ అనే టర్కీ జాతికి చెందిన 'ఇమామ్‌కులి' దంపతులకు క్రీ.శ. 1688లో జన్మించెను. పేద కుటుంబంలో జన్మించుట వలన, జీవనోపాధివరకు రహదార్లు కొట్టి జీవిస్తూ, ధైర్యశాలిగా మారినాడు. కొద్ది కాలమునకు పర్షియా రాజైన రెండో 'షాతహ్ మాస్ప్' కొలువులో చేరెను. అదేసమయములో ఆఫ్ఘన్‌లు తిరుగుబాటుచేసి, రాజును పదవి నుండి తొలగించినారు. నాదిర్‌షా తానే స్వయంగా సైన్యమును సమకూర్చుకొని, ఆఫ్ఘన్‌లను ఓడించి, రాజధానిని వశపర్చుకొని, 'సఫవీ' వంశమును తిరిగి పునఃప్రతిష్టించినాడు. నాదిర్‌షా సహాయంతో చక్రవర్తియైన 'తహ్‌మాస్ప్' పేరుకు మాత్రమేరాజు, అధికారం మాత్రం పూర్తిగా నాదిర్‌షా చేతులలో ఉండెను. తుదకు క్రీ.శ. 1732లో నాదిర్‌షా 'సఫవీ' వంశము వారిని తోసిపుచ్చి, తానే చక్రవర్తి అయినాడు.

### 2) భారతదేశంపై దండయాత్ర :

పర్షియాకు అధిపతి అయిన తరువాత నాదిర్‌షా రాజ్యవిస్తరణకు పూనుకొనెను. ఆఫ్ఘన్‌లను లొంగదీయుటకు కాందహార్‌ను ముట్టడించగా, వారిలో కొందరు మొగల్ ప్రాంతములకు పారిపోయి తలదాచుకొనిరి. అందుచే నాదిర్‌షా ఆనాటి మొగల్ చక్రవర్తియైన 'మహమ్మద్‌షా'కు ఆఫ్ఘన్‌లకు ఎటువంటి ఆశ్రయం ఇవ్వవద్దని వర్తమానం పంపెను. అయితే మొగల్ చక్రవర్తి తన మాటను మన్నింపకపోగా, తాను పంపిన రాయబారులను కూడా సరిగా చూడలేదు అను నెపంతో నాదిర్‌షా మొగల్ చక్రవర్తిపై దండెత్తివచ్చి, గజనీ, కాబూల్, లాహోర్‌లను జయించి, క్రీ.శ. 1739 నాటికి పంజాబ్ చేరినాడు.

### 3) కర్నాల్ యుద్ధము (క్రీ.శ. 1739) :

పానిపట్టుకు 20 మైళ్ళదూరంలో ఉన్న 'కర్నాల్' వరకు పారశీక సేనలు చొచ్చుకొని వచ్చేవరకు మొగల్ చక్రవర్తిగాని, సరిహద్దు సైన్యముగాని ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చివరకు మహమ్మద్‌షా 75,000 సైన్యంతో, 'ఔడ్' గవర్నర్ అయిన బురావాన్ - ఉల్-ముల్క్ సహాయంగా రాగా, కర్నాల్ వద్ద విడిదిచేసినాడు.

మహమ్మద్‌షా చేసిన యుద్ధసన్నాహాలు చూసి, నాదిర్‌షా తెలివిగా ప్రత్యక్ష యుద్ధమునకు దిగకుండా వారిని తప్పించుకొని ఢిల్లీ చేరుటకు ప్రయత్నించెను. ముందు మొగల్ ఆహార పదార్థాలను వశపరచుకొని, వారిని ఇబ్బందులకు గురిచేసెను. అందువల్ల, మొగల్ సేనలు విశ్రాంతి లేకుండా పారశీక సైన్యంతో యుద్ధం చేయవలసి వచ్చెను. క్రీ.శ. 1739 ఫిబ్రవరి 24న కర్నాల్ వద్ద జరిగిన మూడు గంటల యుద్ధంలో నాదిర్‌షా సేనల ప్రతాపం ముందు మొగల్ సేనలు నిలువలేకపోయెను. తదుపరి నిజాం-ఉల్-ముల్క్, నాదిర్‌షాను సంధికి అంగీకరించమని కోరగా, కొన్ని కారణముల వలన నాదిర్‌షా సంధికి అంగీకరించలేదు. చివరకు 'సావల్‌ఖానీ' పిలుపు మేరకు క్రీ.శ. 1739 మార్చి 12న నాదిర్‌షా ఢిల్లీ ప్రవేశించి, దివాన్-ఇ-ఖాస్‌లో విడిదిచేసి యుండగా, నాదిర్‌షా మరణించాడనే వదంతి వ్యాపించి, మొగల్ సైనికులు, పారశీక సైన్యంపై దాడిచేసిరి.

## 4) నాదిర్‌షా ఢిల్లీని దోచుకొనుట :

మొగలుల కుట్రను గ్రహించిన నాదిర్‌షా ఆగ్రహావేశంతో ఢిల్లీనగరాన్ని దోచుకొనవలసినదిగా తన సైన్యంనకు వర్తమానం పంపి, సుమారు 5 గంటలసేపు దారుణ హింసాకాండను సృష్టించెను. అనేకమంది పౌరులు హతులైనారు. రాజధానిని, పరిసర ప్రాంతాలను కొల్లగొట్టి, అనేక ఇళ్ళను తగుటబెట్టి, అక్బర్ కాలం నుండి మొగల్‌లు సంపాదించిన, అమూల్య ధనరాసులను దోచుకొనెను. నాదిర్‌షా స్వదేశం తిరిగి వెళ్ళేటప్పుడు సుమారు 15 కోట్ల రూపాయల నగదు, కోహినూరు వజ్రం, నెమలి సింహాసనము, 300 ఏనుగులు, 10,000 గుర్రాలను, 10,000 ఒంటెలను, 130 మంది కవులను, 100 మంది కొజ్జాలను, 200 మంది తాపీమేస్త్రీలను, వెండి, బంగారము, వజ్రవైఢూర్య రాసులను తన వెంట తీసుకొని వెళ్లినట్లు, నాదిర్‌షా కార్యదర్శి కథనం ప్రకారం తెలియుచున్నది.

## 5) నాదిర్‌షా దండయాత్ర ఫలితాలు :

ఎ) నాదిర్‌షా దండయాత్ర శిథిలమైపోతున్న మొగల్ సామ్రాజ్యమునకు గొడ్డలి పెట్టయినది. మొగల్ సైన్యం పూర్తిగా ధ్వంసమైంది. సామ్రాజ్య రక్షణకు అవసరమైన సైన్యం లేదని తేటతెల్లమైంది.

బి) నాదిర్‌షా భారతదేశ సిరిసంపదలను దోచుకొనుట వలన ఆర్థిక పరిస్థితులు క్షీణించెను. చక్రవర్తుల రాజ్యపోషణకు అవసరమగు ధనం కూడా లేకుండా పోయెను.

సి) పరిపాలనా యంత్రాంగం పూర్తిగా విచ్ఛిన్నమై, దేశం నలుమూలలా అరాచక పరిస్థితులు ఏర్పడెను.

డి) నాదిర్‌షా దండయాత్రల వలన మొగల్ సుబేదారులు స్వతంత్రులైరి. కాబూల్, సింధ్, పంజాబ్ మొదలగు ప్రాంతాలు పారశీక సామ్రాజ్యంలో అంతర్భాగాలు అయినాయి.

ఇ) నాదిర్‌షా దండయాత్ర, అహమ్మద్‌షా అబ్దాలీ దండయాత్రలకు మార్గమును చూపినది.

## 8.3.2 అహమ్మద్‌షా అబ్దాలి దండయాత్ర (క్రీ.శ. 1748 - 1769) :

క్రీ.శ. 1747లో నాదిర్‌షా హత్యచేయబడగా, అతని సేనాధిపతులలో ఒకడైన అహమ్మద్‌షా ఆఫ్ఘన్ స్థానాన్ని పారశీకుల పాలన నుండి విముక్తి చేసి, స్వతంత్రుడై, చక్రవర్తిగా ప్రకటించుకొని, భారతదేశంపై అనేక పర్యాయాలు దండెత్తి వచ్చి, అపార ధనరాసులను దోచుకొనిపోయి, మొగల్ సామ్రాజ్య వినాశనానికి కారకుడైనాడు.

## 1) తొలిజీవితం :

అహమ్మద్‌షా అసలుపేరు అహమ్మద్‌ఖాన్, ఇతడు అబ్దాలీ తెగకు చెందినవాడు. ఆఫ్ఘన్ దేశీయుడు. చిన్నతనంలోనే అనేక కష్టాలుపడి, నాదిర్‌షా సైన్యంలో ఉద్యోగిగా చేరి, అతని భారతదేశ దండయాత్రలో పాల్గొని, సమర్థుడైన యోధునిగా పేరుపొందెను.

నాదిర్‌షా మరణానంతరం స్వతంత్రుడై, క్రీ.శ. 1747లో కాందహార్‌లో "దోర్-ఇ-దురానే" అనే బిరుదును ధరించి, పట్టాభిషిక్తుడైనాడు. అనైక్యంతో నలిగిపోతున్న ఆఫ్ఘన్‌లందరిని సమైక్యపరచి, 'ఆఫ్ఘనిస్థాన్' అనే పదనామాన్ని సృష్టించిన మహానాయకుడితడు.

## 2) భారతదేశంపై దండయాత్రలు :

స్వదేశంలో తన అధికారాన్ని సుస్థిరపరచుకొని, అబ్దాలీ తన దృష్టిని భారతదేశంపై మరల్చెను. భారతదేశంలోని సిరిసంపదలను కొల్లగొట్టి, తన అధికారమును స్వదేశంలో పదిలపర్చుకొనుటకు, నాదిర్‌షా వారసునిగా అబ్దాలీ భారతదేశ పశ్చిమోత్తర ప్రాంతములను వశపరచుకొనెను. కొంత భాగంలోనైనా ఆఫ్ఘన్ అధికారంను పునరుద్ధరించవలెననే లక్ష్యాలతో క్రీ.శ. 1748-69 సంవత్సరముల మధ్యకాలంలో సుమారు 8 పర్యాయములు దండెత్తి వచ్చినాడు.

అబ్దాలీ మొదటి దండయాత్ర క్రీ.శ. 1748 జనవరిలో లాహోర్‌ను వశపరచుకొనుటతో ప్రారంభమయ్యెను. తదుపరి జరిగిన రెండు దండయాత్రలలో కాశ్మీర్, పంజాబ్, సింధు ప్రాంతాలను జయించగా, మొగల్ చక్రవర్తియైన అహమ్మద్‌షా ఆ ప్రాంతాలన్నింటిని అతనికిచ్చి, అతనితో సంధి చేసుకొనెను.

శిక్కులలో పోరాటానికి దిగిన 'మీర్‌మన్నూ' చనిపోగా అతని భార్య 'మొఘలానీ బేగం' కుమారుని తరపున పాలనా బాధ్యతలు స్వీకరించెను. ఈమె అబ్దాలీ నుంచే కాకుండా, మొగల్ చక్రవర్తి నుంచి కూడా తన కుమారునికి వారసత్వ హక్కును పొందెను. కాని మొగల్ వజీరైన 'ఇమాద్-ఉల్-ముల్క్' వేరొకరిని నియమించగా, అబ్దాలీ ఉగ్రుడై క్రీ.శ. 1757లో నాల్గోపర్యాయం భారతదేశంపై దండెత్తి సరాసరి ఢిల్లీచేరి కొల్లగొట్టినాడు. రెండవ ఆలంఘర్ పంజాబ్, సింధు, ముల్తాన్, కాశ్మీర్, ప్రాంతాలన్నింటినీ అబ్దాలీకి అప్పగించి, అతని కుమారుడైన తైమూర్‌షాకు తన కుమార్తెనిచ్చి వివాహం చేసినాడు. ఈ క్రొత్త రాష్ట్రానికి అబ్దాలీ తన కుమారుని గవర్నర్‌గా నియమించి, స్వదేశం చేరినాడు.

అబ్దాలీ స్వదేశం చేరగానే, 'రఘునాధరావు' నాయకత్వంలో మహారాష్ట్రులు పంజాబ్‌పై దండెత్తి, తైమూర్‌షాను పదవి నుండి తొలగించిరి. తన కుమారునికి జరిగిన అవమానం తెల్పి అబ్దాలీ ఢిల్లీచేరి క్రీ.శ. 1761 జనవరి 14న జరిగిన మూడవ పానిపట్ యుద్ధంలో పాల్గొని, మహారాష్ట్ర, మొగల్ సేనలను సర్వనాశనం చేసినాడు. ఢిల్లీలో బీభత్సం సృష్టించినాడు. రెండవ షా ఆలమ్‌ను మొగల్ చక్రవర్తిగా గుర్తించి, క్రీ.శ. 1762లో స్వదేశం చేరెను.

తిరిగి క్రీ.శ. 1764 - '69 సంవత్సరాల మధ్య పంజాబ్ ప్రాంతములో శిక్కులు అలజడి ఎక్కువగా ఉన్నందును, వారిని అదుపులో పెట్టుటకు నాలుగుసార్లు లాహోర్ వరకు వచ్చినా, కొన్ని ప్రత్యేక కారణముల వలన స్వదేశమునకు మరలి వెళ్ళెను. కేవలం అబ్దాలీ పెషావర్, 'అటక్'కు పశ్చిమోత్తర ప్రాంతములను మాత్రమే తన ఆధీనంలో ఉంచుకొనెను.

## 3) అబ్దాలీ దండయాత్ర ఫలితములు :

అబ్దాలీ దండయాత్రలు భారతదేశ చరిత్రలో కొన్ని శాశ్వత పరిణామాలను కలుగచేసినాయి.

ఎ) ఈ దండయాత్రల ఫలితంగా మొగల్ అధికారం, సామ్రాజ్యం అతి త్వరగా క్షీణించినాయి.

బి) మహారాష్ట్ర సామ్రాజ్యా విస్తరణను అరికట్టి, వారి అధికారానికి తీరని నష్టాన్ని కలుగజేసినాయి.

సి) పంజాబ్‌లో శిక్కులు స్థిరపడి, స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకోవటానికి పరోక్షంగా అబ్దాలీయే ముఖ్యకారకుడు. "భారతదేశంలో అతని జీవితం శిక్కుల స్వాతంత్ర్యం పోరాటంతో అతి సన్నిహితంగా ఓ భాగమైపోయింది", అని చరిత్రకారుల అభిప్రాయం.

డి) మొగల్ చక్రవర్తుల, పీష్వాల అధికారం, ఈ దాడుల వలన పూర్తిగా దెబ్బతిన్నందువల్ల, ఆంగ్లేయులు భారతదేశంలో తమ సార్వభౌమాధికారాన్ని స్థాపించుకోవటానికి చక్కని అవకాశం ఏర్పడింది. "ఆంగ్లాధికార బీజాలు నాటడానికి, ప్లాసీ (1757) యుద్ధం తోడ్పడగా, ఆ అధికారం వేళ్ళు పాతుకొనేందుకు వ్యవధిని మూడవ పానిపట్ యుద్ధం సమకూర్చెను".

## మాదిరి ప్రశ్నలు :

1. కడపటి మొగల్ చక్రవర్తులను గురించి వివరింపుము ?
2. కడపటి మొగల్ చక్రవర్తుల కాలంలో సంభవించిన విదేశీ దండయాత్రలను వర్ణింపుము ?
3. బహదూర్‌షా
4. మహమ్మద్‌షా
5. నాదిర్‌షా దండయాత్ర
6. అహమ్మద్‌షా అబ్దాలీ దండయాత్రలు

## ఉపయుక్త గ్రంథాలు :

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం) డా॥ పాటిబండ ఝాన్సీలక్ష్మీ మరియు డా॥ శ్రీమతి అల్లాడి వైదేహి
2. Indian History and Culture Vol. II - Dr. B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao
3. India since 1526 - V.D. Mahajan
4. The Mughal Empire - A.L. Srivastava.

పాఠము - 9

# మొగలాయిలు - రాజకీయ దౌత్య సంబంధాలు

**విషయసూచిక**

9.0 లక్ష్యం
9.1 ఉపోద్ఘాతం
9.2 దక్కన్ సుల్తానులు
9.3 శిక్కులు
9.4 రాజపుత్రులు
9.5 పశ్చిమోత్తర సరిహద్దు రాజ్యాలు
9.6 ఐరోపావారు

## 9.0 లక్ష్యం :

మొగలాయిలు స్వదేశీ, విదేశీ రాజులతో నెలకొల్పుకొనిన రాజకీయ, దౌత్య సంబంధాలను గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## 9.1 ఉపోద్ఘాతం :

మొగలాయిలు యుద్ధరంగంలోనేగాక రాజకీయ, దౌత్యరంగాలలో కూడా చాలా సమర్థులు. వీరు స్వదేశీ, విదేశీ రాజులతో రాజకీయ, దౌత్య సంబంధాలను నెలకొల్పినారు. మొగలులు తమ రాజకీయ, దౌత్యసిద్ధాంతాలలో పరిగణించిన ప్రధాన సూత్రాలు-స్నేహ సంబంధాలు, వివాహ సంబంధాలు, సామ, దాన, భేద, దండోపాయాలు, మతసహన, తుల్యప్రాబల్య సిద్ధాంతము. మొగల్ రాజకీయ, దౌత్యనీతి సిద్ధాంతాలకు మొదటిసారిగా పునాదులువేసి రూపకల్పన చేసినవాడు అక్బరు. తమకు బద్ధశత్రువులయిన ఆఫ్ఘన్‌లను అదుపులో ఉంచడానికి అక్బర్ రాజపుత్రులను తగినవారుగా తలచినాడు. మతసహన సిద్ధాంతంతో హిందువులను ఆకట్టుకోవడానికి ప్రయత్నించాడు. యుద్ధసమయాలలో ఏ ప్రాంతం మీదికి దండెత్తినాడో ఆ ప్రాంతానికి చెందిన వారిని సేనానులుగా నియమించాడు. దక్కన్ సుల్తానుల విషయంలో సామ, దాన, భేద, దండోపాయాలను అనుసరించినాడు. పర్షియా వారితో దౌత్యసంబంధాలను నెలకొల్పినాడు. అక్బరు అనుసరించిన విధానాన్ని ఔరంగజేబు మినహా అందరూ కొనసాగించారు. ఔరంగజేబు తుల్యప్రాబల్య సిద్ధాంతాన్ని విడిచిపెట్టాడు. దానితో రాజకీయ, దౌత్య సంబంధాలలో విపరీతమయిన పరిణామాలు ఏర్పడినాయి. కడపటి మొఘలుల కాలంలో అప్పుడప్పుడు తుల్యప్రాబల్య సిద్ధాంతాన్ని అనుసరించారు. ఐరోపా వారితో మొగల్ చక్రవర్తులు వర్తక, మత, దౌత్య సంబంధాలను నెలకొల్పినారు. అప్పుడప్పుడూ సంఘర్షణలు కూడ జరిగాయి.

## 9.2 మొగలులు - దక్కన్ సుల్తానులు :

### ఎ) ఉపోద్ఘాతము :

ప్రాచీన కాలము నుండి ఉత్తరాపథాన్ని పాలించిన చక్రవర్తులలో భారతదేశాన్నంతా తమ ఆధీనంలోకి తేవాలని, భారతదేశ రాజకీయ ఐక్యత తేవాలనే ధ్యేయంతో దక్షిణ హిందూదేశాన్ని జయించడానికి ప్రయత్నించారు. ఇటువంటి విధానాన్నే ఢిల్లీ సుల్తానత్ పాలకులు, మొగలాయిలు అనుసరించారు. మొగలాయి చరిత్రలో వారి దక్షిణ సామ్రాజ్య స్థాపన ప్రధాన ఘట్టము.

## బి) అక్బరు :

మొగలాయి చక్రవర్తులలో దక్కన్ జయింప ప్రయత్నించిన మొదటి చక్రవర్తి అక్బరు. ఇతడు ఉత్తరాపథమున తన అధికారమును సుస్థిరం చేసికొనిన తరువాత తన దృష్టిని దక్షిణదేశంపై కేంద్రీకరించాడు. అక్బర్ మొదట, దక్షిణ రాజ్యాలన్నింటిని మొగల్ సార్వభౌమాధికారమును గుర్తించి కప్పం చెల్లించవలసినదిగా రాయబారాలు పంపాడు. ఖాందేష్ పాలకుడు అక్బరు ఆజ్ఞలను శిరసావహించాడు. మిగతా రాజ్యాలు ఆ ఆజ్ఞలను లెక్కచేయలేదు. అందువలన ఆ రాజ్యాలను ఓడించటానికి ఉద్యుక్తుడయ్యాడు. 1593లో అక్బర్ తన సైన్యాలను అహమ్మద్‌నగర్‌పై పంపి కుట్రతో ఆక్రమించి మొగల్ సామ్రాజ్యంలో విలీనం చేశాడు. ఈ ప్రాంతంలో అక్బర్ తన మూడవ కుమారుడైన దనియాల్‌ను రాజప్రతినిధిగా నియమించాడు.

## సి) జహంగీర్ :

ఇతడు తన తండ్రి అనుసరించిన దక్కన్ విస్తరణ విధానాన్ని అనుసరించాడు. అహమ్మద్‌నగర్ ప్రధానమంత్రి మాలిక్‌అంబర్ మహారాష్ట్ర గెరిల్లాల సాయంతో అక్బర్ ఆక్రమించిన భూభాగాలను తిరిగి ఆక్రమించాడు. జహంగీర్ పంపిన తొలిదాడులను అంబర్ త్రిప్పికొట్టాడు. 1617లో జహంగీరు తన కుమారుడైన ఖుర్రంను పంపగా అతడు అంబర్‌ను ఓడించి బాలాఘాట్ ప్రాంతాన్ని వశపరచుకొన్నాడు. ఆ తదుపరి అంబర్ గోల్కొండ, బీజాపూర్ సుల్తానులతో కలసి మొగలులపై యుద్ధాన్ని ప్రకటించగా ఖుర్రం వారిని ఓడించి సంధి చేసుకోవటం జరిగింది. ఈ సంధి ప్రకారం అహమ్మద్‌నగర్ 12 లక్షలు, బీజపూర్ 18 లక్షలు, గోల్కొండ 20 లక్షలు మొగలులకు యుద్ధ నష్టపరిహారం చెల్లించింది. కాని అహమ్మద్‌నగర్ ఆక్రమించడం జరగలేదు.

## డి) షాజహాను :

ఇతని కాలంలో మాలిక్ అంబర్ అహమ్మద్‌నగర్‌లో, మీర్‌జుమ్లా గోల్కొండలో కొంతకాలం దక్కన్ రాజకీయాలను తన ఆధీనంలో ఉంచుకొనినారు. అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని పాలించు మహమ్మద్ ఆలిషాకు అంబర్ మంత్రిగా, సేనానిగా వ్యవహరించాడు. ఇతడు అబిసీనియా దేశపు బానిస. తన శక్తిసామర్థ్యాలతో ఇతడు అహమ్మద్‌నగర్ రాజ్యంలో చిన్న పదవిలో చేరి ఉన్నతస్థానాన్ని ఆక్రమించాడు. పరిపాలనా రంగంలో, సైనిక నిర్మాణంలోను ఆరితేరినవాడు. తోడర్‌మల్ రెవిన్యూ సంస్కరణను అతడు అహమ్మద్‌నగర్ రాజ్యంలో అమలుపరిచాడు. సైన్యంలో మహారాష్ట్ర యువకులను చేర్చుకొని వారికి గెరిల్లా యుద్ధపద్ధతులలో శిక్షణ ఇప్పించాడు. ఇతని మరణానంతరం అతని కుమారుడు ఫతేఖాన్ ఆస్థానానికి వచ్చాడు. ఇతడు అవినీతిపరుడైనందువలన మొగల్ సైన్యాలు అహమ్మద్‌నగర్ సైన్యాలను ఓడించి 1633లో మొగల్ సామ్రాజ్యంలో కలుపుకున్నారు. షాజహాన్ తన కుమారుడైన ఔరంగజేబును దక్కన్ వైస్రాయిగా నియమించాడు. ఔరంగజేబు పరిపాలనా సౌలభ్యం కోసం దక్కనును ఖాన్‌దేశ్, బీరార్, దౌలతాబాద్, తెలంగాణా అను నాలుగు భాగాలుగా విభజించాడు. ముర్షిద్ అలీఖాన్ అనే రెవిన్యూ అధికారి సహాయంతో ఔరంగజేబు దక్కన్‌లో తోడరమల్లు భూమిశిస్తు విధానాన్ని అమలుపరిచాడు.

## ఇ) ఔరంగజేబు :

ఇతని కాలమున మొగలుల దక్కన్ విధానము తారాపథము నందుకొనెను. బీజపూర్, గోల్కొండ సుల్తానులు షియామతస్థులు. ఔరంగజేబు సున్నీ ముస్లిం అయినందువలన వారిని ఏవగించుకునేవాడు. బీజపూర్, గోల్కొండ సుల్తానులు తన కొలువులలో హిందువులకు ఉన్నత పదవులను ఇచ్చారు. వీరు మహారాష్ట్రుల విజృంభణను అదుపులో పెట్టలేకపోయారు. ఈ కారణాలచేత ఔరంగజేబు దక్కన్‌లోని షియారాజ్యాలపై తన సైన్యాలను నడిపాడు. ముందుగా బీజపూర్ ముట్టడి జరిగింది.

ఈ సమయంలో మహారాష్ట్రులు, గోల్కొండ నవాబు బీజాపూర్ సుల్తాన్‌కు సహాయంచేసి, మొగల్ సేనలను ముప్పతిప్పలు పెట్టారు. కానీ ఔరంగజేబు పట్టుదల వలన పోరాటాన్ని సాగించి, **1686**లో సుల్తాన్ సికిందర్ ఆదిల్‌షాను వశపరచుకొన్నాడు. ఆ తదుపరి ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని జయించడానికి పూనుకొన్నాడు. గోల్కొండ సుల్తాన్ అబుల్‌హసన్ కుతుబ్‌షా ప్రజారంజకంగా రాజ్యమేలుతున్నారు. అతని ఆస్థానంలో అక్కన్నమాదన్నలు మంత్రిగా, సేనానిగా వ్యవహరిస్తూ పరిపాలనను కడు సమర్ధవంతంగా నడుపుతుండేవారు. ఔరంగజేబు కుట్రతో వీరిద్దరిని హైదరాబాద్ నగరవీధులలో చంపించి, సుల్తానును ఓడించి **1687**లో గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించాడు. అబుల్‌హసన్‌ను దౌలతాబాద్ కోటలో బందీచేశాడు. మహారాష్ట్రలో శివాజీ విజృంభించి మొగల్ రాజ్యాలపై దోపిడీలు ప్రారంభించాడు. ఔరంగజేబు శివాజీని అణచలేక, గత్యంతరంలేక రాజుగా గుర్తించాడు.

## ఎఫ్) ముగింపు :

మొగలులు దక్కన్‌ను తమ పాదాక్రాంతము చేసుకోవడానికి యుద్ధాలు చేసారు. అందువలన మొగలుల ఖజానాకు సైన్యమునకు అపారనష్టం కల్గింది. యుద్ధాల వలన మొగల్ సైనిక బలహీనత, వారి స్వామిద్రోహ చింత బహిర్గతమయ్యింది. బీజపూర్, గోల్కొండ ఆక్రమణతో దక్కన్‌లో మహారాష్ట్రులు విజృంభించారు. సుమారు **25** సంవత్సరములు ఔరంగజేబు రాజధానికి దూరముగా నుండుటచే మొగల్ దర్బారునందు క్రమశిక్షణ లోపించినది. ముఠాలు ఏర్పడి అధికారం కొరకు తగవులాడుకోసాగారు. ఇటువంటి పరిస్థితులలోనే శిక్కులు, జాటులు, బుందేలులు బలవంతులై స్వతంత్రులు కాసాగారు. జాధునాధ్ సర్కార్ మాటలలో స్పెయిన్ రాచపుండు నెపోలియన్‌ను నాశనము చేస్తే, దక్కన్ రాచపుండు ఔరంగజేబు నాశనం చేసింది.

## 9.3 శిక్కులు - మొగలులు :

మధ్యయుగంలో భారతదేశమందు ఇస్లాం ప్రభావం వల్ల జనించిన భక్తి ఉద్యమ ప్రవక్తలలో గురునానక్ ఒకడు. ఇతడు స్థాపించిన మతమే శిక్కుమతం. ఇతని అనుచరులే శిక్కులు. వీరు మొదట శాంతియుత సహజీవనం గడిపి అన్నివర్గాల వారితోను, మొగలాయిలతోను స్నేహభావం కల్గియుండిరి. నానక్ బాబర్‌నకు సమకాలికుడు. నానక్ తన బోధనలు ప్రచారం చేయుటకు తనకు వారసుడుగా అంగద్‌ను గురువుగా నియమించెను. అంగద్ నానక్ జీవితచరిత్రను వ్రాసెను. ఇతడు హుమాయూన్ సమకాలికుడు. హుమాయూన్ ఇతనిని దర్శించి దీవెనలు పొందెను. అంగద్ తరువాత అమర్‌దాస్ గురుపీఠమలంకరించాడు. ఇతనికి అక్బర్ ఒక జాగీర్‌ను దానం చేశాడు. అమర్‌దాస్ తరువాత గురుపీఠమలంకరించిన రామదాస్ అక్బరుతో స్నేహభావం వహించి అతని వద్దనుండి పంజాబ్‌లో ఒక చిన్న స్థలాన్ని సంపాదించి అచట అమృతసరస్సును త్రవ్వించి, దానిమధ్య సువర్ణదేవాలయ నిర్మాణం ప్రారంభించాడు. రామదాస్ తరువాత శిక్కుగురువైన అర్జున్‌సింగ్ స్వర్ణదేవాలయ నిర్మాణము పూర్తిచేసెను. ఇతడు నానక్ బోధనలన్నింటిని శిక్కులకు పవిత్ర గ్రంథమైన ఆంధిగ్రంథ్‌గా సంకలనం చేశాడు. ఇతడు అక్బర్‌తో స్నేహభావమును కల్గియున్నను జహంగీర్‌పై తిరుగుబాటు చేసిన ఖుస్రూను అర్జున్‌సింగ్ ఆశీర్వదించిన జహంగీర్ అతనికి జరినామా విధించాడు. ఈ జరినామాను అర్జున్‌సింగ్ చెల్లించుటకు నిరాకరించగా జహంగీర్ అతనిని ఉరితీయించెను. ఈ చర్య వలన శిక్కులు సైనిక జాతిగా రూపొంది మొగలులను ప్రతిఘటింపసాగిరి. ఇట్లు మొగల్ - శిక్కు మైత్రి సంఘర్షణగా మారి, తుదకు మొగల్ సామ్రాజ్య విచ్ఛిన్నానికి ప్రముఖ కారణమయ్యెను. ఆరవ శిక్కు గురువు హరగోవింద్ శిక్కులకు యుద్ధ పద్ధతులందు శిక్షణనిచ్చి వారిని యుద్ధవీరులుగా మార్చెను. ఇతడు మొగలులతో ప్రత్యక్ష యుద్ధమునకు దిగి షాజహాన్ సైన్యమును సంగ్రామ్ వద్ద ఓడించెను. కాని షాజహాన్ చేతిలో ఓడి కాశ్మీర్ కొండ ప్రాంతాలకు పారిపోయెను. హరగోవింద్

తరువాత శిక్కుగురువైన హరరాయ్ షాజహాన్‌తో సత్సంబంధాలు కల్గియున్నను వారసత్వ యుద్ధంలో దారాకు సాయపడుట వలన ఔరంగజేబు ఆగ్రహావేశాలకు గురిఅయ్యెను. హరరాయ్ తరువాత హరకృష్ణ శిక్కు గురవయ్యెను. హరకృష్ణ తరువాత తేజ్‌బహదూర్ గురుపీఠమధిష్టించెను. ఔరంగజేబు మతవిధానమును ప్రతిఘటనను సాగింపవలసినదిగా కాశ్మీరునందలి హిందువులను ఇతడు ప్రోత్సహింపగా ఇది సహింపని ఔరంగజేబు ఇతనిని నిర్భందించి మొగల్ ఆస్థానమునకు కొనితెచ్చెను. ఆస్థానమున ఇస్లాం స్వీకరించుటకు తేజ్‌బహదూర్ నిరాకరించినందువలన ఔరంగజేబు ఇతనిని వధించెను. శిక్కులు ప్రతీకారకాంక్షతో మొగలాయిలను నిర్మూలించుటకు బద్ధకంకణులైరి. తేజ్‌బహదూర్ మరణానంతరం గురుగోవింద్‌సింగ్ మొగలాయిలను నిర్మూలించుటకు శిక్కుసంఘమును సంస్కరించి వారిని సైనిక జాతిగా తీర్చిదిద్దెను. ఇతడు పంజాబ్‌లోని కొండజాతుల వారిని ఓడించి చిన్న స్వతంత్ర రాజ్యమును స్థాపించి మొగలాయిలను ఎదుర్కొనసాగెను. ఔరంగజేబు పంపిన అనేక దాడులను త్రిప్పికొట్టెను. కాని ఈ దాడులలో తన నల్గురు కుమారులను మొగలులు బంధించి క్రూరంగా వధించారు. అయినను చలింపక గోవింద్‌సింగ్ మొగల్ సైన్యమును ముక్తేశ్వర్‌వద్ద ఓడించి, ఆనంద్‌పూర్‌ను కేంద్రముగా చేసికొని పాలింపసాగెను. ఇతడు 1708లో ఒక పఠానుచే హత్యగావింపబడెను. గురుగోవింద్‌సింగ్ మతగురువుకు బదులు రాజకీయ నాయకుడు పదవి సృష్టించి తన వారసునిగా శిక్కులకు సైనిక రాజకీయ నాయకుడుగా బందాబహదూర్‌ని నియమించెను. ఇతడు స్వతంత్ర శిక్కురాజ్యమును స్థాపించి మహమ్మదీయులను అనేక రీతుల బాధించెను. కాని మొగలాయి చక్రవర్తి ఫరూక్‌సియార్ శిక్కులను ఓడించి బందాను బంధించి హతమార్చెను. బందా మరణంతో శిక్కుజాతి అనామకమైంది. శిక్కులు సయ్యద్ సోదరుల కాలమున అతిదారుణ హింసాకాండకు గురిఅయ్యారు. అయినా శిక్కులు ధైర్యం కోల్పోక కపూర్‌సింగ్ నాయకత్వాన మొగలులను ప్రతిఘటించారు. ఈ విధంగా మొగలుల నిరంకుశ విధానమును, పరమత పీడన విధానమును శిక్కులు ప్రతిఘటించి మొగల్ సామ్రాజ్య క్షయములో ప్రముఖపాత్ర వహించి, స్వతంత్ర రాజ్యమును ఏర్పాటు చేసుకొన్నారు.

## 9.4 రాజపుత్రులు - మొగలులు :

### ఎ) బాబరు :

మధ్యయుగ భారతదేశ చరిత్రలో కీలకపాత్ర వహించిన వారిలో ఒకరు రాజపుత్రులు. మొగల్ సామ్రాజ్య స్థాపన నాటికి వీరి అధికారం ఆధునిక రాజెస్థాన్‌కు పరిమితమయి ఉండడమేకాక పడమటి సింధునది దిగువ భాగం వరకు, తూర్పున చందేరి, బుందేల్ ఖండ్ వరకు వ్యాపించిఉంది. రాజపుత్ర రాజ్యాలలో మేవార్ రాజ్యం ఉచ్ఛస్థితిలో ఉంది. 1526లో మొదటి పానిపట్టు యుద్ధంలో తనకు సహాయం చేస్తానని చెప్పి తటస్థ్యం వహించినారనే కారణంచేత, రాజ్యాన్ని స్థాపించవలెననే కారణంచేత బాబర్ రాజపుత్రులతో యుద్ధానికి దిగాడు. దానిఫలితమే కాణ్వాయుద్ధం, ఈ యుద్ధంలో బాబరు రాజపుత్ర కూటమిని చిత్తుచేసి విజయం సాధించాడు. కాణ్వాయుద్ధ పరాభవం రాజపుత్ర ప్రాభవానికి పెద్ద విఘాతాన్ని కలిగించింది. రాజపుత్రులు చిన్నాభిన్నమయినారు.

### బి) హుమాయూన్ :

హుమాయూన్ కాలంలో రాజపుత్రుల బలం పూర్తిగా పీగిపోయింది. చిత్తోడ్ రాణి కర్ణావతి హుమాయూన్ సహాయమర్థించగా ఆమెకు సహాయం చేయక రాజపుత్రుల సహకారాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయాడు.

### సి) అక్బర్ :

అక్బర్ రాజపుత్రుల విషయంలో రెండు భిన్న మార్గాలను అవలంభించాడు. అవసరాన్నిబట్టి వీరితో యుద్ధానికిదిగినా చాలావరకు వీనిని వివాహ సంబంధాలతో, మతసహనంతో లొంగదీసుకున్నాడు. మేవార్, జోధ్‌పూర్ రాజ్యాలపై యుద్ధం

ప్రకటించాడు. రాణా ఉదయ్‌సింగ్, రాణా ప్రతాప్‌సింగ్‌తో అక్బర్ తన జీవితాంతం యుద్ధం చేసాడు. చిత్తోడ్, రణతంభోర్, కలంజర్ కోటలను ఆక్రమించుకొని తన సేనలను నిలిపినాడు. తనను ఎదిరించి ఓడిపోయిన జోధ్‌పూర్ రాజును స్వతంత్రంగా ఉండనిచ్చినాడు. తనతో స్నేహానికి వచ్చిన వారితో మైత్రి నెరపినాడు. అంబర్‌రాజు బిహారీమల్ కుమార్తెను వివాహమాడినాడు. జైసల్మీర్, మార్వార్, బికనీర్ రాజులు అక్బర్‌తో వైవాహిక సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. సమర్థులైన రాజపుత్రులకు ఉన్నత ఉద్యోగాలిచ్చాడు.

### డి) షాజహాన్ :

ఇతని కాలంలో రాజపుత్ర రాజ్యాలన్నీ మొగల్ ఆధిపత్యాన్ని ఆమోదించాయి. తండ్రి కాలంలో మేవాడ్‌తో యుద్ధంచేసి నానా భీభత్సంచేసినా సంధి తరువాత వారితో స్నేహాన్ని సాగించాడు. తనపై తిరుగుబాటు కాలంలో కొంతకాలం సిసోదియారాజు కరణ్‌సింగ్ రక్షణలో ఉన్నాడు. చిత్తోడ్‌ని ఆక్రమించి పునరుద్ధరించవలెనని ప్రయత్నించాడు గాని ఆ ప్రయత్నం ఫలించలేదు.

### ఇ) ఔరంగజేబు :

ఇతని కాలంలో మొగల్ రాజపుత్ర సంబంధాలు రకరకాలుగా మార్పులు చెందాయి. 1679లో జిజియాపన్ను విధించటంచేత ఔరంగజేబు మతవిద్వేష విధానాలు రాజపుత్రులను తిరుగుబాటుదారులుగా మార్చినాయి. బాబరు కాలం నుండి షాజహాను కాలం వరకు మొగల్ చక్రవర్తులతో యుద్ధంచేసిన మేవాడ్‌రాజులు ఔరంగజేబు కాలంలో స్నేహసంబంధాలను నెలకొల్పారు. అంతవరకు మిత్రులుగా ఉన్న మార్వారు రాజ్యం మొగలాయిలకు బద్ధ శత్రువుగా మారింది.

### ఎఫ్) కడపటి మొగలులు :

ఈ కాలంలో రాజపుత్రులకు మొగలాయిలకు మధ్య ఎటువంటి యుద్ధాలు జరగలేదు. రాజ్యస్రష్టలలో ఒక్క నిజాం-ఉల్-ముల్క్‌ను మినహాయిస్తే మిగిలినవారంతా జిజియాను నిషేదించి రాజపుత్రులతో స్నేహాన్ని స్థాపించుకోవడానికి ప్రయత్నించారు.

## 9.5 మొగలులు - పశ్చిమోత్తర సరిహద్దు రాజ్యాలు :

### ఎ) బాబర్ :

బాబర్ ఫర్గానా, సామర్‌ఖండ్‌లను పోగొట్టుకొన్న తరువాత కాబూల్‌ను 1504లో ఆక్రమించి, కాబూల్ కేంద్రంగా భారతదేశంపై దండయాత్రలు చేసి మొగల్‌రాజ్యాన్ని 1526లో స్థాపించాడు. 1530లో బాబర్ మరణించేనాటికి మొగల్‌రాజ్యం కాబూల్ నుండి బీహార్ వరకు విస్తరించింది.

### బి) హుమాయూన్ :

హుమాయూన్ తన తండ్రి బాబర్ ఆజ్ఞ ప్రకారం కాబూల్‌ను తన సోదరుడైన కమ్రాన్‌కు అప్పగించాడు. హుమాయూన్ ప్రవాసకాలంలో కాబూల్ పాలకుడు హుమాయూన్‌ను ఆదరించలేదు. హుమాయూన్ పర్షియా పారిపోయి దాని పాలకుడు షా తమాస్ప్ సహాయంతో కాందహార్, కాబూల్‌లను స్వాధీనపరచుకొన్నాడు.

### సి) అక్బరు :

అక్బరు కాలంలో కాబూల్, కాందహార్ మొగలులు ఆధీనం క్రింద వుండేది. అతని మరణానంతరం కాబూల్ మొగల్ సామ్రాజ్యంలో భాగముగా వుండగా కాందహార్ మాత్రం సామ్రాజ్యానికి వెలుపల మొగల్ గవర్నర్‌చే పాలించబడింది.

## డి) జహంగీర్ :

జహంగీర్ కాలంలో పర్షియా చక్రవర్తి మొదటి అబ్బాస్ కాందహార్‌లోని మొగల్ గవర్నర్‌తో స్నేహాన్ని నటిస్తూనే దానిని ఆక్రమించాడు. పశ్చిమోత్తర సరిహద్దులో కాందహార్ కీలకస్థానాన్ని ఆక్రమించి ఉన్నందున దాని నష్టాన్ని మొగల్ సామ్రాజ్యం భరించలేదు. కాబట్టి దానిని తిరిగి ఆక్రమించడానికి జహంగీర్ సైనిక ఏర్పాట్లుచేసి ఖుర్రంను సైన్యాన్ని నడిపించవలసిందిగా ఆజ్ఞాపించాడు. కాని ఖుర్రం సైన్యాన్ని నడపడానికి ఇష్టపడక తండ్రిపై ఎదురుతిరిగాడు. దానికి కారణం నూర్జహాన్ అనుసరించిన విధానాలే ప్రధానకారణం. జహంగీర్ తన పాలనాకాలంలో తిరిగి కాందహార్‌ను ఆక్రమించలేకపోయాడు.

## ఇ) షాజహాన్ :

షాజహాన్ కాందహార్‌ను తిరిగి ఆక్రమించటానికి ప్రయత్నించాడు. కాందహార్‌నేలే పర్షియా గవర్నర్ మొగల్ కొలువులో మున్సబ్‌దార్ ఉద్యోగాన్ని ఆశించి లంచాన్ని తీసుకొని కాందహార్‌ను మొగల్ సైన్యానికి అప్పగించాడు. ఆ తదుపరి షాజహాన్ సైన్యాలు బాల్క్, బదక్షనులను ఆక్రమించాయి కాని బాల్క్, బదక్షన్, కాందహార్‌లను మొగలాయిలు కోల్పోయారు. ఈ యుద్ధాలలో మొగలులు పరువు ప్రతిష్టలు దెబ్బతినడమేగాక, సామ్రాజ్యానికి ఆర్థిక నష్టం వాటిల్లింది.

## ఎఫ్) ఔరంగజేబు :

ఇతని కాలంలో ఆఫ్ఘనిస్థాన్‌లోని యూసఫ్ జాయిస్, ఆఫ్రిడి మొదలగు మొరటు తెగల దాడులలో పశ్చిమోత్తర సరిహద్దుప్రాంతంలో చాలా ఇక్కట్లు సంభవించాయి. ఔరంగజేబు ఈ తెగల నాయకులకు లంచం ఇచ్చి అదుపులో పెట్టాలనుకున్నాడు కాని ప్రయోజనం లేకపోయింది. లంచాలు ఇచ్చేకొద్దీ మొరటు తెగలవారి దురాక్రమణలు ఎక్కువవుతూ ఉండేవి. విసిగిపోయిన ఔరంగజేబు సైనికచర్యల ద్వారా **1676** నాటికి ఈ దండయాత్రలను అరికట్టగలిగినాడు.

## 9.6 ఐరోపావారు :

మొగలాయిలు వర్తక వాణిజ్యాలు కోసం ఐరోపావారితో సంబంధాలు పెంచుకున్నారు. ప్రథమంలో ఐరోపావారి వర్తక నౌకలు వర్తక సంఘాల అధిపతులు నాయకత్వంలో వ్యాపారం కోసమే వచ్చినా ఆ తదుపరి తమ వ్యాపారాభివృద్ధి కోసం ఐరోపావారు స్థానిక ప్రతినిధులను రాయబారులను పంపారు. ఐరోపా వారితో మొగలుల సంబంధం అక్బర్‌తో ప్రారంభమయింది.

## ఎ) పోర్చ్‌గీసువారు :

అక్బరు రాజ్యానికి వచ్చేనాటికి భారతదేశంలో పోర్చుగీసువారు మాత్రమే ఉన్నారు. గుజరాత్, బెంగాల్ దండయాత్రల సందర్భంలో వీరు అక్బరుకు పరిచయమయి కానుకలు సమర్పించారు. తత్వ జ్ఞానాసక్తుడయిన అక్బరు క్రైస్తవ మతాచార్యుల కోసం గోవాలో స్థావరమేర్పరచుకొన్న పోర్చుగీస్ అధికారుల ద్వారా రాయబారం పంపాడు. మక్కా యాత్రకు వెళ్ళే మహమ్మదీయులకు రక్షణ కల్పించటం కోసం పోర్చుగీసువారికి అన్ని వర్తక సౌకర్యాలు కల్పించాడు. జహంగీరు కాలంలో ప్రథమంలో మంచి సంబంధాలు ఉన్నప్పటికీ ఆంగ్లేయుల రాకతో పోర్చుగీసువారు మొగలులతో తగాదాలకు దిగారు. ఆంగ్లేయులు తమతో పోటీకివస్తే తమ వ్యాపారం సన్నగిల్లుతుందనే భయంతో చక్రవర్తికి వారిమీద చాడీలు చెప్పారు. వారికి వర్తక సౌకర్యాలు ఇస్తే పరిస్థితులు విషమిస్తాయని భయపెట్టారు. జహంగీర్ ఆంగ్లేయులకు వర్తక సౌకర్యాలు కల్పించడమేగాక వారి సహాయంతో పోర్చుగీసువారిని అణచడానికి ప్రయత్నించాడు. షాజహాన్ కాలంలో మొగలులకు పోర్చుగీసువారికి మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమన్నది. ముంతాజ్ బేగం బానిసలను బందీలుగా తీసుకొని వెళ్ళటం దీనికిప్రధాన కారణం. షాజహాన్ బెంగాలులోని పోర్చుగీసువారి స్థావరం హుగ్లీపై దాడిజరిపి దానిని నేలమట్టంచేసి వేలకొలది పోర్చుగీసువారిని చంపించెను. ఔరంగజేబు కాలంలో వీరి అధికారం అడుగంటినది.

**బి) డచ్చివారు :**

డచ్చివారు మొదటిసారిగా జహంగీర్ కాలంలో భారతదేశం వచ్చారు. పోర్చుగీసువారిని ఓడించి డచ్‌వారు చిన్‌సూరా ప్రాంతాన్ని ఆక్రమించి ఆ తదుపరి చక్రవర్తి నుండి వర్తకానికి అనుమతి పత్రాలు పొందారు. షాజహాన్ రాగానే అభినందనలు తెలిపి కానుకలు సమర్పించి తమ వ్యాపారాభివృద్ధి చేసుకున్నారు. ఔరంగజేబు కాలంలో కూడా వారి వ్యాపారం యధావిధిగా నడిచింది. ఆంగ్లేయుల అధికారం పెరగడంవల్ల కడపటి మొగలుల కాలంలో వీరి వ్యాపారం దెబ్బతిన్నది.

**సి) ఆంగ్లేయులు :**

ఆంగ్లేయులు మొదటిసారిగా జహంగీర్ కాలంలో మొగలులతో వర్తక సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆంగ్లేయులు జహంగీర్ అనుమతితో సూరత్, అహమ్మదాబాద్, బ్రోచ్, ఆగ్రాలలో ఫ్యాక్టరీలు కట్టుకొన్నారు. షాజహాన్ కాలంలో వీరు బెంగాల్, ఒరిస్సాలలో హుగ్లీ, కాశీబజార్, భాలాసూర్, హరిహరపూర్ సంపాదించారు. ఔరంగజేబు వీరిని క్షమించి అంతవరకు వారు పొందిన హక్కులను గుర్తించాడు. మొగల్ చక్రవర్తి అనుమతితో ఆంగ్లేయులు బర్ద్వాన్, గోవిందపూర్, సుతనతి, కలకత్తాలను సంపాదించి ఫోర్టువిలియం కోటను కట్టించారు. కడపటి మొగలుల కాలంలో ఆంగ్లేయులు మరికొన్ని సంపాదించుకొని చాలామటుకు స్వతంత్రంగా వ్యవహరించారు.

**డి) ఫ్రెంచివారు :**

వర్తకం కోసం భారతదేశం వచ్చిన ఐరోపావారిలో ఫ్రెంచివారు కడపటివారు. వీరు 1667లో మొదట సూరత్‌వద్ద ఫ్రెంచి ఫ్యాక్టరీని స్థాపించారు. ఆ తదుపరి బెంగాల్ గవర్నర్ అనుమతితో బాలాసూర్, కాశీంబజార్, చంద్రనగర్‌లలో ఫాక్టరీలు నిర్మించారు. ఆ తరువాత కరైకాల్, సూరత్, మచిలీపట్టణంలలో ఫాక్టరీలను నిర్మించారు. వీరికి మొగలాయిలతో ఎట్లాంటి తగాదాలు జరగలేదు.

**మాదిరి ప్రశ్నలు :**

**ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.**

1) మొగలుల దక్కన్ విధానమును పరిశీలింపుము.
2) మొగలుల రాజపుత్ర విధానాన్ని వివరింపుము.
3) మొగల్ శిక్కు సంబంధాలను వివరింపుము.
4) మొగలుల పశ్చిమోత్తర సరిహద్దు విధానాన్ని వివరింపుము.
5) ఔరంగజేబు దక్కన్ విధానము
6) మొగలాయిల రాజపుత్ర విధానము

**చదువతగిన గ్రంథాలు :**


1. S.R. Sarma - Mughal Empire in India
2. R.P. Tripati - Rise and Fall of the Mughal Empire
3. J. L. Mehta - An advanced study in the history of Medieval India
4. Iswari Prasad - A short History of Muslim Rule in India


**- V. K. MOHAN**

పాఠం - 10

# మొగల్ పరిపాలనా పద్ధతి

**విషయసూచిక**


10.0 లక్ష్యం

10.1 ఉపోద్ఘాతం

10.2 కేంద్ర ప్రభుత్వం

10.3 రాష్ట్ర ప్రభుత్వం

10.4 ఆదాయ వనరులు, భూమిశిస్తు

10.5 సైనికపాలన

10.6 న్యాయపాలన

10.7 తపాలా గూఢచారిశాఖ

10.8 అటవీ శాఖ

10.9 టంకశాలలు

10.10 మతవిధానం

10.11 ముగింపు


## 10.0 లక్ష్యం :

మొగల్ పరిపాలనా విధానం గూర్చి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 10.1. ఉపోద్ఘాతం :

క్రీ.శ. 1526లో జరిగిన మొదటి పానిపట్టు యుద్ధంలో బాబర్ విజయం సాధించి ఢిల్లీలో మొగల్ వంశాన్ని స్థాపించాడు. ఈ వంశంలో మూడవ చక్రవర్తి అక్బరు. సువిశాల సామ్రాజ్యమును నిర్మించుటయేగాక, దాని సుస్థిరతకు చక్కని పరిపాలనా విధానమును రూపొందించాడు. అక్బరు ప్రవేశపెట్టిన పాలనా విధానాన్ని కొద్ది మార్పులతో అతని వారసులు కొనసాగించారు. అక్బర్ పరిపాలనా విధానములోని ముఖ్యలక్షణాలు కేంద్రీకృత పాలనా వ్యవస్థ, ప్రాజ్ఞ నిరంకుశ రాజరికం, లౌకిక రాజ్యము, జాతీయతా భావం మొదలగునవి. ఐనీ - అక్బరీ, చక్రవర్తుల రాజాజ్ఞలు, విదేశీయుల రచనలు మొగల్ పాలనను గురించి పెక్కు వివరాలను విపులంగా ఇచ్చినాయి.

## 10.2 కేంద్ర ప్రభుత్వం :

### ఎ) చక్రవర్తి :

సామ్రాజ్యానికంతటికీ చక్రవర్తే సర్వాధికారి. మొఘలులు మీర్జా, సుల్తాన్, పాదుషా అనే బిరుదులు స్వీకరించారు. చక్రవర్తి మాట శిలాశాసనం. చక్రవర్తి దైవాంశసంభూతుడని నాటి ప్రజల విశ్వాసం. అక్బర్‌మినహా మొగల్ చక్రవర్తులందరూ ఇస్లాం మతాధికారుల

ఆదేశానుసారం పాలన కొనసాగించారు. మొగల్ చక్రవర్తి సర్వాధికారియైనను నిరంకుశుడు కాదు. చక్రవర్తి దినచర్య - ఉదయం ప్రజలకు దర్శనమిచ్చి వారి విన్నపాలను స్వయంగా ఆలకించడం, సైనిక శిక్షణ పరిశీలించుట, రాజ్యవ్యవహారాలు సరిదిద్ది, విదేశీ రాయబారులను, ఉన్నతోద్యోగులను పరామర్శించుట, మధ్యాహ్నం రాజ్య వ్యవహారాలు తనిఖీచేసి సాయంత్రం సంగీత సాహిత్య గోష్టులు జరుపుట, రాత్రి మంత్రులతో ముఖ్య విషయాలను ముచ్చటించుట.

### బి) మంత్రిమండలి :

చక్రవర్తి సర్వాధికారి అయినా పాలనా సౌకర్యం కోసం, సలహాలివ్వడం కోసం మంత్రులను నియమించారు. చక్రవర్తి వీరిని తొలగించవచ్చు. మంత్రులందరిలో ముఖ్యుడు రెవిన్యూ మంత్రి. మంత్రులు చక్రవర్తికి ఉద్యోగులకు మధ్య వంతెన వంటివారు. ఈ మంత్రులు వారి విధులు :

1) వకీల్ - రాజప్రతినిధి. రాజ్యస్రష్టలంతా ఈ పదవిని స్వీకరించారు. ప్రభుత్వ యంత్రాంగమంతయు ఇతడు పర్యవేక్షిస్తాడు.
2) దివాన్ లేక వజీర్ - ఆర్థికమంత్రి. భూమిశిస్తు, పన్నులు, ఆదాయవ్యయాలు ఇతర ఆర్థిక విధానాలు పర్యవేక్షిస్తాడు.
3) మీర్‌బక్షీ - సేనాపతి. సైనిక, పౌర ఉద్యోగులకు జీతాలిచ్చువాడు.
4) మీర్‌సమన్ - అంతఃపుర విషయాలు పరిశీలించడం, సైనికులకు సరుకుల సరఫరా ఇతని విధి.
5) మమతాసీచ్ - ఇతడు నీతి నిజాయితీలకు రక్షకుడు.
6) చీఫ్‌సదర్ - మతవిషయాలను నిర్వహిస్తాడు.
7) చీఫ్‌క్వాజీ - ఇతడు న్యాయశాఖామంత్రి.

మంత్రులకు సహాయం చేయటానికి ఉద్యోగులు, వారి కోసం కార్యాలయమూ ఉండేవి. మొగలుల కాలంలో ఉద్యోగులు కార్యాలయాలకు అనుబంధంగా రికార్డు ఆఫీస్‌కూడ ఉండేది. అర్హతనుబట్టి ఉద్యోగులను చక్రవర్తి నియమిస్తాడు. వీరి జీతాలు ప్రభుత్వ ఖజానా నుంచి ముట్టేవి.

## 10.3 రాష్ట్ర ప్రభుత్వం :

పాలనా సౌలభ్యం కొరకు అక్బరు రాజ్యాన్ని సుబాలుగా, సూబాలను సర్కారులుగా, సర్కారులను పరగణాలుగా విభజించాడు. పరగణాల కింద గ్రామాలుండేవి. ఇవిగాక ప్రతి పట్టణానికి ఒక అధికారి ఉండేవాడు.

### ఎ) సుబా :

దీని పాలకుడు సుబేదారు. కేంద్ర ప్రభుత్వంలో చక్రవర్తివలే ఇతడు సుబాకు సంపూర్ణ అధికారి. సుబాయందు శాంతిభద్రతల పరిరక్షణ, న్యాయ నిర్వహణ, రాష్ట్ర సైన్యంపై అజమాయిషీ మొదలగు పౌర, సైనిక అధికారాలు ఇతనికి కలవు. ఇతనికి సలహాలివ్వడానికి కేంద్రంలోవలె దివాన్, బక్షీ, సదర్, ఖాజీ అనే ఉద్యోగులున్నారు. వీరుగాక మరికొందరు ఉద్యోగులు ఉన్నారు. వీరు రాష్ట్రానికి సంబంధించిన పాలనా వివరాలను పరిశీలిస్తూ ఉండేవారు.

### బి) సర్కారు :

సుబా తరువాత పాలనా విభాగం సర్కార్. దీని పాలనాధికారి ఫౌజ్‌దార్. ఇతనిని సుబేదారు నియమిస్తాడు. సర్కారులో అలజడులను అణచి రహదారుల్లో రక్షణ కల్పించి ప్రజలను కాపాడటం ఇతని విధి.

## సి) పరగణా :

సర్కార్ తరువాత విభాగం పరగణా. దీనికి షిక్‌దారు అధికారి. శాంతిభద్రతల పరిరక్షణ, న్యాయ నిర్వహణ షిక్‌దారు విధులు. పరగణా అధికారులలో ప్రధానులు కనుంగో, అమీల్, అమీన్, పోత్‌దార్. పోత్‌దార్ పరగణా ఖజానాదారు, కనుంగో రెవిన్యూ తగాదాలను పరిశీలించేవాడు.

## డి) గ్రామం :

ప్రతి పరగణాయందు అనేక గ్రామాలు గలవు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా గ్రామపెద్దల అధికారంలో గ్రామపాలన జరిగింది. ముకద్దమ్, పట్వారీ అనే ఇద్దరు ఉద్యోగులు గ్రామంలో ప్రభుత్వప్రతినిధులుగా పనిచేసేవారు. శిస్తు వసూలుచేసి, గ్రామ పరిరక్షణ చేయుట వీరి విధి.

## ఇ) పట్టణపాలన :

మొగలులు నగరపాలన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణానికి కొత్వాల్ సర్వాధికారి. ఇతడు ప్రధానంగా పోలీస్, న్యాయ విధులను నిర్వర్తించేవాడు.

## 10.4 ఆదాయ వనరులు - భూమిశిస్తు :

మొగలు ఆదాయ వనరులలో ప్రధానమైనవి ఎగుమతి, దిగుమతి పన్నులు, ఉప్పు పన్ను, నిర్వారసుల ఆస్తి సంక్రమణ, బహుమతులు, సామంత రాజులు చెల్లించు కప్పం, జకత్ (ముస్లిం మతస్థులపై విధించు పన్ను) జిజియా, భూమిశిస్తు. ప్రభుత్వ ఆదాయం ఉద్యోగుల జీతాలకు, యుద్ధాలకు, చక్రవర్తి భవనానికి, రాజాంతఃపురానికి, కోటల, రహదార్ల, నీటివసతుల నిర్మాణాలు, పామరజన పోషణ, పండిత, కవి, గాయక, కళాకారుల సత్కారం మొదలగు వాటికి ఖర్చు అయ్యేది.

## ఎ) భూమిశిస్తు :

బాబర్, హుమాయూన్‌లు భూమిశిస్తు విషయంలో ఎటువంటి సంస్కరణలు ప్రవేశపెట్టలేదు. ఏ ప్రాంతంలోఉన్న ఆచారాన్నిబట్టి ఆ ప్రాంతంలో భూమిశిస్తు వసూలుచేశారు. అక్బరు సింహాసనానికి వచ్చిన తరువాత భూమిశిస్తు, పన్ను విధానంలో, భూమి పంపిణీ విధానంలో పెక్కు మార్పులు చేసాడు. భూమిశిస్తు విధానంలో అక్బరు షేర్షా అడుగుజాడలలో నడిచి తన ఆర్థిక మంత్రి రాజాతోడర్‌మల్ సహాయంతో అంతకు పూర్వమందున్న లోపాలను తొలగించి 'బందోబస్తు' పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతి మూడు సూత్రాలపై ఆధారపడింది. అవి 1) భూమి సర్వే 2) పంట భూములను వాటిసాగుబడి, కాలమును బట్టి విభజన 3) శిస్తు నిర్ణయం. రాజ్యంలోని పంట పొలమంతా సర్వేచేయబడింది. పంట పొలములను కొలుచుటకు జరీబ్ (ఇనుప రింగులతో అతికించిన పెద్ద వాసాలు) అను సాధనమును ఉపయోగించాడు. సాగుబడినిబట్టి, ఫలసాయాన్నిబట్టి భూమిని 4 తరగతులుగా విభజించాడు. అవి పోలజ్, పరౌటీ, చచార్, బంజర్. మరల ప్రతిరకం భూమిని ఉత్తమ, మధ్యమ, అధమ అను మూడు రకాలుగా విభజించారు. ఆ తదుపరి ప్రతిరకము భూమినందు 10 సంవత్సరాలు దిగుబడితేల్చి వాని సరాసరి నిర్ణయించి అందులో మూడవవంతు శిస్తుగా నిర్ణయించాడు. ఈ శిస్తు ధనరూపంలోగాని, ధాన్యరూపంలోగాని చెల్లించవచ్చును. ఈ శిస్తును రైతులు నేరుగా ప్రభుత్వానికి చెల్లించాలి. శిస్తు వసూలునందు ప్రభుత్వానికి రైతుకు మధ్య దళారులు లేకుండుట వలన ఈ విధానము 'రైత్వారీ విధాన'ముగా ప్రసిద్ధికెక్కెను. రైతులకు పట్టాలిచ్చి వారివద్దనుండి శిస్తు చెల్లింపు ఒడంబడికలు తీసుకున్నాడు. వచ్చే ఆదాయాన్ని, ప్రభుత్వానికి కట్టవలసిన పన్నును రైతుకు నికరంగా తేల్చే పద్ధతి గనుక ఇరుపక్షాల వారికి ఇది లాభదాయకమయింది. రెవిన్యూ ఉద్యోగుల బారినుండి రైతుకు రక్షణ ఏర్పడింది.

## 10.5 సైనికపాలన :

భారతదేశ చరిత్రలో ప్రప్రథమంగా జీతాలు సూత్రంపై సైన్యాన్ని స్థాపించినవారు మొగలులు. వీరి సైన్యంలో వివిధ జాతులవారు, ప్రాంతాలవారు, భాషలవారు కలరు. మొగల్ సైన్యంలో చక్రవర్తి సైన్యం, మునసబ్‌దారీ సైన్యం అను రెండు ప్రధాన విభాగాలు కలవు. చక్రవర్తి సైన్యం స్థిర సైన్యం. ఇది చక్రవర్తి పర్యవేక్షణలో ఉంటుంది. మునసబ్‌దారీ సేనలపై మునసబ్‌దారులు సర్వాధికారులు. మొగలులు తమ సైన్యాన్ని కాల్బలం, నౌకాదళం, గజదళం, ఫిరంగిదళం, అశ్వికదళం అని 5 రకాలుగా విభజించారు.

### ఎ) మన్సబ్‌దారీ విధానం :

మొగలాయి సైనిక విధానంలో మన్సబ్‌దారీ విధానం చాలా ముఖ్యమయినది. మొగల్ సైన్యంలో మన్సబ్‌దారీ సేనలే అధికం. మున్సబ్ అనగా హోదా లేదా సైనికశ్రేణిలో గల ఒక తరగతి అని అర్థం. ధైర్యం, సాహసం, యుద్ధనైపుణ్యం, సేనలను నడపగల శక్తి ఉన్నవారికి ఈ పదవి ఇవ్వడం జరిగింది. చక్రవర్తికి అవసరమగునపుడు సైనిక తదితర సహాయములు చేయుట మున్సబ్‌దార్ ముఖ్యవిధి. మునసబ్‌దారి విధాన లక్షణాలు.

1) ప్రతి మున్సబ్‌దారు తన హోదాకి తగ్గట్లు నిర్ణీతమైన అశ్వికులను, అశ్వాలను పోషించవలెను. దీనికి అగుఖర్చు చక్రవర్తి భరించును.
2) మన్సబ్‌దార్ నియామకం, తొలగింపు, వేతనములు చక్రవర్తి ఇష్టప్రకారం జరుగును.
3) మన్సబ్‌దారీ విధానం వంశపారంపర్యం కాదు.
4) మున్సబ్‌దారుల వేతనం జాగీరుల రూపమునగాని, నగదు రూపంలోగాని చెల్లించవచ్చును.
5) ప్రతి మున్సబ్‌దార్ సైనిక, పౌర విధులను నిర్వహించవలెను.

మున్సబ్‌లను 66 తరగతులుగా అక్బర్ విభజించినా 33 తరగతుల వరకే అమలులో పెట్టాడు. అక్బర్ కాలంలో మునసబ్ సంఖ్య 10 నుంచి 12,000 వరకు మాత్రమే పరిమితమయి ఉండేది. ఈ 33 శ్రేణులుగాక జాత్, సవారీ అను రెండు హోదాలు కూడా మున్సబ్‌దారులకు కలవు. జాత్ అనగా వ్యక్తిగత హోదా, సవార్ అనగా అదనపు హోదా. ఈ అదనపు హోదాకు అదనపు వేతనం చెల్లింపబడును. వారు అదనపు అశ్వికులను పోషించవలెను. మస్తరు సమయమున మన్సబ్‌దారులు మోసగించకుండా నిరోధించుటకై అశ్వికులకు ఆనవాళ్ళు వ్రాయించెను. అశ్వాలకు రాజముద్రలు వేయించెను. మన్సబ్‌దారీ విధానమందు లాభనష్టాలు రెండూ కలవు.

1) యుద్ధ సమయంలో సైనికులుగా, శాంతి సమయంలో సివిల్ ఉద్యోగులుగా మన్సబ్‌దారులు ఉపకరించారు. పేరుకు మన్సబ్‌దార్ స్వతంత్రుడయినా చక్రవర్తి జీతంపై ఆధారపడి ఉన్నందువల్ల మనసబ్ సేనలకు కూడ చక్రవర్తే సర్వాధికారి.

2) సాధారణంగా ప్రతి మన్సబ్‌దారీ సేనలో తన జాతీయులనే చేర్చుకొనేవాడు. దీనివలన మొగల్ సామ్రాజ్యమునకు ప్రజల విశ్వాసమును పొందగలిగిరి. 1) ఈ విధానమందు సైనికునికి, చక్రవర్తికి ప్రత్యక్ష సంబంధంలేదు. 2) అందువలన సైనికులు చక్రవర్తి కంటే మన్సబ్‌దారుకే ఎక్కువ విధేయత కల్గియుండిరి. 3) మన్సబ్‌దారులు తమ జాతివారినే సైనికులుగా ఎంపిక చేయుటవలన మొగల్ సైన్యమందు ఏకత్వం లోపించింది.

## 10.6 న్యాయపాలన :

బాబర్, హుమాయూన్‌ల కాలంలో ఇస్లాం మతం ప్రకారం న్యాయపాలన నడిచింది. ఇస్లాం ప్రకారం న్యాయశాస్త్రంలో షరాయ్, ఉర్ఫీ అను రెండు తరగతులున్నాయి. షరాయ్ ప్రకారం వివాహం, రాజ్యసంక్రమణ, వారసత్వం మొదలయిన విషయాలు ఖురాన్ ఆధారంగా తీర్పులిచ్చేవారు. ఉర్ఫీ ప్రకారం వర్తకవ్యాపారాలు, యుద్ధ విషయాలు ముస్లిం రాజులిచ్చిన తీర్పులనాధారంగా న్యాయవిచారణ జరిపేవారు. హిందువుల విషయంలో హిందూగ్రంథాలు ఆధారంగా తీసుకొనేవారు. అక్బర్ రాజ్యాన్ని మతరహితం చేశాడు. కాబట్టి మతపరమయిన విషయాలు సదర్ అధీనంలో ఉంచి న్యాయవిషయాలను చూడటానికి ఖాజీ అనే ఉద్యోగిని నియమించాడు. జహంగీర్ న్యాయపాలన విషయంలో 12 శాసనాలు ప్రకటించాడు. ఇతని ధర్మఘంట కీర్తి ప్రపంచ వ్యాప్తమయ్యింది. ఔరంగజేబు ఖురాన్‌లోను, ఇతర మత గ్రంథాలలోను లేని సూత్రాలను సమకూర్చి న్యాయపాలన కోసం వీటిని 'ఫతావా ఇ అలంగీర్' అను పేరుతో గ్రంథ రూపంలో ప్రచురించాడు. దీనిలోని ప్రధానఅంశాలు న్యాయాధికారి ఆజ్ఞలేకుండా ఏ వ్యక్తిని కారాగారంలో వేయరాదు. కారాగార శిక్ష విధించిన వెంటనే జాప్యం లేకుండా విచారణ చేయాలి. న్యాయరక్షణలో ఉద్యోగులంతా చక్రవర్తిని అనుసరించాలి.

### ఎ) న్యాయస్థానాలు :

చక్రవర్తి దర్బారు సామ్రాజ్యంలో ఉన్నత న్యాయస్థానం. చక్రవర్తి తరవాత కేంద్ర ప్రభుత్వంలోని ఖాజీ ప్రధాన న్యాయాధికారి. రాష్ట్రాలందు సుబేదారులు, పట్టణాలందు, సర్కారులందు ఖాజీలు గ్రామములందు గ్రామపంచాయితీలు న్యాయవిచారణ చేసేవారు. ఇస్లాం మతగ్రంథాలు ప్రతి నేరానికి శిక్షలు విధించినా మొగలులు చాలా వాటిని పాటించలేదు. జరిమానా, జైలుశిక్ష, అంగవిచ్ఛేదం, కొరడా దెబ్బలు సాధారణ శిక్షలు. బలిష్టమయిన రక్షణ దుర్గాలను కారాగారులుగా ఉపయోగించారు.

## 10.7 తపాలా గూఢచారిశాఖ :

ఈ శాఖ దేశవ్యాప్తమయినది. దీనికి కేంద్రంలో ఒకమంత్రి ఉండేవాడు. సుబా, సర్కార్, పరగణా విభాగాలనుంచి ఈ మంత్రికి ఎప్పటికప్పుడు వార్తలందేవి.

## 10.8 అటవీశాఖ :

మొగల్ చక్రవర్తులు అడవుల విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకొని వాటి రక్షణ కోసం పుల్లరి వసూలు చేయడానికి ఉద్యోగులను నియమించి వారిపై ఒక అధికారిని నియమించారు.

## 10.9 టంకశాలలు :

మొగలుల కాలంలో ఢిల్లీ, ఆగ్రాలలోనే గాక చాలచోట్ల టంకశాలలను ఏర్పాటుచేశారు. రాగి, వెండి, బంగారము ఉపయోగించిన మిశ్రమలోహాలలో నాణాలు చేశారు. ప్రభుత్వమేగాక ప్రైవేటు వ్యక్తులు కూడా రాజానుమతితో నాణేలు చేసారు.

## 10.10 మతవిధానం :

మొగల్ చక్రవర్తులు మతవిధానంలో మధ్యేమార్గాన్ని అనుసరించారు. ఇతర ముస్లిం రాజులవలె హిందువులను కేవలం మతపరంగా హింసించకపోయినా ఇస్లాం మతాన్ని ప్రోత్సహిస్తూ వచ్చారు. బాబర్‌కు మతంలో మూఢత్వం లేకపోయినా హిందువులను 'కాఫిర్'లని సంబోధించి వారిపై జిజియాపన్ను విధించినాడు. రాణాసంగాపై జిహాద్ ప్రకటించి ఘాజీ బిరుదు స్వీకరించాడు.

హుమాయూన్ మతసహనం ఇస్లాంలోని శాఖా భేదాలను పరిత్యజించుటతో ఆగిపోయింది. బాబర్, హుమాయూన్‌లు స్వభావసిద్ధంగా హిందువులపట్ల విద్వేషాన్ని ప్రకటించకపోయినా కొంత విరోధాన్ని వ్యక్తపరిచారు. అక్బర్ మాత్రం మతసహనం ప్రదర్శించాడు. ఇతడు హిందువులకు సమాన హక్కులను, మతస్వాతంత్ర్యాన్ని ఇచ్చాడు. జహంగీర్ కూడా తండ్రివలె మతసహనం ప్రదర్శించాడు. కాని ఖుస్రూకు సహాయం చేసినారని శిక్కులను దండించాడు. హిందువులు అభిమానించిన దశావతారాలను దూషించాడు. షాజహాన్ కాలంలో మతసహన సిద్ధాంతం మూలబడింది. ఇతడు హిందూదేవాలయాలను ధ్వంసంచేసి ఇస్లాం వ్యాప్తికి ధనం ఖర్చుచేసాడు. ఔరంగజేబు కాలంలో మతసహన సిద్ధాంతం రద్దయింది. మొత్తం భారతదేశాన్ని ఇస్లాం రాజ్యంగా మార్చాలని ఇస్లామేతరులను శిక్షించి వారిపై తలపన్ను, యాత్రలపన్ను విధించాడు. స్వమతాభిమానం వల్ల వారిపై క్రౌర్యం ప్రకటించాడు. తత్ఫలితంగా మొగలులు రాజపుత్రుల సహాయాన్ని కోల్పోయారు. శిక్కులు, జాట్‌లు, సత్నామీలు తిరుగుబాట్లు లేవదీసారు. దక్కన్‌లో మహారాష్ట్రులు మొగలులతో పోరు ప్రారంభించారు.

## 10.11 ముగింపు :

మొగలుల పరిపాలనా పద్ధతులలో దురంధరులు. వీరు సువిశాలమైన సామ్రాజ్యాన్ని నిర్మించుటయేగాక, దాని సుస్థిరతకు చక్కని పరిపాలనా విధానమును రూపొందించారు. వీరు భారతీయ, పారశీక, అరబ్బీ పద్ధతులను మేళవించి అమలుచేశారు. స్వభావాన్నిబట్టి మొగల్ పాలనాధికారాన్ని కేంద్రీకృత నిరంకుశత్వమని, పాజ్ఞనిరంకుశత్వమని, ఉద్యోగస్వామ్యమని పలురకాలుగా వర్ణించారు. సర్‌జాదునాథ్ సర్కార్ మాటలలో మొగల్ పాలనాపద్ధతి భారతీయ వాతావరణంలో నాటుకొనిపోయిన పర్షియా - అరబ్బీ పద్ధతి. ఈశ్వరప్రసాద్ మాటలలో మహమ్మదీయుల పాలనలో మొగలుల కాలంలో ప్రథమంగా పరిపాలనాదక్షత మహోన్నతస్థాయినందుకొన్నది.

### మాదిరి ప్రశ్నలు :

### ఈ క్రింది వ్యాసరూప ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.

1. మొగల్ పరిపాలనా విధానమును వర్ణింపుము.
2. అక్బర్ పరిపాలనా విధానమును గూర్చి వివరింపుము.
3. మున్సబ్‌దారి విధానము గూర్చి వివరింపుము
4. రైత్వారీ పద్ధతి

### చదువదగిన గ్రంథాలు :


1. Iswari Prasad - A short History of Muslim Rule in India
2. S.R. Sarma - Mughal Empire in India
3. A.L. Srivatsava - Mughal Empire
4. R.P. Tripate - Rise and Fall of Mughal Empire
5. పి. ఝాన్సీలక్ష్మీ & ఎ. వైదేహి - భారతదేశ చరిత్ర - సంస్కృతిక (ద్వితీయ భాగం)


పాఠ్య రచయిత : **వి.కె. మోహన్**

పాఠం - 11

# మొగలాయిల కాలంనాటి

# సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు

విషయసూచిక

11.0 లక్ష్యం
11.1 ఉపోద్ఘాతం
11.2 సాంఘిక పరిస్థితులు
11.3 ఆర్థిక పరిస్థితులు
11.4 సారస్వతం
11.5 కళాపోషణ
11.6 ముగింపు

## 11.0 లక్ష్యం :

మొగలాయిల కాలంనాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, వారి సాంస్కృతిక వైభవం వివరించడం ఈ పాఠం లక్ష్యం.

## 11.1 ఉపోద్ఘాతం :

మొగలాయి యుగంలో సమాజంలో వివిధ వర్గాల మధ్య శాంతియుత సహజీవనం నెలకొన్నది. దేశంలో సుస్థిరమైన ప్రభుత్వం ఎక్కువకాలం ఉండటం వల్ల శాంతిభద్రతలు నెలకొల్పబడినవి. మొగల్ చక్రవర్తులు అవలంబించిన సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారం అభివృద్ధి చెందింది. అంతేగాక వీరుచూపిన ప్రత్యేక శ్రద్ధ వలన ఇస్లామిక్ వాస్తు, చిత్రకళ, సంగీతం, సాహిత్యం అభివృద్ధి చెందింది. మొగలుల కాలంనాటి సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక చరిత్రలకు అబుల్‌ఫజల్ రచనలు, విదేశీ రాయబారులు, వర్తకులు వ్రాసిన గ్రంథాలు, కట్టడాలు, చిత్రలేఖనాలు మొదలగునవి ఆధారాలు.

## 11.2 సాంఘిక పరిస్థితులు :

భారతదేశంలో మొగలాయి యుగంలో వివిధ దేశాలవారు, భిన్నమతాలవారు ఉన్నారు. వీరి ఆర్థిక స్తోమతనుబట్టి సంఘమును ఉన్నత, మధ్యమ, అధమ అని మూడు తరగతులుగా విభజించవచ్చును.

**11.2.1 ఉన్నతవర్గాల వారు :** మొగలుల కాలంలో ఇస్లాం మతానికి చెందిన మేధావులూ, సమర్థులూ, సాహసికులూ విదేశాల నుండి భారతదేశానికి వచ్చి ఢిల్లీపాలకుల ఆదరణవల్ల వజీర్లుగా, మన్సబ్‌దార్లుగ నియమింపబడినవారు. ఉన్నత ఉద్యోగులు, ఉన్నత వర్గానికి చెందినవారు. వీరు ప్రథమంలో సామ్రాజ్య విస్తరణలో ప్రముఖపాత్ర నిర్వహించారు. కాని ఆ తదుపరి వీరు విలాస జీవితానికి అలవాటుపడ్డారు. వీరు తమ సహజలక్షణాలను కోల్పోయి భోగలాలసులయ్యారు. ప్రజాధనాన్ని వీరు ఆడంబరాలకు, వ్యసనాలకు ఖర్చుచేసారు.

**2.2 మధ్యతరగతివారు :** వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ వర్గానికి చెందినవారు. వీరు పొదుపుగా, నిరాడంబరముగా జీవనం సాగించారు.

**2.3 పేదలు :** సేవకులు, శ్రమజీవులు మూడవ వర్గానికి చెందినవారు. వీరి జీవన పరిస్థితులు దుర్భరంగా ఉండేవి. వీరు చాలీచాలని కూడుగుడ్డతో అల్లాడేవారు.

**2.4 సాంఘిక ఆచారాలు :**

మొగలుల కాలంలో సంఘంలో హిందువులు అత్యధిక సంఖ్యాకులు, ముస్లింలు అల్పసంఖ్యాకులు. ఇరువురిలో జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలలో నమ్మకం ఉండేది. హిందువులలో బాల్యవివాహాలు, సతీసహగమనం, వరకట్నం, కన్యాశుల్కం మొదలగు దురాచారాలుండేవి. మహమ్మదీయ ప్రభావం వలన హిందువులలో బహుభార్యత్వం ప్రబలింది. ఈ యుగంలో హిందూముస్లిం వర్గాల మధ్య ద్వేషభావాలు తగ్గాయి. ఇరువురు పండుగలు వేరువేరుగా, కలసికట్టుగా జరుపుకొనేవారు. ముస్లిం ప్రముఖులు హిందువుల హోలీ పండుగలో, హిందువులు ముస్లింల మొహర్రం వేడుకల్లో పాల్గొనేవారు. సమాజంలో స్త్రీకి గౌరవప్రదమైన స్థానంలేదు. పెక్కుమంది స్త్రీలు విలాస వనితలుగా, నాట్యకత్తెలుగా, అంతఃపురములో, ధనికుల గృహములలో ఉంపుడు గత్తెలుగా ఉండేవారు. మహమ్మదీయులలో బహుభార్యత్వం సర్వసామాన్యమయింది. కాని ఈ కాలంలో హిందూ ముస్లిం స్త్రీలలో ప్రసిద్ధిపొందినవారు కూడా ఉన్నారు. గుల్ బదన్ బేగమ్ హుమాయూన్ నామాను రచించింది. నూర్‌జహాన్, రాణీదుర్గావతి, చాంద్‌బీబీ, తారాబాయ్ వంటివారు కీలకపాత్ర వహించారు.

**11.3 ఆర్థికపరిస్థితులు :** భారతదేశం మొగలుల కాలంలో ఆర్థికంగా పురోభివృద్ధి సాధించింది.

**11.3.1 వ్యవసాయం :** ప్రజల ప్రధానవృత్తి వ్యవసాయం. వరి, గోధుమ, బార్లీ, పప్పునూనె, ధాన్యాలు, పొగాకు, ప్రత్తి, చెరుకు మొదలగు పంటల్ని రైతులు పండించేవారు. బీహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో చెరకు, దక్కన్, గుజరాత్, బెంగాల్ ప్రాంతాలలో ప్రత్తి విరివిగా పండేది. ఆనాడు పన్నుల భారం కొంతవరకు ఎక్కువైనా మొగల్ చక్రవర్తులు ముఖ్యంగా అక్బర్ చేసిన భూమిశిస్తు సంస్కరణలవల్ల, నీటిపారుదల సౌకర్యాల వల్ల రైతుల జీవితం ఆర్థికంగా స్థిరత్వాన్ని పొందింది.

**11.3.2 పరిశ్రమలు :** మొగలుల కాలంలో నేత, లోహ పరిశ్రమలు అభివృద్ధిచెందాయి. ఆనాడు బెంగాల్, బీహార్, ఒరిస్సా, గుజరాత్, దక్కన్‌లో ప్రముఖంగా నేతపరిశ్రమ ఉంది. ఉన్ని పరిశ్రమకు లాహోర్, ముల్తాన్, కాశ్మీర్‌లు, పట్టుపరిశ్రమకు ఆగ్రా, ఫతేపూర్‌సిక్రి, బీహార్, బెంగాల్ ప్రసిద్ధి వహించాయి. ఆంధ్ర, బెంగాల్, బీహార్‌లు అద్దకంలో, రంగులు వేయటంలో ప్రసిద్ధికెక్కాయి.

**11.3.3 వర్తక వాణిజ్యాలు :** మొగలుల కాలంలో స్వదేశీ, విదేశీ వ్యాపారం చురుకుగా సాగింది. సూరత్, గోవా, డయ్యూ, హుగ్లీ, కలకత్తా, మచిలీపట్నం నాటి ప్రధాన రేవులు. ఓడరేవులలో రాజధాని నగరాలలో రహదార్లకు ఇరువైపులా వర్తకుల క్షేమం కోసం చక్రవర్తులు తగిన వసతులు కల్పించారు. భారతదేశంలో ఐరోపావారు, పర్షియా, చైనా, జపాన్, ఈజిప్టు, అరేబియా వారు వ్యాపారం చేసారు. ఆనాటి ఎగుమతులలో బంగారం, వెండి, రాగి, నూలు వస్త్రాలు, ముడి సిల్కు, గుర్రాలు, దంతాలు, పగడాలు, ముత్యాలు, పంచదార, నల్లమందు ముఖ్యమైనవి. ఉన్నిగుడ్డలు, అత్తరులు, పింగాణీ సామగ్రి, బానిసలను దిగుమతి చేసుకొనేవారు.

**11.3.4 నాణేలు :** ఆనాడు ప్రధాన నగరాలలో బంగారు, వెండి, రాగి, లోహాలతో నాణేలు ముద్రించేవారు. పైసలు వాడుకలోనికి వచ్చాయి.

**11.3.5 ధరలు, వేతనాలు :** అబుల్‌ఫజల్ రచనలను బట్టి నిత్యావసర వస్తువులు స్వల్పధరకు లభించేవని తెలుస్తున్నది. ఆనాడు పనివారికి రూపాయలో 20 వ వంతు వేతనంగా ముట్టేది. నాడు తిండితిప్పలకు లోటులేదని టెర్రీ వ్రాసాడు.

**11.3.6 కరువుకాటకాలు :** మొగలాయిల కాలంలో తరచూ కరువుకాటకాలు సంభవించడంవల్ల ప్రజలు అనేక కష్టాలకు లోనయ్యారు. 1556 - 57లో ఆగ్రాలో, 1573 - 74 లో గుజరాత్‌లో, 1630 - 31లో మాళ్వా, గుజరాత్, దక్కన్‌లలో, 1641 - 46లో కాశ్మీర్‌లో కరువు సంభవించింది. క్షామనివారణకు అక్బర్, షాజహాన్‌లు ప్రయత్నించారు. తరచుగా పన్నులు రద్దుచేసారు.

## 11.4 సారస్వతం :

మొగలు చక్రవర్తులు సారస్వతాభిమానులు. వీరికాలంలో పారశీక, అరబ్బీ, సంస్కృత, హిందీ భాషలలో సాహిత్యం వృద్ధిచెందింది. అంతేగాక మొగల్ చక్రవర్తులలో బాబర్, హుమాయూన్, జహంగీర్, దారాలు గొప్ప కవులు, పండితులు.

**11.4.1 బాబర్ :** బాబర్ టర్కీ, అరబ్బీ, పారశీక భాషలలో గొప్ప పండితుడు. టర్కీ భాషలో 'తుజుక్-ఇ-బాబరీ' వ్రాసాడు.

**11.4.2 హుమాయూన్ :** హుమాయూన్ పెక్కుమంది కవులను, పండితులను పోషించాడు. ఇతడు ఎల్లప్పుడు గ్రంథాలయాల్లో కాలం వెల్లబుచ్చేవాడు.

**11.4.3 అక్బర్ :** అక్బర్ నిరక్షరాస్యుడైనను పాండిత్యమంటే అత్యంత ప్రీతి. ఇతని దగ్గర 64, 63, 731 రూపాయల విలువగల గ్రంథాలయముంది. ఇందు 24,000 పుస్తకాలున్నాయి. దీనిలో చరిత్ర, మతం, తత్త్వశాస్త్రము, ఖగోళశాస్త్రం, ఇతరశాస్త్రాలకు చెందిన గొప్ప గ్రంథాలున్నాయి. ఇతడు అనేకమంది కవులను, పండితులను, చరిత్రకారులను పోషించారు. ఇతని కాలంలోనే ఇండో - పారశీక సాహిత్యం మొదటిదశ ప్రారంభమయింది. అబుల్‌ఫజల్ రచనలనుబట్టి ఇతని ఆస్థానమున 59 మంది కవులున్నట్లు తెలియుచున్నది. వీరిలో ఫైజీ, అబుల్‌ఫజల్, బదాయుని ముఖ్యులు. వీరిలో అబుల్‌ఫజల్ అక్బర్ ఆస్థానపండితుడు. ఇతడు అక్బర్‌నామా, అయినీ అక్బరీ అను గ్రంథాలు వ్రాసాడు. బదయుని మంత్‌కాబ్-ఉత్-తవారిక్ లిఖించాడు. నాటి చారిత్రక గ్రంథాలలో ముఖ్యమైనవి గుల్‌బదన్ బేగమ్ వ్రాసిన హుమాయూన్ నామా, నిజాముద్దీన్ అహమ్మద్ వ్రాసిన తబకత్-ఇ-అక్బరీ. రామాయణ, మహాభారతాలు, కల్హణుని రాజతరంగిణి, పంచతంత్రం పారశీక భాషలోకి తర్జుమా చేయించబడెను. అక్బర్ ఆస్థానమునలంకరించిన సుప్రసిద్ధ హిందీ కవులు ఖాన్-ఇ-ఖానాన్, బీర్బల్, మాన్‌సింగ్, సూరదాస్. వీరిలో బీర్బల్ తన కవితా వైదుష్యముచే 'కవిరాయ' బిరుదు పొందాడు. నాటి హిందీ భాషలో తులసీదాస్ లిఖించిన రామచరితమానస్ గొప్ప కావ్యం. 'పారశీ ప్రకాష' అను పారశీక సంస్కృత నిఘంటువు ఈ కాలంలో తయారుచేయబడెను.

**11.4.4. జహంగీర్ :** ఇతడు స్వయంగా పండితుడు. తన స్వీయచరిత్ర 'తుజుక్-ఇ-జహంగీరీ' వ్రాసుకొనెను. కవులను, పండితులను ఆదరించెను. వారిలో ముఖ్యుడు ముతామిద్‌ఖాన్.

### 11.4.5 షాజహాన్ :

ఇతడు పెక్కుమంది పారశీక, సంస్కృత, హిందీ కవులను పోషించెను. ఇతని ఆస్థానమునలంకరించిన కవులలో సుప్రసిద్ధులు సూర్‌దాస్, కవీంద్ర ఆచార్య సరస్వతి, జగన్నాధ పండితుడు. వీరిలో జగన్నాధ పండితుడు రసగంగాధరము, గంగాలహరి అను గ్రంధాలను లిఖించాడు. షాజహాన్ కుమారుడైన దారా గొప్ప పండితుడు. ఇతడు పెక్కు హిందూ గ్రంథాలను పారశీక భాషలోనికి అనువదింపజేసెను. విద్యాభివృద్ధికై ఢిల్లీలో ఒక కళాశాలను నెలకొల్పెను. అబ్దుల్ హమీద్ లాహరీ పాధుషానామా వ్రాశాడు.

**11.4.6 ఔరంగజేబు :** ఇతడు ముస్లిం న్యాయశాస్త్రమందు గొప్ప పండితుడు. ఇతని ఆదరణలోనే ఫత్వా-ఇ-అలంఘరీ అను మహమ్మదీయ ధర్మశాస్త్రం సంతరింపబడెను. ఖాఫీఖాన్, అలంఘీర్‌నామా వ్రాసిన మీర్జామహమ్మద్ ఖ్వాశిమ్ నాటి ముఖ్య చరిత్రకారులు.

11.4.7 మొగలుల కాలంలో బెంగాలీభాషలో వైష్ణవ సాహిత్యం వెల్లువికింది. భారత భాగవతాలు బెంగాలీ భాషలోనికి అనువదించబడ్డాయి. నాటి బెంగాల్ సాంఘిక పరిస్థితులను ముకుందదాసు 'కవి కంకణ చండీ' అను గ్రంథంలో వివరించాడు. మరాఠీభాషలో తుకారామ్, రామదాసులు భక్తిసాహిత్యం వెలువడింది. ఢిల్లీ, లక్నో, దక్కన్‌లలో ఉర్దూ సాహిత్యం వృద్ధిచెందింది. ఆనాటి ప్రసిద్ధ ఉర్దూకవులు బిజాపూర్, ఔరంగాబాదీ.

## 11.5 కళాపోషణ :

మొగల్ చక్రవర్తులు వాస్తు, చిత్రలేఖన, సంగీతాలను ఆదరించినారు. షాజహాన్ కాలంలో ముస్లిం వాస్తువు పరాకాష్ట చెందింది. జహంగీర్ కాలంలో చిత్రలేఖనం బాగా అభివృద్ధి చెందింది.

**11.5.1 వాస్తు కళ :** మొదటి పానిపట్టు యుద్ధానంతరం బాబర్ భారతదేశంలో స్థిరపడాలని సంకల్పించుకొని పర్షియా నుండి వాస్తుకారులను రప్పించి పెక్కు భవనాలు నిర్మించాడు. వీటిలో చెప్పుకోదగిన విశేషాలు లేవు. హుమాయూన్ కట్టడాలలో పేర్కొనదగినది దీన్‌పనాహ అను ఢిల్లీ కోట. అక్బర్ గొప్ప నిర్మాత. పెక్కుకోటలను, నగరాలను, భవనాలను ఇతడు నిర్మించాడు. వీటిలో ఆగ్రా కోట, ఫతేపూర్ సిక్రి నగరం ముఖ్యమైనవి. ఇతడు హిందూ, ముస్లిం ముఖ్యంగా పారశీక పద్ధతులను మేళవించి నూతన నిర్మాణాలు కావించాడు. అక్బర్ నిర్మాణాలలో ఫతేపూర్‌సిక్రి, దానిలోని భవనాలు విశిష్టమైనవి. దీని నిర్మాణం 1570లో ప్రారంభమయి 1580 వరకు కొనసాగింది. దానిలో మొత్తం 9 దర్వాజాలున్నాయి. వాటిలో ఆగ్రా, ఢిల్లీ, గ్వాలియర్, ధోల్‌పూర్ దర్వాజాలు ముఖ్యమైనవి. కోటలోని ముఖ్యకట్టడాలు సంగీత భవనం, టంకశాల, దివాన్-ఇ-ఆమ్, అక్బర్ నివాసభవనం, మోతీమసీదు, షేక్‌సలీంచిష్టి సమాధి, జోద్‌బాయ్ భవనం, రాజా బీర్బల్ నివాసం, స్తంభ సింహాసనం. 1573లో బులాంద్ దర్వాజా అనే మరొక పెద్ద దర్వాజా నిర్మించారు. ఆగ్రాకోటలో నిర్మితమైన జహంగీర్‌మహల్‌లో హిందూ, ముస్లిం లక్షణాలు కన్పిస్తాయి. సికాంద్రాబాద్‌లోని అక్బర్‌గోరీలో బౌద్ధవిహార లక్షణాలు స్పష్టంగా గోచరిస్తాయి. జహంగీర్ కట్టడాలలో ముఖ్యమైనది ఇత్-మాద్-ఉద్-దౌలా సమాధి. ఇది పాలరాతితో నిర్మితమైంది. షాజహాన్ కాలంలో భవన నిర్మాణం తారాస్థాయి చేరుకొంది. ఇతడు పాలరాతితో ఢిల్లీ, ఆగ్రా, లాహోర్ మొదలగు నగరాలందు అనేక భవనాలు, మసీదులు, కోటలు నిర్మించాడు. ఢిల్లీలోగల ఎర్రకోట, అందలి దివానీఖాస్, దివానీఆమ్, ఆగ్రాలోని దివానీఖాస్, దివానీ ఆమ్ ఢిల్లీలోని జుమ్మా మసీదు, తాజ్‌మహల్, నెమలిసింహాసనము నాటి వాస్తుశాస్త్ర కళానైపుణ్యానికి నిదర్శనాలు. వీనిలో ఆగ్రాలో యమునానది ఒడ్డున తన ప్రియతమ భార్య ముంతాజ్ జ్ఞాపకార్థం నిర్మించిన తాజ్‌మహల్ మకుటాయమైనది. దాని నిర్మాణానికి పర్షియా, అరేబియా, టర్కీల నుంచి చిత్రకారులను రప్పించాడు. దీని ముఖ్య వాస్తుశిల్పి ఉస్తాద్ ఇశా. దీని నిర్మాణం 2 కోట్ల రూపాయలతో, 22 సంవత్సరాల తరువాత పూర్తి అయింది. ఇది ప్రపంచ అద్భుతాలతో ఒకటని, పాలరాతితో మలచిన సుందర స్వప్నమని విమర్శకులు శ్లాఘించారు.

## 11.5.2 చిత్రలేఖనము :

ఇస్లాం మతానుసారం చిత్రలేఖనం నిషిద్ధము. అయినప్పటికీ ఔరంగజేబు మినహా మిగతా మొగల్ చక్రవర్తులు చిత్రలేఖనంపట్ల శ్రద్ధ చూపారు. హుమాయూన్ పర్షియాలో ఉన్నా చిత్రలేఖన పద్ధతిని నేర్చుకొని భారతదేశంలో ప్రవేశపెట్టాడు. ఇతడు తనతోబాటు పర్షియా నుండి మీర్ సయ్యద్అలీ, ఖ్వాజా అబ్దుల్ సయద్‌లను ప్రఖ్యాత చిత్రలేఖకులను తీసుకువచ్చాడు. వీరు చిత్రలేఖనంపై దస్తాన్ - ఇ - అమీర్ అను పుస్తకాన్ని రచించారు. అక్బరుకాలం నాటికి భారతదేశంలో ఉన్న చిత్రలేఖన పద్దతులు పర్షియా నుండి

ప్రవేశించిన పద్దతులతో మేళవించి కొత్తపద్దతి రూపొందింది. దీనినే మొగల్ చిత్రలేఖనా పద్ధతి అని పిలవవచ్చు. ఈ పద్దతిలో చిత్రించిన మొదటి పటం తాన్‌సేన్ అక్బర్ దర్బారును ప్రవేశించినప్పటి దృశ్యం. అక్బర్ దర్బారులో వందమంది చిత్రకారులున్నారు. వీరిలో అబ్దుల్ సయద్, షరూఖ్‌బేగ్, ఖుస్రూకులీ, బస్వాన్, లాల్, కేసు, హరిబన్స్, దాస్‌పంత్‌లు ముఖ్యులు. జహంగీర్ కాలంలో చిత్రలేఖనం పరాకాష్టనందుకొన్నది. ఇతడు స్వయంగా చిత్రకారుడు. పెక్కుమంది స్వదేశీ, విదేశీ చిత్రకారులను పోషించాడు. ఇతని ఆస్థాన చిత్రకారులలో ముఖ్యులు, అబుల్‌హసన్, మహమ్మద్ నాదిర్, మహమ్మద్ మురద్, ఉస్తాద్ మాన్‌సూర్ మొదలగువారు. షాజహాన్ కాలంలో చిత్రలేఖన ప్రమాణంతగ్గి ఔరంగజేబు అనాదరణలో మొగల్ చిత్రలేఖనం పరమపదించింది.

### 11.5.3 సంగీతము :

మొగల్ వంశ స్థాపకుడైన బాబర్ సంగీతంపై పుస్తకంరాసాడు. అక్బర్ ఆస్థానంలో 36 మంది గాయకులుండేవారు. వారిలో తాన్‌సేన్, బాబా రామదాసు, బైజుబావరా, సూర్‌దాస్‌లు సుప్రసిద్ధులు. తాన్‌సేన్ హిందూస్థానీ సంగీతానికి ప్రాణం వంటివాడు. ఇతడు ఎన్నో స్వరాలను, రా గాలను, స్వరకల్పనలను కనిపెట్టాడు. జహంగీర్, షాజహాన్‌ల కాలంలో కూడా సంగీతం బాగా అభివృద్ధి పొందింది. మిత్రసింహుడు షాజహాన్ ఆస్థాన గాయకుడు. ఔరంగజేబు సంగీతాన్ని నిషేధించినా ఇతని కాలంలో మున్సబ్‌దారులు సంగీతాన్ని పోషించారు.

## 11.6 ముగింపు :

బాబరు మొదలు ఔరంగజేబు వరకు పాలించిన మొగల్ చక్రవర్తులు భారతదేశంలో రాజకీయంగా అధిక భాగాన్ని సమైక్యపరచి, కేంద్రప్రభుత్వాన్ని నిర్మించి, శాంతిభద్రతలు స్థాపించారు. రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టి, వ్యవసాయాన్ని, పరిశ్రమలను వాణిజ్యాన్ని ప్రోత్సహించారు. ఢిల్లీ, ఆగ్రా మొదలైన నగరాలలో పాలరాతితో అనేక భవనాలు నిర్మించి నూతన వాస్తు పద్ధతులను ప్రవేశపెట్టారు. పారశీక, సంస్కృత, హిందీ కవులు, పండితులు మొగల్ ఆస్థానాన్ని అలంకరించి ఉత్తమ గ్రంథాలు రచించారు.

### మాదిరి ప్రశ్నలు :

1. మొగలుల కాలం నాటి సాంస్కృతిక విశేషాలను పరిశీలించండి.
2. మొగలుల కాలంనాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులను వివరింపుము.
3. మొగలుల సాహిత్య పోషణ
4. మొగలుల కళాపోషణ

### చదువదగిన గ్రంథాలు :


1. A.L. Srivatsava - Mughal Empire
2. S.R. Sarma - Mughal Empire in India
3. James Fergussen - History of Indian and Eastern Architecture
4. Lane - poole Medieval India
5. Law Promotion of Learning in India during Mahammadan Rule
6. పాటిబండ్ల ఝాన్సీలక్ష్మి & అల్లాడి వైదేహి - భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం)


పాఠ్య రచయిత : **వి.కె. మోహన్**

పాఠం - 12

# మొగల్ సామ్రాజ్య క్షీణతకు కారణాలు

**విషయసూచిక**

12.0 లక్ష్యం
12.1 ఉపోద్ఘాతం
12.2 ఔరంగజేబు బాధ్యత
12.3 వారసుల బలహీనత
12.4 వారసత్వ యుద్ధాలు
12.5 పరిపాలనా విధానమందలి లోపాలు
12.6 ఆర్థిక కారణాలు
12.7 సాంఘిక కారణాలు
12.8 మతకారణాలు
12.9 సైనికలోపాలు
12.10 సామ్రాజ్య విశాలత
12.11 విదేశీ దండయాత్రలు
12.12 రాష్ట్ర పాలకుల తిరుగుబాటు
12.13 నౌకాబలాన్ని నిర్లక్ష్యం చేయుట
12.14 యూరోపియన్‌ల ఆధిక్యం
12.15 సమీక్ష

## 12.0 లక్ష్యం :

మొగలు సామ్రాజ్య పతనానికి కారణాలు, ముఖ్యంగా ఈ సామ్రాజ్య పతనానికి ఔరంగజేబు ఎంతవరకు బాధ్యుడో వివరించడమే ఈ పాఠం లక్ష్యం

## 12.1 ఉపోద్ఘాతం :

1526లో బాబర్ స్థాపించిన మొగల్ రాజ్యం అక్బరు కాలంలో (1556 - 1605) సామ్రాజ్యమై ఔరంగజేబు కాలంలో (1658 - 1707) దాదాపు భారతదేశమంతా విస్తరించింది. మొగలుల పాలన సుమారు రెండువందల సంవత్సరాలు దిగ్విజయంగా కొనసాగింది. కడపటి మొగలాయి చక్రవర్తుల కాలంలో మొగల్ సామ్రాజ్యం క్షీణించి చివరకు ఆంగ్లరాజ్య స్థాపనకు అవకాశం కల్పించింది. మొగల్ సామ్రాజ్య పతనమునకు అనేక కారణాలు గలవు. వాటిని ఈ క్రింద వివరించడం జరిగింది.

## 1.2 ఔరంగజేబు బాధ్యత :

ఔరంగజేబు అనుసరించిన మతవిధానం, దక్కన్ విధానం, రాజపుత్ర విధానం వ్యక్తిగత లోపాలు మొగల్‌సామ్రాజ్య పతనానికి దారితీసిందని పెక్కుమంది చరిత్రకారుల అభిప్రాయం.

### 12.2.1 మతవిధానం :

ఔరంగజేబు అనుసరించిన స్వమతాభిమానం, హిందూ విద్వేషభావం మొగల్ సామ్రాజ్య పతనానికి ప్రధానకారణం. ఇతడు సనాతన సున్నీమతస్థుడు. భాదతదేశాన్నంతా జయించి దానిని ఇస్లాం రాజ్యంగా మార్చుటకు తన అధికారాన్ని, రాజ్యసంపదను వినియోగించాడు. సామ్రాజ్యంలో అధిక సంఖ్యాకులైన హిందువులను హీనంగాచూసి, వారిని ప్రభుత్వ ఉద్యోగాల నుంచి తొలగించినాడు. వారి దేవాలయాలను ధ్వంసం చేసాడు. వారిపై జిజియాపన్ను, తీర్థయాత్రల పన్ను, ఆదాయపుపన్ను విధించి అనేక బాధలకు గురిచేసాడు. తత్ఫలితముగా హిందువుల సానుభూతిని కోల్పోయాడు. శిక్కుమత గురువగు తేజ్‌బహదూర్ ఇస్లాం స్వీకరింపలేదని దారుణంగా చంపించెను. దీనివలన శిక్కులు ప్రతిఘటనోద్యమం ప్రారంభమయి మొగల్ సామ్రాజ్యమును బలహీనపరచెను. ముస్లిమేతరులపై ఔరంగజేబు అనుసరించిన విధానం వల్లనే మధురనందలి జాటులు, బుందేల్‌ఖండ్‌లోని బుందేలులు, నార్నాల్ నందలి సత్నామీలు తిరుగుబాటు లేవదీసి రాజ్యమున శాంతిసుస్థిరతలు లేకుండా చూసారు. హిందువులనేగాక ఇస్లాంలోని షియావారిని కూడా హింసించడం వలన ఔరంగజేబు వారి క్రోధానికి గురిఅయినాడు.

### 12.2. దక్కన్ విధానము :

ఔరంగజేబు అనుసరించిన దక్కన్ విధానం వలన మొగల్ సామ్రాజ్యమునకు విపరీత ధననష్టం జరిగింది. పాలనాయంత్రాంగం అస్తవ్యస్తమైనది. దక్కన్ స్థాపితమైన బీజపూర్, గోల్కొండ రాజ్యాలు మహారాష్ట్రులను అదుపులో ఉంచుతున్నందున మొగల్ సామ్రాజ్యానికి వారిముప్పులేదు. కాని బీజపూర్, గోల్కొండ సుల్తానులు సియామతస్థులనే సాకుతో ఔరంగజేబు వారిని నాశనం చేశాడు. తత్ఫలితంగా మహారాష్ట్రులకు ఎటువంటి ఆటంకంలేక నేరుగా మొగల్ సామ్రాజ్యంపై దండయాత్రలుచేసి దానిని కూలదోయడానికి అన్ని ప్రయత్నాలు చేసారు. శివాజీ నాయకత్వాన ఒకగొప్ప జాతీయశక్తిగా అవతరించిన మహారాష్ట్రులు గెరిల్లాయుద్ధ పద్ధతులను అవలంబించి స్వరాజ్యమును స్థాపించుకొని హిందూసంస్కృతిని రక్షించడానికి మొగలులతో ఢీకొన్నారు. ఔరంగజేబు తనపాలనా కాలంలో చివరి 22 సంవత్సరాలు మహారాష్ట్రుల నణచుటలో గడిపి తుదకు విఫలుడైనాడు. మొగల్ సామ్రాజ్య క్షీణతకు కొంతవరకు మహారాష్ట్రులు కారకులు.

### 12.2.3 రాజపుత్రవిధానం :

భారతదేశంలో రాజపుత్రులు గొప్ప యుద్ధవీరులు. వారి సహాయంతోనే అక్బర్ మొగల్ సామ్రాజ్యాన్ని విస్తరింపజేసి పటిష్టపరిచాడు. వారు హిందువులైనందున ఔరంగజేబు ద్వేషించి వారి సహకారాన్ని కోల్పోయాడు. మేవార్, మార్వార్ రాజపుత్ర రాజ్యాలను ఔరంగజేబు ఆక్రమించడానికి ప్రయత్నించి వారి ఆగ్రహానికి గురిఅయినాడు. రాజపుత్రుల సహకారం లేకపోవడంతో మొగల్ సామ్రాజ్యం బలహీనమయ్యెను.

### 12.2.4 వ్యక్తిగత లోపాలు :

ఔరంగజేబు అనుమాన స్వభావుడు. అందువలన పాలనా విషయాలలో తన కుమారులకు తగిన శిక్షణ ఇవ్వలేదు. అందువల్ల ఔరంగజేబు తరువాత పాలనా బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేకపోయారు.

## 12.3 వారసుల బలహీనత :

ఔరంగజేబు తరువాత మొగల్ సింహాసనాన్ని ఆక్రమించిన మొగల్ చక్రవర్తులందరూ బలహీనులు, అసమర్థులు. వారు వినోద విహారాలకులోనై రాజ్యపాలనను నిర్లక్ష్యము చేసారు. చక్రవర్తులతోబాటు ప్రధాన మంత్రులు, ప్రభుత్వోద్యోగులు కూడా

అసమర్ధులయినారు. వీరిలో అధికారవాంఛ తప్ప సామ్రాజ్య శ్రేయస్సును కాపాడే దీక్ష లేకపోయింది. జుల్ఫికర్‌ఖాన్, సయ్యద్ సోదరుల వంటి రాజ్యస్రష్టలంతా సామ్రాజ్యం గురించిగాని, ప్రజల గురించిగాని పట్టించుకోలేదు. వీరికి చక్రవర్తిపై గౌరవం లేదు. మొగల్ రాజ్యం అరాచకం కావటానికి వీరే బాధ్యులు.

## 12.4 వారసత్వ యుద్ధాలు :

తండ్రి తరువాత పెద్దకుమారుడు రాజ్యానికి రావలెననే సిద్ధాంతం ఇస్లాం మతంలో లేనందున మొగల్ రాజవంశంలో చక్రవర్తి చనిపోగానే మొగల్ రాజవంశంలో ఆయన కుమారులందరూ వారసత్వ యుద్ధానికి తయారై అన్నదమ్ములు ఒకరినొకరు వధించుకొని బలవంతుడు, గెలిచినవాడు సింహాసనాక్రమించేవాడు. మొదటి వారసత్వ యుద్ధం అక్బరు కాలంలో జరిగింది. దీని ఫలితంగా అబుల్‌ఫజల్ దుర్మరణం పాలయ్యాడు. ఖుస్రూ నికృష్ట జీవితం గడిపి జహంగీర్ కాలంలో చంపబడ్డాడు. జహంగీర్ తరువాత షాజహాన్, షహ్రియార్‌ల మధ్య వారసత్వ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో షాజహాన్ పోటీచేసినవారిని నిర్దాక్షిణ్యంగా చంపించాడు. షాజహాన్ బతికుండగానే అతని కుమారులమధ్య వారసత్వ యుద్ధం ప్రారంభమయింది. ఈ యుద్ధంలో విజయం సాధించిన ఔరంగజేబు తండ్రిని నిర్బంధించి సోదరులను హతమార్చాడు. ఈ వారసత్వ యుద్ధాలవల్ల మొగలుల ప్రతిష్ట దెబ్బతిన్నది. మొగల్ దర్బారు ముఠాలుగా చీలిపోయి కలహించుకోసాగారు. ప్రతి ముఠా చక్రవర్తిని తమ చెప్పుచేతులలో ఉంచుకొనుటకు ప్రయత్నించింది. దీని ఫలితంగా మొగల్ రాజ్యం బలహీనపడింది.

## 12.5 పరిపాలనా విధానమందలి లోపాలు :

మొగలుల కాలంలో పాలనాయంత్రాంగం ఉద్యోగి స్వామ్యసూత్రాల ప్రకారం నిర్మితమయింది. ఉన్నత ఉద్యోగాలలోవున్న మన్సబ్‌దారులు పాలనావ్యవహారాలలో ఆసక్తి కనపరచలేదు. వీరు అంతఃపుర కలహాలలో వేరువేరు పక్షాలలో చేరినారు. వీరు నైతికంగా దిగజారి, స్వార్ధపరులుగా, వ్యభిచారులుగా మారారు. ఉద్యోగులలో అవినీతి ప్రబలింది. ఉద్యోగులు తమ ఉద్యోగాలను అమ్మడం కూడా ఆరంభమయింది.

## 12.6 ఆర్థిక కారణాలు :

మొగల్ చక్రవర్తులలో షాజహాన్ భవన నిర్మాణానికి, ఔరంగజేబు దీర్ఘకాలిక యుద్ధాలకు ఖర్చు చేయడంతో ఖజానా ఖాళీ అయింది. మొగల్ సర్దారులు తమ విలాసాలమీద ఖర్చుపెట్టేవారు. భూమి శిస్తు విధానంలో అక్బరు కాలంలో తొలగించబడిన అనేక లోపాలు మరల తలెత్తినవి. సామాన్య ప్రజల మీద పన్నులభారం అధికం కావటమేగాక కరువుకాటకాల వల్ల అనేక ఇబ్బందులు అనుభవించారు. విదేశీ వ్యాపారస్తులు దర్బారులో జరుగుచున్న కుట్రవల్ల ప్రభుత్వానికి అందజేయవలసిన సొమ్ము చెల్లించేవారుకాదు. ఔరంగజేబు కాలంలో, ఆ తర్వాత పెక్కుప్రాంతాలు స్వతంత్రించడంవల్ల ప్రభుత్వానికి రావలసిన ఆదాయం తగ్గింది. దీనికితోడు విదేశీ దండయాత్రల వలన దేశం మరింత ఆర్థిక నష్టాలకు గురిఅయింది. సతీష్ చంద్ర మాటలలో మొగలుల కాలంలో ఆర్థికవిధానం పూర్తిగా చెడిపోయింది. ఏ రాజ్యమైనా ఆర్థిక దుస్థితికిలోనైతే ఎక్కువకాలం మనజాలదు.

## 12.7 సాంఘిక కారణాలు :

మొగలుల కాలంలో ప్రజలలో పాపభీతి, దైవభీతి నశించాయి. స్త్రీ, పురుషులు ఇరువురూ మద్యం సేవించేవారు. పెక్కుమంది స్త్రీలు జీవనోపాధికోసం ఉంపుడు కత్తెలుగా జీవితం సాగించారు. సామాన్య ప్రజలేగాక మతాధిపతులు కూడా నైతికంగా హీనస్థితికి వచ్చారు.

## 12.8 మత కారణాలు :

ఔరంగజేబు అనుసరించిన స్వమతాభిమానము వలన హిందువులకు విరోధి అయినాడు. ఇతడి కాలంలో మతకారణంగా జాట్‌లు, శిక్కులు, సత్‌నామీలు తిరుగుబాట్లుచేసి ప్రభుత్వానికి పక్కలో బల్లెం వలె తయారయినారు.

## 12.9 సైనిక లోపాలు :

మొగలుల సైనిక వ్యవస్థలోకూడా అనేక లోపాలున్నాయి. అందులో మంగోలులు, తురుష్కులు, ఉజ్‌బెక్‌లు, పారశీకులు, ఆఫ్ఘనులు, రాజపుత్రులు మున్నగు వివిధ జాతులవారు ఉండేవారు. అందువలన సైన్యంలో సారూప్యత లోపించింది. అసమర్థులు చక్రవర్తులైనపుడు అందులో జాతిభేదాలు స్పష్టంగా కనిపించేవి. మొగల్ సైన్యంలో అత్యధికులు మన్సబ్‌సేనలు. వీరికి చక్రవర్తికి మున్సబ్‌దారీ విధానంలో సంబంధం ఉండేదికాదు. మన్సబ్‌దారులు చక్రవర్తికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినపుడు సైనికులు మున్సబ్‌దారు పక్షం వహించేవారు. అంతేగాక మన్సబ్‌దారులు తమ హోదానుబట్టి సైనికులను పోషించేవారు కాదు. కాలక్రమేణ మొగల్ సైన్యంలో క్రమశిక్షణ, శక్తియుక్తులు లోపించి తమ చక్రవర్తుల వలె నైతికంగా దిగజారి భోగలాలసులైరి. అధూనాతన ఆయుధాలు, సరియైన శిక్షణ సైనికులకు లేకపోవడం కూడా పెద్దలోటు. సైన్యం బాగా పెరగటంవల్ల చక్రవర్తులు, సేనానులు స్త్రీలతో నాట్యకత్తెలతో యుద్ధాలకు తరలివెళ్ళటంవల్ల సైన్యగమనంలో వేగం తగ్గింది. మహా పట్టణ ప్రమాణంతో ఉండే వీరి సైన్యశిబిరం శీఘ్రగాములైన మహారాష్ట్ర సైనికులకు ఎన్నోసార్లు బలిఅయింది. మొగల్ సైన్యం బలహీనం కావడం వల్లనే నాదిర్‌షా, అహమ్మద్‌షా అబ్దాలీ భారతదేశంపై దండెత్తి దోచుకున్నారు.

## 12.10 సామ్రాజ్య విశాలత :

మొగల్ సామ్రాజ్యం ఔరంగజేబు కాలంలో భారతదేశంలో అధికభాగంలో వ్యాపించింది. ప్రయాణ సౌకర్యాలు సరిగా వృద్ధిచెందని ఆ రోజులలో దూరప్రదేశాలను అదుపులో ఉంచుట కష్టసాధ్యమయ్యేది. చక్రవర్తులు అసమర్థులైనపుడు దూరప్రాంతాలలో ఉన్నవారు తరచుగా తిరుగుబాటు చేసి స్వతంత్రులైనారు.

## 12.11 విదేశీ దండయాత్రలు :

కడపటి మొగల్ చక్రవర్తుల కాలంలో మొగల్ సామ్రాజ్యం బలహీనమయి అనేక విదేశీ దండయాత్రలకు గురిఅయినది. వాటిలో 1738 - 39 మధ్యకాలంలో జరిగిన పర్షియా చక్రవర్తి నాదిర్‌షా దండయాత్ర, 1748 - 67 మధ్యకాలంలో జరిగిన ఆఫ్ఘన్ పాలకుడైన అహమద్‌షా అబ్దాలీ దండయాత్రల ఫలితంగా జననష్టమేగాక దేశ సౌభాగ్యం కొల్లగొట్టబడినది. ఈ విదేశీ దండయాత్రలు మొగల్ సామ్రాజ్యాన్ని బలహీన పరచినాయి.

## 12.12 రాష్ట్రపాలకుల తిరుగుబాటు :

రాష్ట్రాధిపతులు అవకాశం లభించినపుడు తిరగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించేవారు. కడపటి మొగలుల అసమర్థతవల్ల మన్సబ్‌దారులు స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. హైదరాబాద్ సుబేదారు నిజాం ఉల్‌ముల్క్ మొగల్ చక్రవర్తి మొహమ్మద్‌షాను ధిక్కరించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. అలాగే అయోధ్య సుబాలో సారత్‌ఖాన్, బెంగాల్, బీహార్, ఒరిస్సాల సుబేదారు ఆలీవర్దీఖాన్ స్వతంత్రులైరి. దీని ఫలితంగా మొగల్ సామ్రాజ్య విస్తీర్ణం బాగా తగ్గిపోయింది.

## 12.13 నౌకాబలాన్ని నిర్లక్ష్యం చేయుట :

మొగల్ చక్రవర్తులు నైకాబల నిర్మాణ విషయంలో తగుశ్రద్ధ వహించలేదు. అందువలన సముద్ర మార్గం ద్వారా భారతదేశం ప్రవేశించిన ఐరోపా వారు వ్యాపారాన్ని హస్తగతం చేసుకొన్నారు. ఆ తదుపరి నౌకాబలము వలన వారు రాజకీయాధికారాన్ని గూడా చేజిక్కించుకొన్నారు.

## 12.14 యూరోపియన్‌ల ఆధిక్యం :

కడపటి మొగలుల కాలంలో తీరప్రాంతాలలో క్రమక్రమంగా యూరోపియన్‌ల ఆధిక్యం బలపడింది. తమలో తాము కలహించుకొంటున్న భారత పాలకులు యూరోపియన్‌ల సహాయమర్థించారు. దీనినవకాశంగా తీసుకొని యూరోపియన్‌లు భారత భూభాగాలను కబళించసాగారు. 1757 ప్లాసీ యుద్ధంలో ఆంగ్లేయుల విజయం సాధించి భారతదేశంలో ఆంగ్లరాజ్యస్థాపన చేశారు. ఆ తదుపరి 1764 బక్సార్‌యుద్ధంలో మొగల్ చక్రవర్తి షా ఆలం ఆంగ్లేయుల చేతిలో పరాజయం చెందాడు. నాటి నుండి మొగల్ చక్రవర్తులు ఆంగ్లేయుల చేతిలో కీలుబొమ్మలయ్యారు. చివరకు 1857 తిరుగుబాటులో మొగల్ చక్రవర్తి రెండవ బహదూర్‌షా పాల్గొనగా ఆంగ్లేయులు అతనిని నిర్బంధించి రంగూన్‌కు ఖైదీగా పంపారు. 1862లో రంగూన్‌లో 2వ బహదూర్‌షా మరణించడంతో మొగల్ వంశమంతరించింది.

## 12.15 సమీక్ష :

ఈ విధంగా ఆంతరంగికమైన, బాహిరమైన కారణాల వలన మొగల్ సామ్రాజ్యం అంతరించినది.

## మాదిరి ప్రశ్నలు :

1. మొగల్ సామ్రాజ్య పతనమునకు గల కారణాలను వివరింపుము.
2. మొగల్ సామ్రాజ్య పతనానికి ఔరంగజేబు ఎంతవరకు కారకుడు చర్చించుము.
3. వారసత్వ యుద్ధాలు

## చదువదగిన గ్రంథాలు :

1. పాటిబండ్ల ఝాన్సీలక్ష్మీ & అల్లాడి వైదేహి - భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం)
2. A.L. Srivatsava - Mughal Empire
3. R.P. Tripati - Rise and Fall of the Mughal Empire
4. S.R. Sarma - Mughal Empire in India

పాఠ్య రచయిత : **వి.కె. మోహన్**

పాఠం - 13

# మహారాష్ట్రులు - శివాజీ స్వరాజ్య స్థాపన

**విషయసూచిక**

13.0 లక్ష్యం

13.1 ఉపోద్ఘాతం

13.2 మహారాష్ట్రుల విజృంభణకు కారణాలు

13.3 శివాజీ స్వరాజ్యస్థాపన

13.4 శివాజీ పరిపాలనా విధానం

13.5 శివాజీ వారసులు

13.6 సమీక్ష

## 13.0 లక్ష్యం :

మహారాష్ట్రంలో స్వతంత్ర రాజ్యస్థాపనకు దోహదం చేసిన పరిస్థితులు, శివాజీ రాజ్యస్థాపన చేసిన విధం వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 13.1 ఉపోద్ఘాతం :

క్రీ.శ. 12వ శతాబ్దములో మహమ్మదీయులు భారతదేశాన్ని జయించి క్రీ.శ. 1206లో ముస్లిం రాజ్యాన్ని స్థాపించిన తరువాత హైందవ ధర్మరక్షణ కోసం ఢిల్లీసుల్తానత్ యుగంలో (క్రీ.శ. 1206 - 1526) విజయనగర సామ్రాజ్య స్థాపన జరిగిన విధంగానే మొగలుల కాలంలో భాన్స్లే వంశస్తుల నాయకత్వంలో మహారాష్ట్ర రాజ్యస్థాపన జరిగింది. ఈ రాజ్య నిర్మాత శివాజీ. కడపటి మొగలుల కాలంలో మహారాష్ట్రులు పీష్వాల నాయకత్వంలో సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి తమ అధికారం నలుమూలల వ్యాప్తి చేసారు.

## 13.2 మహారాష్ట్రుల విజృంభణకు కారణాలు :

మహారాష్ట్రంలో స్వతంత్ర రాజ్యస్థాపనకు లేక మహారాష్ట్రుల విజృంభణకు రాజకీయంగా, జాతీయంగా పెక్కు అంశాలు దోహదం చేశాయి.

### 13.2.1 భౌగోళిక పరిస్థితులు :

భౌగోళిక పరిస్థితులు మహారాష్ట్రులను ఒక గొప్ప జాతిగా రూపొందించుటలో విశేష ప్రభావాన్ని ప్రదర్శించాయి. మహారాష్ట్రంలో వింధ్య, సాత్‌పూరా, సహ్యాద్రి పర్వతపంక్తులు వ్యాపించి వున్నాయి. ఈ పర్వతాలు చాలా ఎత్తయినవి కావడంవల్ల ఇతర ప్రాంతపు దాడుల నుండి రక్షణ కల్పించినవి. శత్రువులు ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకోవడానికి వీలులేకుండా మైదాన ప్రాంతాన్ని తొంగిచూస్తూ ఉండేటటువంటి గిరిదుర్గాలనేకం నిర్మించబడినాయి. కొండలు, అడవులు, సెలయేరులతో కూడిన ఈ ప్రాంతం గెరిల్లా యుద్ధపద్ధతులకు

చాలా అనుకూలంగా ఉంది. ఇట్టి మహారాష్ట్ర భౌగోళిక పరిస్థితులు అచటి ప్రజలలో ధైర్యం, ఆత్మవిశ్వాసం మొదలగు లక్షణాలను పెంపొందించినవి. అంతేగాక ఈ ప్రాంతం వ్యవసాయానికి అనువయినది కాదు. ఎంతో కష్టపడితేగాని ప్రజలకు జీవనోపాధి జరిగేది కాదు. శారీరక పరిశ్రమలవల్ల, అక్కడ నెలకొన్న శీతల వాతావరణంవల్ల మహారాష్ట్రులు ఆరోగ్యంగాను, దృఢకాయులుగాను, నిరాడంబరులుగా ఉండేవారు.

### 13.2.2 సామాజిక, మత పునరుజ్జీవం :

క్రీ.శ. 16, 17 శతాబ్దాలలో మహారాష్ట్రంలో సాంఘిక, మతపరమైన ఉద్యమాలు బయలుదేరినాయి. తుకారాం, రామదాసు, వామనపండితుడు, ఏకనాథుడు, నామదేవులు మహారాష్ట్రంలో భక్తి ఉద్యమాన్ని సాగించి ప్రజలలో దైవభక్తిని పెంపొందించి సాంఘిక, మత రంగాలలో ఉన్న మూఢాచారాలను ఖండించారు. వర్ణవ్యత్యాసాలను, కులపరమైన ఆచార వ్యవహారాలను ఖండించి సర్వమానవ సమానత్వాన్ని చాటినారు. రామదాస్ 'దేశబోధ' అనే తన గ్రంథం ద్వారా జాతిని, మతాన్ని పునరుజ్జీవింపజేసి మహారాష్ట్ర ధర్మం అనే కొత్తసూత్రం ద్వారా రాజకీయ ఐక్యాన్ని సాధించాలని ప్రబోధించాడు. సర్కార్ మాటలలో భక్తిమార్గ బోధకులు సాధించిన సాంస్కృతిక పునరుజ్జీవనమే మహారాష్ట్రుల రాజకీయ పునరుజ్జీవనానికి కారణమయింది.

### 13.2.3 భాషా సారస్వతాలు :

భక్తి ఉద్యమకారులు ప్రజల భాష అయిన మరాఠీలో తమ బోధనలను ప్రచారంచేసి మరాఠి సారస్వతాన్ని సుసంపన్నం చేసారు. ఇది సామాన్య ప్రజలను ఉత్తేజితులను చేసింది. తుకారాం మున్నగువారి గీతాలు ప్రజలను ఆకట్టుకొని వారిని ఐక్యం చేశాయి.

### 13.2.4 రాజకీయ శిక్షణ :

దక్కన్‌లో బహమనీ రాజ్యపతనానంతరం ఐదు ముస్లిం రాజ్యాలు స్థాపితమయినవి. వీరిమధ్య ఐకమత్యం, సహనం, సహకారం లోపించినది. మహారాష్ట్రులు అహమ్మద్‌నగర్, బీజపూర్ సుల్తానుల కొలువులలోచేరి సైనిక, పరిపాలనా విషయాలలో మంచి అనుభవం గడించారు. మొగలాయిలతో పోరుకు మహమ్మదీయులు కంటే మహారాష్ట్రులే తగినవారని భావించి అహమ్మద్‌నగర్ ప్రధాని మాలిక్ అంబర్ వీరికి గెరిల్లా యుద్ధపద్ధతులలో శిక్షణను ఇప్పించాడు. మురారిరావు, మదన పండితుడు గోల్కొండ రాజ్యంలో దివానులుగా వ్యవహరించినారు. అదే విధంగా యేసూపండితుడు మొదలగువారు బీజపూర్ రాజ్యంలో ఉన్నతస్థానమునలంకరించారు. శివాజీ తండ్రి షాజీ భోన్‌స్లే బీజపూర్ రాజ్యంలో జాగీర్దారు. పెక్కుమంది మరాఠీ బ్రాహ్మణులు అహమ్మద్‌నగర్ రాజ్యంలో రాయబారులుగా నియమింపబడినారు. ఈ విధంగా దక్కన్ సుల్తానులు కొలువులలో తాము పొందిన శిక్షణ మహారాష్ట్రంలో స్వతంత్ర రాజ్యస్థాపనకు దోహదకారి అయింది.

### 13.2.5 దక్కన్ సుల్తానుల బలహీనత :

దక్కన్ సుల్తాన్‌ల అసమర్ధత, ముస్లిం సర్దారుల దురాశ, మొగల్ దండయాత్రలు మొదలగు అంశాలు దక్కన్ రాజ్యాలను బలహీనపరిచినవి. దక్కన్ సుల్తానుల బలహీనతను అదనుగా తీసుకొని మహారాష్ట్రులు రాజ్యస్థాపనకు పూనుకొన్నారు.

### 13.2.6 మొగలుల మతవిధానం :

ఔరంగజేబు అనుసరించిన మతద్వేష విధానం మహారాష్ట్రులలో స్వధర్మ రక్షణ భావాన్ని చైతన్యవంతం చేశాయి.

### 13.2.7 శివాజీ అవతరణ :

ఇటువంటి పరిస్థితులలో మహమ్మదీయుల బారినుండి హిందువులను కాపాడటానికి హిందూ ధర్మాన్ని రక్షించడానికి శివాజీ గణనీయమైన కృషిచేసాడు. సాంస్కృతిక, సాంఘిక ఐక్యాన్ని భక్తిమార్గబోధకులూ, సంస్కర్తలూ సాధిస్తే కొదవబడిన రాజకీయ ఐక్యత శివాజీ సాధించాడని జాదునాథ్ సర్కార్ అభిప్రాయపడినాడు.

13.2.8 పైన పేర్కొన్న విధంగా భౌగోళిక పరిస్థితులు, భక్తి ఉద్యమకారుల ప్రచారం, మహారాష్ట్రులు గడించిన రాజకీయ అనుభవం, దక్కన్ సుల్తానుల బలహీనత, శివాజీ కృషి మహారాష్ట్రుల విజృంభణకు దోహదం చేసినవి.

## 13.3 శివాజీ స్వరాజ్యస్థాపన :

మహారాష్ట్రుల చరిత్రలో శివాజీకి గొప్ప స్థానముంది. ఇతడు చెల్లాచెదురైన మహారాష్ట్రులను సమీకరించి, సంఘటితపరచి, మొగలాయిలను, బీజపూర్ సుల్తాన్‌ను తీవ్రంగా ఎదుర్కొని మహారాష్ట్రలో స్వతంత్ర రాజ్యస్థాపన చేసినాడు. ఢిల్లీ సుల్తానుల కాలంలో విజయనగర రాజులవలె మొగలుల కాలంలో మహమ్మదీయుల దాడుల నుండి హిందూమతాన్ని, సంస్కృతిని కాపాడిన ఘనుడు శివాజీ. ఇతడు గొప్ప యోధుడు, విజేతయేగాక పరిపాలనాదక్షుడు.

### 13.3.1 శివాజీ బాల్యజీవితం :

క్రీ.శ. 1627లో శివాజీ షివనీర్ అను దుర్గంలో జన్మించాడు. ఇతని తల్లి జిజియాబాయ్ దేవగిరి నేలిన యాదవ వంశానికి, తండ్రి షాజీభాన్‌స్లే సిసోడియా వంశానికి చెందినవారు. షాజీ భాన్‌స్లే బీజపూర్ రాజ్యంలోని పూనా జాగీర్దారు. షాజీ కర్ణాటక జాగీర్‌ను సంపాదించినపుడు, పూనా జాగీర్‌ను, పెద్దభార్య జిజియాను, కుమారుడైన శివాజీని దాదాజీ కొండదేవ్ పోషణ కింద వదిలిపెట్టి, చిన్న భార్య తుకాబాయి మోహితేతో కర్ణాటక జాగీర్‌కు వెళ్లాడు. దాదాజీ కొండదేవ్ పూనా జాగీర్‌ను నిర్వహిస్తూ, శివాజీకి క్షత్రియ విద్యలు నేర్పినాడు. భర్త నిరాదరణకు గురియైన జిజియాబాయి కుమారునికి పురాణ గాథలను, ఆత్మవిశ్వాసాన్ని బోధించింది. సమర్థ రామదాస్ శివాజీకి దేశభక్తిని, హిందూమత గొప్పతనాన్ని ప్రబోధించాడు. ఇట్లు తల్లి జిజియాబాయ్, దాదాజీ కొండదేవ్, సమర్థరామదాస్ శివాజీని బాగా ప్రభావితుని చేసారు.

### 13.3.2 తొలి ఆక్రమణలు :

1642 నాటికి శివాజీ శిక్షణను ముగించుకొన్న తరువాత తండ్రి జాగీర్ అయిన బెంగళూర్ ప్రాంతంలో రెండు సంవత్సరాలు గడిపి పూనా చేరినాడు. ప్రథమంలో శివాజీ మావళీయులతో స్నేహం చేసి కొండ ప్రాంతాలలోను, అరణ్య ప్రాంతాలలోను పరిచయ మేర్పరచుకొనెను. మావళీయులను తన సైన్యంలో చేర్చుకొని వారికి సైనిక శిక్షణ ఇచ్చాడు. స్వతంత్ర రాజ్యస్థాపనలో శివాజీకి వీరు గొప్ప సేవ చేసారు. 1646లో శివాజీ విజయయాత్ర ప్రారంభమయ్యెను. బీజపూర్ సుల్తాన్ అస్వస్థుడుకాగా శివాజీ తోర్నదుర్గాన్ని ఆక్రమించాడు. 1648లో శివాజీ చకన్, కొండానా, పురందర్, సూపా, బారామతి ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు.

### 1.3.3. షాజీభాన్‌స్లే నిర్బంధము :

శివాజీ కల్యాణి దుర్గమును ఆక్రమించినంతనే, భీతి చెందిన బీజపూర్ సుల్తాన్ శివాజీ చర్యలను అరికట్టుటకు షాజీని నిర్బంధించెను. అందువలన శివాజీ కొండన, బెంగళూర్‌ను బీజపూర్ సుల్తాన్‌కు అప్పగించి సంధి చేసుకొని తన తండ్రిని విడిపించెను. ఆ తదుపరి ఆరు సంవత్సరాల వరకు శివాజీ ఒప్పందం ప్రకారం సైనిక చర్యలను నిలిపివేసాడు. ఈ కాలంలో తాను జయించిన ప్రాంతాలను సంఘటిత పరచుకొన్నాడు.

### 13.3.4 జావలి, కొంకణ్ ఆక్రమణ :

1656లో శివాజీ తన దండయాత్రలను పునఃప్రారంభించి జావలి దుర్గాన్ని ఆక్రమించినాడు. దాని పాలకుడు చంద్రరావు హత్యకు గురిఅయినాడు. జావలి ఆక్రమణ శివాజీ దక్షిణ దండయాత్రలకు రాజబాట వేసింది. 1657లో శివాజీ కొంకణ్‌పై దాడిచేసి దుర్గాలను, ధనాన్ని సంపాదించాడు.

### 13.3.5 బీజపూర్‌తో యుద్ధాలు :

శివాజీ కొంకణ్ ఆక్రమణతో భీతిల్లిన బీజపూర్ సుల్తాన్ శివాజీని అణచుటకు అఫ్జల్‌ఖాన్‌ను పంపాడు. అఫ్జల్‌ఖాన్ మార్గమధ్యములోని మహారాష్ట్ర గ్రామాలను నాశనం చేయుచు దేవాలయాలను అపవిత్రం గావించుచూ ప్రతాప్‌ఘర్ దుర్గం చేరినాడు. ఆ దుర్గము నుండి శివాజీని బయటకు రప్పించుటలో విఫలుడైన అఫ్జల్‌ఖాన్ మహారాష్ట్ర బ్రాహ్మణుడైన కృష్ణాజీ భాస్కర్ ద్వారా సంప్రదింపులు ప్రారంభించి సమావేశమునకు ఒప్పించెను. అఫ్జల్‌ఖాన్ దురుద్దేశాలను తెలుసుకున్న శివాజీ ఆత్మరక్షణకై తగుసన్నాహాలు చేసుకొని సమావేశ స్థలంచేరి తననుచంపడానికి ప్రయత్నించిన అతనిని పులిగోళ్ళతో చీల్చి చంపాడు. నాయకుని శవాన్ని చూచి బీజపూర్ సైన్యం పారిపోయింది. వెంటనే శివాజీ పనహాల, విశాలఘర్ ప్రాంతాలను కొల్లగొట్టి ఆక్రమించాడు. దీనితో బీజపూర్ సుల్తాన్ శివాజీతో సంధిచేసుకొని అతని విజయాలు గుర్తించాడు.

### 13.3.6 మొగలులతో యుద్ధాలు :

దక్కన్ రాజప్రతినిధిగా వున్న ఔరంగజేబు వారసత్వ యుద్ధంలో పాల్గొనుటకు ఉత్తర భారతదేశం వెళ్ళగా 1657లో శివాజీ మొగల్ భూభాగముపై దాడులు ప్రారంభించాడు. కాని మొగల్ సైన్యం అతనిని ఓడించి తరిమివేసింది. వారసత్వ యుద్ధంలో విజయం సాధించిన తరువాత ఔరంగజేబు శివాజీ విజృంభణను అణిచివేసేందుకు 1660లో షాయి స్థ ఖాన్‌ను దక్కన్ సుబేదారుగా నియమించాడు. షాయిస్థఖాన్ పేరుగాంచిన సైన్యాధిపతి. ఇతడు పూనాను ఆక్రమించి, చకన్ దుర్గాన్ని పట్టుకొని కల్యాణి ప్రాంతం నుంచి మహారాష్ట్రులను తరిమివేసాడు. శివాజీ పూనాపై అర్ధరాత్రి దాడిజరిపినాడు. షాయస్థఖాన్ తన బొటనవేలిని పోగొట్టుకొని కిటికీ ద్వారా తప్పించుకొని పారిపోయినాడు. పిమ్మట శివాజీ సూరత్‌ను ముట్టడించి దానిని దోచుకున్నాడు. సూరత్‌లోని మొగల్ సైనికులు మహారాష్ట్రుల దాడిని నిరోధించకుండా పారిపోయినారు. దీనితో ఆగ్రహ పరవశుడైన ఔరంగజేబు శివాజీనణచుటకు రాజాజయసింగ్ అను రాజపుత్ర వీరుని పంపాడు. జయసింగ్ ఎంతో జాగ్రత్తతో రాజనీతిని ఉపయోగించి శివాజీ చుట్టు అ నేకమంది శత్రువులు చేరేటట్లు చేసినాడు. తన సైన్యాన్ని ఎన్నో భాగాలుగా చేసి అనేక దిక్కుల నుంచి ఒకేసారి ముట్టడించినాడు. నైరుతి దిశగా తానువెళ్ళి పురంధర్ ముట్టడించాడు. విధిలేక శివాజీ 1665లో రాజాజయసింగ్‌తో పురంధర్ సంధికి అంగీకరించాడు. ఈ సంధిననుసరించి శివాజీ ఔరంగజేబ్‌ను చక్రవర్తిగా అంగీకరించాడు. తాను 12 దుర్గాలు మాత్రమే ఉంచుకొని 23 దుర్గాలను మొగలులకు అప్పగించాడు. మొగల్ సైన్యానికి 5000 మంది మహారాష్ట్ర సైనికులను ఇవ్వడానికి శివాజీ ఒప్పుకొన్నాడు. తన కుమారుడు శంభూజీతో సహా శివాజీ ఆగ్రాలోని మొగల్ దర్బారును దర్శించడానికి అంగీకరించాడు.

### 13.3.7 ఆగ్రాను సందర్శించుట :

1666లో శివాజీ తన కుమారుడు శంభూజీతో సహా ఆగ్రాలోని మొగల్ దర్బారు సందర్శించాడు. అచట రాచమర్యాదలు లభించని శివాజీ ఆగ్రహించి ఔరంగజేబును తూలనాడినాడు. వెంటనే ఔరంగజేబు శివాజీని ఖైదు చేయించినాడు. కానీ అనతి కాలంలోనే శివాజీ కుమారునితో సహా నిర్బంధము నుండి యుక్తితో తప్పించుకొని మధుర చేరుకొని తన కుమారుని అక్కడేవుంచి సన్యాసివేషంలో మహారాష్ట్ర చేరుకొన్నాడు. 1667లో జయసింగ్‌ను దక్కన్‌నుంచి పిలిపించి, ఆస్థానంలో రాజాజస్వంత్ సింగ్‌ను సుబేదార్‌గా ఔరంగజేబు నియమించాడు. జస్వంత్ సలహాపై ఔరంగజేబు శివాజీతో సంధిచేసుకొని అతనికి 'రాజా' అను బిరుదుఇచ్చినాడు.

### 13.3.8 మొగలులతో తిరిగి యుద్ధం :

1670లో శివాజీ దండయాత్రలు ప్రారంభించి పురంధర్ సంధితో కోల్పోయిన దుర్గాలన్నిటినీ తిరిగి ఆక్రమించాడు. సూరత్‌ను శివాజీ రెండవసారి కొల్లగొట్టినాడు. మొగల్ రాష్ట్రాలైన ఖాన్‌దేశ్, బీరార్, అహమ్మద్ నగరాలపై దాడులు ప్రారంభించి శివాజీ అపార ధనరాసులను కొల్లగొట్టాడు.

### 13.3.9 పట్టాభిషేకం :

1674 జూన్ 16న శివాజీ రాయఘడ్‌లో ఛత్రపతి అను బిరుదుతో ఎంతో వైభవంగా పట్టాభిషేకం చేసుకొన్నాడు. తానుపాలించిన ప్రాంతానికి స్వరాజ్యం అని పేరు పెట్టినాడు.

### 13.3.10 చివరి రోజులు :

పట్టాభిషేకానంతరం శివాజీ జంజీరను పాలించు అబిసీనియన్‌లతోను, బీజపూర్ సుల్తాన్‌తోను పోరాడెను. ఆ తదుపరి గోల్కొండ సుల్తాన్‌తో ఒడంబడిక చేసుకొని దక్షిణదేశంపై దండెత్తివెళ్ళి బళ్ళారి, బెంగుళూరు, వెల్లూరు, జింజి, తంజావూర్‌లను జయించాడు. తంజావూరు పాలకుడు వెంకోజీ శివాజీ సార్వభౌమాధికారాన్ని గుర్తించాడు. నిర్విరామ కృషివలన ఆరోగ్యం క్షీణించి శివాజీ 1680లో మరణించాడు.

### 13.3.11 రాజ్య విస్తీర్ణం :

శివాజీ స్వరాజ్యం పశ్చిమ తీరం వెంట ఉత్తరాన రామ్‌నగర్ నుండి దక్షిణాన కార్వార్ వరకు విస్తరించియుండెను. తూర్పు సరిహద్దు ఉత్తరాన బగ్లానా నుండి దక్షిణాన కొల్హాపూర్ వరకు గలదు. ఇదిగాక మైసూర్, కర్ణాటక ప్రాంతాలలోని కొన్ని ప్రదేశాలు శివాజీ రాజ్యంలో చేరియుండెను.

### 13.3.12 ఘనత :

మహారాష్ట్రంలో స్వతంత్ర రాజ్యస్థాపకుడు శివాజీ. ఇతడు ముస్లిం దాడుల నుంచి మహారాష్ట్రను, హిందూ సంస్కృతిని రక్షించాడు. గెరిల్లా యుద్ధ పద్ధతులలో ఆరితేరిన శివాజీ మొగలాయిలతో, బీజపూర్ సుల్తాన్‌తో పెక్కు యుద్ధాలు చేసి విజయాలు సాధించాడు. తన స్వరాజ్యంలో పటిష్టమైన పాలనా యంత్రాంగాన్ని నిర్మించి ప్రజలకు శాంతిభద్రతలను, సుఖశాంతులను చేకూర్చాడు. శివాజీ ముస్లిం మసీదులను, స్త్రీలను, ఖురాన్ గ్రంథాన్ని గౌరవమర్యాదలతో చూసాడు. శివాజీని తీవ్రంగా విమర్శించిన ఖాఫీఖాన్ అను చరిత్రకారుడు మత విషయాలలో శివాజీ విశాల హృదయాన్ని కొనియాడినాడు.

## 13.4 శివాజీ పరిపాలనా విధానము :

శివాజీ రాజ్యస్థాపకుడేగాక పరిపాలనాదక్షత కూడా గలవాడు. ఇతని పాలనా విధానంలో హిందూ ధర్మసూత్రాలు, న్యాయశాస్త్రాలు, దక్కన్ సుల్తానులు, మొగలాయి పాలనా విధానములోని కొన్ని అంశాలు మిళితమై యున్నాయి. హిందూ ధర్మరక్షణ కోసం సామ్రాజ్యం స్థాపించినా ప్రభుత్వాన్ని మతసహితం చేయలేదు. ప్రజాశ్రేయస్సే పరమావధిగా కలవాడవటంవల్ల ఇతని ప్రభుత్వం ప్రాజ్ఞ నిరంకుశ ప్రభుత్వమని చెప్పవచ్చు. భూస్వామ్య పద్ధతిని రద్దుపరచి భూమిని రైతులకు పంచి ఇవ్వడం వలన కేంద్రీకృత ప్రభుత్వమనవచ్చు. శాంతిభద్రతలకు సైనిక బలమవసరమని స్వరాజ్యాన్ని సైనికపరంగా విభజించడంవలన సైనిక ప్రభుత్వమని కూడా చెప్పవచ్చును. శివాజీ మహారాష్ట్ర జాతి నిర్మాతయేగాక మధ్యయుగ భారతదేశ చరిత్రలోకెల్లా గొప్ప పరిపాలనాదక్షుడని జాదునాథ్ సర్కార్ అభిప్రాయపడినాడు. రౌలిన్ సన్ మాటలలో ప్రపంచంలోని ప్రతియోధునివలె శివాజీ కూడా గొప్ప పరిపాలనా దక్షుడు.

### 13.4.1 కేంద్ర ప్రభుత్వం :

**ఎ) రాజు :** రాజు పదవి వంశపారంపర్యం. ఇతడు రాజ్యానికి సర్వాధికారి. సైనిక, న్యాయపరమైన అన్ని అధికారాలు అతని చేతిలో కేంద్రీకరించబడినాయి. తనకు సలహాలివ్వడానికి అష్టప్రధానులు అనే మంత్రులను నియంమించాడు. వీరు ఎల్లప్పుడు శివాజీ ఆజ్ఞానుసారం ప్రవర్తించ వలసిందేగాని స్వతంత్రంగా వ్యవహరించకూడదు. ఈ అష్టప్రధానుల పద్ధతిని దక్కన్‌లో మొదటిసారిగా అహమ్మద్‌నగర్ రాజ్యంలో మాలిక్ అంబర్ ప్రవేశపెట్టాడు. ఈ పద్ధతిని సంస్కరించి శివాజీ తన రాజ్యానికి అనుగుణంగా మార్చుకొన్నాడు.
బి) అష్ట ప్రధానులు : శివాజీ మంత్రిమండలిని అష్టప్రధానులంటారు. వీరి విధులు స్పష్టంగా నిర్దేశింపబడినాయి.

**1) పీష్వా :** ఇతడు ప్రధానమంత్రి. ఇతనికి మంత్రులందరిపైనా అధికారం వున్నది. రాజకీయ, పాలనా వ్యవహారాలను రాజుతోపాటు పరిశీలించి నిర్వహించేవ్యక్తి.

ఇతడు ఆర్థిక మంత్రి. ప్రభుత్వ ఆదాయవ్యయ పట్టికను తయారుచేయడం, జమాఖర్చు లెక్కలను తనిఖీ చేయటం ఇతని ముఖ్య విదులు.

ఇతడు స్వదేశీ వ్యవహారాల మంత్రి. ఇతడు ఆస్థాన విషయాల దినచర్యను తయారుచేస్తాడు. ఇతడు అంతఃపుర మహాప్రతిహారిగా గూడా వ్యవహరిస్తాడు.

ఇతడు ఆంతరంగిక వ్యవహారాల మంత్రి. ఇతడు ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతాడు.

ఇతడు విదేశీ వ్యవహారాల మంత్రి. విదేశీ వ్యవహారాలను పరిశీలించడం, సంప్రదింపులు, రాయబారాలు సాగించి సంబంధ బాంధవ్యాలు నెలకొల్పడం ఇతని విధులు.

ఇతడు సైనిక వ్యవహారాల మంత్రి. సైనికులను చేర్చుకొనుట, శిక్షణ ఇప్పించుట, క్రమశిక్షణ, నిర్వహణ మున్నగునవి ఇతని విధులు

ఇతడు దానధర్మాలు, విద్యా పోషణం మొదలైన వ్యవహారాల మంత్రి. మత సంస్థల రక్షణ, గోబ్రాహ్మణ రక్షణ, మతసూత్రాల ఆచరణము అమలుపరచడం, నీతినియమాలు కాపాడటం ఇతని విధులు.

ఇతడు న్యాయశాఖా మంత్రి. న్యాయ నిర్వహణలో రాజుకు ప్రధాన సలహాదారు.

ఎనిమిది మంత్రులలో పండితరావు, న్యాయాధీశుడు తప్ప మిగిలిన ఆరుగురు సైనికాధికారులుగా కూడా నియమితులై సైన్య సమీకరణ చేసేవారు. వీరి ఉద్యోగకాలం చక్రవర్తి ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉన్నది. వీరి సేవకు ప్రతిఫలంగా నెలజీతాలు నిర్ణయించాడు. ఈ పదవులకు వంశపారంపర్య హక్కులేదు.

### 13.4.2 రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు :

శివాజీ తన స్వరాజ్యాన్ని నాలుగు రాష్ట్రాలుగ విభజించినాడు. ప్రతి రాష్ట్రాన్ని ప్రాంత్‌లుగా, ప్రాంత్‌ను పర్గణాలుగా, పర్గణాను టర్ఫ్‌లుగా, టర్ఫ్‌ను మోజాలుగా విభిజించాడు. గ్రామ పాలనా యంత్రాంగంలో కడపటి విభాగం. రాష్ట్రానికి రాజప్రతినిధి అధికారి. తన పాలనా విభాగంలో పాలన నిర్వహణ పర్యవేక్షించడం ఇతని కర్తవ్యం. ముఖ్యదేశాధికారి ప్రాంత్ మీద అధికారి. ఇతనికి పాలనలో 8మంది మంత్రులు సహాయపడేవారు. పరగణా, టర్ఫ్, మోజా విభాగాలకు చెందిన పాలనా విధానాల వివరాలు కానరావు. గ్రామపంచాయితీలు గ్రామ పాలన సాగించాయి.

### 13.4.3 సైనిక నిర్వహణ :

శివాజీ సైనికపాలనా విధానంలో పెక్కు మార్పులు చేసాడు. ప్రథమంగా మహారాష్ట్రంలో శివాజీ స్థిరసైన్యాన్ని నెలకొల్పాడు. శివాజీ సైన్యంలో లక్ష కాల్బలం, 40 వేల అశ్వికదళం, 1260 గజదళం, 3 వేల ఒంటెలు ఉండేవి. ఇవికాక ఫిరంగిదళం, నైకాదళం,

తుపాకి దళమును కూడా శివాజీ నెలకొల్పాడు. సైన్యమందలి ప్రతిభాగాన్ని వివిధ శ్రేణులుగా విభజించి ఒక దానిపై మరొకదాని అజమాయిషీ ఉండునట్లు చేశాడు. సైనికులకు జీతం నగదు రూపంలో చెల్లించాడు. వీరి పదవులు వంశపారంపర్యం కాదు. సైన్యంలో అన్ని భాగాలకు అష్టప్రధానులలో ఒకడైన సేనాపతి సైన్యాధక్షుడు. సైన్యాన్ని గెరిల్లా యుద్ధమునకు అనుగుణంగా నిర్మించాడు.

### ఎ) అశ్విక దళం :

శివాజీ ప్రధానంగా అశ్వికదళంలో ఎక్కువ శ్రద్ధ కనబరిచినాడు. అశ్వదళాన్ని బర్గీలు, సిలాహీదార్‌లు అను రెండు రకాలుగా విభజించాడు. మొదటి రకంలో ప్రతి సైనికునికి గుర్రాన్ని, ఆయుధాలను ప్రభుత్వమే సమకూర్చింది. రెండో రకంలో సైనికులు తమంతటతామే పరికరాలను సమకూర్చుకోవలెను. వీరికి యుద్ధసమయములో యుద్ధభూమిలో ఉన్నంతసేపు వారి ఖర్చులకు సరిపడే డబ్బును మాత్రమే ప్రభుత్వమిచ్చేది. శివాజీ తన అశ్వికదళాన్ని 5 భాగాలుగా చేసి ఒక్కొక్క భాగాన్ని వేర్వేరుగా నాలుగు తరగతులుగా విభజించాడు. ఇందులో మొదటిది హవల్‌దారీ. దీనిమీద హవల్‌దార్ అధికారి. ఇతని కింద 25 మంది అశ్వికులున్నారు. ఐదుగురు హవల్‌దార్‌లపై ఒక జమ్లాదార్, 10 మంది జామ్లాదార్‌లపై ఒక హజారీ, ఐదుగురు హజారీలపై ఒక పాంచ్‌క హజారీ ఉన్నారు. పాంచ్‌హజారీపై సర్‌నాబత్ అధికారి. ఇతడు మొత్తం అశ్వికదళానికి అధిపతి.

### బి) కాల్బలం :

శివాజీ కాల్బలాన్ని కూడా అనేక భాగాలుగా విభజించినాడు. ఇందులో 9 మంది సైనికులపై ఒక నాయక్, ఐదుగురు నాయక్‌లపై ఒక హవల్దార్, ఇద్దరు లేక ముగ్గురు హవల్దార్‌లపై ఒక జమ్లేదారు, 10 మంది జమ్లేదార్లపై ఒక హజారీ, ఏడుగురు హజారీలపై ఒక పాంచ్‌హజరీని నియమించాడు. కాల్బలం మొత్తానికి ఉన్నతాధికారి సర్ నౌబత్.

### సి) నౌకాదళం :

శివాజీ కొలాబా వద్ద నౌకాదళమును నిర్మించాడు. పోర్చుగీసువారు, ఆంగ్లేయులు కూడా శివాజీ నౌకాబలానికి భయపడినారు.

### డి) దుర్గాలు :

మహారాష్ట్ర సైనిక విధానంలో దేశరక్షణకు కొండదుర్గాలు ముఖ్యపాత్ర వహించినవి. శివాజీకి 280 కోటలుండేవి. వాటిలో శిక్షితులైన సైనికులను ఉంచినాడు. ప్రతిదుర్గము సమాన అధికారాలు గల ముగ్గురు ఉద్యోగుల ఆధీనంలో ఉండేది. వీరు హవల్‌దార్, సబ్నీస్, సర్‌నౌబత్. వీరు ఒకరిపై ఒకరు నిఘావేసి ఉండేవారు.

### ఇ) క్రమశిక్షణ :

సైనిక నిర్వహణలో శివాజీ క్రమశిక్షణకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చేవాడు. క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిని కఠినంగా శిక్షించేవాడు. సైనిక శిబిరములలో స్త్రీల ప్రవేశమును, మత్తుపదార్థములను నిషేధించెను. యుద్ధ సమయములందు పంటలను నాశనం చేయరాదని, పౌరులను హింసించరాదని శాసించెను. ముఖ్యముగా స్త్రీలపట్ల శివాజీ ప్రవర్తన ప్రస్తుతింపదగినది.

## 13.4.4. రెవిన్యూ పరిపాలన :

### ఎ) భూమి శిస్తు :

భూమిశిస్తు విషయంలో శివాజీ తోడర్‌మల్లు, మాలిక్ అంబర్ విధానాలను ఆదర్శంగా తీసుకున్నాడు. భూమిశిస్తు నిర్ణయంలో

శివాజీ భూమి విస్తీర్ణాన్ని భూసారాన్ని పరిగణలోనికి తీసుకొనేవాడు. పంటలో 40 శాతం భూమి శిస్తుగా నిర్ణయించినాడు. రైతులు నేరుగా ప్రభుత్వానికి శిస్తును ధనరూపేనగాని ధాన్యరూపేణగాని చెల్లించవచ్చును. ప్రభుత్వానికి రైతులకు మధ్య దళారులుండేవారు కాదు. ప్రభుత్వం రైతులకు అప్పులిచ్చేది. స్వల్ప మొత్తాలలో రైతులు అప్పును తిరిగి ప్రభుత్వానికి చెల్లించేవారు. కరువుకాటక సమయాలలో రైతులకు ధాన్యం, ధనం ఇచ్చి ప్రభుత్వం సాయపడేది.

### బి) చౌత్, సర్దేశ్‌ముఖి :

స్వరాజ్య ఆదాయం కోసం శివాజీ భూమిశిస్తు విధానాన్ని సంస్కరించుటయేగాక చౌత్, సర్దేశ్‌ముఖి అనే రెండు రకాల పన్నులను వసూలుచేశాడు. చౌత్ నామరూపాలను గురించి, ప్రాచీనత గురించి చరిత్రకారులలో భిన్న అభిప్రాయాలున్నాయి. రామ్‌నగర్ రాజు చౌతియా దీనిని డామన్‌లో ఉన్న పోర్చుగీస్‌వారిపై విధించాడు కాన చౌత్ అనే పేరు వచ్చిందని 1/4 వంతు అనగా చౌసాను పన్నుగా నిర్ణయించినారు కాబట్టి చౌత్ అన్నారని భిన్నఅభిప్రాయాలున్నాయి. ఇది మొదట 1579లో అమలులోకి వచ్చింది. 1664లో శివాజీ ఈ చౌత్‌ను సూరత్ ప్రజలనుంచి 1677లో డామన్ ప్రజలనుంచి, బేసిన్‌లో ఉన్న పోర్చుగీసువారి నుంచి వసూలు చేశాడు. సమీప రాజ్య ప్రజలను శత్రువుల బారినుండి శివాజీ కాపాడినందున ఆ రాజ్యప్రజలు చెల్లించిన ప్రతిఫలం చౌత్ అని రనడే అభిప్రాయపడగా సమీపరాజ్యాలు తమ్ముతాము మహారాష్ట్ర దాడుల నుండి రక్షించుకొనుటకు చెల్లించుసుంకము ఈ చౌత్ అని జాదునాద్ సర్కార్ అభిప్రాయపడినాడు. శివాజీ నుండి కడపటి పీష్వాల వరకు మహారాష్ట్రులంతా ఈ చౌత్ వసూలు చేసారు. శివాజీ కాలంలో స్థానిక ఉద్యోగులు చౌత్ వసూలు చేయగా, ఆ తదుపరి మహారాష్ట్ర ఉద్యోగులే చౌత్ వసూలు చేసారు. చౌత్‌ను వసూలు చేయడం ద్వారా శివాజీ ఆదాయాన్ని చాలావరకు పెంచగలిగాడు. సర్దేశ్‌ముఖ్ అనగా ప్రాంతీయ నాయకులకు పెద్ద వంశపారంపరంగా వస్తున్న హక్కును గుర్తించి సర్దేశ్‌ముఖ్‌కు ఇచ్చే పన్ను కావడంచేత సర్దేశ్‌ముఖీ అనే పేరు వచ్చింది. శివాజీ ఆదాయంలో 1/10 వంతు ప్రతివానినుంచి ఈ పన్ను వసూలుచేసాడు. ప్రజలకు సేవచేసినందుకు, చట్టబద్ధంగా, న్యాయంగా తనకు చెందవలసిందని దీనిని శివాజీ వసూలు చేశాడు.

### 13.4.5 న్యాయనిర్వహణ :

అష్టప్రధానులలో న్యాయాధీశుడు ముఖ్య న్యాయాధికారి. ధర్మశాస్త్రాల కనుగుణంగా న్యాయనిర్ణయం జరిగేది. గ్రామస్థాయిలో గ్రామపంచాయితీలు నేరవిచారణ జరిపి శిక్షలు విధించేవి.

### 13.4.6 మత విధానం :

శివాజీ సనాతన హిందూ మతస్థుడైనను ఇతర మతాలపట్ల సహనం పాటించాడు. ముస్లింలకు సంపూర్ణ మతస్వేచ్ఛ ఇవ్వబడింది. ఖురాన్‌ను భగవద్గీతతో సమనంగా చూసాడు. పౌర, సైనిక విభాగాలలో శివాజీ పెక్కుమంది ముస్లింలను నియమించాడు. శివాజీని నిశితంగా విమర్శించిన ఖాఫీఖాన్ అతని మతసహనాన్ని గూర్చి శ్లాఘించాడు.

### 13.4.7 ఘనత :

శివాజీ యోధునిగా, రాజనీతిచతురునిగా, జాతి నిర్మాతగా, పరిపాలనాదక్షునిగా భారతదేశ చరిత్రలో గొప్ప స్థానమలంకరించెను. పాలనాదక్షతలో ఫ్రాన్స్‌రాజగు మొదటి నెపోలియన్‌తో శివాజీని పోల్చవచ్చునని రావిల్సన్ అభిప్రాయపడినాడు.

## 13.5 శివాజీ వారసులు :

1680 శివాజీ మరణంతో స్వరాజ్య అభ్యున్నతి కుంటుపడింది. తిరిగి పీష్వాలు విజృంభించేవరకు మహారాష్ట్రం వారసత్వ

యుద్ధాలకు నిలయమైంది. శివాజీ మరణానంతరం శంభూజీ, రాజారాం, తారాబాయిలు వరుసగా మహారాష్ట్రులకు నాయకత్వం వహించి మొగలులతో పోరాడినారు. రాజారాం భార్య తారాబాయి, శంభూజీ కుమారుడు సాహుల మధ్య అంతర్యుద్ధం ప్రారంభం కావడంతో దీని నవకాశంగా తీసుకొని పీష్వాలు అధికారాన్ని చేజిక్కించుకొన్నారు.

## 13.6 సమీక్ష :

17వ శతాబ్దంలో మహారాష్ట్రుల విజృంభణకు భౌగోళిక పరిస్థితులు, భక్తి ఉద్యమకారుల ప్రచారం, మహారాష్ట్రులు గడించిన పాలనానుభవం మొదలగు విషయాలు దోహదంచేసాయి. చెల్లాచెదురైన మహారాష్ట్రులను సమీకరించి స్వరాజ్యాన్నిస్థాపించి మహమ్మదీయుల బారినుండి హిందూమతాన్ని, ధర్మాన్ని కాపాడినాడు. ప్రథమంగా రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టి భూస్వామ్య వ్యవస్థను రద్దుపరిచాడు. అంతేగాక మహారాష్ట్రలో తొలిసారిగా సిద్ధసైన్యాన్ని ఏర్పాటు చేసినాడు. ఇతని మరణానంతరం తిరిగి పీష్వాలు విజృంభించేవరకు స్వరాజ్య అభ్యున్నతి కుంటుపడింది.

## మాదిరి ప్రశ్నలు :

1. మహారాష్ట్ర రాజ్యస్థాపనకు శివాజీ ఎంతవరకు బాధ్యుడో వివరంగా వ్రాయుము.
2. శివాజీ పరిపాలనా విధానమును వర్ణింపుము.
3. మహారాష్ట్రలో స్వతంత్ర రాజ్యస్థాపనకు దోహదము చేసిన పరిస్థితులేవి ?
4. పురందర్ సంధి
5. శివాజీ అష్టప్రదాన్
6. చౌత్, సర్దేశ్‌ముఖీ

## ఉపయుక్త గ్రంధాలు :


1. పాటిబండ్ల ఝాన్సీలక్ష్మీ మరియు అల్లాడి వైదేహి - భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం)
2. Sankar - Shivaji and His times
3. Ranade - Rise of the Maratha Power - Vol. 1
4. Sen - Shiva Chatrapati.

పాఠం - 14

# పీష్వాల యుగము

**విషయసూచిక**


**14.0** లక్ష్యం

**14.1** ఉపోద్ఘాతం

**14.2** బాలాజీ విశ్వనాథ్

**14.3** బాజీరావు

**14.4** బాలాజీ బాజీరావు

**14.5** మూడవ పానిపట్టు యుద్ధం

**14.6** ముగింపు


## 14.0 లక్ష్యం :

శివాజీ మరణానంతరం మహారాష్ట్ర అంతరంగిక కల్లోలాలకు గురిఅయినపుడు, దానికి శాంతి భద్రతలు ప్రసాదించుటయేగాక, మహారాష్ట్రులను యావద్భారత శక్తిగా రూపొందిన పీష్వాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 14.1 ఉపోద్ఘాతం :

హిందూ ధర్మశాస్త్రాలను అనుసరించి శివాజీ ఏర్పరచిన అష్టప్రధానులలో ముఖ్యుడు పీష్వా. పీష్వా అనగా ప్రధానమంత్రి. ఈ పదవి తాత్కాలికమైనది. కాని సాహు కాలంలో ఇది వారసత్వ హక్కుగల శాశ్వత పదవిగా రూపొందినది. దీనిని 1714లో బాలాజీ విశ్వనాధ్ సాధించాడు. నాటినుంచి 1818 వరకు పీష్వాల యుగం కొనసాగింది. పీష్వాలు మొదట మొగలులతో తరువాత ఆంగ్లేయులతో యుద్ధాలు చేసారు. ఆంగ్లేయులతో చేసిన యుద్ధాలవల్ల వీరి అధికారం క్షీణించింది. ఈస్ట్ ఇండియా కంపెనీ 1818లో పీష్వా పదవిని రద్దుచేసింది. పీష్వాలలో సుప్రసిద్ధులు బాలాజీ విశ్వనాధ్, బాజీరావు, బాలాజీ బాజీరావు. బాలాజీ బాజీరావు కాలంలో జరిగిన మూడవ పానిపట్టు యుద్ధంలో పీష్వా అధికారం క్షీణించింది.

## 14.2 బాలాజీ విశ్వనాథ్ (1713 - 1720) :

### 14.2.1 తొలిజీవితం :

బాలాజీ విశ్వనాథుడు చిత్‌పవన్ శాఖకు చెందిన బ్రాహ్మణుడు. ఇతడు మహారాష్ట్రుల కొలువులో రెవిన్యూ ఉద్యోగిగా ప్రవేశించి తారాబాయ్ సేనాపతియైన ధనాజీ జాదవ్ దగ్గర పనిచేసాడు. ఆ తదుపరి ధనాజీ జాదవ్‌తోబాటు ఇతడు సాహుపక్షాన సేనాకర్త అయ్యెను. అంతర్యుద్ధంలో శంభూజీ కుమారుడైన సాహుపక్షం వహించి అతని విజయానికి దోహదం చేశాడు. సాహు ఛత్రపతియైన పిమ్మట బాలాజీ చేసిన సేవలకు ప్రతిఫలంగా 1713లో పీష్వాగా నియమించెను.

### 14.2.2 కన్హోజీతో ఒడంబడిక :

పశ్చిమతీర నౌకాదళాధిపతియైన కన్హోజీ సాహు బద్ధవిరోధి మరియు తారాబాయి విశ్వాసపాత్రుడు. మహారాష్ట్ర సామ్రాజ్య విస్తరణకు, రక్షణకు కన్హోజీ సేవలు అవసరమని గుర్తించిన బాలాజీ లోనవాలా ఒడంబడిక ద్వారా సాహు, కన్హోజీలను సమన్వయపరచెను. ఈ ఒడంబడిక ప్రకారం కన్హోజీ, సాహును ఛత్రపతిగా గుర్తించాడు. సాహు, కన్హోజీని నౌకాదళాధిపతిగా గుర్తించాడు. కన్హోజీ సహాయంతో సాహు సిద్దీలపై, పోర్చుగీసువారిపై విజయాలు సాధించాడు.

### 14.2.3 మొగలులతో సంధి :

మొగల్ చక్రవర్తి ఫరూక్‌సియార్‌ను పదవీభ్రష్టుని చేయడానికి సయ్యద్ సోదరులలో ఒకడు మరియు దక్కన్‌లో మొగల్ రాజప్రతినిధియైన హుస్సేన్ ఆలీ మహారాష్ట్రుల సహాయమర్థించెను. భారతదేశంలో మహారాష్ట్రుల ఆధిక్యాన్ని నెలకొల్పాలని భావిస్తున్న బాలాజీ వెంటనే సహాయం చేయడానికి అంగీకరించి సంధి చేసుకొన్నాడు. 1714లో జరిగిన ఈ సంధి ప్రకారం

1) శివాజీ సంపాదించిన ప్రాంతాలన్నింటిని సాహుకు తిరిగి ఇవ్వడానికి
2) మహారాష్ట్రులు ఖాందేష్, గొండ్వానా, బీరార్‌లలో, హైదరాబాద్, కర్ణాటకంలో స్వాధీనం చేసుకున్న ప్రాంతాలలో షాహు అధికారాన్ని గుర్తించడానికి
3) దక్కన్‌లో ఉన్న 6 మొగల్ సుబాలలో సాహు చౌత్, సర్‌దేశ్‌ముఖీ వసూలు చేయడానికి సయ్యద్ సోదరులు అంగీకరించారు.
4) దీనికి ప్రతిఫలంగా సాహు మొగల్ చక్రవర్తికి 10 లక్షల రూపాయలు కప్పం చెల్లించుటకు
5) 15 వేల అశ్వికదళంతో మొగలులకు యుద్ధ సమయంలో సహాయం చేయడానికి బాలాజీ అంగీకరించాడు.

ఈ ఒడంబడికననుసరించి బాలాజీ సయ్యద్ సోదరులకు సహాయంచేసి ఫరూఖ్‌సియార్‌ను దింపి రఫీ ఉద్ దరాజత్‌ను మొగల్ చక్రవర్తిని చేసాడు. 1719 మొగల్ చక్రవర్తి రఫీ ఈ ఒడంబడికను అధికార పూర్వకంగా ఆమోదించాడు.

### 14.2.4 వాడ్ గోవాన్ యుద్ధం :

బాలాజీ ఢిల్లీలో ఉండగా కొల్హాపూర్ రాజు శంభూజీ సాహుపై దండెత్తాడు. ఈ వార్తలంది బాలాజీ వెంటనే తిరిగివచ్చి 1719లో వాడ్ గోవాన్ యుద్ధంలో శంభూజీని ఓడించి శాంతి నెలకొల్పెను.

### 14.2.5 మహారాష్ట్ర కూటమి :

బాలాజీ సాధించిన మరొక ఘనవిజయం మహారాష్ట్ర సమాఖ్యను ఏర్పాటు చేయుట. శివాజీ స్థాపించిన పాలనా విధానం రాజరామ్ కాలంలో అంతమొందింది. జాగీర్దారీ పద్ధతి ప్రవేశపెట్టబడింది. వీరు స్వతంత్రులై సాహును రాజుగా గుర్తించలేదు. అందువలన బాలాజీ జాగీర్దారీవిధానం రద్దుచేయుట సాధ్యంకాదని గ్రహించి, వారు రాజుకు విధేయులై మసలునట్లు వారికి దక్కన్ సుబాలలో చౌత్, సర్‌దేశ్‌ముఖీ వసూలు చేయుహక్కును పంచి యిచ్చెను. అంతేగాక వీరందరూ తమ శత్రువులను ప్రతిఘటించుటకు వీలుగా సాహు నాయకత్వం క్రింద ఒక కూటమిగా ఏర్పాటుచేసి మహారాష్ట్రులలో ఐక్యతను సాధించెను.

### 14.2.6 ఘనత :

బాలాజీ విశ్వనాథ్ మహారాష్ట్రమున శాంతిభద్రతలు నెలకొల్పి మహారాష్ట్రుల ప్రాబల్యం భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు వ్యాపింపచేయుటకు మార్గమేర్పరచినాడు. సాహుకు బాలాజీ గొప్ప సేవచేసి సాటిలేని సేవకునిగా పేరుగాంచాడు. అందువలన బాలాజీ రెండవ మహారాష్ట్ర సామ్రాజ్య నిర్మాతగా కీర్తింపబడినాడు.

## 14.3 బాజీరావు (1720 - 1740) :

బాలాజీ విశ్వనాథ్ తరువాత అతని కుమారుడు బాజీరావు పీష్వాగా నియమించబడినాడు. ఇతడు గొప్ప యోధుడే గాక మంచి రాజనీతిజ్ఞుడు. రాజ్యవ్యవహారాల్లో అనుభవం గడించినాడు. భారతదేశమున హిందూ సామ్రాజ్య నిర్మాణమే ఇతని లక్ష్యం.

ఎ) తన లక్ష్యసాధనకు మొదట బాజీరావు మహారాష్ట్రుల అధికారాన్ని దక్కన్‌లో సుస్థిరపరచుటకు ప్రయత్నించాడు. తనకు ప్రత్యర్థిగా నిలిచిన హైదరాబాద్ నిజాం రాజ్య విస్తరణను అరికట్టి కర్ణాటక ప్రాంతంలోని పాలకులను తన ఆధిపత్యములోనికి తెచ్చుకొనుటకు దాడులు జరిపి తంజావూర్, గుత్తి, చితల్‌దుర్గ్, గదగ్ పాలకులపై మహారాష్ట్రుల ఆధిపత్యమును నెలకొల్పినాడు. నిజామ్, సాహుకు చౌత్, సర్‌దేశ్‌ముఖీ చెల్లించుటకు నిరాకరించడమేగాక కొల్హాపూర్ పాలకుడు శంభాజీని రాజుగా గుర్తించినందువల్ల బాజీరావు పాల్‌ఖేడ్ యుద్ధంలో నిజామ్‌ను ఓడించి సంధికి ఒప్పించెను. ఈ సంధి ప్రకారం నిజాం, సాహును రాజుగా గుర్తించి చౌత్, సర్దేశ్‌ముఖి చెల్లించుటకు అంగీకరించాడు. ఆ తదుపరి గుజరాత్ పాలకుడు త్రియంబక్‌రావును పీష్వాకు వ్యతిరేకంగా రెచ్చగొట్టుటకు నిజాం ప్రయత్నించగా దానిని వమ్ముచేసెను.

బి) బాజీరావు మాళ్వా, గుజరాత్‌లను జయించి రెవిన్యూ వసూలుకు అధికారులను నియమించెను. ఉదయపూర్, జైపూర్ పాలకుల నుండి కప్పం వసూలు చేసినాడు. బుందేల్ ఖండ్ పాలకుడగు ఛత్రసాల్‌ను అలహాబాద్‌లోని మొగల్ గవర్నర్ మహమ్మద్‌ఖాన్ నిర్బంధించగా బాజీరావు ఛత్రసాల్‌ను బంధవిముక్తి చేసెను. ఇందుకు ప్రతిఫలంగా ఛత్రసాల్ మధ్య ఇండియాలో ఝాన్సీ, సాగర్, కల్పి, హటా మొదలగు ప్రాంతాలను బాజీరావు కిచ్చెను. మొగల్ చక్రవర్తికి సహాయంగా వచ్చిన నిజాంను బాజీరావు భోపాల్ యుద్ధమున ఓడించాడు. ఈ విజయం వలన మహారాష్ట్రులకు యమున - నర్మదా నదుల మధ్య ప్రాంతం, 60 లక్షల రూపాయలు లభించినవి.

సి) పశ్చిమతీరంలోని జంజీర సిద్దీల అధికారమును నిర్మూలించుటయేగాక పోర్చుగీస్‌వారిని ఓడించి బేసిన్, థానా, సాల్‌సెట్టిలను స్వాధీనపరచుకొన్నారు. ఆంగ్లేయులు చౌత్ పన్నును మహారాష్ట్రులకు చెల్లించుటకు అంగీకరించి వాణిజ్యసంధి చేసుకొన్నారు. వీటి ఫలితంగా పశ్చిమతీరమున పీష్వా అధికారం నెలకొల్పబడింది. 1740లో బాజీరావు మరణించాడు. తన 20 సంవత్సరాల పాలనాకాలంలో బాజీరావు మహారాష్ట్ర రాజ్యమును తంజావూరు నుండి ఢిల్లీ వరకు విస్తరింపచేసి తన లక్ష్యమగు హిందూ సామ్రాజ్యమును (హిందూపదపాద్‌షాహి) స్థాపించెను.

## 14.4 బాలాజీ బాజీరావు (1740 - 1761) :

బాజీరావు మరణానంతరం అతని కుమారుడు బాలాజీ బాజీరావు తన 18వ యేట పీష్వా పదవిని స్వీకరించాడు. ఇతడు తండ్రివలె యోధుడు కాదుగాని గొప్ప పాలనాదక్షత ఉన్నవాడు. తన తమ్ముడైన రఘునాధరావు, పినతండ్రి కుమారుడైన సదాశివరావు భావేల సహాయసహకారాలతో ఇతడు గొప్ప విజయాలు సాధించాడు. ఇతని కాలంలో పీష్వా పదవి ఎంతో బలపడింది. అయితే ఇతడు హిందూపాలకుల సహకారంతో సామ్రాజ్య నిర్మాణ యోచనకు స్వస్తిచెప్పడం వలన, మహారాష్ట్రేతరులను సైన్యంలో చేర్చుకోవడం వలన గెరిల్లా యుద్ధపద్ధతులను మానినందువల్ల మహారాష్ట్రులకు నష్టం కలిగింది. బాలాజీ బాజీరావు తన 20 సంవత్సరాల పదవీకాలంలో వ్యక్తిగతంగా తనపట్ల శత్రుత్వం వహించిన రఘూజీ భాన్‌స్లే, తారాబాయ్, దామోజీ గాయక్వార్‌లను అదుపులోకి తెచ్చాడు. అంతేగాక కర్ణాటకలో స్వతంత్ర రాజులతో, నవాబులతో, దక్కన్‌లో ఆసఫ్ జాహిలతో, తూర్పున ఆలీవర్దీఖాన్‌తో, ఉత్తరాన రాజపుత్రులతో, జాట్‌లతో, మొగలులతో, మహమ్మద్‌షా అబ్దాలీతో యుద్ధాలు చేసినాడు. ఆంగ్లేయులతో, ఫ్రెంచివారితో పోరాడినాడు.

### 14.4.1 దిగ్విజయ యాత్రలు :

ఎ) బాలాజీరావు జైపూరు పాలకుని సహాయంతో మాల్వాను స్వాధీనం చేసుకున్నాడు.

బి) రఘూజీ భాన్‌స్లే నాయకత్వాన మహారాష్ట్రులు కర్ణాటక దండయాత్రలు నిర్వహించి ఆర్కాట్ నవాబు దోస్త్‌ఆలీని వధించి అతని అల్లుడైన చాంద్‌సాహెబ్‌ను బంధించి తిరుచునాపల్లి పాలకునిగా మురారిరావును నియమించారు. ఇది సహించని నిజాం

ఉల్‌ముల్క్ మురారిరావును పారద్రోలి అన్వరుద్దీన్‌ను కర్ణాటక నవాబుగా చేసెను. అందువలన పీష్వా తన సేనలను మరొకసారి కర్ణాటకపైకి పంపి శ్రీరంగపట్టణం రాజు, సావనూరు, షీరా, కర్నూల్, కడప నవాబులను ఓడించి కర్ణాటకనంతా స్వాధీనం చేసుకున్నాడు.

సి) అంతేగాక పీష్వా హైదరాబాద్ రాజ్యంపై దండయాత్రలు జరిపించి పశ్చిమ బీరారు, బంగ్లానా, ఖాందేశ్, దౌలతాబాద్, అహమ్మద్‌నగర్, బుర్హాన్‌పూల్, బీజపూర్‌లను ఆక్రమించాడు.

డి) బెంగాల్, బీహార్, ఒరిస్సాలను పాలించు నవాబు ఆలీవర్ధీఖాన్‌ను ఓడించి ఆ ప్రాంతాలలో చౌత్, సర్దేశముఖి పన్నులు వసూలు చేయు హక్కును సంపాదించారు. ఒరిస్సాలో కొంతభాగం ఆక్రమించాడు.

ఇ) రాజపుత్ర స్థానం, బుందేల్‌ఖండులలో మహారాష్ట్రుల ఆధిపత్యం నెలకొల్పబడెను. రోహిత్‌ఖండ్‌లో అధికభాగమాక్రమించాడు.

ఎఫ్) మొగల్ చక్రవర్తితో మహారాష్ట్రులు సంధి చేసుకొని అహమ్మద్‌షా అబ్దాలీ ఆక్రమణలో ఉన్న పంజాబ్ విముక్తి చేయుటకు ప్రయత్నించారు. అబ్దాలీ కుమారుడు తైమూర్‌ను పంజాబ్ నుండి తరిమివేసి దానిని ఆక్రమించారు. అందుకు ఆగ్రహించిన అబ్దాలీ మహారాష్ట్రులను శిక్షించుటకు భారతదేశం వచ్చి పంజాబ్‌లోని మహారాష్ట్రులను తరిమివేసి ఢిల్లీవైపు పురోగమించాడు. దాని ఫలితమే **1761**లో జరిగిన మూడవ పానిపట్టుయుద్ధం. ఈ యుద్ధంలో మహారాష్ట్రుల పరాజయ వార్త విన్న బాలాజీరావు అచిరకాలంలోనే మరణించాడు.

## 14.5 మూడవ పానిపట్టు యుద్ధం (1761) :

### 14.5.1 ఉపోద్ఘాతం :

భారత చరిత్రగతిని మార్చిన ప్రధాన యుద్ధాలలో **1761** జనవరి **14**న జరిగిన మూడవ పానిపట్టు యుద్ధం ఒకటి. ఇది మహారాష్ట్రులకు, అహమ్మద్‌షా అబ్దాలీకి మధ్య జరిగినది. ఇందులో అబ్దాలీ విజయం సాధించాడు.

### 14.5.2 యుద్ధానికి దారితీసిన పరిస్థితులు :

ఎ) ఔరంగజేబు అనుసరించిన మతవిధానం వలన, విదేశీ దండయాత్రల వలన, రాష్ట్రాధిపతుల తిరుగుబాటుల వలన మొగల్‌ల అధికారం క్షీణించెను. అందువలన మొగల్ చక్రవర్తి తన రాజ్యమును కాపాడుకొనుటకు **1752**లో మహారాష్ట్రులతో సంధి చేసుకొని వారి రక్షణకు అంగీకరించాడు.

బి) ఆఫ్ఘనిస్థాన్ ప్రభువు అహమ్మద్‌షా అబ్దాలీ, నాదిర్షా వారసునిగా పంజాబ్‌పై తనకు హక్కుగలదని **1752**లో దాని ఆక్రమించి తన కుమారుడైన తైమూర్‌షాను పంజాబ్ గవర్నర్‌గా నియమించాడు.

సి) మొగల్ చక్రవర్తిని రక్షించుబాధ్యత గల మహారాష్ట్రులు పంజాబ్‌చేరి తైమూర్‌ను తరిమివేసిరి. అందువలన అబ్దాలీ ఆగ్రహించి వారిని తరిమివేయుటకు నిశ్చయించాడు.

డి) సున్నీ మతస్థులైన రోహిల్లాలు తరచూ మహారాష్ట్ర దాడులకు గురియైరి. అందువలన మహారాష్ట్రులను దెబ్బతీయుటకు అబ్దాలీని భారతదేశం జయింపవలసినదిగా ఆహ్వానించిరి.

### 14.5.3 అబ్దాలీ దండయాత్ర :

అహమ్మద్‌షా అబ్దాలీ **1759**లో భారతదేశంపై ఐదవ పర్యాయం దండెత్తివచ్చి మహారాష్ట్రులను ఓడించి తరిమివేసి పంజాబును తిరిగి ఆక్రమించాడు. దత్తాజీ సింధియా ఈ యుద్ధంలో మరణించాడు.

### 14.5.4 మూడవ పానిపట్టు యుద్ధం :

పంజాబ్‌లో మహారాష్ట్రుల పరాజయ వార్తలు విన్న పీష్వా బాలాజీ బాజీరావు పెద్ద సైన్యమును సమకూర్చి సదాశివరావు భావే నాయకత్వంలో అబ్దాలీని శిక్షించుటకు పంపెను. రోహిల్లాలు, అయోధ్య నవాబు అబ్దాలీ పక్షము వహించినారు. ఇరుపక్షాల వారికి

1761 జనవరి 14న పానిపట్టు వద్ద ఘోరయుద్ధం జరిగింది. యుద్ధంలో మొదట మహారాష్ట్రులు ముందంజ వేసినను చివరకు వారు పరాజయమైనారు. ఈ యుద్ధంలో పీష్వా కుమారుడు విశ్వాసరావు, సదాశివరావు భావే, ఇతర మహారాష్ట్ర ప్రముఖులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహారాష్ట్ర సైనికులు మరణించారు. ఈ దుర్వార్త విన్న పీష్వా బాలాజీరావు అనతికాలంలోనే మరణించాడు.

### 14.5.5. ఫలితాలు :

ఎ) ఈ యుద్ధంలో మహారాష్ట్రంలో కుమారుని పోగొట్టుకోని గృహం లేదు.

బి) పానిపట్టు పరాభవంతో మహారాష్ట్రుల పేరుప్రతిష్టలు దిగజారినాయి.

సి) మహారాష్ట్ర కూటమి విచ్ఛిన్నమై అందు సభ్యులైన సింధియా, హోల్కార్, భాన్స్లే, గైక్వాడ్‌లు స్వతంత్రులైరి.

డి) ఈ యుద్ధంలో మొగలుల అధికారం తుడిచిపెట్టుకు పోయింది.

ఇ) పంజాబ్ నందు శిక్కులు విజృంభణకు ఇది దోహదం చేసింది.

ఎఫ్) ఆంగ్లేయుల అధికారం భారతదేశంలో వ్రేళ్ళూనుటకు ఈ యుద్ధం దోహదము చేసినది.

### 14.5.6 మహారాష్ట్రుల పరాజయానికి కారణాలు :

అబ్దాలీ విజయానికి, మహారాష్ట్రుల పరాజయానికి కారణాలు :

ఎ) సదాశివరావు అహంభావపూరిత స్వభావం.

బి) మహారాష్ట్ర నాయకులలో ఐకమత్యం లేకపోవుట

సి) అబ్దాలీ ప్రదర్శించిన నైపుణ్యం

డి) స్వదేశీయులైన రోహిల్లాలు, అయోధ్య నవాబు అబ్దాలీకి సహాయపడుట.

ఇ) మహారాష్ట్రులకు రాజపుత్రుల, జాటుల సహాయం లభించకపోవడం

ఎఫ్) అబ్దాలీ సైనికసంఖ్య కంటే మహారాష్ట్రుల సైనికశక్తి తక్కువగుట

జి) గెరిల్లా యుద్ధపద్ధతులను విస్మరించుట

హెచ్) మొగల్ చక్రవర్తుల బలహీనత

ఐ) అబ్దాలీతో సదాశివరావు సరితూగువాడు కాకపోవడం

జె) ఆహారపదార్థాలు, యుద్ధసామాగ్రి మహారాష్ట్ర సేనకు అందకపోవడం మొదలగు కారణాలు దోహదము చేసినది.

### మాదిరి ప్రశ్నలు :

1. పీష్వాల కాలమున (1713 - 1716) మహారాష్ట్ర సామ్రాజ్యమెట్లు విస్తరించెనో వర్ణింపుము.
2. బాలాజీ విశ్వనాధ్ మహారాష్ట్ర సామ్రాజ్యమునకు రెండవ వ్యవస్థాపకుడు. చర్చించుము.
3. మూడవ పానిపట్టు యుద్ధానికి దారితీసిన పరిస్థితులను, ఫలితాలు వివరింపుము.
4. బాజీరావు
5. బాలాజీ బాజీరావు
6. 1761 ప్రాధాన్యత

### ఉపయుక్త గ్రంథాలు :


1. పాటిబండ్ల ఝాన్సీలక్ష్మి మరియు అల్లాడి వైదేహి - భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం)
2. A.L. Srivastava - Mughal Empire
3. Majumdar, Raychandhuri and Datta - An Advanced History of India
4. K.A.N. Sastri - History of India.


**రచయిత : వి.కె. మోహన్**

పాఠము - 15

# ఐరోపా వారి రాక - ఆంగ్లేయుల అధికార స్థాపన

**విషయసూచిక**


15.0 లక్ష్యం
15.1 ఉపోద్ఘాతం
15.2 పోర్చుగీస్ వారి అధికార విస్తరణ, పతనం
15.3 డచ్చి అధికారవృద్ధి, క్షీణత
15.4 ఆంగ్ల - ఫ్రెంచి సంఘర్షణలు
15.5 భారతదేశంలో ఫ్రెంచివారి పరాజయమునకు కారణాలు
15.6 ఆంగ్లరాజ్య స్థాపన
15.7 సమీక్ష


## 15.0 లక్ష్యం :

భారతదేశంలో పోర్చుగీస్‌వారి అధికార విస్తరణ వారి వైఫల్యము, డచ్చి అధికారాభివృద్ధి క్షీణత, ఆంగ్ల - ఫ్రెంచి సంఘర్షణలు, ఆంగ్లరాజ్య స్థాపన గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 15.1 ఉపోద్ఘాతం :

అత్యంత ప్రాచీన కాలం నుండి ఐరోపాకు భారతదేశానికి భూమార్గం ద్వారా వాణిజ్య సంబంధాలుండేవి. కాని 1453లో తురుష్కులు కాన్‌స్టాంటినోపుల్‌ను స్వాధీనం చేసికొనుటతో భూమార్గమునకు అవరోధం ఏర్పడింది. అందువల్ల ఐరోపావారు భారతదేశంలో వాణిజ్యం కొనసాగించడానికి సముద్రమార్గ అన్వేషణకు బయలుదేరారు. ఈ అన్వేషణలో మొదట పోర్చుగీసువారు విజయం సాధించారు. పోర్చుగీస్ నావికుడైన వాస్కోడిగామా పోర్చుగల్ నుండి బయలుదేరి ఆఫ్రికా ఖండాన్ని చుట్టి భారతదేశ పశ్చిమతీరం చేరి నూతన మార్గం కనుగొన్నాడు. పోర్చుగీసువారి తరువాత డచ్‌వారు, ఫ్రెంచివారు, ఆంగ్లేయులు భారతదేశంనకు వచ్చి వర్తకస్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరు ఆ తదుపరి భారతదేశ రాజకీయాలలో జోక్యం చేసుకొని సామ్రాజ్య స్థాపన కోసం పరస్పరం కలహించుకొన్నారు. ఈ కలహాలలో చివరగా విజయం సాధించి సామ్రాజ్య స్థాపన చేసినవారు ఆంగ్లేయులు.

## 15.2 పోర్చుగీస్ వారి అధికార విస్తరణ , పతనం :

### 15.2.1 ఉపోద్ఘాతం :

నావిగేటర్ అను బిరుదుపొందిన పోర్చుగల్ రాజు హెన్రీ ప్రోత్సాహంతో 1487లో బార్తలోమియా డయజ్ అను పోర్చుగీసు నావికుడు సముద్రమార్గం కనుగొనడానికి భారతదేశం బయలుదేరి ఆఫ్రికా దక్షిణ తీరం చేరాడు. అచట తుఫానులు ఎక్కువగా ఉండుటచే దానికి తుఫానుల అగ్రంఅని పేరుపెట్టి స్వదేశం చేరాడు. ఈ మార్గాన్ని అనుసరించి వాస్కోడిగామా భారతదేశ

పశ్చిమతీరానగల కాలికట్‌ని 1498 మే 17న చేరాడు. కాలికట్ పాలకుడు జమోరిన్ పోర్చుగీసువారికి వ్యాపార సదుపాయాలు కల్పించాడు.

### 15.2.2. తొలిస్థావరాలు :

వాస్కోడిగామా తరువాత 1500 లో పోర్చుగీసు అధికారిగా కాబ్రల్ భారతదేశానికి వచ్చి కాలికట్‌లో వర్తక స్థావరం నెలకొల్పాడు. వాస్కోడిగామా రెండవ పర్యాయం 1502లో మలబార్‌తీరం చేరి కొచ్చిన్, కన్ననూర్‌లలో వర్తక స్థావరాలు నిర్మించాడు.

### 15.2.3 రాజప్రతినిధులు :

ఇతడు భారతదేశానికి వచ్చిన తొలి పోర్చుగీసు రాజప్రతినిధి. ఇతడు పోర్చుగీస్‌వారి వాణిజ్యాన్ని, నౌకాబలాన్ని వృద్ధిచేయుటకు సముద్రాధిపత్య విధానమనుసరించాడు. ఇతడు జామరిన్ నౌకాదళాన్ని ధ్వంసం చేసాడు. ఆ తదుపరి జామరిన్, అరబ్బు, ఈజిప్టు నౌకాదళాలు ఏకమై పోర్చుగీసువారిని ఓడించాయి. అయితే అనతి కాలానికే ఆల్మడా వీరిపై విజయం సాధించి హిందూ మహాసముద్రంపై ఆధిపత్యం సంపాదించాడు. దీనితో అరబ్బుల ప్రాబల్యం అంతరించింది.

**బి) ఆల్బూకర్క్ :** ఆల్మడా తరువాత పోర్చుగీస్ రాజప్రతినిధిగా ఆల్బూకర్క్ వచ్చాడు. ఇతడు రాజ్యకాంక్షాపరుడు. భారతదేశమున పోర్చుగీస్ వలస సామ్రాజ్య నిర్మాత ఇతడే. ఆల్బూకర్క్ విజయనగర రాజు కృష్ణదేవరాయలతో సంధిచేసుకొని 1510లో బీజపూర్ సుల్తానును ఓడించి గోవాను ఆక్రమించాడు. మరుసటి సంవత్సరం మలక్కాను, 1515లో ఆర్ముజ్‌ని స్వాధీనపరచుకొన్నాడు. గోవాకు రక్షణ శ్రేణులు నిర్మించి దానిని పోర్చుగీసు ప్రధాన కేంద్రంగా రూపొందించాడు. స్వదేశీయులలో వివాహాల ద్వారా పోర్చుగీస్ వారి జనాభాను వృద్ధిచేయుటకు ప్రయత్నించాడు. క్రైస్తవ మతాన్ని ప్రచారం చేసాడు.

**సి) తరువాత రాజప్రతినిధులు :** ఆల్బూకర్క్ తరువాత వచ్చిన రాజప్రతినిధులు బేసిన్, డయ్యూ, డామన్, సాల్‌సెట్టి, నాగపట్టణం, హుగ్లీ, చిట్టగాంగ్‌లు ఆక్రమించారు.

డి) ఈ విధంగా 16వ శతాబ్దం మధ్యభాగం నాటికి పోర్చుగీస్ అధికారం ఉన్నత స్థితికి చేరుకొనెను. తూర్పుదేశాలలో తమ గొప్పదనాన్ని చాటడానికి పోప్‌కు పోర్చుగల్ ఎన్నో బహుమతులు పంపింది. తూర్పుతీర ప్రాంతాల కంటే పశ్చిమ తీరంలో గల పోర్చుగీసు స్థావరాలు బాగా వృద్ధిచెందినవి.

### 15.2.4 పోర్చుగీసు వారి వ్యాపారాభివృద్ధికి కారణాలు :

1493లో పోప్ జారీచేసిన ఆజ్ఞాపత్రం వలన తూర్పుదేశాల వ్యాపార గుత్తాధిపత్యం పోర్చుగీసు వారికి లభించుట వలన వాణిజ్యం లాభసాటిగా కొనసాగింది. వాస్కోడిగామా, ఆల్మడా, ఆల్బూకర్క్ మొదలగు సమర్థులు పోర్చుగల్‌కు లభించుట వలన తూర్పుదేశాలలో పోర్చుగీస్‌వారి అధికారం విస్తరించింది. బలిష్టమైన నౌకలు కూడా పోర్చుగీస్‌వారి విజయానికి దోహదంచేశాయి. పోర్చుగల్‌కు తొలుత ఇంగ్లాండ్‌తో వైరం లేకపోవుటచే ఆదేశ విదేశవర్తకం నిరాటంకంగా సాగింది. మలబారు తీరపాలకులు వ్యాపారులకు అన్ని సదుపాయాలు సమకూర్చుట వలన పోర్చుగీసు వ్యాపారం వృద్ధిచెందింది. దక్కనులో విజయనగర రాజులకు బహమనీ సుల్తానులకు మధ్య, మలబారు తీరంలో కాలికట్, కొచ్చిన్ రాజుల మధ్య చెలరేగిన యుద్ధాలు పోర్చుగీసువారి వాణిజ్య అభివృద్ధికి దోహదం చేసినవి. ముస్లిం నౌకల కంటే పోర్చుగీస్‌వారి నౌకలు బలమైనవి అగుటవలన సముద్రాధిపత్యం పొందుట పోర్చుగీసు వారికి వీలైనది.

### 15.2.5 పోర్చుగీసు వారి పతనానికి కారణాలు :

పోర్చుగల్ చిన్నదేశమగుట వలన సువిశాల భారతదేశంలో సామ్రాజ్యమును స్థాపించి పరిపాలించగల సాధన సంపత్తి, జనబలము పోర్చుగల్‌కు లేవు. పోర్చుగీస్ ఉద్యోగులలో ప్రబలిన అవినీతి, లంచగొండితనం పోర్చుగీస్ అధికారాన్ని క్షీణింపజేసాయి. పోర్చుగీస్ రాజప్రతినిధులు తరచూ మారుతూ ఉండుట వలన స్థానిక పరిస్థితుల అవగాహన సరిగా ఉండేది కాదు. అంతేకాక ఉద్యోగుల జీతాలు తక్కువగా నుండుటచే వారు దోపిడీలు కూడా సాగించారు. భారతీయులను క్రైస్తవులుగా మార్చుటకు పోర్చుగీస్‌వారు చేసిన ప్రయత్నం వారియెడల విద్వేషాన్ని కలిగించాయి. 1580లో పోర్చుగల్‌ను స్పెయిన్ ఆక్రమించుటవలన పోర్చుగల్ వలసలు నిరాదరణకు గురిఅయినాయి. విజయనగర సామ్రాజ్య పతనము వలన పోర్చుగీసువారి వాణిజ్యం బాగా తగ్గిపోయింది. ఇంగ్లాండ్ పోటీ ఎదురగుటచే పోర్చుగీసువారి ప్రాబల్యం క్షీణించెను. ఇటువంటి పరిస్థితులలో డచ్చివారు, ఆంగ్లేయులు పోర్చుగీస్ స్థావరాలను ఆక్రమించారు. గోవా, డయ్యూ, డామన్ తప్ప తక్కిన ప్రాంతాలనన్నిటిని పోర్చుగీసువారు కోల్పోయారు.

## 15.3 డచ్చి అధికారవృద్ధి, క్షీణత :

ఎ) హాలండు ప్రజలను డచ్చివారంటారు. డచ్చివారు తూర్పుదేశాలలో వర్తకం చేయుటకు సంయుక్త తూర్పుఇండియా వర్తక సంఘాన్ని స్థాపించారు. ఈ సంఘానికి హాలండు ప్రభుత్వం ఒడంబడికలు, యుద్ధాలు చేసుకొనుటకు, భూసంపాదనకు, దుర్గ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. డచ్చివారు 1619లో జావాలో వర్తక స్థావరమును నెలకొల్పి తమ బలాన్ని వృద్ధిచేసుకొని మలక్కా, సింహళ ప్రాంతాల నుండి పోర్చుగీస్ వారిని తరిమివేసి 17వ శతాబ్దపు మధ్యభాగానికి తూర్పుఇండియా దీవులకు సర్వాధికారులయ్యారు. అంబోయినాలో నివసించు ఆంగ్లేయులను డచ్చి గవర్నర్ హత్యచేయించడంతో ఆంగ్లేయులు తమ దృష్టిని తూర్పుఇండియా దీవుల నుంచి భారతదేశంపై దృష్టిమరల్చినారు. కోరమండలతీరం, గుజరాత్‌లలో లభించు నూలు బట్టలకు మలయా ద్వీపకల్పం, తూర్పుఇండియా దీవులలో మంచి గిరాకీ ఉంది. ఇది గమనించిన డచ్చివారు భారతదేశంలో కూడ వ్యాపారస్థావరాలను నెలకొల్పినారు. గుజరాత్‌లో భరుకచ్చం, కాంబేలు, మలబారు తీరంలో క్విలన్, క్రంగనూరు, కొచ్చిన్‌లు, కోరమండల్ తీరంలో నాగపట్నం, పులికాటు, మచిలీపట్నంలు డచ్చివారి వ్యాపార కేంద్రాలు. భారతదేశంలో మొదట పులికాట్, తరువాత నాగపట్నం డచ్చివారి ప్రధాన కేంద్రాలు.

బి) తూర్పుదేశాలలో డచ్‌వారి ప్రాబల్యం నెలకొనుటకు గల కారణాలు శక్తివంతమైన నౌకాదళం, డచ్చి ప్రభుత్వ మద్దతు, డచ్చి వారి ధైర్యసాహసాలు, జాతీయతా భావం, డచ్చి గవర్నరుల సామర్థ్యం, అంతఃకలహాలతో నిమగ్నమైన ఆంగ్ల తూర్పుఇండియా వర్తక సంఘము నుండి గొప్ప పోటీ లేకపోవటం మొదలగునవి.

సి) డచ్చివారి పతనానికి కారణాలు కంపెనీ ఉద్యోగుల జీతాలు తక్కువగుటచే వారు స్వంత వ్యాపారం చేసుకుంటూ కంపెనీ వ్యాపారాన్ని నిర్లక్ష్యం చేయడం, ఆంగ్లేయుల పోటీకి డచ్చివారు నిలువలేకపోవడం, ఐరోపా యద్ధాలు హాలాండ్‌కు నష్టం కలిగించడం, డచ్చివారి ప్రధాన కేంద్రమైన తూర్పుఇండియా దీవులలో ఆదాయ వనరులు తక్కువగుట వలన డచ్చివారు బలం తగినంతగా వృద్ధిచెందకపోవటం మొదలగునవి.

## 15.4 ఆంగ్ల - ఫ్రెంచి సంఘర్షణలు లేక కర్ణాటక యుద్ధాలు :

### 15.4.1 ఉపోద్ఘాతం :

క్రీ.శ. 1600లో తూర్పుదేశాలలో వ్యాపారం చేయుటకు ఇంగ్లాండురాణి మొదటి ఎలిజిబెత్ అనుమతితో ఆంగ్ల

తూర్పుఇండియా వర్తక సంఘం నెలకొల్పబడింది. ఈ వర్తక సంఘం ఇతర ఐరోపావారితో పోటీపడి భారత రాజకీయ పరిస్థితులను ఆసరాగా తీసుకొని చివరకు తమ సామ్రాజ్యమును స్థాపించారు. ఫ్రాన్స్ చక్రవర్తి 14వ లూయీ ఆర్థికమంత్రి కోల్బర్ట్ ప్రోత్సాహం వలన 1664లో ఫ్రెంచి ఇండియా వర్తక సంఘమేర్పడి భారతదేశమున వాణిజ్యమును ప్రారంభించెను. ప్రభుత్వపరమైన ఈ వర్తకసంఘం తూర్పు ఆఫ్రికా తీరాన గల మడగాస్కర్, మారిషస్ దీవులను ఆక్రమించి దానిని కేంద్రంగా చేసుకొని భారతదేశంపై తమ దృష్టిని కేంద్రీకరించెను.

## 15.4.2 భారతదేశంలో ఆంగ్లస్థావరాలు :

ఇంగ్లాండ్‌రాణి మొదటి ఎలిజిబెత్ అనుమతితో 1600లో నెలకొల్పబడిన తూర్పుఇండియా కంపెనీ జహంగీర్ కాలంలో తమ రాయబారులను మొగల్ దర్బారుకు పంపినది. జహంగీర్ అనుమతితో 1613లో సూరత్‌లో బ్రిటిష్ ఫ్యాక్టరీ నెలకొల్పబడెను. సర్‌థామస్‌రో తన చాకచక్యంతో జహంగీర్‌ను మెప్పించి భరుకచ్ఛము, అహమదాబాద్, ఆగ్రాలలో బ్రిటిష్ వాణిజ్య కేంద్రాలను నెలకొల్పుటకు అనుమతి సంపాదించాడు. ఇంగ్లాండు రాజు రెండవ చార్లెస్ పోర్చుగీస్ రాకుమారిని వివాహమాడి వారినుంచి బొంబాయి పొందాడు. బ్రిటిష్ ప్రభుత్వం దీనిని తూర్పుఇండియా కంపెనీకి అద్దెకు ఇచ్చింది. గోల్కొండ సుల్తాన్ అనుమతితో గోల్కొండ రాజ్యంలోని ప్రధాన రేవుపట్టణం మచిలీపట్నంలో ఆంగ్లేయులు ఫ్యాక్టరీ నిర్మించారు. ఆ తదుపరి ఆర్మగాంలో ఫ్యాక్టరీ నిర్మించారు. చంద్రగిరి రాజు మూడవ వెంకటపతిరాయల కాలంలో స్థానిక పాలకుడైన దామెర్ల వెంకటాద్రినాయుని అనుమతితో సర్‌ఫ్రాన్సిస్‌డే అను బ్రిటిష్ ఉద్యోగి జార్జి కోటను నిర్మించాడు (1641). ఇది కోరమండల్ తీరంలోని బ్రిటిష్ వ్యాపార స్థావరములకు ప్రధాన కేంద్రమయ్యెను. కడలూర్‌వద్ద బ్రిటీష్‌వారు సెయింట్ డేవిడ్ కోటను 1690లో నిర్మించారు. ఒరిస్సాలోని హరిహరపూర్, బాలసోర్‌లలో బ్రిటిష్ ఫ్యాక్టరీలు నెలకొల్పబడినవి. మొగల్ చక్రవర్తి షాజహాను నుండి హుగ్లి, పాట్నా, కాశింబజారు, రాజమహల్‌ల వద్ద ఫ్యాక్టరీలు నిర్మించుటకు కంపెనీ అనుమతి సంపాదించింది. ఆ తదుపరి మొగలుల అనుమతితో సుతనుతి, కలికట, గోవిందపూర్ గ్రామాలను కొని ఫ్యాక్టరీ నిర్మించారు. అదియే కలకత్తా. ఇక్కడ 1700లో విలియంకోట నిర్మించబడింది. ఈ విధంగా భారతదేశంలోని బ్రిటిష్ వ్యాపారకేంద్రాలకు బొంబాయి, మద్రాస్, కలకత్తా ప్రధాన కేంద్రాలయ్యాయి. వీటికి బ్రిటిష్ గవర్నర్లు నియమింపబడినారు.

## 15.4.3 భారతదేశంలోని ఫ్రెంచి స్థావరాలు :

1668లో సూరత్‌నందు ఫ్రెంచి వ్యాపార స్థావరాన్ని ఫ్రెంచి డైరెక్టరు జనరల్ కారన్ ఏర్పాటుచేసాడు. తరువాత గోల్కొండ అనుమతితో మచిలీపట్నంలో ఫ్యాక్టరీ నిర్మించాడు. 1674లో నెలకొల్పబడిన పాండిచ్చేరి వ్యాపార కేంద్రం ఆ తదుపరి ఫ్రెంచివారికి ప్రధాన కేంద్రమయినది. 1676లో చంద్రనగర్‌వద్ద ఫ్యాక్టరీ నిర్మించారు. భారతదేశంలో ఫ్రెంచివారి గొప్పతనానికి పునాదివేసిన మార్టిన్ పాండిచ్చేరిని సురక్షితమయిన వ్యాపారకేంద్రంగా రూపొందించాడు. మలబారు తీరంలోని మాహి, కాకినాడ సమీపంలోని యానాం వద్ద లెనాయిర్ క్రొత్త వ్యాపారకేంద్రాలను నెలకొల్పుటయేగాక పాండిచ్చేరిని అభివృద్ధిచేసాడు. ఫ్రెంచ్ గవర్నర్‌లలో ప్రముఖుడైన డ్యూమాస్ మొగలాయిల నుండి నాణేలు ముద్రించుహక్కు సంపాదించాడు. భారతీయులను యూరోపియన్ సైన్యంలో చేర్చుకొనే సాంప్రదాయమును ఇతడు ప్రారంభించాడు. ఇతని వారసుడిగా వచ్చిన డూప్లే కాలంలో మూడు కర్ణాటక యుద్ధాలు జరిగి వాటిలో ఫ్రెంచివారు ఆదిలో విజయులైనను చివరకు పరాజితులైరి.

## 15.4.4. కర్ణాటక యుద్ధాలు లేదా ఆంగ్లఫ్రెంచి సంఘర్షణ :

### ఎ) ఉపోద్ఘాతం :

దూరదక్షిణ ప్రాంతానికి కర్ణటకమని పేరు. ఈ ప్రాంతంలో అధికారం కోసం జరిగిన యుద్ధాలు కావడం వలన ఈ

యుద్ధాలకు కర్ణాటక యుద్ధాలని పేరు. మొగల్ సామ్రాజ్య శిధిలాలపై స్థాపితమైన స్వతంత్ర రాజ్యాలలో ఒకటి దక్కన్. ఇచట 1724లో నిజాంఉల్‌ముల్క్ స్వతంత్రుడై అసఫ్‌జాహి వంశాన్ని స్థాపించాడు. ఇందులో అనేక సర్కార్‌లు గలవు. ఈ సర్కారులకు పాలకులు నవాబులు. ఈ నవాబులలో కర్ణాటక్ నవాబు బలవంతుడు. ఇతని రాజధాని ఆర్కాట్. దీని పాలకుడు దోస్త్‌ఆలీ. మహారాష్ట్రులు కర్ణాటకంపై దండెత్తివచ్చి దోస్త్‌ఆలీని వధించి అతని అల్లుడు చందాసాహెబును బందీగా తీసుకొనిపోయారు. అందువల్ల నిజాంఉల్‌ముల్క్ కర్ణాటకపై దండెత్తివచ్చి మహారాష్ట్రులను పారద్రోలి తన ప్రతినిధిగా అన్వరుద్దీన్‌ని నియమించాడు. నాటికే ఆంగ్లేయులు, ఫ్రెంచివారు కర్ణాటక యందు స్థావరాలను నెలకొల్పి సామ్రాజ్య స్థాపనకు ప్రయత్నిస్తున్నారు. వీరు ఐరోపాలో బద్ధవిరోధులు. వీరి మధ్య ఐరోపాలో యుద్ధాలు ప్రారంభంకాగానే, ఆ యుద్ధాలు వలసలకు విస్తరించుట పరిపాటి అయింది. ఇట్లు ఉభయుల మధ్య జరిగిన యుద్ధాలలో కర్ణాటక యందు జరిగిన మూడు యుద్ధాలు ముఖ్యమైనవి.

### బి) మొదటి కర్ణాటక యుద్ధం (1746 - 48) :

కర్ణాటకలో ఆంగ్లేయులకు మద్రాసు, ఫ్రెంచివారికి పాండిచ్చేరి ప్రధాన స్థావరాలు. కర్ణాటకలో ఉభయులూ తన ఆధిపత్యం సంపాదించటానికి సమయం కోసం వేచియున్నారు. ఇటువంటి పరిస్థితులలో ఐరోపాలో ఆస్ట్రియా వారసత్వ యద్ధం ప్రారంభమయింది. ఈ యుద్ధంలో ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు చెరొకపక్షం వహించాయి. ఈ వార్త తెలియగానే ఫ్రెంచి గవర్నర్ డూప్లే ఆంగ్లేయులకు ఒక ప్రతిపాదన చేయుచూ శాంతియుతంగా ఉందామని సూచించాడు. కాని ఆంగ్లేయులు ఈ ప్రతిపాదనను ఆమోదించలేదు. మద్రాస్ గవర్నర్ నికోలస్ మోర్స్ పాండిచ్చేరిపై దాడి ప్రారంభించాడు. కర్ణాటక నవాబు అన్వరుద్దీన్‌తో శాంతిని పరిరక్షింపవలసినదిగా డూప్లే కోరాడు. అన్వరుద్దీన్ సలహామేరకు ఆంగ్లేయుల యుద్ధాన్ని ఆపుచేసిరి. ఈలోపున డూప్లే తన బలాన్ని వృద్ధిచేసుకొని మద్రాసును ముట్టడించి ఆక్రమించాడు. కాని ఫ్రెంచి నౌకాదళాధిపతి లాబోర్టునాయ్ లంచం పుచ్చుకొని మద్రాసును ఆంగ్లేయులపరం చేశాడు. డూప్లే రెండోమారు మద్రాసును ఆక్రమించాడు. అంతట ఆంగ్లేయులు తమకు అప్పగించవలసినదిగా అన్వరుద్దీన్‌కు విన్నవించుకొన్నారు. ఆంగ్లేయుల కోరికను మన్నించి అన్వరుద్దీన్ యుద్ధానికి దిగాడు. దాని ఫలితమే శాంథోమ్ లేక అడయారు (1746) యుద్ధం. ఈ యుద్ధంలో అన్వరుద్దీన్ పూర్తిగా పరాజితుడైనాడు. ఆ తదుపరి డూప్లే సెయింట్ డేవిడ్ కోటను ముట్టడించడానికి ఆంగ్లేయులు పాండిచ్చేరిని ఆక్రమించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇంతలో 1748లో జరిగిన ఏలా షాపెల్ సంధితో ఆస్ట్రియా వారసత్వ యుద్ధం ముగిసింది. దీనితో భారతదేశంలో కూడ యుద్ధం ఆగిపోయింది. సంధి ప్రకారం ఫ్రెంచివారు మద్రాసును తిరిగి ఆంగ్లేయుల కిచ్చివేసిరి. ఈ యుద్ధం వలన ఫ్రెంచివారి ప్రతిష్ట పెరిగినది. ఈ యుద్ధంలో ఐరోపావారి సైనికాధిక్యత, భారతీయుల సైనిక బలహీనత విదితమయ్యెను. ఆంగ్లేయులు ఫ్రెంచివారి మధ్య వైరభావం ఎక్కువయింది.

### సి) రెండవ కర్ణాటక యుద్ధం (1749 - 54) :

1748లో జరిగిన ఏలాషాపెల్ సంధి కర్ణాటకంలో ఆంగ్లేయులు, ఫ్రెంచివారి మధ్య సుస్థిర శాంతిని నెలకొల్పలేదు. డూప్లే రాజ్యకాంక్ష, కర్ణాటక, హైదరాబాద్‌లలో బయలుదేరిన వారసత్వ యుద్ధాలు రెండవ కర్ణాటక యుద్ధానికి దారితీసినది. నిజాంఉల్‌ముల్క్ మరణానంతరం అతని కుమారుడు నాసర్‌జంగ్, నాసర్‌జంగ్ అన్నకుమారుడు ముజఫర్‌జంగ్‌ల మధ్య సింహాసనం కొరకు వారసత్వయుద్ధం మొదలయ్యింది. అలాగే కర్ణాటకలో చాంద్ సాహెబ్, అన్వరుద్దీన్‌ల మధ్య సింహాసనం కొరకు ఘర్షణ మొదలయింది. డూప్లే మిత్రుడు చాంద్‌సాహెబ్. చాంద్‌సాహెబ్, ముజఫర్‌జంగులు మిత్రులు. ఈ వారసత్వ యుద్ధాలలో జోక్యం చేసుకొని ఫ్రెంచి ప్రాబల్యాన్ని స్థాపించడానికి డూప్లే చాంద్‌సాహెబ్, ముజఫర్‌జంగులతో కలసి అన్వరుద్దీన్‌పై యుద్ధం ప్రకటించి ఆర్కాట్ వైపు పురోగమించెను. 1749లో అంబూర్ వద్ద జరిగిన యుద్ధంలో అన్వరుద్దీన్ మరణించాడు. అతని

కుమారుడు మహమ్మద్ ఆలీ తిరుచునాపల్లికి పారిపోయాడు. చాంద్‌సాహెబ్ కర్ణాటక నవాబుగా, ముజఫర్‌జంగ్ హైదరాబాద్ నిజాంగా ప్రకటించబడినారు. వీరు తమకుచేసిన సహాయానికి ప్రతిఫలంగా ఫ్రెంచివారికి విలయనూరు, బహూర్, దివి, మచిలీపట్టణములను దత్తం చేసారు. ఫ్రెంచి ప్రాబల్యాన్ని అరికట్టుటకు ఆంగ్లేయులు నాసర్‌జంగ్‌కు, మహమ్మదాలీకి మద్దతు తెలిపారు. నాసర్‌జంగ్ ఆంగ్లేయుల సహాయంతో ముజఫర్‌జంగ్‌ను ఓడించినారు. కాని అనతికాలానికే కడప, కర్నూలు నవాబులు నాసర్‌జంగ్‌ను, ముజఫర్‌జంగ్‌ను హత్యచేసారు. దీనితో ఫ్రెంచివారు నిజాంఉల్‌ముల్క్ కుమారుడు సలాబత్ జంగ్‌ను హైదరాబాదు నిజాంగా ప్రకటించారు. దీనికి ప్రతిగా ఫ్రెంచివారికి ఉత్తర సర్కారులు లభించాయి. ఈ విధంగా ఫ్రెంచివారికి మిత్రులైన చాంద్‌సాహెబ్ కర్ణాటక నవాబుగా, సలబత్‌జంగ్ దక్కన్ సుబేదారుగా నియమితులు గావడంతో ఫ్రెంచిప్రాబల్యం అధికమయ్యెను. ఈ క్లిష్ట పరిస్థితులలో ఆంగ్లేయులు రాబర్ట్ క్లైవ్ నాయకత్వాన ఆర్కాటును ముట్టడించి స్వాధీనపరచుకొని చాందాసాహెబ్‌ని వధించి మహమ్మదాలీని కర్ణాటక నవాబుగా ప్రకటించారు. ఫ్రెంచివారు కర్ణాటకంలో విఫమగుట వలన డూప్లే అప్రతిష్టపాలై స్వదేశం వెళ్లవలసి వచ్చింది. డూప్లే వారసునిగా గాడ్‌హూ వచ్చాడు. ఇతడు ఆంగ్లేయులతో పాండిచ్చేరివద్ద **1754**లో సంధి చేసుకొన్నాడు. దీని ప్రకారం ఒకరి విషయాలలో మరొకరు జోక్యం కలుగజేసుకొనకుండుటకు, ఆక్రమించిన ప్రదేశాలు వదులుటకు, ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ యుద్ధం వలన బ్రిటిష్ తూర్పుఇండియా కంపెనీ ప్రతిష్ట పెరిగింది. క్లైవ్ శక్తి, సామర్ధ్యాలు వెలుగులోనికి వచ్చాయి. డూప్లే కీర్తి ప్రతిష్టలు క్షీణించాయి. ఫ్రెంచి వారి ప్రాబల్యం కర్ణాటకలో అంతరించింది.

### డి) మూడవ కర్ణాటక యుద్ధం (1756 - 63) :

ఐరోపాలో సప్తవర్ష సంగ్రామం ప్రారంభమైనపుడు ఆంగ్లేయులు, ఫ్రెంచివారు చెరొక పక్షమున యుద్ధంలో ప్రవేశించుటతో భారతదేశంలో కూడా ఆంగ్ల, ఫ్రెంచి కంపెనీలు యుద్ధ మారంభించాయి. ఫ్రెంచివారు కర్ణాటకలో తాము కోల్పోయిన పరువు ప్రతిష్టలను తిరిగి సంపాదించుకొనుటకు యుద్ధం ఆరంభించారు. ఫ్రెంచి గవర్నరు కాంట్ డి లాలి సెయింట్ డేవిడ్ కోటపై దాడిచేసి దానినాక్రమించాడు. ఈ తదుపరి లాలి మద్రాస్, తంజావూరులను ఆక్రమించుటకు ప్రయత్నించి విఫలుడయ్యెను. ఈ లోపల ఫ్రెంచి నౌకాదళాధిపతి ఆషీ ఆంగ్లేయులను ఓడించుటకు ప్రయత్నించి విఫలుడయినాడు. అందువలన లాలీ మద్రాస్‌ను ఆక్రమించుటకు హైదరాబాద్‌లో ఉన్న బుస్సీని పిలిపించాడు. బుస్సీ మరలినంతనే ఫ్రెంచి ప్రాబల్యమును ఆంగ్లేయులు అంతంచేసిరి. ఫ్రెంచివారు మద్రాసును ఆక్రమించలేకపోయారు. విజయనగర జమీందారు ఆనందగజపతి ఆహ్వానం మేరకు ఆంగ్లేయులు ఉత్తర సర్కారులో ప్రవేశించి ఫ్రెంచివారిని ఓడించి మచిలీపట్నం ఆక్రమించారు. ఈ విజయం తరువాత హైదరాబాద్ నిజాం సలాబత్‌జంగ్ ఉత్తర సర్కారులు ఆంగ్లేయులకిచ్చి సంధి చేసుకున్నాడు. ఆంగ్ల సేనాని సర్‌ఐర్‌కూట్ ఫ్రెంచిసేనను వందవాసి యుద్ధంలో **(1760)** ఓడించి బుస్సీని బంధించాడు. ఆ తదుపరి ఆంగ్లేయులు జింజి, పాండిచ్చేరిలను ఆక్రమించారు. లాలీ ఆంగ్లేయులకు లొంగిపోయాడు. ఐరోపాలో సప్తవర్ష సంగ్రామం పారిస్ సంధి **(1763)**లో ముగిసింది. దీనితోపాటు మూడవ కర్ణాటక యుద్ధం అంతమయింది. ఈ సంధి ఫలితంగా పాండిచ్చేరి ఫ్రెంచివారికి తిరిగి ఇవ్వబడింది. ఈ యుద్ధ ఫలితంగా భారతదేశంలో ఫ్రెంచివారి ప్రాబల్యం పూర్తిగా నశించింది. అందువలన ఆంగ్ల రాజ్యవిస్తరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

## 15.5 భారతదేశంలో ఫ్రెంచివారి పరాజయానికి కారణాలు :

భారతదేశానికి ఆంగ్లేయులు, ఫ్రెంచివారు వర్తకులుగా వచ్చి రాజ్యస్థాపన కొరకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో చివరకు ఆంగ్లేయులు విజయం సాధించారు. ఫ్రెంచివారు పరాజయం పొందారు. దానికి పెక్కు కారణాలు గలవు.

ఎ) ఫ్రెంచి కంపెనీ ప్రభుత్వసంస్థ. నెలసరి జీతాలు తీసుకునే వర్తకులు వ్యాపారంలో శ్రద్ధ వహించలేదు. కంపెనీకి నష్టాలేగాని లాభాలంటూ వచ్చేవికావు. ఆర్థిక దుస్థితి ఫ్రెంచివారి ఓటమికి దారితీసింది. ఇంగ్లీష్ ఈస్టిండియా కంపెనీ ప్రైవేట్ వర్తకులతో స్థాపితమైంది. వారు శ్రద్ధతో వ్యాపారం సాగించి లాభాలు గడించారు. వారి లాభాలు వారి విజయానికి తోడ్పడినవి.

బి) ఆంగ్ల కంపెనీ ఓడరేవులైన మద్రాస్, కలకత్తా, బొంబాయి మొదలగునవి వ్యాపారానికి చాలా ఉపయోగపడినాయి. ఫ్రెంచివారి ఓడ రేవులలో ఒక్క పాండిచ్చేరి తప్ప మిగిలినవి నిరుపయోగమైనవి. అందువల్ల ఇంగ్లీష్ కంపెనీ అంత వ్యాపారాన్ని ఫ్రెంచి కంపెనీ సాగించలేకపోయింది.

సి) రాబర్ట్ క్లైవ్, లారెన్స్, వాట్సన్, సర్ఐర్కూట్ వంటి సమర్ధులైన నాయకులు ఇంగ్లీష్ కంపెనీ కుండేవారు. వీరిమధ్య ఐక్యత ఎక్కువ. ఫ్రెంచి కంపెనీకి డూప్లే, కాంట్ డీ లాలీ, బుస్సీవంటి నాయకులున్నా వారిమధ్య ఐక్యత లేక వారివిధిని చక్కగా నిర్వహించలేకపోయారు.

డి) ఇంగ్లండ్కు నౌకాదళం చాలా పెద్దది. ఫ్రాన్స్కు అంత నౌకాబలం లేదు. ఆంగ్లేయుల సముద్రాధిపత్యం వారి విజయానికి దోహదం చేసింది.

ఇ) ఫ్రెంచి కంపెనీ దాని ప్రధాన లక్ష్యమైన వ్యాపారమును నిర్లక్ష్యంచేసి రాజ్యసంపాదన ప్రధానధ్యేయంగా వ్యవహరించింది. అందువలన ఫ్రెంచికంపెనీ ఆర్థిక పటిష్టతను కోల్పోయి ధనసహాయానికి మాతృదేశంపై ఆధారపడెను. ఐరోపా యుద్ధాలలో మునిగియున్న ఫ్రాన్స్ ధనసహాయం సకాలంలో అందచేసే స్థితిలో లేకుండెను. ఆంగ్లేయులు రాజకీయాలలో తలదూర్చినను వాణిజ్యం అశ్రద్ధ చేయలేదు. అందువలన ఆంగ్ల కంపెనీ సుసంపన్నంగా ఉంది. ఆర్థిక సౌష్టవం ఆంగ్ల కంపెనీ విజయానికి దోహదం చేసింది.

ఎఫ్) డూప్లేను పదవినుండి తొలగించి మాతృదేశం పిలిపించుట ఫ్రెంచి ప్రభుత్వం చేసిన పెద్దపొరపాటు. అతనికి భారతదేశ పరిస్థితులను గూర్చి చక్కటి అవగాహన ఉంది. డూప్లే వారసులు అతని విధానం విడనాడుట, లాలీ అనుభవశూన్యత, ఆవేశం, అహంకారం ఫ్రెంచివారి పరాజయానికి కారణమయింది.

## 15.6 ఆంగ్లరాజ్య స్థాపన (రాబర్ట్క్లైవ్) :

### 15.6.1 ఉపోద్ఘాతం :

భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్య స్థాపన చేసిన క్లైవ్ తన జీవితాన్ని సెయింట్ జార్జి కోటలో గుమస్తాగా ప్రారంభించెను. రెండవ కర్ణాటక యుద్ధంలో ఆర్కాట్ను ముట్టడించి స్వాధీనపరచుకొన్నాడు. ఆ తదుపరి తిరుచునాపల్లిని స్వాధీనం చేసుకొని చాందాసాహెబ్ను వధించి మహమ్మద్ ఆలీని ఆర్కాట్ నవాబుగా చేసాడు. దీనితో క్లైవ్ కీర్తిప్రతిష్టలు ఇనుమడించాయి. ఈ విజయాలకు ప్రతిఫలంగా కంపెనీవారు క్లైవ్ను మద్రాస్ కౌన్సిల్ సభ్యునిగా చేసారు. తరువాత క్లైవ్ ప్లాసీ యుద్ధంలో విజయం సాధించి బెంగాల్ గవర్నర్ అయ్యాడు. బక్సార్ యుద్ధానంతరం క్లైవ్ అలహాబాద్ సంధి చేసుకొని బెంగాల్, బీహార్, ఒరిస్సా లందు ఆంగ్ల అధికారమును పటిష్టపరిచెను.

### 15.6.2 సిరాజుద్దౌలా :

1756లో బెంగాల్ నవాబైన సిరాజుద్దౌలా తన రాజ్యములో కోటలు నిర్మించరాదని ఆంగ్లేయులను, ఫ్రెంచి వారిని ఆజ్ఞాపించాడు. ఈ ఆజ్ఞను ఫ్రెంచివారు మన్నించగా ఆంగ్లేయులు ఖాతరు చేయలేదు. దానితో ఆగ్రహించిన సిరాజుద్దౌలా

ఆంగ్లేయులపై దాడిచేసి కాసింబజారు, కలకత్తా, విలియం కోటలను వశపరచుకొన్నాడు. కలకత్తా పతనమైన రాత్రి బందీలుగా పట్టుబడిన 146 మంది ఆంగ్లేయులను చిన్న గదిలో (18' x 14' x 10') బంధింపగా మరునాటికి 23 మంది మాత్రమే బ్రతికి బయటపడినారు. దీనినే కలకత్తా చీకటిగది విషాద వృత్తాంతమంటారు. ఈ విషయంలో చరిత్రకారులలో ఏకాభిప్రాయంలేదు. ఈ వార్త మద్రాసు చేరగానే మద్రాసు కౌన్సిల్ క్లైవ్, వాట్సన్‌లను బెంగాల్ పంపినారు. కలకత్తాను క్లైవ్ ఆక్రమించాడు. ఆ తదుపరి ఇరుపక్షాల మధ్య సంధి జరిగింది. దీని ప్రకారం కంపెనీ హక్కులు పునరుద్ధరించబడినాయి. కలకత్తా చుట్టూ రక్షణ శ్రేణులు నిర్మించుకొనుటకు ఆంగ్లేయులకు అనుమతి లభించింది.

## 15.6.3 ప్లాసీ యుద్ధం (1757) :

సిరాజ్‌ఉద్దీన్ ఫ్రెంచివారిపట్ల సుముఖుడని అందువల్ల ఫ్రెంచివారిని బెంగాల్‌నుంచి తరిమివేయవలెనని క్లైవ్ నిశ్చయించి వారి ప్రధానకేంద్రమయిన చందర్‌నగర్‌ను ముట్టడించి ఆక్రమించాడు. చందర్‌నగర్ పతనానంతరం పారిపోయివచ్చిన ఫ్రెంచివారి కందరికి సిరాజ్ ఆశ్రమమిచ్చినాడు. ఫ్రెంచి సైన్యం కర్ణాటక నుండి రావటానికి అవకాశం ఉండటం వల్ల అట్లా వచ్చినట్లయితే తనకు ముప్పు వాటిల్లుతుందనే భయంవల్ల సిరాజ్‌ని పదవీచ్యుతిని చేయడానికి క్లైవ్ ఒక ఉపాయం పన్నినాడు. అమీన్‌చంద్ అనే వ్యాపారి ద్వారా సిరాజ్ శత్రువులయిన మీర్‌జాఫర్, జగత్‌సేత్, రాయదుర్గభ్‌లతో సంప్రదింపులు జరిపాడు. నవాబును ఏకాకిని చేయడానికి అతని మంత్రులను ప్రోత్సహించి ఫ్రెంచివారినందరిని తరిమివేయునట్లు చేసాడు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం జరిపినందుకు ప్రతిఫలంగా అమీర్‌చంద్‌కు 30 లక్షల రూపాయలు ఇచ్చుటకు నిర్ణయింపబడినది. ఈ ఒప్పందమును క్లైవ్ రెండు పత్రాలపై తయారుచేయించాడు. అందులో ఒకటి నకిలీది. మీర్జాఫర్ తనను బెంగాల్ నవాబును చేసిన 175 లక్షల రూపాయలు ఆంగ్లేయులకు చెల్లించెదనని తెలిపాడు. క్లైవు యుద్ధ సన్నాహాలు పూర్తిచేసుకొని సైన్యంతో సిరాజ్ పైకి బయలుదేరినాడు. దాని ఫలితమే 1757 జూన్ 23న జరిగిన ప్లాసీయుద్ధం. ఈ యుద్ధంలో మీర్జాఫర్ ద్రోహం వలన ఆంగ్లేయులు విజయం సాధించారు. సిరాజ్ ప్రాణాలు కోల్పోయాడు. మీర్జాఫర్ బెంగాల్ నవాబైనాడు. ఈ యద్ధంలో భారతదేశంలో ఆంగ్లరాజ్య స్థాపన జరిగింది. 24 పరగణాలు ఆంగ్లేయులపరం చేయబడింది. బెంగాల్ నవాబైన మీర్జాఫర్ పెద్దమొత్తంలో ఆంగ్ల ఉద్యోగులకు ధనం ముట్టజెప్పినాడు. ప్లాసీ యుద్ధం తరువాత బెంగాల్ కౌన్సిల్ క్లైవును గవర్నరుగా ఎన్నుకొన్నది. ఇతడు మీర్జాఫర్‌ను అదుపులో ఉంచడానికి క్లైవు ఎన్నో వ్యతిరేక చర్యలను తీసుకున్నాడు. ఇంతలో మొగలాయిలు బీహార్‌పై దండెత్తిరాగా క్లైవు వారిని పారద్రోలినాడు. ఆ తదుపరి డచ్చివారిని పారద్రోలి ఛిన్సూరాను స్వాధీనపరచుకొన్నాడు. 1760లో క్లైవు ఇంగ్లాండ్ వెళ్ళినాడు.

## 15.6.4 మీర్జాఫర్ :

ప్లాసీ యుద్ధానంతరం బెంగాల్ నవాబయిన మీర్జాఫర్ ఆర్ధిక ఇబ్బందులకులోనై కంపెనీకి చెల్లించవలసిన ధనం చెల్లించలేకపోయాడు. ఇటువంటి పరిస్థితులలో కంపెనీ ఉద్యోగులు ధనాశతో మీర్జాఫర్‌ను తొలగించి అతని అల్లుడయిన మీర్‌ఖాసింను బెంగాల్ నవాబుగా చేసిరి. మీర్‌ఖాసిం కంపెనీకి బర్ద్వాన్, మిద్నపూర్, చిట్టగాంగ్‌లను, ఉద్యోగులకు విలువైన బహుమతులను సమర్పించుకొనెను.

## 16.6.5 మీర్ ఖాసిం :

మీర్‌ఖాసిం అధికారంలోకి రాగానే పాలనా సంస్కరణలకు పూనుకోవడం ఆంగ్లేయులకు నచ్చలేదు. మీర్‌ఖాసిం కంపెనీ ఉద్యోగులనుభవించు వ్యాపార రాయితీలను తొలగించుటకు ప్రయత్నించుటతో ఆ ప్రయత్నాన్ని ఉపసంహరించుకొమ్మని

విజ్ఞప్తి చేశారు. అయితే ఖాతరు చేయలేదు. అందువలన కంపెనీవారు మీర్‌ఖాసింను తొలగించి మరల మీర్జాఫర్‌ను బెంగాల్ నవాబుగా చేశారు.

### 15.6.6 బక్సారు యుద్ధం (1764) :

పదవీచ్యుతుడైన మీర్‌ఖాసిం అయోధ్య నవాబైన షుజాఉద్దౌలాతో, మొగల్ చక్రవర్తి రెండవషా ఆలంతో ఒక మిత్రకూటమిని ఏర్పాటుచేసి, ఆంగ్లేయులపై యుద్ధం ప్రకటించాడు. ఇరుపక్షాలకు మధ్య బక్సారు వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఆంగ్లేయులు విజయం సాధించారు. మొగల్ చక్రవర్తి, అయోధ్య నవాబు, మీర్‌ఖాసింలు పరాజయం చెందారు. ఇది ఆంగ్లేయులకు ఘనవిజయం. ఈ యుద్ధంలో పరాజయం చెందిన మొగల్ చక్రవర్తి ఆంగ్లేయుల రక్షణనంగీకరించాడు. అయోధ్య నవాబు బలం తగ్గింది. మీర్‌ఖాసిం వాయువ్య ప్రాంతాలకు పారిపోయి అచట మరణించాడు.

### 15.6.7 క్లైవు పునరాగమనం :

1765లో రెండోసారి క్లైవ్ బెంగాల్ గవర్నర్‌గా వచ్చాడు. కంపెనీ ఉద్యోగుల అవినీతిని, దుష్పరిపాలనను అంతం చేయడానికి క్లైవ్ ప్రయత్నించాడు. ఆంగ్లేయుల స్వంత వ్యాపారాన్ని నిషేదించాడు. వారు స్వదేశీయుల నుండి బహుమతులను స్వీకరించరాదని శాసించాడు. కంపెనీ సైనికుల భత్యమును తగ్గించాడు. బక్సార్ యుద్ధంలో విజయం సాధించిన ఆంగ్లేయులు రాజ్యవిస్తరణకు ప్రయత్నించగా క్లైవ్ అందుకు సమ్మతించక మొగల్ చక్రవర్తి షా ఆలంతో, అయోధ్య వజీర్ షుజాతో అలహాబాద్ వద్ద 1765లో సంధులు చేసుకొనెను. ఈ సంధుల ప్రకారం అయోధ్య రాజ్యాన్ని షుజాకు ఇచ్చి నష్టపరిహారంగా 50 లక్షలు, కారా, అలహాబాద్‌లను పొందెను. అవసరమైనపుడు అయోధ్య నవాబును ఖర్చు భరించు షరతుపై సైనిక సహాయం చేయుటకు కంపెనీవారు సమ్మతించారు. మొగల్ చక్రవర్తి కంపెనీకి బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో దివానీ అధికారం ఇచ్చి, ఉత్తర సర్కార్, కర్ణాటకలలో వారి ఆధిపత్యమును గుర్తించారు. దీనికి ప్రతిగా మొగల్ చక్రవర్తికి కంపెనీకి కారా, అలహాబాద్‌లను ఇచ్చి, సాలినా 26 లక్షలు చెల్లించుటకు అంగీకరించెను.

### 15.6.8 ద్వంద్వ పాలన :

అలహాబాద్ సంధితో కంపెనీకి దివానీ అధికారం (పన్నులు వసూలుచేయు అధికారం) దక్కటం వలన బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పడింది. సైన్యమును పోషించి, శాంతిభద్రతలను బెంగాల్ నవాబు కాపాడవలెను. వాస్తవానికి పూర్తి రాజకీయ బాధ్యత కంపెనీ తీసుకొని స్వదేశీయులను నామమాత్రపు అధికారులుగా ఉంచినారు.

### 15.6.9 అంతిమదశ :

క్లైవు తిరిగి 1767లో ఇంగ్లండ్ వెళ్ళినాడు. కంపెనీ రహస్య సంఘం వారి నివేదిక ప్రకారం క్లైవు దోషిగా నిరూపణ అయినా క్లైవు ఆంగ్లేయులకు చేకూర్చిన విజయాలకు కృతజ్ఞతగా పార్లమెంట్ అతనిని నిర్దోషిగా తీర్మానించింది. 1774లో క్లైవు మరణించాడు. భారతదేశంలో ఆంగ్లసామ్రాజ్య స్థాపన చేసిన ఘనత క్లైవుకు దక్కింది. ఇంగ్లాండ్ ప్రధానమంత్రి క్లైవును గురించి మాట్లాడుతూ 'దివి నుండి భువికి దిగివచ్చిన సేనాని' అని శ్లాఘించాడు.

### 15.7 సమీక్ష :

1498లో వాస్కోడిగామా భారతదేశానికి సముద్రమార్గాన్ని కనుగొన్న తరువాత పోర్చుగీసువారు, డచ్చివారు, ఆంగ్లేయులు, ఫ్రెంచివారు భారతదేశానికి వచ్చి వర్తకస్థావరాలను ఏర్పరచుకొన్నారు. కాలక్రమమున వీరు భారతదేశ రాజకీయాలలో జోక్యం

చేసుకొని సామ్రాజ్యమును స్థాపించుటకు ప్రయత్నించి పరస్పరం కలహించుకొనిరి. ఈ కలహాలతో డచ్‌వారు పోర్చుగీసువారిని ఓడించగా, ఆంగ్లేయులు ఫ్రెంచివారిని ఓడించి భారతదేశమున ఆంగ్ల సామ్రాజ్యమును స్థాపించిరి.

## 15.8 మాదిరి ప్రశ్నలు :

1. కర్ణాటక యుద్ధాలను గురించి వివరింపుము.
2. భారతదేశములో రాబర్ట్‌క్లైవ్ ఏ విధముగా ఆంగ్లసామ్రాజ్య స్థాపన చేసెను.
3. భారతదేశంలో పోర్చుగీసువారి అధికారవృద్ధి, క్షీణతను గురించి వ్రాయుము.
4. భారతదేశంలో ఫ్రెంచివారి పరాజయానికి కారణాలు వివరింపుము.
5. వాస్కోడిగామా
6. భారతదేశంలో డచ్చివారి స్థావరాలు
7. సర్‌థామస్ రో
8. డూప్లే
9. ప్లాసీ యుద్ధం
10. బక్సార్ యుద్ధం

## 15.9 చదువదగిన గ్రంథాలు :


1. పాటిబండ్ల ఝాన్సీలక్ష్మి మరియు అల్లాడి వైదేహి - భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం)
2. P.E. Roberts - History of British India
3. K.A.N. Sastri - History of India
4. Majumdar, Rayachandhuri and Datta - An advanced History of Inida



రచయిత :

**వి.కె. మోహన్**

పాఠం - 16

# ఆంగ్ల - మహారాష్ట్ర యుద్ధాలు

**విషయసూచిక**


16.0 లక్ష్యం

16.1 ఉపోద్ఘాతం

16.2 మాధవరావు 1

16.3 మొదట మహారాష్ట్ర యుద్ధం

16.3.1 కారణాలు

16.3.2 సూరత్ సంధి

16.3.3 యుద్ధము

16.3.4 పురంధర్ సంధి

16.3.5 యుద్ధం కొనసాగింపు

16.3.6 వాడ్గాం సంధి

16.3.7 యుద్ధము కొనసాగింపు

16.3.8 సాల్బే సంధి

16.4 సాల్బే సంధి అనంతరం మహారాష్ట్ర పరిస్థితులు

16.4.1 మహదాజీ సింధియా

16.4.2 నానాఫడ్నవీస్

16.5. రెండవ మహారాష్ట్ర యుద్ధము

16.5.1 మహారాష్ట్ర పరిస్థితి

16.5.2 బెస్సీన్ సంధి

16.5.3 యుద్ధము

16.5.4 దేవగానే సంధి

16.5.5 జనరల్ లౌక్ విజయాలు

16.5.6 సిర్జిఅంజన గాంలే సంధి

16.5.7 హోల్కార్‌తో సంధి

16.6 మూడవ మహారాష్ట్ర యుద్ధము

16.6.1 కారణాలు

16.6.2 హేస్టింగ్ విధానం

16.6.3 సహాయక సంధులు

16.6.4 పీష్వా తిరుగుబాటు

16.6.5 ఒప్పందాలు

16.7 మహారాష్ట్రుల పరాజయానికి కారణాలు

16.8 ముగింపు

## 16.0 లక్ష్యం :

ఇంగ్లీషు వారు భారతదేశంలో తమ సామ్రాజ్యాన్ని విస్తరింప చేసుకునే ప్రయత్నంలో మహారాష్ట్రులతో మూడు యుద్ధాలు చేశారు. మొదటి, రెండవ, మూడవ ఆంగ్ల మహారాష్ట్ర యుద్ధాలకు దారితీసిన కారణాలు, ఆ యుద్ధాల సంఘటనలను, వాని ఫలితాలను, మహారాష్ట్రుల పరాజయానికి కారణాలను తెలుసుకొనడం ఈ పాఠం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## 16.1 ఉపోద్ఘాతం :

కర్నాటక యుద్ధాలు, ప్లాసీ యుద్ధానంతరము ఆంగ్లేయులు భారతదేశములో బలీయమైన శక్తిగా రూపొందారు. తమ సామ్రాజ్యమును విస్తరింపచేసి, భారతదేశమునంతటను తమ స్వాధీనము చేసుకొనుటకు వారికి సమర్థులు, బలవంతులు అయిన మహారాష్ట్రులు అడ్డంకిగ కన్పడ్డారు. మొఘల్ సామ్రాజ్య పతనానంతరము మహారాష్ట్రులు విజృంభించి పీష్వాల నాయకత్వంలో, ఉత్తర, పశ్చిమ భారతదేశాలపై తమ ఆధిపత్యం నెలకొల్పారు. సామ్రాజ్య విస్తరణకు పూనుకున్న ఇంగ్లీషువారికి, వారిని ప్రతిఘటించిన మహారాష్ట్రులకు మధ్య మూడు యుద్ధాలు జరిగినవి. వానినే ఆంగ్ల - మహారాష్ట్ర యుద్ధాలు అని పిలుస్తారు. మూడు మహారాష్ట్ర యుద్ధాలలో మహారాష్ట్రులను జోడించిన ఇంగ్లీషవారు భారతదేశములో తిరుగులేని రాజకీయ, సైనికశక్తిగా అవతరించి, మనదేశముపై సార్వభౌమత్వ అధికారాన్ని నెరపారు.

మూడవ పానిపట్టు యుద్ధకాలానికి మహారాష్ట్రుల అధికారం ఉత్తరాన పంజాబు, రాజపుటానాల నుండి దక్షిణాన కర్నాటకము వరకు పడమర గుజరాతు నుండి తూర్పున బెంగాల్ సరిహద్దుల వరకు విస్తరించి ఉండేది. శివాజీ మరణానంతరము ఛత్రపతి పదవి నామమాత్రా వశిష్టముకాగా పీష్వాయే అధికారాన్ని నెరపుతుండేవాడు. ఈ విశాల సామ్రాజ్యములో సమైక్యత ఏమాత్రము ఉండేదికాదు. మహారాష్ట్ర సామంతులలో నలుగురు ప్రముఖులు ఉండేవారు. వారు గ్వాలియర్ రాజైన సింధియా, ఇండోర్ రాజైన హోల్కార్, బీదర్ పాలకుడైన ఖాన్స్లే, గుజరాత్ పాలకుడైన గైక్వాడ్. వారు పీష్వా అధికారాన్ని నామమాత్రంగ మన్నించి, తమ తమ రాజ్యాలలో సర్వస్వతంత్రంగ వ్యవహరిస్తున్నప్పటికీ, పీష్వాకు కప్పంకట్టి, అవసరమైనపుడు పీష్వాకు సైనిక సహాయం కూడా చేస్తూ ఉండేవారు.

## 16.2 మాధవరావు 1 :

1761లో మూడవ పానిపట్టు యుద్ధములో మహారాష్ట్రులు చావుదెబ్బతిన్నారు. ఆ దుఃఖముతోనే పీష్వా బాలాజీ బాజీరావు మరణించాడు. అతడి అనంతరము పీష్వా అయిన అతని కుమారుడు మాధవరావు నాయకత్వములో మహారాష్ట్రులు తిరిగి కోలుకున్నారు. ఇతడు దూరదృష్టి, సమర్థత కలిగినవాడు. మహారాష్ట్ర నాయకులను కూడగట్టి, వారి పూర్వ ప్రతిష్టను పునరుద్ధరించడానికి కృషిచేశాడు. మాధవరావు దక్షిణాన మైసూరు మొదలు ఉత్తరదేశంలో రోహిల్‌ఖండ్ వరకు దాడులు జరిపి, కప్పం వసూలు చేశాడు. మొఘలాయి చక్రవర్తి షా ఆలమ్ సైతము మహారాష్ట్రుల రక్షణనంగీకరించాడు. మహారాష్ట్రుల ప్రాబల్యం పెరుగుతున్న ఈ తరుణంలో 1772 హఠాత్తుగా మాధవరావు మరణించడం మహారాష్ట్రులకు తీరని నష్టం కలిగించింది.

## 16.3 మొదటి మహారాష్ట్ర యుద్ధము :

### 16.3.1 కారణాలు :

3వ పానిపట్టు యుద్ధంలో ఓటమి తరువాత మహారాష్ట్రులు తిరిగి కోలుకునే లోపల వీలయినన్ని ప్రాంతాలను ఆక్రమించుటకు ఆంగ్లేయులు పూనుకున్నారు. మద్రాసు,కలకత్తా ప్రభుత్వాలు స్వదేశీ సంస్థాన వ్యవహారాలలో జోక్యం కల్పించుకొని

భూభాగాలు సంపాదిస్తే, బొంబాయి ప్రభుత్వం అలా చేయలేకపోవటం వారికొక విచారకర విషయమైనది. కనుక ఎలాగైనా వారికి దగ్గరలోనున్న మహారాష్ట్రులతో యుద్ధంచేసి, వారి నుండి కొంత ప్రదేశమైనా రాబట్టవలెనని తగిన అదునుకోసం ఇంగ్లీషు వారు వేచియున్నారు. మొదటి మహారాష్ట్ర యుద్ధానికి ముఖ్యకారణం ఇదే. పీష్వా మొదటి మాధవరావు క్రీ.శ. 1772లో మరణించగానే అతని తమ్ముడైన నారాయణరావు పీష్వా అయినాడు. ఇతను అసమర్థుడు. ఇతని పినతండ్రి అయిన రఘోబా అనబడే రఘునాధరావు దురాశతో కుట్రపన్ని నారాయణరావును 1773లో హత్యచేయించి తనను పీష్వాగా ప్రకటించుకున్నాడు. అయితే ఈ దురాగతాన్ని సహించని కొందరు ముఖ్యులు నానాఫట్నవీస్ నాయకత్వంలో బారాభాయి అనే కూటమిగా ఏర్పడి, నారాయణరావు మరణానంతరము పుట్టిన అతని కొడుకును రెండవ మాధవరావు అనే పేరుతో పీష్వాగా ప్రకటించిరి. ఓడిపోయి పదవీచ్యుతుడైన రఘోబా పూనా నుండి పారిపోయి, ఇంగ్లీషువారి శరణుజొచ్చాడు. ఈ అవకాశానికే ఎదురుచూస్తున్న బొంబాయి గవర్నర్ వెంటనే రఘునాధరావుతో క్రీ.శ. 1775లో సూరత్ సంధి చేసుకున్నాడు.

### 16.3.2 సూరత్ సంధి (1775) : దీని ప్రకారము

1) ఇంగ్లీషువారు రఘునాధరావును పీష్వాగా పునః ప్రతిష్ఠించటానికి అంగీకరించారు.

2) దానికి ప్రతిఫలంగా అతడు సాల్సెట్టి, బేస్సిన్‌లను ఇంగ్లీషు వారికి ఇవ్వడానికి అంగీకరించాడు.

3) రఘునాధరావుకు సైనిక సహాయం చేయడానికి, ఆ సైన్యానికయ్యే ఖర్చు నిమిత్తం అతను 1 1/2 లక్షల రూపాయలు ఆంగ్లేయుల కివ్వడానికి అంగీకారం కుదిరింది. ఇంగ్లీషు సైన్యం పూనాపైకి బయలుదేరడంతో మొదట మహారాష్ట్ర యుద్ధం ఆరంభమైనది.

### 16.3.3 యుద్ధం :

రఘోబాకు సహాయంగా వెళ్ళిన ఇంగ్లీషు సైన్యము కల్నల్ కీటింగ్ నాయకత్వంలో పూనా సైన్యాన్ని ఆర్రాస్ వద్ద ఓడించినవి. కానీ ఈ లోపల రెగ్యులేటరీ చట్టం ప్రకారం కలకత్తాలోని గవర్నర్ జనరల్ అనుమతి పొందకుండా బొంబాయి ప్రభుత్వం యుద్ధం చేయకూడదని తెలిసినా, యుద్ధంలో దిగినందువల్ల యుద్ధాన్ని ఆపివేయమని కలకత్తాలోని గవర్నర్ జనరల్ కౌన్సిల్ ఉత్తర్వునిచ్చింది.

### 16.3.4 పురంధర్ సంధి :

కొన్ని నెలల తరువాత కలకత్తా కౌన్సిల్ ఉపటన్‌ను, నానాఫడ్నవిస్‌తో సంప్రదింపులు జరపటానికి పంపినది. అతడు 1776 మార్చి 1వ తేదీన నానాఫట్నవిస్‌తో పురందర్‌పట్నం వద్ద కొత్త సంధి చేసుకున్నాడు. ఆ సంధి ప్రకారం

1) ఆంగ్లేయులు సాల్సెట్టి, బేస్సిన్ ప్రాంతాలువారే ఉంచుకునేటట్లు,

2) బ్రోచ్ రేవుపట్టణం నుండి వచ్చే ఆదాయం, ఇంగ్లీషు వారికి చెందేటట్లు,

3) యుద్ధ ఖర్చులు క్రింద ఇంగ్లీషు వారికి 12 లక్షల రూపాయలు చెల్లించేటందుకు

దానికి ప్రతిఫలంగా

4) రెండవ మాధవరావు పీష్వాగా ఉండటానికి

5) ఆంగ్లేయులు రఘునాధరావుకు తమ సహాయాన్ని ఉపసంహరించేటట్లు ఒప్పందం కుదిరింది.

### 16.3.5 యుద్ధము కొనసాగింపు :

బొంబాయి కౌన్సిల్ పురంధర్ సంధికి నిరాకరించిన కోర్ట్ ఆఫ్ డైరెక్టర్లకు అప్పీలు చేశారు. అంతేకాక రఘోబాకు ఆశ్రయం ఇచ్చారు. ఇంగ్లాండులోని కంపెనీ అధికారులు పురంధర్ సంధి కంటే సూరత్ సంధి షరతులే లాభసాటిగా ఉన్నవని గ్రహించి ఆ సంధినే ఆమోదించడంతో యుద్ధం కొనసాగింది.

పూనాలో నానాపడ్నవీస్ కూడా ఇంగ్లీషువారిని నమ్మక సెయింట్ లూబిస్ అనే ఫ్రెంచ్ వ్యక్తిని తన కొలువులో చేర్చుకొని సైన్యాన్ని ఆయత్తం చేశాడు.

### 16.3.6 వాడ్గాం సంధి :

బొంబాయి ప్రభుత్వం కల్నల్ ఎగర్టన్ నాయకత్వాన ఒక సైన్యాన్ని పంపింది. అదే సమయంలో గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ లెస్లీ నాయకత్వాన మరొక సైన్యాన్ని బెంగాల్ నుండి పంపాడు. ఈ క్లిష్ట పరిస్థితిలో సింధియా, హోల్కార్ తదితర మహారాష్ట్ర నాయకుల సహకారంతో నానా ఫడ్నవీస్ యుద్ధములో విజయం పొందాడు. బెంగాల్ సైన్యం మధ్యభారతంలోనే ఓడించబడింది. బొంబాయి సైన్యం కూడా ఓడిపోయింది. ఇంగ్లీషువారు నానాఫడ్నవీస్తో వాడ్గాంవద్ద 1779 లో కొత్త సంధి చేసుకున్నారు. ఈ సంధి ప్రకారం

1) 1773 నుండి ఇంగ్లీషువారు జయించిన ప్రాంతాలన్నీ మహారాష్ట్రులకు తిరిగి ఇచ్చివేయాలి.
2) బెంగాల్ నుండి వస్తున్న ఇంగ్లీష్ సైన్యం వెనుతిరగాలి.
3) బ్రోచ్ రేవు నుండి వచ్చే ఆదాయంలో కొంతభాగం సింధియాకు ఇవ్వాలి.
4) రఘోబాను సింధియా ఆధీనంలో ఉంచాలి.

### 16.3.7 యుద్ధము కొనసాగింపు :

ఈ విధంగా పూనాపై ఇంగ్లీషువారి దాడి పూర్తిగా విఫలమై వారి ప్రతిష్ఠ దెబ్బతిన్నది. వారన్ హేస్టింగ్స్, అతని కౌన్సిల్ ఈ పరాజయమును అంగీకరింపక, మహారాష్ట్రులతో తిరిగి యుద్ధము చేసి వారిని ఓడించవలెనని నిర్ణయించుకొనిరి. జనరల్ గోడార్ట్ నాయకత్వాన ఒక సైన్యాన్ని పూనాపైకి పంపారు.

ఈ లోపల నానాఫడ్నవీస్ తన అద్భుత రాజనీతిని ప్రదర్శించి నైజాము, హైదరాలీలతో ఒక ఆంగ్ల వ్యతిరేక కూటమిని ఏర్పరిచాడు. నైజాము నుండి గుంటూరు సర్కారును మద్రాసు ప్రభుత్వం తీసికొన్నందున అతడు ఆంగ్లేయులపై కోపించాడు. నైజామ్ ఉత్తర సర్కారుల మీద, హైదరాలీ కర్నాటక మీద, నానాఫడ్నవీస్ బొంబాయి మీద, భాంస్లే బెంగాల్ మీద ఒకేసారి దాడిచేయవలెనని నిర్ణయించుకున్నారు. ఈ ప్రణాళిక సఫలమైనచో ఇంగ్లీషువారు ఆనాడే మనదేశాన్ని వదలి వెళ్ళవలసి వచ్చేది.

అయితే గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్ దౌత్యనీతిలో నానాఫడ్నవీసును మించినవాడు. విభజించి పాలించు అన్న నీతిని ప్రయోగించి, మిత్రకూటమి సభ్యులలో కొందరిని తనవైపుకు త్రిప్పుకొని, కూటమిని విచ్ఛిన్నము జేయపూనుకున్నాడు. నైజాముకు గుంటూరు సర్కారును తిరిగిఇచ్చి, అతడిని తన వైపుకు త్రిప్పుకున్నాడు. భాంస్లేను కూడ మహారాష్ట్ర కూటమి నుండి వేరుచేసినాడు. గైక్వాడ్ను కూడ తన వైపుకు త్రిప్పుకున్నాడు.

కల్నల్ గోడార్డ్ సైన్యం కలకత్తా నుండి మధ్యభారత్ మీదుగా పయనించి, అహమ్మదాబాద్ను 1780 ఫిబ్రవరి 11వ తేదీన, బెస్సీన్ను డిసెంబరు 11న ఆక్రమించి పూనాపైకి నడిచింది. 1781 ఏప్రియల్లో ఆ సైన్యాన్ని నానాఫడ్నవీస్ బోరొఘాట్ వద్ద ఓడించాడు. ఈ లోపల వారన్ హేస్టింగ్స్ పోహమ్ నాయకత్వాన ఒక సైన్యాన్ని మహదాజీ సింధియాపైకి పంపాడు. అతడు గ్వాలియర్ కోటను ముట్టడించి 1780 ఫిబ్రవరిలో ఆక్రమించాడు. సిప్రి వద్ద కూడ సింధియా ఓడిపోయాడు. గత్యంతరం లేక సింధియా ఇంగ్లీషువారితో 1781 అక్టోబరు 13వ తేదీన వేరుగా సంధి చేసుకున్నాడు. ఇంగ్లీషు వారికి, నానాఫడ్నవీస్కు మధ్య రాజీకుదుర్చుటకు సింధియా అంగీకరించాడు.

### 16.3.8 సాల్బే సంధి (1782) :

అప్పటికే యుద్ధముతో విసుగు చెందిన ఇంగ్లీషు వారికి, నానాఫడ్నవీస్ నాయకత్వములోని పూనా ప్రభుత్వమునకు మధ్య సంప్రదింపులు జరిగి చివరకు 1782 మే 17వ తేదీన వారి మధ్య సాల్బే సంధి కుదిరినది. సాల్బే సంధి ప్రకారము

1) రెండవ మాధవరావు పీష్వాగా ఉండేటట్లు,
2) రఘునాధరావుకు భరణం ఇచ్చేటట్లు, ఇంగ్లీషువారు ఇకమీదట అతనికి సాయం చేయకుండేటట్లు,
3) యమునా నదికి పడమరగ ఉన్న ప్రాంతం సింధియాకు చెందేటట్లు
4) సాల్సెట్టి ఇంగ్లీషు వారికి చెందేటట్లు, పురంధర్ సంధి తరువాత ఇంగ్లీషువారు ఆక్రమించిన ప్రాంతాలు మహారాష్ట్రాలకు తిరిగి ఇచ్చివేసేటట్లు
5) ఆర్కాట్ నవాబునుండి హైదరాలీ ఆక్రమించిన ప్రాంతాలు తిరిగి అతడికి ఇచ్చివేసేటట్లు
6) ఇంగ్లీషువారికి శత్రువులైన ఐరోపా జాతులతో పీష్వా మైత్రి వహించకుండేటట్లు షరతులు కుదిర్చుకున్నారు. సాల్బే సంధితో మొదటి మహారాష్ట్ర యుద్ధము ముగిసింది. ఈ యుద్ధములో ఇంగ్లీషువారికి ఆశించిన ప్రయోజనము చేకూరలేదు. పైగా అధిక ధన నష్టము కలిగింది. అయితే వారికి ఈ యుద్ధం వల్ల మహారాష్ట్ర రాజకీయాలలో ప్రవేశించి, వారి బలహీనతలను గుర్తించే అవకాశం కలిగింది. 'సాల్బే సంధివల్ల భారత రాజకీయాలలో బ్రిటీష్ వారికి కీలకస్థానం లభించి, 1818లో తమ సార్వభౌమత్వాన్ని స్థాపించుకోవడానికి తోడ్పడింది' అని విన్సెంట్ స్మిత్ అభిప్రాయపడినాడు.

## 16.4 సాల్బే సంధి అనంతరము మహారాష్ట్ర పరిస్థితులు :

మొదటి మహారాష్ట్ర యుద్ధానంతరము మహారాష్ట్ర రాజకీయాలలో మహదాజీ సింధియా, నానాఫడ్నవీస్‌లు అతిముఖ్యమైన పాత్రలు నిర్వర్తించారు. ఉత్తర భారతదేశంలో మహదాజీ, దక్షిణాన నానా తమ ప్రాబల్యములను నెలకొల్పారు. మహారాష్ట్ర విరోధులపట్ల వీరభయులూ కలిసేవారు. కానీ మహారాష్ట్ర రాజకీయాల్లో అధికారం కోసం పోటీపడ్డారు. ముఖ్యంగా నానాఫడ్నవీస్, మహదాజీ పట్ల అసూయతో ప్రవర్తించాడు. వారిరువురూ కలిసినట్లయితే భారతదేశ చరిత్రగతి మరో విధంగా ఉండెడిది.

### 16.4.1 మహదాజీ సింధియా :

1784 నుండి 1795 వరకూ మహారాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖపాత్ర నిర్వర్తించాడు. 3వ పానిపట్టు యుద్ధంలో పాల్గొని కుంటివాడయ్యాడు. అనంతరం ఇతను మాళవ ప్రాంతంలోని తన జాగీరును పీష్వా మాధవరావు సాయంతో పొంది దానిని విస్తరింపచేశాడు. మహారాష్ట్రుల ఉత్తరభారతదేశ దండయాత్రలో పాల్గొని మొఘలాయి చక్రవర్తి 2వ షా ఆలమ్‌ను మహారాష్ట్రుల రక్షణలోనికి తెచ్చాడు. మొదటి ఆంగ్ల - మహారాష్ట్ర యుద్ధంలో నానాకు తన పూర్తి సహకారమిచ్చినాడు. ఫ్రెంచి వారి సహాయంతో తన సైన్యానికి తర్ఫీదు నిప్పించాడు. బెనోడిబాయిన్ అను ఫ్రెంచ్ సేనానితో కొత్త పద్ధతులతో పాశ్చాత్య యుద్ధవిధానంలో తన సైన్యానికి తర్ఫీదు నిప్పించాడు. రాజపుత్ర రాజ్యాలను, జాట్‌లను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. ఆగ్రాపై దాడిచేసి మహమ్మద్‌బేగ్ మొదలగు మొగల్ సేనానులను ఓడించి చక్రవర్తి షా ఆలమ్‌ను తన చేతిలో కీలుబొమ్మగా చేసుకొని నాయబ్ పీష్వా అనే బిరుదును సంపాదించాడు. యమునా నదికి పడమరగానున్న ప్రాంతానికంతకూ పరిపాలకుడైనాడు. రోహిల్లా నాయకుడు గులామ్ ఖాదర్‌ను వధించాడు. ఈ విధంగా దినదినాభివృద్ధి చెందిన మహదాజీ ప్రాబల్యాన్ని చూసి, నానా, ఆంగ్లేయులు కూడా భయపడుతుండేవారు. తర్వాత పీష్వాను తన వైపుకు తిప్పుకొని దక్షిణదేశ ఆధిపత్యాన్ని కూడా

పొందదలిచాడు. అందుకు పూనా చేరిన సింధియా తీవ్రంగా జ్వరపడి 1794లో మరణించాడు. మహదాజీ అనంతరం అతని దత్తపుత్రుడు దౌలత్‌రావు సింధియా గద్దెనెక్కాడు. 13 సం॥ వయస్సుగల ఈ పసివానికి, 67 ఏండ్లు జీవించి బ్రిటీష్‌వారిని, మహారాష్ట్ర మైసూర్, నైజామ్‌లను గడగడలాడించిన మహదాజీ సింధియాకు ఎట్టి పోలికా లేదు. అతడి మరణంతో ఒక ముఖ్య శత్రువును ఆంగ్లేయులు కోల్పోయారు.

## 16.4.2 నానాఫడ్నవీస్ :

మహదాజీ వలెనే ఇంగ్లీష్‌వారిని గడగడలాడించిన రాజనీతిజ్ఞుడు ఇతడు. మహారాష్ట్రుల నందరినీ ఏకంచేసి మహారాష్ట్ర సామ్రాజ్యాన్ని స్థాపించి ఆంగ్లేయులను పూర్తిగా దేశం నుండి వెళ్ళగొట్టవలెనని ఆశించాడు. క్రీ.శ. 1742లో జన్మించిన నానా, పీష్వా బాలాజీరావు కుమారులతోపాటు విద్యనభ్యసించాడు. 1756లో ఇతడి తండ్రి మరణానంతరం పీష్వా ఇతనికి ఫడ్నవీస్ పదవిని కల్పించాడు. 3వ పానిపట్టు యుద్ధానంతరం మహారాష్ట్ర రాజకీయాల్లో చురుకుగా పాల్గొని రఘోబా కుట్రను విఫలంచేసి 2వ మాధవరావును పీష్వాగా చేశాడు. ఇతడు మేధావి. దేశభక్తి, మరియు మహారాష్ట్ర అభిమానం కలవాడు. అనేక దేవాలయాలు, సత్రాలు కట్టించాడు. గూఢచారుల ద్వారా అప్రమత్తంగా ఉండేవాడు. సాల్బే సంధి తర్వాత పీష్వాను నామమాత్రునిగా చేసి నానా అధికారం చేజిక్కించుకున్నాడు. దక్షిణదేశంలో మహారాష్ట్ర రాజ్యాన్ని విస్తరింపచేయుటకు పూనుకున్నాడు. 1785లో టిప్పుసుల్తాన్‌ను ఓడించి బాదామి, కిట్టూరు, నార్గుండ్ ప్రాంతాలను పొందాడు. టిప్పు నుండి 45 లక్షల ధనాన్ని వసూలు చేశాడు. అనంతరం 3వ మైసూరు యుద్ధంలో పాల్గొని టిప్పూను ఓడించి తుంగభద్ర నదికి ఉత్తరంగా నున్న ప్రాంతాన్ని ఆక్రమించాడు. ఈ విజయాల అనంతరం నిజామ్‌పైకి దృష్టిని సారించి నాటికి అతడు బకాయిపడ్డ చౌత్, సర్దేశ్‌ముఖి మొత్తం వెంటనే చెల్లించవలెనని నానా కోరాడు. ఇంగ్లీషువారి సాయం లభించగలదనే ధైర్యంతోనే నిజామ్ ఆ కోర్కెను తిరస్కరించాడు. కాని అప్పటి గవర్నర్ జనరల్స్ కారన్‌వాలిస్, మరియు షోర్‌లు తటస్థ విధానాన్ని అనుసరిస్తూ నిజామ్‌కు సహాయం చేయుటకు నిరాకరించాడు. నిజామ్ ఒంటరిగా మహారాష్ట్రులను ఎదుర్కొనవలసి వచ్చింది. నానా నాయకత్వంలో మహారాష్ట్ర కూటమిలో పీష్వా, దౌలత్‌రావ్ సింధియా, తుకోజీ హోల్కార్, భాన్స్లేలు నిజామ్‌పై దాడిచేశారు. 1795 మార్చిలో ఖర్దావద్ద నిజామ్ ఓడి చాలా అవమానకరమైన సంధి చేసుకున్నాడు. నిజామ్ మహారాష్ట్రులకు 5 కోట్ల రూపాయలు, దౌలతాబాద్ దుర్గము, దాని సమీప ప్రాంతాలను ఇచ్చాడు. మహారాష్ట్ర నాయకులంతా ఏకమై పనిచేయటం ఇదే తుదిసారి. ఖార్దా విజయంతో నానా గౌరవప్రతిష్టలు ఇనుమడించినవి. అతడి కలలు ఫలించినవి. మహారాష్ట్రులందరినీ ఏకం చేయటమేకాక, నిజామ్, టిప్పులను కూడా ఓడించాడు. ఆంగ్లేయులు కూడా అతనికి భయపడ్డారు. ఈ విజయాలతో నానా నిరంకుశంగా ప్రవర్తించ నారంభించాడు.

ఈ నిరంకుశ ధోరణిని సహించలేక పీష్వా మాధవరావు II 1795 అక్టోబరులో ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మరణశాసనం ప్రకారం రఘోబా కుమారుడైన బాజీరావు పీష్వా అయినాడు (1769). తనకు పరమ శత్రువైన రఘోబా కుమారుడు పీష్వా కావటాన్ని నానా వ్యతిరేకించాడు. అయితే ఇతరుల జోక్యంతో 2వ బాజీరావు పీష్వాగా ఉండుటకు నానా అంగీకరించాడు. 2వ బాజీరావు పీష్వా అయినప్పటినుండీ మహారాష్ట్రానికి దుర్దినాలు ఆరంభమైనాయి. అతను పరిపాలనాదక్షుడు కాకపోవటమేకాక కుత్సిత స్వభావుడు. ఉన్నత ఆదర్శాలు కాని, ధైర్యసాహసాలు కాని లేవు. ప్రముఖ నాయకుల మధ్య కుట్రలుపన్నటం, వైషమ్యాలు పెంచుట అతనికి వ్యసనం. నానాతో ఎప్పుడూ కలహిస్తుండేవాడు. 1800 సం॥ నానా మరణించాడు. దీనితో మహారాష్ట్ర నావికుడు లేని నౌకవలే అయినది. యుద్ధాలలోనూ, పరిపాలనా నిర్వహణలోనూ నానా సమర్థుడు. దూరదృష్టి కలవాడు. అతని లోపమంతా అధికార కాంక్ష. అలాకాక దేశభక్తితో వ్యవహరించినచో చరిత్రలో ఎంత ఉన్నతస్థానం పొందేవాడు.

## 16.5 రెండవ మహారాష్ట్ర యుద్ధం (1803 - 1805) :

### 16.5.1 మహారాష్ట్ర పరిస్థితి :

నానా మరణంతో మహారాష్ట్ర కూటమి విచ్ఛిన్నమైనది. ప్రముఖ నాయకులంతా ఒకరివెంట ఒకరు కొద్దికాలంలో మరణించుట దురదృష్టకరం. మహదాజీ సింధియా, మల్‌హర్‌రావు హోల్కర్, తుకోజీ భాన్‌స్లే, తుకోజీ హోల్కార్, అహల్యాబాయిలు కొద్ది సంవత్సరాల తేడాతో మరణించారు. నానాఫడ్నవీస్ 1800, మార్చి 13న మరణించాడు. వీరి స్థానంలో వయసులో చాలా చిన్నవారు, అనుభవరహితులు, దూరదృష్టిలేనివారు, భోగలాలసులు, ప్రజల రాజ్యక్షేమం ఏ మాత్రం పట్టించకోనివారు, స్వార్థపరులు అయిన క్రొత్తవారు, దౌలత్‌రావు సింధియా, జస్వంతరావు హోల్కార్, కాశీరావు, పీష్వా రెండవ బాజీరావులు అధికారములోనికి వచ్చారు. మహారాష్ట్ర కూటమి ఈ విధముగా నాయకత్వరహితమై, వారిలో వారు ఈర్ష్యా, అసూయలతో కలహించుకోసాగారు. మహారాష్ట్రతో జోక్యం కల్పించుకోడానికి ఇంగ్లీషువారికి చక్కటి అవకాశమేర్పడినది. నానాఫడ్నవీస్ ఉన్నంతకాలం మహారాష్ట్ర నాయకులలో కలహాలెన్నిఉన్నా ఆంగ్లేయులు వాటితో జోక్యం కల్పించుకోకుండా నానా తన రాజనీతిని ప్రదర్శించాడు. అతని తర్వాత అట్టి దూరదృష్టికల నాయకుడెవరూ మహారాష్ట్రులలో లేకపోవడంతో రెండవ మహారాష్ట్ర యుద్ధానికి దారితీసింది.

దౌతల్‌రావు సింధియా, జస్వంతరావు హోల్కార్‌లు పీష్వాను కీలుబొమ్మగా చేసుకొని, మహారాష్ట్రలో ఆధిపత్యానికి పోటీపడ్డారు. పీష్వా బాజీరావు **II** సమయానుకూలముగ పక్షాలు మారుస్తూ, వారి మధ్య విభేదాలు పెంచాడు. కొంతకాలం అతడు సింధియాకు మద్దతు ఇచ్చాడు. సింధియా హోల్కార్‌మీద దాడిచేసి మాళవపైకి వెళ్ళాడు. పీష్వా హోల్కార్ తమ్ముడిని చంపించాడు. అంత ఉగ్రుడైన జస్వంతరావు హోల్కర్ పీష్వా, సింధియాల సైన్యాన్ని ఓడించి, పీష్వా రెండవ బాజీరావును పారద్రోలి పూనాను ఆక్రమించినాడు. పీష్వా బెస్సీన్‌కు పారిపోయి ఇంగ్లీషువారి శరణుజొచ్చాడు.

### 16.5.2 బెస్సీన్ సంధి (1802) :

అంతకుముందు గవర్నర్ జనరల్ వెల్లస్లీ అనేకసార్లు పీష్వాను సహాయ సంధికి ఒప్పుకొనవలసిందిగా అభ్యర్థించినా నానాఫడ్నవీస్ ఉన్నతంకాలము పీష్వా దానికి అంగీకరించలేదు. ఇపుడు పారిపోయి ఇంగ్లీషువారి రక్షణ, సహాయము కోరిన పీష్వా గత్యంతరములేక వారితో 1802 డిశెంబరు 31వ తేదీన బేస్మిన్ సంధి చేసుకున్నాడు. ఈ సంధి ప్రకారము

1) పీష్వా 6000 మందితో కూడిన ఇంగ్లీషు సైన్యాన్ని తన రాజ్యంలో శాశ్వతంగా ఉంచుకోవాలి.

2) ఆ సైన్యము ఖర్చుల క్రింద సంవత్సరానికి 26 లక్షల రూపాయలు ఆదాయం వచ్చే ప్రాంతాన్ని ఇంగ్లీషు వారికివ్వాలి.

3) పీష్వా తన విదేశాంగ విధాన నిర్వహణను బ్రిటీష్‌వారికి అప్పచెప్పాడు. మొదట్లో ఆంగ్లేయులకిచ్చిన ప్రాంతాలు పూనా పరిసరాలలో ఉండేవి. 1803లో వీటికి బదులుగా బుందేల్ ఖండ్ ఇంగ్లీషు వారికివ్వడం జరిగింది. కల్నల్ వెల్లస్లీ ఇంగ్లీషు సైన్యంతో పూనాకువెళ్ళి 1803 మే 13న బాజీరావును మరల పీష్వాగా ప్రతిష్టించాడు. కానీ పీష్వా ఇపుడు స్వతంత్రుడు కాదు. ఆంగ్లేయుల సామంతుడు మాత్రమే.

మిగతా మహారాష్ట్ర నాయకులు బేస్మిన్ సంధి తమ కందరకూ అవమానకరమని భావించారు. వారి మధ్య కల అసూయాద్వేషాలను మరచి వారంతా కలసి ఆంగ్లేయులు నెదిరించుటకు పూనుకున్నారు. ఇదే రెండవ మహారాష్ట్ర యుద్ధానికి దారితీసింది. సింధియా, భాన్‌స్లేలు తమ విభేదములను మరచి, మరాటా స్వాతంత్ర్య పరిరక్షణకు కలసి పోరాడుటకు పూనుకున్నారు. గైక్వాడ్ వారిని సమర్థించినాడు. పీష్వా కూడ తన తప్పిదాన్ని గుర్తించి, రహస్యముగ వారిని సమర్థించాడు.

### 16.5.3 యుద్ధము :

భారతదేశములో బ్రిటీష్ సామ్రాజ్య స్థాపనకు పూనుకున్న వెల్లస్లీ ప్రభువుకు ఈ యుద్ధము మంచి అవకాశమిచ్చింది. మహారాష్ట్ర నాయకులను విడదీసి వారిని నాశనం చేయడానికి, ముఖ్యంగా ఫ్రెంచి వారితో తన సైన్యాన్ని తర్ఫీదు చేయించి, మొఘల్ పాదుషాను తన కీలుబొమ్మగా చేసుకొని, ఢిల్లీని తన గుప్పెట్లో పెట్టుకున్న సింధియాను పూర్తిగా ఓడించడానికి, ఢిల్లీ సమీపంలోని రాజపుత్రులను లొంగదీసుకోడానికి వెల్లస్లీ యుద్ధాన్ని ఒక సాధనంగా వాడుకున్నాడు.

సింధియా ఇంగ్లీషువారు ప్రతిపాదించిన సహాయక సంధికి నిరాకరించి, తన సైన్యాన్ని భాన్స్లే సైన్యంతో కలిపి ఖాండేష్‌లోని బుర్హాన్‌పూర్ వద్ద నిలిపాడు. ఖాండేష్ నుండి ఉపసంహరించుకోమన్న ఇంగ్లీషువారి కోరికను తిరస్కరించుటతో యుద్ధమారంభమైనది (1803).

వెల్లస్లీ ప్రభువు అయోధ్య, బరోడా, మైసూరు, సూరత్‌లతో వేరువేరుగా సంధులు చేసుకొని, అవి శత్రుపక్షములో చేరకుండా జాగ్రత్తపడినాడు. ఇంగ్లీషువారికి బేస్సీన్ సంధి మూలంగా మహారాష్ట్రలో నిరాటంకముగ ప్రవేశించడానికి వీలుగ ఉంది. ఆంగ్ల సేనానులు, ఆర్థర్, వెల్లస్లీ, లౌక్ మొదలైనవారు కడుసమర్థులు, అనుభవజ్ఞులు. ఆంగ్లసైన్యం మూడు భాగాలుగా వెల్లస్లీ, అతని సోదరుడు ఆర్థర్ వెల్లస్లీ, జనరల్ లౌక్‌ల నాయకత్వంలో విభజింపబడి భాన్స్లే, సింధియా, హోల్కార్‌ల మీదకు నడిచింది.

ఆర్థర్ వెల్లస్లీ 1803 ఆగస్టులో అహమ్మద్‌నగరాన్ని ఆక్రమించాడు. అస్సే వద్ద సింధియా, భాన్స్లేల ఉమ్మడి సైన్యాన్ని ఓడించి, బుర్హాన్‌పూర్, ఆసీర్‌ఘర్‌లు ఆక్రమించాడు. నవంబరులో భాన్స్లే సైన్యాలు తిరిగి ఆరగాం యుద్ధంలో ఓడిపోయినవి. గావిత్‌ఘర్ దుర్గాన్ని ఇంగ్లీషు వారుగ (డిసెంబరు 14న) పట్టుకొనడంతో భాన్స్లే పూర్తిగా ఓడిపోయి, దేవగాన్ సంధి చేసుకున్నాడు.

**16.5.4 దేవగాన్ సంధి (1803 డిశెంబరు 17) :** దీని ప్రకారం భాన్స్లే

1) ఇంగ్లీషు వారికి తన స్వాధీనములోనున్న కటక్ జిల్లాను, వార్ధానదికి పడమటగా ఉన్న ప్రాంతాలను ఇవ్వడానికి అంగీకరించాడు.
2) భాన్ స్లే సహాయక సంధికి ఒప్పుకున్నాడు. నాగపూర్‌లో బ్రిటీష్ రెసిడెంటును నిలుపుకొని, తన విదేశీ వ్యవహారాలను అతని ద్వారా నిర్వహించడానికి అంగీకరించాడు.
3) ఇంగ్లీషు వారి శత్రువులకు తన రాజ్యంలో ఉద్యోగాలివ్వనని అంగీకరించాడు.
4) నిజాము నుండి చౌత్ వసూలు చేసుకునే హక్కును వదులుకొన్నాడు.

### 16.5.5 జనరల్ లౌక్ విజయాలు :

ఉత్తర భారతదేశంలో జనరల్ లౌక్ కూడ సింధియాపై ఘనవిజయాలు సాధించాడు. కాన్పూర్ నుండి బయలుదేరిన లౌక్ సైన్యం సింధియా ముఖ్యస్థావరాలలో ఒకటైన ఆలీఘర్‌ను ఆక్రమించింది. సింధియా కొలువులోనున్న ఫ్రెంచి సేనాని పెర్రాన్ ఇంగ్లీషువారితో యుద్ధం చేయడానికి ఇష్టపడక సింధియా కొలువు నుండి తప్పుకున్నాడు. అనంతరము లౌక్ సింధియా సైన్యాలను ఓడించి ఢిల్లీ, ఆగ్రా పట్టణాలను ఆక్రమించి మొఘల్ చక్రవర్తిని తన స్వాధీనములోకి తీసుకున్నాడు. చివరకు లాస్వారి దగ్గర జరిగిన కీలకమైన యుద్ధంలో సింధియా సైన్యాలు సర్వనాశనమైనవి. ఇంగ్లీషువారు గుజరాత్, బుందేల్‌ఖండ్, ఒరిస్సాలను స్వాధీనపర్చుకున్నారు. పూర్తిగా ఓడిపోయిన సింధియా ఇంగ్లీషువారితో 1803 డిశెంబరు 30వ తేదీన సిర్జిఅంజన గాంవ్ వద్ద సంధి చేసుకున్నాడు.

### 16.5.6 సిర్జి అంజన గాంవ్ సంధి :

దీని ప్రకారము సింధియా నుండి ఆంగ్లేయులు అనేక ప్రదేశాలు పొందారు.

1) గంగా యమునల మధ్య ప్రాంతాన్ని, గోహాడ్, జయపూర్, జోధ్‌పూర్ రాజ్యాలను ఉత్తరంగ ఉన్న భూములను, అహమద్‌నగర్, బ్రోచ్‌నగరాలను సింధియా నుండి ఆంగ్లేయులు పొందారు.

2) మొఘల్ చక్రవర్తి, పీష్వా, నిజామ్, గయక్వాడ్‌లపై తన హక్కులను సింధియా వదులుకొన్నాడు.

1804లో జరిగిన బుర్హాన్‌పూర్ సంధి ప్రకారము సహాయక సంధికి కూడా సింధియా అంగీకరించి, సహాయ సైన్యాన్ని (subsidiary force) తన రాజ్యంలోకాక, తన సరిహద్దులకు సమీపంలో నిలుపుకొని పోషించటానికి అంగీకరించాడు. ఈ సంధులతో సింధియా, భాన్స్లేలు మళ్లీ తలెత్తుకోలేకపోయారు.

### 16.5.7 హోల్కార్‌తో యుద్ధము :

సింధియా, భాన్స్లేలు లొంగిపోయేదాకా తటస్థంగ ఉన్న హోల్కార్ జరిగిన పరిణామాలతో కలవరపడి, ఆంగ్లేయులపై యుద్ధం ప్రకటించాడు. తన సైన్యాన్ని బాగా పెంచుకొని, ఇంగ్లీషువారి మిత్రులైన రాజపుత్ర సంస్థానాధీశుల మీద దాడులకు పూనుకున్నాడు. జయపూర్ సంస్థానాధీశుని ఆస్తి కొల్లగొట్టించాడు. 1804లో జనరల్ లౌక్ హోల్కాలును చంబల్ నదికి దక్షిణంగ ఉన్న కోటకు తరిమి రాంపూర్ ఆక్రమించాడు. వర్షాకాలంలో లౌక్ కాన్పూర్‌కు వెళ్ళగా, ఆంగ్లసైన్యాలను నడుపుతున్న కల్నల్ మాన్‌సేన్‌పై హోల్కార్ ముకుంద్‌దారా వద్ద ఘనవిజయం సాధించాడు. భారతదేశంలో ఆంగ్లేయులు ఇంతటి పరాభవం ఎన్నడూ పొందలేదు. అక్కడనుండి హోల్కార్ భరత్‌పూర్‌రాజు సాయంతో ఢిల్లీని ముట్టడించాడు. కాని దానిని ఆక్రమించడంలో విఫలం చెందాడు. ఈ లోపల లౌక్ అతడి కాల్బలాన్ని డిగ్‌వద్ద ఓడించాడు (నవంబరు 13). అతడి అశ్వికదళం ఫరూకాబాద్ వద్ద పారద్రోలబడింది. బొంబాయి నుండి వచ్చిన మరొక ఆంగ్లేయదళం హోల్కార్ రాజధాని ఇందూర్‌ను పట్టుకుంది. లౌక్ భరత్‌పూర్‌ను కూడా ముట్టడించాడు. కాని అది అతనికి స్వాధీనంకాకపోగా ఆ రాజుతో సంధి చేసుకున్నాడు. లౌక్‌చే తరుమబడిన హోల్కార్ పంజాబు పారిపోయి రంజితసింగ్ సాయంకోరాడు. కాని రంజితసింగ్ అందుకు నిరాకరించాడు. సర్వనాశనం కావలసిన హోల్కార్ హఠాత్తుగా ఇంగ్లీషువారి విధానంలో వచ్చిన మార్పుమూలంగా కాపాడబడ్డాడు. ఎడతెగకుండా జరుగుతున్న యుద్ధముతో విసుగుచెందిన ఇంగ్లాండులోని పై అధికారులు యుద్ధాన్ని ఆపివేయమన్నారు. వెల్లస్లీ స్థానంలో వచ్చిన కారన్‌వాలిస్ ప్రభువు హోల్కార్ పై యుద్ధాన్ని విరమించాడు (1806 జులై).

### 16.5.8 హోల్కార్‌తో సంధి :

1805 డిశెంబరు 24న హోల్కార్‌కు, ఆంగ్లేయులకు మధ్య రాయఘాట్ వద్ద సంధి కుదిరింది.

1) దీని ప్రకారం చంబల్ నదికి ఉత్తరంగా, పడమరంగా ఉన్న ప్రదేశాలు ఆంగ్లేయులు, ఆ నదికి దక్షిణంగా, తూర్పుగ ఉన్న ప్రదేశాలు హోల్కారు ఉంచుకునేటట్లు అంగీకరించారు.

2) నర్మదకు దక్షిణంగ మొదటినుండి హోల్కార్‌కు చెందిన ప్రాంతాలు అతనికే చెందవలెను.

3) ఆంగ్లేయులు సమ్మతి లేకుండ ఇతర ఐరోపా జాతుల వారికి హోల్కార్ ఉద్యోగాలివ్వరాదు.

తరువాత కాలంలో రాజపుత్ర రాజ్యాల రక్షణ బాధ్యతలను ఆంగ్లేయులు వదులుకున్నారు. ఇందువల్ల ఇంగ్లీషువారికి విశ్వాసపాత్రంగా ఉన్న రాజపుత్ర రాజ్యాలను మహారాష్ట్ర దండయాత్రలకు గురిచేయడమైనది. ఈ విధానానికి నిరసనగ జనరల్ లౌక్ తన పదవికి రాజీనామా చేసి ఇంగ్లాండ్ వెళ్ళాడు. ఈ విధముగ రెండవ మహారాష్ట్ర యుద్ధము ముగిసింది.

## 16.6 మూడవ మహారాష్ట్ర యుద్ధము (1817 - 19) :

### 16.6.1 కారణాలు :

ఆంగ్లేయులకు, మహారాష్ట్రులకు జరిగిన ఆఖరి యుద్ధం ఈ 3వ మహారాష్ట్ర యుద్ధము. 2వ మహారాష్ట్ర యుద్ధంలో కోల్పోయిన అధికారాన్ని రాబట్టుకోవలెననే మహారాష్ట్రుల ప్రయత్నం, తమ సామ్రాజ్య వ్యాప్తికి అడ్డంకిగా ఉన్న మహారాష్ట్రులను పూర్తిగా లొంగదీయవలెనని ఆంగ్లేయుల నిర్ణయం 3వ మహారాష్ట్ర యుద్ధానికి దారితీసింది. బార్లో అనుసరిస్తున్న పూర్వ స్వాతంత్ర్య వైభవాలను పునరుద్ధరించుకునే ప్రయత్నం కూడా మహారాష్ట్రులు చేయలేకపోయారు. రాజకీయంగా, ఆర్థికంగా మహారాష్ట్ర రాజ్యాలన్నీ దయనీయ స్థితిలో ఉన్నాయి. పీష్వా హోల్కార్ సింధియా, భాంస్లేలు వారి పూర్వులవలె బలవంతులుకారు. వారి మధ్య అసూయాద్వేషాలు ప్రబలాయి. ఐక్యత లోపించింది. కానీ వారిలో తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయామనే భాధ, తిరిగి స్వతంత్రులం కావాలనే కోర్కె ఉన్నవి. ముఖ్యంగా పీష్వా బాజీరావుకు బేస్మిన్ సంధి చేసుకున్న నాటి నుండి ఆంగ్లేయులపై ద్వేషం పెరిగిపోయింది. సింధియా, భాన్స్లే, హోల్కార్‌లతో రహస్యంగా సంప్రదించి మహారాష్ట్ర కూటమిని మరల పునరుద్ధరించే ప్రయత్నాలు ఆరంభించాడు. పిండారీలను, పఠానులను చేర్చుకొని సైన్యాన్ని వృద్ధిచేశాడు. ఈ పరిస్థితులలో పీష్వాకు, గైక్వాడ్‌లకు మధ్యనున్న తగాదాను పరిష్కరించుటకై పూనా వెళ్ళిన గైక్వాడ్ మంత్రి గంగాధర శాస్త్రి హత్య కావింపబడ్డాడు. పూనాలోని బ్రిటీష్ రెసిడెంట్ ఎల్ఫిన్‌స్టన్, పీష్వా సలహాదారుడు త్రంబక్జీని అనుమానించి ఖైదులో ఉంచాడు. అయితే త్రంబక్జీ తప్పించుకున్నాడు (పీష్వా సహాయంతో). అందువల్ల పీష్వాపై గట్టిచర్య తీసుకోవలసిందిగా హేస్టింగ్స్‌ను ఎల్ఫిన్‌స్టన్ కోరాడు.

### 16.6.2 హేస్టింగ్స్ విధానము :

1813లో వచ్చిన హేస్టింగ్స్ ప్రభువును కూడా వెల్లస్లీ వలెనే సామ్రాజ్యకాంక్ష ఎక్కువ. అతడు తటస్థ విధానానికి స్వస్తిచెప్పాడు. యుద్ధం చేసైనా ఆంగ్లేయుల శత్రువులందరినీ అణచివేస్తే తప్ప తమ సామ్రాజ్యానికి సుస్థిరత సాధ్యం కాదని ఇతని నమ్మకం. భారతదేశంలో ఆంగ్ల సార్వభౌమత్వాన్ని స్థాపించుటకు పూనుకున్నాడు. ఇంగ్లాండ్‌లోని పై అధికారుల ఆమోదంతో ఆధీన సహకారం (సబార్డినేట్ కో ఆపరేషన్) అనే కొత్త విధానాన్ని రూపొందించాడు. అనేకమంది స్వదేశ రాజులతో హేస్టింగ్స్ సహాయక సంధులు చేసుకొని ఆంగ్ల సార్వభౌమత్వం నెలకొల్పాడు. మహారాష్ట్ర నాయకులతో కూడా అనేక ఒడంబడికలు చేసుకున్నాడు.

### 16.6.3 సహాయక సంధులు :

**పూనా సంధి** : 1817లో హేస్టింగ్స్, పీష్వా బాజీరావు చేత నిర్భంధంగా పూనా వద్ద సహాయక సంధి చేసుకున్నాడు. దాని ప్రకారం పీష్వా మహారాష్ట్ర కూటమి నాయకత్వాన్ని విడనాడి తన విదేశీ వ్యవహారాల నిర్వహణను బ్రిటీష్ రెసిడెంట్ ద్వారా జరుపుకోవటానికి, కొంకణ ప్రాంతాన్ని ఇంగ్లీషు వారికి ఇచ్చివేయడానికి అంగీకరించాడు. ఈ సంధితో పీష్వా తన అధికారాలను కోల్పోయి ఆంగ్లేయులకు సామంతస్థితికి దిగజారాడు.

**నాగపూర్ సంధి** : 1816లో మే నెలలో భాన్స్లేతో ఇంగ్లీషువారు నాగపూర్ వద్ద సహాయక సంధి చేసుకున్నారు.

**గ్వాలియర్ సంధి (1817 నవంబరు)** : సింధియాతో సహాయక సంధిని గ్వాలియర్ వద్ద చేసుకున్నారు. దీని ప్రకారం సింధియా తన సైన్యాన్ని తగ్గించుకోవటానికి, పిండారీలను అణచివేయటంలో ఆంగ్లేయులతో సహకరించుటకు అంగీకరించాడు. చంబల్ నదికి ఉత్తరంగా నున్న రాజ్యాలపై తనకు గల హక్కులను వదులుకొన్నాడు. రాజపుత్ర రాజ్యాలతో ఒడంబడికలు

చేసుకునే అవకాశం కంపెనీ వారికి కలిగింది. 1817లో గైక్వాడ్ కూడ సహాయక సంధికి అంగీకరించి, తన సైన్యాలను తగ్గించుటకు, ఇంగ్లీషు వారి సహాయక సైన్యాన్ని అంగీకరించి, వారి ఖర్చులకై కొన్ని ప్రాంతాలు ఇచ్చుటకు అంగీకరించాడు.

పై సంధులు వల్ల ఇంగ్లీషువారు బాగా లాభించడం, మహారాష్ట్రులు తీవ్రంగ నష్టపడటం, స్వతంత్రాన్ని కోల్పోవడం జరిగింది. అందువల్ల మహారాష్ట్ర నాయకులంతా సమావేశమై తమస్వాతంత్రం తిరిగి పొందటానికి కుట్రలు పన్నడానికి యత్నించడమే మూడవ మహారాష్ట్ర యుద్ధానికి దారితీసింది.

## 16.6.4 పీష్వా తిరుగుబాటు :

మొదటి పీష్వా ఆంగ్లేయులపై తిరుగుబాటుచేసి, మిగతి నాయకులను కూడ అందుకు ప్రోత్సహించాడు. సింధియా గ్వాలియర్ సంధి చేసుకున్న రోజునే పీష్వా పూనాలోని బ్రిటీష్ రెసిడెంట్ కార్యాలయాన్ని దగ్ధంచేసి, కిర్కీలోని ఇంగ్లీషు సైనిక స్థావరంపై దాడిచేశాడు. పీష్వా తిరుగుబాటు వార్త వినగానే మిగతా మహారాష్ట్ర నాయకులు కూడ అతని మార్గాన్నే అనుసరించారు. భాన్స్లే, హోల్కారులు కూడ ఆంగ్లేయులపై యుద్ధం ప్రకటించారు.

భాన్స్లే రాజు సలహాదారుడైన అప్పాసాహెబ్ ఆంగ్లేయులతో యుద్ధంచేసి, సీతాబాల్డీ (నవంబరు 1817), నాగపూర్ (డిశెంబరు 1817) యుద్ధాలలో పూర్తిగా ఓడిపోయారు. హోల్కారు కూడ మహిద్‌పూర్ యుద్ధంలో ఆంగ్లేయుల చేతిలో ఓడిపోయి, యుద్ధాన్ని విరమించాడు. పీష్వా కిర్కీకోర్‌గాం, అష్టి యుద్ధాలలో ఓడి, ఆంగ్లేయులకు లొంగిపోయాడు. మూడవ మహారాష్ట్ర యుద్ధములో ఇట్లు ఆంగ్లేయులు ఘనవిజయం సాధించారు.

## 16.6.5 ఒప్పందాలు :

ఈ యుద్ధంతో మహారాష్ట్రుల బలం పూర్తిగా విధ్వంసమైనది. హేస్టింగ్స్ ప్రభువు మహారాష్ట్రులు మళ్ళీ తలెత్తుకొనకుండా ఏర్పాడు చేశాడు. పీష్వా పదవి రద్దయినది. రెండవ బాజీరావుకు భరణమివ్వటం జరిగింది. అతని రాజ్యాన్ని పూర్తిగా బ్రిటీష్ రాజ్యాంలో చేర్చారు. హేస్టింగ్స్ సతారా అనే చిన్న రాజ్యాన్ని స్థాపించి, శివాజీ వంశానికి చెందిన ప్రతాప్‌సింగ్ అనే చిన్నపిల్లవానిని దానికి రాజును చేశాడు.

భాన్స్లే నర్మదానదికి ఉత్తరంగా తనకున్న భూములన్నింటిని కంపెనీ వారికిచ్చాడు.

హోల్కార్ మందసోర్‌వద్ద ఆంగ్లేయులతో సంధి చేసుకొని వారికి రాజపుత్రస్థానంలో తనకున్న హక్కులన్నీ వదులుకొన్నాడు. సైన్య సహకార నిబంధనల కంగీకరించాడు.

మహారాష్ట్రుల పతనంతో భారతదేశములోని అధికభాగం ఆంగ్ల సామ్రాజ్యంలో చేరిపోయింది.

## 16.7 మహారాష్ట్రుల పతనానికి కారణములు :

ఆంగ్ల - మహరాష్ట్ర యుద్ధాలలో మహారాష్ట్రుల పరాజయానికి అనేక కారణాలు కలవు.

మహారాష్ట్ర జాతిలోని ఐకమత్యం తాత్కాలికం. గొప్ప ప్రతిభావంతుడైన నాయకుడు మాత్రమే వారిని ఒకత్రాటిపై నడిపించగలడు. కాని 19వ శతాబ్దం చివరలో అసమర్థులు, స్వార్థపరులు అయినవారు మహారాష్ట్రులకు నాయకులైనారు. దేశభక్తి, జాతీయాభిమానం లోపించిన వీరు స్వార్థంతో తమలో తాము కలహించుకొని ఇంగ్లీషు వారి చేతిలో ఓడిపోయారు.

మహారాష్ట్ర సామ్రాజ్యం విశాలమైంది. అంతటి దానిని ఏలుటకు సమర్థులైన రాజులెవ్వరూ శివాజీ అనంతరం రాలేదు. తర్వాత కొంతకాలం పీష్వా రాజ్యాధిపత్యం నెరిపాడు. అంత పెద్ద సామ్రాజ్యం పరిపాలించుటకు కష్టమని భావించి పీష్వా

దానిని విభజించి సింధియా, హోల్కార్, భాన్స్లే, గైక్వాడ్ అనే నలుగురు సామంతులకు ఇచ్చాడు. వీరు కూడా స్వార్థపరులై నిరంతరం అంతఃకలహాలతో మునిగితేలుతూ స్వతంత్రించుటకు ప్రయత్నిస్తూ ఉండుటతో ఒకరి అనంతరం ఒకరిని ఓడించుట ఆంగ్లేయులకు సులభమైనది. వారి అనైక్యతే వారి పతనానికి ముఖ్యహేతువైనది.

మహారాష్ట్రుల పరిపాలనలో జాగీర్దార్ విధానంవల్ల ప్రజలు అష్టకష్టాల పాలయ్యారు. విపరీతమైన పన్నులు విధించి, ఆ ధనాన్ని యుద్ధాలపై, భోగవిలాసాలకు వెచ్చించేవారు. ప్రజాసౌకర్యాలకుగాని, వ్యవసాయాభివృద్ధికి వెచ్చించేవారు కాదు. పొరుగున ఇంగ్లీషువారు అనేక సంస్కరణలు చేపట్టి ప్రజల సుఖజీవనానికి తోడ్పడగా మహారాష్ట్రులు తమ ప్రజలను దోపిడీకి గురిచేశారు. ఈ కారణంగా ప్రజలలో నిరసన కలిగి, ప్రజల సహకార లోపం వారి పతనానికి మరో కారణమైనది.

తమకు అలవాటైన గెరిల్లా యుద్ధ పద్ధతులను మానివేసి పెద్ద పెద్ద సైన్యాలను నిర్వహించుటవల్ల సైనికంగా వెనుకబడ్డారు. ఆంగ్లేయులతో పోటీ చేయగల ఆధునిక ఆయుధాలు ఫిరంగులు వారికి లేవు. వారిలో కొందరు పాశ్చాత్య సైనిక పద్ధతులను అనకరించి, అనుకరణలో ఫ్రెంచివారిపై ఆధారపడ్డారు. కాని కీలక సమయాలలో ఫ్రెంచి సేనానులు వారిని విడనాడటంతో మహారాష్ట్రుల పతనానికి మరో కారణం. మహారాష్ట్ర సైన్యాలు సాంకేతిక పరిజ్ఞానంతో, ఆధునిక యుద్ధ పద్ధతులలో ఆంగ్లేయుల కంటే ఎంతో వెనుకబడ్డారు. మహారాష్ట్ర రాజ్యాలు ఆర్థిక సమస్యలతో వనరుల లేమితో సతమతమయ్యాయి. ఈ ప్రాంతాలు వ్యాపార, వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధికి అనుకూలమైనవి కావు. తరచుగా కరువు కాటకాలకు గురయ్యేవి. కనుక మరాఠా సైన్యాలు పొరుగు రాజ్యంపై దాడిచేసి దోపిడీకి పాల్పడేవి. రానురాను వారంటే దోపిడీదారులనే అభిప్రాయం కలిగింది. అందువల్ల ప్రజలు వీరిని ద్వేషించి ఆంగ్లేయులను శరణుజొచ్చారు.

మహారాష్ట్రులు నౌకాబలంను నిర్లక్ష్యం చేయటం కూడా ఇంగ్లీషువారి విజయానికి తోడ్పడింది.

పై కారణాలకుతోడు దురదృష్టవశాత్తు కడుసమర్థులు అయిన మహారాష్ట్ర నాయకులు అందరూ 18వ శతాబ్దాంతానికి అదృశ్యమై, అతి బలహీనులు, స్వార్థపరులు అధికారంలోకి వచ్చారు. మహదాజీ, నానాఫడ్నవీస్, తుకోజీ హోల్కార్, అహల్యాబాయ్ మరణించి వారి స్థానంలో రెండవ బాజీరావు, దౌలత్‌రావు, సింధియా, జస్వంత్‌రావ్ హోల్కర్ వంటి దూరదృష్టి లేనివారు అధికారంలోకి రావటం మహారాష్ట్ర కూటమి నాయకత్వం విచ్ఛిన్నమైంది. కాగా వారి శత్రువులైన ఆంగ్లేయులలో కడు శక్తిమంతులు, దేశభక్తిపరులు అయిన సేనానులు. ఉదా ॥ వెల్లస్లీ ప్రభువు, ఆర్థర్ వెల్లస్లీ, ఎల్‌ఫిన్‌స్టన్, జనరల్ లౌక్ మొదలైనవారు ఆంగ్లేయులను విజయపథంలోకి నడిపించారు.

## 16.8 ముగింపు :

ఇంగ్లీషువారు మహారాష్ట్రులతో మూడు యుద్ధములు చేశారు. మొదటి మహారాష్ట్ర యుద్ధములో నానాఫడ్నవీస్ వంటి ప్రతిభావంతుడు మహారాష్ట్రుల నాయకుడుగ ఉండుటతో వారి ఆశయం అంతగా నెరవేరలేదు. అయితే నానా, మహదాజీల మరణం తర్వాత మహరాష్ట్ర కూటమి విచ్ఛిన్నమై బహునాయకత్వము, అంతఃకలహాలు, క్రమశిక్షణారాహిత్యంతో నీరసమైంది. అట్టి పరిస్థితులలో వెల్లస్లీ ప్రభువు మహారాష్ట్ర నాయకులందరనూ రెండవ మహారాష్ట్ర యుద్ధంలో ఒకరి తర్వాత ఒకరిని ఓడించి వారిని సహాయ సంధులకు ఒప్పించి, వారి స్వాతంత్ర్యం హరించాడు. తర్వాత మహారాష్ట్ర నాయకులు కోల్పోయిన స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందటానికి చేసిన ప్రయత్నాన్ని లార్డ్ హేస్టింగ్స్ ప్రభువు 3వ మహారాష్ట్ర యుద్ధంలో విఫలంచేసి వారిని అణచివేయటంతో భారతదేశ సార్వభౌమత్వాధికారాన్ని ఆంగ్లేయులు పొందారు. మరాఠీ యుద్ధాలకు ముందు భారతదేశంలో అనేక రాజ్యాలలో ఒక రాజ్యాంగమున్న ఆంగ్లేయులు ఈ మూడు మహారాష్ట్ర యుద్ధాల అనంతరము భారతదేశ సార్వభౌములు కాగలిగారు.

**మాదిరి ప్రశ్నలు :**

1. మొదటి మహారాష్ట్ర యుద్ధమునకు దారితీసిన పరిస్థితులను, దాని ఫలితములను వివరింపుము.
2. ఆంగ్ల - మహారాష్ట్ర యుద్ధ కారణములు, ఫలితములను వివరింపుము.

**సమస్యాపూరిత ప్రశ్నలు :**

1. మహారాష్ట్ర రాజకీయములలో నానాఫడ్నవీస్ నిర్వర్తించిన పాత్ర ఎట్టిది ?
2. ఆంగ్ల - మహారాష్ట్ర యుద్ధాలలో మహారాష్ట్రుల పరాజయానికి కారణాలేమిటి ?
3. రెండవ మహారాష్ట్ర యుద్ధములో హోల్కార్ పాత్రను గూర్చి వ్రాయుము.

**లఘు ప్రశ్నలు :**

1. సూరత్ సంధి
2. రఘునాధరావు
3. వాడ్గాం సంధి
4. బేస్సిన్ సంధి
5. మహదాజీ సింధియా
6. సాల్బే సంధి

**చదువదగిన గ్రంథాలు :**


1. Cambirdge History of India - Vols. Iv & V
2. Gant Duff - History of Marathas
3. Kincaid & Parasnis - History of the Maratha People
4. Nelakantasastri - History of India Vol. III
5. Roberts - History of British India
6. Hatton - Marques Wellesly
7. Majumndar R.C. (ed) - Bharatiya Vidya Bhavan Series 'The Maratha Empire'
8. Majumdar R.C., Roychandari & Dutta - Advanced History of India.
9. B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao - Indian History and Culture Vol. III
10) అల్లాడి వైదేహి & పాటిబండ్ల ఝాన్సీలక్ష్మి - భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం)


పాఠ్య రచయిత : **కె.సి. గాంధీబాబు**

పాఠం - 17

# ఆంగ్లో - మైసూర్ యుద్ధములు : (క్రీ.శ. 1767 - 1799)

**విషయసూచిక**


17.0 లక్ష్యం

17.1 ఉపోద్ఘాతం

17.2 ప్రాచీన మైసూర్ చరిత్ర

17.3 హైదరాలీ (క్రీ.శ. 1722 - 1782)

17.3.1 మైసూర్ సైన్యంలో ఉద్యోగిగా

17.3.2 మైసూర్ నందు సర్వాధికారములు పొందుట

17.4 మొదటి ఆంగ్లో - మైసూర్ యుద్ధం (క్రీ.శ. 1767 - 1769)

ఎ) కారణాలు

బి) యుద్ధము

సి) సంధి షరతులు

17.5 రెండవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం (క్రీ.శ. 1780 - 1784)

ఎ) కారణాలు

బి) యుద్ధము

సి) సంధి షరతులు

17.6 టిప్పుసుల్తాన్ (క్రీ.శ. 1753 - 1799)

17.7 మూడవ ఆంగ్లో - మైసూర్ యుద్ధము (క్రీ.శ. 1790 - 1792)

ఎ) యుద్ధ కారణాలు

బి) యుద్ధము

సి) సంధి షరతులు

17.8 నాల్గవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం (క్రీ.శ. 1799)

ఎ) యుద్ధ కారణాలు

బి) యుద్ధం

సి) యుద్ధ ఫలితాల


## 17.0 లక్ష్యం :

ఆంగ్లేయులకు - మైసూర్ ప్రభువులకు మధ్య జరిగిన యుద్ధములు యుద్ధములకు గల కారణములు, ఇరువురి మధ్య కుదిరిన సంధులు, వాటి ఫలితాలు, మైసూర్ చరిత్రలో 'హైదరాలీ' 'టిప్పుసుల్తాను' లకు గల ప్రాధాన్యత మొదలగు అనేక విషయములను తెలుసుకొనుట ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 17.1 ఉపోద్ఘాతం :

క్రీ.శ. 1767 - 1799 సంవత్సరాల మధ్య ఆంగ్లేయులకు, మైసూర్ ప్రభువులకు మధ్య నాలుగు యుద్ధాలు జరిగినాయి. బెంగాల్, కర్ణాటకలలో ఆంగ్లేయులు యుద్ధాలు చేసి అక్కడి నవాబులను పదవి నుండి తొలగించి, తమకు అనుకూలురు అయిన

వారిని నవాబులుగా చేసి, ఈ నవాబులను తమచేతిలో కీలుబొమ్మలు వలె ఆడించి, పరోక్షంగా తమ అధికారంను చెలాయించుచూ, ఇతర సంస్థానాలకు భయాందోళనను కల్గించుచుండిరి. అటువంటి సంస్థానాలలో మైసూర్ ఒకటి.

దక్షిణ భారతదేశంలో ఆంగ్లేయులను ధైర్యంగా ఎదుర్కొన్న సంస్థానాలలో మైసూర్ ఒకటి. హైదరాలీ, టిప్పుసుల్తాన్ వరుసగా ఒకరి తరువాత ఒకరు ఆంగ్లేయులతో యుద్ధం చేసినారు. దేశాన్ని ఆంగ్లేయుల బారినుండి రక్షించుటకు, ఈ ఇద్దరు తమ జీవితాలను ధారపోసినారు. ఆంగ్లో - మైసూర్ యుద్ధాలు అనడానికి బదులుగా ఆంగ్లేయులకు - హైదరాలీకి, అటు తరువాత ఆంగ్లేయులకు - టిప్పుసుల్తాన్‌కు మధ్య జరిగిన యుద్ధాలు అని చెప్పుట సమంజసము. ఈ ఆంగ్లో - మైసూర్ యుద్ధాలలో చివరకు మైసూర్ ఆంగ్లేయులవశమై, సామంత సంస్థానంగా ఉండెను.

## 17.2 ప్రాచీన మైసూర్ చరిత్ర :

18 వ శతాబ్దారంభంనాటికి విజయనగర్ సామ్రాజ్యం అస్తమించి చిన్నాభిన్నమయింది. తదుపరి ఆ సామ్రాజ్యాన్ని పరిపాలించిన ఆరవీటి వంశంవారు మైసూర్‌ను పాలించసాగిరి. మైసూర్‌ను పాలించినవారిలో మొదటివాడు చిక్కదేవరాయులు. (క్రీ.శ. 1672 - '74). అతని తరువాత మూగవాడైన 'రెండవ కంఠీరవ నరస' (క్రీ.శ. 1704 - '13), తదుపరి 'రెండో దొడ్డ కృష్ణరాజు' (క్రీ.శ. 1713 - '31), 'ఏడవ చామరాజు' (క్రీ.శ. 1731 - '34) వరుసగా మైసూర్‌ను పరిపాలించిరి.

చామరాజు కాలంనుండి రాజులు మంత్రుల చేతులలో కీలుబొమ్మలై, వారు ఆడించినట్లుగా మారారు. అంతేకాక రాజులు ఎక్కువ దైవవిషయాలలో నిమగ్నులై పరిపాలనాబాధ్యత అంతా ముఖ్యమంత్రులకే వదిలిపెట్టేవారు. సంవత్సరానికి రెండు పర్యాయాలు మాత్రం వారు ప్రజలకు దర్శనం ఇచ్చేవారు. పేరుకు మాత్రం వారు రాజులుగా ఉండేవారు కాని అసలు రాజ్యాధికారం ప్రధానమంత్రులు వహించేవారు. ప్రధానమంత్రిని 'దైవ' అని పిలిచేవారు. ఈ పదవి రాచరికంవలె వంశపారంపర్యంగా గాక 'దైవ' పదవిగా మారెను. మొగల్ చక్రవర్తి అధికారంలో ఉన్నప్పుడు ఈ సంస్థానంనుండి 'చౌత్' (ఒక విధమైన పన్ను) వసూలుచేసే అధికారము మహారాష్ట్రులకు లభించెను. అంతకుమించి, ఈ సంస్థానం ఎవ్వరికి తలవంచకుండా స్వతంత్రంగానే ఉండేది. 'దైవ' పదవిని ఆలంకరించినవారిలో 'నంజరాజు' ముఖ్యుడు. అతడే 'హైదరాలీని' పైకితీసుకొచ్చినవాడు.

## 17.3 హైదరాలీ : (క్రీ.శ. 1722 - 1782)

హైదరాలీ క్రీ.శ. 1722 వ సంవత్సరములో మైసూర్‌లోని 'కోలారు' జిల్లాలోఉన్న 'బుడికోట' లో జన్మించెను. ఇతని తండ్రి ఫతేమహమ్మద్. ప్రసిద్ధిచెందిన 'కోరేష్' వంశానికి చెందినవాడు. వీరి పూర్వీకులు మతగురువులుగా ఉండి మతభోద చేసేవారు. ఆ వంశములో సైనికుడుగాచేరి జీవనోపాధిని కల్పించుకొన్న, మొదటివాడు ఫతేమహమ్మద్. అతడు కొంతకాలం ఆర్కాట్ నవాబువద్ద అటు తరువాత మైసూర్ మహారాజువద్ద సామాన్య సైనికుడుగాచేరి, క్రమేపి 'బిలాపూర్', 'కలన్‌కోట' కు సైన్యాధిపతి అయినాడు. ఒకసారి ప్రక్కరాజుతో యుద్ధం చేస్తుండగా అతడు మరణించినాడు. తండ్రి మరణించేనాటికి హైదరాలీకి మూడు సంవత్సరాల వయస్సు. అతనిని, అన్నను, విధవరాలైన తల్లిని, ఖైదీలుగా తీసుకొని వెళ్లగా, శ్రీరంగపట్నంలో మైసూర్ సైన్యంలో ఒక ముఖ్యఉద్యోగి అయిన అతని బంధువు, శత్రురాజుకు ధనమిచ్చి, వారి ముగ్గురినీ విడిపించాడు. అతని పెంపకంలో హైదరాలీ, అతని అన్న యుద్ధవిద్యలలో నైపుణ్యం సంపాదించినారు. కొద్దికాలానికి వారికి సైన్యంలో ఉద్యోగాలు లభించినాయి.

### 17.3.1. మైసూర్ సైన్యంలో ఉద్యోగిగా :

క్రీ.శ. 1750 నాటికి హైదరాబాదులో వారసత్వ యుద్ధం జరగగా, 'ముజఫర్‌జంగ్' ఫ్రెంచివారి, మైసూర్ ప్రభువుల సహాయం కోరినాడు. ముజఫర్ జంగ్‌కు సహాయంగా వెళ్ళిన మైసూర్ సైన్యంలో హైదరాలీ కూడా ఉన్నాడు. అక్కడ జరిగిన యుద్ధాలన్నిటిలో, అతడు తన శక్తిసామర్థ్యములను ప్రదర్శించి, మంచి పేరు సంపాదించాడు. 'దైవ' స్థానంలో ఉన్న నంజరాజు అతనిని మెచ్చి,

'దిండిగల్' సైన్యానికి 'ఫౌజ్‌దార్'గా నియమించినాడు. ఫ్రెంచివారితో చేరి అనేక పర్యాయాలు ఆంగ్లేయులతో యుద్ధం చేయుటవలన హైదరాలీ, విదేశీయుల కిటుకులు, సైన్యంనందలి క్రమశిక్షణ మొదలగు విషయములను తెలుసుకొని, తన సైన్యమునకు ఫ్రెంచివారిచేత శిక్షణ ఇప్పించి, బలమైన సైన్యమును తయారుచేసెను.

### 17.3.2. మైసూర్‌నందు సర్వాధికారములు పొందుట :

హైదరాలీకి మైసూర్ సంస్థానంలో మంచిపేరు, హోదా లభించినాయి. నంజరాజుకు హైదరాలీ పైకిరావటం అంతగా నచ్చలేదు. ప్రతి విషయంలోనూ నంజరాజు హైదరాలీకి అడ్డుపడుతూ వచ్చేవాడు. ఇట్టి సమయంలో హైదరాలీ సలహామేరకు 'ఖండేరావు' అనే మహారాష్ట్ర బ్రాహ్మణుని మైసూర్ రాజమంత్రిగా నియమించెను. ఖండేరావు స్వార్థపరుడు. అతడు 'దైవ' గా ఉన్న నంజరాజును పదవినుండి తొలగించి, తనే 'దైవ' గా ప్రకటించుకొనెను. పైగా తనకు సహాయంచేసిన హైదరాలీని, మైసూరు రాజును మోసం చేసి, రహస్యంగా మహారాష్ట్రులను, మైసూర్‌పై దండెత్తి రావలసినదిగా పురికొల్పెను. ఈ చర్యకు నంజరాజు కూడా పరోక్షంగా కారకుడయ్యెను. ఇట్టి సమయములో హైదరాలీ నంజరాజును రాజుతో చెప్పి ఖైదుచేసి, కొన్నాళ్ళు తరువాత, అతనిని చంపించి, నామమాత్రంగా రాజును సింహాసనంపైఉంచి, తానే రాజుగా హైదరాలీ అన్ని వ్యవహారాలను చూసుకుంటూ, మైసూర్ రాజ్యానికి సర్వాధికారి అయినాడు. అతని ధైర్యసాహసాలకు మెచ్చి, మొగల్ చక్రవర్తి అతనిని మైసూర్‌కు దగ్గరగా ఉన్న 'సీరా' రాష్ట్రమునకు సుబేదారుగా నియమించినాడు.

## 17.4. మొదటి మైసూర్ యుద్ధము : (క్రీ.శ. 1767 - 1769)

### 17.4.1. కారణాలు :

1) సామాన్యుడయిన హైదరాలీ ఫ్రెంచివారి సహాయంతో సైన్యాలను తయారుచేసి, మైసూర్ రాజ్యాన్ని విస్తరింపచేయుటకు ప్రయత్నించుట.
2) హైదరాలీ బెద్నూర్, సుంద, సీరా, కెనరా, గుత్తి మొదలగు ప్రాంతములను ఆక్రమించి, అప్పటి 'పాలిగార్లు' ను అణిచివేయుట.
3) పీష్వా మొదటి మాధవరావు మరణానంతరం, బళ్ళారి, కడప, కృష్ణా, తుంగభద్ర మధ్యఉన్న మహారాష్ట్ర ప్రాంతములను ఆక్రమించి, వారి నుండి 2 లక్షల రూపాయలు కప్పం పొందుట.
4) హైదరాలీ చర్యలను అరికట్టుటకు ప్రయత్నించిన మహారాష్ట్రులు, నైజామ్ అతని చేతిలో ఓడిపోవుట.
5) ఆంగ్లేయ మద్దతుదారుడైన కర్ణాటక నవాబు మహమ్మద్ ఆలీ అన్న, శత్రువు అయిన 'మవూజ్‌ఖాన్' కు హైదరాలీ రక్షణ ఇచ్చుట.
6) అటులనే చందాసాహెబు కొడుకయిన రాజసాహెబుకు కూడా హైదరాలీ తన సంస్థానంలో ఉద్యోగమిచ్చుట.

ఈ విధంగా హైదరాలీ తన రాజ్యాన్ని విస్తరింపజేయుట, వారి శత్రువులకు రక్షణ ఇచ్చుట, మొదలగు చర్యలు ఆంగ్లేయులకు హైదరాలీ పై కోపం తెప్పించి, అతనిని అణిచివేయుటకు ప్రయత్నింపచేసెను. హైదరాలీకి ఆంగ్లేయులపై కోపం రావటానికి ప్రధానకారణం మైసూర్ రాజ్యాన్ని విస్తరింపచేయకుండా వెల్లూరులో ఆంగ్లసైన్యం అడ్డుగా ఉండుట. పై కారణములే మొదటి మైసూర్ యుద్ధంనకు దారితీసెను.

**17.4.2. యుద్ధము :** మొదట మహారాష్ట్రులను ఆంగ్లేయులు హైదరాలీపై పంపినారు. కాని హైదరాలీ వారిని తిరగగొట్టడమే కాకుండా, వారికి కొంచెము ధనంకూడా ఇచ్చి, ఆంగ్లేయులతో వారు కలియకుండా ఉండేటట్లు ఒప్పందము కుదుర్చుకొనెను. 'మవూజ్‌ఖాన్' రహస్యంగా నైజామ్‌తోచేరి, అతనికి, హైదరాలీకి సంధి కుదిర్చెను.

క్రీ.శ. 1767 లో కర్నల్ స్మిత్ హైదరాలీని 'చంగామా', 'ట్రింకోమలై' ప్రాంతాలలో ఓడించినాడు. హైదరాలీ ఓడిపోగానే నైజామ్ ఆంగ్లేయుల పక్షం చేరినాడు.

ధైర్యసాహసాలున్న హైదరాలీ, నైజామ్ తనను వదలిపెట్టినా, తనకు కొన్ని ప్రదేశాలలో అపజయము కలిగినా అధైర్యపడక, బొంబాయి నుండి వచ్చిన బ్రిటీష్ సేనలను తిరగగొట్టి, క్రీ.శ. 1769 లో మంగళూరును స్వాధీనము చేసుకొని, వెంటనే మద్రాసుకు అయిదుమైళ్ళ దూరంవరకు వచ్చి ఆంగ్లేయుల నెదిరించాడు. యుద్ధానికి సిద్ధంగాలేని బ్రిటీష్‌వారు హైదరాలీతో 'మద్రాసు సంధిని' చేసుకొనిరి. ఇట్లు మొదటి మైసూర్ యుద్ధము క్రీ.శ. 1769 లో జరిగిన 'మద్రాసు సంధి' తో ముగిసెను.

**17.4.3. సంధి షరతులు :** మొదటి మైసూర్ యుద్ధం వలన హైదరాలీకిగాని, ఆంగ్లేయులకుగాని పెద్దగా ఏవిధమైన లాభము చేకూరలేదు. 1) మొదటి మైసూర్ యుద్ధకాలంలో ఒకరివి, మరొకరు స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలు, ఎవరివి, వారికి ఇచ్చి వేయవలెను. 2) కర్ణాటక నవాబు స్వాధీనంలోఉన్న 'కరూరు' రాష్ట్రం హైదరాలీకి సంక్రమించెను. 3) అటులనే ఇరువురూ యుద్ధఖైదీలను విడుదల చేయవలెను. 4) యుద్ధ నష్టపరిహారముగా ఆంగ్లేయులు హైదరాలీకి తగిన ధనం ముట్ట చెప్పవలెను. 5) ఏ సందర్భంలోనైనా, వారిద్దరిలో ఎవరినైనా, మూడవవాడు ఎదిరించినట్లయితే ఇరువురు ఒకరికొకరు సహాయం చేసుకొనవలెను.

యుద్ధకాలంలో హైదరాలీకి చెందిన యుద్ధసామాగ్రి ఓడను బొంబాయిలో ఆంగ్లేయులు పట్టుకొనిరి, దానిని తిరిగి ఈ మద్రాసు సంధి ప్రకారం హైదరాలీకి ఇచ్చుట జరిగెను. హైదరాలీకి, కర్ణాటక నవాబుకు మధ్య జరిగిన ఒప్పందములను కూడా ఆంగ్లేయులు మన్నించిరి. మహమ్మద్ ఆలీ మైసూర్ రాజులకు సామంతుడుగాఉండి, ఏటా ఆరులక్షల రూపాయలు కప్పము మైసూరు దర్బారుకు కట్టవలెను. ఇట్లు మొదటి మైసూర్ యుద్ధం వలన ఇరువురికి ఏవిధమైన లాభము చేకూరలేదు. కాని సామాన్య సైనికుడుగా ఉండిన హైదరాలీ ఉన్నత స్థానమునకు ఎదిగి, ఆంగ్లేయులను ఆజ్ఞాపించదగిన స్థాయిని పొందుట ఈ మొదటి ఆంగ్లో - మైసూర్ యుద్ధ ప్రత్యేకతగా చెప్పవచ్చును.

## 17.5. రెండవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం : (క్రీ.శ. 1780 - 1784)

క్రీ.శ. 1769 లో హైదరాలీకి, ఆంగ్లేయులకు మధ్య జరిగిన 'మద్రాస్ సంధి' తాత్కాలికంగా యుద్ధం విరమించడానికి తోడ్పడిందేకాని, ఆంగ్లేయులకు, హైదరాలీకి మధ్య శాశ్వత స్నేహమును కుదర్చలేదు. హైదరాలీ మొదట్లో ఈ సంధికి ప్రాముఖ్యత ఇచ్చినా, త్వరలోనే ఆంగ్లేయులు ఉద్దేశం గ్రహించి, వారిపై కోపం పెంచుకొనెను. ఏదో ఒకవిధంగా హైదరాలీతో తిరిగి యుద్ధం చేయటానికి ఆంగ్లేయులు సిద్ధపడుచుండిరి. వారిద్దరి అభిప్రాయాలకు రూపకల్పనే రెండవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం.

### 17.5.1. కారణాలు :

1) క్రీ.శ. 1770 లో మహారాష్ట్రులు మైసూర్‌పై దండెత్తిరాగా, మద్రాస్ సంధిని పురస్కరించుకొని హైదరాలీ ఆంగ్లేయుల సహాయం కోరగా, ఆంగ్లేయులు హైదరాలీకి ఎటువంటి సహాయం చేయకపోవుట.

2) క్రీ.శ. 1770 లో ఆంగ్లేయులు 'ఒనోర్'లో ఒక కర్మాగారం నిర్మించి, మలబార్ కోస్తాలో ఉండే చందనకట్టె, మిరియాలు, పూర్తిగా ఆంగ్లేయులకే విక్రయించేటట్లు, దానికి బదులుగా బొంబాయి ప్రభుత్వం హైదరాలీకి, అవసర సమయంలో యుద్ధసామాగ్రి సరఫరా చేసేటట్లు ఒక ఒడంబడిక చేసుకొనెను.

కాని హైదరాలీకి, మహారాష్ట్రులకు మధ్య యుద్ధం జరుగుతున్న కాలంలో హైదరాలీ పై ఒడంబడికను పురస్కరించుకొని బొంబాయి ప్రభుత్వంను యుద్ధసామాగ్రి సరఫరా చేయమని కోరగా, వారు అతని కోరికను తిరస్కరించారు. ఈ చర్య కూడా రెండో ఆంగ్లో - మైసూర్ యుద్ధంనకు కారణమైంది.

3) అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులకు, ఫ్రెంచివారికి మధ్య సంఘర్షణ ఏర్పడెను. ఈ సంఘర్షణ వారి వలస ప్రాంతాలలో కూడా ఏర్పడెను.

ఇట్టి సమయములో ఆంగ్లేయుల సహాయం పొందలేకపోయిన హైదరాలీ, ఫ్రెంచివారి సహాయం కోరెను. ఫ్రెంచివారు ఆంగ్లేయులతోగల శత్రుత్వమును పురస్కరించుకొని హైదరాలీకి సహాయం చేయుటకు అంగీకరించిరి.

4) హైదరాలీ ఆధీనంలో ఉన్న మలబార్ కోస్తాలోని 'మహి' అనే రేవుపట్టణాన్ని ఫ్రెంచివారు తమ స్వాధీనంలో ఉంచుకొనిరి. ఈ రేవుద్వారా హైదరాలీ ఎన్నో వస్తువులను విదేశాలకు ఎగుమతిచేసి అవసర సమయములలో ఐరోపానుండి ఈ రేవుద్వారా యుద్ధసామాగ్రి దిగుమతి చేసుకొనేవాడు.

ఆంగ్లేయులు ఫ్రెంచివారిని, హైదరాలీని దెబ్బతీయుటకు పాండిచ్చేరిని ఆక్రమించి, 'మహి'ని కూడా వశపర్చుకొనుటకు ప్రయత్నించగా, హైదరాలీ ఆంగ్లేయులకు 'మాహి'ని వశపర్చుకొనవద్దని కోరినాడు, కాని ఆంగ్లేయులు 'మహి'ని ముట్టడించడానికి తీర్మానించుకొన్నారు. ఆంగ్ల సైన్యం 'మహి' చేరాలంటే మైసూర్ ద్వారానే పోవాలి, వారు పోకూడదనే ఆజ్ఞ ఉన్నా, అనుమతికోసం వారు వేచిఉండక మాహిని ముట్టడించిరి.

హైదరాలీ ఫ్రెంచివారి సహాయంతో 'మాహి'ని కాపాడి, ఫ్రెంచి పతాకము 'మాహి'పై ఎగురవేయించెను. ఈ చర్య కూడా రెండో ఆంగ్లో - మైసూర్ యుద్ధంనకు కారణమయ్యెను.

**17.5.2. యుద్ధము :** క్రీ.శ. 1780 జూలై నెలలో హైదరాలీ ఆంగ్లేయులపై యుద్ధం ప్రకటించి 'ఆర్కాటు'ను ముట్టడించి 'కల్నల్ బైలీ' నాయకత్వంలో మద్రాస్ నుండి పంపబడిన ఆంగ్లసైన్యమును హైదరాలీ కుమారుడు టిప్పుసుల్తాను చిత్తుగా ఓడించెను.

దీనితో ఆగ్రహించిన వారన్ హేస్టింగ్స్ నిజాం, మహారాష్ట్రులతో కలసి 'సర్ ఐర్ కూట్' నాయకత్వంలో పెద్ద సైన్యాన్ని మైసూర్‌పైకి పంపెను. క్రీ.శ. 1781 లో 'పోర్టోనాలో' యుద్ధంలో హైదరాలీ ఓడిపోయెను. వందవాసి, 'పెర్మకొయిల్'లు ఆంగ్లేయులకు వశమైయ్యెను. దురదృష్టవశాత్తు క్రీ.శ. 1782 లో క్యాన్సర్ వ్యాధితో హైదరాలీ మరణించెను. దీనిని అవకాశంగానెంచి ఆంగ్లేయులు టిప్పుసుల్తాన్‌పై యుద్ధం తీవ్రతరం చేసిరి. ఆంగ్ల సైన్యాన్ని వారన్ హేస్టింగ్స్ రెండుగా విభజించి ఏకకాలంలో టిప్పుపైకి పంపెను. 'హానోవర్', బెంగుళూర్, బెద్నూరు, దిండిగల్లు, కోయంబత్తూరు, పాలఘాటులు ఆంగ్లేయులు వశపరచుకొనిరి. రాజధాని శ్రీరంగపట్టణం ముట్టడించడానికి ఆంగ్ల సైన్యము బయలుదేరెను. ఇంతలో మద్రాస్ గవర్నర్ మెకార్టినీ ప్రభువుతో టిప్పుసుల్తాన్ క్రీ.శ. 1784 సంధి కుదుర్చుకొనెను. యుద్ధం మంచిపట్టులో ఉండగా, యుద్ధమును విరమించటం వారన్ హేస్టింగ్స్‌కు నచ్చలేదు. ఇట్లు రెండుపక్షాల వారికి ఏవిధమైన లాభం చేకూరకుండ రెండో ఆంగ్లో - మైసూర్ యుద్ధం ముగిసింది.

**17.5.3. సంధి షరతులు :**

క్రీ.శ. 1784 లో ఆంగ్లేయులకు, టిప్పుసుల్తాన్‌కు మధ్య జరిగిన 'మంగుళూరు' సంధి ద్వారా రెండో ఆంగ్లో - మైసూర్ యుద్ధం ముగిసింది. ఈ సంధి ఇదివరకు ఆంగ్లేయులకు - మైసూర్ ప్రభువులకు మధ్య జరిగిన మద్రాస్ సంధినే బలపరిచింది. టిప్పుసుల్తాన్ గెలుచుకొన్న కర్ణాటకము ఆంగ్లేయులకిచ్చివేసేటట్లు, మైసూర్‌లో ఆంగ్లేయులు ఆక్రమించుకొన్న ప్రాంతములను టిప్పుకు ఇచ్చివేసేటట్లు మంగుళూరు సంధి షరతులోని ముఖ్యాంశాలు.

## 17.6. టిప్పుసుల్తాన్ (క్రీ.శ. 1753 - 1799) :

ఆంగ్లేయులకు, మైసూర్‌కు మధ్య జరిగిన మూడు, నాలుగు, మైసూర్ యుద్ధాలలో ముఖ్యపాత్ర వహించినవాడు టిప్పుసుల్తాన్.

క్రీ.శ. 1753 లో దేవనహళ్ళిలో టిప్పు జన్మించెను. అతని తల్లి 'ఫకీరున్నీసా'. ఆమె తండ్రి కడప గవర్నరుగా ఉండేవాడు. కనుక తన కుమారుడు గొప్ప పదవిలోకి రావలెనని, దానికి తగిన ప్రోత్సాహమిచ్చి టిప్పును గొప్ప యోధుడుగాను, సమర్థుడుగాను ఆమె తయారుచేసెను.

తండ్రి చనిపోయిన వార్త చాలా రోజులవరకు పొక్కనీయకుండా చేసిన దివాన్ 'పూర్ణయ్య' వివేకం వలన, టిప్పు ఆంగ్లేయులతో ధైర్యంగా ఎదిరించి యుద్ధం చేసినాడు.

టిప్పుసుల్తాన్ పరమతద్వేషి అని, ఎంతోమందిని తన మతంలోకి బలవంతంగా చేర్పించినాడని, చరిత్రకారులు పేర్కొనిరి. మంగుళూరు ముట్టడిలో బలవంతంగా 30 వేలమందిని తన మతంలోకి మార్చినట్లు తెలియుచున్నది.

క్రీ.శ. 1784 లో 'సుల్తాన్' అనే బిరుదు ధరించెను. కెనరా, మలబార్, ప్రాంతాలలోని హిందువులను, మహమ్మదీయులను పోర్చుగీసువారు క్రైస్తవమతంలోకి మార్పించుచున్నారు అని వారిని శ్రీరంగపట్టణం నుండి పంపివేసెను. ఇతడు పుంగనూరు, మదనపల్లి, కొడుగు ప్రదేశాలను జయించుట, మహారాష్ట్రులకు, నైజాంకు భయంను కలిగించెను. వారు టిప్పుపై దండెత్తిరాగా, టిప్పు చాకచక్యంతో వారిని ఓడించి, ఆదోని, కంచనఘర్, సుంటూరు, కంప్లి, మొదలైన కోటలను వశపరచుకొనెను.

టిప్పుసుల్తాన్ ఎంత క్రూరుడయినా 'స్త్రీ' లను గౌరవించెడివాడు. పైన చెప్పిన కోటలను ముట్టడించునప్పుడు తన సైనికులు స్త్రీలపై అత్యాచారములు జరిపితే, వారిని కఠినంగా శిక్షించెను. అటులనే అనేకమంది మహారాష్ట్ర నాయకులు యుద్ధంనుండి పారిపోతూ తమ స్త్రీలను విడిచిపోగా, సుల్తాన్ ఆ స్త్రీలను సగౌరవముగా సన్మానించి, "ఇంకెప్పుడూ మా భర్తలు సుల్తానుపై యుద్ధంనకురారు, అని వారిచే ఒట్టు వేయించుకొని" వారిని వారి భర్తల దగ్గరకు పంపెను.

టిప్పుసుల్తాన్ ప్రజాక్షేమముననుసరించి, అనేక సంస్కరణలు చేసెను. ముఖ్యంగా లంచగొండితనాన్ని నిర్మూలించెను. తన పేరున నాణెములను ముద్రించెను. విదేశీ వ్యాపారంను ప్రోత్సహించెను. తొమ్మిదిమంది సభ్యులుగల ఒక బోర్డును వ్యాపార విషయాలు చూడటానికి నియమించెను. కొత్త కాలెండరును ప్రవేశపెట్టినాడు. సరైన తూకము - కొలతలు అమలుపరచెను. సైన్యమునందలి లోపములను సవరించి, సైనికుల, అధికారుల విధులను ఒక పుస్తకంలో ప్రచురించెను. అతనికి ఆంగ్లేయులపట్ల ద్వేషమే మూడో ఆంగ్లో - మైసూర్ యుద్ధమునకు కారణమైంది. "మైసూర్ పులి" (Tiger of Mysore) అని బిరుదుపొందెను.

## 17.7. మూడవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం : (క్రీ.శ. 1790 - 1792)

మనదేశమున ఆంగ్ల అధికారమును అంతము చేయుటయే టిప్పు జీవితాశయము. కనుకనే ఆంగ్ల శత్రువులైన ఫ్రెంచివారితో టిప్పు స్నేహము చేసెను.

### 17.7.1. యుద్ధకారణాలు :

1) టిప్పుసుల్తాన్ 'మంగుళూరు' సంధిని అవమానముగా భావించి, ఆంగ్లేయులను తరిమివేయుటకు ఫ్రెంచివారి సహాయము, కాన్‌స్టాన్‌టినోపుల్ పరిపాలించు తురుష్కుల సహాయమును ఆర్జించెను. కానివారు టిప్పుకు సహాయము చేయుటకు అంగీకరించలేదు. కాని టిప్పు ఆంగ్లేయులతో యుద్ధం చేయడానికి నిశ్చయించుకొనెను.

2) టిప్పుసుల్తాన్ మహారాష్ట్రులపట్ల అతిక్రూరంగా వ్యవహరించుట, అతని చర్యలకు భీతిల్లి, నిజామ్, గుంటూరు సర్కారును ఆంగ్లేయులు పరంచేయుచూ, తనకు అవసర సమాయాలలో సైనిక సహాయం చేయవలసిందిగా 'కారన్ వాలిస్'ను అభ్యర్థించెను.

3) మొదట ఆంగ్లేయులు తటస్థ విధానాన్ని అనుసరించి, స్వదేశీ రాజుల వ్యవహారాలలో జోక్యం కలుగచేసుకోమని, తదుపరి, మంగుళూరు సంధి షరతులు ఉల్లంఘించి, నైజామ్‌కు సహాయం చేయుటకు అంగీకరించి, ఆంగ్ల మిత్రరాజ్యముల జాబితాను తయారుచేసిరి. అందులో టిప్పు పేరు లేకపోవుట వలన టిప్పు ఉగ్రుడై ఆంగ్ల మిత్రరాజ్యమైన తిరువాన్కూరుపై దండెత్తెను. కారన్‌వాలీస్ మహారాష్ట్రులతోను, నిజామ్‌తోను త్రైపాక్షిక సంధి చేసుకొని, టిప్పుపై యుద్ధం ప్రకటించెను. దీనితో మూడవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం ప్రారంభమయ్యెను.

### 17.7.2 యుద్ధం :

క్రీ.శ. 1790 జూలై 4వ తేదీన ఆంగ్లేయులకు, టిప్పుసుల్తానుకు మధ్య యుద్ధం ప్రారంభమయ్యెను. కారన్‌వాలిస్ ప్రభువు నైజామ్ నుంచి గుంటూరు సర్కారును పొంది అతనితోను, మహారాష్ట్రులతోను పరస్పర సహాయ త్రైపాక్షిక సంధి చేసుకొన్నాడు.

కారన్‌వాలిస్ తన సైన్యమును రెండు భాగములుగా విభజించి ఒక భాగాన్ని 'మెడోస్' క్రింద, రెండో భాగం తానే నడిపేటట్లు ఏర్పాటు చేసినాడు. 'మెడోస్' కోయంబత్తూరు, దిండిగల్లు, పాలఘాట్ లను పట్టుకొనగా, కారన్‌వాలిస్ వెల్లూరు, అంబూరులు మీదుగా బెంగుళూరు వరకు వెళ్ళినాడు. అంతలో బొంబాయినుంచి ఆంగ్ల సైన్యము, అతనికి సహాయానికి రాగా అతడు క్రీ.శ. 1792 లో శ్రీరంగపట్టణాన్ని ముట్టడించి, టిప్పుతో పోరాడినాడు. టిప్పు ఒంటరి వాడయినందువల్ల ఎంతో చాకచక్యంతో పోరాడినా ఆంగ్లేయులచేత ఓడిపోయి శ్రీరంగపట్టణం దగ్గర వారితో సంధి చేసుకొనెను. ఈ విధంగా మూడో ఆంగ్లో - మైసూర్ యుద్ధం ముగిసింది.

### 17.7.3. సంధి షరతులు :

మూడో ఆంగ్లో - మైసూర్ యుద్ధం క్రీ.శ. 1792 లో 'శ్రీరంగపట్టణం' సంధి ద్వారా ముగిసినది. ఈ సంధి ప్రకారం టిప్పుసుల్తాను తన రాజ్యంలో సగభాగం శత్రువుల కిచ్చివేసేటట్లు ఒప్పుకున్నాడు. కృష్ణ, పెన్నా నదుల మధ్య ఉన్న భూభాగము నైజామ్‌కు, అక్కడినుంచి తుంగభద్రానది వరకు గల ప్రాంతము మహారాష్ట్రులకు చెందేటట్లు ఆంగ్లేయులు ఏర్పాటు చేసినారు.

మహారాష్ట్రులు, నైజామ్ ఆంగ్లేయుల కెంతో సహాయపడినందుకు పారితోషికముగా ఈ ఏర్పాటు జరిగింది. ఆంగ్లేయులు దిండిగల్లు, బారామహల్ జిల్లాలు మాత్రం ఉంచుకొన్నారు. అంతేకాక టిప్పుసుల్తాను ఆంగ్లేయులకు యుద్ధ నష్టపరిహారం క్రింద మూడు కోట్ల ధనం చెల్లించడానికి, అది చెల్లించేవరకు అతని కొడుకులు ఇద్దరిని ఆంగ్లేయులు వశంలో ఉంచడానికి ఒప్పుకొనెను. ఇట్లు టిప్పు కోరలుతీసిన పాము అయ్యెను. కారన్‌వాలిస్ మాటలలో చెప్పవలెనన్న "మన మిత్రులు (నిజామ్, మహారాష్ట్రులు) మిగులు బలవంతులు కాకుండా, మన శత్రువును (టిప్పుసుల్తాన్‌ను) చావుదెబ్బ తీసితిమి".

## 17.8. నాల్గవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం (క్రీ.శ. 1799) :

మూడవ మైసూర్ యుద్ధమున పరాజితుడైన, అసమానకరమైన శ్రీరంగపట్నం సంధికి అంగీకరించిన టిప్పుసుల్తాన్ ఆంగ్లేయులపై కసి తీర్చుకొనవలెనని ప్రయత్నించుటయే నాల్గవ ఆంగ్లో - మైసూర్ యుద్ధంనకు దారితీసెను.

### 17.8.1. యుద్ధకారణాలు :

1) టిప్పుసుల్తాన్ తన సైన్యమును బలపరుచుకొని, కోటలను మరమ్మతుచేసి, ఆంగ్ల శత్రువులతో సంధి సంప్రదింపులు జరుపుట.

2) ఆంగ్లో - ఫ్రెంచి సంఘర్షణను పురస్కరించుకొని ఆంగ్ల వ్యతిరేకి అయిన ఫ్రెంచి చక్రవర్తి 'నెపోలియన్ బోనా పార్టీ' తో సంధి కుదుర్చుకొనుట.

3) టిప్పుసుల్తాన్ మతమనే మిషతో ఇస్లామ్ ప్రాంతాలయిన అరేబియా, కాన్‌స్టాన్‌టినోపుల్, కాబూల్ ప్రభువుల సహాయం కోరుట. కాబూల్ అమీర్ 'జమాన్‌షా' ఇండియాపై దండెత్తి వచ్చుటకు యుద్ధ సన్నాహాలు చేస్తున్నట్లు ఆంగ్లేయులకు వార్త తెలియుట.

అంతట వెల్లస్లీ అటువంటి ఆంగ్ల వ్యతిరేక చర్యలను విరమించవలసిందిగ, టిప్పుసుల్తాన్‌ను కోరినాడు. కాని టిప్పుసుల్తాన్ ఈ కోరికను మన్నించలేదు. పై కారణములు నాల్గవ ఆంగ్లో - మైసూరు యుద్ధం అనివార్యమయ్యెను. అయితే నాల్గవ ఆంగ్లో - మైసూర్ యుద్ధంనకు పూర్తి బాధ్యత టిప్పుసుల్తాన్‌దేకాదు, అందు ఆంగ్లేయుల బాధ్యత కూడా కలదు. ముఖ్యంగా వెల్లస్లీ సైన్యసహకార పద్ధతి (అనగా స్వదేశీ రాజుల రక్షణార్థం ఆంగ్ల సైన్యం స్వదేశీ సంస్థానములలో ఉండును, దానికి అగు ఖర్చును వారే భరించవలెను.) అమలు జరుపుట. ఆత్మగౌరవంగల టిప్పు వ్యతిరేకించుట, అంతట యుద్ధం తప్పలేదు.

### 17.8.2. యుద్ధం :

వెల్లస్లీ నిజాంతోను, మహారాష్ట్రులతోను సంధి చేసుకొని క్రీ.శ. 1799 లో మైసూర్ పై యుద్ధం ప్రకటించెను. వెల్లస్లీ సోదరుడు ఆర్థర్ వెల్లస్లీ, నైజాం సేన సహాయంతో, తూర్పునుండి స్టూవర్ట్ సేనాని బొంబాయి సేన సహాయంతో పశ్చిమ నుండి మైసూర్ పై

దండెత్తినాడు. శ్రీరంగపట్టణానికి 40 మైళ్ళ దూరంలో గల 'సిద్దేశ్వర' కనుమవద్ద క్రీ.శ. 1799 మార్చి 5వ తేదీన 'మాలవల్లి' దగ్గర, మార్చి 27న స్టూవర్ట్, హారిస్‌ల చేతులలో వరుసగా టిప్పు ఓడిపోయెను. టిప్పు ఓడిపోయి సంధికి ఒప్పుకుంటూ ఆంగ్లేయులకు వర్తమానం పంపెను. కాని సంధి షరతులు చాలా అవమానకరంగా ఉండెను. దానితో టిప్పు తన ప్రాణాలయినా బలిచేయడానికి సిద్ధపడెను.

ఆంగ్లేయులు టిప్పుకోటలో ప్రవేశించి ఎంతో కష్టంగా అతనిని ఓడించి, చంపిరి. ఈ విధంగా టిప్పు మరణంతో నాల్గవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం ముగిసినది.

### 17.8.3. యుద్ధ ఫలితాలు :

శ్రీరంగపట్టణంతో సహా మైసూర్ ఆంగ్లేయుల వశమయింది. ఈ విజయానంతరము టిప్పు రాజ్యములోని అత్యధిక భాగమును అనగా కెనరా, నీలగిరి, కోయంబత్తూరు జిల్లాలను, శ్రీరంగపట్టణం మొదలైన ప్రాంతములను వెల్లస్లీ ఆక్రమించి ఆంగ్ల సామ్రాజ్యమున చేర్చినాడు. మిగిలిన మైసూర్ రాజ్యమును పూర్వపు హిందు 'ఒడయారు' వంశానికి చెందిన క్రిష్ణరాజ ఒడయారునకు ఇచ్చెను. క్రిష్ణరాజ ఒడయార్ ఆంగ్లేయుల సైన్యసహకార పద్ధతిని అంగీకరించెను. నిజాంకు దత్త మండలములు (కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు) లభించెను. "సైనికముగ, ఆర్థికముగ, స్నేహశాంతుల దృష్ట్యా మైసూర్ విజయం క్లైవు అనంతరం ఆంగ్లేయులు సాధించిన మహోజ్వల విజయము" అని 'డిన్ హట్టన్' పండితుడు పేర్కొనెను. నాల్గవ మైసూర్ యుద్ధానంతరము ఆక్రమించిన ప్రాంతములను, ఉత్తర సర్కారులను, కర్ణాటకమును కలిపి 'మద్రాస్ రాష్ట్రము'గ ఏర్పరచి వెల్లస్లీ మద్రాస్‌రాష్ట్ర నిర్మాత అయినాడు.

### మాదిరి ప్రశ్నలు :

1) హైదరాలీ తొలిజీవితం, అతడు మైసూర్‌నందు సర్వాధికారములు ఎట్లు వశపరచుకొనెను. వివరింపుము.
2) ఆంగ్లో - మైసూర్ యుద్ధములను వర్ణింపుము.

### వ్యాసరూప ప్రశ్నలు :

1) టిప్పుసుల్తాన్
2) శ్రీరంగపట్టణం సంధి
3) మంగుళూరు సంధి

### చదువదగిన గ్రంధాలు :

1) ఆధునిక భారతదేశ చరిత్ర (1757 - 1947) - డా॥ శ్రీమతి అల్లాడి వైదేహి
2) భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయభాగం) - డా॥ పాటిబండ ఝాన్సీలక్ష్మి మరియు డా॥ శ్రీమతి అల్లాడి వైదేహి
3) History of India - Vol. I & II & III - K.A. Neelakantha Sastry
4) Advance History of India Vol. II & III - Ray Chowdary, Mazumdar & Gupta

Author : **C. RAVINDRA RAJU**

పాఠం - 18

# శిక్కులు - రంజిత్‌సింగ్

విషయసూచిక

18.0 లక్ష్యం
18.1 ఉపోద్ఘాతం
18.2 రాజకీయ చరిత్ర
18.3 మహారాజ రంజిత్‌సింగ్ (క్రీ.శ. 1780 - 1839)
18.3.1 తొలిజీవితం
18.3.2 లాహోర్ రాజగుట (1738)
18.3.3 మాళ్వా ఆక్రమణ (1806)
18.3.4 ఆంగ్లేయులతో సంబంధములు
18.3.5 అమృతసర్ సంధి (1809)
18.3.6 ఇతర ఆక్రమణలు
18.3.7 సామ్రాజ్య విస్తీర్ణము
18.3.8 పరిపాలనా సంస్కరణలు
ఎ) కేంద్ర ప్రభుత్వము
బి) రాష్ట్ర ప్రభుత్వము
సి) ఆర్థిక పరిస్థితులు
డి) సైనిక సంస్కరణలు
ఇ) న్యాయ సంస్కరణలు
18.3.9 ఘనత
18.3.10 ముగింపు

## 18.0 లక్ష్యం :

శిక్కు మతస్థాపకుడెవరు ? శిక్కుల రాజకీయ చరిత్రను, శిక్కు చరిత్రలో రంజిత్‌సింగ్‌కు గల ప్రాధాన్యతను, మనదేశ చరిత్రలో శిక్కులకు గల ప్రాముఖ్యతను మొదలగు అంశములను తెలుసుకొనుట ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 18.1 ఉపోద్ఘాతం :

ఆధునిక భారతదేశ చరిత్రలో శిక్కులకు ప్రముఖస్థానం ఉంది. వీరు అత్యంత ధైర్యసాహసములు గల వీరులు. త్యాగనిరతికి, దేశభక్తికి పెట్టినది పేరు. పంజాబ్ చరిత్రలోనేకాక, మనదేశ చరిత్రలో కూడా శిక్కులకు, సముచిత స్థానము కలదు. శిక్కు మతగురువులు గొప్ప గుణగణాలు కలిగినవారు. తమ మతప్రచారం కోసం వారు శ్రమపడి పనిచేసేవారు. వారిలోగల విశిష్టగుణము ఐక్యత. అట్టి ఐక్యతతోనే వారు ఆంగ్లేయులను సైతం ఎదిరించి, నిలువ కలిగిరి. మరియు నాటి హిందూస్థానీ ప్రభువులైన మొగల్ చక్రవర్తులతో పోటీపడిరి.

## 18.2 రాజకీయ చరిత్ర :

శిక్కు మతస్థాపకుడు గురునానక్. ఇతడు క్రీ.శ. 1469 - 1538 మధ్యకాలంనకు చెందినవాడు. ఇతనిని శిక్కుమత మొదటి గురువుగా పేర్కొందురు. దేవుని యందు అచంచల విశ్వాసము, కర్మ సిద్ధాంతములో విశ్వాసం, కైవల్యప్రాప్తి మున్నగునవి నానక్ బోధనలలోని ప్రధాన అంశాలు. నానక్ తదుపరి అంగద్ శిక్కుల గరువు అయినాడు. ఇతడు రెండవ శిక్కు గురువు. ఇతని తదుపరి అమరదాస్ (క్రీ.శ. 1552 - '74) శిక్కుల మూడవ గురువుగా నియమింపబడెను.

అమరదాస్ తరువాత అతని అల్లుడు రామ్‌దాస్ (క్రీ.శ. 1514 - 1581) శిక్కుల నాల్గవ గురువుగా వచ్చెను. రామ్‌దాస్‌పట్ల మొగలాయి చక్రవర్తి అక్బర్‌కు అపారమైన గౌరవం ఉండేది. అక్బర్ శిక్కులకు కొంత భూమిని అమృతసర్‌లో కేటాయించెను. రామ్‌దాస్ ఒక సరస్సును నిర్మింపచేసి, దాని మధ్యలో స్వర్ణదేవాలయం నిర్మించెను. శిక్కులకు 'స్వర్ణదేవాలయం' అతి పవిత్రమైన యాత్రా స్థలమైంది.

రామ్‌దాస్ తదుపరి అర్జున్‌సింగ్ (క్రీ.శ. 1581 - 1606) శిక్కుల ఐదవగురువు. ఇతడు అత్యంత సమర్ధవంతుడు. శిక్కులందరిని ఏకతాటిపై నడిపించెను. ఇతనికి ముందు మతగురువులు రాసి ఉంచిన ప్రార్థనా గీతాలను, జయదేవుని కాలం నుండి హిందు, ముస్లిం బోధకులు రాసిన ప్రార్థనా గీతాలను సేకరించి, వాటి నాధారంగా శిక్కు మతగ్రంథం 'ఆదిగ్రంధ్'ను సంకలం చేసెను. అటులనే మత ప్రచారమునకు అవసరమగు ఆర్థిక వనరులను కూడా ఇతడు శిక్కుల నుండి సమకూర్చెను. ప్రతి సంవత్సరము శిక్కు జాతీయ సదస్సులను ఏర్పాటుచేసి, శిక్కులు ఒక పద్ధతి, ప్రభుత్వ విధానమునకు అలవాటుపడునట్లు చేసెను. మొదటిసారిగా దేశ రాజకీయములలో జోక్యం చేసుకొన్న శిక్కుగురువు అర్జున్‌సింగ్. అందువలననే జహంగీర్ అర్జున్‌సింగ్‌కు మరణశిక్ష విధించినాడు. తత్‌ఫలితంగా శిక్కులు, మొగలాయిలకు బద్ధ శత్రువులైనారు. శాంతియుతంగా సహజీవనం చేస్తున్న శిక్కులు ఆయుధాలు సేకరించటం మొదలుపెట్టినారు.

అర్జున్‌సింగ్ తరువాత హర్‌గోవింద్ (క్రీ.శ. 1608 - 1645) శిక్కుల గురువయ్యెను. ఇతడు ఒక చిన్న సైన్యమును సమకూర్చుకొని షాజహాన్‌పై 1628లో తిరుగుబాటు చేయగా, అమృత్‌సర్ దగ్గరగల 'సాంగ్రామా' యుద్ధంలో షాజహాన్ చేతిలో హరగోవింద్ సింగ్ ఓడిపోయెను. ఇతడు పంజాబ్ వదలి 1645లో మరణించేదాకా, కాశ్మీర్ కొండలలో తలదాచుకొనెను.

హరగోవింద్ రెండవ కుమారుడు తేజ్‌బహదూర్ (కీ.శ. 1664 - '75) శిక్కుల తొమ్మిదవ గురువు. ఇతడు గురుపీఠానికి వచ్చేముందు ఔరంగజేబ్ సైన్యంలో పనిచేసి, అతడి అస్సాం యుద్ధాల్లో పాల్గొనెను. కాని ఔరంగజేబ్ మత అసహన విధానంనకు విసుగుచెంది, శిక్కు మతప్రచారానికి పూనుకొనెను.

తేజ్‌బహదూర్ కుమారుడు గురుగోవింద్‌సింగ్ (క్రీ.శ. 1675 - 1708) శిక్కుల పదవ, చివరి గురువు. శిక్కులను సైనికశక్తిగా రూపొందించినవాడు ఇతడే. "నక్కలను పులులుగానూ, పిచ్చుకలను డేగలుగానూ మార్చగలశక్తి" ఇతనికి కలదని ప్రజలు భావించేవారు. శిక్కులకు జరిగిన అన్యాయాలకు ప్రతీకారచర్య తీసుకొనేందుకు శిక్కులను సమాయత్తపరచెను. శిక్కులలోగల కులతత్వాన్ని, నిర్మూలించి, వారికి సాంఘిక సమానత్వ విలువలు బోధించెను. శిక్కులలో సంఘీభావం ఏర్పరచెను. దీనిని 'ఖల్సా' (సోదరభావము) అందురు. శిక్కులందరు ఈ క్రిందివి ధరించాలి అని గురుగోవింద్‌సింగ్ పేర్కొనెను.

1) కంఘా (దువ్వెన); 2) కబ్ (పొట్టిషరాయి); 3) కర్ద్ (బాకు); 4) కేశ్ (జుట్టు); 5) కిర్పాన్ (ఖడ్గం);

గోవింద్‌సింగ్ పంజాబ్‌లోని కొండజాతులవారితో పోరాడి ఒక చిన్న రాజ్యాన్ని ఏర్పరచుకొనెను. మొగలాయి చక్రవర్తి ఔరంగజేబ్ చాలా పర్యాయములు శిక్కులపైకి సైన్యాలు పంపించినాడు, అయితే ఎట్టి ఫలితం లభించలేదు. అయితే ఒక యుద్ధంలో గోవింద్ ఓడిపోయెను. అతని ఇద్దరు కుమారులు మొగలాయి సైనికుల చేతిలో హతులైరి. చివరకు గోవింద్‌సింగ్ శిక్కు సైన్యమును సమాయత్తపరచి, 'ముక్తేశ్వర్' వద్ద జరిగిన యుద్ధంలో మొగలాయి సైన్యంను ఓడించెను.

శిక్కులకు ఆధ్యాత్మిక దృష్ట్యా గురుగోవింద్‌సింగ్ చివరి నాయకుడు. మతవిషయములలో కన్నా, లౌకిక విషయాలలో శిక్కులకు, నాయకత్వం అవసరం ఎంతగానో కలదని అతడు భావించెను. అందుచేతనే మరణానికి ముందు గురుపీఠానికి ఎవరిని తన వారసునిగా నియమింపలేదు. కాని ఆధిగ్రంధ్‌ను గురువుగా భావింపవలెనని అతడు శాసించెను. అటులనే 'బందాను' సైనిక వారసునిగా నియమించెను.

బందా మంచి సైనిక అనుభవం కలవాడు. ఇతడు సిక్కులకు మంచి సైనిక శిక్షణ ఇప్పించి మొగలాయిలపై యుద్ధం ప్రకటించి, గురుగోవింద్‌సింగ్ కుమారులను వధించిన "సర్‌హింద్ ఫౌజ్‌దార్, 'వజీర్‌ఖాన్'లను పట్టుకొని వధించెను. సట్లేజ్, జమునల మధ్య ప్రాంతాన్ని అతడు ఆక్రమించెను. 'మెఖ్లిస్‌పూర్' వద్ద 'లోహ్‌ఘర్' అనే కోటను కట్టించి, దానిని బందా తన రాజకీయ కేంద్రంగా చేసుకొనెను. ఇతడు తన పేరు మీదగా నాణెములను కూడా ముద్రించి, చెలామణిలోకి తెచ్చెను. కానీ క్రీ.శ. 1761లో మొగలాయి సేనలు అతడిని పట్టుకొని ఓడించి, వధించెను.

తదుపరి 'ఫైజుల్లాపూర్'కు చెందిన 'కపూర్‌సింగ్' నాయకత్వములో శిక్కులు తిరిగి తమశక్తిని వృద్ధిపరచుకొనిరి. 'దళ్‌ఖల్సా' అనే మత ప్రాతిపదిక గల ఒక సంస్థను వారు ఏర్పరచుకొన్నారు.

క్రీ.శ. 1752 నాటికి పంజాబ్‌పై మొగలాయిలకు పూర్తిగా పట్టుతప్పింది. మూడవ పానిపట్ యుద్ధం (1761) తరువాత శిక్కులు 'గెరిల్లా' యుద్ధపద్ధతులను అనుసరించి, అహమ్మద్‌షా అబ్దాలీని సైతం తికమక పెట్టుటతో, చేయునదిలేక 1767 నాటికి అబ్దాలీ శిక్కుల చేతుల్లో పరాజయాన్ని అంగీకరించెను.

అబ్దాలీ ఇండియా నుండి తనిష్క్రమించిన తరువాత, అతడు వదిలివెళ్ళిన ప్రాంతాలన్నింటిని శిక్కులు వశపరచుకొని, క్రీ.శ. 1773 నాటికి వారి అధికారం తూర్పున 'సహ్రాన్‌పూర్' నుండి పడమర 'అటక్' వరకు, ఉత్తరాన ' కాంగ్రా' నుండి దక్షిణాన 'ముల్తాన్' వరకు విస్తరించెను. ఈ విధంగా స్వాతంత్ర్యం సంపాదించుకొన్న శిక్కులు తమ అధికారం క్రింద ఉన్న భూభాగాలను పన్నెండు రాజ్యాల క్రింద విభజించారు. వాటిని 'మిజెల్స్ (Misls) అంటారు అవి ఏమనగా

| | | | |
|---|---|---|---|
| 1) భంగీజబ్జెయాం | 2) సుకర్ ఛెకియా | 3) నాకాయి | 4) ఫైజెల్లా పూరియా |
| 5) అహ్లూవాలియా | 6) రామారియా | 7) దాలేవాలియా | 8) కరోరా |
| 9) సింఘయా | 10) నిషాన్‌వాలా | 11) సాహిద్‌నిహాంగ్ | 12) పూల్కియా. |

ఈ పన్నెండు మిజిల్స్‌ను శిక్కు సర్దారులు పాలించారు. ఈ పన్నెండు మిజిల్స్‌ను చాలావరకు జయించి, ఒక సమైక్యరాజ్యంగా ఏర్పరచినవాడు సుకర్ ఛెకియా ప్రభువైన మహారాజ రంజిత్‌సింగ్.

## 18.3 మహారాజ రంజిత్‌సింగ్ (క్రీ.శ. 1780 - 1839) :

భారతదేశ చరిత్రలో పేరుమోసిన మహావీరులలో రంజిత్‌సింగ్ ఒకడు. చిన్నాభిన్నమై పరస్పర కలహములతో నిమగ్నులైయున్న శిక్కులను సమైక్యపరచి వారికొక జాతీయ రాజ్యమును నిర్మించి, వారి ఔన్నత్యమును జీవితాంతము అవిరళ కృషిసల్పి 'పంజాబ్ సింహము'గా చరిత్రలో చరితార్థుడైనట్టి యుగపురుషుడు రంజిత్‌సింగ్. ఇతడు "దృఢసంకల్పముతో మనుషులలో పుట్టిన నాయకుడని, ప్రాచ్య దేశములలో సామ్రాజ్య నిర్మాణమునకు అవసరమైన సద్గుణ, దుర్గుణములు రెండునూ సరియైన పాళ్ళలో వేళవించిన వ్యక్తి" అని పి.ఇ. రాబర్ట్సు పండితుడు పేర్కొన్నాడు.

("A born leader of men gifted with an iron will, he possesed just that combination of virtues and vices which is best adopted for building up an oriental empire" - P.E. Roberts).

### 18.3.1 తొలిజీవితం :

రంజిత్‌సింగ్ 1780 నవంబర్ 2వ తేదీన 'గుజ్రన్‌వాలా'లో జన్మించెను. ఇతని తండ్రి మహాన్‌సింగ్ 'సుకర్ ఛెకియా' మిజిల్ ప్రభువు. రంజిత్‌కు చిన్నతనంలో మశూచి సోకి ఒక కన్ను పోయింది. మహాన్‌సింగ్ తన కుమారుడికి విద్య నేర్పించాలి అని ప్రయత్నించి విఫలుడైనాడు. కాని రంజిత్‌సింగ్ చిన్నతనంలోనే అన్ని క్షాత్ర విద్యలు నేర్చుకొనెను. రంజిత్‌సింగ్‌కు పన్నెండేళ్లు రాగానే తండ్రి మహాన్‌సింగ్ మరణించాడు. సుకర్ ఛెకియా వ్యవహారాలను అతని తల్లి, అత్త, దివాన్ లక్‌పత్‌రాయ్ నడిపారు. కాని వారి అసమర్థతవల్ల పరిపాలన కుంటుపడింది. రంజిత్‌సింగ్ పదిహేడేళ్ళు రాగానే తానే స్వయంగా రాజ్యవ్యవహారాలను చేపట్టాడు.

మొగలాయి సామ్రాజ్యం పతనావస్థలో ఉన్నందువల్ల, 'అహమ్మద్‌షా అబ్దాలీ' దండయాత్రల వల్ల పంజాబ్‌లో ఆనాడు తీవ్రమైన సంక్షోభం ఏర్పడి ఉంది. పన్నెండు మిజిల్స్ (Misls) ప్రభువులు స్వతంత్రంగా తమ చిత్తం వచ్చినట్లు వ్యవహరించేవారు. వారిలో వారు తరచూ సంఘర్షణ పడేవారు. దానికితోడు పంజాబ్‌లో ఒక హిందూరాజ్యం, చిన్న, చిన్న ముస్లిం రాజ్యాలు ఏర్పడి ఉన్నాయి. అందువల్ల పంజాబ్ చిన్న, చిన్న ముక్కలుగా విడిపోయి ఉంది. దీన్ని రంజిత్‌సింగ్ సదవకాశంగా తీసుకొని తన అధికారమును పంజాబ్‌లో విస్తరింపచేసుకొనెను.

### 18.3.2 లాహోరు రాజగుట (1798) :

రంజిత్‌సింగ్ సుకర్‌ఛెకియాలో అధికారానికి వచ్చిన కొద్దికాలానికే ఆఫ్ఘన్ పాలకుడు 'జమన్‌షా' పంజాబ్‌పై నాల్గవసారి దండెత్తివచ్చి లాహోర్‌ను ఆక్రమించెను. కాని అదే సమయంలో అఫ్ఘన్‌లో తిరుగుబాటు సంభవించగా, జమన్‌షా లాహోర్ నుండి వెళ్ళిపోవలసి వచ్చెను. దీనిని రంజిత్‌సింగ్ సదవకాశముగా భావించి లాహోర్‌ను ఆక్రమించెను. లాహోర్ ఆక్రమణతో రంజిత్‌సింగ్ కీర్తిప్రతిష్టలు పంజాబ్ అంతటా వ్యాపించెను. అందువల్ల తక్కిన పదకొండు మిజిల్స్ పాలకులలో భయాందోళనలు ప్రారంభమై వారందరూ రంజిత్‌సింగ్‌కు వ్యతిరేకంగా ఒక కూటమిగా ఏర్పడ్డారు. కాని రంజిత్‌సింగ్ 'ఖానిస్ యుద్ధంలో' ఈ కూటమిని ఓడించి, తన అధికారమును సుస్థిరపరచుకొనెను. ఈ విజయముతో రంజిత్‌సింగ్‌కు ఎదురులేకుండా పోయెను.

ఈ తొలి విజయాలతో ప్రభావితుడైన రంజిత్‌సింగ్ అన్నివైపులా సైన్యాలను తరలించి, చాలా రాజ్యాలను ఆక్రమించెను. 1803లో అకల్‌ఘర్, 1805లో అమృత్‌సర్, 1807లో దల్లెవాలియా మిజిల్, 1811లో ఫైజల్‌పురియా మిజిల్ అతని వశమైనాయి.

### 18.3.3. మాల్వా ఆక్రమణ (క్రీ.శ. 1806) :

శిక్కులందరికి తాను ఏకైక నాయకుడు కావాలనే లక్ష్యంతో రంజిత్‌సింగ్ మాళ్వాను ఆక్రమించాలని నిర్ణయించెను. పూల్కియా మిజిల్ పాలకుని క్రింద పాటియాలా, నభా, జింద్ ప్రాంతాలున్నాయి. క్రీ.శ. 1806లో పాటియాలా, నభా ప్రభువుల మధ్య మనస్పర్ధలేర్పడగా, దాన్ని అదునుగా తీసుకొని 20,000 మంది సైనికులతో రంజిత్‌సింగ్ సట్లేజ్‌నది దాటి ధౌలధ అనే పట్టణాన్ని ఆక్రమించెను. పాటియాలా పాలకుడు 'రాజా సాహెబ్ సింగ్‌ను' ఓడించి అతడి చేత కప్పం కట్టించుకొనెను.

అటులనే క్రీ.శ. 1807లో రంజిత్‌సింగ్ రెండవ పర్యాయం మాళ్వాపై దండెత్తి వార్ని, జీరాలను ఆక్రమించెను. అంబాలా, కైతాల్, కాల్సియా పాలకులు అతడికి సామంతులుగా ఉండటానికి అంగీకరించి, కప్పం చెల్లించిరి.

### 18.3.4 ఆంగ్లేయులతో సంబంధము :

రంజిత్‌సింగ్ రెండవ మాళ్వా దండయాత్ర శిక్కు సంస్థానాధీశులలో అమిత భయాందోళనలు కలుగజేశాయి. అందువల్ల వారు బ్రిటిష్‌వారి రక్షణను ఆశ్రయించారు. కాని అట్టి సమయంలో ఇండియాపై రష్యా దండెత్తివచ్చుననే భయం ఆంగ్లేయులలో కలిగింది. అందుచేత వారు స్వదేశీ సంస్థానాధీశులకు సహాయం చేయుటకు నిరాకరించారు.

నాటి ఇండియన్ గవర్నర్ జనరల్ లార్డ్ మింటో, రంజిత్‌సింగ్‌తో మిత్ర సంధి కుదుర్చుకొనుటకు 'ఛార్లెస్ మిట్కాఫ్' (Sir Charles Metcalfe) ను పంపెను. రెండు షరతులకు అంగీకరిస్తే ఇంగ్లీష్‌వారితో సంధి చేసుకొనుటకు తాను సిద్ధమేనని రంజిత్‌సింగ్ ప్రకటించెను. అవి ఏమనగా

ఎ) కాబూల్ అమీర్‌తో తనకు యుద్ధం సంభవిస్తే, ఆంగ్లేయులు తటస్థంగా ఉండాలి.

బి) మాళ్వాపై తన అధికారమును ఆంగ్లేయులు గుర్తించాలి.

అయితే ఈ రెండు షరతులను ఆంగ్లేయులు అంగీకరించనందున, చర్చలు విఫలమైనాయి.

## 18.3.5 అమృత్‌సర్ సంధి (1809) :

ఐరోపాలో పరిస్థితులు కుదుటపడినంతనే ఆంగ్లేయులకు రష్యా బెడద తప్పింది. అందువల్ల వారు రంజిత్‌సింగ్‌కు వ్యతిరేకంగా సైనికచర్యలు ప్రారంభించారు. ఆంగ్లేయులతో ప్రత్యక్షంగా యుద్ధంచేసి నెగ్గలేమని గ్రహించిన రంజిత్‌సింగ్ క్రీ.శ. 1809 ఆంగ్లేయులతో అమృత్‌సర్ సంధి చేసుకొనెను.

అమృత్‌సర్ సంధి ప్రకారం సట్లేజ్ బ్రిటీష్ సామ్రాజ్యానికి, రంజిత్‌సింగ్ రాజ్యానికి సరిహద్దు అయింది. సట్లేజ్‌నది ఎడమవైపు రాజ్యాలను రంజిత్‌సింగ్ ఆక్రమించరాదు, అటులనే సట్లేజ్‌నది ఉత్తరప్రాంతాలలో ఆంగ్లేయులు జోక్యం చేసుకోమని ప్రకటించిరి. ఒకవిధంగా అమృత్‌సర్ సంధి రంజిత్‌సింగ్ ఓటమికి నిదర్శనము. శిక్కురాజ్యాలను ఏకం చేయాలి అనే అతడి కోరిక, కోరికగానే మిగిలిపోయింది. మాళ్వాను తన అధికారములోనికి తీసుకొని రాలేకపోయినాడు. ఒక విధంగా అమృత్‌సర్ సంధి రంజిత్‌సింగ్‌కు మేలు చేకూర్చెను. తూర్పు సరిహద్దులలో అతడికి ఎటువంటి ప్రమాదం లేకుండా పోయింది.

రంజిత్‌సింగ్ వెలియంబెంటిక్ కాలంలో (క్రీ.శ. 1831) 'రూపర్' వద్ద మరొక సంధి కుదుర్చుకొనెను. ఈ సంధి రంజిత్‌సింగ్‌కు, ఆంగ్లేయులకు మధ్య మరింత సాన్నిహిత్యమును పెంచెను.

## 18.3.6 ఇతర ఆక్రమణలు :

తూర్పున రాజ్యవిస్తరణకు అమృత్‌సర్ సంధి వల్ల అడ్డు ఏర్పడటంతో రంజిత్‌సింగ్ తన దృష్టిని పడమర, వాయువ్య ప్రాంతాల వైపు కేంద్రీకరింపచేసెను.

ఎ) మొదట క్రీ.శ. 1809 - 1811 మధ్య గూర్ఖాలతో పోరాడి రంజిత్‌సింగ్ 'కాంగ్రా' జిల్లాను ఆక్రమించెను.

బి) క్రీ.శ. 1813లో ఆఫ్ఘన్‌ల వద్ద నుండి 'అటక్' ప్రాంతమును స్వాధీనపరచుకొనెను.

సి) క్రీ.శ. 1813లోనే 'షాషుజా' ఆఫ్ఘనిస్తాన్ నుండి పారిపోయివచ్చి రంజిత్‌సింగ్‌ను శరణు వేడుకొన్నాడు. అప్పుడే అతడి నుండి కోహినూర్ వజ్రంను రంజిత్‌సింగ్ సంపాదించెను.

డి) క్రీ.శ. 1818లో ముల్తాన్‌ను వశపర్చుకొనెను.

ఇ) క్రీ.శ. 1819 లో కాశ్మీర్, 1834లో పేషావర్‌ను రంజిత్‌సింగ్ ఆక్రమించెను. 'సింధ్' ప్రాంతమును రంజిత్‌సింగ్ ఆక్రమించుటకు ప్రయత్నించగా విలియంబెంటిక్ అసమ్మతి వల్ల రంజిత్‌సింగ్ తన పథకాన్ని వదలుకొనెను.

## 18.3.7 సామ్రాజ్య విస్తీర్ణము :

ఇట్టి విజయముల వలన రంజిత్‌సింగ్ సామ్రాజ్యము సట్లేజ్ నుండి ఖైబర్ కనుమ వరకూ, టిబెట్ సరిహద్దు నుండి సింధ్ వరకూ వ్యాపించెను.

**18.3.8 పరిపాలనా సంస్కరణలు :**

రంజిత్‌సింగ్ ఒక నూతన సామ్రాజ్య నిర్మాతయేగాక, చక్కని పరిపాలనాదక్షుడు.

**ఎ) కేంద్ర ప్రభుత్వము :** చక్రవర్తి పౌర, సైనిక, రాజకీయ వ్యవహారములకు ఉన్నత అధికారి. అయితే రంజిత్‌సింగ్ ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తన పరిపాలనా విధానంను రూపొందించెను. ఖాల్సా పరిరక్షణయే తన ఉన్నతాశయమని అతను ప్రకటించెను. మత రక్షకులమని చెప్పుకొనే 'అకాలీల' సలహాలను అతడు పాటించవలసి వచ్చెను. గురునానక్, గురుగోవింద్‌సింగ్‌ల పేర్లతో రంజిత్‌సింగ్ నాణెములను కూడ ముద్రించెను.

**బి) రాష్ట్ర ప్రభుత్వము :** పరిపాలనా వ్యవస్థలో చక్రవర్తి సర్వాధికారి అయినా, అతడికి కొన్ని హద్దులు లేకపోలేదు. మంత్రిమండలి సలహాను కొంతవరకైనా పాటించవలసి ఉంది. మతంపరంగా కూడా అతడు లొంగివున్నాడు.

పరిపాలనా సౌలభ్యం కొరకు తన రాజ్యాన్ని రంజిత్‌సింగ్ నాలుగు రాష్ట్రములుగా విభజించెను. అవి 1) లాహోర్, 2) ముల్తాన్, 3) కాశ్మీర్ 4) పేషావర్

ప్రతి రాష్ట్రమునకు 'నజీం' అనే ఉద్యోగి అధికారి. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణ నజీం ముఖ్యవిధి. కొన్ని వ్యవహారాలలో అతడు తీర్పులు కూడా చెప్పేవాడు. రంజిత్ రాష్ట్రములను తిరిగి పరగణాలుగాను, పరగణాలను తాలూకాలుగాను విభజించెను. 'కాదర్' పరగణా అధికారి. తాలూకా క్రింది నూరు నుండి నూటయాభై గ్రామాలుండేవి. గ్రామపరిపాలన పంచాయితి నిర్వహించేది.

**సి) ఆర్థిక పరిస్థితులు :** ప్రభుత్వమునకు ముఖ్య ఆదాయం భూమిశిస్తు. సుంకాలు, జాగీర్‌లు, వివిధ వృత్తుల మీద విధించిన పన్నులు ఇతర ఆదాయమార్గాలు. ప్రభుత్వ ఆదాయమంతా సైన్యంమీద, పాలనా యంత్రాంగం మీద ఖర్చు అయ్యేది. ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రంజిత్‌సింగ్ ప్రజాపయోగకరమైన పనులపై ప్రభుత్వ వ్యయము చేసెను.

**డి) సైనిక సంస్కరణలు :** రంజిత్‌సింగ్ సమర్థవంతమైన సైన్యంను పోషించెను. ఫ్రెంచి సైన్యాధికారులచే తన సైన్యమునకు పాశ్చాత్య పద్ధతులలో శిక్షణ ఇప్పించెను. రంజిత్‌సింగ్ సైన్యం నందు మూడు విభాగములు కలవు. అవి ఏమనగా

1) సిద్ధ సైన్యం (ఫౌజ్-ఇ-ఆమ్)
2) ప్రత్యేక సైన్యం (ఫౌజ్-ఇ-ఖాన్)
3) శిక్షణలోని సైన్యం (ఫౌజ్-ఇ-బేఖవాయిద్)

సిద్ధ సైన్యంలో కాల్బలం, శతఘ్నిదళం, అశ్వికదళం ప్రధానాంగాలు. కాల్బలానికి సైన్యంలో ప్రత్యేకస్థానం కలదు. కాల్బలాన్ని పటాలాల కింద విభజించెను. శిక్కు చరిత్రలో సైనికులకు జీతాలిచ్చిన మొదటివాడు రంజిత్‌సింగ్. అతడికి పూర్వం శిక్కు సైన్యమునకు జీతాలు లేవు. శత్రురాజ్యాలలో కొల్లగొట్టిన సొమ్మును సైనికులు పంచుకునేవారు. కాని రంజిత్‌సింగ్ శిక్కు సైన్యమునకు జీతాలు చెల్లించి, క్రమశిక్షణ, సామర్ధ్యం పెంచెను. రంజిత్‌సింగ్ కాలంలో సైన్యం వదలి పారిపోవటం కూడా చాలా వరకు తగ్గింది. సైన్యాలు ఒకచోట నుండి మరోచోటకి తరలి వెళ్ళవద్దని, సైనికులు పంటపొలాలను నాశనం చేయరాదని అతడు శాసించెను. రైతుల పిల్లలను సైన్యంలో చేర్చుకొనెను.

**ఇ) న్యాయసంస్కరణలు :** రంజిత్‌సింగ్ న్యాయపరిపాలన ఆ కాలంనాటి కట్టుబాట్లమీద, ఆచారాల మీద ఆధారపడినది. వివిధ మతాల ఆచారాలనుబట్టి తీర్పులు ఇవ్వబడేవి. 'ఖాజీలు' ముస్లింలకు తీర్పులు ఇచ్చేవారు. ముస్లిం వివాహములు కూడా 'ఖాజీలే' నిర్వహించేవారు. న్యాయస్థానాలుండేవి. కాని హైకోర్టులని, క్రింది కోర్టులనీ ఉండేవికావు. గ్రామాలలో పంచాయితీలు తగాదాలపై తీర్పులిచ్చేవి. కొన్ని సందర్భాలలో వ్యవహారాలను పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులను నియమించేవారు. వారిని 'అదాలతీలు' అని పిలిచేవారు. లాహోర్‌లో రంజిత్‌సింగ్ ప్రత్యేక న్యాయస్థానంను స్థాపించెను. దానిపేరు 'అదాలత్-ఇ-ఆలా'.

నాడు శిక్షలు కఠినంగా ఉండేవికావు. మరణశిక్ష లేదని చెప్పవచ్చును. ఖైదుశిక్ష కూడా చాలా అరుదుగా విధించేవారు. న్యాయపరిపాలన ద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా వచ్చేది. ఓడిపోయినవారు 'జుల్మానా' చెల్లించుకోగా, గెల్చినవారు 'నజరానా' చెల్లించుకొనేవారు.

### 18.3.9 ఘనత :

రంజిత్‌సింగ్ గొప్ప సైనిక నాయకుడు, రాజనీతిజ్ఞుడుయేగాక, చక్కని పరిపాలనాదక్షునిగా పేర్కొనవచ్చును. శిక్కుల జాతీయరాజ్య నిర్మాతగా రంజిత్‌సింగ్ శిక్కు చరిత్రలో గొప్ప కీర్తిప్రతిష్టలు పొందెను. రంజిత్‌సింగ్ పరమతద్వేషి కాదు. అతడు పరమతసహనము పాటించి హిందు, ముస్లిం, క్రైస్తవులకు ప్రభుత్వములో ఉద్యోగములిచ్చెను. అటులనే ఉద్యోగుల నియామకంలో సామర్థ్యానికే ప్రాధాన్యత ఇచ్చెను. "మహారాష్ట్రులకు శివాజీ ఎట్టి సేవచేసినో, శిక్కులకు రంజిత్‌సింగ్ అట్టి సేవ చేసెను".

### 18.3.10 ముగింపు :

రంజిత్‌సింగ్ మరణముతో శిక్కులు ప్రతిభ సన్నగిల్లెను. శివాజీవలె రంజిత్‌సింగ్ కూడా తన ప్రజలలో జాతీయతాభావమును శాశ్వతముగా కొనసాగునట్లు చేయకపోవుట, తాను ప్రవేశపెట్టిన పాలనా విధానం సరియైన పునాదులతో కూడియుండకపోవుట వలన, శివాజీ మరణానంతరము మహారాష్ట్ర సామ్రాజ్యము చిన్నాభిన్నమైనట్లు, రంజిత్‌సింగ్ మరణానంతరము శిక్కు రాజ్యము సైతము తునాతునకలయ్యెను. రంజిత్‌సింగ్ ఎంతటి ధీరుడైనను, ఆంగ్లేయులతో సంఘర్షణపడుటకు, భయపడి 'అమృత్‌సర్' సంధి చేసుకొనెను. 'సర్‌హింద్' శిక్కు మజిలీలను జయించుటలో విఫలుడగుట వలన రంజిత్ జీవితాశయమైన 'శిక్కుజాతి సమైక్యత' సిద్ధింపలేదు.

ఏది ఏమైనను "సర్ లెపెల్ గ్రిఫెన్' నుడివినట్లు "ఎన్ని సంవత్సరములు గతించినా నేటికిని పంజాబ్‌లో ఆయన పేరు (రంజిత్‌సింగ్), ప్రతినోట వినిపించును, అటులనే ఆయయ ప్రతిమ ప్రతిఇంట, ప్రతి రాజభవనముపైన కన్పించును". రంజిత్ మరణించిన ఏబది సంవత్సరములకు గ్రిఫెన్ రాసిన సువర్ణాక్షరములివి.

("Although half a century had passed since his death, his name still a household word in the province. His portrairt is still preserved in castle and cottage" - Sir Lepel Griffin).

### మాదిరి ప్రశ్నలు :

1) శిక్కు చరిత్రలో రంజిత్‌సింగ్ గొప్పవాడని ఎట్లు చెప్పగలవు ?
2) మహారాజ రంజిత్‌సింగ్ ఘనతను వివరింపుము ?

### లఘు వ్యాసరూప ప్రశ్నలు :

1) అర్జున్‌సింగ్
2) గురుగోవింద్‌సింగ్
3) అమృత్‌సర్ సంధి
4) సైనిక సంస్కరణలు

### చదువవలసిన గ్రంథాలు :

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం) - డా॥ పాటిబండ్ల ఝాన్సీలక్ష్మీ మరియు డా॥ శ్రీమతి అల్లాడి వైదేహి
2. Indian History and Culture Vol. II - Dr. B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao.

**- C. Ravindra Raju**

పాఠం - 19

# ఆంగ్లేయులు - సరిహద్దు ప్రాంతాలు

**విషయసూచిక :**

19.0 లక్ష్యం
19.1. ఉపోద్ఘాతం
19.2. సింధు ఆక్రమణ
19.3. మొదటి బర్మా యుద్ధం
19.4. రెండవ బర్మా యుద్ధము
19.5. మొదటి ఆఫ్ఘన్ యుద్ధము
19.6. ఉపసంహారము

## 19.0 లక్ష్యం :

1823వ సంవత్సరానికి ఈస్ట్ఇండియా కంపెని ఇంచుమించు భారతదేశమంతా విస్తరించింది. వారిని ఎదిరించగల సమర్థులు ఎవరూలేరు. శిక్కు రాజైన రంజిత్‌సింగ్ కూడా ఆంగ్లేయులతో సమాధానపడినాడు. వాయువ్య సరిహద్దుకున్న ప్రాధాన్యత వలన ఆంగ్లేయులు కూడా రంజిత్‌సింగ్‌తో యుద్ధం చేయలేకపోయినారు. భారతదేశాన్ని ఆక్రమించిన తర్వాత ఆంగ్లేయులు పరిసర ప్రాంతాలను కూడా స్వాధీనపరచుకొను పూనుకున్నారు. 1857 లోపల వారు సింధును ఆక్రమించుకొని, ఆఫ్ఘన్‌లతో ఒక యుద్ధంచేసి, బర్మాతో రెండు యుద్ధాలు చేసి తమ సామ్రాజ్యాన్ని విస్తరింపచేసికున్నారు. 1857 వరకు ఆంగ్లేయులు సరిహద్దు రాజ్యాలతో చేసిన యుద్ధాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 19.1. ఉపోద్ఘాతము :

భారతదేశమంతా ఆక్రమించిన ఆంగ్లేయులు సరిహద్దు రాజ్యాలను ఆక్రమించ పూనుకున్నారు. భారత సరిహద్దులు స్పష్టంగా లేకపోవటం వలన అనేక సమస్యలేర్పడినవి. ఈ సమస్యలే అనేక యుద్ధాలకు దారితీశాయి. ఈ యుద్ధాల వలన 1857 లోపల ఆంగ్ల సామ్రాజ్య సరిహద్దులు విస్తరించాయి.

## 19.2. సింధు ఆక్రమణ :

సింధు నదీ ప్రాంతానికి సింధు రాష్ట్రమని పేరు. మొఘులాయిాల కాలంలో సింధువారి ఆధీనంలోవుంది. నాదిర్‌షా దండెత్తినప్పుడు సింధును కూడా ఆక్రమించాడు. తర్వాత కొంతకాలం ఆఫ్ఘన్లకు సామంతరాజ్యంగా వుంది. చివరకు అమీర్ల ఆధీనంలోకి వచ్చింది.

1758లో అమీర్ల అనుమతితో ఆంగ్లేయులు ధట్టాలో ఒక ఫ్యాక్టరీని నిర్మించారు. తర్వాత ఇరువురికి అభిప్రాయభేదాలేర్పడి అమీర్లు సింధు నుండి ఆంగ్లేయులను తరిమివేశారు. సింధు సముద్రతీరంలో వుండటంవలన, ఆసియాప్రాంతం వ్యాపారానికి అనుకూలంగా వుండటం వలన ఎలాగైనా దానిని స్వాధీనపరచుకోవాలని ఆంగ్లేయులు పూనుకున్నారు. అంతేకాక, ఆఫ్ఘనిస్తానును, కనుక రష్యా ఆక్రమిస్తే సింధు కూడా వారి ఆధీనమౌతుందని భయపడి, సింధూలో రాజకీయ జోక్యానికి పూనుకున్నారు.

శిక్కురాజు రంజిత్ సింగ్, పంజాబులో చాలాభాగం ఆక్రమించి, సింధును కూడా ఆక్రమించపూనుకున్నాడు. రంజిత్ సింగ్ చాలా బలవంతుడు. సింధు కూడా అతని ఆధీనంలోకివస్తే మరింత బలవంతుడౌతాడని, భావించి ఆంగ్లేయులు బలవంతంగా సింధుని సంధికంగీకరింపచేశారు.

1839లో గవర్నరు జనరల్ ఆక్లండు సింధుతో సహాయక సంధి చేసికొని, రాయబారిని పంపటం జరిగింది. సింధు ఆక్రమణతో సహాయక సంధి తొలిమెట్టు అని చెప్పవచ్చు. మొదటి ఆఫ్ఘన్ యుద్ధ సమయంలో ఎలెన్‌బరో, సింధు సహాయక సంధిని ఉల్లంఘించే నెపం మీద 1842లో నేపియర్ అనే అధికారిని పంపాడు. నేపియర్ 1843లో అమీర్ల మీద యుద్ధాన్ని ప్రకటించి, దానిని ఆక్రమించి ఆంగ్లరాజ్యంలో కలిపివేశాడు.

## 19.3 మొదటి బర్మా యుద్ధము :

భారతదేశ ఈశాన్య సరిహద్దు స్పష్టంగా లేదు. అప్పటికీ భారతదేశమంతా విస్తరించిన ఆంగ్లేయులకు ఈశాన్య రాష్ట్రాలలో సంబంధాలేర్పడినాయి. ఈశాన్య ప్రాంతంలో అనేక రాజ్యాలు - ఆరెగాన్, పైగూ, టెన్నసీరం మొదలగునవి వున్నవి. 18వ శతాబ్దంలో ఆలంగపాయ, ఎగువ దిగువ బర్మాలను ఏకం చేసి 'ఆవా' రాజధానిగా రాజ్యాన్ని ఏర్పాటుచేశాడు. బర్మా చరిత్రలో ఇదొక ముఖ్యాధ్యాయం. ఆలంగపాయ, మణిపూర్ ప్రాంతాన్ని కూడా ఆక్రమించాడు. అతని తర్వాత వచ్చిన బోదపాయ కూడా 1784 - 85లో ఆరెకాన్‌ని ఆక్రమించాడు. ఆరెకాన్‌లోని నాగజాతి సాంస్కృతికంగా బెంగాల్‌తో సంబంధాలు కలిగివుంది. దీనితో వారు బర్మా పాలనకు వ్యతిరేకంగా బెంగాలులోని కంపెనీ సహాయాన్ని అర్థించారు. దీనితో ఈస్ట్‌ఇండియా కంపెనీకి బర్మా వ్యవహారాలలో తలదూర్చే అవకాశం కల్గింది.

1813లో బర్మా 'సుమ్రా' లోయను ఆక్రమించింది. కలకత్తా కౌన్సిలు, సామరస్య పరిష్కారానికి, రాయబారిని బర్మా పంపింది. అది విఫలమవటమేకాక బర్మా రాజు, చిట్టగాంగు, ఢాకా, ముర్షీదాబాదు, కాశింబజారు కూడా తమకు చెందినవని వాదించాడు.

1822లో బర్మా కమాండరు మహాబందూల అస్సాం ఆక్రమించాడు. తర్వాత మణిపూరునుకూడా ఆక్రమించాడు. సరిహద్దు ప్రాంతమైన 'కచారు'లో కూడా అడుగుపెట్టారు. 1823లో బర్మా చిట్టగాంగు దగ్గర 'షాపురి'ని ఆక్రమించి అక్కడి బ్రిటీషు సరిహద్దుదళాన్ని తరిమివేసింది. దీనితో లార్డ్ ఆమ్‌హర్స్ట్ 1824 ఫిబ్రవరి 24న యుద్ధాన్ని ప్రకటించాడు.

### యుద్ధము :

బర్మా నైసర్గిక స్వరూపం ఆంగ్లేయులను కలవరపరచింది. బర్మా అంతా వర్షపాతం ఎక్కువ. అడవులు నదులు ఎక్కువ. ఈ కారణాలవలన ఆంగ్లేయులు మొదట ఓటమి నెదుర్కొనవలసి వచ్చింది. మహాబిందూల 'రామో' దగ్గర ఆంగ్లేయులనోడించి కలకత్తాకు దారితీశాడు. ఈ లోపల ఇంకొక ఆంగ్లసైన్యం కాంప్‌బెల్ ఆధ్వర్యంలో రంగూన్ మీదకు దాడిచేసి, ఆక్రమించింది. ఇది 1824మే 11న జరిగింది. తర్వాత టెన్నసీరం కూడా ఆక్రమించారు. డిసెంబరులో మహాబందూల 'పగోడా' దగ్గర ఓడిపోయాడు.

ఆంగ్లసైన్యం కచారుగూండా ఆవా మీద దాడి చేసింది. కాంప్‌బెల్ ప్రోమ్ ఆక్రమించాడు. ఇదే సమయంలో మహబందూల మరణించగా బర్మా సైన్యం చెల్లాచెదురై 'పగోన్' దగ్గర ఓడిపోయింది. ఆంగ్లసైన్యం యాండబూ చేరుకుంది. బర్మా రాజు సంధికంగీకరించాడు.

### యాండబూ సంధి (1826) :

బర్మా ఆరెకాన్, టెన్నసీరంలను ఆంగ్లేయులకివ్వటానికి అంగీకరించింది. బర్మా యుద్ధ నష్టపరిహారం క్రింది కోటిరూపాయలు చెల్లించాలి. ఆంగ్లరాయబారిని ఆవాలోను, బర్మా రాయబారిని కలకత్తాలోను నియమించుటకు పరస్పరం అంగీకరించారు. ఇరువురి మధ్యా ఒక వాణిజ్య ఒప్పందం కుదిరింది.

## 19.5. మొదటి ఆఫ్ఘన్ యుద్ధం : (1838 - 42)

ఆఫ్ఘన్ రాజ్యానికి ఒకవైపు బ్రిటీషు ఇండియా, మరొకవైపు రష్యా సరిహద్దులు. వీరు స్వతంత్ర ప్రియులు. వారిలో ఎన్ని విభేదాలున్నా అవసరమైనప్పుడు ఒకటై పోరాడేవాడు. అందుకే చిన్నరాజ్యమైనా తన స్వతంత్రాన్ని కాపాడుకోగల్గింది.

ఆఫ్ఘన్ రాజ్యాన్ని అహమ్మద్ షా స్థాపించాడు. తర్వాత తైమూర్‌షా, జామాన్‌షా, మహమ్మద్‌షాలు పరిపాలించారు. 1803లో షాషుజా రాజైనాడు. ఇతని కాలంలోనే రష్యావారు తమ రాజ్యాన్ని విస్తరింపజేసి పర్షియాను స్వాధీనం చేసికొని ఆఫ్ఘనిస్తాన్‌ని కూడా ఆక్రమింప పూనుకున్నారు. రష్యా కనుక ఆఫ్ఘనిస్థాన్‌ను ఆక్రమిస్తే ఇండియాలోని తమ రాజ్యానికి ముప్పని ఆంగ్లేయులు భావించి ఆఫ్ఘన్ వ్యవహారాలలో తలదూర్చారు.

### యుద్ధకారణాలు :

రష్యా ప్రోద్భలంతో పర్షియా ఆఫ్ఘనిస్థాన్‌లోని హీరట్‌ను ముట్టడించింది. ఆంగ్లేయులు రష్యా నెదుర్కోవాలంటే ఆఫ్ఘనిస్థాన్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలి. రష్యాను ఎదుర్కోవాలంటే ఆంగ్లేయులకు భూమార్గమే శరణ్యం కాని వారి నౌకాదళం ఎంతమాత్రం పనికిరాదు. ఈ కారణాలచేత మొదట ఆఫ్ఘనిస్థాన్‌ని ఆక్రమించడానికి పూనుకున్నారు.

ఆఫ్ఘనిస్థాన్‌లోని ఆంతరంగిక పరిస్థితి కూడా ఆంగ్లేయులకు సహాయపడింది. 1809లో షాషుజాను తొలగించి దోస్తు మహమ్మద్ రాజైనాడు. దోస్తు మహమ్మద్ కూడా భయంతో ఆంగ్లేయులతో స్నేహం కోసం ప్రయత్నించాడు. కాని ఆంగ్లేయులకు దోస్తు మహమ్మద్‌కు పొత్తుకుదరలేదు. రంజిత్ సింగ్ రాజ్యభాగమైన పెషావర్‌ను తనకిప్పించవలసిందిగా దోస్తు మహమ్మద్ ఆంగ్లేయులను కోరాడు. రంజిత్‌సింగ్‌తో వైరం ఇష్టంలేని ఆంగ్లేయులు దీనికి నిరాకరించారు. అప్పుడు దోస్తు మహమ్మద్ రష్యా సహాయాన్ని అర్థించాడు.

ఈ లోపల రాజ్యాన్ని కోల్పోయిన షాషుజా తన రాజ్యాన్ని ఇప్పించవలసిందిగా ఆంగ్లేయులను కోరాడు. ఆంగ్లేయులు దీనికంగీకరించి, షాషుజాతోను, శిక్కులతోను, త్రైపాక్షిక ఒడంబడిక చేసికొన్నారు. దీని ప్రకారం షాషుజాను రాజుగా చేయటానికి అంగీకరించారు.

ఆంగ్లసైన్యం ఆఫ్ఘనిస్థాన్‌లోకి ప్రవేశించి దోస్తు మహమ్మద్‌ను తరిమివేసి షాషుజాను రాజుగా ప్రకటించింది. దోస్తు మహమ్మద్ ఖైదుచేసి కలకత్తా పంపించారు. దీనితో ఆఫ్ఘనిస్థాన్‌లో ఆంగ్లేయుల జోక్యం ఎక్కువైంది. స్వాతంత్ర ప్రియులైన ఆఫ్ఘన్లు ఈ జోక్యాన్ని సహింపలేకపోయారు. తమరాజు వారి చెప్పుచేతల్లో ఉండటంకూడా ఇష్టపడలేదు. ఎలాగైనా ఆంగ్లేయులను పారద్రోలాలని పూనుకున్నారు. ఇదే యుద్ధానికి కారణం. ఆక్లండ్ కాలంలో ఆంగ్లేయులకు, ఆఫ్ఘన్లకు యుద్ధం జరిగింది. ఈ యుద్ధం ఆంగ్లేయులకు అమిత అమిత నష్టాన్ని కల్గజేసింది. అవమానభారంతో ఆక్లండ్ రాజీనామాచేయగా ఎలెన్‌బరో గవర్నర్‌గా నియమించబడ్డాడు. షాషుజా వలన ఎటువంటి ఉపయోగంలేదని గ్రహించిన ఆంగ్లేయులు దోస్తు మహమ్మద్ కుమారుడైన అక్బరు ఖాన్‌తో 1841లో సంధి చేసుకున్నారు. కాని ఈ సంధి షరతులు ఆంగ్లేయులకి మాత్రం ఉపయోగకరంగా లేవు.

### షరతులు :

1) దోస్తు మహమ్మద్‌ను ఖైదునుండి విడుదలచేసి కాబూలు పంపించాలి.
2) ఆంగ్లసైన్యం కాబూలు వదిలి వెళ్లిపోవాలి.
3) షాషుజా పదవి నుండి తొలగిపోవాలి.

ఈ సంధి షరతులను ఆంగ్లేయులు అములుపరచక అక్బరు ఖాన్ విరోధులతో సంప్రదింపులు జరిపారుకాని, వారుకూడా సహాయంచేయుట ఇష్టపడలేదు. ఈ లోపల షాషుజా శత్రువుల చేతిలో మరణించాడు.

ఎలన్‌బరో ఈ పరిస్థితులలో యుద్ధమే శరణ్యమని భావించి, పోలక్, నాట్ అను సేనానులను పూర్తి అధికారాలతో ఆఫ్ఘనిస్థాన్ పంపాడు. పోలక్ ఆఫ్ఘన్లను ఓడించి, బాలహిస్సార్, కాబూలులను ఆక్రమించాడు. నాట్ గజనీని స్వాధీనపరచుకున్నాడు. దీనితో మొదటి ఆఫ్ఘన్ యుద్ధం ముగిసింది.

**ఫలితాలు :**

ఆంగ్లేయులు దోస్తు మహమ్మద్‌ను ఖైదు నుండి విడుదలచేసి రాజుగా నియమించారు. ఇతను 1863 వరకు పరిపాలించాడు. అతను వున్నంతవరకు ఆంగ్లేయులతో మైత్రితో వున్నాడు.

ఈ యుద్ధంలో ఇరుపక్షాలవారికి ధననష్టం, జననష్టం జరిగింది. ఆంగ్లేయులు ఇదివరలో చేసిన యుద్ధాలు వేరు. ఇప్పుడు ఆఫ్ఘన్లతో చేసిన యుద్ధాలు వేరు. ఈ యుద్ధం వలన ఆఫ్ఘన్లకు ఆంగ్లేయులమీద ద్వేషం పెరిగింది. ఇదే రెండవ ఆఫ్ఘన్ యుద్ధానికి దారితీసింది.

**19.6. ఉపసంహారం :**

1857 లోపల ఆంగ్లేయులు చేసిన ఈ యుద్ధాల వలన ఆంగ్ల సరిహద్దులు విస్తరించాయి. దీనితో ఆంగ్లరాజ్యాన్ని ఎదుర్కొనటానికి విదేశీయులు కూడా సాహసించలేదు.

**మాదిరి ప్రశ్నలు :**

1) మొదటి ఆఫ్ఘన్ యుద్ధ కారణములు పేర్కొనుము.
2) ఆంగ్లేయులు బర్మాతో చేసిన యుద్ధములను వివరింపుము.
3) ఆంగ్లేయుల సింధు ఆక్రమణను వివరింపుము.
4) మొదటి బర్మా యుద్ధము

**చదువదగిన గ్రంథాలు :**

1) Indian History & Culture - B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao
2) North - West Frontier & Afganistan - Bellws.
3) History of British India - P.E. Roberts.

రచయిత : **ప్రమీల గోగినేని**

పాఠం - 20

# ముఖ్య గవర్నర్ జనరల్‌లు

విషయసూచిక

20.0 లక్ష్యం
20.1 ఉపోద్ఘాతం
20.2 వారన్ హేస్టింగ్సు
20.3 కారన్‌వాలిస్
20.4 వెల్లస్లీ
20.5 హేస్టింగ్సు
20.6 బెంటింక్
20.7 డల్‌హౌసి
20.8 సమీక్ష

## 20.0 లక్ష్యం :

క్రీ.శ. 1772 - 1858 మధ్య కాలంలో భారతదేశంలోని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని పరిపాలించిన ముఖ్య గవర్నర్ జనరల్‌లు అయిన వారన్ హేస్టింగ్స్, వెల్లస్లీ, హేస్టింగ్సు, బెంటింక్, డల్‌హౌసీల గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## 201. ఉపోద్ఘాతం :

క్రీ.శ. 1772 - 1858 మధ్య కాలంలో భారతదేశంలోని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని పరిపాలించిన గవర్నర్ జనరల్స్‌లో ముఖ్యులైన వారన్ హేస్టింగ్స్, కారన్‌వాలిస్ ప్రభువు, వెల్లస్లీ, హేస్టింగ్స్, బెంటింక్, డల్‌హౌసీలు ప్రభుత్వ యంత్రాంగంలో గొప్ప మార్పులు తెచ్చి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని సుస్థిరంగా స్థాపించడానికి దోహదం చేసారు. బ్రిటీష్ సామ్రాజ్య వ్యాప్తే తమ ధ్యేయంగా తలచక వీరు పరిపాలనలో అనేక మార్పులు చేసి, ప్రజల మన్ననలు పొందటానికి ప్రయత్నించారు.

## 20.2 వారన్ హేస్టింగ్స్ (1772 - 1785) :

### 20.2.1 ఉపోద్ఘాతం :

క్లైవ్‌చే స్థాపించబడిన ఆంగ్లాధికారమును వారన్ హేస్టింగ్స్ సుస్థిరపరచి, విస్తృతం చేసి, చక్కని పరిపాలనా వ్యవస్థను ప్రసాదించాడు.

### 20.2.2 తొలిజీవితము :

క్రీ.శ. 1732 డిశంబరు 6వ తేదీన చర్చిల్ అనే పట్టణంలో వారన్ హేస్టింగ్స్ జన్మించాడు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి, తండ్రి నిరాదరణకు గురియై దూరబంధువు దగ్గర పెరిగి 1750లో తూర్పు ఇండియా సంఘంలో గుమాస్తాగా భారతదేశం వచ్చాడు. హేస్టింగ్స్ స్వశక్తితో త్వరలోనే వృద్ధిలోకి వచ్చి బక్సార్ యుద్ధంలో క్లైవ్‌కు సహాయపడినాడు. 1772లో బెంగాల్ రాష్ట్ర గవర్నర్‌గా హేస్టింగ్స్‌ను డైరెక్టర్‌లు నియమించారు. 1773 రెగ్యులేటింగ్ చట్టము ప్రకారం బెంగాల్ గవర్నర్ జనరలై 1785 వరకు పదవిలో కొనసాగాడు.

### 20.2.3 పాలనా సంస్కరణలు :

వారన్ హేస్టింగ్స్ సంస్కరణలు ప్రవేశపెట్టినపుడు మూడు అంశాలకు ప్రాధన్యత ఇచ్చాడు. అవి

ఎ) ఆంగ్లేయుల సార్వభౌమత్వం పైన భారత ప్రజలలో నమ్మకం కలిగేటట్లు చేయడం

బి) ప్రజల అవసరాలను తెలుసుకోవడానికి గూఢచారులను నియమించడం

సి) ప్రభుత్వానికి ప్రజలకు ముఖాముఖీ సంబంధాలు ఏర్పరచి కంపెనీ నిరంకుశత్వాన్ని స్థాపించటం

వారన్ హేస్టింగ్స్ ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలు :

ఎ) పరిపాలనా సంస్కరణలు బి) న్యాయ సంస్కరణలు సి) భూమిశిస్తు సంస్కరణలు డి) ఇతర సంస్కరణలు

### ఎ) పరిపాలనా సంస్కరణలు :

వారన్ హేస్టింగ్స్ అధికారానికి రాగానే ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి బెంగాల్ రాష్ట్రపాలనా బాధ్యతలన్నింటినీ కంపెనీయే నిర్వహించేటట్లు చేసెను పసివాడైన బెంగాల్ నవాబు నజీమ్‌ఉద్దౌలాకు భరణమిచ్చి మీర్జాఫర్ భార్య మున్నీబేగంను సంరక్షకురాలుగా నియమించాడు. కంపెనీవారు దివానీ అధికారమునకు ప్రతిఫలముగా బెంగాల్ నవాబుకు ఇచ్చే భరణం 32 లక్షల నుంచి 16 లక్షలకు తగ్గించాడు. మొగల్ చక్రవర్తి షా ఆలం మహారాష్ట్రుల పక్షం చేరినాడను మిషతో అలహాబాద్ సంధి ప్రకారం అతనికి చెల్లించు 26 లక్షల భరణం రద్దుచేయడమేకాక కారా, అలహాబాద్ జిల్లాలను అతని నుండి సంగ్రహించి అయోధ్య నవాబుకు 50 లక్షలకు అమ్మి కంపెనీకి ఆర్థికంగా లాభం చేకూర్చినాడు.

### బి) న్యాయసంస్కరణలు :

సివిల్, క్రిమినల్ వ్యవహారాలను పరిష్కరించడానికి వారన్ హేస్టింగ్స్ వేరువేరుగా జిల్లా న్యాయస్థానాలను స్థాపించి, సివిల్ న్యాయస్థానానికి కలెక్టరును, క్రిమినల్ న్యాయస్థానానికి ఒక భారతీయుని న్యాయాధిపతిగా నియమించాడు. ఈ న్యాయస్థానాల నుంచి అప్పీళ్ళను విచారణ చేయడానికి కలకత్తాలో సదర్‌దివానీ అదాలత్, సదర్ నిజామత్ అదాలత్ అనే రెండు ఉన్నత న్యాయస్థానాలను ఏర్పరచినాడు. సంప్రదాయ సిద్ధంగా వస్తున్న హిందూ మహమ్మదీయ చట్టాలననుసరించి దేశంలోని పండితుల సహాయంతో న్యాయపాలన చేయడానికి ఏర్పాట్లు చేసాడు. హిందూ న్యాయశాస్త్రాన్ని గ్రంథ రూపంగా తయారుచేయించి దానిని పారశీక భాషలోకి తర్జుమా చేయించాడు. ఆంగ్ల ఉద్యోగులు సంస్కృత పారశీక భాషలను నేర్చుకోవడానికి ఆ భాషలలో ప్రవీణులైనవారిని పోషిస్తూ వారి సహాయంతో ఉత్తమ వ్యవహార గ్రంథాలను తర్జుమా చేయడానికి ప్రయత్నించాడు. ఈ విధంగా తర్జుమా చేసిన గ్రంథాలలో ముఖ్యమైనది హిందూ న్యాయశాస్త్ర సంహిత.

### సి) భూమిశిస్తు సంస్కరణలు :

ప్రభుత్వానికి ముఖ్యమయిన రాబడి భూమిశిస్తు. అందువలన వారన్ హేస్టింగ్స్ భూమిశిస్తు వసూలు చేయడంలో ఒక కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినాడు. 17వ శతాబ్దం నుంచి భూమిశిస్తు వసూలుచేసే అధికారం జమీందారులకు ఉండేది. వారు రైతులు వద్ద నుంచి శిస్తు వసూలుచేసి అందులో కొంతభాగం తాము ఉంచుకొని మిగతాది ప్రభుత్వానికి చెల్లించేవారు. ఈ జమీందారీ హక్కు వంశపారంపర్యంగా ఉండేది. క్లైవ్ బెంగాల్ గవర్నరయిన తరువాత జమీందార్ల వద్ద నుంచి శిస్తు వసూలు చేయడం కోసం ఇద్దరు నాయకులను నియమించాడు. వారన్ హేస్టింగ్స్ గవర్నర్ కాగానే నాయకుల ఉద్యోగాలను రద్దుచేసి ఆర్థిక విషయాలను పరిశీలించడానికి గవర్నర్‌తోకూడిన ఒక చిన్న సంఘాన్ని నియమించాడు. దానికి బోర్డ్ ఆఫ్ కంట్రోలు అని పేరు. ఈ బోర్డు శిస్తు వసూలు చేసే విధానంలో ఒక నూతన పద్ధతిని ప్రవేశపెట్టింది. దీనినే వేలం పద్ధతి అంటారు. ఈ వేలం పద్ధతి ప్రకారం వేలంపాటలో ఎవరయితే ఎక్కువ పాడతారో వారికి భూమిశిస్తు వసూలుచేసే అధికారం 5 సంవత్సరాలకు ఇవ్వడం జరుగుతుంది. 5 సంవత్సరాల తరువాత

తిరిగి వేలం జరుగుతుంది. చాలావరకు జమీందార్లే వేలంపాడి శిస్తు వసూలు హక్కుపొందారు. అందువల్ల ఈ కొత్తవిధానం హేస్టింగ్స్ ఆశించినట్లుగా పెద్దమార్పు తేలేదు. వారన్ హేస్టింగ్స్ 1774లో వేలం పద్ధతిని రద్దుచేసి అధికారుల ఆజ్ఞానుసారం రెవిన్యూ నియంత్రణ సమితిని నియమించాడు. దీనిలో 5గురు సభ్యులు. వారిలో ఇద్దరు బోర్డు ఆఫ్ కంట్రోల్ సభ్యులు. అట్లే రాష్ట్రాన్ని 6 భాగాలుగా చేసి, ఒక్కొక్క భాగంలో 5గురు సభ్యులు గల ఒక సమితిని ఏర్పాటు చేశాడు. ఈ సమితులకు భూమిశిస్తు అధికారం ఇచ్చాడు. అంతేకాక కలెక్టర్లకు బదులుగా భూమిశిస్తు విషయాలను గమనించడానికి స్వదేశీ దివానులను నియమించాడు. కాని, ఈ మార్పులు కూడా లాభదాయకంగా లేవు. వారన్ హేస్టింగ్స్ తదుపరి అధికారుల అనుమతి తీసుకొని మధ్యవర్తులను తొలగించి, జమీందార్లే ఏటా కొంత మొత్తం ప్రభుత్వానికి కట్టేటట్టు చేసినాడు. కారన్‌వాలిస్ ఈ విధానంలో కొంత మార్పు చేసి శాశ్వత శిస్తు విధానాన్ని ప్రవేశపెట్టాడు.

### డి) ఇతర సంస్కరణలు :

వారన్ హేస్టింగ్స్ రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పడానికి ఒక్కొక్క జిల్లాను ఠాణాలుగా విభజించి, వాటి వ్యవహారాలను దరోగాకు అప్పచెప్పినాడు. ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క పోలీస్ సూపరిండెంట్‌ను నియమించి వారు జిల్లా కలెక్టరు కింద పనిచేయునట్లు ఏర్పాటుచేశాడు. పిల్లలను దొంగిలించే దిగంబర సన్యాసులను పట్టుకొని, శిక్షించి తిరిగి అటువంటి ప్రమాదం జరగకుండా కట్టుదిట్టం చేసాడు. వారన్ హేస్టింగ్స్ వాణిజ్యానికి కూడా ప్రోత్సాహం ఇచ్చాడు. స్వదేశీయులతోపాటు ఆంగ్లేయ వర్తకులు కూడా రెండున్నర శాతం సుంకం కట్టవలెనని నిర్ణయించాడు. ఉప్పు, నల్లమందు, నేత పరిశ్రమలను ప్రోత్సహించాడు. భారతీయ సంస్కృతిని పరిరక్షించి దాని ఔన్నత్యమును చాటుటకు విలియన్ జోన్స్ అధ్యక్షతన 'ఏసియాటిక్ సొసైటి ఆఫ్ బెంగాల్' అను సంస్థను ఏర్పాటు చేశాడు. ఈ సంస్థ భారతదేశ చరిత్ర - సంస్కృతి నిర్మాణానికి గొప్ప సేవచేసింది.

**20.2.4 విదేశాంగ విధానము :** వారన్ హేస్టింగ్స్ రాజ్యాంగవేత్తేగాక యుద్ధాలలో నిపుణుడు. అతడు రోహిల్లాలతోను, మైసూర్‌తోను, మహారాష్ట్రులతోను యుద్ధాలుచేసి గెలవడమే ఇందుకు నిదర్శనము.

**20.2.5 ముగింపు :** క్లైవ్ స్థాపించిన ఆంగ్లాధికారము స్వదేశీయుల ప్రతిఘటనకు గురియైనపుడు వారన్ హేస్టింగ్స్ దానిని సంరక్షించి సుస్థిరతను ప్రసాదించాడు. సర్ విలియం హంటర్ మాటలలో భారతదేశములో వారన్ హేస్టింగ్స్ సివిల్ పరిపాలనా విధానమునకు పునాదులు వేసాడు.

## 20.3 కారన్‌వాలీస్ ప్రభువు (1786 - 1793) :

**20.3.1 ఉపోద్ఘాతము :** హేస్టింగ్స్ వలె కారన్‌వాలీస్ కూడా ప్రభుత్వ విధానంలో అనేక మార్పులు చేసాడు. ఇతనికి భారతీయుల మీద, వారి నాగరికతా సంస్కృతుల మీద మంచి అభిప్రాయం లేదు. ఇతడు ప్రవేశపెట్టిన సంస్కరణలన్నీ ఇంగ్లాండ్‌లోని పద్ధతులననుసరించి ఉన్నాయి.

**20.3.2 తొలిజీవితం :** కారన్‌వాలీస్ 1738 డిసెంబరు 31న జన్మించాడు. ఏటన్‌లో విద్యాభ్యాస్యం చేసి, ట్యూరిన్ మిలటరీ అకాడమీలో తర్ఫీదు పొందాడు. 1759లో కామన్స్‌సభలో సభ్యుడుగా ఎన్నికైనాడు. ఆ తదుపరి లార్డ్స్ సభలో సభ్యత్వం పొందాడు. పెక్కు యుద్ధాలలో పాల్గొని గొప్ప యోధుడిగా పేరు పొంది మేజర్ జనరల్ స్థానం సంపాదించాడు. ఇంగ్లాండులోని అధికార వర్గమునకు సన్నిహితుడగుటచే ఇతడు 1786లో బెంగాల్ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యెను.

**20.3.3. పరిపాలనా సంస్కరణలు :** కారన్‌వాలీస్ బ్రిటీష్ పాలనా వ్యవస్థను చక్కబరచుటకు సివిల్, రాజ్యాంగ, భూమిశిస్తు, న్యాయ, పోలీస్ సంస్కరణలను ప్రవేశపెట్టాడు.

**ఎ) సివిల్ సంస్కరణలు :** కంపెనీ ఉద్యోగస్థులలో ప్రబలిన అవినీతి, లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం రూపుమాపుటకు కంపెనీ ఉద్యోగుల జీతాలు పెంచాడు. సొంత వ్యాపారమును నిషేధించాడు. భారతీయులపట్ల కారన్‌వాలీస్‌కు సదభిప్రాయం లేనందువల్ల వారంతా హెచ్చుజీతాలు పొందటానికి అనర్హులని నమ్మాడు. అందువల్ల భారతీయులను చిన్న చిన్న ఉద్యోగములందు నియమించాడు. ఉన్నత ఉద్యోగాలన్నింటిని ఆంగ్లేయులకే ఇచ్చాడు. సిఫారస్‌లనుబట్టిగాక యోగ్యతలనుబట్టి ఉద్యోగాలిచ్చాడు.

**బి) రాజ్యాంగ సంస్కరణలు :** గవర్నర్ జనరల్ ఆదేశాలకు లోబడి రాష్ట్ర గవర్నర్‌లు వ్యవహరించాలి. 1793 చట్టప్రకారం గవర్నర్ జనరల్, గవర్నర్లకు వీటో అధికారమీయబడింది. భారతదేశ ఆదాయము నుండి బోర్డు ఆఫ్ కంట్రోల్ సభ్యుల వేతనాలు చెల్లింపబడాలి. భారతదేశ వ్యయపత్రాలను కంపెనీవారు బ్రిటీష్ పార్లమెంటుకు సమర్పించాలి.

**సి) భూమిశిస్తు సంస్కరణలు (లేదా) శాశ్వత శిస్తు నిర్ణయం :** కారన్ వాలీస్ ప్రవేశపెట్టిన సంస్కరణలన్నిటిలో ఎక్కువ ప్రాముఖ్యం వహించినది శాశ్వతపన్ను విధానము. 17వ శతాబ్దం నుంచి బెంగాల్ రాష్ట్రంలో జమీందారులు రైతుల వద్ద నుంచి భూమిశిస్తు వసూలుచేసి, కొంతభాగం తాము ఉంచుకొని మిగతాది ప్రభుత్వానికి జమకట్టేవారు. ఈ జమిందారీ హక్కు వంశపారంపర్యంగా వచ్చేది. వారు భూమి స్వంతదారులు కాదు. వారు స్వార్ధపరులై రైతుల వద్ద నుంచి ఎక్కువ మొత్తం వసూలుచేసి ప్రభుత్వానికి తక్కువ మొత్తం చెల్లించడం వలన ప్రభుత్వానికి రైతులకు నష్టదాయకం పరిణమించింది. ఈ పద్ధతికి బదులుగా హేస్టింగ్స్ వేలం పద్ధతిని ప్రవేశపెట్టాడు. కాని ఇది కూడా లోపభూయిష్టమయింది. వేలం పాడినవారు రైతులను అమితంగా పీడించి కంపెనీకి పైకం చెల్లించక బకాయి పెట్టేవారు. కలెక్టర్లు వేలంపాటదార్లతో చేరి లంచాలు పుచ్చుకొని కంపెనీని మోసం చేయసాగారు. భూమిశిస్తు వసూలు కంపెనీ డైరెక్టర్లకు ఒక సమస్య అయింది. తిరిగి పాతపద్ధతి ప్రకారం భూమిశిస్తు వసూలు చేసే అధికారం జమీందార్లకే ఇచ్చివేసి, వారు ప్రభుత్వానికి ఎంత శిస్తు చెల్లించవలసిందీ శాశ్వతంగా నిర్ణయిస్తే కంపెనీకి నిలకడైన రాబడి ఉంటుందని తలచి డైరెక్టర్లు తమ అభిప్రాయాన్ని కారన్‌వాలీస్‌కు వెలిబుచ్చినారు. వారి ఆజ్ఞమేరకు కారన్‌వాలీస్ రైతులు ఎంత భూమిని సాగుచేస్తున్నారో, ఎంత పంట పండుతున్నదో, ఇంతవరకు వారు ఎంత శిస్తు కడుతున్నారో కనుక్కొని లెక్కలు తయారుచేయమని కలెక్టర్లకు చెప్పాడు. కాని కలెక్టర్లు ఎంత శ్రమపడినా పూర్తి వివరాలు తెలుసుకోలేకపోయారు. కలెక్టర్లు తమ కాలమంతా ఈ విషయ సేకరణకు ఉపయోగిస్తే వారి మిగతా పనులకు ఇబ్బంది అని తలచి అప్పటివరకు లభించిన వివరాల ఆధారంగా రైతులు ఎంత కట్టవలెనో జమీందార్ల వద్దనుంచి ఎంత పన్ను వసూలుచేయాలో నిర్ణయించి శాశ్వతంగా భూములను 1789లో జమిందార్లకు ఇచ్చివేసినాడు. ఈ విధానానికే 'శాశ్వత భూమిశిస్తు విధానము' అని పేరు.

## 1) భూమి శిస్తు విధానంలోని ముఖ్యాంశాలు :

ఎ) జమీందార్లకు భూమి స్వంతదార్లుగా పరిగణన ఉంటుంది. అయితే ఏ సందర్భంలోనైనా వారు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే వారికి భూమిపై హక్కులు రద్దు అవుతాయి.

బి) జమీందార్లు కట్టే భూమి శిస్తు తప్పించి భూమిపై ఇతర పన్నులద్వారా వసూలు అయిన ధనం ప్రభుత్వానికి దక్కదు.

సి) శాశ్వత భూమిశిస్తు 1765 నాటికి అమలులో ఉన్న పన్నుకు రెండింతలు జమీందార్లు ప్రభుత్వానికి జమకట్టాలి.

డి) జమీందార్లకు న్యాయవిచారణ హక్కులుండవు.

ఇ) జమీందార్లు రైతులతో తమకు ఇష్టం వచ్చిన నిబంధనలు పట్టాల రూపంలో చేసుకోవచ్చు. ఒకవేళ జమీందారు ఆ నిబంధనలను అతిక్రమిస్తే రైతు కోర్టులో ఫిర్యాదు చేయవచ్చు.

## 2) శాశ్వత భూమిశిస్తు విధానంలోని లాభాలు :

ఎ) శాశ్వతశిస్తు విధానంవల్ల ప్రభుత్వానికి సకాలానికి తమకు రావలసిన మొత్తం అందుతుండేది.

బి) అందువల్ల వారు తలపెట్టిన కార్యాలు నిర్విఘ్నంగా జరగడానికి వీలయ్యేది.

సి) పూర్వం కన్నా కంపెనీ రాబడి రెట్టింపైంది.

డి) జమీందార్లకు పన్ను వసూలు చేసే అధికారం అప్పగించినందువల్ల కంపెనీవారు వేరే ఉద్యోగస్తులను నియమించడం, వారి ఖర్చులను భరించడం అవసరం లేనందువల్ల కంపెనీ ఖర్చు చాలా తగ్గిపోయింది.

ఇ) జమీందార్లు భూమిపై శాశ్వత హక్కును కల్గి యుండుటచేత తమ హక్కుల రక్షణార్థము ఎల్లప్పుడూ ఆంగ్లేయులకు విధేయులై విశ్వాసపాత్రులై మసలిరి.

ఎఫ్) జమీందార్లు బంజరు భూములను సాగుబడిలోకి తెచ్చి వ్యవసాయాభివృద్ధి చేసి ఐశ్వర్యవంతులైరి.

జి) తత్ఫలితంగా జమీందారులు వర్తక, పారిశ్రామిక, సాంఘిక, సాంస్కృతిక రంగములందు ప్రముఖపాత్ర వహించిరి.

### 3) శాశ్వత భూమిశిస్తు విధానంలోని లోపాలు :

ఎ) భూమిశిస్తు భారము పెరుగుటవలన కొందరు జమీందారులు అప్పులపాలైనారు.

బి) కొందరు జమిందారులు భోగలాలసులై కలకత్తానందే నివసిస్తూ వ్యవసాయమును నిర్లక్ష్యము చేయుట వలన వ్యవసాయాభివృద్ధి కుంటుపడెను.

సి) రైతులకు భూమిహక్కు లేనందువల్ల సంఘము నందు జమీందార్లు, రైతులు అనే రెండు వర్గాలేర్పడి సాంఘిక అనైక్యత ప్రబలెను.

డి) జమీందార్లు కంపెనీకి చెల్లించవలసిన కౌలు నిర్ణయమైనను రైతులు జమీందార్లకు ఎంత కౌలు చెల్లింపవలెనో నిర్ణయం కాకపోవుట వలన వారు రైతులను పీడించారు.

ఇ) బంజరు భూములు సాగుబడిలోనికి వచ్చి ఆదాయం వృద్ధి చెందినా కంపెనీ ఆదాయం పెరగలేదు.

### 4) విమర్శ :

శాశ్వతశిస్తు నిర్ణయం పద్ధతి వివేకవంతమైనదని కొందరు చరిత్రకారులు భావించగా మరికొందరు ఇది ఘోరతప్పిదమని పేర్కొన్నారు. విలియం బెంటింక్ మాటలలో "శాశ్వతశిస్తు నిర్ణయ పద్ధతిలో అనేక లోపాలుండవచ్చు కాని దానివల్ల ఆంగ్లేయుల రాజ్యాధికారం చిరస్థాయిగా ఉండిపోవలెనని కోరుకునే ఒక భూస్వామ్యవర్గం ఏర్పడటం, ఆ భూస్వాములకు ప్రజలపై అధికారం కలగటం ఆంగ్లేయులకు ఎంతో లాభకరమైంది".

### డి) న్యాయసంస్కరణలు :

కారన్‌వాలీస్ దృష్టిని ప్రప్రథమంగా ఆకర్షించినది న్యాయస్థానాలు. ప్రజల యోగక్షేమాలకు న్యాయస్థానాలు ముఖ్యమని కారన్‌వాలీస్ అభిప్రాయం. అందువల్ల న్యాయాధికారము, కార్యనిర్వాహణాధికారం ఒకే వ్యక్తిలో కేంద్రీకరింపబడుట నిరంకుశత్వమునకు దారితీయునని నవాబులకు, కలెక్టర్లకు గల న్యాయాధికారములను రద్దుచేసెను. సమర్ధవంతమైన న్యాయపాలనా వ్యవస్థను సివిల్, క్రిమినల్ కేసుల విచారణలో నాలుగు రకములైన న్యాయస్థానాలను నెలకొల్పెను.

1) మొదటి 50 రూపాయలు మించని కేసుల విచారణకై చిన్న చిన్న న్యాయస్థానాలను (మున్సిఫ్ కోర్టులను) స్థాపించెను.

2) ప్రతి జిల్లాకు ఒక జిల్లా న్యాయస్థానం స్థాపించి ఆంగ్లజడ్జి ఆధీనమందుంచెను.

3) వీరిపైనా పాట్నా, ఢాకా, ముర్షిదాబాద్, కలకత్తాలందు సంచార న్యాయస్థానాలను నెలకొల్పెను. ఈ న్యాయస్థానములు జిల్లాలో పర్యటించి అచటి అప్పీళ్ళను విచారించును. ఈ న్యాయస్థానాల్లో ఇద్దరు ఆంగ్లేయులు, ఒక భారతీయుడు ఉంటారు.

4) ఈ సంచార న్యాయస్థానాల నుండి వచ్చు అప్పీళ్ళను విచారించటకు కలకత్తా నందు సుప్రీమ్ సివిల్‌కోర్టు (సర్ దివానీ అదాలత్) ను నెలకొల్పెను. ఇది గవర్నర్ జనరల్ ఆధీనమందుండెను. సివిల్ కోర్టులు మాదిరిగానే క్రిమినల్ కేసులందూ వివిధ

స్థాయిలందు 4 రకాలైన కోర్టులు గలవు. వీనిలో చిన్న న్యాయస్థానాలను దరోగా కోర్టులందురు. ఇవి భారతీయ న్యాయమూర్తి ఆధీనమందుండును. ఇంకను జిల్లా కోర్ట్లు, సంచార కోర్టులు, సుప్రీం క్రిమినల్ కోర్టు కలవు. కొత్తగా ఏర్పాటుచేయబడిన న్యాయస్థానాలు సక్రమముగా పనిచేయుటకు కారన్‌వాలీస్ ఒక నిబంధనావళిని తయారుచేయించాడు. దీనినే కారన్‌వాలీస్ కోడ్ అందురు. ఈ కోడ్ నందు ఆంగ్ల న్యాయవిచారణ విధాన సూత్రాలు పొందుపరచబడెను. ఉరిశిక్ష, అమానుష శిక్షలు రద్దు చేయబడెను.

### ఇ) పోలీస్ సంస్కరణలు :

కారన్‌వాలీస్ జమీందార్లకున్న పోలీస్ అధికారాలను రద్దుచేసి పోలీస్ దళమును పునర్నిర్మించి నేటి పోలీస్‌శాఖకు పునాదులు వేసెను. ప్రతి జిల్లాకు ఠాణాలుగా విభజించి ప్రతి ఠాణాకు ఒక పోలీస్ స్టేషన్‌ను, దానికి దరోగా అను పోలీస్ అధికారిని నియమించెను. ప్రతి జిల్లాకు ఒక పోలీస్ సూపరిండెంట్‌ను నియమించి పోలీస్‌శాఖ పర్యవేక్షణాధికారమును జిల్లా కలెక్టర్ ఆధీనమందుంచెను.

### 20.3.4 విదేశాంగ విధానము :

కారన్‌వాలీస్ శాంతికాముకుడైనను బ్రిటీష్ రాజ్యమనుగడకు ప్రమాద మేర్పడినపుడు తన విధానమును మార్చుకొని మైసూర్ ప్రభువగు టిప్పుసుల్తాన్‌తో మూడవ మైసూర్ యుద్ధంచేసి ఓడించి టిప్పు రాజ్యంలో సగం భాగం తీసుకున్నాడు.

### 20.3.5 ఘనత :

కారన్‌వాలీస్ తన సంస్కరణలలో విదేశాంగనీతి ప్రదర్శించి బహుముఖ ప్రజ్ఞావంతుడని పేరు పొందడమేగాక, భారతదేశంలో బ్రిటీష్ పరిపాలన పటిష్టంగా ఉండటానికి బలమైన పునాదులు వేశాడు.

## 20.4 వెల్లస్లీ ప్రభువు (1798 - 1805) :

### 20.4.1 ఉపోద్ఘాతము :

సర్‌జాన్‌షోర్ తరువాత గవర్నర్ జనరల్‌గా నియమితుడైన వెల్లస్లీ సాధ్యమైనంత వరకు స్వదేశ సంస్థానాలలో ఏదో ఒక మిష మీద జోక్యం కలిగించుకొని, వారిని సామంతులుగా చేసి బ్రిటీష్ సామ్రాజ్యాధికారాన్ని భారతదేశంలో చాలా భాగం వ్యాపింపజేసాడు.

### 20.4.2 తొలిజీవితం :

మార్క్విస్ వెల్లస్లీ 1760 జూన్ 20వ తేదీన జన్మించాడు. ఇతడు ఏటన్, క్రైస్ట్‌చర్చి, ఆక్స్‌ఫర్డ్‌లలో విద్యాభ్యాసం చేసి, చదువు పూర్తిగాక పూర్వమే తండ్రి మరణించినందువల్ల చదువుకు స్వస్తి చెప్పి కుటుంబ బాధ్యతలను స్వీకరించాడు. 1781లో కామన్సు సభకు ఎన్నికైనాడు. ఆ తదుపరి ట్రెజరిలో జూనియర్ లార్డుగాను, బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌లో సభ్యుడుగాను పనిచేసి 1798లో బెంగాల్‌కు గవర్నర్ జనరల్‌గా పదవీ స్వీకారం చేసాడు.

### 20.4.3 నాటి భారతదేశ పరిస్థితులు :

వెల్లస్లీ భారతదేశానికి వచ్చునాటికి బ్రిటీష్‌వారి అధికారం బెంగాల్, మద్రాస్, బొంబాయి రాష్ట్రాలలో మాత్రమే వ్యాపించి ఉండేది. ఈ రాష్ట్రాలకు స్వతంత్రదేశ సంస్థానాలు ఇరుగుపొరుగులుగా ఉండేవి. ఈ సంస్థానాలలో పరస్పర పోరాటాలు, అంతః కలహాలు సర్వసాధారణమై ఉండేవి. మైసూరు టిప్పుసుల్తాన్ ఆంగ్లేయులను పాలద్రోలుటకై ఫ్రాన్స్ చక్రవర్తితో సంప్రదింపులు

జరుపుచుండెను. హైదరాబాద్ నిజామ్, మహదాజీ సింధియా తమ సైన్యాలకు ఫ్రెంచి సైన్యాధికారులచే శిక్షణ ఇప్పించుచుండిరి. కాబూల్ వజీర్ భారతదేశంపై దండెత్తునను వదంతులు వ్యాపించెను.

### 20.4.4. వెల్లస్లీ ఆశయాలు :

భారతదేశంలో ఫ్రెంచి ప్రాబల్యమును నాశనము చేయుట, భారతదేశానికి బ్రిటీష్‌వారిని సార్వభౌములుగా చేయుట మరియు బ్రిటీష్ పాలనా విధానమును పటిష్టపరచుట వెల్లస్లీ ఆశయాలు. ఈ ఆశయాన్ని నెరవేర్చుకోవడం కోసం వెల్లస్లీ నాలుగు పద్ధతులు అనుసరించాడు. అవి

ఎ) సైన్యసహకార పద్ధతి

బి) యుద్ధాలు

సి) దుష్పరిపాలన అను మిష

డి) పరిపాలన సంస్కరణలు

**ఎ) సైన్య సహకార పద్ధతి :** వెల్లస్లీ తన ఆశయాన్ని నెరవేర్చుకోవడం కోసం అవలంబించిన పద్ధతులలో ముఖ్యమైనది సైన్యసహకార పద్ధతి.

### 1) సైన్యసహకార పద్ధతి లక్షణాలు :

ఎ) ఈ పద్ధతికి ఒప్పుకొనిన సంస్థానాధీశుడు ఆంగ్ల సైన్యాలను తన రాజ్యంలో పెట్టుకొని, వాటికి అయ్యే ఖర్చులు భరించవలె. లేదా అందుకు తగిన ఆదాయం వచ్చే ప్రాంతాలను ఆంగ్లేయులకు ఇవ్వవలె. ఈ సైన్యం సంస్థానంలోని అంతః కలహాలను అణచడానికి, ఆ సంస్థానముపై ఇతరులు దాడిచేసినపుడు దానిని త్రిప్పికొట్టటానికి ఉపయోగించబడుతుంది.

బి) ఇతర సంస్థానాలలో వారికి గల వాదప్రతివాదనలన్నిటినీ ఆంగ్లేయుల మధ్యవర్తిత్వంలో వారి సలహాలననుసరించి పరిష్కరించుకొనవలెను.

సి) వారు తమ కొలువునందు ఆంగ్లేయులను తప్ప ఇతర ఐరోపియనులను చేర్చుకోవడంగాని, వారితో సంబంధం పెట్టుకోవడం కాని కూడదు. ఆంగ్లేయుల మిత్రులను తమ మిత్రులుగాను, వారి శత్రువులను తమ శత్రువులుగాను పరిగణించవలెను.

డి) రక్షణ పొందిన సంస్థానాలలో ఆంగ్ల అధికారిని ఒకరిని, ఉంచుకొనవలెను. సంస్థానాదీశులు సంధి షరతులన్నిటినీ పాటిస్తున్నారో లేదో చూడటం అతని కర్తవ్యము.

ఇ) ఈ షరతులను అంగీకరించిన సంస్థానాదీశులను సర్వకాల సర్వావస్థల యందు శత్రుభయం లేకుండా రక్షించడానికి ఆంగ్లేయులు ఒప్పుకొన్నారు.

### 2) సైన్య సహకార పద్ధతిలో గుణదోషాలు :

ఎ) ఈ సంధి అమలులోకి రాగానే ఆ సంస్థానాలలో అంతఃకలహాలు అంతమైనాయి.

బి) సంస్థానాల మధ్య యుద్ధాలు కూడా చాలావరకు తగ్గిపోయాయి.

సి) ఆంగ్లేయులకు అనేక సైనిక స్థావరాలు లభించాయి.

డి) తమ సైన్యాల ఖర్చు సంస్థానాలు భరిస్తూ ఉన్నందువల్ల ఆంగ్లేయులకు ఆర్థికంగా ఎంతో లాభకరమైంది.

ఇ) నామకః ఆసంస్థానాలు స్వతంత్రాలుగా ఉన్నా, ఆంగ్లేయులు వారి స్వంత విషయాలలో తరచు జోక్యం పెట్టుకుంటూ తన అధికారాన్ని చాటేవారు.

ఎఫ్) బాధ్యతలేని అధికారం ఆంగ్లేయులకు ఈ సంధి ద్వారా లభించడం వెల్లస్లీ చతురతకు తార్కాణము.

జి) ఆంగ్లేయుల వ్యాపారం కూడా చాలా వృద్ధిపొందింది. ఇంతకు పూర్వం సులభంగా ప్రవేశంలేని సంస్థానాలలో వారు స్వేచ్ఛగా వ్యాపారం చేయసాగారు. వారిని ఎదిరించే సామర్థ్యం, ధైర్యం రాజులకు లేకపోయింది.

హెచ్) ఆంగ్లేయులకు ఫ్రెంచివారి బాధ పూర్తిగా తొలగిపోయింది.

ఎ) సైన్యసహకారపద్ధతి ఆంగ్లేయులకు లాభదాయకంగా పరిణమించినా సంస్థానాధీశులకు కొంచెమైనా లాభం లేకుండా పోయింది. వారు పూర్తిగా భంగపడినారు.

బి) ఆంగ్ల సైన్యాలకు అయ్యే ఖర్చులు భరించడానికి వారు ఎన్ని ప్రయత్నాలు ఇచ్చినా ఆంగ్లేయులకు తృప్తి కలుగలేదు. తుదకు వారి స్వాధీనంలోఉన్న ఎక్కువ సారవంతాలైన భూములను కోల్పోవలసి వచ్చింది.

సి) ఖర్చులు పెరిగిపోవడంవల్ల పన్నులబాధ అధికమై ప్రజలు చాలా కష్టపడినారు.

డి) రాజులకు ఎటువంటి బాధ్యతలు లేనందువల్ల వారు తమ కాలమంతా విలాసాలలో వెళ్ళబుచ్చేవారు.

ఇ) స్వదేశీ సైనికులకు ఉద్యోగాలు పోయినాయి.

ఎఫ్) నిరుద్యోగ సమస్య ప్రబలింది.

హెచ్) చివరకు ఈ పరిస్థితి అరాచకానికి దారితీసి 1857 - 1858 విప్లవానికి దారితీసింది.

### 3) సైన్య సహకారపద్ధతిలో చేరిన సంస్థానాలు :

ఎ) హైదరాబాదు నిజామ్ మొట్టమొదటిసారిగా 1801లో ఈ పద్ధతిలోచేరి ఆంగ్లసైన్య పోషణార్థము దత్తమండలాలను ఆంగ్లేయులకిచ్చివేసెను.

బి) వెల్లస్లీ 1801లో అయోధ్య నందు ఈ పద్ధతిని బలవంతంగా ప్రవేశపెట్టి గోరక్‌పూర్, రోహిల్‌ఖండ్ గంగా - యమూనా అంతర్వేదిని సంపాదించాడు.

సి) ఈ పద్ధతిలో చేరిన ఇతరులు మొగల్ చక్రవర్తి షా ఆలం, సింధియా, భాన్‌స్లే, గైక్వాడ్, మైసూరు ప్రభువు కృష్ణరాజు వడయారు.

**4) సమీక్ష :** వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్యసహకార పద్ధతి సంస్థానాలను సర్వనాశనం చేసింది. బ్రిటీష్‌వారు భారతదేశంలో తమ సార్వభౌమత్వమును నెలకొల్పుటకు ఈ పద్ధతి ఉపకరించింది.

**బి) యుద్ధాలు :** ఆంగ్ల సామ్రాజ్య విస్తీర్ణంలో వెల్లస్లీ నాల్గవ మైసూర్ యుద్ధం, రెండవ మహారాష్ట్ర యుద్ధం చేశాడు. నాల్గవ మైసూర్ యుద్ధంలో (1799) టిప్పుసుల్తాన్‌ను ఓడించి అతని రాజ్యంలోని అధికభాగాన్ని ఆంగ్ల సామ్రాజ్యంలో చేర్చెను. డీన్‌హట్టన్ మాటలలో మైసూర్ విజయం సైనికంగా, ఆర్థికంగా, స్నేహశాంతుల దృష్ట్యా క్లైవ్ అనంతరం ఆంగ్లేయులు సాధించిన ఒక గొప్ప విజయం. నాల్గవ మైసూర్‌యుద్ధం తరువాత ఆక్రమించిన ప్రాంతాలను ఉత్తర సర్కారులను కలిపి మద్రాస్ రాష్ట్రముగా ఏర్పరచాడు. వెల్లస్లీ రెండవ మహారాష్ట్ర యుద్ధంలో పాల్గొని (1803 - 1805) విజయం సాధించి కటక్ జిల్లాను, వార్దానదికి పశ్చిమముగా నున్న ప్రాంతం, సింధియా, అహమ్మద్‌నగర్, బ్రోచ్‌ని ఆంగ్లరాజ్యంలో చేర్చెను.

**సి) దుష్పరిపాలన అను మిష :** వెల్లస్లీ దుష్పరిపాలన అను నెపముతో తంజావూరు, కర్ణాటకము, సూరత్, ఫరూకాబాద్ పాలకులకు భరణములిచ్చి వాటిని బ్రిటీష్ సామ్రాజ్యంలో విలీనం చేశాడు.

**డి) పరిపాలనా సంస్కరణలు :** వెల్లస్లీ గొప్ప సామ్రాజ్యవాదియేగాక పరిపాలనదక్షత కలవాడు. ఇతడు కొన్ని ముఖ్య సంస్కరణలను ప్రవేశపెట్టాడు.

1) కంపెనీ ఉద్యోగులు తమ విధులు చక్కగా నిర్వర్తించాలంటే వారికి తగిన తర్ఫీదు ఇవ్వవలెనని అభిప్రాయపడి 1800లో కలకత్తాలో ఉన్న విలియం కోటలో ఒక కళాశాలను స్థాపించాడు. కాని ఈ కళాశాలను 1802లో డైరెక్టర్లు మూసివేయించారు.
2) వెల్లస్లీ న్యాయశాఖలో కూడ మార్పులు తెచ్చినాడు. అంతవరకు సాదర్ దివాన్ అదాలత్‌కు న్యాయమూర్తులుగా గవర్నర్ జనరల్, కౌన్సిల్ సభ్యులు వ్యవహరించేవారు. కాని ఈ అలవాటుకు స్వస్తిచెప్పి నిపుణులైన న్యాయమూర్తులను ప్రత్యేకంగా నియమించేపద్ధతి ఏర్పాటు చేశాడు.
3) సిఫారస్‌లను బట్టిగాక అర్హతనుబట్టి ఉద్యోగము లిచ్చాడు.
4) బ్రిటిష్ సైన్యమందు ఆంగ్ల సైనికులను అధికం చేసాడు.
5) వెల్లస్లీ పత్రికలపై అనేక ఆంక్షలు పెట్టినాడు.

### 20.4.5 వెల్లస్లీ ఘనత :

భారతదేశంలోని గవర్నర్ జనరల్ పదవిని అలంకరించిన ప్రముఖులలో వెల్లస్లీ ఒకడు. అతడు భారతదేశానికి వచ్చినపుడు ఆంగ్లేయుల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉండేది. ఒకప్రక్క మహారాష్ట్రులు, మైసూరు, నైజాము, ఇతర సంస్థానాధీశ్వరులు, మరోప్రక్క ఫ్రెంచివారు ఆంగ్లేయులను భయపెడుతుండగా అతడు చాకచక్యంతో అందరినీ అణచి ఆంగ్ల సార్వభౌమత్వాన్ని దేశంలో స్థాపించాడు. పి.ఇ. రాబర్ట్స్ మాటలలో వెల్లస్లీ అద్భుత విజయాలను సాధించిన పాలకుడు, ఆంగ్ల సామ్రాజ్య నిర్మాతలలో ఒకడు మరియు కంపెనీ అక్బర్.

## 20.5 హేస్టింగ్స్ ప్రభువు (1813 - 1823) :

### 20.5.1 ఉపోద్ఘాతం :

హేస్టింగ్స్ ఆంగ్ల సామ్రాజ్య నిర్మాతలలో ఒకడు. ఇతడు వెల్లస్లీ తలపెట్టిన కార్యాన్ని పూర్తిచేసాడు.

### 20.5.2 తొలిజీవితము :

హేస్టింగ్స్ 1754 డిసెంబరులో జన్మించాడు. హారో అనే ప్రాంతంలో విద్యాభ్యాసం చేసి, అమెరికా స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొని పేరు గడించాడు. 1793లో మాయిరా ప్రభువుగా స్థానం పొందినాడు. 1813లో గవర్నర్ జనరల్‌గా భారతదేశం వచ్చాడు.

### 20.5.3 విదేశాంగ విధానము :

హేస్టింగ్స్ వీలయినంతవరకు యుద్ధాలు చేయకుండా బ్రిటీష్ సామ్రాజ్యాన్ని వ్యాపింపచేయడానికి ప్రయత్నించాడు. కాని, అవసరమైనపుడు యుద్ధాలు చేయడానికి వెనకాడలేదు. హేస్టింగ్స్ పాల్గొనిన యుద్ధాలలో ముఖ్యమైనవి నేపాల్ యుద్ధము, మూడవ మహారాష్ట్ర యుద్ధము. నేపాల్ యుద్ధం (1814 - 16) ఫలితంగా బ్రిటీష్ సామ్రాజ్య సరిహద్దు హిమాలయ పర్వతపాదాల వరకు విస్తరించింది. మూడవ మహారాష్ట్ర యుద్ధఫలితంగా మహారాష్ట్రుల ప్రతిభ అడుగంటింది. హేస్టింగ్స్ పిండారీలను కూడా అణచినాడు. హేస్టింగ్స్ శాంతియుత మార్గం అవలంబించి కొన్ని సంస్థానాలను స్వాధీనం చేసుకొన్నాడు. ఈ విధానాన్నే 'అధీన సంబంధ నిరోధము' అంటారు. ఈ విధానాన్ని అంగీకరించిన సంస్థానాలలో రాజపుత్రుల సంస్థానాలు ముఖ్యమైనవి.

### 20.5.4 పాలనా సంస్కరణలు :

హేస్టింగ్స్ రాజ్యవిస్తరణ చేయడమేగాక ప్రభుత్వంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టినాడు.

ఎ) బొంబాయి, మద్రాస్ రాష్ట్రములందు శాశ్వతశిస్తు నిర్ణయపద్ధతికి స్వస్తిచెప్పి రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టెను. బెంగాల్‌లోని రైతుల రక్షణకు అనేక చర్యలు గైకొనెను.

బి) కలెక్టర్లు నుండి తీసివేసిన న్యాయవిచారణ అధికారమును హేస్టింగ్స్ పునరుద్ధరించెను.

సి) హేస్టింగ్స్ భారతీయులపట్ల స్నేహభావం ప్రదర్శించి వారిని న్యాయశాఖలో మునసబులుగా నియమించెను.

డి) దేశీయ భాషలకు ప్రోత్సాహమిచ్చెను.

ఇ) హేస్టింగ్ పత్రికా స్వాతంత్ర్యము ప్రసాదించెను.

ఎఫ్) పాశ్చాత్య విజ్ఞానాన్ని, ఆంగ్లభాషను బోధించుటకు కలకత్తాలో ఒక హిందూ కళాశాలను స్థాపించాడు.

### 20.5.5. ఘనత :

హేస్టింగ్స్ ఆంగ్ల సామ్రాజ్యమునకు స్థిరత్వము, రక్షణ చేకూర్చెను. ఇతడు సాధించిన ఘనవిజయాలలో పేర్కొనదగినవి మహారాష్ట్రుల అధికారమును అంతంచేయుట, గూర్ఖాలను శిక్షించుట, పిండారులను అణచుట. హేస్టింగ్స్ పాలన వలన భారతదేశమందు బ్రిటీష్ సార్వభౌమాధికారము స్థిరపడెనని జె.ఎస్.మిల్. పేర్కొన్నాడు.

## 20.6 విలియం బెంటింక్ (1828 - 1835) :

### 20.6.1 ఉపోద్ఘాతం :

విలియం బెంటింక్ ఉదారభావాలు కలవాడు. భారతీయుల శ్రేయస్సు బ్రిటీష్ వారి ప్రథమ కర్తవ్యమని భావించినవారిలో ప్రథముడు. భారతదేశ చరిత్రలో ఇతని పరిపాలనాకాలం నూతనశకానికి నాందీవాక్యం పలికిందని చెప్పవచ్చు. సాంఘికంగా, విద్యావిషయకంగా భారతీయులు అభివృద్ధికి బెంటింక్ తన సర్వశక్తులనూ వినియోగించాడు.

### 20.6.2 తొలిజీవితము :

బెంటింక్ 1774లో జన్మించాడు. పెనిన్సులర్ యుద్ధాలలో, ఇటలీ స్వాతంత్ర్య ఉద్యమ యుద్ధంలో పాల్గొని గొప్ప పేరు సంపాదించాడు. 1803 లో మద్రాస్ రాజధానికి గవర్నర్‌గా నియమితుడైనాడు. కాని అతనికి అతని కౌన్సిలుకు, ఉన్నత న్యాయాధికారికి సఖ్యము కుదరకపోవడానికి తోడుగా 1806లో వేలూరులో సైనిక తిరుగుబాటు జరగడంతో ఇంగ్లండ్‌లోని డైరెక్టర్లు అతనిని గవర్నర్ పదవి నుంచి తొలగించి ఇంగ్లండ్‌కి పిలిపించారు. 1828లో బెంటింక్ గవర్నర్ జనరల్‌గా ఎంపిక కావడంతో భారతదేశంలోని బ్రిటీషు సామ్రాజ్య చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. 1833 చట్టము ప్రకారం బ్రిటీష్ సామ్రాజ్యమంతటికి ప్రథమ గవర్నర్ జనరల్ అయి భారతీయుల శ్రేయస్సుకు అవిరళ కృషి సల్పాడు.

### 20.6.3 పాలనా సంస్కరణలు :

బెంటింక్ ఉదార రాజకీయవాది. శాంతికాముకుడు. దయార్ద్ర హృదయుడు. ప్రజాశ్రేయస్సుకు బెంటింక్ పాలనా, రాజ్యాంగ, ఆర్థిక, న్యాయ, విద్య, సాంఘిక, ప్రజాహిత రంగాలలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు.

### ఎ) పాలనా సంస్కరణలు :

కారన్‌వాలీస్ ప్రభువు పద్ధతికి భిన్నంగా బెంటింక్ భారతీయులకు కంపెనీలో సామాన్య ఉద్యోగాలతోబాటు న్యాయస్థానాలలోగూడ ఉద్యోగములిచ్చాడు. వాయువ్య రాష్ట్రానికి అలహాబాద్‌లో రెవిన్యూబోర్డును ఏర్పాటుచేశారు.

## బి) రాజ్యాంగ సంస్కరణలు :

బెంటింక్ కాలమున 1833లో చార్టరు చట్టం అమలులోకి వచ్చింది. దీనిప్రకారము బెంగాల్ గవర్నర్ జనరల్ భారతదేశ గవర్నర్ జనరల్ అయ్యెను. తూర్పుఇండియా వర్తక సంఘము గుత్తాధికారము రద్దయ్యెను. కంపెనీ ఉద్యోగాలలో భారతీయులకు ముందు అవకాశము ఇవ్వవలసిందిగా ఆదేశించెను. శాసన నిర్మాణాధికారం కేంద్రీకృతమయింది.

## సి) ఆర్థిక సంస్కరణలు :

బెంటింక్ గవర్నర్ జనరల్‌గా వచ్చునాటికి కంపెనీ ఆర్థిక దుస్థితికి లోనై అప్పుల పాలయ్యెను. ఇట్టి ఆర్థిక దుస్థితి నుండి కంపెనీని విముక్తిచేసి దాని ఆదాయమును అభివృద్ధి పరచుటకు బెంటింక్ అనేక చర్యలు గైకొనెను. అనవసరపు ఉద్యోగాలు రద్దుచేశాడు. ఉద్యోగుల వేతనాలు, భత్యాలు తగ్గించాడు. సైనికుల భత్యాలు కూడా తగ్గించాడు. నిరుపయోగంగా ఉన్న సంచార న్యాయస్థానాలను రద్దుచేశాడు. నల్లమందు వ్యాపారాన్ని క్రమబద్ధం చేస్తూ లైసెన్సులిచ్చు పద్ధతిని ప్రవేశపెట్టినాడు. దీనివలన కంపెని ఆదాయం పెరిగింది. కంపెనీ ఉద్యోగాలలో భారతీయులను నియమించి ఖర్చు తగ్గించాడు. హక్కుపత్రాలు లేని ఇనాం భూములను కంపెనీపరం చేశాడు ఈ సంస్కరణల వలన మిలియన్ లోటులోఉన్న కంపెనీ బడ్జెటు ఒకటిన్నర మిలియన్ల మిగులు బడ్జెటుగా మారినది.

## డి) న్యాయసంస్కరణలు :

న్యాయపాలనా విధానములోని లోపాలను తొలగించుటకు బెంటింక్ అనేక సంస్కరణలు చేసాడు. జాప్యం, అధికవ్యయం, అనిశ్చితికి ఆలవాలమైన సంచార న్యాయస్థానాలను రద్దుచేసెను. రద్దుచేయబడిన న్యాయస్థానాలకు బదులు బెంగాల్, బీహార్, ఒరిస్సాలను కొన్ని భాగాలుగా విభజించి ఒక్కొక్క భాగముపై ఒక కమీషనరును నియమించెను. ఈ కమీషనరుకు పన్ను వసూలుచేయు అధికారం, న్యాయాధికారం లీయబడినది. ఈ కమీషనర్లు రెవిన్యూ విషయాలలో రెవిన్యూబోర్డు ఆధిపత్యంలోను, న్యాయవిషయాలలో సదర్ నిజామత్ ఆదాలత్ ఆధిపత్యములోను ఉందురు. భూ కమతాల విషయమైవచ్చు వివాదాలను శీఘ్రముగా పరిష్కరించవలెనని శాసించెను. న్యాయస్థానాలలో ప్రాంతీయభాషల నుపయోగించుటకు అనుమతి ఇచ్చెను. భారతీయులకు న్యాయస్థానాలలో ఉన్నత పదవులిచ్చెను. బెంగాల్ నందు జ్యూరీపద్ధతి ప్రవేశపెట్టెను. వాయువ్య రాష్ట్రానికి ఒక ప్రత్యేకమైన న్యాయస్థానం నెలకొల్పెను. న్యాయశాస్త్రమును క్రోడీకరించుటకు మెకాలే ప్రభువును నియమించెను.

## ఇ) విద్యా సంస్కరణలు :

1813 చార్టరు చట్టం ప్రకారం భారతీయుల విద్యాభివృద్ధికి లక్షరూపాయలు కేటాయించబడినది. ఈ ధనాన్ని ప్రాచ్య విద్యాభివృద్ధికి వినియోగించవలనా లేక ఆంగ్ల విద్యాభివృద్ధికి వినియోగించవలెనా అను విషయం మీద తర్జనభర్జనలు జరిగినవి. విల్సన్ నాయకత్వంలో ఒకవర్గం వారు ప్రాచ్య విద్యాభివృద్ధి చేయవలెనని వాదించగా మరొక వర్గంవారు ఆంగ్ల విద్యాభివృద్ధికి ఈ ధనము వెచ్చించవలెనని వాదించిరి. చివరకు, చార్లెస్ ట్రవెలియన్ వర్గానికి బలము చేకూరినది. ప్రగతివాదులైన రాజారామ్‌మోహనరాయ్, ద్వారకానాధ్ టాగూర్ మున్నగువారు ఆంగ్లవిద్యకు అనుకూలంగా ఉన్నారు. తత్ఫలితంగా మెకాలే ఆంగ్ల విద్యావిధానమునకే విద్యను కేటాయించిన నిధులను వినియోగించాలని నివేదిక తయారుచేసెను. తదనుగుణముగా బెంటింక్ 1835 మార్చి 7న ఒక ఉత్తర్వును జారీచేసెను. దాని ప్రకారము ఇంగ్లీషు రాజభాష అయ్యెను. పాశ్చాత్య వైద్య, రాజకీయ శాస్త్రములు, ఆంగ్ల సారస్వతం విద్యాసంస్థలందు బోధింపబడెను. కలకత్తాలో ఒక వైద్య కళాశాల స్థాపించబడెను. ఈ ఆంగ్లభాషా ప్రభావమే భారతీయులను చైతన్యులను చేసి ఐకమత్యం, జాతీయభావము, స్వాతంత్ర్య పిపాస పెంపొందించినవి.

**ఎఫ్) సాంఘిక సంస్కరణలు :**

బెంటింక్ ప్రవేశపెట్టిన సాంఘిక సంస్కరణలు భారతదేశ చరిత్రలో అతనికి శాశ్వత స్థానాన్ని కల్పిస్తాయి. అనాదిగా భారతదేశంలో సాగుతున్న సతీసహగమన దురాచారాన్ని నిర్మూలించుటకు అక్బరు, అల్బూకర్క్, హేస్టింగ్స్ మొదలగువారు విఫలయత్నాలు చేశారు. దీని నిర్మూలనలో బెంటింక్ ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించాడు. ఈ కార్యసాధనలో బెంటింక్‌కు రాజారామ్‌మోహన్‌రాయ్ వంటి సంస్కర్తల అండదండలు లభించాయి. సతీసహగమనాన్ని నిషేధిస్తూ బెంటింక్ 1829లో ఒక శాసనం చేశాడు. దీనిప్రకారం భర్తహీనులను సజీవసమాధి చేయుటగాని, చితిలో వేయుటగాని నరహత్యతో సమానమని ప్రకటించెను. ఆత్మహత్యకు పాల్పడినవారు, తోడ్పడినవారు శిక్షార్హులని ప్రకటించెను. ఇట్లు బెంటింక్ సతీసహగమనమును రూపుమాపెను. పంజాబు, రాజస్థాన్, బెంగాల్ మున్నగుచోట్ల వ్యాప్తిలోఉన్న శిశుహత్యలను, నరబలులను రూపుమాపినాడు. మతాంతరులైన హిందువులకు తండ్రి ఆస్తిలో హక్కు కల్పించాడు. దారిదోపిడీలు కొనసాగిస్తూ చాలాకాలం నుండి తప్పించుకు తిరుగుతున్న 'ధగ్గు'లను దొంగలను బెంటింక్ అణచివేసినాడు. సర్‌విలియన్‌స్లీమన్ అనే సేనాని దగ్గుల నిర్మూలనలో బెంటింక్‌కు తోడ్పడినాడు.

**జి) ప్రజాహిత సంస్కరణలు :**

ప్రజాక్షేమమే ధ్యేయముగాగల బెంటింక్ వాయువ్య రాష్ట్రములో కాలువల ద్వారా నీటిపారుదల సౌకర్యము కల్పించాడు. ఇంగ్లాండు, ఇండియాల మధ్య ఆవిరిశక్తితో నడుచు నౌకలను ప్రవేశపెట్టినాడు. ఢిల్లీ నుండి కలకత్తా వరకు రాజమార్గం వేయించినాడు. బొంబాయి, ఆగ్రాల మధ్య రహదారి నిర్మాణము ప్రారంభించబడింది. ఈ చర్యల వలన వాణిజ్యాభివృద్ధి జరిగింది. బెంటింక్ పత్రికలకు స్వేచ్ఛను ప్రసాదించాడు.

## 20.6.4 విదేశీ విధానము :

బెంటింక్ రాజ్యవిస్తరణ కంటే రాజ్యసుస్థిరతకే ఎక్కువ ప్రాధాన్యతమిచ్చి స్వదేశరాజుల పట్ల తటస్థ విధానమును అవలంభించినాడు. అయినను అనివార్య పరిస్థితులేర్పడినపుడు అతడు జోక్యము కలుగజేసుకొనుటకు వెనకాడలేదు. కంపెనీ చేసిన హెచ్చరికను నిర్లక్ష్యముచేసి పాలనా సామర్థ్యాన్ని పెంపొందించినందుకు మైసూరును స్వాధీనం చేసుకున్నాడు. అదే కారణంతో కచార్, జయంతియా, కూర్గ్ రాజ్యాలు స్వాధీనం చేసుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో, పంజాబు ప్రభువు రంజిత్‌సింగ్‌తో స్నేహసంబంధాలు నెలకొల్పబడెను.

## 20.6.5 ఘనత :

బెంటింక్ ప్రభువు కంపెనీ ఆదాయమును వృద్ధిచేయుటకు, భారతీయుల జీవనవిధానమును మెరుగుపరుచుటకు తన శాయశక్తులా కృషిచేసాడు. భారతీయుల సంక్షేమమును గూర్చి తలపోసిన మొదటి గవర్నర్ జనరల్ బెంటింక్. అందువలన భారతీయులకతడు చిరస్మరణీయుడైనాడు.

## 20.7. డల్‌హౌసీ : (1848 - 56)

## 20.7.1 ఉపోద్ఘాతం :

భారతదేశాన్ని పాలించిన గవర్నర్ జనరలందరిలో చిన్నవాడు డల్‌హౌసీ ప్రభువు. ఇతడు సమర్థుడు, కార్యదీక్షాపరుడు, రాజనీతిజ్ఞుడు మరియు సామ్రాజ్యవాది. తనకు లభించిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని రాజ్యాన్ని విస్తరింపజేశాడు.

## 20.7.2. తొలిజీవితము :

డల్‌హౌసీ అసలు పేరు జేమ్సు ఆండ్రూ బ్రౌన్‌రామ్‌సే. ఇతడు 1812 ఏప్రిల్‌లో ఆక్స్‌ఫర్డ్‌లోని క్రైస్ట్‌చర్చిలో చేరి పట్టభద్రుడైనాడు. 1837లో అతడు పార్లమెంట్‌కు ఎన్నికైనాడు. 1843లో బోర్డ్ ఆఫ్ ట్రేడ్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా ఉండి ఆ తరువాత ప్రెసిడెంట్ అయినాడు. 1848లో కలకత్తా గవర్నర్ జనరల్ పదవి స్వీకరించినాడు.

### 20.7.3 ఆశయములు :

దుష్పరిపాలనను అంతంచేయుట, కంపెనీ రాజ్యవిస్తరణ, బ్రిటీష్ ఇండియాలోని ప్రజల సంక్షేమము, చక్కని పాలనావ్యవస్థను ప్రసాదించుట అనునవి డల్‌హౌసీ ముఖ్య ఆశయాలు. ఈ ఆశయ సిద్ధికై ఇతడు అనేక ఆక్రమణలు చేయుటయేకాక అనేక ప్రజాహిత సంస్కరణలు ప్రవేశపెట్టి ఆధునిక భారతదేశ నిర్మాతగా పేరుమోసెను. డల్‌హౌసీ కంపెనీ రాజ్యవిస్తరణలో నీతినియమాలు పాటించలేదు. యుద్ధాలు, రాజ్యసంక్రమణ సిద్ధాంతాలు, దుష్పరిపాలన అను మిష, బిరుదులు, భరణాలు రద్దుచేయుట, బకాయి అనునెపముతో రాజ్యాన్ని విస్తరింపజేసాడు.

**ఎ) యుద్ధాలు :**

**1) రెండవ శిక్కు యుద్ధం :** పంజాబులో ఆంగ్లేయుల ప్రాబల్యమును శిక్కులు సహింపలేకపోయిరి. ముల్తాన్ గవర్నరు ముల్‌రాజ్ తిరుగుబాటు చేసెను. ముల్‌రాజ్‌తో హజారా సంస్థానాధీశుడు మరికొందరు చేతులు కలిపిరి. డల్‌హౌసీ పంజాబ్‌పై 1849లో యుద్ధం ప్రకటించి రాయ్‌నగర్, చిలియన్‌వాలా, గుజరాత్ యుద్ధాలలో శిక్కులను ఓడించినాడు. పంజాబ్ కంపెనీ రాజ్యములో విలీనము చేయబడినది.

**2) రెండవ బర్మా యుద్ధం :** బర్మారాజు తన రాజ్యంలోని ఆంగ్ల ప్రతినిధిని గౌరవించక, బర్మాలోని ఆంగ్ల వ్యాపారులను బాధింపసాగెను. ఆంగ్ల వ్యాపారులు కంపెనీవారికి మొరపెట్టుకొనిరి. డల్‌హౌసీ హెచ్చరికను బర్మారాజు ఖాతరు చేయకపోవుట వలన బర్మాపై సైన్యాన్ని పంపి రంగూన్, ప్రోమ్, పేగూ నగరాలు దిగువ బర్మా ప్రాంతం ఆంగ్లరాజ్యములో విలీనము చేసెను.

**3) సిక్కిం యుద్ధం :** సిక్కిం ప్రజలు ఇద్దరు ఆంగ్ల ఉద్యోగులను చంపిన ఫలితంగా డల్‌హౌసీ సిక్కింపై యుద్ధం ప్రకటించి సిక్కింలోని కొంతభాగమాక్రమించెను.

**బి) రాజ్యసంక్రమణ సిద్ధాంతము :** డల్‌హౌసీ యుద్ధాలు చేయకుండా వీలైనంతవరకు సామంత రాజ్యాలను, ఇతర రాజ్యాలను ఆంగ్ల సామ్రాజ్యములో చేర్చుకోవడానికి అనుసరించిన విధానాలలో ఒకటి రాజ్యసంక్రమణ సిద్ధాంతము. రాజ్యసంక్రమణ సిద్ధాంతమనగా ఆంగ్ల సార్వభౌమత్వమును అంగీకరించిన స్వదేశరాజులు పుత్రులు లేనివారు బ్రిటీష్‌వారి అనుమతి లేకుండా ఎవరిని దత్తత చేసికొనరాదు. అట్టి అనుమతి లేకుండా ఏ స్వదేశరాజైన దత్తత చేసుకొనిన ఆ దత్తత కుమారునికి ఆ స్వదేశరాజు వ్యక్తిగత ఆస్తి సంక్రమించునేగాని, ఆ స్వదేశ సంస్థానం సంక్రమించదు. పైగా ఆ స్వదేశ సంస్థానము కంపెనీకి సంక్రమించును. దత్తత అంగీకరించుటకు గాని తిరస్కరించుటకుగాని పూర్తి అధికారము ఆంగ్లేయులదే. కాని అన్ని సందర్భములలోను కంపెనీ దత్తతను అంగీకరింపకపోవుట, పెక్కుమంది స్వదేశరాజులకు ఈ సమయముననే సంతానము లేకపోవుట జరిగింది. ఈ సూత్రాన్ని అనుసరించే 1834లో కంపెనీ మాండవి, కొలబా, సూరత్‌లను ఆక్రమించెను. కాని డల్‌హౌసీ సామ్రాజ్యవాధి యగుటచే ఏ ఒక్కరికి దత్తత నంగీకరింపక అనేక స్వదేశ సంస్థానములనాక్రమించెను. ఈ సిద్ధాంతం ప్రకారము డల్‌హౌసీ ఆంగ్ల సామ్రాజ్యములో కలిపిన స్వదేశ సంస్థానాలు సతారా, నాగపూర్, జైత్‌పూర్, సంబల్‌పూర్, భగత్, ఉదయపూర్, ఝూన్సీ, కరౌలీ మొదలగునవి. రాజ్యసంక్రమణ సిద్ధాంతము భారతదేశ ఆచార సంప్రదాయాలకు విరుద్ధము. హిందూన్యాయశాస్త్ర సమ్మతమైనది దత్తస్వీకారం. దత్తకుమారునకు వ్యక్తిగత ఆస్తియేగాక రాజ్యము సైతము పొందుటకు గల హక్కు చిరకాలంగా హిందూధర్మశాస్త్రాలు గుర్తించినవి. కనుక ఇట్టి దత్తతను ఆంగ్లేయులు సమ్మతింపపోవుట అన్యాయం, హిందూధర్మ శాస్త్రములకు విరుద్ధము. డల్‌హౌసీ స్వదేశ సంస్థానముల నాక్రమించుటలో తన అధికార పరిధులను, నీతినియమాలను అతిక్రమించాడు. రాజ్యసంక్రమణ సిద్ధాంతము హిందూరాజులలో భయాందోళనను కల్గించి 1857 తిరుగుబాటునకు దోహదము చేసెను.

**సి) దుష్పరిపాలన అను నెపము :** అయోధ్య నవాబు దుష్పరిపాలనలో ప్రజలు అనేక ఇబ్బందులననుభవించిరి. రాజ్యములోని అవినీతిని గూర్చి బెంటింక్, ఆక్లండ్, హార్డింజ్‌లు చేసిన హెచ్చరికలను అయోధ్య నవాబు లక్ష్యపెట్టలేదు. 1801లో సైన్యసహకార పద్ధతికి అంగీకరించిన అయోధ్యను 1856లో కంపెనీ ఆదేశం మేరకు డల్‌హౌసీ ఆంగ్లరాజ్యమున చేర్చెను. డల్‌హౌసీ చేసిన ఘోర రాజకీయ తప్పిదము అయోధ్య ఆక్రమణ. ఆంగ్లేయులకు విశ్వాసపాత్రులైన స్వదేశీరాజులకు విధింపబడిన శిక్ష ఈ ఆక్రమణ అని స్వదేశీరాజులు భావించిరి.

**డి) బిరుదములు, భరణములు రద్దు :** స్వదేశీరాజుల భరణాలు, బిరుదులు రద్దుచేసి డల్‌హౌసీ మరికొన్ని రాజ్యాలను కబళించెను. తంజావూరు పాలకుడు, కర్ణాటక నవాబు మరణించిన తరువాత ఆ రాజ్యాలకు ఎవరిని వారసులుగా గుర్తించక ఆ పదవులను లేక బిరుదులను రద్దుచేసి వానిని ఆక్రమించెను. 1853లో రెండవ బాజీరావు మరణానంతరం అతని దత్తపుత్రుడైన నానాసాహెబ్ వారసత్వాన్ని గుర్తించకుండా పీష్వా పదవిని రద్దుచేసెను. అందువలన 1857 తిరుగుబాటులో ప్రతీకారదృష్టితో నానాసాహెబ్ పాల్గొన్నాడు.

**ఇ) బకాయి అను నెపము :** దుష్పరిపాలన నెపముతోనేగాక బకాయిల నెపముతో గూడ డల్‌హౌసీ స్వదేశ సంస్థానాలను ఆంగ్లరాజ్యములో కలిపెను. హైదరాబాదు నవాబు చెల్లించవలసిన బకాయికి బదులుగా బీరార్ ప్రాంతాన్ని డల్‌హౌసీ ఆక్రమించాడు.

### 20.7.4 పాలనా సంస్కరణలు :

డల్‌హౌసీ గొప్ప సామ్రాజ్య నిర్మాతయేగాక పాలనాదక్షుడు. భారతీయుల శ్రేయోభివృద్ధికి ఇతడు అనేక సంస్కరణలు చేసి 'ఆధునిక భారతదేశ నిర్మాతగా' ప్రసిద్ధికెక్కెను. డల్‌హౌసీ పరిపాలనా, సైనిక, ప్రజాహిత, విద్యారంగాలలో సంస్కరణలు ప్రవేశపెట్టడమే గాక తంతి, తపాలా, రైల్వేలను ప్రవేశపెట్టాడు.

**ఎ) పరిపాలనా సంస్కరణలు :**

డల్‌హౌసీ పరిపాలనా సంస్కరణలో ప్రధానమైనది కేంద్రీకృత వ్యవస్థ. బ్రిటీష్ ప్రభుత్వ కేంద్రముగా సిమ్లాను ఏర్పాటుచేశాడు. బెంగాల్ పాలనకు ఒక లెఫ్టినెంట్ గవర్నరును నియమించి తన పాలనా భారమును కొంత తగ్గించుకొనెను. నూతనముగా ఆంగ్ల సామ్రాజ్యమున చేరిన ప్రాంతములకు సమర్థులు, విశ్వసనీయులు అయిన కమీషనర్లను నియమించెను.

**బి) సైనిక సంస్కరణలు :** బ్రిటీష్ సామ్రాజ్య విస్తరణను దృష్టిలో ఉంచుకొని డల్‌హౌసీ మిలటరీ ప్రధాన కార్యాలయమును కలకత్తా నుండి మీరట్‌కు మార్చెను. గూర్ఖా రెజిమెంట్‌ను అభివృద్ధి చేసెను. సైన్యంలో ఆంగ్లేయుల సంఖ్యను పెంచుటకు కృషిచేసెను.

**సి) ప్రజాహిత కార్యక్రమాలు :** మిలటరీబోర్డు పరిధి నుండి పబ్లిక్‌వర్క్స్ డిపార్టుమెంటును తప్పించి ప్రత్యేకశాఖగా ఏర్పాటుచేసెను. సాంకేతిక నిపుణులను తయారుచేయుటకై రూర్కెలా ఇంజనీరింగ్ కళాశాలను నెలకొల్పెను. ఈ కాలములో పాతరహదారులు, వంతెనలు, కాలువలు మరమ్మత్తులు చేయించుటయేగాక ప్రజాక్షేమము దృష్ట్యా కొత్తవి ఏర్పాటు చేయించెను. ఎగువగంగ జిల్లాల సౌకర్యార్థమై గంగ కాలువ, డోబ్ కాలువ త్రవ్వబడినవి.

**డి) విద్యాసంస్కరణలు :** బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడైన సర్‌ఛార్లెస్ ఉడ్ పంపిన విద్యాసంఘ నివేదికననుసరించి బొంబాయి, మద్రాస్, కలకత్తాలలో విశ్వవిద్యాలయాలు నెలకొల్పబడెను. ఉడ్ నివేదిక ఆధారంగా డల్‌హౌసీ ప్రాంతీయ విద్యాలయాలను ప్రోత్సహించెను. ఎన్నో పాఠశాలలను, కళాశాలలను నెలకొల్పెను. పురాతన భవనముల పట్ల, వస్తువుల పట్ల శ్రద్ధ వహించుటయేగాక ప్రత్యేకశాఖ నేర్పాటుచేసెను.

**ఇ) రైల్వేలు, తంతి, తపాలా సౌకార్యాలు :** భారతదేశంలో రైలు మార్గానికి మూలపురుషుడు డల్‌హౌసీ. వ్యాపారాభివృద్ధికి ప్రయాణసౌకర్యమునకు రైల్వేలు ముఖ్యాధారాలని భావించి రైల్వేలను డల్‌హౌసీ అభివృద్ధి చేసాడు. 1853లో బొంబాయి, థాణాల మధ్య

రైలుమార్గమును వేయించెను. ఆ తదుపరి కలకత్తా నుండి రాణిగంజికి, మద్రాసు నుండి ఆర్కోణమునకు రైలు మార్గములు ఏర్పడినవి. 1853 - 1856 మధ్య కాలంలో డల్‌హౌసీ కలకత్తాను పెషావర్‌తోను, బొంబాయిని మద్రాసుతోను కలుపుతూ 4000 మైళ్ళ తంతి మార్గమును వేయించెను. తపాలా సౌకర్యమును ప్రవేశపెట్టి వివిధ ప్రాంత ప్రజలు పరస్పరము యోగక్షేమాలను తెలుసుకొనుటకు వీలుకల్పించెను. డల్‌హౌసీ తన కాలంలో 753 పోస్టాఫీసులను నెలకొల్పెను. రైలు, తంతి, తపాలా సౌకర్యములు భారతదేశ ఆధునికీకరణకు మిక్కిలి తోడ్పడెను. ఈ సౌకర్యాల వలన భారతదేశమున వ్యాపారాభివృద్ధి జరుగుటయేకాక, భారతీయులకు తామందరము ఒకటేయను జాతీయభావమేర్పడినది.

**ఎఫ్) ఇతర సంస్కరణలు :** డల్‌హౌసీ సతీసహగమనమును మాన్పించుటకు కృషిచేసెను. విధవా వివాహములను ప్రోత్సహించెను. మతాంతరులకు ఆస్తిహక్కు కల్పించెను. జాతీయ ప్రాతిపదికపై ఐ.సి.యస్. పోటీ పరీక్షల నేర్పాటు చేసి అభ్యర్థులకు ఎన్నుకొను పద్ధతిని ప్రవేశపెట్టెను. డల్‌హౌసీ స్వేచ్ఛావ్యాపారమును ప్రోత్సహించెను. రేవు పట్టణములను బాగుచేయించెను.

### 20.7.5. ఘనత :

డల్‌హౌసీ రాజ్యమును విస్తరించుటయేగాక ఆక్రమిత ప్రాంతాలలో సుస్థిరతను చేకూర్చెను. ఇతని పాలనా సంస్కరణలు భారతదేశ ఆధునికీకరణకు ఎంతగానో సహకరించినవి. అయినప్పటికి డల్‌హౌసీ నిరంకుశుడు. భారతీయుల మనోభావములపట్ల అతనికి సానుభూతి లేదు. వివిధ కారణాల వలన అతడు వివిధ వర్గాల ప్రజలను రెచ్చగొట్టెను. అందువలన 1857లో జరిగిన తిరుగుబాటుకు డల్‌హౌసీ కొంతవరకు కారకుడని చరిత్రకారుల భావన.

## 20.8 సమీక్ష :

రాబర్ట్‌క్లైవ్ భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్యమునకు పునాది వేయగా వారన్ హేస్టింగ్స్ పాలనా సంస్కరణలను ప్రారంభించాడు. కారన్‌వాలీస్ సంస్కరణల కార్యక్రమం కొనసాగింది. అతని సంస్కరణలో ప్రధానమైనది శాశ్వతశిస్తు నిర్ణయపద్ధతి. వెల్లస్లీ కాలంలో బ్రిటీష్‌వారి అధికారం విస్తరించింది. ఇతడు రాజ్యవిస్తరణను అనుసరించిన పద్ధతులలో ఒకటి సైన్యసహకారపద్ధతి. విలియం బెంటింక్ ప్రధానంగా భారత సమాజంలోని దురాచారాలను రూపుమాపుటకు ప్రయత్నించాడు. డల్‌హౌసీ రాజ్యవిస్తరణ కార్యక్రమాన్ని పూర్తిచేసినాడు. ఇతడు ప్రజల క్షేమం కొరకు పాటుపడినాడు.

## మాదిరి ప్రశ్నలు :

1. బెంటింక్ ప్రవేశపెట్టిన సంస్కరణలను వివరింపుము.
2. డల్‌హౌసీ రాజ్యవిస్తరణ విధానము, సంస్కరణలు వివరింపుము.
3. వారన్ హేస్టింగ్స్ సంస్కరణలను తెలుపుము.
4. శాశ్వత శిస్తు నిర్ణయపద్ధతిని వివరింపుము.
5. వెల్లస్లీ ఘనతను వివరింపుము.

## చదువదగిన గ్రంథాలు :

1. పాటిబండ్ల ఝాన్సీలక్ష్మి & అల్లాడి వైదేహి - భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగము)
2. P.E. Roberts - History of British India
3. Majumdar, Raychoudhuri & Datta - An Advanced History of India
4. A.L. Basham - The wonder that was India
5. Rapson - Cambridge History of India.

**V.K. Mohan**

పాఠం - 21

# భారత రాజ్యాంగాభివృద్ధికి బ్రిటీష్ పార్లమెంటు చేసిన చట్టాలు

**విషయసూచిక :**


21.0. లక్ష్యం

21.1. ఉపోద్ఘాతము

21.2. రెగ్యులేటింగ్ చట్టము - (1733)

21.3. పిట్స్ ఇండియా చట్టము - (1784)

21.4. ఛార్టరు చట్టము - (1813)

21.5. ఛార్టరు చట్టము - (1833)

21.6. ఛార్టరు చట్టము - (1853)

21.7. ముగింపు


## 21.1. లక్ష్యం :

భారతదేశములో ఈస్ట్ఇండియా కంపెనీ స్థాపించిన తర్వాత, బ్రిటీషు పార్లమెంటు అనేక చట్టాలు చేసింది. ఒకవైపు ఈస్ట్ఇండియా కంపెనీని నియంత్రిస్తూ మరొకవైపు భారతదేశ పరిపాలనను నిర్దేశించటమే ఈ చట్టాల లక్ష్యం. ఈ చట్టాలు రాజ్యాంగ రూపకల్పనకు దారితీశాయి.

## 21.1. ఉపోద్ఘాతము :

1600 సంవత్సరములో ఈస్ట్ఇండియా కంపెనీ ఏర్పడి భారతదేశ వ్యాపారంలో గుత్తాధిపత్యాన్ని సంపాదించింది. విక్టోరియారాణి ప్రకటన ద్వారా 20 సంవత్సరములపాటు వ్యాపార హక్కును పొందింది. కంపెనీ వ్యాపారాన్ని అభివృద్ధి చేసికోవటమే కాకుండా, అనేక కోటలు నిర్మించి వాటిని ఆయుధాలతో నింపింది. కర్నాటక యుద్ధాలు, బెంగాలు ఆక్రమణతో ఫ్రాన్సును పారద్రోలి సుస్థిరమైన రాజకీయశక్తిగా ఆవిర్భవించింది. భారతదేశంలో బ్రిటీషు సామ్రాజ్యాన్ని నిర్మించింది. భారతదేశ పరిపాలన ఒక ప్రయివేటు కంపెనీ ఆధ్వర్యంలో వుండటం బ్రిటీషు పార్లమెంటులో ధుమారాన్ని లేపింది. ఇదే ప్రభుత్వ జోక్యానికి దారితీసింది.

## 21.2. రెగ్యులేటింగు చట్టము - (1773)

### 21.2.1. చట్టం చేయడానికి దారితీసిన పరిస్థితులు :

ఈస్టుఇండియా కంపెనీ, ఇంగ్లాండు రాణి ఎలిజిబెత్ జారీచేయబడిన చార్టరు ప్రకారము క్రీ.శ. 1600లో స్థాపించబడినది. ఇది ప్రైవేటు వర్తకులు స్థాపించిన సంస్థ. వ్యాపారం కోసం అనుమతి తీసికొన్న కంపెని క్రమంగా రాజకీయాధికారాన్ని చేజిక్కించుకుంది. కంపెనీ వర్తకులు భారతదేశంలో ఎంతో ధనాన్ని సంపాదించి, ఇంగ్లాండులో ప్రత్యేక ఆస్తుల నేర్పరచుకున్నారు. ఇంకొకవైపు పరిపాలనను నిర్లక్ష్యం చేశారు. ఈ సమయంలోనే కంపెని, ఇంగ్లాండు ప్రభుత్వాన్ని అప్పుకోసం దరఖాస్తు పెట్టింది. దీనితో ప్రభుత్వం కంపెనీ వ్యవహారాలను అధ్యయనం చేయటంకోసం ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. ఆ కమిటీ రిపోర్టు ఆధారంగా బ్రిటీషు పార్లమెంటు కంపెనీని అదుపులో వుంచుతూ దాని బాధ్యతలను, అధికారాలను తెలియజేస్తూ 1773లో ఒక చట్టం చేసింది. అదే రెగ్యులేటింగ్ చట్టము.

**ప్రధాన అంశములు :**

1) ఈ చట్టం కంపెని పరిపాలనలో అనేక మార్పులు చేసింది. డైరెక్టర్ల బోర్డు ప్రభుత్వాధీనంలోకి తీసికురాబడింది. 500 పౌనుల నుండి 1000 పౌనుల ఆదాయంవున్న షేర్ హోల్డర్స్‌కి మాత్రమే కంపెనీలో ఓటుహక్కు గల్గించబడింది. ఈ చట్టం ప్రకారం 24 డైరెక్టర్లు 4సం॥ కొకసారి ఎన్నిక చేయబడతారు. సైనిక వ్యవహారాలు సివిల్ వ్యవహారాలు, ఆదాయానికి చెందిన అన్ని రికార్డులు పార్లమెంటు ముందుంచాలి.

2) బెంగాలు గవర్నరు ఇకనుంచి గవర్నరు - జనరల్‌గా వ్యవహరింపబడతాడు. గవర్నరు - జనరల్‌కు సలహా ఇచ్చేందుకు 4సభ్యులతో ఒక కౌన్సిల్ ఏర్పాటు చేయబడింది. గవర్నరు జనరలు మెజారిటీ సభ్యుల అనుమతితో వ్యవహరించాలి. ప్రతిష్టంబన ఏర్పడినప్పుడు గవర్నరు జనరల్‌కు ప్రత్యేక ఓటు ఇవ్వబడింది. వీరి పదవీకాలం 5 సంవత్సరములు. డైరెక్టర్ల కోరికపై బ్రిటీషు రాణికి మాత్రమే వీరిని తొలగించే అధికారం వుంటుంది. ఈ చట్టం ప్రకారం మొదటి గవర్నరు - జనరల్ వారన్ హేస్టింగ్స్ - క్లావరింగ్, మాన్‌సన్, ఫిలిప్ ఫ్రాంసిస్, బారవెల్ కౌన్సిల్ సభ్యులు.

గవర్నరు - జనరల్‌కు ఆర్డినెన్సులు జారీచేసే హక్కు ఇవ్వబడింది. సాధారణ పరిపాలన, సైనిక విషయాలమీద పూర్తి అజమాయిషి ఇవ్వబడింది. కాని గవర్నరు - జనరలు రూల్స్ ఆర్డినెన్సులు అన్నీ బ్రిటీషు ప్రభుత్వానికి లోబడివుండాలి. కంపెనీ అధికారులు స్వదేశీ రాజుల నుండి ఎటువంటి కానుకలు, లంచాలు స్వీకరించకూడదు. అటువంటివారు కఠినంగా శిక్షింపబడతారు.

3) గవర్నరు - జనరల్‌కు రాష్ట్రాలపై పూర్తి అధికారాలు ఇవ్వబడ్డాయి. కాని అత్యవసర పరిస్థితులలో రాష్ట్రాలు స్వతంత్రముగా వ్యవహరించవచ్చు.

4) ఈ చట్టం ప్రకారం కలకత్తాలో ఒక సుప్రీంకోర్టు ఏర్పాటు చేయబడింది. ఒక ప్రధాన న్యాయమూర్తి, 3 సాధారణ న్యాయమూర్తులు వుంటారు. సర్ ఎలీజా ఇంపే మొదటి ప్రధాన న్యాయమూర్తిగా నియమించబడ్డాడు. సుప్రీంకోర్టుకు సివిల్, క్రిమినల్ అధికారులు ఇవ్వబడ్డాయి.

**విమర్శ :**

1) ఈ చట్టంలో చాలా లోపాలున్నాయి. గవర్నరు - జనరల్ అధికారాలు సరిగ్గా నిర్వచించలేదు. గవర్నరు - జనరల్, కౌన్సిలులోని మెజారిటీ సభ్యుల కనుగుణంగా నడుచుకోవాలి. దీనివలన గవర్నరు - జనరలుకు కౌన్సిలు మధ్య తరచూ భేదాభిప్రాయాలు ఏర్పడేవి.

2) సుప్రీమ్‌కోర్టు అధికారాలు స్పష్టంగా లేవు. తరచు స్వదేశీ వ్యవహారాలలో జోక్యం చేసికునేది. అలాగే సుప్రీంకోర్టు పరిధి సరిగ్గా నిర్వచించనందున, గవర్నరు - జనరల్‌తో అభిప్రాయ భేదాలు ఏర్పడేవి.

3) రాష్ట్రాలపై కూడా గవర్నరు - జనరల్‌కు స్పష్టమైన అధికారాలు ఇవ్వలేదు. అత్యవసర పరిస్థితులలో రాష్ట్రాలు స్వతంత్రముగా వ్యవహరించుటకు వీలున్నందున కొన్ని రాష్ట్రాలు యుద్ధాలు కూడా చేశాయి.

**ప్రాధాన్యత :**

రెగ్యులేటింగ్ చట్టము భారతరాజ్యాంగ రూపకల్పనకు నాందీ అయ్యింది. లక్షలాది భారతీయులు ఈస్ట్‌ఇండియా కంపెనీ మీద ఆధారపడకుండా, బ్రిటీషు పార్లమెంటు అజమాయిషీ మొదలైంది. సుప్రీంకోర్టు ఏర్పాటుద్వారా, భారతదేశములో న్యాయవ్యవస్థ ప్రారంభమయ్యెను.

## 21.3. పిట్స్ ఇండియా చట్టము - (1784)

రెగ్యులేటింగ్ చట్టములోవున్న లోపాలను సరిదిద్దుటకు అతిత్వరలోనే మరొక చట్టము చేయబడెను. రెగ్యులేటింగ్ చట్టములోని లోపాలవలన సుప్రీంకోర్టుకు గవర్నరు - జనరల్‌కు, గవర్నరు - జనరల్‌కు కౌన్సిలు సభ్యులకు, గవర్నరు - జనరల్‌కు రాష్ట్రాలకు మధ్య విభేదాలు ప్రారంభమై కంపెనీ పాలన దెబ్బతినే అవకాశం ఏర్పడింది. అందువలన 1784లో పిట్స్ ఇండియా చట్టం చేయబడింది.

1781లో బ్రిటీష్ పార్లమెంటు ఒక ఎమెండ్‌మెంటు చట్టం చేసింది. దాని ప్రకారం సుప్రీంకోర్టు పరిధి స్పష్టంగా నిర్వచించబడింది. గవర్నరు - జనరల్ మీద సుప్రీంకోర్టుకు ఎటువంటి అజమాయిషీ లేదు. సుప్రీంకోర్టు అధికారం కేవలం సివిల్, క్రిమినల్ కేసులకు మాత్రమే పరిమితం చేయబడింది.

రెండు సంవత్సరముల తర్వాత ప్రతిపక్ష సభ్యుడు దుండాస్ కంపెనీని సరిదిద్దుటకు ఒక బిల్లును ప్రతిపాదించాడు కాని వీగిపోయింది. అదే సంవత్సరం ప్రధానమంత్రి 'ఫాక్స్' (Fox) ఒక బిల్లును ప్రవేశపెట్టాడుకాని అది ఎగువసభలో వీగిపోయింది. అతని తర్వాత వచ్చిన ప్రధానమంత్రి విలియమ్ పిట్ సరికొత్త బిల్లును 1784లో ప్రవేశపెట్టాడు. అదే పిట్స్ ఇండియా చట్టం పేరుతో పార్లమెంటు ఆమోదం పొందింది.

**ప్రధాన అంశాలు :**

1) కంపెనీ పరిపాలన నిమిత్తం బోర్డు ఆఫ్ కంట్రోలు ఏర్పాటయింది. అందులో 6 కమీషనర్స్, సెక్రటరీ ఆఫ్ స్టేట్, ఛాన్సలర్ ఆఫ్ ఎక్సెక్కర్, నల్గురు ప్రీవీ కౌన్సిలర్స్ వుంటారు. వీరు బ్రిటీషు క్రౌన్ చేత నియమించబడ్తారు. బోర్డు ఆఫ్ కంట్రోలుకు ఇండియా పరిపాలనమీద పూర్తి అధికారం ఇవ్వబడింది.

2) గవర్నరు - జనరల్ కౌన్సిలు సభ్యుల సంఖ్య 4 నుండి 3కు తగ్గించబడినది. గవర్నరు జనరల్‌కు రాష్ట్రవ్యవహారాల మీద పూర్తి అధికారం ఇవ్వబడింది.

**ప్రాధాన్యత :**

ఈ చట్టం వలన కంపెనీ పూర్తిగా బ్రిటీషు పార్లమెంటుకు తలవొగ్గవలసివచ్చింది. కోర్టు ఆఫ్ డైరెక్టర్స్, బోర్డ్ ఆఫ్ కంట్రోలుకు లోబడి వుండాలి. ఈ విధంగా 'డబుల్ గవర్నమెంటు' ఏర్పడింది.

## 21.4. ఛార్టరు చట్టము - (1813)

1) ఈ చట్టం వలన కంపెనీ పరిపాలనలో ఎటువంటి మార్పులేదు. ఈస్ట్ఇండియా కంపెని ఛార్టరును 20 సం॥కు పొడిగించారు.

2) భారతదేశ వ్యాపారంలో కంపెనీ గుత్తాధిపత్యం రద్దయింది. అలాగే పరిపాలనలో బ్రిటీషు ప్రభుత్వానికి కూడా భాగస్వామ్యం ఏర్పడింది.

3) భారతదేశ పరిపాలన నిమిత్తం, సాధారణ సైనిక ఉద్యోగులకు ఇంగ్లాండులో శిక్షణ ఏర్పాటు చేయబడింది.

4) భారతదేశంలో క్రైస్తవమత వ్యాప్తికి ఒక బిషప్‌ను, ఆర్చి బిషప్‌లను నియమించారు.

5) భారతదేశ విద్యావ్యాప్తికి ఒక లక్షరూపాయలు కేటాయించారు.

## 21.5. ఛార్టరు చట్టము - 1833 :

1) ఈ చట్టం చాలా ప్రాధాన్యత గల చట్టం. భారతదేశములో ఈస్ట్ఇండియా కంపెనీకి వ్యాపారాధికారాలు రద్దుచేసి రాజకీయాధికారాలు ఇవ్వబడ్డాయి.

2) బెంగాలు గవర్నరు జనరల్ ఇకనుండి ఇండియా గవర్నరు - జనరల్‌గా పిలువబడ్డాడు. కంపెనీ పాలనా నిర్వహణలో అతనికి పూర్తి అధికారాలు ఇవ్వబడ్డాయి. గవర్నరు - జనరల్ కౌన్సిల్‌కు 4వ సభ్యుడు నియమించబడ్డాడు. ఇతను న్యాయశాస్త్ర కోవిదుడై వుండాలి.

3) బోర్డ్ ఆఫ్ కంట్రోలు అధ్యక్షుడు భారత వ్యవహారాల మంత్రిగా వ్యవహరిస్తాడు.

4) ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వాలు తమ చట్టాలను తామే చేసుకునేవారు. కాని ఇకనుండి భారతదేశానికంతటికి చట్టాలు చేసే అధికారం గవర్నరు - జనరల్ కౌన్సిల్‌కు ఇవ్వబడింది.

5) ఒక లా కమీషన్ ఏర్పాటు చేయబడింది.

**ప్రాధాన్యత :**

ఈ చట్టం వలన మొదటిసారిగా శాసనవ్యవస్థ ఏర్పడింది. అధికార కేంద్రీకరణ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వాలపై గవర్నరు - జనరల్‌కు పూర్తి అజమాయిషీ ఏర్పడింది.

## 21.6. ఛార్టరు చట్టము - (1853)

1) కోర్టు ఆఫ్ డైరెక్టర్ల సంఖ్య 18కి తగ్గించబడింది. అందులో 6గురు బ్రిటీష్ క్రౌన్ చేత నియమించబడ్డారు. భారతదేశంలో ఉద్యోగ నియామకాలపై డైరెక్టర్ల రద్దుచేసి ఉద్యోగులను పోటీ పరీక్షల ద్వారా నియమింతురు.

2) గవర్నరు - జనరల్ కౌన్సిల్ సభ్యుల సంఖ్య 12కు పెంచబడింది. ఇందులో కమాండర్ ఇన్ చీఫ్, ప్రధాన న్యాయమూర్తి మరియు రాష్ట్రాలనుంచి 4 సభ్యులు శాసన నిర్మాణమునకు నియమించబడెను.

3) ఈస్ట్ఇండియా కంపెనీ అధికారాలు పొడిగిస్తూ ప్రతి 20 సంవత్సరములకు చట్టం చేయనవసరం లేకుండా కంపెనీకి భారతదేశంపై పూర్తి అధికారం ఇవ్వబడింది. కాని కంపెని పార్లమెంటుకు లోబడి వుండాలి.

## 21.7 ముగింపు :

ఈ చట్టాల వలన భారతదేశంలో సుస్థిర పాలన ఏర్పడింది. లక్షలాది భారతీయులు ప్రయివేటు కంపెనీ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడనవసరం లేదు. పార్లమెంటు అదుపువలన కంపెనీ వుద్యోగుల స్వలాభాపేక్ష తగ్గింది. భారతదేశంలో పరిపాలన వ్యవస్థ ఏర్పడటమేకాకుండా, శాసన నిర్మాణానికి, న్యాయవ్యవస్థ ఏర్పడటానికి దోహదం చేశాయి.

**మాదిరి ప్రశ్నలు :**

1) రెగ్యులేటింగు చట్టములోని ముఖ్యాంశములను వివరింపుము ?
2) చార్టరు చట్టములను పేర్కొని వాటి ప్రాధాన్యతను తెల్పుము ?
3) పిట్స్ ఇండియా చట్టము, రెగ్యులేటింగు చట్టములోని లోపములను ఏవిధముగా సరిదిద్దెను ?
4) రెగ్యులేటింగు చట్టములోని లోపములను తెల్పుము ?
5) 1833 చార్టరు చట్టములోని ప్రధానాంశములు
6) రెగ్యులేటింగు చట్టము యొక్క ప్రాధాన్యత

**చదువదగిన గ్రంథాలు :**

1) హిరేన్ ముఖర్జీ - భారత స్వాతంత్రోద్యమం
2) కీట్ - భారతదేశ రాజ్యాంగ చరిత్ర
3) సి.ఇ. రాబర్ట్ - బ్రిటీషు ఇండియా చరిత్ర

**Author - Prameela Gogineni**

పాఠం - 22

# 1857 సిపాయిల తిరుగుబాటు

విషయసూచిక

22.0 లక్ష్యం
22.1 ఉపోద్ఘాతము
22.2 తిరుగుబాటు స్వభావం
22.3 1857 సిపాయిల తిరుగుబాటునకు గల కారణములు
22.3.1 రాజకీయ కారణములు లేక డల్‌హౌసీ బాధ్యత
22.3.2 సాంఘిక కారణములు
22.3.3 మత కారణములు
22.3.4 ఆర్థిక కారణములు
22.3.5 సైనిక కారణములు
22.3.6 తక్షణ కారణము
22.4 తిరుగుబాటు వ్యాప్తి - నాయకులు
ఎ) ఢిల్లీ బి) కాన్పూరు సి) లక్నో డి) అయోధ్య ఇ) బీరార్, బరైలీ ప్రాంతములు ఎఫ్) ఝాన్సీ
జి) రాజపుత్ర స్థానము హెచ్) మధ్యభారత్
22.5 తిరుగుబాటు విఫలమగుటకు కారణములు
22.6 తిరుగుబాటు ఫలితములు లేదా ప్రాముఖ్యము
22.7 ముగింపు

## 22.0 లక్ష్యం :

క్రీ.శ. 1857వ సంవత్సరములో జరిగిన సిపాయిల తిరుగుబాటు స్వభావము, కారణములు, వ్యాప్తి, తిరుగుబాటు విఫలమగుటకు కారణములు, తిరుగుబాటు ఫలితములు మొదలగు అనేక విషయములను తెలుసుకొనుటకు ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 22.1 ఉపోద్ఘాతం :

ఆధునిక భారతదేశ చరిత్రలో మరువరాని సంఘటనలలో 1857 - '58 లో జరిగిన సిపాయిల తిరుగుబాటు చాలా ముఖ్యమైనది. ఆంగ్లసైన్యమందు బ్రతుకుతెరువునకు చేరిన భారతీయులే సిపాయిలు. వీరి సాయముతోనే ఆంగ్లేయులు మనదేశమున సువిశాల సామ్రాజ్యమును స్థాపించిరి. ఈ సిపాయిలు ఏదో ఒక అసంతృప్తికి గురియై తరచు, అతి స్వల్ప కారణములకు ఆంగ్లేయులపై తిరుగుబాటు చేయుచుండిరి.

ఉదా : కవాతు సమయమున బొట్టుపెట్టుకొనరాదను నిబంధనకు వ్యతిరేకంగా క్రీ.శ. 1806లో వెల్లూరునందు సిపాయిలు తిరుగుబాటు చేసిరి. అటులనే క్రీ.శ. 1824వ సంవత్సరమున బరక్‌పూర్ నందు, క్రీ.శ. 1831, 1847లలో బెంగాల్‌లోని మహమ్మదీయులు

తిరుగుబాట్లు, క్రీ.శ. 1849, 1851, 1852, 1855లలో మోప్లాల తిరుగుబాట్లు మొదలగునవి పేర్కొనదగినవి. ఇవన్నియు చిన్న, చిన్న తిరుగుబాట్లు. కాని క్రీ.శ. 1857 - '58 తిరుగుబాటు దీనికి పూర్తిగా విరుద్ధము. ఇది ప్రజల తిరుగుబాటు. ధనికుల నుంచి పేదల వరకు, రాజుల నుంచి సామాన్యుల వరకు, పురుషులు, స్త్రీలు, పిల్లలు అన్నిమతాలవారు ఆంగ్లేయుల పరిపాలనపై అసంతృప్తి కారణంగా ఈ తిరుగుబాటు లేవదీసినారు. ఈ తిరుగుబాటు ఆంగ్లేయులను కలవరపెట్టి, భయాందోళనలు కల్గించిన విప్లవాత్మకమైన చారిత్రక సంఘటనగా చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యత పొందినది.

ఆధునికి భారతచరిత్రలో క్రీ.శ. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు ప్రథమ జాతీయ సంగ్రామముగా ప్రసిద్ధికెక్కినది. ఆంగ్లేయులపై జరిగిన తొలి పోరాటముగా పేర్కొనబడినది. ఈ తిరుగుబాటు గాథను ఆధారముగా చేసుకొని భారతీయులు జాతీయోద్యమమును స్వల్పకాలంలోనే ప్రారంభించిరి. అందుచేతనే ఈ 1857 తిరుగుబాటుతో భారత జాతీయ ఉద్యమ చరిత్ర ప్రారంభమగుచున్నది.

## 22.2 తిరుగుబాటు స్వభావం :

ఎ) క్రీ.శ. 1857 సిపాయిల తిరుగుబాటు స్వభావము గూర్చి చరిత్రకారుల మధ్య భిన్నాభిప్రాయములు కలవు. బ్రిటీష్ చరిత్రకారులు ఈ తిరుగుబాటును కేవలం సిపాయిల 'పితూరీగ' వర్ణించిరి. ఇట్లు సిపాయిల పితూరీగా పేర్కొన్న వారిలో ముఖ్యులు జాన్ లారెన్స్, సర్‌సిలీ, స్మిత్, మార్షమన్ మొదలగువారు.

కాని ఇందు సత్యం లేదు. ఎందుచేతననగా ఈ తిరుగుబాటులో ఒక్క సిపాయిలే కాక అన్ని తరగతులకు చెందిన ప్రజలు పాల్గొనిరి.

బి) ఆంగ్ల చరిత్రకారులైన నార్టన్ డఫి, మాలిసన్, భారత స్వాతంత్ర్య సమరమున ప్రముఖపాత్ర వహించిన వి.డి. సావర్కర్, అశోక్ మెహతా మొదలగువారు జాతీయోద్యమమునకు ఉన్న లక్షణములు అన్నియు ఈ తిరుగుబాటుకు కలవని, కనుక ఇది తిరుగుబాటుగాక, ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామమని అభివర్ణించిరి.

ఇదియును పాక్షికమైన అభిప్రాయమే. ఈ తిరుగుబాటుకు ఒక నిర్దుష్టమైన ప్రణాళికకాని, జాతీయత భావము కాని లేవు, అంతియేకాక ఈ తిరుగుబాటు దేశవ్యాప్తంగా జరగలేదు.

సి) అనేకమంది పండితుల అభిప్రాయం ప్రకారం ఈ తిరుగుబాటును 1857లో జరిగిన 'గొప్ప తిరుగుబాటు'గ పేర్కొనుట సమంజసము. జవహర్‌లాల్‌నెహ్రూ ఇది కేవలం సిపాయిల పితూరీయేగాక, ఒక విలక్షణమైన తిరుగుబాటుకు ఉండవలసిన లక్షణములు ఈ తిరుగుబాటుకు కలవని తన అభిప్రాయంను వ్యక్తపరచెను. సిపాయిలలో వ్యాపించిన అసంతృప్తికి తోడుగా రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత కారణాలు ఈ తిరుగుబాటు సంభవించుటకు తోడ్పడినవి.

## 22.3 1857 సిపాయిల తిరుగుబాటునకు గల కారణములు :

### 22.3.1 రాజకీయ కారణములు లేక డల్‌హౌసీ బాధ్యత :

డల్‌హౌసీ అనుసరించిన రాజ్యసంక్రమణ సిద్ధాంతము (Doctrine of lapse) సామ్రాజ్య విస్తరణ చర్యలే 1857 తిరుగుబాటునకు కారణమని పలువురి చరిత్రకారుల అభిప్రాయం.

ఎ) డల్‌హౌసీ రాజ్యసంక్రమణ సిద్ధాంతమును వర్తింపచేసి సతారా, నాగపూర్, అయోధ్య, ఝాన్సీ మొదలగు స్వదేశీ సంస్థానములను ఆంగ్లరాజ్యములో విలీనము చేయుటతో స్వదేశీ రాజులలో భయాందోళనలు కల్గెను. ఇట్టి రాజ్యములను కోల్పోయిన స్వదేశీరాజులు తిరుగుబాటులో ప్రముఖపాత్ర వహించిరి. ఉదా : పీష్వా రెండవ బాజీరావుకిచ్చు 8 లక్షల రూపాయల భరణము అతని

దత్తపుత్రుడైన నానాసాహెబ్‌కు ఈయకపోవుట వలన, ఝాన్సీరాణి యగు లక్ష్మీబాయికి దత్తత అంగీకరించకపోవుట వలన వీరిరువురు తిరుగుబాటుదారులతో చేతులు కలిపిరి.

బి) క్రీ.శ. 1853లో దుష్పరిపాలన అను నెపముతో అయోధ్య నవాబును పదవి నుండి తొలగించి, అతని భూభాగమును ఆంగ్ల సామ్రాజ్యమున విలీనము చేశారు. అటులనే నాటి మొగల్ పాలకుని తొలగించి, అతనికి గల బిరుదులను రద్దుచేశారు. ఈ చర్యలకు కలత చెంది మహమ్మదీయులు తిరుగుబాటుదారులతో చేతులు కలిపిరి.

అయితే డల్‌హౌసీ రాజ్యసంక్రమణ సిద్ధాంతమును జమీందారీ భూములకు కూడా వర్తింపచేసి, సంతానము లేని జమీందారుల భూములను ఆంగ్ల సామ్రాజ్యమున కలిపెను. దాదాపు 20 వేల మంది డల్‌హౌసీ చర్య ఫలితముగా భూములను కోల్పోయి తిరుగుబాటులో కలిసిపోయిరి.

డి) సనాతన సాంప్రదాయబద్ధులగు హిందువులు డల్‌హౌసీ ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన సంస్కరణలు తమ మతమును నాశనము చేయుటకు, తమను క్రైస్తవ మతములోనికి మార్చుటకు తలపెట్టినవి అని భావించుటచే ఆంగ్లేయులు అత్యధిక సంఖ్యాకులైన హిందువుల ఆగ్రహావేశములకు గురియైరి. ఈ సంస్కరణలను ప్రవేశపెట్టుటలో డల్‌హౌసీ హిందువుల రాగద్వేషములను, మనోభావములను సరిగా అంచనా వేయలేదు.

ఇ) రాజ్య సంక్రమణ సిద్ధాంతం ద్వారా అనేకమంది పాలకులు, ఉద్యోగులు, సైనికులు, తమ జీవనభృతిని కోల్పోయిరి. ఇట్లు ఆంగ్లచర్యలకు గురియై ప్రతీకారము తీర్చుకొనుటకు తిరుగుబాటులో పాల్గొనిరి.

రాజ్యసంక్రమణ సిద్ధాంతమును ప్రవేశపెట్టినది డల్‌హౌసీ కాదు. ఈ సిద్ధాంతము డల్‌హౌసీకి పూర్వమే కలదు. కాని దీనిని అమలుపరచుటలో డల్‌హౌసీ నిర్దాక్షిణ్యముగా వ్యవహరించుట అతని లోపము. కంపెనీ ఆదేశానుసారము అయోధ్యను డల్‌హౌసీ ఆక్రమించెనేగాని, తనకు తానుగా ఆక్రమించలేదు. కావున ఈ విషయంలో డల్‌హౌసీ నిందించుట అంత సమజసము కాదు. డల్‌హౌసీ పాలనా సంస్కరణలు ప్రజాసంక్షేమ దృష్ట్యా ప్రవేశపెట్టినవేగాని, హిందూమత సాంప్రదాయములను నాశనము చేయుటకుకాదు.

చిరకాలంగా కంపెనీపాలనలో ప్రజలు అనేక విధములుగా బాధలకు గురియైరి. వీరంతా ఆంగ్లేయులపై ప్రతీకారము తీర్చుకొనుటకు సిద్ధముగా ఉన్న సమయంలో డల్‌హౌసీ చర్యలు వారిని మరింత ఉద్రుతపరచెను. ఒకవిధంగా డల్‌హౌసీ సంస్కరణలు, చర్యలు కాలగర్భమున మరుగున పడియున్న విప్లవ శక్తులు విజృంభించుటకు దోహదము చేసెనేగాని, అతని విధానముల వలననే విప్లవము రాలేదు. అందుచేతనే 'ఆచార్య ఈశ్వరీప్రసాద్ "డల్‌హౌసీ ఇండియాను పాలించినను, పాలించకపోయినను 1857లో గాకపోతే మరొకరోజు తిరుగుబాటు సంభవించెడిది" అని పేర్కొనెను. ("The mutiny would have occurred at a later date, if Dalhousie ruled India or nor" - Iswari Prasad) .

### 22.3.2 సాంఘిక కారణములు :

భారతదేశంలో కంపెనీపాలన ప్రారంభమగుటతో పాశ్చాత్య నాగరికత ప్రభావము వ్యాపించెను. దీని వ్యాప్తి వలన తమ ప్రాచీన ఆచార సాంప్రదాయములకు ప్రమాదము వాటిల్లినని భారతీయులు ఆందోళన చెందిరి. బెంటింక్, డల్‌హౌసీ మొ॥ వారు ప్రవేశపెట్టిన సాంఘిక, మత సంస్కరణలు సంప్రదాయబద్ధులగు హిందువలను గాయపర్చెను. సతీసహగమనము, బాల్యవివాహములను నిషేధించుట, స్త్రీ విద్యను ప్రోత్సహించుట, వితంతు వివాహ చట్టము చేయుట, ఆంగ్ల విద్యావిధానము, రైలు బండ్లలో అందరు సమానముగా కూర్చొండుట, తంతి తపాలా పద్ధతి, హిందూ మతమును వీడి క్రైస్తవ మతమును స్వీకరించిన వారికి తండ్రి ఆస్తిలో హక్కును కల్పించుట, మొదలగునవి హిందూ సమాజమును, చిరకాలముగా వచ్చు సంప్రదాయములను నాశనము చేయుటకై ప్రవేశపెట్టినవని అపోహపడి ప్రజలు తిరుగుబాటు చేయుటకు దారితీసెను.

### 22.3.3 మత కారణములు :

సనాతన హిందూ దేశమును క్రైస్తవ రాజ్యముగా మార్చనిదే, తమ అధికారము స్థిరపడదని ఆంగ్లేయులు తలంచిరి. హిందువులను క్రైస్తవులుగా మార్చి, తద్వారా నాగరికులను చేసి తమకు విశ్వాసపాత్రులుగా చేయుటకు ప్రయత్నించిరి. మన దేశమున క్రైస్తవమత వ్యాప్తికి అనేక చర్యలు గైకొనిరి.

ఎ) 1813 ఛార్టర్ చట్టప్రకారము క్రైస్తవ మిషనరీలు నియమింపబడిరి. వీరు దేశమంతా విస్తృతంగా తిరిగి, హిందూ, మహమ్మదీయ మతములను దుయ్యబట్టుచూ, క్రైస్తవ మతమును బోధింపసాగిరి.

బి) ఆంగ్ల భాష రాజభాష చేయబడెను.

సి) విద్యాసంస్థల యందు బైబిల్ బోధన నిర్బంధము చేయబడెను. కాని, ఖురాన్, హిందూ మత గ్రంథముల బోధన కెట్టి సదుపాయాలు కల్పించబడలేదు.

డి) హిందూ ధర్మశాస్త్ర ప్రకారము మతము మార్చుకున్న వ్యక్తికి తన తండ్రి కుటుంబ ఆస్తిపై హక్కులేదు. కాని ఆంగ్లేయులు క్రైస్తవమత వ్యాప్తికి, మతము మార్చుకొన్న వ్యక్తికి తండ్రి కుటుంబ ఆస్తిపై హక్కును కల్పించుచూ 1856లో ఒక చట్టము చేసిరి.

ఈ చర్యలన్ని భారతీయులను క్రైస్తవులుగా మార్చుటకు రూపొందినవని తలంచి, హిందువులు, మహమ్మదీయులు తమ తమ మతముల రక్షణార్ధం బద్ధకంకణులై తిరుగుబాటునకు సంసిద్ధులైరి.

### 22.3.4 ఆర్థిక కారణములు :

ఎ) వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్యసహకార విధానం వలన, డల్‌హౌసీ ప్రవేశపెట్టిన రాజ్యసంక్రమణ సిద్ధాంతము వలన స్వదేశీ రాజ్యములు అనేకము బ్రిటీష్ సామ్రాజ్యమున విలీనము చేయబడెను. ఆ రాజ్యమునందలి ప్రభుత్వోద్యోగులు, సైనికులు నిరుద్యోగులై, నిరాశ్రయులై, బికారులుగా మారిరి. వారు తమ కనీస జీవితావసరములను గూడ గడుపుకొను స్థితి లేక, గత్యంతరము లేక తిరుగుబాటుకు సంసిద్ధులైరి.

బి) బ్రిటీష్ వారు అనుసరించిన ఆర్థిక విధానము వలన భారతీయ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. రైతుల మీద అధిక పన్నులు విధించేవారు, పైగా ఆ పన్నులు ధనరూపంలోనే వసూలు చేసేవారు. శిస్తు వసూలులో ఆంగ్లేయులు నిర్దాక్షిణ్యముగా వ్యవహరించి, బకాయిలు పడిన జమీందార్ల భూములను "Sale Law" ప్రకారము వేలము వేయసాగిరి. దాదాపు 20,000 ఎస్టేట్లను డల్‌హౌసీ కాలమున ప్రభుత్వం స్వాధీనము చేసుకొనెను.

సి) ఇంగ్లాండులో జనించిన పారిశ్రామిక విప్లవ ఫలితంగా, భారతదేశంలో లక్షలాది ప్రజలకు జీవనభృతి నొసంగు కుటీర పరిశ్రమలు క్షీణించెను.

బ్రిటీష్‌వారు మనదేశమున ముడిపదార్థములు ఎగుమతి చేసే దేశముగాను, బ్రిటీష్ వస్తువులకు మంచి మార్కెట్‌గాను రూపొందించిరి. విదేశీ వస్తువులు మార్కెట్‌లో చౌకగా లభించుటచే, దేశీయ ఉత్పత్తులలో గిరాకీ తగ్గిపోయెను. కుటీర పరిశ్రమలపై ఆధారపడిన అనేకమంది నిరాశ్రయులై, నిరుద్యోగులైరి. దేశీయ పరిశ్రమలకు ఆంగ్లేయుల రక్షణగాని, సౌకర్యములుగాని కల్పింపక పోవుటతో వాటి ప్రాధాన్యత తగ్గిపోయెను.

డి) కరువు కాటకములందు ప్రజలకు ప్రభుత్వము నుండి ఎటువంటి సహాయము అందక, వారి జీవన పరిస్థితులు దుర్భరమయ్యెను.

ఇ) రైత్వారీ విధానము వలన అనేకమంది రైతులు ఋణగ్రస్తులు కాగా, విద్యావంతులైన భారతీయులకు కంపెనీ సర్వీస్‌లందు ఉద్యోగములు లభింపక పోవుటతో నిస్సహాయులైరి. ఇట్లు బ్రిటీష్‌వారు అనుసరించిన ఆర్థిక విధానం మన దేశములోని అన్ని వర్గముల వారు ఆర్థిక దుస్థితికి గురియై 1857 తిరుగుబాటుకు దోహదము చేసిరి.

## 22.3.5 సైనిక కారణాలు :

అన్ని కారణాలలోకి ప్రధానమైనది సైనిక కారణము. ఒక విధముగా 1857 తిరుగుబాటు సైనిక రంగము నుండి ప్రారంభమైనదని చెప్పవచ్చును.

ఎ) నాడు ఆంగ్ల సైన్యమందు గల సిపాయిల పరిస్థితులు అత్యంత దుర్భరముగా ఉండెను. సిపాయిలను ఆంగ్లేయులు కడుహీనముగా చూచుచుండిరి. ఆంగ్ల సైనికులకంటే సిపాయిల జీత, భత్యములు చాలా తక్కువ. సైనిక వ్యవస్థలో పదవుల నొసంగుట, మరియు ఉద్యోగహోదా హెచ్చింపు (ప్రమోషన్లు) అర్హత, శక్తి సామర్థ్యములను బట్టిగాక క్రైస్తవ మతమును స్వీకరించిన వారికి, ఆంగ్లేయులకు విధేయులై, వారి ఆదరాభిమానములు పొందినవారికి మాత్రమే ఉన్నత పదవులీయబడెను. దానితో సిపాయిలకు ఉన్నత పదవులను పొందు అవకాశము లేకపోవుటతో, సిపాయిలలో ఆంగ్లేయులపై ద్వేషభావం పెరిగెను.

బి) సిపాయిలపై ఆంగ్ల అధికారములకు విశ్వాసము లేదు.

సి) హిందూ ధర్మశాస్త్రము సముద్రయానము నిషేధించెను. హిందూ సిపాయిలు రెండవ బర్మాయుద్ధమున సముద్రమును దాటుట కిష్టపడలేదు. నాటి గవర్నర్ -జనరల్ కానింగ్ క్రీ.శ. 1856లో సామాన్య సేనాని యుక్త చట్టము (General Service Enlistment Act) చేసి సిపాయిలు సముద్రాంతర దేశములకు కూడా తప్పనిసరిగా వెళ్లవలయునని ఆదేశించెను. ఇట్లు ఆంగ్లపాలనలో హిందూ మత విశ్వాసములకు తీరని అవమానము ఏర్పడెను.

డి) ఆంగ్ల సైన్యములో గల మహమ్మదీయ సిపాయిల మత సాంప్రదాయములగు గడ్డములను, తల మీద జుత్తును ఉంచుకొనుటకు ఆంగ్లేయులు మొదట అనుమతించినను, కాలక్రమముగా వానిని తీసివేయవలసినదిగా ఆజ్ఞాపించుటచే మహమ్మదీయులు తమ భావములను గాయపరచినట్లు భావించి, ఆంగ్లేయులపై ద్వేషభావం పెంచుకొనిరి.

ఇ) భారతీయులకు ఆంగ్ల సైనిక శక్తిసామర్థ్యములపై అపార విశ్వాసము కలదు. కాని మొదటి ఆఫ్ఘన్ యుద్ధమున బ్రిటీష్ సైన్యము ఘోరపరాజయము పొందుట వలన వారి సైనికశక్తి ఎడల సిపాయిలకున్న విశ్వాసము సడలెను. తాము కూడా తిరుగుబాటు చేసి ఆంగ్లేయులపై విజయమును సాధించవచ్చునని భారతీయ సిపాయిలు తలంచి తిరుగుబాటుకు సంసిద్ధులైరి.

ఎఫ్) చైనా, క్రిమియా యుద్ధంలో ఆంగ్లేయులు నిమగ్నులై యుండుట, ఆంగ్ల సైన్యము నందు బ్రిటీష్ సైన్యము కంటే సిపాయిలు అత్యధిక సంఖ్యాకులగుట వలన సిపాయిలందు ధైర్యము ఇనుమడించెను. ఉదా : మొత్తం ఆంగ్ల సైన్యమందు 2,33,600 మంది సిపాయిలుండగా, బ్రిటీష్ సైనికులు కేవలము 45,332 మాత్రమే కలరు. అనగా బ్రిటీష్ సైనికులు ఆంగ్లసైన్యమందు 19 శాతం మాత్రమే.

జి) నాడు ఉత్తరాపథంలో గల ఆంగ్లాయుధాగారములు సిపాయిల పర్యవేక్షణలో ఉండుట, బ్రిటీష్ సైనికులలో ఎక్కువమంది కొత్తగా జయింపబడిన పంజాబ్ మొదలగు ప్రాంతములకు పంపబడుట, కీలక ప్రాంతమునందు ఆంగ్లసేనల లేకపోవుట మొదలగు అంశములు తిరుగుబాటునకు దోహదపడెను.

హెచ్) సిపాయిలు ఆంగ్లపాలనపై అసంతృప్తి, నిరసనలు వ్యక్తపరచుచు చపాతీలలో కాగితముల ద్వారా తమ అభిప్రాయములను ఒకచోట నుండి మరొక చోటికి చేరవేయసాగిరి. ఆంగ్ల అధికారులను వధించుట, చెరసాలలను బ్రద్దలు కొట్టుట, ప్రభుత్వ ధనాగారములను పట్టుకొనుట, రైలు, తంతి మార్గములను విచ్ఛిన్నము చేయుట, ఆయుధశాలలను, కోటలను వశపరచుకొనుట మొదలగు కార్యక్రమాలను సిపాయిలు రూపొందించిరి.

### 22.3.6 తక్షణ కారణము (ఆవు, పంది కొవ్వు తూటాలు) :

ఇట్టి విషమ పరిస్థితులలో క్రొత్తగా ప్రవేశపెట్టిన 'ఎన్‌ఫీల్డ్ రైఫిల్స్' అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఈ రైఫిల్స్‌లో క్రొత్తరకం తూటాలకు ఆవు కొవ్వు, పంది కొవ్వు పూయబడిందని వదంతి వ్యాపించెను.

ఆవు హిందువులకు పవిత్రము, పంది మహమ్మదీయుల కసహ్యము. ఆ తూటాలను వాడే ముందు పంటితో కొరకవలె. దీనితో హిందూ, ముస్లిం సిపాయిలు ఈ చర్యను నిరసించి, తిరుగుబాటుకు ఉపక్రమించిరి. ఆంగ్లేయులు ఈ తీవ్ర సంఘటనను గాంచి తూటాలను ఉపసంహరించుకొందుమని హామీ యిచ్చినను, ఫలితం లేకపోయెను. అంతట 29, మార్చి 1857 మంగళ్‌పాండె అను సిపాయి 'బరక్‌పూర్' వద్ద ఆంగ్ల ఉద్యోగిని కాల్చిచంపుటతో తిరుగుబాటు ప్రారంభమయ్యెను.

## 22.4 తిరుగుబాటు వ్యాప్తి - నాయకులు :

సిపాయిల తిరుగుబాటు మొదట బరక్‌పూర్‌నందు ప్రారంభమై ఆనతికాలంలోనే ఉత్తరాపథములోనికి వ్యాపించి, వివిధ ప్రదేశము లందు తిరుగుబాట్లు జనించునట్లు చేసెను. 10, మే 1857న మీరట్‌లోని సిపాయిలను ఆంగ్లేయులు కఠినముగా శిక్షించుటతో సిపాయిలు తిరుగుబాటు చేసి, ఆంగ్లాధికారులను వధించి, వారి గృహములను దగ్ధము చేసిరి. ఆనతికాలంలోనే సిపాయిలు ఢిల్లీని చేజిక్కించుకొనిరి. రెండవ బహదూర్‌షా (నాటి మొగల్ చక్రవర్తి) భారతదేశ చక్రవర్తిగా ప్రకటించబడినాడు. తిరుగుబాటు ఇంచుమించు ఉత్తర భారతదేశం అంతటా వ్యాపించింది. ఈ తిరుగుబాటుకు ఢిల్లీ ముఖ్య కేంద్రంగా మారింది.

**ఎ) ఢిల్లీ :** తిరుగుబాటుదారులు ఢిల్లీని ఆక్రమించుకొని, రెండవ బహదూర్‌షాను భారతదేశ చక్రవర్తిగా ప్రకటించుటతో, నాటి గవర్నర్ జనరలైన 'కానింగ్' కాబూల్ అమీరైన దోస్తు మహమ్మద్‌తోను, దినకరరావు, సింధియాతోను, హైదరాబాద్ నిజాన్‌తోను సంధి చేసుకొని, 'నికల్‌సన్' నాయకత్వమున ఆంగ్లసేనలను ఢిల్లీ పైకి పంపెను. బ్రిటీష్‌వారు పంపిన సిక్కు పటాలము సెప్టెంబరు 14వ తేదీన ఢిల్లీని తిరిగి ఆక్రమించెను. ఈ ఆక్రమణలో ఆంగ్ల సేనలు దాదాపు 30,000 మంది పౌరులను కిరాతకముగా వధించిరి, అయితే ఈ సంఘటనలలో 'నికల్‌సన్' కూడా అసువులుబాసెను.

ఆంగ్లసేనలు ఢిల్లీని ఆక్రమించిన పిదప, ఢిల్లీ పాదుషా బందీ చేయబడి, బర్మాకు పంపబడినాడు. బహదూర్‌షా బర్మాలో 1862లో మరణించెను. అతని మరణముతో మొగల్ సామ్రాజ్యము అంతమయ్యెను.

**బి) కాన్పూరు :** కాన్పూర్ నందు తిరుగుబాటుకు నాయకత్వము వహించినవాడు చివరి పీష్వా రెండవ బాజీరావు దత్తకుమారుడైన నానాసాహెబ్. మొదట నానాసాహెబ్ ఆంగ్లేయులకు మిత్రుడిగా నటించి, వారి విశ్వాసములను చూరగొని, రహస్యముగా సిపాయిలకు సాయముచేసి, అనేకమంది ఆంగ్లేయులను, వారి కుటుంబ సభ్యులను 'బీబీఘర్' నందు దారుణముగా వధించెను. దీనికితోడు జూన్ 30వ తేదీన నానాసాహెబ్ తానే పీష్వాగా ప్రకటించుకొనెను. అంతట కోపోద్రిక్తులైన ఆంగ్లసైన్యము హెన్రీహావ్‌లాక్, నీల్ నాయకత్వములో కాన్పూర్‌ను ఆక్రమించెను. నానాసాహెబ్ పరాజితుడై నేపాల్ అడవులకు పారిపోయెను.

**సి) లక్నో :** లక్నో నందు సిపాయిలు తిరుగుబాటు చేసి ఆంగ్ల ఉద్యోగియైన సర్.హెన్రీ లారెన్స్‌ను చంపిరి. కాని హావ్‌లాక్, జేమ్స్‌ఔట్రామ్‌లు లక్నోను తిరిగి స్వాధీనపరచుకొని తిరుగుబాటు అణచివేసిరి.

**డి) అయోధ్య :** అయోధ్యలో తిరుగుబాటుదారులు రాణి బేగన్ హజ్రత్‌మహల్, నానాసాహెబ్ సోదరుడైన బాలాసాహెబ్ నాయకత్వమున తిరుగుబాటు చేయగా, 'సర్ కోలిన్ కాంప్‌బెల్' వీరి తిరుగుబాటును అణిచివేసెను.

**ఇ) బీరార్, బరైలీ ప్రాంతములు :** బీరార్ నందలి 'దినపూర్ నందు' కున్వర్‌సింగ్, రోహిల్‌ఖండ్ నందలి 'బరైలీ' నందు ఖాన్‌బహదూర్ తిరుగుబాటు చేయగా, ఆంగ్లేయులు అణిచివేసిరి.

**ఎఫ్) ఝాన్సీ :** ఝాన్సీ పాలకుడైన గంగాధరరావు మరణానంతరము, అతని భార్య లక్ష్మీబాయి పాలనా బాధ్యతలు స్వీకరించి, తన రాజ్యమునకు వారసునిగా ఒక మైనర్ బాలుని దత్తత చేసుకొనెను. ఈ దత్తతను నాటి గవర్నర్ జనరల్ డల్‌హౌసీ అంగీకరించక, ఝాన్సీని ఆంగ్ల సామ్రాజ్యమును విలీనము చేసెను. అంతట లక్ష్మీబాయి హిందూ సేనలను సమీకరించి, ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసెను. ఝాన్సీలోని తిరుగుబాటుదారులు ఆంగ్ల సైనికోద్యోగియైన 'డన్ లప్' ను దారుణముగా చంపిరి. తాంతియాతోపే, రావుసాహెబ్‌లు లక్ష్మీబాయికి అండగా నిలిచిరి. కాని సర్ హ్యూ రోస్ (Sir Hugh Rose) నాయకత్వములోని ఆంగ్లసేనలు లక్ష్మీబాయి, తాంతియాతోపేలను గ్వాలియర్ వద్ద ఓడించెను. లక్ష్మీబాయి పురుషవేషము ధరించి కదనరంగములో వీరోచితముగా ఆంగ్లేయులతో పోరాడి వీరమరణము పొందెను.

## జి) రాజపుత్ర స్థానము :

రాజపుత్ర స్థానములోని ఇండోర్, నర్సిరాబాద్, నిమాచ్‌లను తిరుగుబాటు చెలరేగెను. ఈ తిరుగుబాట్లను ఆంగ్లసేనలు సమర్ధవంతంగా అణచివేసి, శాంతిభద్రతలు నెలకొల్పెను.

## హెచ్) మధ్య భారత్ :

ఝాన్సీ తిరుగుబాటు నుండి తప్పించుకొని పారిపోయిన తాంతియాతోపే, రావుసాహెబ్‌లు, మధ్యభారత్, బుందేల్‌ఖండ్ ప్రాంతములందు రహస్య స్థావరముల నేర్పరచుకొని, క్రీ.శ. **1859** వరకు ఆంగ్లేయులపై గెరిల్లా పోరాటమును సాగించిరి. కాని తాంతియా స్నేహితుడైన 'మార్వార్' ప్రభువైన 'మాన్‌సింగ్' మిత్రద్రోహియై, తాంతియాను ఆంగ్లేయులకు పట్టించెను. ఆంగ్లేయులు తాంతియాను ఉరితీసిరి. తాంతియా ఉరితీతతో తిరుగుబాటు ముగిసెను.

## 22.5 తిరుగుబాటు విఫలమగుటకు కారణములు :

1857 సిపాయిల తిరుగుబాటు విఫలమగుటకు కొన్ని కారణములు కలవు. అవి ఏమనగా

1) సిపాయిల తిరుగుబాటు కొన్ని ప్రాంతములకే పరిమితమైనది, దేశవ్యాప్తముగా జరగలేదు. కేవలము ఉత్తరప్రదేశ్, అయోధ్య, రోహిల్‌ఖండ్, బీహార్, బెంగాల్‌లోని పశ్చిమ ప్రాంతములకు మాత్రమే పరిమితమయ్యెను. సింధు, పంజాబ్, తూర్పుబెంగాల్, దక్షిణ భారతములందు ఎట్టి తిరుగుబాట్లు చెలరేగలేదు.

2) తిరుగుబాటుదారుల మధ్య సరైన ప్రణాళికకాని, సంబంధములు కాని లేవు. దానికితోడు ప్రధానంగా అసలు ఈ తిరుగుబాటుకు నాయకత్వము లేదు. మరియు తిరుగుబాటు అనుకున్న పథకము కంటే ముందుగానే ఆరంభమై, అనతి కాలములోనే ముగిసెను. వీరికి సరియైన ఆశయము కూడా లేదు.

3) దేశములోని అత్యధిక సంఖ్యలో ప్రజలు, ప్రముఖ వీరులు, స్వదేశీ సంస్థానాధీశులు తిరుగుబాటు నందు పాల్గొనకపోగా, తిరుగుబాటు అణుచుటలో ఆంగ్లేయులకు సహాయపడిరి. ఉదా : రసపుత్ర వీరులు, శిక్కులు, ఘూర్కాలు, గ్వాలియర్ పాలకుడు దినకరరావు, హైదరాబాద్ నిజామ్ అఫ్జల్ ఉద్దౌలా, పాటియాలా, కాశ్మీర్, సింధు, పాలకులు ఆంగ్లేయులకు బాసటగా నిలిచిరి.

4) లారెన్స్, ఔట్రామ్, హవలాక్, నికల్సన్, ఎడ్వర్డ్స్ మొదలగు ఆంగ్లాధికారులతో పోల్చిన తిరుగుబాటుదారులు ఏ విధముగాను సరిరారు.

5) భారతీయులు అనాగరిక సాధనములను ఉపయోగించగా, సముద్రాధిపత్యమును కల్గిన ఆంగ్లేయులు ఆధునిక, శాస్త్రీయ సైనిక సంపత్తితో తిరుగుబాటు సమర్ధవంతముగా అణిచివేసిరి.

6) తిరుగుబాటు చెలరేగిన కొన్ని ప్రాంతములలో సిపాయిలు పౌరజనులను హింసించుట వలన, వారు ప్రజల సానుభూతిని కోల్పోయిరి. ప్రజలే కొన్నిచోట్ల తిరుగుబాటుదారులను అణచివేయుటకు ఆంగ్లేయులకు సహాయపడిరి.

7) తిరుగుబాటుదారుల పట్ల కానింగ్ ప్రభువు ఔదార్యముతో వారిని హింసింపక, శాంతియుత మార్గముల ద్వారా వారిని సమన్వయపరచెను.

8) సిపాయిలు ఆఫ్ఘన్ రాజు వద్ద నుండి సాయము లభించునని ఆశించిరి. తుదకు వారికెట్టి సాయము లభించలేదు.

9) ఆంగ్లసైన్యము శుశిక్షితమైనది. ఆంగ్లేయులకు ధనము కూడా కలదు. సిపాయిలు ఆర్థికపరమైన ఇబ్బందులకు కూడా గురియైనారు.

10) 1857 తిరుగుబాటులో పాల్గొన్న నాయకులు తమ వ్యక్తిగత రాజకీయ స్వప్రయోజనార్థము మాత్రమే తిరుగుబాటులో పాల్గొనిరి. ఇందు ఎవరికి జాతీయభావ లక్ష్యము లేదు.

ఒక విధంగా బహు నాయకత్వము, ఉమ్మడి కార్యక్రమరహితము, సైనిక, ఆర్థిక బలహీనతలు, ఆంగ్లేయుల ఆధిక్యత, ప్రజలకు దేశభక్తి లోపించుట, డల్‌హౌసీ కాలమున ప్రవేశపెట్టబడిన తంతి, తపాలా, రైల్వే మొదలగు ఆధునిక సౌకర్యములు ఆంగ్లేయుల చేతిలో ఉండుటతో తిరుగుబాటును త్వరితముగా అణిచివేయకలిగిరి.

## 22.6 తిరుగుబాటు ఫలితములు లేదా ప్రాముఖ్యత :

1857 తిరుగుబాటు ఆధునిక భారతదేశ చరిత్రలో ఒక విప్లవాత్మకమైన సంఘటన. ఈ తిరుగుబాటు విఫలమైనను పాలకులకు కనువిప్పు కలిగించి, వారు పాలనా వ్యవస్థలో అనేక మార్పులను ప్రవేశపెట్టుటకు దోహదపడెను.

1) క్రీ.శ. 1857లో జరిగిన తిరుగుబాటు ఫలితంగా ఆంగ్లేయ పరిపాలన విధానంలో ఒక నూతన శకం ప్రారంభమయింది. కంపెనీ పాలనలోని లోపములను, భారతీయుల అసంతృప్తిని బ్రిటీష్ పార్లమెంటు గ్రహించి, క్రీ.శ. 1858 ఆగస్టులో ఒక శాసనముచేసి, దాని ద్వారా తూర్పుఇండియా పరిపాలన రద్దుచేసి, భారతదేశ పరిపాలన బాధ్యతను బ్రిటీష్ సార్వభౌముడు స్వీకరించెను.

2) తూర్పు ఇండియా కంపెనీ పాలన రద్దు అగుటతో, కంపెనీ యజమానుల సంఘము, కంపెనీ నిర్దేశకుల సంఘము, బోర్డు ఆఫ్ కంట్రోల్ కూడా రద్దయ్యెను. ఇండియాలోని గవర్నర్ - జనరల్ రాజప్రతినిధి (వైస్రాయ్) అయ్యెను. ఇతడు బ్రిటీష్ ఇండియాను పాలించుటలో గవర్నర్ జనరల్ హోదాలోను, స్వదేశీ సంస్థానాధీశులతో వ్యవహరించునపుడు రాజ ప్రతినిధి లేదా వైస్రాయి హోదాలోను వ్యవహరించును. అనగా ఒకే వ్యక్తి రెండు హోదాలను నిర్వహించును. అటులనే భారత వ్యవహారములను చూచుటకు భారత వ్యవహారముల మంత్రి లేదా భారతరాజ్యమంత్రి (Secretary to State for India) అను ఒక మంత్రి, అతనికి సలహాలిచ్చుటకు 15 మంది సభ్యులుగల ఇండియా కౌన్సిల్ అను ఒక సలహామండలి ఏర్పాటు చేయబడెను.

3) సిపాయిల తిరుగుబాటును అణచిన పిమ్మట, సార్వభౌముని పాలనలో తొలి వైస్రాయి కానింగ్ ప్రభువు 1858, నవంబరు 1వ తేదీన అలహాబాద్ దర్బార్ ఏర్పాటుచేసి, విక్టోరియా మహారాణిని భారతదేశ సార్వభౌమురాలిగా ప్రకటించి, ఒక ప్రకటన చేసెను. దీనినే "విక్టోరియా మహారాణి'' ప్రకటన అందురు. ఈ ప్రకటనలో మహారాణి భారతీయులందు అలముకొనిన భయాందోళనలను నివృత్తి చేయుటకు కొన్ని హక్కులిచ్చెను. అవి ఏమనగా కంపెనీ స్వదేశీ సంస్థానాధీశులతో చేసుకున్న సంధి షరతుల ప్రకారం ఇకపైనకూడ నడుచుకొనేటట్లు, స్వదేశీ సంస్థానాధీశుల హక్కులను, మర్యాదలను కాపాడునని హామీఇచ్చెను. మత విషయాలలో ఎటువంటి జోక్యం కల్పించుకొనమని, జాతి, మత విచక్షణ లేకుండా అర్హతలనుబట్టి ప్రజలందరికి ఉద్యోగాలిచ్చేటట్లు చట్టాలు చేయగలమని, ప్రాచీన సంప్రదాయాలను మన్నించగలమని ఆమె తన ప్రకటనలో ప్రకటించెను.

4) రాజ్యసంక్రమణ సిద్ధాంతము, పూర్తిగా రద్దుచేయబడి, స్వదేశీ సంస్థానాధీశులకు దత్తు తీసుకునే హక్కు కల్పించబడెను.

5) సైన్యంలో భారతీయుల సంఖ్య తగ్గించబడింది. శతఘ్నిదళాలను యూరోపియన్లకే పరిమితం చేసినారు. అటులనే ఉన్నత కులాలవారిని సైన్యం నుంచి తొలగించారు.

6) మొగల్ చక్రవర్తి అయిన 'రెండవ బహదూర్‌షా' దేశము నుండి బహిష్కరింపబడి, రంగూన్‌కు పంపబడుటతో ఢిల్లీనందు మొగల్ పాలన అంతమయ్యెను. తదుపరి కొద్ది కాలమునకు బహదూర్‌షా మరణానంతరము (క్రీ.శ. 1862) మొగల్ వంశమంతరించెను.

7) ఆంగ్లేయులు హిందూ సిపాయిల పట్ల సానుభూతి వహించి, ముస్లిం సిపాయిల పట్ల కఠినముగా వ్యవహరించిరి. తత్ఫలితంగా హిందూ - ముస్లింల మధ్య ద్వేషము ప్రబలెను. ఈ విభేదములే బ్రిటీష్‌వారు విభజించు పాలించు విధానమును, తదుపరి హిందూ - ముస్లిం సంఘర్షణకు దారితీసెను.

8) తూర్పు ఇండియా సంఘము రద్దగుటచే ఆంగ్లేయులు అధిక సంఖ్యలో భారతదేశమునకు వచ్చి వర్తక వ్యాపారములను కొనసాగించిరి. మనదేశ వనరులను కొల్లగొట్టిరి. దీనితో భారతదేశము ఆర్థిక దుస్థితికి లోనై బడుగు దేశమయ్యెను.

9) ఈ తిరుగుబాటు ఫలితముగా ఆంగ్లేయులు భారతీయులను అణచివేయుటకు ప్రయత్నించిరి. అయితే క్రమముగా భారతీయులలో రాజకీయ చైతన్యము కల్గి, జాతీయభావ మంకురించి, తదుపరి స్వాతంత్ర్య సమరమునకు దోహదపడెను.

10) ముఖ్యముగా వ్యాపారబద్ధమైన, అభివృద్ధి నిరోధక, స్వార్థపూరిత ప్రభుత్వమునకు బదులు, ఉదార, విజ్ఞానవంతమైన పాలన ప్రారంభమగుటకు ఈ తిరుగుబాటు ఉపకరించెను.

## 22.7 ముగింపు :

ఏమైనను సిపాయిల తిరుగుబాటు వలన భారతదేశ చరిత్రలో ఒక నూతన శకము ప్రారంభమయ్యెను. ఆంగ్లేయులకు కనువిప్పు కల్గినది, భారతీయుల శక్తి బహిర్గతమైనది, తదుపరి భారత స్వాతంత్ర్య ఉద్యమముకు నాందిగా ఈ తిరుగుబాటు నిలిచెను.

## మాదిరి ప్రశ్నలు :

1. క్రీ.శ. 1857 తిరుగుబాటుకు గల కారణములు, ఫలితాలను వివరింపుము.
2. క్రీ.శ. 1857 సిపాయిల తిరుగుబాటునకు గల కారణములు - తిరుగుబాటు విఫలమగుటకు గల కారణములు వివరింపుము.
3. క్రీ.శ. 1857 సిపాయిల తిరుగుబాటుకు డల్‌హౌసీ ఎంతవరకు బాధ్యుడు ?
4. 1857 తిరుగుబాటుకు గల సైనిక కారణములు
5. 1857 తిరుగుబాటు ఫలితములు తెలుపుము.
6. 1857 తిరుగుబాటు సాంఘిక, మత కారణాలు

## ఉపయుక్త గ్రంథాలు :


1) ఆధునిక భారతదేశ చరిత్ర (1757 - 1947) - డా॥ అల్లాడి వైదేహి

2) 1857 తిరుగుబాటు - ఆచార్య పి. శ్రీరామశర్మ

3) భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగం) - డా॥ పాటిబండ్ల ఝాన్సీలక్ష్మీ & డా॥ శ్రీమతి అల్లాడి వైదేహి

4) The First War of Indian Independence - V.D. Savarkar

5) History of the Freedom Movement in India Vol. I - R.C. Majumdar


**Author : C. Ravindra Raju**

పాఠం - 23

# బ్రిటీషు పార్లమెంటరీ చట్టములు 1858 నుండి 1947 వరకు

**విషయసూచిక :**


23.0 లక్ష్యం

23.1. 1858 చట్టము

23.2. 1861 కౌన్సిలు చట్టము

23.3. 1892 కౌన్సిలు చట్టము

23.4. మింటో - మార్లే సంస్కరణలు లేక 1909 శాసన సభా చట్టము

23.5. మాంటేగు - ఛమ్స్‌ఫర్డ్ సంస్కరణలు లేక 1919 శాసనసభా చట్టము

23.6. 1935 చట్టము

23.7. భారతదేశ స్వతంత్ర చట్టము - 1947

23.8. ముగింపు


## 23.0 లక్ష్యం :

ఆంగ్లేయ ప్రభుత్వం ఈస్ట్ఇండియా కంపెనీ నుండి అధికారాన్ని స్వాధీనపరుచుకున్న తర్వాత, భారతదేశాభివృద్ధికి చేసిన చట్టాలను వివరించడమే ఈ పాఠం యొక్క లక్ష్యం. భారతీయుల ఆందోళన ఫలితంగా బ్రిటీషు ప్రభుత్వం ఎన్నో చట్టాలను చేసింది. బ్రిటీషు పరిపాలన పద్ధతులే చట్టరూపంలో ఏర్పడి భారతదేశ రాజ్యాంగాభివృద్ధికి దోహదం చేశాయి.

## 23.1. 1858 చట్టము :

### ఉపోద్ఘాతము :

1857లో భారతదేశంలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటు వలన ఇంగ్లాండులో ఆందోళన చెలరేగింది. భారతదేశము వంటి పెద్ద దేశాన్ని ఒక వ్యాపారసంస్థ ఆధీనంలో వుంచుట క్షేమం కాదని, కంపెనీ పాలన రద్దు చేయాలనే ఆందోళన ఇంగ్లాండులో ప్రారంభమయింది. ఈ ఆందోళన ఫలితంగా బ్రిటీషు పార్లమెంటు ఒక చట్టం చేసింది. అదే 1858 చట్టం.

### ముఖ్యాంశాలు :

1) భారతదేశ పరిపాలన ఈస్టిండియా కంపెనీ నుండి బ్రిటీషు చక్రవర్తి ఆధీనంలోకి వచ్చింది.

2) కోర్టు ఆఫ్ డైరెక్టర్స్, బోర్డ్ ఆఫ్ కంట్రోలుల పరిపాలన రద్దుచేయబడినది. వీరి స్థానంలో భారతరాజ్య కార్యదర్శి నియమించబడెను. ఇతనికి భారత వ్యవహారములపై పూర్తి ఆధిపత్యము ఇవ్వబడెను. ఇతను బ్రిటీషు మంత్రివర్గ సభ్యుడై వుండాలి. జీతబత్తెములు మాత్రం భారత ఖజానా నుండి చెల్లించబడును. బ్రిటీషు పార్లమెంటుకు బాధ్యత వహించవలెను. ప్రభుత్వం ఇతని సలహాతో గవర్నరు - జనరల్‌ను, రాష్ట్ర గవర్నర్లను, ప్రధాన న్యాయాధిపతులను నియమిస్తుంది. ఇతని కార్యాలయం లండన్‌లో వుంటుంది.

3) గవర్నరు జనరల్ ఇకనుండి రాజప్రతినిధిగా వ్యవహరింపబడి వైస్రాయిగా పిలువబడతాడు.

4) ఈ చట్టం వలన 15 మంది సభ్యులతో ఒక ఇండియన్ కౌన్సిల్ ఏర్పడింది. ఇందులో 7 గురిని కోర్టు ఆఫ్ డైరెక్టర్స్ ఎన్నుకుంటారు. మిగిలిన 8 మందిని చక్రవర్తి నియమిస్తాడు. ఇండియన్ కౌన్సిలు సమావేశాలకు భారతరాజ్య కార్యదర్శి అధ్యక్షత వహిస్తాడు. అతనికి ప్రత్యేక ఓటుకూడా ఇవ్వబడింది. కౌన్సిలు సభ్యుల జీతభత్యాలను బ్రిటీషు ప్రభుత్వమే భరిస్తుంది.

**ప్రాధాన్యత :**

ఈ చట్టం భారతదేశంలో కంపెనీ పాలనను అంతంచేసింది. భారతీయ వ్యవహారాలపై భారతరాజ్య కార్యదర్శి అదుపు మొదలైంది.

## 23.2. 1861 కౌన్సిలు చట్టం :

**ముఖ్యాంశాలు :**

1) గవర్నరు - జనరల్ కౌన్సిలు సభ్యుల సంఖ్య 4 నుండి 5కు పెంచబడెను. గవర్నరు - జనరల్ అధికారాలు పెరిగాయి. మొదటిసారిగా శాఖల విభజనచేసి ఒక్కొక్క శాఖను ఒక్కొక్క సభ్యునికి కేటాయించటం జరిగింది.

2) గవర్నరు - జనరల్ కౌన్సిలుకు శాసన నిర్మాణానికి 6గురి నుండి 12మంది సభ్యులను నియమించటం జరిగింది. అందులో సగం మంది అనధికారులు. సభ్యులను గవర్నరు - జనరల్ నియమిస్తాడు. శాసనసభ అధికారాలు కేవలం పరిమితం. సభ్యులు ఆమోదించిన బిల్లులు గవర్నరు - జనరల్ అనుమతి పొందితేనే చట్టమౌతుంది. రాష్ట్ర చట్టాలు కూడా గవర్నరు జనరల్ అనుమతి పొందాలి.

3) అత్యవసర పరిస్థితులలో గవర్నరు - జనరల్‌కు ఆర్డినెన్సు జారిచేసే అధికారం వుంటుంది. దీని కాలపరిమితి 6 నెలలు.

**సమీక్ష :**

ఈ చట్టం వలన భారతీయులను అనధికార సభ్యులుగా శాసనసభలో నియమించే అధికారం ఉంటుంది. కాని ఈ అనధికార సభ్యులను గవర్నరు - జనరల్ నియమించటం వలన సరైన సభ్యులు ఎన్నికయ్యే అవకాశం లేదు. ఈ చట్టం వలన వికేంద్రీకరణ తొలగిపోయి రాష్ట్ర శాసన సభల అధికారాలు పునరుద్ధరింపబడ్డాయి. ఒక్కొక్క శాఖను ఒక్కొక్క సభ్యుడికి కేటాయించటం వలన మంత్రివర్గ పద్ధతి ప్రవేశపెట్టబడింది.

## 23.3. 1892 కౌన్సిలు చట్టము :

**ఉపోద్ఘాతం :**

1861 చట్టం భారతీయులకు సంతృప్తి నివ్వలేదు. విద్యావేత్తలు విమర్శించారు. బెంటిక్ కాలంలో ప్రవేశపెట్టిన ఆంగ్లవిద్య ఫలితంగా భారతీయులలో మేధావి వర్గం ఏర్పడింది. వీరిలో జాతీయతాభావం, తలఎత్తి ఆందోళనకు దారితీసింది. ఇండియన్ నేషనల్ కాంగ్రెసు స్థాపన కూడా దీనికి దోహదం చేసింది. వీరందరి ఆందోళన ఫలితంగా 1892 చట్టం చేయబడింది.

**ముఖ్యాంశాలు :**

1) కేంద్ర శాసనసభలో అనధికారుల సంఖ్య 8కి తగ్గకుండా, 20కి మించకుండా వుండాలి. సభ్యులలో 2/5 మందిని గవర్నరు - జనరల్ నియమిస్తాడు. మిగిలినవారిని జిల్లా బోర్డులు, మునిసిపాలిటీలు, వాణిజ్య సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఎన్నుకుంటాయి. పరోక్ష ఎన్నిక విధానం అమలులో వుంటుంది.

2) ఈ చట్టం వలన అనధికార సభ్యులు సభలో పరిపాలనకు సంబంధించిన ప్రశ్నలు అడగవచ్చు. బడ్జెటు గురించి చర్చించవచ్చు. కాని ప్రశ్నలకు ముందుగా అనుమతి పొందాలి.

**విమర్శ :**

కేంద్ర శాసన సభ అధికారాలు పరిమితం. అనధికారులు సంఖ్య కూడా స్వల్పం. సభ్యుల ఎన్నిక పద్ధతి సక్రమంగా లేదు. సభ్యులకు ఉపప్రశ్నలు అడిగే అధికారం లేదు. బడ్జెటు గురించి చర్చ నామమాత్రం. అందువలన ఈ చట్టం వలన భారతీయులకు ఏ మాత్రం లాభం చేకూరలేదు.

**ప్రాధాన్యత :** ఈ చట్టం భారతీయులకు శాసన సభలో ప్రాతినిధ్యం కల్పించింది.

## 23.4. మింటో - మార్లే సంస్కరణలు లేక 1909 శాసన సభా చట్టము :

**ఉపోద్ఘాతం :**

1892 తర్వాత భారతదేశంలో అనేక సంఘటనలు జరిగాయి. కర్జను 1905లో బెంగాలును విభజించాడు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెసు ఆధ్వర్యంలో స్వదేశీ వుద్యమం బెంగాలులో ప్రారంభమయింది. అది త్వరలోనే భారతదేశమంతటా వ్యాపించింది. బ్రిటీషు ప్రభుత్వం ఈ వుద్యమాన్ని అణచటానికి దమన నీతిని ప్రయోగించింది. 1896 - 1900 మధ్య కరువు కాటకం ఏర్పడి ప్లేగువ్యాధికి దారితీయగ, లక్షలాదిజనం మరణించారు. ఆంగ్ల ప్రభుత్వం, సరైన నివారణ చర్యలు తీసుకోలేదు. తిలక్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండించాడు. కాంగ్రెసు అతివాదులు, మితవాదులని రెండుగా చీలింది. భారతీయ ముస్లిం వర్గాలలో కూడా ప్రభుత్వంపట్ల అసంతృప్తి ఏర్పడింది. ఆగాఖాన్ నాయకత్వంలో ముస్లింలు గవర్నరు-జనరల్ మింటోను కల్సి రాజ్యాంగ సంస్కరణలలో తమకు కూడా ప్రాతినిధ్యం కల్పించవలసిందిగా కోరారు.

ఈ చర్యలను గమనించిన ప్రభుత్వ రాజ్యకార్యదర్శి మార్లే గవర్నరు - జనరల్ మింటోతో కల్సి కాంగ్రెసులోని మితవాదులను సంతృప్తిపరచటానికి 1909 చట్టం చేయటం జరిగింది.

**ముఖ్యాంశాలు :**

1) కేంద్ర శాసన సభలను విస్తరించారు. సభ్యుల సంఖ్య 60కు పెంచటం జరిగింది. ఇందులో 28 అధికారులు, 27 అనధికారులు, కాగా, 5గురు సభ్యులను గవర్నరు - జనరల్ నియమిస్తాడు. అనధికారులు, భూస్వాములు, వాణిజ్య మండలులు విశ్వవిద్యాలయ సంఘాల నుండి ఎన్నుకోబడ్తారు.

2) రాష్ట్ర శాసన సభ్యుల సంఖ్య కూడా పెంచబడింది. పెద్ద రాష్ట్రాలలో 50కు చిన్న రాష్ట్రాలలో 30కి పెంచబడింది.

3) శాసన సభా అధికారాలు పెంచబడ్డాయి. సభ్యులకు ప్రజా సమస్యలపై తీర్మానాలు చేసే హక్కు ఇవ్వబడింది. సభ్యులు చర్చల సందర్భముగా పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవదీయవచ్చు. సభ్యులకు ప్రశ్నలు, ఉపప్రశ్నలు అడిగే హక్కు ఇవ్వబడింది. బడ్జెటు గురించి విమర్శించవచ్చు. కాని స్వదేశీ సంస్థానాలు, విదేశీ వ్యవహారాలు ప్రభుత్వాదాయము, సైనిక వ్యవహారాలు మొదలగు అంశాల గురించి చర్చించే హక్కులేదు. అలాగే సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా గవర్నరు - జనరల్ నిరాకరించవచ్చు.

4) గవర్నరు - జనరల్ కార్యనిర్వాహక సంఘంలో మరొక సభ్యుణ్ణి నియమించారు. భారతరాజ్య కార్యదర్శికి సలహాఇచ్చే ఇండియన్ కౌన్సిల్‌కు ఇద్దరు భారతీయులను నియమించటం జరిగింది.

5) ముస్లిం ఓటర్లకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయబడినవి. ఈ నియోజక వర్గాల నుండి ముస్లిం సభ్యులు మాత్రమే ఎన్నుకోబడ్డారు.

**లోపాలు :**

ఈ చట్టం భారతీయులకు ఏమాత్రం బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఇవ్వలేదు. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు ఏర్పాటు చేయటంవలన భవిష్యత్తులో శిక్కులకు, క్రైస్తవులకు కూడా ఏర్పాటు చేయవలసి వచ్చింది. ఇదే దేశవిభజనకు దారితీసింది. శాసన సభల అధికారాలు పెంచినా అవి నామమాత్రమే. సభ్యుల ప్రశ్నలకు గవర్నరు - జనరల్ సమాధానాలు ఇవ్వకుండా నిరాకరించవచ్చు. ఆర్థిక సంబంధమైన అంశాలను చర్చించే అధికారం సభ్యులకు లేదు. ఎన్నిక విధానంలో అనేక లోపాలున్నాయి.

గోఖలే ఈ సంస్కరణలు భారతదేశానికి వుపయోగపడవనగా, తిలక్ శాసన సభలు కేవలం చర్చా వేదికలని విమర్శించాడు.

**ప్రాధాన్యత :**

మింటో మార్లే సంస్కరణలు ప్రాతినిధ్య పద్ధతిని ప్రవేశపెట్టటం ద్వారా పార్లమెంటరీ ప్రభుత్వ స్థాపనకు దారితీశాయి. సభ్యులకు హక్కులు లేకున్నా ప్రభుత్వ లోపాలను బహిర్గతపరచవచ్చు. అందువలన ఈ చట్టం బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనకు తొలిమెట్టు అని చెప్పవచ్చు.

## 23.5. మాంటేగ్ - ఛమ్స్‌ఫర్డ్ సంస్కరణలు లేక 1919 చట్టము :

**ఉపోద్ఘాతం :**

1909 సంస్కరణలు కాంగ్రెసులోని మితవాదులను కూడా సంతృప్తిపరచలేదు. భారతీయుల కోర్కె అయిన భాధ్యతాయుత పరిపాలనకు ఈ చట్టంలో ఎటువంటి అవకాశం లేదు. ముస్లింలను కూడా చట్టం తృప్తిపరచలేదు. ఈ కారణాల వలన సర్వత్రా ఈ చట్టం పట్ల వ్యతిరేకత ఎదురైంది.

ఈ దశలోనే 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. ఈ యుద్ధంలో బ్రిటన్ కూడా ప్రముఖపాత్ర వహించినది. తమకు సహకరించవల్సిందిగా ఆంగ్లేయులు కోరారు. ఈ యుద్ధంలో సహాయపడినట్లయితే స్వపరిపాలనావకాశం కల్గుతుందని భారతీయులు ఆశించారు. కాని యుద్ధం ముగిసాక దేశ ఆర్థికపరిస్థితి క్షీణించింది. ధరలు విపరీతంగా పెరిగాయి. తిలక్, ఆనిబిసెంటు కలసి 'హోంరూల్' వుద్యమాన్ని ప్రారంభించారు. ముస్లింలు కూడా మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీపట్ల బ్రిటన్ ప్రవర్తించిన విధానం వలన అసంతృప్తులై ఖిలాఫత్ వుద్యమాన్ని ప్రారంభించారు. దీనికి కాంగ్రెసు కూడా చేయూతనిచ్చింది.

ఈ పరిస్థితులలో సంస్కరణల ఆవశ్యకతను ఆంగ్ల ప్రభుత్వం గుర్తించింది. ఆగస్టు 20, 1917న భారతరాజ్య కార్యదర్శి మాంటేగ్ బ్రిటీషు పార్లమెంటులో ఒక ప్రకటన చేస్తూ, భారతీయులను అన్ని పాలనా శాఖలలో చేర్చుకోవటం జరుగుతుందని, తర్వాత క్రమంగా స్వపరిపాలనావకాశం కల్పించబడుతుందని తెలిపాడు. మాంటేగ్ 1917 నవంబరులో ఇండియావచ్చి ప్రజాభిప్రాయాన్ని తెలిసికోవటం కోసం అన్ని ప్రాంతాలను సందర్శించాడు. 1918లో వైశ్రాయి ఛమ్స్‌ఫర్డ్‌తో కలసి ఒక నివేదికను తయారుచేశాడు. జూన్ 2, 1919లో దీనిని పార్లమెంటు ముందుంచాడు. జూన్ 5న రెండవ రీడింగులో చారిత్రాత్మక ఉపన్యాసంలో సంస్కరణల ప్రాధాన్యతను వివరించాడు. తర్వాత డిసెంబరు 23, 1919లో ఆ బిల్లు చట్టరూపం పొందింది.

**ముఖ్యాంశాలు :**

1) భారతరాజ్య కార్యదర్శి అధికారాలు కొన్ని గవర్నరు - జనరల్‌కు బదిలీ చేయబడ్డాయి. రాజ్యకార్యదర్శి, ఇండియా కౌన్సిలు సభ్యుల జీతభత్యాలు ఆంగ్లప్రభుత్వమే భరిస్తుంది. ఇంగ్లాండులో భారతీయ వ్యవహారాల పర్యవేక్షణ నిమిత్తం ఒక హైకమీషనర్ని నియమించటం జరిగింది. అతని పదవీకాలం 6 సంవత్సరములు. జీతభత్యాలు భారత ఖజానా నుండి చెల్లించబడతాయి.

2) కేంద్రంలో ద్వంద్వ శాసన సభా విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎ) ఎగువసభ - కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ లేక రాజ్యసభ బి) దిగువసభ - లెజిస్లేటివ్ అసెంబ్లీ.

**ఎ) ఎగువసభ :** సభ్యులసంఖ్య 60. ఇందులో 33 సభ్యులు ఎన్నుకోబడగా మిగిలిన 27 మందిని గవర్నరు - జనరల్ నియమిస్తాడు.

**బి) దిగువసభ :** ఇందులో 145 మంది సభ్యులుంటారు. వీరిలో 103 మంది ఎన్నుకోబడగా, 42 సభ్యులను గవర్నరు - జనరల్ నియమిస్తాడు. ఈ 42లో 25మంది అధికారులు, 17మంది అనధికారులు. ఎన్నుకోబడిన 103లో 51 సాధారణ నియోజక వర్గాలనుండి, 32 మంది మత నియోజకవర్గాల నుండి ఎన్నికౌతారు.

3) సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ కాలపరిమితి 3 సంవత్సరములు. ఎగువసభ కాలపరిమితి 5 సంవత్సరములు. కాని గవర్నరు - జనరల్‌కు ఏసభనైనా రద్దుచేసే అధికారం వుంది. సభ కాలపరిమితిని తగ్గించటానికి, పెంచటానికి కూడా అధికారం కలిగివుంటాడు. మొదట స్పీకరును గవర్నరు - జనరల్ నియమించగా, ఆ తర్వాత స్పీకరు పదవి కూడా ఎన్నిక ద్వారా నిర్ణయించబడింది.

4) రెండు సభలకు ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే సభ్యులు ఎన్నికౌతారు. కాని ఓటుహక్కు మాత్రం పరిమితం చేయబడింది. ఎగువసభకు 10,000 నుండి 20,000 వరకు ఆదాయం వచ్చేవారికి, 750 నుండి 5000 వరకు వ్యవసాయ ఆదాయంవున్నవారికి, ప్రజాసేవలో పాల్గొన్నవారికి విద్యావేత్తలకు ఓటుహక్కు ఇవ్వబడింది. దిగువసభకు, 15 నుండి 20 రూపాయల మునిసిపల్ పన్నుకట్టేవాళ్లకు, స్వంత ఇల్లు కలిగివున్న వారికి 2000 నుండి 5000 వరకు ఆదాయం పన్ను చెల్లించేవారికి మాత్రమే ఓటు హక్కు ఇవ్వబడింది.

5) కేంద్ర శాసనసభాధికారాలు పెరిగాయి. శాసనసభ భారతదేశమంతటికీ సంబంధించిన శాసనాలు చేయవచ్చు. బిల్లులను క్లాజువారీగా చర్చించవచ్చు. సవరణలు ప్రతిపాదించవచ్చు. వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టవచ్చు. సభ్యులు ప్రశ్నలతోపాటు ఉప ప్రశ్నలుకూడా అడగవచ్చు. కాని బడ్జెటులో ముఖ్యమైన అంశాలను చర్చించేహక్కు సభ్యులకు లేదు. సభలను సమావేశపరచుట, వాయిదా వేయుట, రద్దుచేయుట గవర్నరు - జనరల్ ఇష్టానుసారం జరుగును.

6) రాష్ట్ర శాసన సభలను విస్తృతపరిచారు. 70% సభ్యులు ఎన్నుకోబడగా 30% సభ్యులు నియమించబడ్డారు. పదవీకాలం 3 సంవత్సరములు. కాని అవసరమైతే గవర్నరుకు రద్దుచేసే అధికారం కలదు.

### 7) ద్వంద్వ పరిపాలన :

అన్నిటికంటే ముఖ్యమైనది రాష్ట్రాలలో ద్వంద్వ పరిపాలనను ప్రవేశపెట్టటం. ప్రభుత్వ శాఖలు రెండుగా విభజించటం జరిగింది. అవి 1) రిజర్వుడ్ శాఖలు 2) ట్రాన్స్‌ఫర్డ్ శాఖలు. రిజర్వుడు శాఖలనగా గవర్నరు కార్యనిర్వాహకవర్గ సభ్యులు నిర్వహించే శాఖలు. న్యాయం, పోలీసు, వ్యవసాయం, కాలువలు, విద్యుచ్ఛక్తి, భూమిశిస్తు మొదలైన ముఖ్యమైన శాఖలు. ట్రాన్స్‌ఫర్డ్ శాఖలనగా, శాసనసభ నుండి ఎన్నికైన సభ్యులు నిర్వహించే శాఖలు. స్థానిక పరిపాలన, కార్పొరేషనులు, జిల్లా బోర్డులు, ఆరోగ్యం, వైద్యం, రోడ్లు, మొదలైన శాఖలు. రాష్ట్రాలలో ద్వంద్వ పరిపాలన 1921 నుండి 31 వరకు అమలు జరుపబడింది.

8) 1919 చట్టం ప్రకారం పరిపాలనా శాఖలను రెండుగా విభజించారు. 1) కేంద్ర ప్రభుత్వాధీన శాఖలు 2) రాష్ట్ర ప్రభుత్వాధీన శాఖలు. ప్రధానమైన, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, రక్షణ, దేశీయ వ్యవహారాలు, తంతీతపాల, రైల్వేలు, మొదలైనవి కేంద్ర ప్రభుత్వాధీనశాఖలుగాను, న్యాయం, విద్య, స్థానిక సంస్థలు, భూమిశిస్తు మొదలైనవి రాష్ట్రప్రభుత్వాధీన శాఖలుగాను విభజించారు.

### 9) లోపాలు :

ద్వంద్వ ప్రభుత్వంలో అనేక లోపాలున్నాయి. భారతీయులకు ట్రాన్స్‌ఫర్డ్ శాఖలనివ్వటం జరిగింది. కాని వారికి ఎటువంటి అధికారాలు లేవు. వారు ఒకవైపు గవర్నరు జనరల్‌కు బాధ్యులు, మరొకవైపు శాసనసభకు బాధ్యత వహించాలి. అధికారాలు అన్ని

రిజర్వుడు శాఖాధిపతుల చేతిలో వుండేవి. ప్రధాన నిర్ణయాలన్నీ వీరే తీసుకునేవారు. ముఖ్యంగా ఇద్దరి మధ్య సహకారం లేదు. ఇది కేవలం బాధ్యత వహించే ప్రభుత్వమేకాని బాధ్యతాయుత ప్రభుత్వంకాదని విమర్శవుంది.

### ప్రాధాన్యత :

ఈ చట్టం వలన బాధ్యతాయుత పరిపాలనకు అంకురార్పణ ఏర్పడింది. ప్రొఫెసర్ శ్రీనివాసన్ ప్రాతినిధ్య పద్ధతి ఏర్పాటుతో భారతదేశంలో నూతనశకం ప్రారంభమైందని చెప్పారు.

## 23.6. 1935 చట్టము :

### ఉపోద్ఘాతం :

1919 చట్టం పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని స్థాపించలేదు. అందువలన కాంగ్రెసు తిరిగి స్వయంపాలనకు ఆందోళన ఉధృతం చేసింది. ఆంగ్ల ప్రభుత్వం 1919 చట్టం పనితీరును పరిశీలించుటకు సైమను కమీషను భారతదేశానికి పంపింది. ఈ కమీషనులో సభ్యులంతా ఆంగ్లేయులు. అందువలన దీనిని భారతీయులు బహిష్కరించారు. 1930లో సైమను కమీషను తమ రిపోర్టులో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేయవలసిందిగా సూచించింది. ఈ లోపల జలియన్‌వాలాబాగ్‌లో అమానుషంగా ప్రజలను కాల్చి చంపటం జరిగింది. గాంధీజీ సహాయనిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు. పరిస్థితి తీవ్రతను గమనించిన ఆంగ్ల ప్రభుత్వం రౌండు టేబిలు సమావేశాలనేర్పాటు చేసింది. మూడవ రౌండు టేబిలు సమావేశంలో భారతీయ ప్రజల హక్కులు తీర్చటం కోసం చట్టం చేయవలెనని నిర్ణయించారు. లిన్‌లిట్ గో ఆధ్వర్యంలో ఒక పార్లమెంటరీ కమిటీని నియమింపగా, ఆ కమిటీ తీర్పు ఆధారంగా 1935 చట్టం చేయబడింది.

### ముఖ్యాంశాలు :

1) సమాఖ్య ప్రభుత్వ ఏర్పాటు
2) కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వ స్థాపన
3) రాష్ట్రాల స్వతంత్రం

**1) సమాఖ్య ప్రభుత్వ ఏర్పాటు :** భారతదేశంలో మొదటి సారిగా సమాఖ్య ప్రభుత్వ మేర్పడింది. బ్రిటీషు రాష్ట్రాలు, స్వదేశీ సంస్థానాలు కల్సి సమాఖ్యగా ఏర్పడ్డాయి. ఈ ప్రభుత్వానికి, సమాఖ్యకు కావల్సిన, వ్రాత పూర్వక రాజ్యాంగము, అధికార విభజన, ఉన్నతన్యాయస్థానము, అన్ని వున్నాయి.

**ఎ) వ్రాతపూర్వక రాజ్యాంగము :** 1935 చట్టము రాజ్యాంగంగా అమలుజరుపబడింది.

**బి) అధికార విభజన :** కేంద్ర ప్రభుత్వాధికారాలను మూడు జాబితాలుగా విభజించారు.

1) కేంద్ర జాబితా 2) రాష్ట్ర జాబితా 3) ఉమ్మడి జాబితా

కేంద్ర జాబితాలో 59 శాఖలు, న్యాయ, రక్షణ, ఆర్థిక, ఆంతరంగిక మొదలైనవి ఉన్నాయి. రాష్ట్రజాబితాలో 54 శాఖలున్నాయి. అందులో ముఖ్యమైనవి, రహదారులు, విద్య, వైద్యం, ఆరోగ్యం, నీటిపారుదల మొదలగునవి. ఉమ్మడి జాబితాలో 36 అంశాలున్నాయి. ఉమ్మడి జాబితాపై రెండు ప్రభుత్వాలకు అధికారంవుంటుంది.

### సి) ఉన్నత న్యాయస్థానం :

1935 చట్టం ప్రకారం ఒక వున్నత న్యాయస్థాన మేర్పాటు చేయబడింది. ఇందులో ఒక ప్రధాన న్యాయాధిపతి 6 గురు ఇతర

న్యాయాధికారులు వుంటారు. ఇందులో రాజ్యాంగ సంబంధమైన కేసులను, క్రింది కోర్టులనుండి వచ్చిన కేసులను విచారిస్తారు. ఇంకా కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య, రాష్ట్రాల మధ్య వచ్చిన విభేదాలను పరిష్కరిస్తుంది.

**2) కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వ స్థాపన :**

మొదటిసారిగా కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం పరిపాలనా శాఖలను, రిజర్వుడు శాఖలని, ట్రాన్స్‌ఫర్డ్ శాఖలని విభజించటం జరిగింది. రిజర్వుడు శాఖలు గవర్నరు జనరల్ కార్యనిర్వాహకవర్గ సభ్యుల ఆధీనంలో వుంచబడ్డాయి. ఇవి, విదేశీ, ఆర్థిక, ఆంతరంగిక మొదలైన శాఖలు. ఈ మంత్రులు శాసన సభకు గవర్నరు జనరలుకు బాధ్యులు. ట్రాన్సుఫర్డ్ శాఖలను గవర్నరు జనరల్ మంత్రిమండలి సహాయంతో నిర్వహిస్తాడు. ఈ మంత్రులు శాసన సభకు ఎన్నికైన భారతీయులు. వీరు గవర్నరు జనరల్‌కు శాసన సభకు కూడా బాధ్యత వహించవలెను.

**శాసనసభ :** సమాఖ్య ప్రభుత్వంలో రెండు శాసన సభలను ఏర్పాటుచేశారు. 1) ఎగువసభ లేక రాజ్యసభ 2) దిగువసభ.

**ఎగువసభ :** ఇందులో 260 మంది సభ్యులుంటారు. 150 మంది బ్రిటీషు ఇండియానుండి ఎన్నుకోబడగా, 104 గురు స్వదేశీ సంస్థానాలనుండి నియమించబడ్డారు. మిగిలిన 6గురిని గవర్నరు జనరల్ నియమిస్తాడు.

**దిగువసభ :** ఇందులో 375 మంది సభ్యులుంటారు. 250 మంది బ్రిటీషు రాష్ట్రాలనుంచి పరోక్షంగా ఎన్నుకోబడగా, 125 మంది స్వదేశీ సంస్థానాలనుండి నియమించబడ్డారు.

**అధికారాలు :**

రెండు సభలు సమానాధికారాలు కలిగి వుంటాయి. కాని ఆర్థిక బిల్లులు మాత్రం దిగువ సభలో ప్రవేశపెట్టాలి. బడ్జెటులో 15% మాత్రమే ఓటింగుకు పెట్టవచ్చు. ఏ బిల్లునైనా వీటోచేసే అధికారం గవర్నరు జనరల్‌కుంది. సభ సమావేశంలో లేనప్పుడు గవర్నరు జనరల్ ఆర్డినెన్సులు జారీచేయవచ్చు. వీటి కాలపరిమితి 6 నెలలు.

**3) రాష్ట్రాల స్వతంత్రం :** 1935 చట్టం ప్రకారం రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వం రద్దుచేయబడింది. రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వబడింది. మంత్రులకు పరిపాలనలో కొన్ని అధికారాలివ్వబడ్డాయి. గవర్నరు మెజారిటీ పార్టీ నాయకుణ్ణి ముఖ్యమంత్రిగా నియమిస్తాడు. అతని సలహాపై మిగిలిన మంత్రులను నియమిస్తాడు. శాసనసభ విశ్వాసం కోల్పోతే మంత్రిమండలి రాజీనామా చేయాలి.

**రాష్ట్ర శాసన సభలు :** పెద్ద రాష్ట్రాలలో రెండు సభలు చిన్న రాష్ట్రాలలో ఏకసభను ఏర్పాటుచేసారు. ఈ చట్టం ప్రకారం ఇండియా కౌన్సిలును రద్దుచేయటం జరిగింది.

**ప్రాధాన్యత :** మొదటిసారిగా రాష్ట్రాలకు స్వతంత్రం ఇవ్వటం జరిగింది. కేంద్రంలో సమాఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

## 23.7. భారత స్వతంత్ర చట్టము - 1947 :

**ఉపోద్ఘాతం :**

భారత ప్రజల స్వాతంత్ర్యేగుర్తించి ప్రభుత్వాధికారం బదిలీచేయుటకు అట్లీ అధ్యక్షతనగల లేబరు ప్రభుత్వం నిశ్చయించింది. మౌంటు బాటన్ ప్రణాళిక ప్రకారం ఇండియాను 1) ఇండియన్ యూనియన్ 2) పాకిస్తాన్ అని రెండుగా విభజించుటకు అంగీకరించటం జరిగింది. 3 జూన్, 1947న బిల్లును బ్రిటీషు పార్లమెంటులో ప్రవేశపెట్టారు. 18 జూన్‌న బిల్లు చట్టరూపం పొందింది.

**ప్రధానాంశాలు :**

1) 15 ఆగస్టు 1947 నుండి ఇండియా, పాకిస్తాన్ అను రెండు దేశములు పూర్తి సార్వభౌమాధికారంతో ఏర్పాటు చేయబడ్డాయి.
2) రెండు దేశాలకు గవర్నరు జనరల్ నియమించబడ్డాడు.
3) స్వదేశీ సంస్థానాలపై కూడా బ్రిటీషు అధికారం రద్దయి, వారి ఇష్టప్రకారం, ఇండియాలోకాని పాకిస్థాన్‌లోకాని చేరవచ్చు.
4) రెండు దేశాలకు రాజ్యాంగపరిషత్తులు ఏర్పాటు చేయబడ్డాయి.
5) కొత్త రాజ్యాంగం ఏర్పరచుకొనేవరకు తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడుతుంది. ఆ ప్రభుత్వం 1935 చట్ట ప్రకారం పనిచేస్తుంది.
6) ఈ చట్టం ప్రకారం బ్రిటీషు రాజుకున్న 'భారతచక్రవర్తి' అనే బిరుదు రద్దవుతుంది.
7) సెక్రటరీ ఆఫ్ స్టేట్ పదవి రద్దవుతుంది.
8) బ్రిటీషు కామన్వెల్తులో చేరే విషయంలో రెండు దేశాలకు పూర్తి స్వేచ్ఛవుంటుంది.

## 23.8. ఉపసంహారం :

భారతదేశ పరిపాలన నిమిత్తం, బ్రిటీషు ప్రభుత్వం చేసిన చట్టాలను వివరించటం జరిగింది. ఈ చట్టాల ఏర్పాటుకు దారి తీసిన పరిస్థితులు చట్టాల ప్రాధాన్యత కూడా వివరించబడింది. ఈ చట్టములే భారతదేశ రాజ్యాంగాభివృద్ధికి దోహదం చేశాయి. భారతదేశంలో నూతన రాజ్యాంగ రచనకు ఈ చట్టాలే ముఖ్యాధారాలయినాయి.

**మాదిరి ప్రశ్నలు :**

1) 1935 చట్టములోని ముఖ్యాంశములను వివరింపుము.
2) 1919 చట్టము యొక్క గుణ దోషములను చర్చించుము.
3) మింటో మార్లే సంస్కరణలను పేర్కొనుము.
4) 1892 శాసన సభా చట్టమందలి ముఖ్యాంశములను తెల్పుము.
5) 1858 చట్టములోని ప్రధానాంశముల ప్రాముఖ్యతను వివరింపుము.
6) 1919 చట్టం ప్రకారం రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వ పనితీరును వివరింపుము.
7) 1935 చట్టంలోని రాష్ట్రాల స్వయంపాలనను వివరింపుము.
8) 1935 చట్టం ప్రకారం ఏర్పడిన సమాఖ్య ప్రభుత్వాన్ని గురించి వివరింపుము.
9) 1909 చట్టం చేయటానికి దారి తీసిన పరిస్థితులు వివరింపుము.

**చదువదగిన గ్రంథములు :**


1) రాజ్యాంగ చరిత్ర - V.D. మహజన్
2) భారతదేశ రాజ్యాంగ చరిత్ర - పున్నయ్య
3) భారత రాజ్యాంగ చరిత్ర - కీట్
4) ఆచరణలో ద్వంద్వ ప్రభుత్వం - అప్పాదురై
5) భారతదేశ చరిత్ర సంస్కృతి Vol III- హనుమంతరావు, బసవేశ్వరరావు
6) భారతదేశ చరిత్ర - సంస్కృతి - తెలుగు అకాడమీ


రచయిత : **ప్రమీల గోగినేని**

పాఠం - 24

# ఆంగ్లేయులు - సరిహద్దు సమస్యలు (క్రీ.శ. 1858 తర్వాత)

విషయసూచిక


24.0 లక్ష్యం

24.1. ఉపోద్ఘాతము

24.2. రెండవ ఆఫ్ఘన్ యుద్ధము

24.2.1. కుశలస్తబ్ద విధానము

24.2.2. షేర్ ఆలీ

24.2.3. గాండ్‌మాక్ సంధి

24.2.4. రిప్పన్ విధానము

24.2.5. ఫలితాలు

24.3. రెండవ ఆఫ్ఘన్ యుద్ధానంతర పరిస్థితులు

24.4. మూడవ ఆఫ్ఘన్ యుద్ధము

24.4.1. ఫలితాలు

24.5. మూడవ బర్మా యుద్ధము

24.5.1. మిండాన్

24.5.2. ధీబా

24.5.3. యుద్ధము

24.5.4. ఫలితాలు

24.6. సిక్కిం

24.7. భూటాన్

24.8. టిబెట్

24.9. వాయువ్య సరిహద్దు ప్రాంతాలు

24.9.1. లారెన్స్ విధానము

24.9.2. లిట్టన్ విధానము

24.9.3. డురాండ్ రేఖ

24.9.4. కర్జన్ విధానము

24.9.5. వాయువ్య సరిహద్దు రాష్ట్రము

24.10. ముగింపు

## 24.0. లక్ష్యం :

భారతదేశములో తమ సామ్రాజ్యమును స్థాపించిన ఆంగ్లేయులు తమ సామ్రాజ్య రక్షణ కొరకు మనదేశ సరిహద్దులోనున్న ఆఫ్ఘనిస్థాన్, బర్మా, సిక్కిమ్, భూటాన్, టిబెట్ వాయువ్య సరిహద్దు ప్రాంతములను తమ ఆధీనములోనికి తెచ్చుటకు చేసిన ప్రయత్నాలను వివరించుట ఈ పాఠం యొక్క ధ్యేయం. (1858 తర్వాత)

## 24.1. ఉపోద్ఘాతము :

క్రీ.శ. 1857లో సిపాయిల తిరుగుబాటు అనంతరము భారతదేశ రాజ్యాంగ విధానాలలో మార్పులు వచ్చినట్లే, బ్రిటీష్ ఇండియా విదేశాంగ విధానంలో కూడ మార్పు వచ్చింది. అప్పటికి ఇంచుమించు భారతదేశమంతా బ్రిటీష్ సామ్రాజ్య పరిధి క్రిందకు వచ్చింది. అనంతరము వారి చూపు మన సరిహద్దుల కవతల ఉన్న సరిహద్దు రాజ్యాలపై పడింది. మన సరిహద్దులకవతల ఉన్న రాజ్యాలలో ఆఫ్ఘనిస్థాన్, బర్మా, సిక్కిమ్, భూటాన్, టిబెట్లు ముఖ్యమైనవి. అప్పటికే బర్మా, ఆఫ్ఘనిస్థాన్లతో యుద్ధాలు చేసిన ఆంగ్లేయులు ఆ ప్రాంతాలన్నీ ఆక్రమించి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని విస్తరింపజేయాలనుకున్నారు. ఈ సరిహద్దు రాజ్యాలవారు అంతః కలహాలతో బలహీనంగ ఉండటంతో వారిని జయించుట సులభమని తోచింది. అంతేకాక భారతదేశమంతా ఇప్పుడు బ్రిటీష్ వారికి స్వాధీనమై ఉండుటతో ఈ పెద్దదేశం యొక్క వనరులు, అంగ, అర్ధబలగాలు వారిచేతిలో ఉండుటతో ఈ సరిహద్దు దేశాలపై తమ ఆధిపత్యం సులభంగా నెరపగలిగారు. ముఖ్యంగా మన పొరుగునున్న సరిహద్దు దేశాలనుండి గాని, ఇతర ఐరోపా దేశాల నుండి కాని మన దేశంలోని బ్రిటీష్ సామ్రాజ్యానికి ఎటువంటి ప్రమాదము రాకుండ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయుట బ్రిటీష్ వారి సరిహద్దు విధాన లక్ష్యం.

## 24.2. రెండో ఆఫ్ఘన్ యుద్ధము (1878 - 80) :

మొదటి ఆఫ్ఘన్ యుద్ధం వల్ల ఆంగ్లేయులకు లాభమేమి కలుగలేదు. పైగా చాల ధనవ్యయం జరిగింది. చివరకు దోస్త్ మహమ్మద్ ఆఫ్ఘన్ రాజై, ఆంగ్లేయులతో స్నేహంగ ఉన్నారు. తర్వాత ఇంగ్లీషువారు పంజాబు, సింధు ప్రాంతాలను జయించుటతో వారి సరిహద్దులు ఆఫ్ఘనిస్థాన్ను తాకినవి. అయితే మొదటి ఆఫ్ఘన్ యుద్ధ అనుభవాన్ని బట్టి వారు ఆఫ్ఘన్ వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ఆఫ్ఘన్ అమీర్ అయిన దోస్త్ మహమ్మద్ కూడ బ్రిటీష్ ఇండియన్ ప్రభుత్వంతో సంధి చేసుకొని వారితో స్నేహంగా మెలగేవాడు. కాని అప్పటికే మధ్య ఆసియా ప్రాంతాన్నంతా కబళించిన రష్యా ఆఫ్ఘనిస్థాన్ కూడ ఆక్రమించుతుందేమో అనే భయం వారికుండేది.

### 24.2.1. కుశల స్తబ్ధ విధానము :

1863లో దోస్త్ మహమ్మద్ మరణంతో ఆఫ్ఘనిస్థాన్ అంతర్యుద్ధంలో మునిగిపోయింది. అతడి 16 మంది కొడుకులు సింహాసనం కోసం పోటీపడి, ఇంగ్లీషు వారి సహాయం కోసం అభ్యర్థించారు. అప్పటి వైస్రాయి సర్జాన్ లారెన్స్ వారిలో ఎవరికీ సహాయం చేయడానికి అంగీకరించలేదు. ఏ ఒక్కరిని బలపర్చినా మిగతావారిని రష్యా ప్రాబల్యంలోకి గెంటివేయడమవుతుందని అతడు భావించాడు. కాబట్టి తాము ప్రత్యక్షంగా ఆఫ్ఘన్ వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండా, వారసత్వ యుద్ధంలో ఎవరు గెలిచి అధికారంలోకి వస్తే అతడితోనే ఆంగ్లేయులు మైత్రిచేసి బలపరుద్దామని భావించారు. ఈ విధానాన్నే కుశల స్తబ్ధత విధానము అంటారు. ఈ విధానం వల్ల రష్యావారిని ఆఫ్ఘనిస్థాన్కు దూరంగా ఉంచడం జరుగుతుంది. ఇదే విధానాన్ని లార్డ్మేమో, లార్డ్ నార్ బ్రాక్ కూడా అనుసరించారు.

### 24.2.2. షేర్ ఆలీ :

ఆఫ్ఘన్ అంతర్యుద్ధంలో చివరకు షేర్ ఆలీ గెలిచి రాజైనాడు. బ్రిటీష్ వారి సహాయం ఆశించకుండా వారితో స్నేహసంబంధాలు కొనసాగిస్తూ అతడు ఒక పక్క తన స్వదేశ శత్రువులను, వేరొక పక్క రష్యన్ సామ్రాజ్య విస్తరణను ప్రతిఘటించవలసి వచ్చింది. రష్యా 1866లో బుఖారాను ఆక్రమించి రష్యన్ టర్కీస్థాన్ అనే రాష్ట్రాన్ని ఏర్పరచింది. అనంతరం సమర్ఖండ్, కివాలను కూడా స్వాధీనపరుచుకుంది. దీనితో ఆఫ్ఘన్ రాజు భయపడి గవర్నర్ జనరల్ మేయో ప్రభువుతో సంప్రదించాడు. రష్యాకు వ్యతిరేకంగా తనకు సాయపడవలెనని, తన వంశస్థులను రాజవంశంగా గుర్తించవలెననే అతని కోర్కెలను ఇంగ్లీషువారు తేలికగా తీసుకున్నారు. అనంతరం రష్యా ఖివాను ఆక్రమించినప్పుడు మరి రెండుసార్లు షేర్ ఆలీ ఇంగ్లీషు వారి సహాయం అభ్యర్థించిననూ, వారు ఎట్టి సహాయం చేయలేదు. మరొకసారి పర్షియాకు, ఆఫ్ఘనిస్తానుకు మధ్య తలెత్తిన సరిహద్దు వివాదంలో పర్షియాకు అనుకూలంగా ఆంగ్లేయులు తీర్పునిచ్చారు. దాంతో షేర్ ఆలీ తనకు అవసరమైనప్పుడు ఇంగ్లీషువారు సహాయం చేయరని భావించి రష్యాతో స్నేహ సంబంధాలు పెంపొందించుకోవటానికి పూనుకున్నాడు. కడకు 1833లో రష్యాకు షేర్ ఆలీకు మధ్య సంధి జరిగినది.

1874లో ఇంగ్లండ్‌లో టోరీపార్టీ అధికారంలోకి వచ్చింది. వీరు ఆఫ్ఘనిస్థాన్‌ను ఎట్టి పరిస్థితులలోనూ బ్రిటీష్ ప్రాబల్యం నుండి దాటిపోనివ్వరాదని నిర్ణయించి, ఆవిధంగా చూడమని వైస్రాయ్ లిట్టన్‌కు ఆదేశాలిచ్చారు. లిట్టన్ రష్యాతో తెగతెంపులు చేసుకొని, బ్రిటీష్ వారితో స్నేహ సంబంధాలు పునరుద్ధరించమని, బ్రిటీష్ రాయబారి కార్యాలయాన్ని కాబూల్‌లో నెలకొల్పటానికి అంగీకరించమని షేర్ ఆలీని కోరాడు. దానికి షేర్ ఆలీ సమ్మతించలేదు. పైగా లిట్టన్ కైబర్ కనుమ గుండా పంపిన దూతలను ఆఫ్ఘన్‌లు అటకాయించారు. దాంతో లిట్టన్ 1878 నవంబర్‌లో ఆఫ్ఘనిస్థాన్ పైకి బ్రిటీష్ సైన్యాన్ని పంపాడు.

బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా రష్యా తనకు సహాయ పడగలదన్న షేర్ ఆలీ అంచనా తప్పింది. ఆ సమయంలో యూరప్‌లో బెర్లిన్ సంధి జరిగి బ్రిటన్, రష్యా స్నేహంగా ఉండవలెనని నిశ్చయించుకున్నాయి. అందువల్ల రష్యా ఆఫ్ఘన్‌లకు తోడ్పడక పోగా రష్యా గవర్నర్ జనరల్ కాఫ్‌మన్ ఇంగ్లీషువారితో సంధి చేసుకొనవలసిందిగా షేర్ ఆలీకి సలహా ఇచ్చాడు. షేర్ ఆలీ ఇంగ్లీషువారితో యుద్ధానికే సిద్ధపడ్డాడు. ఈ విధంగా రెండవ ఆఫ్ఘన్ యుద్ధం ఆరంభమైనది.

### 24.2.3. గాండ్‌మాక్ సంధి :

బ్రిటీష్ సైన్యాలు సులభంగా ఆఫ్ఘనిస్థాన్‌ను ఆక్రమించినాయి. జనరల్ స్టువర్ట్ సైన్యం కాందహార్ ను ఆక్రమించింది. షేర్ ఆలీ కాబూల్ నుండి రష్యన్ తుర్కిస్థాన్‌కు పారిపోయి అక్కడే కొద్దికాలంలో మరణించాడు. అతని కుమారుడైన యాకూబ్‌ఖాన్ తానే అమీర్‌నని ప్రకటించుకుని బ్రిటీష్ వారితో సంప్రదింపులు జరిపి, 1879 మే 26 న గాండ్‌మాక్ వద్ద సంధి చేసుకున్నాడు. దాని ప్రకారం

1) కాబూల్‌లో బ్రిటీష్ రాయబారిని అనుమతించుటకు
2) విదేశ వ్యవహారాలలో ఇంగ్లీష్ వారి సలహా పాటించుటకు ఆమోదించాడు.
3) ఆంగ్లేయులు యాకూబ్‌కు ప్రతి సంవత్సరం 6 లక్షల రూపాయలు ఇచ్చుటకు
4) విదేశ దాడుల నుండి ఆఫ్ఘనిస్థాన్‌ను రక్షించుటకు బ్రిటీష్ వారు అంగీకరించారు.

వెంటనే ఇంగ్లీషు రాయబారి కాబూల్ వెళ్ళాడు. రిట్టన్ తన లక్ష్యం సాధించుకున్నందుకు తృప్తి చెందాడు. కానీ అది భ్రాంతిగానే మిగిలింది. స్వాతంత్ర్య ప్రియులైన ఆఫ్ఘన్‌లు 1879 సెప్టెంబర్‌లో తిరుగుబాటు చేసి ఆంగ్లరాయబారిని, అతని అనుచరులందరినీ చంపి కాబూల్‌ను ఆక్రమించారు. ఈ తిరుగుబాటును అణచుటకు వెళ్ళిన బ్రిటీష్ సైన్యాలు అతి కష్టం మీద కాబూల్‌ను తిరిగి స్వాధీనపరుచుకున్నారు. అక్టోబర్ 2న యాకూబ్ ఖాన్‌ను భారతదేశానికి ఖైదీగా పంపారు. రాజులేని ఆఫ్ఘనిస్థాన్ పరిస్థితి అల్లకల్లోలమైనది. ఈ స్థితిలో ఇంగ్లండ్‌లో లిట్టన్ స్థానంలో రిప్పన్‌ను వైస్రాయ్‌ని పంపినది.

### 24.2.4. రిప్పన్ విధానము :

రిప్పన్ ఆఫ్ఘన్ సమస్యను పరిష్కరించగలిగాడు. షేర్ ఆలీ సోదరుని కుమారుడైన అబ్దుల్ రహమాన్‌ను అమీర్‌గా గుర్తించి అతడు తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవటానికి తోడ్పడ్డాడు. సాలుకు 12 లక్షల రూపాయలు సహకార ధనంగా ఇచ్చుటకు నిర్ణయమైనది. బ్రిటీష్ సైన్యాలను ఆఫ్ఘనిస్థాన్ నుండి ఉపసంహరించినాడు. కాబూల్‌లో బ్రిటీష్ రాయబారి ఉండవలెనని పట్టుబట్టలేదు. ఇందుకు బదులుగా రెహమాన్ పిషిన్, సిబి జిల్లాలను బ్రిటీష్ వారికి ఇచ్చాడు.

### 24.2.5. ఫలితాలు :

1) ఈ యుద్ధ ఫలితంగా ఇంగ్లీషు వారికి బెలూచిస్థాన్‌లోని ఈశాన్య భాగం లభించినది. 2) ఆఫ్ఘనిస్థాన్‌పై రష్యా ప్రభావం తొలగించబడినది. 3) ఆంగ్లేయులకు అధిక ధననష్టం జరిగింది. ఒక పక్క భారతదేశంలో కరువు నెలకొన్నప్పుడు 20 మిలియన్ పౌనులు ఈ యుద్ధంపై వెచ్చించటాన్ని అనేకులు విమర్శించారు. 4) అట్లే స్వాతంత్ర్య ప్రియులైన ఆఫ్ఘనులను భారతీయులవలె తేలికగా అణచివేయుట సాధ్యపడదని ఇంగ్లీషువారికి మరొక్కసారి బోధపడింది. 5) రిప్పన్ బ్రిటీష్ - ఇండియన్ ప్రభుత్వానికీ, ఆఫ్ఘనిస్థాన్‌కు మధ్య స్నేహ సంబంధాలు నెలకొల్పటంలో సఫలమైనాడు.

## 24.3. రెండవ ఆఫ్ఘన్ యుద్ధానంతర పరిస్థితులు :

యుద్ధం ముగిసినా ఆఫ్ఘనిస్థాన్‌కు శాంతి లభించలేదు. బ్రిటన్, రష్యాల మధ్య ఆఫ్ఘనిస్థాన్ ఒక కీలుబొమ్మ అయినది. 1884లో రష్యా మెర్వ్‌ను ఆక్రమించింది. రష్యా ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య సరిహద్దు నిర్ణయానికి ఒక సంయుక్త కమిషన్ నియమించుటకు రష్యా అంగీకరించింది. 1885 మార్చిలో రష్యన్లు జుల్ఫికర్ కనుమను ఆక్రమించి ఆఫ్ఘన్‌లను పాంజ్‌డే నుండి తరిమివేయడంతో యుద్ధవాతావరణం నెలకొన్నది. అయితే డఫ్రిన్ ప్రభువు సమయోచిత దౌత్యం వల్ల యుద్ధము నివారింపబడినది.

బ్రిటన్ - రష్యా ఒప్పందం ప్రకారం రష్యన్లు పాంజ్‌డే పొందేటట్లు, జుల్ఫికర్ కనుమను ఆఫ్ఘన్లకు ఇచ్చేటట్లు ఒప్పందం కుదిరింది. సరిహద్దు సంఘం తన పనిని కొనసాగించి చివరికి 1887 జూలైలో రష్యా, ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య సరిహద్దును నిర్ణయించింది. ఈ విధంగా సరిహద్దు సమస్య పరిష్కరింపబడినా ఒకరిపట్ల ఒకరికి అనుమానం తొలగలేదు. 1901లో అబ్దుల్ రెహమాన్ మరణించగా అతని జ్యేష్ఠపుత్రుడు హబీబుల్లా ఆఫ్ఘనిస్థాన్‌కు అమీర్ అయినాడు. 1905లో భారత ప్రభుత్వానికీ హబీబుల్లాకూ కుదిరిన ఒప్పందం ద్వారా అతడి తండ్రి అబ్దుల్ రహమాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలను గౌరవించేటట్లు అంగీకారం కుదిరింది.

1907లో కుదిరిన ఆంగ్లో - రష్యన్ ఒప్పందం ద్వారా ఆఫ్ఘనిస్థాన్‌ను తన ప్రభావానికి బయట ఉన్న దేశంగా రష్యా గుర్తించింది. హబీబుల్లా పాశ్చాత్యీకరణ విధానాలను ప్రజలు వ్యతిరేకించారు. 1910 ఫిబ్రవరి 20న హబీబుల్లా హత్యకు గురై అమానుల్లా ఆఫ్ఘనిస్థానుకు కొత్త అమీర్ అయినాడు.

## 24.4. 3వ ఆఫ్ఘన్ యుద్ధము :

అమానుల్లా మొదటినుండీ బ్రిటీష్ వ్యతిరేక విధానాన్ని పాటించాడు. స్వేచ్ఛా ప్రియులైన ఆఫ్ఘన్‌లు అవకాశం వస్తే ఇంగ్లీషువారిపై యుద్ధం చేసి తిరిగి తమ స్వాతంత్ర్యాన్ని పొందాలని కోరటమే 3వ ఆఫ్ఘన్ యుద్ధానికి దారితీసింది. మొదటి ప్రపంచ యుద్ధంలో ఒక సంఘటనగా 3వ ఆఫ్ఘన్ యుద్ధం జరిగింది. అమానుల్లా బ్రిటీష్ ప్రాంతాలపై దాడి చేయటంతో ఆరంభమైన ఈ యుద్ధం మూడు వారాలపాటు కొనసాగింది. ఆరంభంలో ఇంగ్లీషువారు కొన్ని పరాజయాలు చవిచూసినా ఆఫ్ఘన్‌లను పారద్రోలటం ద్వారా సంపూర్ణ విజయం సాధించారు. జలాలాబాద్, కాబూల్ లపై బాంబుల వర్షం కురిపించారు. ఆఫ్ఘన్ సైన్యం సర్వనాశనమైనది. ఆఫ్ఘన్‌లు లొంగిపోయి 1919 ఆగస్టు 8న రావల్పిండి వద్ద ఇంగ్లీషు వారితో సంధి కుదుర్చుకున్నారు. తిరిగి అదే సంధిని నవంబరులో బలపరుచుకున్నారు.

### 24.4.1. ఫలితాలు :

ఈ సంధి ద్వారా ఆఫ్ఘనిస్థాన్ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ఆంగ్లేయులు గుర్తించారు. వారి విదేశ వ్యవహారాల నిర్వహణలో ఎట్టి జోక్యం చేసుకోబోమని ఇంగ్లీషువారు మాట ఇచ్చారు. భారతదేశం ద్వారా ఆయుధాలను ఆఫ్ఘన్‌లు దిగుమతి చేసుకోవటాన్ని రద్దుచేశారు. అమీర్‌కు బ్రిటీష్‌వారు బకాయిపడ్డ ధనాన్ని రద్దు కావించారు. ఇకపై ఆఫ్ఘన్ రాయబారి ఇంగ్లండ్‌లోను, ఇంగ్లీషు రాయబారి ఆఫ్ఘన్‌లోను ఉండుటకు అంగీకరించారు. భారతీయ రేవు పట్టణాల ద్వారా సుంకం లేకుండా వస్తువులు దిగుమతి చేసుకోవటానికి ఒప్పందం కుదిరింది. ఈ విధంగా 3వ ఆఫ్ఘన్ యుద్ధం ముగిసింది.

ఈ రకంగా 80 సంవత్సరాల కాలంలో మూడు ఆఫ్ఘన్ యుద్ధాలు జరిగి, వానిలో బ్రిటీష్ వారు గెలిచినా ఆఫ్ఘనిస్థాన్ వారికి స్వాధీనం కాలేదు. ఆఫ్ఘనిస్తాన్ స్వతంత్రదేశంగానే ఉండిపోయింది. భారతదేశంలో వారుపయోగించిన పద్ధతులు గాని, చాకచక్యం గాని, స్వేచ్ఛాప్రియులైన ఆఫ్ఘన్‌లపై పారలేదు. ఇట్లు బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి లొంగక తమ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకున్న ప్రాచ్యదేశం ఆఫ్ఘనిస్థాన్ ఒక్కటే.

## 24.5. 3వ బర్మా యుద్ధము - క్రీ.శ. 1885 - 86 :

మొదటి బర్మా యుద్ధంలో (1824 - 26) బ్రిటీష్‌వారు ఆరకాన్, టెనాస్సిరిమ్ రాష్ట్రాలు పొందారు. రెండవ బర్మా యుద్ధంలో (1852) పెగూ రాష్ట్రం ఆక్రమించి దిగువ బర్మాపై తమ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. మిగతా బర్మాను కూడా జయించి తమ సామ్రాజ్యాన్ని విస్తరింపచేయాలనే ఆంగ్లేయుల రాజ్యకాంక్ష 3వ బర్మా యుద్ధానికి మొదటి కారణమైంది. అలాగే ఇంగ్లీషు వారిని బర్మా నుండి తరిమికొట్టి వారి ఆధీనంలోని ప్రాంతాలను పునరాక్రమించాలనే బర్మారాజు కోరిక ఈ యుద్ధానికి రెండవ కారణం.

### 24.5.1. మిండాన్ :

1857లో బర్మారాజు మిండాన్ తన రాజధానిని 'ఆవా' నుండి 'మాండలే'కు మార్చాడు. 1862, 1867 సంవత్సరాలలో జరిగిన రెండు సంధుల ద్వారా బ్రిటీష్ వారి వాణిజ్య, రాజకీయ హక్కులను బర్మా ప్రభుత్వం గుర్తించింది. బ్రిటీష్ రెసిడెంటు మాండలేలో ఉండి బ్రిటీష్ వారి ప్రయోజనాలను కాపాడుతుండే వాడు. బర్మా రాజదర్బార్ మర్యాదల ప్రకారం బ్రిటీష్ రెసిడెంటు రాజును కలవాలంటే తన పాదరక్షలు తీసి మోకాళ్ళపై నిలబడి రాజును దర్శించవలెను. 1877లో వైస్రాయి ఈ అవామానకరమైన ఆచారాన్ని ఆపటానికి యత్నించాడు. కాని రాజు దానికి అంగీకరించకపోవడంతో బ్రిటీష్ రెసిడెంటు రాజదర్శనాన్ని మానుకొన్నాడు. యుద్ధానకి దారితీసిన కారణాలలో ఇది ఇంకొకటి.

### 24.5.2. థీబా :

మిండాన్ మరణం తర్వాత అతని చిన్నకొడుకు థీబా వారసత్వ యుద్ధంలో గెలిచి బర్మా రాజైనాడు. మిగతా రాజకుమారులను, రాజ కుమార్తెలను బంధించాడు. 1879లో తనపై కుట్రపన్నుతున్నారనే అనుమానంతో వారిలో అనేకమందిని చంపించాడు. బ్రిటీష్ రెసిడెంటు ఇందుకు నిరసన తెలుపగా తాను సర్వస్వతంత్రుడనని జవాబులిచ్చాడు. ఈ హత్యలు ఆగలేదు. 1884లో కూడ మరికొన్ని హత్యలు జరిగినవి. దీనికి నిరసనగా ఆంగ్ల, చైనా వర్తకులు ఎగువ బర్మానంతా బ్రిటీష్ వారి పాలనలోకి తీసుకురావాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. అయితే కేవలం ఆంతరంగిక దుష్పరిపాలన కారణంగా బర్మాపై దాడిచేయడం జరుగదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది.

బ్రిటిష్ వారిని అదుపులో పెట్టటానికి థీబా ఇండో - చైనా ఆక్రమించిన ఫ్రెంచివారితో స్నేహసంబంధాలు నెలకొల్పుకోవడం ప్రారంభించాడు. ఫ్రెంచివారు థీబాకు సైనికసాయం చేస్తామని మాట ఇచ్చారు. ఫ్రెంచి ప్రతినిధి (కాన్సల్) మాండలేలో నియమితుడైనాడు.

వారు రైలుమార్గాన్ని నిర్మించటానికి, మాండలేలో ఒక బ్యాంకును స్థాపించడానికి, బర్మారాజు వ్యాపార సంస్థలను నడపడానికి అంగీకరించారు. ఇట్లు బర్మా రాజ్యంలో ఫ్రెంచి ప్రభావం పెరగసాగింది.

ఈ విధంగా బర్మాలో ఫ్రెంచివారి ప్రభావం పెరిగిపోవడం ఇంగ్లీషు వారు సహించలేకపోయారు. అదే సమయంలో తను అడిగిన అప్పు ఇవ్వలేదనే కోపంతో థీబా బాంబే - బర్మా ట్రేడింగ్ కార్పొరేషన్ అనే ఆంగ్ల కంపెనీపై 10 లక్షలు జరిమానా విధించాడు. అంతేకాక బర్మాలోని అడవులను ఆంగ్లేయులకు బదులు ఫ్రెంచివారికి ఇవ్వవలెనని నిర్ణయించాడు.

### 24.5.3. యుద్ధము :

అది సహించలేని బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం బర్మారాజును సంజాయిషీ అడిగారు. అంతేగాక వారు సహాయక సంధిని పోలిన ఒక పత్రాన్ని తయారుచేసి, దానికి అంగీకరించవలసిందిగా బర్మారాజును ఆజ్ఞాపించారు. దానికి అంగీకరించడమంటే బర్మారాజు ఇంగ్లీషు వారికి సామంతస్థితికి దిగజారుతాడు. బర్మారాజు దానికి నిరాకరించడంతో వైస్రాయి లార్డ్ డఫరిన్ 1885 నవంబరులో బర్మాపై యుద్ధం ప్రకటించి బ్రిటీష్ సైన్యాలను బర్మాపైకి పంపాడు. ఇండోచైనా యుద్ధములో చిక్కుకున్న ఫ్రెంచివారు బర్మారాజుకు ఎట్టి సాయం చేయలేక పోయాడు. బ్రిటీష్ సైన్యాలు 20 రోజులలో మండలేను ఆక్రమించారు. థీబారాజు బందీగా చిక్కి భారతదేశం పంపబడ్డాడు. కాని బర్మా ప్రజలు కొద్ది సంవత్సరాలు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం చెదురుమదురుగా చేశారు. కాని ఫలితం లేకపోయింది. బర్మాదేశము బ్రిటీష్ వారి సామ్రాజ్యములో కలిసిపోయింది. బర్మా సరిహద్దులలోని షానులు, చికులు అనే తెగల వారిని కూడ తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు.

### 24.5.4. ఫలితాలు :

ఎగువ బర్మాను జయించిన ఇంగ్లీషు వారు దానిని అప్పటికే తమ ఆధీనములోనున్న దిగువ బర్మాతో కలిపి రంగూన్‌ను రాజధానిగ బర్మా అనే రాష్ట్రంగ ఏర్పరచి దానిని బ్రిటీష్ ఇండియాలో భాగంగా చేశారు. 1897 వరకు చీఫ్ కమీషనర్ పరిపాలనలో ఉంది. 1923లో బర్మాను గవర్నర్ రాష్ట్రంగా చేశారు. 1935 చట్టంలో బర్మాను భారతదేశంనుండి వేర్పరచి, దానికి ప్రత్యేక రాజ్యాంగం ఇచ్చారు.

ఆఫ్ఘన్ యుద్ధాలవలె కాక బర్మా యుద్ధాలు స్వల్పఖర్చుతో ముగిసినవి. బర్మా రాజు కూడ ఫ్రెంచివారి సాయంతో ఇంగ్లీషువారిని వెళ్ళకొట్టవలెననే ప్రయత్నం చేసి విఫలమైనాడు. బర్మా అంతా బ్రిటీష్ సామ్రాజ్యంలో కలిసిపోయి 1886 నుండి 1937 వరకు భారతదేశములో ఒక రాష్ట్రంగ పరిగణించబడింది. నిజానికి తమ భారత సామ్రాజ్య తూర్పు సరిహద్దులను కాపాడటానికి బర్మాను ఇంగ్లీషువారు జయించారు.

## 24.6. సిక్కిం :

సిక్కిం, భారతదేశము, నేపాల్, భూటాన్, టిబెట్‌ల మధ్య హిమాలయ పర్వతాలలో ఉన్న చిన్న దేశము. సిక్కిం ఒక రాచరిక రాజ్యంగా ఉండేది. నేపాల్ యుద్ధానంతరం (1814 - 16) సిక్కిం రాజాతో బ్రిటీష్ ప్రభుత్వం స్నేహ సంబంధాలు నెలకొల్పుకొన్నది. నేపాల్ నుండి తాను పొందిన కొన్ని ప్రాంతాలను సిక్కింకు ఇచ్చి 1817 లో మైత్రీ సంధి చేసుకొన్నది. డల్హౌసీ కాలంలో అతను సామ్రాజ్య కాంక్ష కారణంగా రెండు దేశాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. బ్రిటీష్ ప్రభుత్వ ప్రతినిధిని సిక్కిం మహారాజు నిర్బంధించాడు. ఇది సహించక డల్హౌసీ సిక్కింపై దాడిచేసి సిక్కింలోని విశేష భాగాన్ని ఆక్రమించాడు. సిక్కింరాజు లొంగిపోయి బ్రిటీష్ వారితో సహాయక సంధి చేసుకున్నాడు. 1887లో టిబెట్ సైన్యం సిక్కింపై దాడిచేయగా అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ 'లాన్స్ డాన్' బ్రిటిష్ సైన్యాన్ని పంపి సిక్కింను కాపాడాడు. ఆ మరుసటి సంవత్సరమే 1888లో సిక్కింను బ్రిటీష్ ప్రభుత్వ "రక్షిత దేశం'' (Protectorate State) గా ప్రకటించారు. అప్పటినుండి 1947 వరకూ సిక్కిం, బ్రిటీష్ సామ్రాజ్యంలో ఒక భాగమైంది.

## 24.7. భూటాన్ :

సిక్కిమ్‌కు తూర్పుగ ఉన్న ఇంకొక హిమాలయ పర్వత రాజ్యం భూటాన్, 19వ శతాబ్దంలో ఇది ఒక రాజ వంశ పరిపాలనలో ఉండేది. ఆంగ్లేయులు అస్సామును ఆక్రమించినాక వారికన్ను భూటాన్‌పై పడింది. భూటాన్‌లు తరచుగా అస్సాము, బెంగాలులపై దాడిచేస్తూ ప్రజలను బాధిస్తుండేవారు. గవర్నర్ జనరల్ ఎల్జిన్ ప్రభువు భూటాన్ రాజువద్దకొక రాయబారిని పంపి భూటాన్‌కు ఇండియాకు మధ్యనున్న కనుమలను తమ స్వాధీనం చేయమని కోరాడు. భూటాన్ రాజు అందుకు నిరాకరించి, రాయబారిని అవమానించి పంపాడు. అనేకమంది ఇంగ్లీషు వారిని రహస్యంగ బందీలు చేశాడు.

మరుసటి సంవత్సరము గవర్నర్ జనరల్ సర్ జాన్ లారెన్స్ భూటాన్ రాజాను, ఖైదీలయిన ఆంగ్లేయులను విడుదల చేయమని వివాదాస్పదమైన కనుమలను తమ స్వాధీనం చేయమని కోరాడు. అందుకు భూటాన్ రాజు నిరాకరించగా లారెన్స్ బ్రిటీష్ సైన్యాలను 1865లో భూటాన్‌పైకి పంపి వారిని ఓడించాడు. ఓడిపోయిన భూటాన్‌రాజు బ్రిటీష్ వారి షరతుల కంగీకరించి 1865లో 'సించులా' సంధి చేసుకున్నాడు. దీని ప్రకారము భూటాన్ 18 కనుమలను బ్రిటీష్ వారికిచ్చేటట్లు, విదేశాంగ వ్యవహారాలలో బ్రిటీష్ వారి సలహాను అనుసరించేటట్లు భూటాన్ రాజు అంగీకరించాడు. దీనికి బదులుగా బ్రిటీష్ ప్రభుత్వం భూటాన్‌కు ప్రతిసంవత్సరం కొంత సహాయనిధి (Subsidy) ఇవ్వడానికి, విదేశీ దండయాత్రల నుండి ఆ దేశాన్ని కాపాడటానికి అంగీకరించింది. అప్పటి నుండి భూటాన్ కూడ బ్రిటీష్ వారి రక్షిత దేశమయింది.

1910లో టిబెట్‌లో జరుగుతున్న అలజడులు చూసి ఆందోళన చెంది భూటాన్‌తో అంతకు ముందు చేసుకున్న సంధిని బలపరుస్తూ, ఏటా ఇచ్చే సహాయనిధిని 50 వేల నుండి లక్ష రూపాయలకు పెంచారు.

## 24.8. టిబెట్ :

టిబెట్ భారతదేశానికి ఉత్తరంగా హిమాలయాలకు ఆవలివైపున ఉన్న బౌద్ధుల రాజ్యము. అక్కడ రాజ్యాధికారం దలైలామా, పంచన్ లామా అనే ఇద్దరు మతాధిపతుల చేతిలో ఉండేది. టిబెట్ రాజధాని లాసా. చైనావారు అనేకసార్లు టిబెట్‌ను సామంతం చేసికొనటం, తిరిగి టిబెటన్లు చైనా నుండి స్వతంత్రం పొందటం టిబెట్ చరిత్రలో సర్వసాధారణం. ఉన్ని సరఫరా చేసే దేశాలల్లో ఇది ముఖ్యమైనది. 19వ శతాబ్దం ఆఖరి భాగంలో ఆంగ్లేయులు టిబెట్‌తో వ్యాపార సంబంధాలు నెలకొల్పుకోవాలని తలచగా టిబెట్ దానికి సమ్మతించలేదు. 13వ దలైలామా కాలంలో టిబెట్, రష్యా ప్రాబల్యంలోకి పోయే పరిస్థితి ఏర్పడినది. అందుచేత బ్రిటీష్ ప్రభుత్వం టిబెట్ వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నది. 1903లో కర్జన్ ప్రభువు కర్నల్ యంగ్ హస్బెండ్ నాయకత్వాన ఒక సైనిక రాయబార వర్గాన్ని టిబెట్‌కు పంపినాడు. టిబెట్ ప్రభుత్వం వీరి రాకకు అనుమతించక ప్రతిఘటించుటకు పూనుకున్నది. దలైలామా పారిపోగా 1904లో ఆయన తరఫున పరిపాలిస్తున్న టిబెట్ ప్రభుత్వ ప్రతినిధులతో యంగ్ హస్బెండ్ 'లాసా' సంధి చేసుకున్నాడు. దీని ప్రకారం 1) టిబెట్ ప్రభుత్వం 75 లక్షల రూపాయలు యుద్ధ ఖర్చులకై బ్రిటీష్ ప్రభుత్వానికి ఇచ్చేటట్లు 2) ఆ ఋణం తీరే వరకూ చుంబీ లోయను ఆంగ్లేయుల ఆధీనంలో ఉంచేటట్లు 3) బ్రిటీష్ వారితో వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకోవటానికి 4) బ్రిటీష్ వాణిజ్య ప్రతినిధిని లాసాలో ఉండనిచ్చేటందుకు 5) ఆంగ్లేయులు తమ వ్యాపార స్థావరాలను గ్యాంట్సీ, గార్టల్ యాటంగ్‌లలో నెలకొల్పుకోవటానికి 6) వారు తగిన సుంకం చెల్లించి తమ వస్తువులను టిబెట్‌లో అమ్మటానికి అంగీకరించింది. 7) టిబెట్ మరే ఇతర విదేశీయులకు వ్యాపార అనుమతినివ్వనని, ఏ రాజకీయ సంబంధం పెట్టుకోనని కూడ మాట ఇచ్చింది. 8) బ్రిటీష్ ప్రభుత్వ సలహానుసరించి తన విదేశాంగ విధానం రూపొందించుటకు టిబెట్ అంగీకరించింది. 9) తరువాత బ్రిటీష్ ప్రభుత్వం ఈ షరతులలో కొన్ని మార్పులు చేసింది. యుద్ధ ఖర్చుల నిమిత్తం టిబెట్ 25 లక్షలే ఇచ్చేటట్లు, చుంబీ లోయ బ్రిటీష్ వారి చేతిలో 3 సంవత్సరాలే ఉండేటట్లు, విదేశీ వ్యవహారాల్లో టిబెట్ స్వేచ్ఛ కలిగి ఉండేటట్లు అంగీకరించింది. వాణిజ్య విషయాలలో సంపాదించిన లాభకరమైన షరతులను మాత్రం బ్రిటన్ వదులుకోలేదు. అంతేగాక టిబెట్‌పై రష్యా ప్రభావం అరికట్టబడింది. ఈ సంధినే 1908 ఏప్రిల్ 20న ధృవపరుచుకున్నారు. ఈ సారి చైనా కూడా ఉన్నది.

1914లో ఇండియా టిబెట్‌ల సరిహద్దును నిర్ణయించుటకు లోంఛన్ షాత్ర, A.H. మాక్మహన్‌లు నియమితులైనారు. వారు నిర్ణయించిన సరిహద్దునే మక్‌మహన్ సరిహద్దు అని పిలుస్తారు. సిమ్లాలో బ్రిటన్, టిబెట్, చైనా ప్రతినిధులు సమావేశమై ఈ సరిహద్దును అంగీకరించారు.

1907లో చైనావారు టిబెట్‌పై దాడి చేయగా దలైలామా డార్జిలింగ్‌కు పారిపోయి ఇంగ్లీషువారి రక్షణను కోరినాడు. వారు చైనా చర్యను నిరసించారు. అనంతరం చైనాలో విప్లవం ఆరంభమైనాక వారు టిబెట్‌ను నిర్లక్ష్యం చేశారు. ఇది అవకాశంగా తీసుకొని 1818లో టిబెట్ చైనా నుండి విడిపోయి తన స్వతంత్రాన్ని ప్రకటించుకున్నది. బ్రిటీష్ వారు టిబెట్‌తో తమ స్నేహ సంబంధాలను కొనసాగించారు.

## 24.9. వాయువ్య సరిహద్దు ప్రాంతాలు :

సింధునదికి ఆఫ్ఘనిస్థాన్‌కు మధ్యనున్న పర్వతమయమైన ప్రాంతమే వాయువ్య సరిహద్దు ప్రాంతము. ఇది మనదేశ చరిత్రలో ఆదినుండి కీలకమైన పాత్ర వహించినది. ప్రాచీన కాలం నుండి మనదేశంపై దండెత్తి వచ్చిన వారంతా ఈ ప్రాంతంలోని కనుమలు, లోయలు గుండా వచ్చిన వారే. ఆంగ్లేయులు పంజాబు, సింధులను జయించిన పిదప వారి రాజ్యము ఇచ్చటి వరకూ విస్తరించినది. ఈ కనుమల ద్వారా విదేశీయులు - రష్యన్‌లు ఫ్రెంచివారు, పర్షియన్లు, ఆఫ్ఘన్‌లు భారతదేశంపై దాడి చేస్తారేమో అనే భయంతో ఈ ప్రాంతాలలో తమ ప్రాబల్యం నెలకొల్పుటకు పూనుకున్నారు.

పర్వతమయమైన ఈ సరిహద్దు ప్రాంతాలలో పెక్కు కొండజాతులు జీవిస్తుండేవారు. వారు స్వేచ్ఛా ప్రియులు. నిరంతరం యుద్ధాలు చేయటం, దాడులు, దోపిడీలు చేయటం వారి జీవనవిధానం. ఎంతమంది విదేశీయులు మనదేశంపై దండెత్తినా ఈ సరిహద్దు తెగలను ఏమీ చేయలేకపోయారు. వారు భారతీయులను, ఆఫ్ఘన్‌లను కూడా దోచుకుంటుండేవారు. ఇప్పుడు ఈ సరిహద్దు తెగలను అణచివేసి తమ భారత ప్రజలను వారి దోపిడీనుండి కాపాడి తమ వాయువ్య సరిహద్దులను పరిరక్షించుకొను బాధ్యత బ్రిటీష్ వారిపై పడినది.

### 24.9.1. లారెన్స్ విధానము :

ఆదిలో లారెన్స్ ప్రభువు కాలంలో సింధునదిని తమ సరిహద్దుగా పరిగణించి ఆవలివైపునున్న తెగల విషయాలలో జోక్యము చేసికొనకుండుట తమ విధానంలో భాగంగా బ్రిటీష్‌వారు పెట్టుకున్నారు. అయితే ఈ విధానం సఫలం కాలేదు. అనాగరిక సరిహద్దు తెగలు బ్రిటీష్ ప్రాంతాలపై దాడులు చేయుచుండుటతో వారిని శిక్షించుటకై బ్రిటీష్‌వారు ఎదురు దాడులు జరుపవలసి వచ్చింది. 1850 - 70 మధ్య కాలంలో 26 సార్లు ఈ దాడులు జరిగాయి. ఇందువలన సైన్య నష్టం, ధన నష్టం మినహా లాభమేమీ లేకపోయింది.

### 24.9.2. లిట్టన్ విధానము :

అందువలన లిట్టన్ ప్రభువు కాలంలో జోక్యం చేసుకొనని విధానాన్ని విడనాడి వాయువ్య సరిహద్దు ప్రాంతమంతా స్వాధీనం చేసుకొని దోపిడీదారులను కఠినంగా శిక్షించి ఆ ప్రాంతాన్ని బ్రిటీష్ సామ్రాజ్యంలో కలుపుకోవటానికి పూనుకున్నారు. 1877లో 'క్వెట్టా'ను స్వాధీనపరుచుకున్నారు. 1879లో పిషిన్, సిబి జిల్లాలను ఆక్రమించారు. ఈవిధంగా బ్రిటీష్ బెలుచిస్థాన్ ఏర్పడింది. లాన్స్‌డౌన్ ప్రభువు కాలంలో ఇండో - ఆఫ్ఘన్ సరిహద్దును ఖచ్చితంగా నిర్ణయించి సరిహద్దు ప్రాంతాలకు రైలు, రోడ్డు మార్గాలను నిర్మించాలని నిర్ణయించినారు. 1889లో కాశ్మీర్ రాజును పదవి నుండి తప్పించి బ్రిటీష్ రెసిడెంట్ పాలనలో ఆ రాష్ట్రాన్ని ఉంచారు. బోలన్ కనుమ వరకు రైలుమార్గాన్ని వేశారు.

### 24.9.3. డురాండ్ రేఖ :

1888లో ఇండో - ఆఫ్ఘన్ సరిహద్దు నిర్ణయానికి 'మార్టిమిర్ డురాండ్ మిషన్' ను ఆఫ్ఘనిస్థాన్‌కు పంపాలని నిర్ణయించారు. కాని ఆఫ్ఘన్ అంతర్గత సమస్యల వల్ల ఈ మిషన్ రెండేళ్ళు వాయిదా పడింది. ఈ లోపల గిల్గిట్‌పై బ్రిటీష్‌వారు ఆధిపత్యం నెలకొల్పారు. తుదకు 1890లో డురాండ్ మిషన్ ఆఫ్ఘనిస్థాన్ భారత దేశాల మధ్య శాస్త్రీయంగా సరిహద్దును నిర్ణయించింది. దీనినే 'డురాండ్ రేఖ' అని పిలుస్తారు. వీలయినంత వరకూ కొండలు, నదులు మొదలైన సహజ భౌగోళికాంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ సరిహద్దును నిర్ణయించారు. ఆఫ్ఘన్‌రాజుకు ఈ రేఖకు ఆవలనున్న కొన్ని ప్రాంతాలను ఇవ్వటం జరిగింది. దీనికి బదులుగా స్వాట్, బజౌర్, చిత్రాల్‌లలో జోక్యం చేసుకోనని అతడు వాగ్దానం చేశాడు. అతడి సహాయక నిధిని 12 లక్షల నుండి 18 లక్షలకు పెంచారు. ఆఫ్ఘన్ - బ్రిటీష్ ప్రభుత్వాల మధ్య సుహృద్భావం నెలకొన్నది.

1895లో చిత్రాల్ రాజు మృతి చెందటంతో బ్రిటీష్ వారు వారసత్వ యుద్ధంలో జోక్యం చేసుకొని దానిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవటానికి ప్రయత్నించారు. అయితే అది సహించక అక్కడి కొండజాతులు 1897లో బ్రిటీష్ వారిపై పవిత్ర మత యుద్ధాన్ని ప్రకటించారు. 'ఆఫ్రిడీ' తెగవారు కైబర్ కనుమను మూసివేశారు. మొహమండ్స్ పెషావర్ ప్రాంతంపై దాడులు చేశారు. అయితే ఈ తిరుగుబాటులను 1897 - 98లో 'మలకండ్ ఫీల్డ్' సైన్యం అణచివేసింది. తిరుగుబాటుదారులు జరిమానాలు చెల్లించారు. చిత్రాల్ లొంగిపోయింది.

### 24.9.4. కర్జన్ విధానము :

కర్జన్ ప్రభువు ఈ వాయువ్య సరిహద్దు సమస్యపై కొత్త విధానాన్ని రూపొందించాడు. ఇంగ్లీషు సైన్యాలను ప్రత్యక్షంగ ఈ తెగల ప్రాంతాలలో నింపకుండా, ఈ సరిహద్దు తెగలవారినే తమ సైన్యాలలో చేర్చుకొని, వారినే ఆ ప్రాంత రక్షణకు నియమించేటట్లు, ఆంగ్ల సైన్యం వారి వెనుక ఉండి వారిని పర్యవేక్షించుతూ, అవసరమైనపుడు మాత్రమే వారికి సాయముగా వెళ్ళేటట్లు ఏర్పాటు చేశాడు. రోడ్డు, రైలు మార్గాలు వేసి, అక్కడక్కడ బ్రిటీష్ స్థావరాలు నెలకొల్పాడు. పోలీసు బాధ్యతలను స్థానిక తెగలకే అప్పచెప్పి వారికి ఆ పని చేసినందుకు కొంతధనం ముట్టచెప్పాడు. సరిహద్దు తెగలవారు పూర్వంవలె దోపిడీలు చేయకుండ గౌరవంగ జీవించే మార్గాలు చూపాడు. ఈ విధానాలు విజయవంతమై అంతకుముందు వాయువ్య సరిహద్దుపై పెట్టబడుతున్న ఖర్చు చాల తగ్గిపోయింది.

### 24.9.5. వాయువ్య సరిహద్దు రాష్ట్రము :

అంతకు ముందు ఈ వాయువ్య సరిహద్దు ప్రాంతము పంజాబు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండెడిది. భారత కేంద్ర ప్రభుత్వానికి పరోక్షంగా మాత్రమే దానిపై అధికారముండెడిది. కాని ఇపుడు కర్జన్ ప్రభువు పరిపాలనా సౌలభ్యము కోసం ఈ సరిహద్దు ప్రాంతాన్ని పంజాబు నుండి విడదీసి, 1901లో 'వాయువ్య సరిహద్దు రాష్ట్రము' (North-West Frontier Province) అనే పేరుతో కొత్త రాష్ట్రాన్ని ఏర్పరిచాడు. సుమారు 40,000 చ.మైళ్ళ విస్తీర్ణము కలిగిన ఈ రాష్ట్రములో ఖుర్రం, ఖైబల్, మలకండ్, తోచి, వన, పెషావల్ మరియు సింధునదికి అవతల ఉన్న ప్రాంతాలన్నింటినీ చేర్చారు. ఆ రాష్ట్ర ప్రజలందరూ పఠానులే. ఆ రాష్ట్ర పాలకుడగు చీఫ్ కమీషనర్ నియమించబడ్డాడు. ఇంతటితో ఆంగ్లేయులకు వాయువ్య సరిహద్దు సమస్య చాలా వరకు తీరిపోయింది.

తరువాత కాలంలో కొన్నిసార్లు ఈ యుద్ధజాతులు తిరుగుబాటులు చేసినా ఆంగ్లేయులు తేలికగా వాటిని అణచివేశారు. ఇలా 1908లో ఆఫ్రిడులు 1914 - 18 మొదటి ప్రపంచ యుద్ధకాలంలో, 1919లో వజీరిలు, 1925లో మన్‌సూద్‌లు, 1930లో ఆఫ్రిడులు, చేసిన తిరుగుబాట్లని బ్రిటీష్‌వారు కఠినంగా అణిచివేశారు. 1947లో స్వాతంత్ర్యానంతరం ఈ ప్రాంతాలు పాకిస్తాన్‌లో చేరినవి.

## 24.10. ముగింపు :

ఈ విధముగా బ్రిటీష్‌వారు తమ భారత సామ్రాజ్య పరిరక్షణకు మనదేశ సరిహద్దులలో నున్న దేశములో జోక్యము చేసుకొని, వానిని తమ ప్రాబల్యము క్రిందకు తీసుకువచ్చిరి. మూడవ బర్మా యుద్ధానంతరము ఆ దేశమును మన దేశములో ఒక రాష్ట్రముగా కలిపివేసిరి. సిక్కిమ్, భూటాన్‌లపై తమ సంరక్షకత్వము నెలకొల్పిరి. టిబెట్‌తో ఒప్పందము చేసుకొని తమ రాజకీయ, వాణిజ్య ప్రయోజనములను కాపాడుకొనిరి. వాయువ్య సరిహద్దులోని తెగలను అణిచివేసి, ఆ ప్రాంతమును వాయువ్య సరిహద్దు రాష్ట్రముగ బ్రిటీష్ సామ్రాజ్యములో చేర్చారు. ఒక్క ఆఫ్ఘనిస్థాన్‌లో మాత్రము, స్వేచ్ఛా ప్రియులైన ఆఫ్ఘనులు వారికి లొంగలేదు. ఆఫ్ఘనిస్థాన్ స్వతంత్ర దేశంగానే ఉండిపోయినా అక్కడ తమకు మిత్రులైనవారు రాజులుగ ఉండేటట్లు బ్రిటీష్ వారు జాగ్రత్తపడ్డారు.

## మాదిరి ప్రశ్నలు :

1) రెండవ ఆఫ్ఘన్ యుద్ధానికి దారితీసిన పరిస్థితులను, దాని ఫలితములను వివరింపుము
2) మూడవ బర్మా యుద్ధ కారణములను, ఫలితాలను వివరింపుము
3) మూడవ ఆఫ్ఘన్ యుద్ధమును వివరించుము
4) భూటాన్ - బ్రిటీష్ వారి సంబంధములను చర్చించుము
5) సిక్కిమ్ - బ్రిటీష్ వారి సంబంధములను చర్చించుము
6) టిబెట్‌తో బ్రిటీష్ వారి సంబంధాలను వివరించుము
7) బ్రిటీష్ వారి వాయువ్య సరిహద్దు విధానమును చర్చించుము

## చదువదగిన గ్రంథాలు :


1) B.S. Hanumantha Rao & K. Basaveswara Rao - Indian History and Culture Vol - II
2) R.C. Majumdar, H.C. Rayachaudari, & K. Datta - Advanced History of India
3) పాటిబండ ఝాన్సీ లక్ష్మి & అల్లాడి వైదేహి - భారతదేశ చరిత్ర - సంస్కృతి - ద్వి. భా.
4) Roberts - History of British India
5) Bellow - North West Frontier & Afghanistan
6) Cambridge History of India - Vols - V & VI


రచయిత : **కె.సి. గాంధీబాబు**

పాఠం - 25

# పరిపాలనా సంస్కరణలు

**విషయసూచిక**

**25.0** లక్ష్యం

**25.1** ఉపోద్ఘాతము

**25.2** ప్రభుత్వోద్యోగ వ్యవస్థ

**25.3** ఆదాయ వ్యయాలు

**25.4** స్థానిక సంస్థలు

**25.5** క్షామ నివారణ

**25.6** విద్యా సంస్కరణలు

**25.7** న్యాయ పరిపాలనాశాఖ - సంస్కరణలు

**25.8** సైనిక సంస్కరణలు

**25.9** ముగింపు

## 25.0 లక్ష్యం :

భారతదేశంలో బ్రిటీష్‌వారి పరిపాలనా కాలములో వివిధ రంగాలలో జరిగిన పరిపాలనా సంస్కరణలను అధ్యయనం చేయడం పాఠం యొక్క ఉద్దేశ్యము.

## 25.1 ఉపోద్ఘాతము :

బ్రిటీష్‌వారు మనదేశాన్ని జయించిన తరువాత మనదేశ పరిపాలన విషయంలో వారు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారు. మనదేశమంతా ఒకేరకమైన పరిపాలనా పద్ధతులను ప్రవేశపెట్టారు. క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా ప్రవర్తించే ఉద్యోగ సిబ్బందిని ఏర్పరిచారు. క్రమేపి భారతీయులకు ఉన్నత ఉద్యోగాలలో ప్రవేశించే అవకాశాలు కల్పించారు. ఆదాయ వ్యయాలను క్రమబద్ధీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కేటాయించారు. స్థానిక సంస్థలను పునరుద్ధరించి క్రమేపి వానిలో స్వపరిపాలన నెలకొల్పారు. క్షామ నివారణకు అనేక చర్యలు పరిపాలనా పరంగా తీసుకున్నారు. పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రాలను బోధించే విద్యాసంస్థలను నెలకొల్పారు. అలాగే వారు తమ దేశంలో ఉన్న న్యాయపాలనా పద్ధతులను మనదేశంలో ప్రవేశపెట్టి జిల్లా కోర్టుల నుండి సుప్రీంకోర్టు వరకు న్యాయస్థానాలను ఏర్పరిచారు. అలాగే భారతీయ సిపాయిలు, ఆంగ్ల సైనికులతో ఒక పటిష్టమైన సైన్యాన్ని దేశరక్షణకు రూపొందించారు. బ్రిటీష్ వారి పరిపాలన అంతరించినాక ఈ వివిధ పరిపాలనా వ్యవస్థలు మన స్వతంత్ర భారతదేశానికి వారసత్వంగా సంక్రమించినవి.

## 25.2 ప్రభుత్వోద్యోగ వ్యవస్థ :

తూర్పు ఇండియా వర్తక సంఘం భారతదేశాన్ని జయించిన పిదప ఇక్కడ పరిపాలనా వ్యవస్థను ఏర్పరచవలసి వచ్చింది. పరిపాలనా యంత్రాంగంలో ఉద్యోగులు ముఖ్యులు. కంపెనీవారు ఆదిలో భారతీయులను నమ్మక వారి వర్త సంఘంలో పనిచేసే ఆంగ్లేయులనే ఉద్యోగాలలో నియమించారు. కాని వారు తమ స్వంత వ్యాపారాన్ని చూసుకుంటూ పరిపాలనను నిర్లక్ష్యం చేశారు.

అంతేకాక వారిలో లంచగొండితనం పెరిగినది. ఒకదశలో కంపెనీ పరిపాలనకు డబ్బుచాలక ఆంగ్ల ప్రభుత్వాన్ని ఋణం అడిగింది. బ్రిటీష్ ప్రభుత్వం పటిష్టమైన ప్రభుత్వ యంత్రాంగపు ఆవశ్యకతను గుర్తించి, పార్లమెంటు ద్వారా ఛార్టర్ చట్టాలను చేసింది. తొలిరోజులలో కంపెనీ ఉద్యోగులు రైటర్లు, గుమస్తాలు, జూనియర్, సీనియర్ వర్తకులుగా విభజింపబడి ఉండేవారు. దివానీ అధికారం పొందినప్పటి నుండి క్లైవు ఆంగ్ల ఉద్యోగులలో లంచగొండితనాన్ని, ప్రైవేటు వ్యాపారాన్ని నిషేధించటానికి ప్రయత్నించాడు. అటువంటి సిబ్బందితో కంపెనీ ఒడంబడిక చేసుకోవటం వల్ల వారిని ఒడంబడిక సిబ్బంది (covenated civil service) అని వ్యవహరించేవారు.

## 25.2.1 కారన్ వాలిస్, వెల్లస్లీ, బెంటింక్‌లు :

కారన్ వాలీస్‌కు భారతీయులపై సదభిప్రాయం లేదు. అందువల్ల 'ఆంగ్లీకరణ' విధానాన్ని అంటే అన్ని ఉన్నత ఉద్యోగాల్లో ఆంగ్లేయులనే నియమించే విధానాన్ని అనుసరించాడు. దీనివల్ల ప్రభుత్వ వ్యయం పెరిగింది. అతడు కంపెనీ ఉద్యోగుల ప్రైవేటు వ్యాపారాన్ని నిషేధించి వారి జీతాలను పెంచెను. ఏడాదికి 500 పౌండ్ల జీతం మించిన ఉద్యోగాలను భారతదేశంలో కనీసం 3 సంవత్సరాలైనా పనిచేసిన ఒడంబడిక సిబ్బందికి మాత్రమే ఇవ్వవలెనని నిర్దేశించినాడు. దీనివల్ల కొంతవరకూ కంపెనీ ఉద్యోగుల్లో సమర్థత మెరుగైనది. వెల్లస్లీ ప్రభువు ఇండియాలోని ఇంగ్లీషు ఉద్యోగులకు దేశభాషలలోను, ఆచార వ్యవహారాలలోను, శిక్షణ నిచ్చుటకు కలకత్తాలోని ఫోర్ట్ విలియం కాలేజీని స్థాపించాడు. కంపెనీ అధికారులు ఈ కాలేజీని 1802లో రద్దుచేసిరి. కాని ఇంగ్లండ్‌లో ఈస్ట్ ఇండియా కాలేజీని 'హైలీబరి'లో స్థాపించిరి. బెంటింగ్ కాలంలో ఆంగ్లీకరణ విధానానికి స్వస్తి చెప్పిరి. 1833 ఛార్టర్ చట్టం ద్వారా కుల మత వర్ణ, జాతి విచక్షణ లేకుండా ప్రభుత్వోద్యోగుల్లో భారతీయులను నియమించటం జరుగుతుందని ప్రకటించారు. ఉదార భావాలు కల అప్పటి గవర్నర్ జనరల్ బెంటింగ్ వెంటనే అధిక సంఖ్యలో భారతీయులను కంపెనీ ఉద్యోగాలలో నియమించాడు. అలాగే ఈ చట్టం హైలీబరీ కాలేజీలో కనీసం 2 సంవత్సరాలు శిక్షణ పొందిన వారిని మాత్రమే ఇండియాకు ఉద్యోగులుగా నియమించవలెనని నిర్ణయించింది. 1853 ఛార్టర్ చట్టము పోటీ ప్రవేశ పరీక్షల పద్ధతిని ప్రవేశపెట్టెను. ఈ పరీక్షల్లో పోటీ చేయుటకు బ్రిటీష్ సామ్రాజ్య ప్రజలందరకూ హక్కు లభించింది. మెకాలే అధ్యక్షత్వంలో ఏర్పరచిన సంఘం ఈ పోటీ పరీక్షల నిబంధనలను రూపొందించినది.

## 25.2.2. విక్టోరియా మహారాణి ప్రకటన :

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత విక్టోరియా మహారాణి తన ప్రకటనలో జాతి, మత, కుల విభేదాలు చూపక భారతీయులకు కూడ అర్హతను బట్టి ఉద్యోగాలిస్తామని చెప్పింది. దీనిని అమలులో పెట్టుటకు వేయబడిన సంఘము ఇంగ్లండులోను, భారతదేశములోను ఒకేసారి పోటీ పరీక్షలు నిర్వహించడము వల్ల భారతీయులకు అవకాశాలు పెరుగుతాయని సూచించడం జరిగింది. అయినా ఈ విషయంలో ఏమీ జరగలేదు. 1857 తిరుగుబాటుతో భారతీయులపై ఇంగ్లీషు వారికి నమ్మకం పోయింది. తిరుగుబాటుతో భారతీయులు ఎక్కువమంది ఎన్నిక కాకుండుటకు కొన్ని శాసనాలు జారీచేశారు. భారతదేశంలోని ఉద్యోగాలకు ఇంగ్లండులో పరీక్షలు జరిపి, భారతీయులు ఇంగ్లీషు వారితో పోటీపడటం దుర్లభమైన పనిగా చేసింది.

1861 చేసిన ఇండియన్ సివిల్ సర్వీస్ చట్టాన్ని అనుసరించి పోటీ పరీక్షల వయో పరిమితిని 23 నుండి 22 సంవత్సరాలకు తగ్గించింది. 1866లో దీనిని 21కి, 1878లో 19కి తగ్గించడం జరిగింది. దీనితో భారతీయులు పోటీ పరీక్షలలో నెగ్గటం అసాధ్యమైపోయినది. 1870 వరకు ఈ పోటీ పరీక్షలలో ఒకే ఒక భారతీయుడు సత్యేంద్రనాథ్ ఠాగూర్ ఉత్తీర్ణుడు కావడం జరిగింది. అందువల్ల ఈ సంవత్సరము ప్రభుత్వం ఒక మార్పు చేసింది. ముఖ్యమైన సివిల్ ఉద్యోగాలకు పోటీ పరీక్షలతో నిమిత్తము లేకుండా భారతీయులను ఉన్న ఖాళీలలో ఆరవ వంతుకు నియమించే అధికారాన్ని గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు.

### 25.2.3 అట్చిసన్ కమీషను :

1886లో భారతీయులు పోటీపరీక్షలను ఇంగ్లండులోను, భారతదేశంలోను ఒకేసారి నిర్వహించవలసినదిగా గవర్నర్ జనరల్ డఫ్రిన్‌కు అర్జీ చేయగా, అతడు అట్చిన్‌సన్ అధ్యక్షత్వాన ఒక సంఘాన్ని నియమించాడు. ఆ సంఘం తన నివేదికలో భారతదేశంలో కూడ పోటీ పరీక్షలను నిర్వహించడాన్ని వ్యతిరేకించింది. అయితే వయో పరిమితిని 23 సంవత్సరాలకు పెంచాలని సూచించింది. అంతేకాక ఒడంబడిక (covenanted) సిబ్బంది, ఒడంబడిక లేని సిబ్బంది అనుమాటలను రద్దుచేసి, ప్రభుత్వ ఉద్యోగాలను మూడు శ్రేణులుగ విభజించాలని సూచించింది.

1. ఇంపీరియల్ - చక్రవర్తికి బాధ్యులుగా ఉండే ప్రభుత్వ ఉద్యోగాలు
2. ప్రావిన్సియల్ - రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు
3. సబార్డినేట్ - అధీన ఉద్యోగాలు

ఇందులో అనేక ప్రభుత్వోద్యోగాలలో ఉన్నతోద్యోగాలు పూర్వంవలెనే ఇంగ్లండులో జరిగే పోటీ పరీక్షలలో నెగ్గినవారికి కేటాయించారు. మిగిలిన వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించే ఏర్పాటయింది. ఆ ఉద్యోగాలలో కొంత నిష్పత్తికి తక్కువ ఉద్యోగులకు పదోన్నతి ద్వారా వచ్చేటట్లు ఏర్పాటయినది. బ్రిటీష్ పార్లమెంటు ఈ నివేదికను ఆమోదించింది. వెంటనే రాష్ట్రాలలో పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లు ఏర్పాటయినవి.

### 25.2.4 ఇస్లింగ్టన్ సంఘం :

1912లో నియమింపబడ్డ ఇస్లింగ్టన్ సంఘం ఇంగ్లండు భారతదేశాలలో ఒకేసారి పోటీ పరీక్షలు జరపాలని సూచించగా, ప్రభుత్వం దానిని ఆమోదించలేదు. పోటీ పరీక్షల్లో నెగ్గి ఉన్నత పదవులలోకి భారతీయులు రావటంవల్ల ఆంగ్ల ప్రభుత్వం బలహీనపడుతుందని వారు భావించారు. అలాగే అల్పసంఖ్యాక వర్గాలకు కూడా అది అనర్థమని భావించినారు.

### 22.2.5 మాంటేంగ్, ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు :

ప్రథమ ప్రపంచ సంగ్రామంలో బ్రిటీష్‌వారికి సహాయపడిన భారతీయులకు ఉద్యోగావకాశాలు కల్పించవలెననే దృష్టితో మాంటేంగు, ఛేమ్స్‌ఫర్డ్ సంఘం కొన్ని సిఫార్సులు చేసింది.

1) ఉన్నత ఉద్యోగాలలో 33% భారతీయులకు చెందాలని, ఆ సంఖ్య ఏటా 1 1/2 పెరగాలని నిర్ణయించారు.
2) ఉద్యోగుల నియామకంలో భారతీయులు, ఆంగ్లేయులనే జాతి విచక్షణ చూపరాదు.

1919 భారత ప్రభుత్వ చట్టం ద్వారా ఈ సంస్కరణలు అమలులో పెట్టబడ్డాయి. 1919 చట్టం ప్రకారం రాష్ట్రాల్లో ద్వంద్వ ప్రభుత్వ విధానం ఏర్పడినది. ఉన్నత ప్రభుత్వ ఉద్యోగులు గవర్నర్ల ఆధీనంలో ఉండేవారు. వారు శాసనసభాధీన శాఖలను నిర్వహించే భారతీయ మంత్రులను నిర్లక్ష్యం చేసేవారు.

### 25.2.6 'లీ' సంఘము 1923 :

1923లో నియమించబడిన 'లీ' సంఘము రిజర్వుడు శాఖలకు చెందిన అఖిల భారత సర్వీసులు - ఇండియన్ సివిల్ సర్వీస్(ICS), పోలీసు శాఖ, అటవీశాఖ, నీటిపారుదల శాఖల ఉన్నతోద్యోగుల నియామకం పోటీ పరీక్షల తర్వాత రాజ్య కార్యదర్శి చేయగలడని, ఇతర రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులను (Transferred శాఖలు) - విద్యాశాఖ, వ్యవసాయశాఖ, రోడ్లు, భవనాల శాఖ మొదలయిన శాఖల ఉన్నతోద్యోగులను పోటీ పరీక్షల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలే నియమించాలని, 20% ఉద్యోగులకు ప్రమోషన్

కల్పించాలని, ఇండియన్ సివిల్ సర్వీస్‌లో 60% ఉద్యోగాలు భారతీయులకు కేటాయించాలనీ, భారతదేశానికి పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఏర్పాటు చేయాలనీ సూచించినది.

## 25.2.7 1935 చట్టము :

1935 భారత ప్రభుత్వ చట్టంలో సివిల్ సర్వీస్ ఉద్యోగులకు రక్షణలు కల్పించబడినవి. ఏ సివిల్ ఉద్యోగి అతడి కంటే తక్కువ ఉద్యోగిని తొలగించే వీలులేదు. కేంద్రంలో ఫెడరల్ పబ్లిక్ కమీషన్‌ను, ప్రతిరాష్ట్రంలో రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమీషన్‌ను నియమించబడతాయి. ఆయా పరిధిలోని ఉద్యోగుల నియామకాలను ఈ కమీషన్‌లు చేస్తాయి. ఉద్యోగులు జీతభత్యాలను తగ్గించరాదు. ఈ చట్టం ద్వారా అల్ప సంఖ్యాకులకు ఉన్నత ఉద్యోగాలలో కొంత శాతం మేరకు ఉద్యోగాలు కేటాయించాలని నిర్ణయించారు. మహమ్మదీయులు, ఆంగ్లో ఇండియన్‌లు ఇందువల్ల లబ్ధిపొందారు.

బ్రిటీష్ వారి కాలంలో ఉన్నత ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలోని ముఖ్యలోపం ఏమనగా భారతీయులను ఉన్నత ఉద్యోగాలకు దూరంగా ఉంచటం జరిగింది. అన్ని కీలకమైన పదవులలో ఆంగ్లేయులను నియమించటం జరిగినది. ఆంగ్లేయులు పదవీ విరమణానంతరం స్వదేశానికి వెళ్ళటంలో వారి పరిపాలనా అనుభవాన్ని దేశం కోల్పోయేది. మొత్తం మీద ICS యాంత్రికంగా తయారై ప్రజల ఆశలకు దూరమైనది.

## 25.3 ఆదాయ - వ్యయాలు :

తూర్పు ఇండియా కంపెనీ భారతదేశాన్ని జయించినాక వ్యాపారంతో పాటు ప్రభుత్వాన్ని కూడా నిర్వహించవలసి వచ్చింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని నడపడానికి ఆదాయం కావాలి. ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించాలి. ఆదాయ వ్యయాలు రెంటినీ ప్రభుత్వం చూసుకోవలెను. కొన్ని సందర్భాలలో వ్యయం రాబడిని మించితే ఋణం చేయవలసి ఉంటుంది. ద్రవ్యాన్ని ముద్రించే బాధ్యత కూడా ప్రభుత్వానిదే.

## 25.3.1 ఛార్టర్ చట్టాలు :

1833 వరకూ బెంగాల్, మద్రాస్, బొంబాయి ప్రెసిడెన్సీలు ఆర్థికంగా ప్రత్యేక ప్రతిపత్తి కలిగి ఉండేవి. ఎన్నో లాభసాటి పన్నులు ప్రజల నుండి వసూలు చేసేవారు. కొన్ని సమయాల్లో అవి ఋణగ్రస్తమై కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని అర్థిస్తుండేవి. 1833 ఛార్టర్ చట్టం రాష్ట్రాల వ్యయంపై కేంద్రానికి పర్యవేక్షణాధికారం ఇచ్చినది. రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవటంతో దుబారా చేస్తూ బాధ్యతా రహితంగా వ్యవహరించసాగినాయి. ఈ విధంగా కేంద్రం ఆధిపత్యం 1871 వరకూ సాగింది. అయితే ఆర్థిక వికేంద్రీకరణ ఆవశ్యకతను గుర్తించి 1869లో ఒక చట్టం ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ప్రతి సంవత్సర ఆరంభంలో రాష్ట్రాలు ఆ సంవత్సరపు వ్యయపట్టికను తయారుచేసి కేంద్రానికి పంపవలెను. కేంద్రం తగు మార్పులు చేసి ఆయా రాష్ట్రాలకు ధనాన్ని కేటాయిస్తుంది.

## 25.3.2 మేయో తీర్మానము :

1867లో 'సర్ రిచర్డ్ స్ట్రాచీ' తయారుచేసిన పథకం ఆధారంగా అప్పటి గవర్నర్ జనరల్ 'మేయో' ప్రభువు ప్రభుత్వ ఆర్థిక వికేంద్రీకరణను అమలులో పెట్టాడు. దీనిప్రకారం పోలీసు, విద్య, రిజిస్ట్రేషన్, వైద్యం, జైళ్ళు, రోడ్లు మొదలయిన శాఖలు పూర్తిగా రాష్ట్రాలకు కేటాయించటమైనది. వాటి వల్ల వచ్చే ఆదాయము రాష్ట్రాలకే చెందుతుంది. అవసరమైతే రాష్ట్రాలు వీటినిర్వహణ నిమిత్తం కొత్త పన్నులు విధించవచ్చు. పైగా ఏటా కొంత మొత్తాన్ని రాష్ట్రాలు కేంద్రం నుండి గ్రాంటుగా పొందుతాయి. దీనిలోని లోపమేమంటే కేంద్రం రాష్ట్రాలకు ఎంత గ్రాంటుగా ఇస్తుందనేది రాష్ట్రాలకు తెలిసేది కాదు. అందువల్ల రాష్ట్రాలు వానికి అవసరమైన దానికంటే ఎక్కువ ధనాన్ని కోరేవి. నోరుగల రాష్ట్రాలు ఎక్కువ నిధులు పొందేవి. కేంద్రం కూడా కొన్నిసార్లు పక్షపాత ధోరణి వహించేది.

అందుచే రాష్ట్రాలు ప్రజలపై ఎక్కువ పన్నులు విధిస్తుండేవి. కొన్ని రాష్ట్రాలలో ఉప్పుపై కూడా పన్ను విధించారు. మొత్తంమీద ధనిక, బీద వ్యత్యాసం లేకుండా అందరూ పన్నుల భారానికి గురి అవుతుండేవారు.

### 25.3.3. లిట్టన్, రిప్పన్ :

1877లో లిట్టన్ ప్రభువు ఎక్కువ ఆదాయం వచ్చే శాఖలను రాష్ట్రాలకు కేటాయిస్తే అవి బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తాయని భావించి, భూమిశిస్తు, అబ్కారీ, స్టాంపులు, సాధారణ పరిపాలన, న్యాయశాఖలు రాష్ట్రాలకు కేటాయించినాడు. వానివల్ల లభించే ఆదాయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా పంచుకోవటం జరుగుతుంది. 1879లో రిప్పన్ ప్రభువు కాలంలో ప్రభుత్వ ఆదాయాన్ని 3 భాగాలుగా విభజించినారు. అవి 1) కేంద్ర ప్రభుత్వ ఆదాయం 2) రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం 3) ఉమ్మడి ఆదాయం. నల్లమందు, ఎగుమతి, దిగుమతి సుంకాలు, వర్తక శాఖలపై వచ్చే ఆదాయం కేంద్రానికి చెందుతుంది. రాష్ట్రాలకు స్టాంపులు, అడవులు, అబ్కారీ, రిజిస్ట్రేషన్, భూమిశిస్తులో కొంతభాగం కేటాయించారు. రాబడిపన్ను ఆదాయం కేంద్రం, రాష్ట్రాల మధ్య ఉమ్మడిగా పంచుకునేటట్లు నిర్ణయించారు. కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంటును రద్దుచేశారు. ఈ విధానాన్ని 5 సంవత్సరములకు ఒకసారి పునః పరిశీలన జరిపే ఏర్పాటు చేశారు. 1887, 92, 97 లలో ఇలా పునః పరిశీలన జరిపారు. కర్జన్ ప్రభువు పోలీసు, ఆరోగ్యం, విద్య మొదలగు ముఖ్య శాఖలకు కేంద్రం, రాష్ట్రాలకు గ్రాంటును ఇచ్చే ఏర్పాటు చేశాడు. 1907లో నియమింపబడ్డ హాబ్ హౌస్ సంఘం సూచనల మేరకు రాష్ట్రాలకు నిధులు ఇచ్చే విషయంలో గవర్నర్ జనరల్ జోక్యం ఉండరాదనీ, రాష్ట్రాల అవసరాలు దృష్టిలో ఉంచుకొని గ్రాంట్ల పంపిణీ జరగాలని సూచించింది.

### 25.3.4 1919 సంస్కరణలు :

1919 మాంటేంగు ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలో 3 ఆదాయ విభాగలలో ఉమ్మడి ఆదాయ పద్ధతి రద్దు అయినది. దీనిప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆదాయశాఖలు 47గాను, (నల్లమందు, ఉప్పు దిగుమతి సుంకాలు, రైళ్ళు, రాబడిపన్ను మొదలగునవి) రాష్ట్ర ప్రభుత్వ ఆదాయశాఖలను 52 గాను (భూమిశిస్తు, స్టాంపులు, రిజిస్ట్రేషన్, అబ్కారీ మొదలగునవి) గుర్తించబడినవి. కాని ఈ విధానంవల్ల కొన్నిసార్లు రాష్ట్రాలకు, కొన్నిదఫాలు కేంద్రానికి నష్టం వాటిల్లినది. ఉమ్మడి ఆదాయపన్ను రద్దువల్ల భూమిశిస్తు, స్టాంపులు రాష్ట్రాలకు కేటాయించటం వల్ల కేంద్రానికి రాబడి కంటే వ్యయం పెరిగింది. అతిపెద్ద నగరాలలో వసూలు అయ్యే రాబడిపన్నులో రాష్ట్రాలకు భాగం లేక నష్టపోయేవి.

### 25.3.5 మెస్టన్ సంఘము :

1920లో ఏర్పడిన 'మెస్టన్' సంఘము కొన్ని సూచనలు చేసినది. మద్రాసు, పంజాబు, సంయుక్త రాష్ట్రాలకు వ్యవసాయం వల్ల వచ్చే ఆదాయంలో కొంతభాగం కేంద్రానికి ఇవ్వాలి. అలాగే కేంద్రానికి అధిక ఆదాయం వచ్చే శాఖల నుండి రాష్ట్రాలకు గ్రాంటులు ఇవ్వవలెనని సూచించటమైనది. ఇందుకు రెండు ప్రభుత్వాలు అసంతృప్తి వెలిబుచ్చాయి.

### 25.3.6 1935 భారత రాజ్యాంగ చట్టము :

ఈ చట్టం రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని కల్పించినది. తిరిగి పూర్వంవలెనే కేంద్రానికి కొన్ని శాఖలు, రాష్ట్రాలకు కొన్ని శాఖలు కేటాయించి ఉమ్మడిగా కొన్నింటిని కేటాయించినారు. ఎవరి జాబితాలోని ఆదాయం వారే పొందుతారు. వాటికి సంబంధించిన శాసనాలు ఆయా ప్రభుత్వాలే చేస్తాయి. ఉమ్మడి జాబితా విషయాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ, చట్టాలను రూపొందించే వీలు కల్పించారు. అయితే రాష్ట్రఆర్థిక విషయాలపై కేంద్రం చాల ఆంక్షలు కొనసాగించినది. రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు విధించే అధికారంపై హద్దులు విధించినది.

## 25.4 స్థానిక సంస్థలు :

మనదేశంలో అనాదిగా గ్రామీణ స్వయంపరిపాలన ఉన్నది. ప్రాచీన మధ్యయుగాల కాలంలో మన గ్రామాలు స్వయం పాలితాలు, స్వయం పోషకాలుగాను ఉండేవి. రాజులు మారినా, యుద్ధాలు వచ్చినా, విదేశీ దండయాత్రలు జరిగినా ఈ గ్రామీణ స్వయం పాలక వ్యవస్థ ఎట్టిమార్పులు లేకుండ బ్రిటీష్ వారిపాలన ఏర్పడేవరకూ కొనసాగింది. మన భారతీయ సంస్కృతి నిలవడానికి గ్రామాలలోని ఈ స్వయం పాలక వ్యవస్థే కారణం. గ్రామరక్షణ, న్యాయ విచారణ, నేరస్థుల శిక్షణ, భూమిశిస్తు వసూలు చేయడం, కాలువలు తవ్వటం, దేవాలయములు, సత్రాలు, చెరువులు నిర్వహించటం, విద్యా సౌకర్యాల కల్పన మొదలగు బాధ్యతలన్నీ ఈ గ్రామపంచాయితీలే వహించేవి. చోళుల కాలానికి ఈ గ్రామీణ స్వయం పాలనా వ్యవస్థ ఉచ్ఛదశకు వచ్చినది. మొగల్ సామ్రాజ్యకాలం నుండి గ్రామాలు క్రమేపీ తమ స్వయం పాలక లక్షణాలను కోల్పోసాగినాయి. అవి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడసాగాయి. మనదేశంలో బ్రిటీష్ పాలన నెలకొన్న తరువాత ఈ గ్రామీణ స్వపరిపాలనా వ్యవస్థ కుప్పకూలిపోయింది.

ఆంగ్లేయులు చాలాకాలం వరకు గ్రామాల విషయాలు అంతగా పట్టించుకోలేదు. పెద్దపట్టణాలైన మద్రాసు, బొంబాయి, కలకత్తాలకు మాత్రమే పురపాలక సంఘాల ద్వారా ప్రజాపరిపాలనా అవకాశాలు కల్పించారు. మొదట్లో ఆంగ్లేయులకు, పరిపాలనా వికేంద్రీకరణ గాని, భారతీయులకు స్వయంపాలనా అవకాశాలు కల్పించటం గాని పెద్దగా ఇష్టంలేదు. అయితే పెరిగిపోతున్న పాలనా భారం వల్ల వివిధ ప్రాంతాల ప్రత్యేక అవసరాలను, భాషా సమస్య వలన, భారతీయులలో పెరుగుతున్న స్వయంపాలనా కాంక్షను కొంతైనా తీర్చుటకు ఆంగ్లేయులు 19వ శతాబ్దపు రెండవ భాగం నుండి మనదేశంలో స్థానిక స్వపరిపాలనా సంస్థల ద్వారా స్వపరిపాలనా అవకాశాలను కల్పించారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యక్ష అజమాయిషీ లేక స్థానిక సమస్యలను, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రధానంగా స్థానికుల సహకారంతో తమ ప్రాంతాలను తామే పాలించుకునే విధానాన్ని స్థానిక స్వపరిపాలన అంటారు.

ఆంగ్లేయుల పాలనలో ప్రెసిడెన్సీ పట్టణాలలో పురపాలక సంఘాల ఏర్పాటుతో స్థానిక స్వపరిపాలనకు నాంది ఏర్పడినది. 1687 లోనే మద్రాసులో పురపాలక సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1773 రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం కలకత్తా నగరంలోని పారిశుద్ధ బాధ్యతలను స్థానిక అధికారులకు అప్పగించారు. 1817 - 30 సంవత్సరాల మధ్యకాలంలో ఈ విధమైన పాలనను మరింత విస్తరించి నగర మెజిస్ట్రేట్‌లు ఉన్నత పోలీసు అధికారులు కూడా నగరం విషయంలో కొంత బాధ్యత వహించారు. 1840 - 1845 సంవత్సరాల నాటికి ఆంగ్లేయుల పాలనలోఉన్న పట్టణాలలోని ఉద్యోగులకు స్థానికంగా పన్నులు వేసి వసూలుచేసే అధికారం కూడా ఇవ్వటమైనది. 1855 నుండి నగర పాలక సంస్థలకు ప్రభుత్వం కమీషనర్‌లను ప్రజారోగ్య అధికారులను నియమించుటేకాక పట్టణ పాలనకై ఎన్నికైన కొంతమంది సభ్యులతోను, నామినేట్ చేయబడిన సభ్యులతోను సంఘాలను ఏర్పాటు చేసింది.

1857 సిపాయిల తిరుగుబాటు వల్ల ఆర్థికంగా బాగా నష్టపోయిన ఆంగ్ల ప్రభుత్వం విద్య, రవాణా విషయాలలో ప్రజల అవసరాలు తీర్చలేకపోయింది. నాటి వైస్రాయ్ సంఘ సభ్యుడైన 'శామ్యూల్ లెంగ్' చిన్న చిన్న విషయాలకు స్థానిక ప్రభుత్వాలను బాధ్యులనుచేసి అందుకు కావలసిన డబ్బును స్థానికుల నుండి పన్నుల ద్వారా వసూలు చేసుకోనిస్తే ప్రజలు అందుకు సంతోషంగా అంగీకరిస్తారు అని సూచించాడు.

### 25.4.1 మేయో ప్రభువు తీర్మానం :

మేయో ప్రభువు తన ఆర్థిక వికేంద్రీకరణ విధానంలో భాగంగా తన ఆర్థిక సంస్థల స్థాపనను ప్రోత్సహించినాడు. ప్రజలు తమ గ్రామాలు లేదా పట్టణాల అభివృద్ధికి అవసరమైన డబ్బును పన్నుల ద్వారా సేకరించి దానిని సక్రమంగా వినియోగించేందుకు

ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో పనిచేసే స్థానిక సంస్థలను నెలకొల్పాలని మేయో భావించాడు. 1870లో రాష్ట్రాల ఆర్థిక స్థితిని గురించి ఆయన కార్య నిర్వహణ మండలి ఆమోదించిన తీర్మానంలో ఈ ఆశయాన్ని పొందుపరిచాడు. ఈ తీర్మానాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు పురపాలక సంఘ చట్టాలు ప్రవేశపెట్టి అనేక పట్టణాలలో పురపాలక సంఘాలను స్థాపించినవి. అయితే గ్రామాలలో ఎటువంటి స్థానిక సంస్థలు ఏర్పడలేదు.

## 25.4.2 రిప్పన్ :

స్థానిక ప్రభుత్వంలో ముఖ్యమైన మార్పులను రిప్పన్ ప్రభువు ప్రవేశపెట్టినాడు. అందుకే అతనిని స్థానిక స్వపరిపాలనా సంస్థల పిత (Father of Local Self Government) అని అంటారు. అప్పటికే దేశంలో విద్యావంతులు ప్రభుత్వంలో తమకు భాగం కావలెనని పోరసాగారు. లిబరల్ పార్టీకి చెందిన రిప్పన్ ప్రభువు ఉదారుడు, విశాల భావాలు కలవాడు. అతడు భారతీయులకు స్థానిక ప్రభుత్వాలలో పాల్గొని క్రమేపీ పై స్థాయిలకు పోవటం మంచిదని భావించాడు. ప్రజలలో రాజకీయ చైతన్యం, పరిపాలనా అనుభవం పెంపొందించే వ్యవస్థలుగా స్థానిక సంస్థలను దేశమంతా స్థాపించాలని భావించాడు. ఈ లక్ష్యసాధనకై రిప్పన్ ప్రభుత్వం 1881-82లో రెండు స్థానిక సంస్థల తీర్మానాలను ఆమోదించింది. ఈ తీర్మానాలు పట్టణాలలో పురపాలక సంఘాలను, గ్రామీణ ప్రాంతాలలో గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు స్థానిక సంస్థలను ఏర్పాటు చేయవలెనని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ స్థానిక సంస్థల నిర్వహణలో ప్రజలచే ఎన్నికయిన అనధికారులు ఎక్కువ సంఖ్యలో ఉండవలెనని స్థానిక సంస్థల కార్యకలాపాలపై ప్రభుత్వాధికారి పర్యవేక్షణ వీలయినంత తక్కువగా ఉండవలెనని వీని అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వాలు ధనసహాయం చేయవలెనని ఆదేశించటమైనది. ఈ ఆదేశాల ననుసరించి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో స్థానిక సంస్థలను ఏర్పరచుటకు తగిన చర్యలు తీసుకున్నవి. ఫలితంగా దేశమంతటా పురపాలక సంఘాలు, జిల్లా బోర్డులు, తాలూకా బోర్డులు వెలిసినవి.

పురపాలక సంఘంలోని సభ్యులను ప్రజలే ఎన్నుకోవాలి. పురపాలక సంఘం యాజమాన్యం ఎన్నికైన అధ్యక్షుడు వహించవలెను. ఈ సంఘాలలో అధికార సభ్యులు 3వ వంతుకు మించరాదు. పురపాలక సంఘాలు విద్య, పారిశుద్ధ్యం, దీపాలు, రోడ్లు, మంచినీటి సరఫరా మొదలగు పబ్లిక్ సేవలను అందించవలెను. వీటి నిర్వహణకు అయ్యే వ్యయాన్ని ప్రజలే పన్నుల ద్వారా భరించవలెను. రిప్పన్ తీర్మానం 1884 - 85 మధ్య కార్యరూపం దాల్చింది. రాష్ట్ర ప్రభుత్వాలు దాని ననుసరించి స్థానిక స్వపరిపాలన శాసనాలు చేసినవి. జిల్లా స్థాయిలో జిల్లా బోర్డులు, తాలూకాలో తాలూకా బోర్డులు, గ్రామ సముదాయాలలో పంచాయతీలు ఏర్పడినాయి. ఈ సంస్థలు విద్య, ఆరోగ్యం, శుభ్రత, వీధిదీపాలు, రోడ్లు, వంతెనలు, మంచినీటి సరఫరా వంటి బాధ్యతలను తామే చేపట్టి అందుకు అవసరమైన ధనాన్ని పన్నుల ద్వారా ప్రజల నుండి వసూలుచేసి ఖర్చు పెట్టేవారు. వారు విధించిన పన్నులలో ముఖ్యమైనవి - ఇంటిపన్ను, వృత్తిపన్ను, ఆక్ట్రాయ్, వాహనాలపై పన్నులు ఈ విధంగా రిప్పన్ ప్రవేశపెట్టిన స్థానిక స్వపరిపాలనా సంస్థలు ప్రజలకు రాజకీయ విద్య, స్వయంపాలనా శిక్షణాలయాలుగా ఉపయోగపడేవి. ప్రథమదశలో ఈ సంస్థలు కొన్ని ఇక్కట్లకు గురైనా కాలక్రమేణా ప్రజలు వాటిని సక్రమంగా నడుపుకోగలరని రిప్పన్ వాదించినాడు. మనదేశ ప్రజలపై ఆయనకున్న అచంచల విశ్వాసం అట్టిది.

## 25.4.3 1909 రాయల్ కమీషన్ :

అప్పటి స్థానిక సంస్థల పనితీరును పరిశీలించి చేయవలసిన మార్పులను సూచించుటకు 1909లో రాయల్ కమీషన్ నియమించబడినది. ఈ సంఘం పరిశీలన జరిపి తగినన్ని నిధులు లేకపోవటం వల్లనే స్థానిక సంస్థలు సమర్థవంతంగా పనిచేయలేకపోతున్నాయని ఈ సంఘం అభిప్రాయపడినది. స్థానిక సంస్థలపై ప్రభుత్వపు అదుపు సడలించాలని వాటికి తగిన ఆదాయ వనరులుండాలని సూచించినది. మున్సిపాలిటీలకు ప్రాథమిక విద్యమాత్రమే అప్పగించి, సెకండరీ విద్య, పోలీస్, కరువు నివారణ, వైద్యం మొదలైన వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని ఈ సంఘం సూచించినది. ఈ సూచనలను అమలులో పెట్టే మొదటి ప్రపంచ యుద్ధం ఆరంభం కావటంతో స్థానిక పాలనలో కొత్త మార్పులేవీ చోటుచేసుకోలేదు.

### 25.4.4. 1917 తీర్మానం :

భారత వ్యవహారాల కార్యదర్శి మాంటెంగ్ 1917 ఆగస్టు నెలలో భారతదేశంలో ఆంగ్లేయుల పాలన ధ్యేయం భారతీయులకు బాధ్యతాయుత పాలన అవకాశం కల్పించుటయే అని ప్రకటించినాడు. వీలయినంత వరకు స్థానిక సంస్థలలో ప్రజా ప్రతినిధులకు స్వయంపాలనకు అవకాశం ఇవ్వవలెనని, ఉద్యోగస్తుల అధికారాలు తగ్గించవలెనని, ఎక్కువమందికి ఓటుహక్కు ఇవ్వవలెననీ పురపాలక సంఘం అధ్యక్షుడు ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదనీ నిర్ణయించాడు.

### 25.4.5 1919 ద్వంద్వ ప్రభుత్వంలో స్థానిక పరిపాలన :

1919 సంస్కరణలలో స్థానిక స్వపరిపాలన రాష్ట్ర మంత్రుల నియంత్రణలోకి వచ్చినది శాసనసభలో ప్రతిరాష్ట్రంలోను స్థానిక స్వపరిపాలనకై శాసనాలు చేసినారు. ఓటర్ల సంఖ్య పెంచబడ్డది. స్థానిక పాలన స్థానిక సంస్థలకే ఇవ్వబడినది. కలకత్తా, బొంబాయి, మద్రాసు నగరాలలో కార్పొరేషన్‌లు ఏర్పాటైనాయి. వీటి అధ్యక్షులను మేయర్లని పిలిచారు. ప్రభుత్వం తరఫున కమీషనర్లు నియమితులైనారు. అంతేకాక పట్టణంలో పురపాలక సంఘాలు జిల్లాల్లో జిల్లా బోర్డులు గ్రామ సముదాయాలలో పంచాయితీలు కొనసాగాయి. 1919 నాటికి 778 పురపాలక సంఘాలు 217 జిల్లా బోర్డులు 584 తాలూకా బోర్డులు ఏర్పడినవి. వీటన్నిటిలో ఎన్నికైన సభ్యులకు మెజారిటి ఉండేది. రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సంఘాలలో తాత్కాలికంగా గాని, పూర్తిగా కాని రద్దు చేయుటకు అధికారం ఉంది.

1935 రాజ్యాంగ చట్టం ద్వారా ద్వంద్వ ప్రభుత్వ విధానం తొలగి రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి లభించినది. ఆర్థిక శాఖ కూడా భారతీయుల చేతికి రావటంలో స్థానిక సంస్థల అభివృద్ధి బాగా జరిగింది. మెజారిటి రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడి స్థానిక స్వపరిపాలనను సమర్థవంతంగా పనిచేయించుటకు ప్రయత్నించాయి.

### 25.5 క్షామ నివారణ :

అనాదిగా మనదేశంలో వ్యవసాయం ఋతుపవనాలపై ఆధారపడిన ఉత్పత్తి కార్యకలాపము. వర్షాలు సరిగా కురవనప్పుడు ప్రజలు తరచుగా క్షామాలకు గురవుతుండేవారు. మరికొన్ని సంవత్సరాలలో వర్షాలు అధికమై వరదలు సంభవించి పంటలు నాశనమయ్యేవి. మొగలాయిల కాలంలో కూడా ఈ క్షామాలవల్ల లక్షలాది మంది ప్రజలు చనిపోవటం, బానిసలు కావటం జరిగిందని మోర్‌లాండ్ వ్రాశాడు. ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో కూడా అనేకసార్లు క్షామ పరిస్థితులు ఏర్పడినవి. 1858 - 1947ల మధ్య కనీసం 20 క్షామాలు సంభవించెను. ఇట్టి ప్రకృతి వైపరీత్యాల కారణంగా లక్షలాది ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారు.

### 25.5.1 క్షామ కారణాలు :

బ్రిటీష్‌వారి పరిపాలనా కాలంలో క్షామాల సంఖ్య పెరిగిందనే అభిప్రాయం ఒకటి కలదు. అందుకు కారణాలేవనగా 1) ఆంగ్లేయులకు పూర్వం మనదేశంలో పండిన ధాన్యం ఇతర దేశానికి ఎగుమతి అయ్యేది కాదు. 2) ఆంగ్లేయుల పాలనా కాలంలో మనదేశ జనాభా బాగా పెరిగింది. దానికి తగినంతగా సేద్యపు భూవిస్తీర్ణం పెరగకపోవటం వల్ల ఆహార కొరత ఏర్పడింది. 3) బ్రిటీష్ ప్రభుత్వం భారతీయులను తమ పశువులను అడవులలో మేపుకోవటానికి అనుమతించకపోవటం వల్ల క్షామ కాలంలో పశునష్టం కూడ జరిగేది. 4) గ్రామీణ పరిశ్రమలు క్షీణించటంతో వ్యవసాయంపై ఒత్తిడి పెరిగింది. 5) బ్రిటీష్ వారి రాకకు పూర్వం స్వదేశీ ప్రభుత్వాలు తవ్వించిన కాలువలు, బావులు వీరి కాలంలో మరమ్మత్తుకు నోచుకోక నిరుపయోగమైనాయి. 6) ఆంగ్లేయులు వ్యవసాయంపై పన్ను భారాన్ని పెంచి, వానిని నిర్దయగా వసూలు చేయటంతో వ్యవసాయదారులు పేదరికంలో మ్రగ్గవలసి వచ్చింది. ఈ విధంగా క్షామ పరిస్థితులు ఏర్పడి ప్రజలు ఈతి బాధలకు గురయ్యేవారు. కరువు కాటకాలు ఏర్పడి లక్షలాది ప్రజలు ఆహారం లభించక మరణించారు.

వర్తకులు పండిన కొద్ది పంటను దాచివేసి ధరలను పెంచేవారు. ఫలితంగా ప్రజల భూములను, పశువులను తెగనమ్మి ప్రాణాలు చేతపట్టి దేశాలు పట్టిపోయేవారు. తల్లులు ఆకలి బాధలకు తాళలేక తమ బిడ్డలను అమ్మివేసేవారు. కొందరు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు.

### 25.5.2 క్షామాలు :

1860లో వాయువ్య రాష్ట్రంలో సంభవించిన కరువు వల్ల 76 వేల చదరపు కిలోమీటర్ల భూమి బీడుగా మారింది. 10 మిలియన్ల మంది ప్రజలు నష్టపోయారు. 1866లో ఒరిస్సా క్షామంలో 10 నుండి 20 లక్షల మంది ఆకలి బాధతోను, వ్యాధులతోను మరణించారు. 1976 - 78 మధ్య వరుసగా రెండు సంవత్సరాలు అనావృష్టి వల్ల బొంబాయి, హైదరాబాదు, మైసూరు, మద్రాసు, ఉత్తరప్రదేశ్‌లలో క్షామం ఏర్పడింది. ప్రభుత్వం క్షామ బాధితులను ఆదుకోవటానికి చర్యలు గైకొన్నప్పటికీ సుమారు 8 లక్షల మంది మృతి చెందారు. క్షామాలు ఏర్పడినప్పుడు వాటి నివారణ చర్యలు సూచించుటకు బ్రిటీష్ ప్రభుత్వం క్షామ నివారణ సంఘాలను నియమించినది.

### 25.5.3 మొదటి క్షామ నివారణ సంఘం (రిచర్డ్ స్ట్రాచీ) :

1878లో మొదటి క్షామ నివారణ సంఘం సర్ రిచర్డ్ స్ట్రాచీ అధ్యక్షతన 1876 - 78 కరువు అనంతరం నియమించబడింది. ఈ సంఘం పరిశీలనానంతరం సమర్పించిన నివేదికలోని ముఖ్య అంశాలు :

1) క్షామం నెలకొన్నప్పుడు పనిచేయగల వారికి ఉపాధి కల్పించవలెను. వృద్ధులకు, వికలాంగులకు ఆహార సదుపాయాలు కల్పించాలి.
2) చెరువుల, బావుల తవ్వకం, గట్లను ఏర్పరచటం వంటి కార్యక్రమాలు చేపట్టటం ద్వారా తాత్కాలిక ఉపాధి సౌకర్యాలను పెంచాలి.
3) ఆహార కొరత వల్ల ప్రజలు శారీరక దారుఢ్యాన్ని కోల్పోయేలోపు వారిని ఆదుకోవాలి.
4) క్షామ పీడితుల నుండి భూమిశిస్తును వసూలు చేయరాదు.
5) వ్యవసాయ ఉత్పాదకాలైన విత్తనాలు, ఎరువులు వంటివి సమకూర్చుకొనుటకు రైతులకు ఋణాలు ఇవ్వవలెను.
6) క్షామానికి గురైన ప్రాంతాలలో చిన్న చిన్న ప్రదేశాలలో ఒక్కొక్క ప్రభుత్వ ఉద్యోగిని నియమించి అతనికి స్థానికుల అవసరాలను తీర్చే బాధ్యతను అప్పగించవలెను.
7) వర్తకులు కొరతను సృష్టించి ధరలను పెంచకుండా వారిపై నియంత్రణ ఉంచవలెను.
8) క్షామ పరిస్థితులలో పశువులను పచ్చికగల ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయవలెను.
9) క్షామ నివారణ నిమిత్తం కేంద్రం క్షామనివారణ నిధిని ఏర్పాటుచేసి దానికి ఏటా 15 మి. రూపాయలు కేటాయించవలెను.
10) క్షామ నివారణకు ఒక ప్రణాళికను రూపొందించి అవసరమైనప్పుడు దానిని ఆచరించవలెను.

అప్పటినుండి ఎప్పుడు క్షామం వచ్చినా ప్రభుత్వం పై నియమావళిని ఆచరించ సాగింది. 1896 - 97, 1898 - 1900లో బీహార్, సంయుక్త రాష్ట్రాలు భయంకర కాటకం సంభవించి సుమారు 2 లక్షల కి.మీ. ప్రాంతంలో 3 1/2 కోట్ల మంది ప్రజలు క్షామానికి గురి అయినారు.

### 25.5.4 2వ క్షామ నివారణ సంఘం :

1898లో నియమించబడిన రెండవ క్షామ సంఘం సర్. జేమ్స్ లియాల్ ఆధ్వర్యంలో నియమించబడినది. ఇది తొలి సంఘపు

సూచనలను ఆమోదించటమేకాక, చేనేత పనివాం(డను, కొండజాతి (ప్రజలను కూడా క్షామనివారణ పథకం పరిధిలోకి తేవలెనని సూచించింది.

### 25.5.5 క్షామ నివారణ సంఘం :

సర్ ఆంథోని మెక్‌డోనెల్ అధ్యక్షతన ఏర్పాటయిన సంఘం కొన్ని కొత్త సూచనలు చేసినది. అవి :

1) కరువు నివారణకు స్థానిక కార్యక్రమాలకు ప్రాధాన్యత నివ్వవలెను.

2) వ్యవసాయ బ్యాంకులను నెలకొల్పవలె. అవి ఆధునిక ఉత్పత్తి పథకాలకు కావలసిన సహాయం చేయవలెను మరియు ఋణ సౌకర్యాలు కల్పించవలెను.

3) నీటిపారుదల సౌకర్యాలను కల్పించవలెను.

4) రైల్వేల ద్వారా కరువు ప్రాంతాలకు ఆహార పదార్థాలు, పశుగ్రాసం సరఫరా చేయవలెను.

ఈ నూతన ప్రణాళిక అమలులోకి వచ్చిన తరువాత పరిస్థితి మెరుగుపడింది. 1919లో మాంటేంగు ఛేమ్స్‌ఫర్డ్ చట్టం ప్రకారం ప్రతిరాష్ట్రం క్షామ నివారణ తన బాధ్యతగా గుర్తించి అందుకై కొంతధనం ఏటా క్షామ నివారణ నిధిగా ఏర్పరచేటట్లు సూచించింది. అట్టి క్షామ నిధులకు దాతల నుండి, స్వదేశీ సంస్థానాధీశుల నుండి, రాష్ట్ర ప్రభుత్వాలు విరాళాలు సేకరించేవి.

### 25.5.6 బెంగాల్ కరువు - 1943 :

అన్నిటికంటే అతి భయంకరమైన కరువు 1943లో బెంగాల్‌లో సంభవించినది. క్షామ విచారణ సంఘం అంచనా ప్రకారం 15 లక్షల మంది ఇందులో మరణించారు. అయితే 35 లక్షల మంది మరణించి ఉండవచ్చునని ఇతర అంచనాల భోగట్టా. అప్పుడు జరుగుతున్న 2వ ప్రపంచ యుద్ధం వల్ల బర్మా నుండి బియ్యం దిగుమతి చేసుకోవటానికి బెంగాల్‌కు వీలుకాలేదు. పైగా యుద్ధంలో విజయానికి కృషి చేస్తూ క్షామ నివారణ పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. వర్తకులు ధాన్యానికి విపరీతంగా ధరలు పెంచటము, వరదలు సంభవించటం వల్ల విపరీతమైన జననష్టం జరిగింది.

### 25.5.7 ఉడ్‌హెడ్ నివేదిక :

ఈ క్షామం వల్ల ఏర్పడిన పరిస్థితులను చక్కదిద్దుటకు 'ఉడ్‌హెడ్' అధ్యక్షతన ఏర్పాటయిన క్షామ పరిశీలనా సంఘం 1945లో తన నివేదికను సమర్పించినది. దాని సూచనలు :

1) అఖిల భారత ఆహార కౌన్సిల్ ఏర్పాటు (All India Food Council)

2) ఆహార ధాన్యాల సేకరణ, పంపిణీ రాష్ట్ర ప్రభుత్వానికి గుత్తాధిపత్యం కల్పించటం.

3) ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు సముచిత ఆహారధాన్యాల ధర నిర్ణయం మొదలగునవి. యుద్ధానంతరం ఏర్పడిన ఆహార కొరతను నివారించుటకు ఈ సూచనలు ఎంతగానో ఉపకరించినాయి. ప్రభుత్వం అనుసరించిన ఈ చర్యలవల్ల ఒక క్షామం అప్పట్లో నివారింపబడినది. ఈ రకంగా బ్రిటీష్ ప్రభుత్వం క్షామ నివారణకు అనేక పథకాలు రూపొందించి ప్రజలను ఆదుకొన్నది.

### 25.6 విద్యా సంస్కరణలు :

ఆంగ్లేయులు చేసిన సంస్కరణలన్నింటిలో భారతదేశ సమాజంపై ఎక్కువ ప్రభావాన్ని చూపినది ఆంగ్ల విద్యా విధానము. మనదేశం బ్రిటీష్ వారి పాలన క్రిందకు వచ్చేనాటికి విద్యా బోధనకై హిందువులకు పాఠశాలలు, మహమ్మదీయులకు మదర్‌సాలు ఉండేవి. కాని వాటి సంఖ్య చాలా అల్పము. వీనిలో విద్యాబోధన కూడ వెనుకటి తరహాలో ఉండేది. దేశ భాషలకు ప్రాధాన్యతనివ్వక

సంస్కృతం, అరబిక్, పారశీక భాషలకే ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. వ్యాకరణం, ధర్మశాస్త్రాలు, ఉపనిషత్తులు మత గ్రంథాలు వంటి వానిని బోధిస్తూ ఉండేవారు. ఆధునిక విషయాలైన చరిత్ర, భూగోళం, విజ్ఞానశాస్త్రాలకు వీనిలో తావుండేది కాదు. ఆంగ్లేయుల పాలన మొదలైన చాలాకాలం వరకూ భారతీయులు తమ ప్రాచీన విద్యా పద్ధతులను మినహా పాశ్చాత్య ప్రపంచంలో జరుగుతున్న శాస్త్రవిజ్ఞానాభివృద్ధిని కాని, రాజనీతి సిద్ధాంతాలు కాని తెలుసుకొనుటకు ఉత్సాహం చూపలేదు. అందువల్ల వారెంతో వెనుకబడిపోయారు.

కంపెనీవారు మొదట్లో దేశంలో విద్యాభివృద్ధి పట్ల ఆసక్తి చూపలేదు. 1781లో వారన్ హేస్టింగ్స్ కాలంలో ప్రప్రథమంగా కలకత్తాలో కలకత్తా మదర్సా అనే పేరుతో ఒక సంస్థను స్థాపించారు. సరిగ్గా 10 సంవత్సరాల అనంతరం కాశీలో ఒక సంస్కృత కళాశాలను స్థాపించినారు. 1793లో ఛార్టర్ చట్టాన్ని రూపొందించినప్పుడు విల్‌బర్ ఫోర్స్ అను సభ్యుడు పార్లమెంటులో మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీలను భారతదేశానికి పంపి వారికి విద్య గరపాలని సూచించినాడు. కాని అది ఆమోదించబడలేదు. ఛార్లెస్ గ్రాట్ అను కంపెనీ సివిల్ ఉద్యోగి మొదటిసారిగా పాఠశాలలో ఆంగ్లవిద్యా బోధన చేయాలని సూచించాడు.

### 25.6.1 క్రైస్తవ మిషనరీలు :

ఈలోపు క్రైస్తవ మిషనరీలు తమ మత బోధనతోపాటు అనేక ఆంగ్ల విద్యాసంస్థల స్థాపనకు పూనుకున్నారు. మద్రాసు, బొంబాయి, కలకత్తా, మచిలీపట్నం, నాగపూర్ మొ॥ ప్రదేశాలలో కళాశాలలు, పాఠశాలలు నెలకొల్పినారు. బొంబాయిలో విల్సన్ కళాశాల, మద్రాస్‌లో క్రిస్టియన్ కళాశాలలు ఈ విధముగా ఏర్పడినవే.

### 25.6.2 1813 ఛార్టర్ చట్టము :

1811లో మింటో ప్రభువు భారతదేశంలో విజ్ఞానశాస్త్రాలు ఆధునిక విద్య నిర్లక్ష్యం చేయబడటంపట్ల బాధపడ్డాడు. అతడి సూచన మేరకు 1813 ఛార్టర్ చట్టములో ఒక లక్ష రూపాయలు విద్యాభివృద్ధికి కేటాయించారు. కంపెనీ ప్రభుత్వము విద్యావ్యాప్తికి శాసన రూపంలో ధనాన్ని కేటాయించటం ఇదే ప్రథమం. ఈ ధనాన్ని పాఠశాలలు, కళాశాలల స్థాపనకు, సారస్వత విజ్ఞానశాస్త్రాలలో బోధనకు వినియోగించాలని భావించారు. కాని ఈ డబ్బు వినయోగముపై అభిప్రాయ భేదాలు ఏర్పడినవి. దేశీయమైన విద్యలను, సంస్కృత, పారశీక భాషల కొరకు ఈ ధనాన్ని వినియోగించాలని ప్రాచ్యపక్షము (Orientalists) వారు వాదించారు. దానితో విభేదించిన ఆంగ్లపక్షము (Anglicists) ఆంగ్లవిద్య ద్వారా పాశ్చాత్య విజ్ఞానాన్ని ప్రజలలో వ్యాప్తి చేయవలెనని వాదించారు.

### 25.6.3 1833 ఛార్టర్ చట్టము :

1833 ఛార్టర్ చట్టము విద్యాభివృద్ధికి ఏటా 1 లక్షకు బదులు 10 లక్షల రూపాయలు కేటాయించాలని తీర్మానించింది. అప్పటి గవర్నర్ జనరల్ బెంటింక్ ప్రభువు ఈ ధనాన్ని సద్వినియోగం చేయడానికి కృషిచేశాడు. రాజారామమోహనరాయ్ వంటి ప్రసిద్ధ భారతీయులు ఆంగ్లవిద్యనే బలపర్చారు. రాజారామమోహనరాయ్ బెంటింక్‌కు లేఖ వ్రాస్తూ ప్రజలలోని అజ్ఞానాన్ని, మూఢవిశ్వాసాలను తొలగించడానికి ఆంగ్లవిద్య తోడ్పడుతుంది అని వివరించాడు.

### 25.6.4 మెకాలే :

గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లోని న్యాయసభ్యుడైన మెకాలేప్రభువు ఈ సమస్యను పరిశీలించి ఒక నివేదికను తయారుచేశాడు. అందులో అతడు ఇంగ్లీషు భాష ద్వారా ఆధునిక విజ్ఞానశాస్త్రాలను బోధించాలని సూచించాడు. భారతదేశంలోని గ్రంథాలన్నిటినీ కలిపినా ఇంగ్లీషులోని కొన్ని పుస్తకాలకు సరితూగవు కనుక ఆంగ్లవిద్య భారతీయులకు లాభకరము అని అతడు భావించాడు. అంతేకాక ఇంగ్లీషు విద్యను నేర్చిన భారతీయులను తక్కువ జీతాలతో గుమస్తాలుగా నియమించి ప్రభుత్వము ఖర్చు తగ్గించవచ్చు. మరియు

విదేశీ వస్తువులపై దేశీయులకు మోజు ఎక్కువై ఆంగ్ల వ్యాపారం కూడ లాభసాటిగా ఉంటుంది. మెకాలే తన తల్లికి వ్రాసిన లేఖలో ఆంగ్ల విద్యావ్యాప్తి ఫలితంగా "రంగులో రక్తంలో భారతీయులైనా ఆలోచనలు, అభిప్రాయాలు, నైతిక జీవనం, మేధాసంపత్తి, విజ్ఞానంలో భారతీయులు ఆంగ్లేయులవుతారు" అని వివరించాడు. అయితే ఆంగ్ల విద్యాభ్యాసము చేసిన భారతీయులు చైతన్యవంతులై జాతీయభావంతో ఆంగ్ల పాలనకు ముప్పు తెచ్చే ప్రమాదం కూడ ఉందని అతడు భయపడ్డాడు.

### 25.6.5 బెంటింక్ :

బెంటింక్ ప్రభువు మెకాలే నివేదికను ఆమోదించి, తదనుగుణంగా 1835 మార్చిలో ఒక ఉత్తరువు జారీచేశాడు. ఇంగ్లీషు రాజభాష అయింది. "భారత ప్రజలలో పాశ్చాత్యుల విద్య, సారస్వతం, భౌతిక శాస్త్రాలను వ్యాప్తి చేయుట బ్రిటిష్ ప్రభుత్వ సంకల్పము. ఇకపై ప్రభుత్వ ధనాన్ని ఆంగ్ల విద్యకేగాని, ప్రాచ్యవిద్యలపై వినియోగించరాదు". ఈ తీర్మానమే ఆంగ్ల విద్యకు మన దేశంలో పునాది అని చెప్పవచ్చు.

హార్డింగ్, డల్‌హౌసీల కాలంలో ఇంగ్లీషు భాషా వ్యాప్తికి ఇంకా ప్రోత్సాహం లభించింది. 1844లో ఇంగ్లీషు భాష తెలిసిన వారికే ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుందని హార్డింగ్ ప్రభువు ఉత్తరువు చేసినాడు. డల్‌హౌసీ కాలంలో ప్రభుత్వ కేంద్రంలోను, రాష్ట్రాలలోను విద్యాశాఖను (Department of Public Instruction) నెలకొల్పడమే గనుక దేశవ్యాప్తంగా అధిక సంఖ్యలో పాఠశాలలు స్థాపించబడినవి.

### 25.6.6. ఉడ్ పథకము 1854 :

డల్‌హౌసీ పరిపాలన కాలంలో 1854లో పార్లమెంటు ఆ దేశంపై ఛార్లెస్ ఉడ్ భారతదేశంలో విద్యాభివృద్ధికై ఒక పథకం రూపొందించాడు. దీనినే ఉడ్ పథకము (Wood's Despatch of 1854) అంటారు. ఇందులోని ముఖ్యాంశాలు :

1) ప్రతి రాష్ట్రంలోను విద్యాశాఖను (Department of Public Instruction) ఏర్పాటు చేయాలి.
2) ప్రెసిడెన్సీ నగరాలలో విశ్వవిద్యాలయాలను స్థాపించాలి.
3) ఉపాధ్యాయులకు శిక్షణా సంస్థలను స్థాపించాలి.
4) ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల సంఖ్య పెంచాలి.
5) విద్యాసంస్థలు నడుపుటకు ప్రభుత్వము ధన సహాయము (Grant-in-aid) చేయాలి.
6) ప్రాథమిక పాఠశాలలు ఎక్కువగా స్థాపించటాన్ని ప్రోత్సహించాలి.
7) బోధనా మాధ్యమంగా ఉన్నత తరగతులలో ఇంగ్లీషు, క్రింది తరగతులు లేదా ప్రాథమిక స్థాయిలో దేశ భాషలను బోధించాలి.
8) స్త్రీ విద్యను ప్రోత్సహించాలి.
9) తెలివైన విద్యార్థులకు ఉపకార వేతనములిచ్చి ప్రోత్సహించాలి.
10) ప్రైవేటుగా పాఠశాలలు నడిపేవారికి ప్రోత్సాహమిచ్చి, ధన సహాయము చేయాలి.
11) ఉన్నత విద్యను తారతమ్యాలు లేకుండా అందరకు అందించాలి.
12) విద్యాబోధనలో ముఖ్యంగా విజ్ఞానశాస్త్రాలు, తత్వజ్ఞానము, సాంఘికశాస్త్రాలు బోధించాలి.
13) మొత్తము మీద భారతీయులను విద్యావంతులను చేయుట ప్రభుత్వ బాధ్యతగా ఉండాలి.

భారతదేశంలో విద్యా విధానానికి ఒక ప్రాతిపదికగా ఉడ్ ప్రణాళిక పరిగణించబడింది. అయితే దీనిలో కూడ కొన్ని లోపాలు లేకపోలేదు. ఇది ఉన్నత, మాధ్యమిక విద్యలకిచ్చిన ప్రాధాన్యతను ప్రాథమిక విద్యకు ఇవ్వలేదు. ప్రాచ్యవిద్యాసంస్థలు ప్రభుత్వము

సహాయము పొందక నిర్లక్ష్యము చేయబడినవి. ఉడ్ నివేదిక ననుసరించి 1857 లో కలకత్తా, మద్రాసు, బొంబాయి రాజధానులలో విశ్వవిద్యాలయాలు ఏర్పడినవి. ఇవి ఇంగ్లండులో యూనివర్సిటీల ఫక్కీలో ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్, సెనేట్‌లను కలిగి ఉంటాయి. ఈ విశ్వవిద్యాలయాలే పరీక్షలు జరిపి ఉత్తీర్ణులైన వారికి పట్టాలు ప్రసాదిస్తాయి. ఇవికాక ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ సహాయక విద్యాసంస్థలు అనేకము నెలకొల్పబడినవి. 1882 నాటికి దాదాపు 25 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసించారు.

## 25.6.7 హంటర్ కమీషన్ :

ఉడ్ పథకము ద్వారా విద్యాభివృద్ధి ఎంతవరకు జరిగినదో పరిశీలించి, విద్యావ్యాప్తికై ఇతర సూచనలు చేయడానికి రిప్పన్ ప్రభుత్వం 1882లో విలియం హంటర్ అధ్యక్షతన ఒక కమీషన్‌ను నియమించింది. హంటర్ కమీషన్ చేసిన ముఖ్య సూచనలు :

1) ప్రాథమిక విద్యావ్యాప్తికి ప్రభుత్వం ప్రధానంగా కృషి చేయాలి.
2) విద్యారంగములో ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలి.
3) ప్రాథమిక పాఠశాలలను స్థానిక సంస్థల ఆధ్వర్యంలో నడపాలి.
4) ప్రభుత్వేతర విద్యాసంస్థలకు ప్రభుత్వం గ్రాంటులివ్వాలి. అట్టి విద్యాలయాలు విద్యార్థుల నుండి తక్కువ రుసుములు వసూలు చేయాలి.
5) తెలివైన విద్యార్థులకు ఇంకా ఎక్కువ మందికి ఉపకార వేతనములు (Scholarships) ఇవ్వాలి.
6) విద్యార్థులకు మత సంబంధము లేని నీతి విషయాలు బోధించాలి.
7) విద్యాలయాల సక్రమ నిర్వహణకు విద్యాలయాలను ప్రభుత్వం తనిఖీ చేస్తూ ఉండాలి.
8) మహమ్మదీయులలో విద్యావ్యాప్తికి ప్రత్యేక కృషి చేయాలి.

ప్రభుత్వం హంటర్ కమీషన్ నివేదికను అంగీకరించి, అమలుపర్చటమే కాక, ప్రతి సంవత్సరము వార్షిక నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఈ నివేదిక అమలు వల్ల దేశంలో విద్యాభివృద్ధి చురుకుగా జరిగింది. ఎంతోమంది విద్యావంతులకు నూతన విద్యాలయాల్లో ఉపాధ్యాయ వృత్తి లభించింది.

## 25.6.8 కర్జన్ :

కర్జన్ ప్రభువు వైస్రాయ్‌గా ఉన్నప్పుడు అప్పటి విద్యారంగములో అతనికి ఎన్నోలోపాలు కనిపించినవి. విద్యార్థులు నేర్చుకునేవి విద్య వారికి జీవితంలో ఏమాత్రం ఉపయోగపడేది కాదు. విద్యార్థులు పాఠ్యగ్రంథాలు కంఠస్థం చేయటమేకాని వాటిని అవగాహన చేసుకోవటానికి ప్రయత్నించేవారు కాదు. వారి చదువు గుమస్తాలు కావటానికి మాత్రమే ఉపయోగపడేది. కర్జన్ సిమ్లాలో ఉన్నత విద్యాధికారుల సమావేశం జరిపి విద్యాసమస్యలపై చర్చించాడు. పిమ్మట 'సర్ థామస్ రాలీ' ఆధ్వర్యంలో ఒక విశ్వవిద్యాలయ సంఘాన్ని (University Commission) ఏర్పరిచాడు. రాలీ సంఘం తన నివేదికలో విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వపు అదుపు ఎక్కువ చేయాలని, మరికొన్ని ఇతర సూచనలు చేసింది.

## 25.6.9 1904 విశ్వవిద్యాలయ చట్టము :

రాలీ సంఘపు నివేదిక ఆధారగా కర్జన్ 1904లో విశ్వవిద్యాలయ చట్టాన్ని తెచ్చాడు. దానిలోని ముఖ్యాంశాలేమనగా - ఈ చట్టం విశ్వవిద్యాలయాల యాజమాన్యాన్ని పునర్ వ్యవస్థీకరించింది. సెనేట్‌లో 50 నుండి 100 వరకు సభ్యులు ఉంటారు. వీరిలో బొంబాయి, మద్రాసు, కలకత్తా విశ్వవిద్యాలయాల సెనేట్‌లలో 20 మంది మిగిలిన విశ్వవిద్యాలయాల్లో 15 మంది ఎన్నికైన సభ్యులుంటారు. సిండికేట్‌లలో అధ్యాపకులకు తగిన స్థానం కల్పించారు. అనుబంధ కళాశాలల అనుమతి విషయమై కొన్ని షరతులను ఏర్పరచారు.

సెనేట్ తృప్తిపడితేనే గాని నూతనంగా కళాశాలలను స్థాపించరాదు. విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులను ప్రభుత్వమే నియమిస్తుంది. విశ్వవిద్యాలయాలలో పోస్టుగ్రాడ్యుయేట్ తరగతులు ప్రారంభించి విద్యాబోధన ప్రధానంగా చేపట్టాలి. అంతేకాక పరిశోధనకు కూడా అవకాశాలు కల్పించాలి. ఈ విధంగా విశ్వవిద్యాలయాలకు కర్జన్ ప్రభువు కొత్తరూపాన్ని కల్పించాడు. ఈ 1904 చట్టం వల్ల యూనివర్సిటీలపై ప్రభుత్వపు నియంత్రణ పెరిగింది.

విశ్వవిద్యాలయాలతోపాటు పాఠశాలలు కూడా సంస్కరించబడ్డాయి. ఉన్నత పాఠశాలలలోని ఆఖరి సంవత్సరం ప్రభుత్వ పరీక్షలు (School final Examinations) ప్రవేశపెట్టారు. కేంద్రం రాష్ట్రాలకు విద్యావ్యాప్తికై ఎక్కువ గ్రాంట్లు ఇవ్వడానికి నిశ్చయించింది.

కర్జన్ సంస్కరణలకు ప్రోత్సాహం ఇచ్చేటందుకు ఆంగ్ల చక్రవర్తి 1912లో ఢిల్లీ దర్బారులో 50 లక్షల ధనం కేటాయించాడు. భారత ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధిచెందటం తనకు అత్యంత ప్రీతిపాత్రమైనదని ఆయన అన్నాడు. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక శాఖ విద్యావిషయాల సభ్యుడైన సర్ హెన్రీ బట్లర్ విశ్వవిద్యాలయాల బాధ్యత పూర్తిగా కేంద్రప్రభుత్వం వహించుట కష్టమనీ, రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించి వాటి బాధ్యతను రాష్ట్రాలే వహించాలని సూచించాడు. వెంటనే పాట్నా, నాగపూర్, రంగూన్‌లలోను తర్వాత కాశీ, ఆలీఘర్, హైదరాబాద్‌లలోను విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. 1920లో అలహాబాద్‌లోను, 1922లో ఢిల్లీలోను విశ్వవిద్యాలయాలు ఏర్పడినవి. 1916లో పూనాలో కార్వే పండితుడు స్త్రీలకు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పెను. 1921లో రవీంద్రనాథ్‌ఠాగూర్ విశ్వభారతి విద్యాలయాన్ని శాంతినికేతన్‌లో స్థాపించాడు.

### 25.6.10 కలకత్తా విశ్వవిద్యాలయ సంఘం (1917) :

వైస్రాయ్ చేమ్స్‌ఫర్డ్ నియమించిన ఈ సంఘం, ముఖ్యంగా కలకత్తా విశ్వవిద్యాలయాన్ని పరిశీలించి ఇతర వాటితో పోల్చి నివేదికను సమర్పించినది. ఈ సంఘం ముఖ్యంగా యూనివర్సిటీకి పనిభారం పెరిగిందని భావించినది. ఈ సంఘపు సూచనలలో ముఖ్యమైనవి :

1) కళాశాలలోని ఇంటర్మీడియట్ తరగతిని సెకండరీ పాఠశాలలకు బదిలీ చేయటం
2) డిగ్రీ విద్యను 3 సంవత్సరాలుగా చేయటం.
3) విశ్వవిద్యాలయాల విషయాలలో ప్రభుత్వం ఎక్కువగా జోక్యం చేసుకోరాదు.
4) పాఠశాలల్లో బోధనా భాషగా ప్రాంతీయ భాషను, ఉన్నత విద్యాస్థాయిలో ఆంగ్లభాషను మాధ్యమంగా చేయటం.
5) పరీక్షా విధానాన్ని కూలంకషంగా సంస్కరించటం

ధనాభావం చేత ఈ సంఘ సూచనలు పూర్తిగా అమలు కాలేదు.

### 25.6.11 1919 చట్టము :

1919 చట్టం వల్ల విద్యా విషయాలన్నీ రాష్ట్రాలకు కేటాయించారు. కాశీ, ఆలీఘర్, ఢిల్లీ విశ్వవిద్యాలయాలు మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేట్లు నిర్ణయమైంది. విద్యాశాఖను రాష్ట్రమంత్రివర్గంలో ఒక మంత్రికి కేటాయించారు. అతని క్రింద విద్యాశాఖ డైరెక్టరు, ఇతర సిబ్బంది పనిచేసేవారు. 1935 చట్టం ప్రకారం విద్యాశాఖ నిర్వహణ స్వయం ప్రతిపత్తి పొందిన రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉంటాయి. 1947 నాటికి పైన ఉదహరించిన సంస్థలే కాక వృత్తివిద్యను బోధించే విద్యాసంస్థలు అనేకం ఏర్పడినవి. వానిలో వైద్య, న్యాయ, వ్యవసాయ, ట్రైనింగ్, పశువైద్య, ఇంజనీరింగ్ కళాశాలలు ముఖ్యమైనవి.

### 25.6.12 జాతీయ విద్యావిధానం :

1937లో మహాత్మాగాంధీ కొందరు జాతీయ నాయకులను సేవాగ్రామంలో సమావేశపరచి జాతీయ విద్యాప్రణాళికను

తయారుచేశారు. అప్పుడు పదవిలో ఉన్న కాంగ్రెస్ మంత్రివర్గాలు ఈ ప్రణాళికను కొంతవరకు ఆచరణలో పెట్టినాయి. దీనిలోని ముఖ్య అంశాలు :

1) 7-14 సంవత్సరాల వయస్సులోగల బాలబాలికలకు విద్యను ఉచితంగాను, నిర్బంధంగాను నేర్పవలెను.
2) పిల్లలకు ఉల్లాసం కలిగేటట్లు విద్యనేర్పవలెను.
3) విద్యను మాతృభాషలో నేర్పవలెను.
4) ఈ విద్యతోపాటు విద్యార్థులకు ఏదో ఒక వృత్తివిద్యను నేర్పవలెను. దీనినే 'బేసిక్' విద్యావిధానం అని కూడా అంటారు.

## 25.6.13 ముగింపు :

ఈ విధంగా ఎప్పటికప్పుడు విద్యా విషయాలలో మార్పులు తేవడం, కొత్త విశ్వవిద్యాలయాలు స్థాపించటం, లౌకిక విషయాలు, విజ్ఞాన శాస్త్రాలు బోధించటం, ఆధునిక విద్యావ్యాప్తి, అనేక పాఠశాలలను స్థాపించటం మొదలగునవి ఆంగ్లేయుల విద్యా సంస్కరణలలో ప్రధానమైన విషయాలు.

## 25.7 న్యాయపరిపాలనా శాఖ - సంస్కరణలు :

ఆంగ్లేయుల పాలన భారతదేశంలో ఏర్పడే నాటికి ఇక్కడ అభివృద్ధి చెందిన న్యాయపరిపాలన ఉండేది. దేశంలో హిందూ, మహమ్మదీయ న్యాయశాస్త్రాలు రెండూ ఉండేవి. ఆంగ్లేయులు క్రమంగా తమ న్యాయ విధానాలను భారతదేశంలో ప్రవేశపెట్టారు. రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం కలకత్తాలో ఫోర్ట్‌విలియంలో సుప్రీమ్ కోర్టును స్థాపించారు. అనంతరం మద్రాసులో 1801లోను, బొంబాయిలో 1823 లోను సుప్రీమ్ కోర్టులు ఏర్పడ్డాయి.

## 25.7.1 వారన్ హేస్టింగ్స్ :

ఆ కాలంలో భారతదేశంలో రెండు విధాలైన కోర్టులు ఉండేవి. ప్రెసిడెన్సీ నగరాలలో సుప్రీమ్ కోర్టులు, రాష్ట్రాల్లో 'సదర్' కోర్టులు ఉండేవి. సుప్రీమ్ కోర్టును బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పరచగా, సదర్ కోర్టులను కంపెనీ ఏర్పరిచింది. 1772లో వారన్ హేస్టింగ్స్ ప్రతి జిల్లాలోను సివిల్, క్రిమినల్ న్యాయస్థానాలను ఏర్పరిచాడు. వీటిపైన కలకత్తాలో 'సదర్ దివానీ అదాలత్' సదర్ నిజామత్ అదాలత్ అనే కోర్టులు ఏర్పడినవి. సదర్ దివానీ అదాలత్‌లో గవర్నర్ జనరల్ ప్రధాన న్యాయమూర్తి. అతనికి ముస్లిం మౌల్వీలు, హిందూ పండితులు సాయం చేసేవారు. వారన్ హేస్టింగ్స్ హిందూ ముస్లిం ధర్మశాస్త్రాలను ఇంగ్లీషులోకి అనువదింపచేయుటకు ప్రయత్నించాడు.

## 25.7.2 కారన్ వాలిస్ :

ఇతని కాలంలో జిల్లాను న్యాయ నిర్వహణకు ప్రాతిపదికగా తీసుకున్నారు. 1787లో జిల్లా కోర్టులను కలెక్టర్‌ల అధికారంలో ఉంచారు. కలెక్టర్‌లకు మేజిస్ట్రేట్ అధికారాలు ఇవ్వబడ్డాయి. జిల్లా న్యాయస్థానంపై కలకత్తా, పాట్నా, ఢాకా, ముర్షిదాబాద్‌లలో 4 రాష్ట్ర న్యాయస్థానాలను నెలకొల్పారు. 1790లో జిల్లా క్రిమినల్ న్యాయస్థానాలను రద్దుచేసి, వాటి స్థానంలో రాష్ట్రాలలోని క్రిమినల్ న్యాయస్థానాలు, సంచార న్యాయస్థానాలు (Circuit Courts) గా వ్యవహరించే ఏర్పాటుచేశారు. ఒక్కొక్క సంచార న్యాయస్థానంలో ఇద్దరు ఆంగ్ల న్యాయమూర్తులు ఉండి సంవత్సరానికి రెండు సార్లు జిల్లా న్యాయస్థానాలను దర్శించి అక్కడ విచారణ జరుపుతారు. న్యాయస్థానాల ఉపయోగార్థం 1793లో కారన్ వాలిస్ ఒక నిబంధనావళిని రూపొందించినాడు. దానినే 'కారన్ వాలిస్ కోడ్' అని పిలుస్తారు. దాని ప్రకారం న్యాయ, మేజిస్ట్రేట్ అధికారాలు కలెక్టర్‌ల నుండి తొలగించి జడ్జీలకు ఇవ్వబడ్డాయి.

### 25.7.3 బెంటింక్ :

ఇతడు కారన్ వాలిస్ స్థాపించిన రాష్ట్ర న్యాయస్థానాల వల్ల జాప్యం జరుగుతున్నదని వాటిని రద్దు చేసినాడు. న్యాయస్థానాల్లో అప్పటివరకు వాడబడుతున్న పారశీకభాష స్థానంలో ప్రజలు తమ మాతృభాషను వాడటాన్ని బెంటింక్ అనుమతించాడు. ఇందువల్ల ప్రజలకు ఎంతో మేలు కలిగింది. బెంగాల్ రాష్ట్రాన్ని 20 విభాగాలు చేసి ప్రతి దానిపై రెవెన్యూ, సంచార కమీషనర్‌ను నియమించాడు. 1831లో కమీషనర్ నుండి సెషన్స్ పనిని సివిల్ జడ్జీలకు బదిలీ చేశాడు. జిల్లా జడ్జి పనిభారం ఎక్కువయి నందున మేజిస్ట్రేట్ అధికారాలను అతడి నుండి కలెక్టర్‌కు బదిలీ చేయటమైనది.

### 25.7.4 హైకోర్టులు :

1861లో బ్రిటీష్ పార్లమెంట్ భారత ఉన్నత న్యాయస్థానాల చట్టం చేసింది. దీని ప్రకారం అంతకు పూర్వం ఉన్న ఉన్నత న్యాయస్థానాలు, సుప్రీంకోర్టు, అదాలత్‌లు రద్దు చేయబడినవి. వాటి స్థానంలో కలకత్తా, మద్రాసు, బొంబాయిలలో హైకోర్టులు స్థాపించారు. ప్రతి హైకోర్టులోనూ ఒక ప్రధాన న్యాయమూర్తి, 15కు మించకుండా న్యాయమూర్తులు ఉండేవారు. వారిలో 3వ వంతు మంది సివిల్ సర్వీస్ ఉద్యోగులు, 3వ వంతు బారిష్టర్‌లను నియమించాలని నిర్ణయించారు. మిగిలిన 3వ భాగం భారత న్యాయవాదుల నుండి లేదా దిగువ కోర్టుల న్యాయాధిపతుల నుండి నియమించేవారు. 1866లో వాయువ్య రాష్ట్రములోనూ, పంజాబ్‌లోనూ హైకోర్టులు నెలకొల్పారు.

1911 భారత హైకోర్టు చట్టాన్ని అనుసరించి పాట్నా, లాహోర్, రంగూన్‌లలో, 1916లో బీహార్, ఒరిస్సాలలో, 1936లో నాగపూర్‌లోను హైకోర్టులను స్థాపించారు. హైకోర్టులలో జడ్జీల సంఖ్యను 15 నుండి 20కి పెంచారు. 1859లో సివిల్ కోడ్‌ను, 1860లో క్రిమినల్ కోడ్‌ను, 1861లో పీనల్ కోడ్‌ను ప్రచురించారు.

### 25.7.5 ఇల్‌బర్ట్ బిల్లు (1881) :

1833 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను అనుసరించి భారతీయ న్యాయమూర్తులు యూరోపియన్ నేరస్థులను విచారణ చేయుటకు అనర్హులు. రిప్పన్ ప్రభువు అతని కార్యనిర్వాహక మండలిలోని న్యాయశాఖ సభ్యుడైన 'ఇల్‌బర్ట్' ను కలిసి ఈ విచక్షణ తొలగించుటకు కేంద్ర శాసనసభలో ప్రవేశపెట్టిన ఇల్‌బర్ట్ బిల్లును ఆంగ్లేయులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఫలితంగా ఈ బిల్లు సవరించబడి భారతీయ న్యాయమూర్తులచే విచారించబడే యూరోపియన్ నేరస్థుడు, న్యాయమూర్తికి సహాయపడే జ్యూరీలో కనీసం సగం మంది సభ్యులు యూరోపియన్లు ఉండవలెనని కోరవచ్చు.

### 7.6 ఫెడరల్ కోర్టు :

1935 భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి ఏర్పడిన సమాఖ్య న్యాయస్థానంలో (Federal Court) ఒక ప్రధాన న్యాయమూర్తి, 6గురు న్యాయమూర్తులు ఉంటారు. వారికి భారతదేశంలో పనిచేసిన అనుభవం ఉండాలి. వయోపరిమితి వీరికి 67 సంవత్సరములు. కేంద్ర, రాష్ట్ర సంస్థానాల మధ్య వివాదాలను పరిష్కరించటం, రాజ్యాంగపరమైన సందేహాలను తీర్చటం ఫెడరల్ కోర్టు విధులు. ఇంతేకాక హైకోర్టుల నుండి వచ్చే అప్పీళ్ళను సంస్థానాల హైకోర్టులలో అప్పీళ్ళను విచారణ చేసే అధికారం ఉండేది.

### 25.7.6 ప్రీవీ కౌన్సిల్ :

బ్రిటీష్ ఇండియాలో అత్యున్నత న్యాయస్థానం ఇంగ్లండులోని 'ప్రీవీ కౌన్సిల్'. 1833 ఛార్టర్ చట్టం ప్రకారం ఫెడరల్ న్యాయస్థానాల నుండి ఇంగ్లండులోని ప్రీవీ కౌన్సిల్‌కు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించబడినది.

### 25.7.7. ముగింపు :

ఆంగ్లేయులు మన దేశంలో సమన్యాయపాలన (Rule of Law) ను ప్రవేశపెట్టారు. జాతి, మత, భాషా బేధాలు లేకుండా ధనికుడైనా, నిరుపేద అయినా, అధికారి అయినా, సామాన్యుడయినా న్యాయస్థానం ముందు అందరూ ఒక్కటే. ప్రజాస్వామ్య స్వేచ్ఛలకు ఈ సమన్యాయ పరిపాలన సూత్రము ప్రాతిపదిక అయినది.

### 2.5.8 సైనిక సంస్కరణలు :

ఆదిలో ఆంగ్లేయులు మన దేశానికి వ్యాపారం కోసం వచ్చినప్పుడు వారికి సైన్యము లేదు. వారి ఫ్యాక్టరీలను కాపాడుకోవటానికి కొందరు కాపలాదారులను నియమించుకున్నారు. రానురాను కంపెనీవారు స్వదేశీ రాజ్యాల విషయాలలో జోక్యం చేసుకోవటం, ఫ్రెంచివారి పోటీని తట్టుకోవటానికి ఈ కాపలాదారుల నుండే చిన్న చిన్న సైనిక దళాలను తయారుచేశారు. కాలక్రమేణ ఈ సైనికదళాలే బెంగాల్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీల సైనిక దళాలుగా రూపొందాయి. 1748లో ఈ మూడు విభాగాలు మేజర్ స్ట్రింజర్ ఆధీనంలోకి వచ్చాయి. ఇతడు కంపెనీ సర్వసేనాని అయినాడు. కంపెనీ సైన్యాన్ని ఇతడు పునర్నిర్మాణం చేసి, ఎక్కువ మంది భారతీయ సిపాయిలను సైన్యంలో చేర్చుకొని భారతీయ సైన్య నిర్మాతగా (Father of the Indian Army) పేరు గాంచాడు.

### 25.8.1 తిరుగుబాటు :

మొదట్లో సిపాయిలు భారతీయ వస్త్రధారణ, ఆయుధములు కలిగి ఉండేవారు. రాబర్టు క్లైవు వారిని క్రమబద్ధం చేసి యూరోపియన్ సైనికుల వలె వస్త్రధారణ, ఆయుధములు ఇచ్చినాడు. విదేశీయుల శిక్షణలో భారతీయులు క్రమశిక్షణతో యుద్ధం చేసి ఇంగ్లీషువారికి విజయం చేకూరుస్తూ ఉండేవారు. అయినా సిపాయిలకు తగిన వేతనాలుకాని, పై ఉద్యోగాలు పొందే అవకాశాలుకాని ఇచ్చేవారు కాదు. అందువల్ల వారిలో అసంతృప్తి చెలరేగి 1857లో తిరుగుబాటు జరిగింది. ఆంగ్ల సైనికులు కూడా 1806లో వేలూరులోను, 1808 లో మద్రాసులోని ప్రభుత్వంపై తిరగబడినారు. ప్రెసిడెన్సీ సైన్యంలో మొదట్లో 3 విభాగాలు ఉండేవి. 1) భారతీయ సిపాయిలు 2) కంపెనీకి చెందిన యూరోపియన్ సైనికులు 3) రాయల్ సైన్యాలు. 1858 తరువాత చివరి రెంటినీ విలీనం చేసినారు. ఇందుకు ఆంగ్ల సైనికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

### 25.8.2 1857 విప్లవం తర్వాతి మార్పులు :

1857 తిరుగుబాటుతో ఆంగ్లేయులకు భారతీయులపై పూర్తిగా నమ్మకం పోయింది. సైనిక విధానాన్ని పరిశీలించి మార్పులు చేయుటకు నియమింపబడ్డ 'పీల్ కమీషన్' సూచనల మేరకు కొన్ని మార్పులు చేపట్టారు. అవి :

1) సైన్యంలో యూరోపియన్ల నిష్పత్తిని బాగా పెంచారు. 1863లో లక్షా నలభై వేల మంది భారతీయులు 65,000 మంది యూరోపియన్లు సైన్యంలో ఉండేవారు.
2) ఫిరంగిదళాలలో పూర్తిగా యూరోపియన్లనే నియమించారు. ఈ రకంగా ఫిరంగి దళాల నుంచి, సాంకేతిక యుద్ధకౌశలం ప్రదర్శించే శాఖల నుంచి భారతీయులను చాలావరకు తొలగించారు.
3) సిపాయిలను ఒకే ప్రాంతం నుండి తీసుకోవటం మానివేశారు. ప్రతి బెటాలియన్‌లోను వివిధ జాతులు, కులాలు, మతాల వాళ్ళు ఉండేటట్లుగా జాగ్రత్తపడ్డారు.
4) గూర్ఖాలు, సిక్కులు, పఠానులు మొదలైన యుద్ధజాతులను ఎక్కువగా సైన్యంలోకి తీసుకొని క్రమేపీ హిందూస్థానీయులు, దక్షిణ పశ్చిమ భారతీయుల సంఖ్యను సైన్యంలో తగ్గించసాగారు.

1879లో లిట్టన్ ప్రభువు సైనిక వ్యయం తగ్గించుటకు 'ఏడెన్' సంఘాన్ని నియమించాడు. దాని సూచనల ననుసరించి 18

పదాతి దళాలను, 11 గుర్రపు పటాలాలను, 11 ఆంగ్లేయ ఫిరంగి దళాలను తగ్గించారు.

సిపాయిల విప్లవానంతరం చాలాకాలం బెంగాల్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీల క్రింద వేర్వేరు సైన్యాలు ఉండేవి. అయితే 1895 నాటికి ఈ సైనిక దళాలు ఒకే సైనిక దళంగా ఏర్పడ్డాయి. వీటన్నిటిపై భారతదేశ సర్వసైన్యాధికారి నియమితుడైనాడు. 'కిచెనర్ ప్రభువు' సలహాపై సర్వసేనాని గవర్నర్ జనరల్‌కు సైనిక సలహాదారుడైనాడు. ప్రపంచంలోకెల్లా క్రమశిక్షణ, సమర్థత కలదని పేరొందిన భారతీయ సైన్యం పేరుపొందింది. మొదటి ప్రపంచ యుద్ధం ముగిశాక భారత సైన్యాన్ని పునర్ వ్యవస్థీకరించి 4 విభాగాలుగా చేసి ఒక్కొక్క భాగానికి ఒక సేనాపతిని నియమించి వారికి ఆధునిక పరికరాలు ఇవ్వటం జరిగింది. సైన్యానికి 3 ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అవి 1) దేశ సంరక్షణ 2) సామ్రాజ్య సంరక్షణ 3) ఆంతరంగిక శాంతి భద్రతల సంరక్షణ. ఇంగ్లీషువారు తెలివిగా భారతీయుల ఖర్చుతో, సైన్యంతోనే భారతదేశంలోని తమ సామ్రాజ్యాన్ని సంరక్షించుకుంటుండేవారు.

## 25.8.3 భారతీకరణ :

భారతీయులు సైన్యంలో ఉన్నతోద్యోగాలు ఇవ్వవలెనని, జీతాలు పెంచవలెనని అధికారులకు విజ్ఞప్తి చేయసాగారు. 1921 - 23లో భారత శాసన సభలలో భారతీయులకు కూడా సైన్యంలో ఉన్నత ఉద్యోగాలు ఇవ్వవలెనని తీర్మానించారు. 1925లో ప్రభుత్వం సైన్యంలో భారతీకరణ గురించి సూచనలు చేయుటకు 'స్కీన్' కమిటీని నియమించింది. మోతీలాల్ నెహ్రూ కూడా ఈ కమిటీలో పనిచేశాడు. ఈ కమిటీ 15 సంవత్సరాల కాలంలో భారత సైన్యంలోని ఆఫీసర్ పదవులలో సగం భారతీయులకివ్వవలెనని సూచించగా బ్రిటీష్ ప్రభుత్వం దానిని త్రోసిపుచ్చింది. అయితే 1922లో డెహరాడూన్‌లో ఇండియన్ మిలటరీ కళాశాల స్థాపించబడినది. ఇక్కడ 70 మంది శిక్షణ పొందుటకు అవకాశముండేది. వారు తర్వాత సాండ్‌హర్స్ట్‌లో తర్ఫీదు పొందేవారు.

సైమన్ కమీషన్ సైన్యాన్ని ఎంతమాత్రం భారతీయం చేయరాదని, భారతీయ సైన్యంపై ఆంగ్లేయుల ఆధిపత్యం ఉండి తీరవలెననీ, లేనిచో భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్యం అంతరించునని హెచ్చరించినది. రౌండ్ టేబుల్ సమావేశాలలో భారతీయ సైన్యాన్ని భారతీయుల అదుపులో ఉంచవలెనని గాంధీజీ వాదించాడు. భారతీయుల సంరక్షణ బాధ్యత భారతీయులదేననీ అందుచేత సైన్యంలో కొన్ని శాఖలనైనా పూర్తిగా భారతీయుల వశం చేయవలెననీ సూచన చేయబడినది. దానికి అనుగుణంగా పదాతిదళంలో ఒక డివిజనును, అశ్వికదళంలో ఒక బి గ్రేడును పూర్తిగా భారతీయం చేయుటకు 1932లో నిర్ణయించారు. భారతీయులకు శిక్షణ నిచ్చుటకు డెహరాడూన్‌లో ఒక సైనిక శిక్షణాలయాన్ని (Indian Military Academy) ని బ్రిటీష్ ప్రభుత్వం నెలకొల్పింది.

## 25.8.4 అజాద్ హింద్‌ఫౌజ్ :

2వ ప్రపంచ యుద్ధకాలంలో బర్మాలో యుద్ధం చేసిన భారతీయ సైనికులు, జపాన్‌కి పట్టుబడినవారు, సుబాస్ చంద్రబోస్ ఏర్పరచిన హింద్‌ఫౌజ్‌లో చేరారు. భారతీయ సైనికులలో జాతీయతా భావం ఉదయించినది. యుద్ధానంతరం అజాద్ హిందూఫౌజ్ సైనికులను బ్రిటీష్ ప్రభుత్వం విచారించ పూనినప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన చెలరేగినది. స్వతంత్ర్య ఉద్యమానికి ఇది ఎంతో స్ఫూర్తిని ఇచ్చినది.

1947లో స్వాతంత్ర్యానంతరం దేశ విభజనతోపాటు సైన్యం కూడా 2 భాగాలుగా విభజితమైనది. ఒక భాగం భారతదేశానికి, రెండవభాగం పాకిస్తాన్‌కు కేటాయించబడినది.

## 25.9 ముగింపు :

ఈ విధముగా బ్రిటీష్‌వారు తమ పరిపాలనా కాలములో పరిపాలనా వ్యవస్థకు సంబంధించిన వివిధ రంగాలలో అనేక

సంస్కరణలు ప్రవేశపెట్టారు. మనదేశ ప్రభుత్వోద్యోగ వ్యవస్థ, ఆదాయ వ్యయాలు, స్థానిక సంస్థలు, క్షామ నివారణ, న్యాయశాఖ, సైన్యము, విద్యారంగాలలో వారు చేసిన సంస్కరణలతో భారతదేశములో పరిపాలనా రంగములో సమైక్యత ఏర్పడినది. ఈ పరిపాలనా సమైక్యతను మన స్వతంత్ర భారత ప్రభుత్వము వారసత్వముగా పొందింది.

**మాదిరి ప్రశ్నలు :**

1. భారతదేశములో బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన పరిపాలన సంస్కరణలను గూర్చి సంగ్రహముగా వ్రాయుము.

**అర్ధ వ్యాసప్రశ్నలు :**

1. బ్రిటీష్‌వారి కాలములో ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో వచ్చిన మార్పులు ఏవి ?
2. స్థానిక సంస్థల విషయములో రిప్పన్ అనుసరించిన విధానమును వివరింపుము.
3. క్షామ నివారణకు బ్రిటీష్ వారు తీసుకున్న చర్యలు ఏవి ?
4. బ్రిటీష్ వారి కాలములో జరిగిన విద్యా సంస్కరణలను వివరింపుము
5. న్యాయ పరిపాలనా రంగములో బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన మార్పులు ఏవి ?

**లఘు వ్యాఖ్యలు :**

1. సైనిక సంస్కరణలు
2. మెకాలే, బెంటింక్‌ల విద్యా విధానము
3. ఉడ్ పధకము
4. హంటర్ కమీషన్

పాఠం - 26

# భారతీయ పునరుజ్జీవనం

## మత, సాంఘిక సంస్కరణోద్యమాలు

విషయసూచిక


26.0 లక్ష్యం

26.1 ఉపోద్ఘాతము

26.2 బ్రహ్మసమాజము

26.2.1 రాజారామమోహన్‌రాయ్

26.2.2 మహర్షి దేవేంద్రనాధ ఠాగూర్

26.2.3 కేశవచంద్ర సేన్

26.2.4 ఈశ్వరచంద్ర విద్యాసాగర్

26.2.5 కందుకూరి వీరేశలింగము

26.2.6 రఘుపతి వెంకటరత్నంనాయుడు

26.3 ఆర్యసమాజము - స్వామి దయానంద సరస్వతి

26.4 రామకృష్ణ మఠము

26.4.1. రామకృష్ణ పరమహంస

26.4.2. స్వామి వివేకానంద

26.4.3. రామకృష్ణ మిషన్

26.5. దివ్యజ్ఞాన సమాజము

26.5.1. అనీబీసెంట్

26.6. ప్రార్ధనా సమాజము

26.6.1. మహదేవ గోవిందరనడే

26.7. మహమ్మదీయులలో సాంస్కృతిక పునర్వికాసము

26.8. ముగింపు


### 26.0. లక్ష్యం :

19వ శతాబ్దములో భారతదేశంలో జరిగిన మత, సంఘ సంస్కరణోద్యమాలను అద్యయనం చేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 26.1. ఉపోద్ఘాతము :

18వ శతాబ్దాంతానికి భారతదేశమంతటినీ స్వాధీనము చేసుకొన్న ఇంగ్లీషువారు రాజకీయ విషయముల వలెనే, సాంఘిక, మత విషయాలలో కూడ తాము ఆధిపత్యాన్ని ఔన్నత్యాన్ని నెలకొల్పడానికి 19వ శతాబ్దంలో ప్రయత్నించారు. హిందూమతమనేక అనాగరిక, పురాతన మూఢాచారాలతో నిండి ఉన్నదని, భారతీయులు తమ రాజకీయ ఆధిపత్యాన్ని అంగీకరించినట్లే, మత సాంస్కృతిక విషయాలలో కూడ తమ మార్గాన్ని అనుసరించాలని ఆంగ్లేయులు ప్రచారం చేయసాగారు. అప్పటి వరకూ మత విషయాలలో తటస్థంగా ఉంటూ వచ్చిన ఆంగ్లేయులు తమ విధానం మార్చుకొన్నారు. 1813 తర్వాత క్రైస్తవ మతబోధకులు తమ మత బోధ చేయడానికి పార్లమెంటు అనుమతి ఇచ్చింది. పెద్ద ఎత్తున క్రైస్తవ మత ప్రచారమారంభమైంది. అంతేకాక ఆంగ్లేయులు మన దేశంలో అనేక మత సాంఘిక సంస్కరణలను ప్రవేశపెట్టినారు. సతి, బాల్య వివాహాలు, శిశుహత్య మొదలగు సాంఘిక దురాచారాలను అంతమొందించటానికి శాసనాలు చేశారు. అలాగే క్రైస్తవ మతంలో వర్ణభేదాలు లేకపోవడం, దేవుని దృష్టిలో అందరూ సమానమే అని ప్రచారం చేయడంతో మన దేశంలోని వెనుకబడిన నిమ్నజాతులవారు అసంఖ్యాకంగా క్రైస్తవ మతంలో చేరసాగారు.

ఈ పరిస్థితిలో భారతీయులలోని విద్యాధికులు, మేధావులులో ఆత్మపరిశీలన ఆరంభమైనది. పాశ్చాత్య మత సంస్కృతీ ప్రవాహములో మనము కొట్టుకొనిపోకుండ, మన మతములోని మూఢవిశ్వాసములను విసర్జించి, మన సంఘములో ప్రవేశించిన దురాచారములను తొలగించి, మత సంఘ సంస్కరణలకు పూనుకున్నారు. మధ్య యుగాలలో ఇస్లాం నుండి హిందూ మత, సంస్కృతులను కాపాడటానికి లేచిన భక్తి ఉద్యమం వంటి దానినే 19వ శతాబ్దంలో కూడా వారు బోధించారు. వారంతా పాశ్చాత్య విద్యా సంస్కృతులు బాగా తెలిసినవారు. ఈ విధముగా 19వ శతాబ్దంలో భారతదేశంలో ఒక అపూర్వమైన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమము వెల్లివిరిసింది. ఈ కాలములో మన దేశములో అనేకమంది మేధావులు, సంస్కర్తలు, ప్రవక్తలు అవతరించి, మన మత, సమాజములోని లోపాలను తొలగించి, భారతీయులను చైతన్యులను చేసిరి. ఇట్టివారిలో ముఖ్యులు రాజారామమోహనరాయ్, స్వామి దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, అనీబీసెంట్ మొదలగువారు. ఈ సంస్కర్తలను రెండు వర్గాలుగ విభజించవచ్చును. వారిలో మొదటి వర్గంవారు పూర్తిగ పాశ్చాత్య ప్రభావానికి లోబడి, దానికనుగుణంగా మన మత, సంస్కృతులను దిద్దుటకు పూనుకున్నారు. వారిలో ముఖ్యులు రాజారామమోహన్‌రాయ్, రనడే, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ మొదలగువారు. వీరివలె కాక రెండవ వర్గంవారు సనాతన ధర్మాన్ని సమర్థించినారు. వీరిలో ముఖ్యులు స్వామి దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు మొదలగువారు. దయానందుడు ఆర్యసమాజాన్ని, వివేకానందుడు రామకృష్ణ మఠాన్ని స్థాపించారు. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజాన్ని మన దేశంలో స్థాపించినది. వీరు ప్రారంభించిన సాంఘిక మత సంస్కరణ ఉద్యమాలు దేశాన్ని ఎన్నో విధాల ప్రభావితం చేసి మన సంస్కృతిని పునరుజ్జీవింపచేశాయి.

## 26.2. బ్రహ్మసమాజము :

బ్రహ్మసమాజము బెంగాల్ రాష్ట్రంలో రాజారామమోహనరాయ్ చేత స్థాపితమైనది. అతని అనంతరం మహర్షి దేవేంద్రనాథ ఠాకూర్, కేశవచంద్రసేన్ దానిని ప్రచారం చేశారు.

### 26.2.1. రాజారామమోహనరాయ్ :

నవభారత వైతాళికుడనబడిన రాజారామమోహనరాయ్ ఈ సంస్కర్తలలో ఆద్యుడు. ఇతడు 1772 లో బెంగాల్ రాష్ట్రంలోని 'రాధానగరం'లో ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. చిన్నతనంలోనే బెంగాలీ, సంస్కృతం, పార్సీ, అరబిక్ భాషలు నేర్చుకోవటమేకాక హిందూ మహమ్మదీయ మత గ్రంథాలు కూడా చదివాడు. 16వ సం॥లోనే సత్యాన్వేషణ నిమిత్తం ఇల్లు విడిచి దేశాటనం చేశాడు. టిబెట్ రాజధాని అయిన 'లాసా' నగరం వెళ్ళి బౌద్ధ గ్రంథాలు అధ్యయనం చేశాడు. తిరిగి ఇంటికి వచ్చి ఇంగ్లీషు, ఫ్రెంచ్, గ్రీక్, లాటిన్, హీబ్రూ

భాషలలో ఉన్న క్రైస్తవ, పారశీక మత గ్రంథాలు కూడా పఠించి వాటి సారాంశం గ్రహించాడు. ఉపనిషత్తులను ఇంగ్లీషు, బెంగాలీ భాషలలోకి తర్జుమా చేశాడు. వేదాంతసారమనే గ్రంథాన్ని రచించాడు. బైబిల్, ఖురాన్ గ్రంథాలను హీబ్రూ, అరబిక్ భాషల నుండి ఇంగ్లీషులోకి అనువదించాడు.

1893లో అతని తండ్రి మరణానంతరం ఇతడు కంపెనీ ప్రభుత్వంలో చేరి 'దిగ్బీ'కి దివాన్‌గా నియమితుడైనాడు. అనంతరం కలకత్తాలో నివాసమేర్పరచుకుని సాంఘిక మత సంస్కరణలకు పూనుకున్నాడు. భారతీయులు తమ మతాన్ని విడనాడి అన్య మతాలను స్వీకరించవలసిన అవసరం లేదని చెప్పాడు. కానీ అప్పటి హిందూ మతాచారాలు సనాతనుల ఆధ్వర్యంలో పరమ ఛాందసంగా మూఢవిశ్వాసాలతో కూడుకుని ఉండేవి. వానిని సంస్కరించి వేదాలు ఉపనిషత్తులలో ఉన్న తమ నిజమైన సంస్కృతిని హిందువులు గుర్తించేటట్లు చేయాలనుకున్నాడు. నిర్జీవంగా ఉన్న హిందూమతాన్ని సజీవంగా చేయాలని సంకల్పించి అందుకోసం 1815లో మొదటగా 'ఆత్మీయసభ'ను స్థాపించి దానినే 1828లో 'బ్రహ్మసమాజంగా' మార్చి భారతీయ పునరుజ్జీవనానికి నాంది పలికాడు.

## బ్రహ్మసమాజ సిద్ధాంతాలు :

1) ఈశ్వరుడు ఒక్కడే; బహుదేవతారాధన అర్థరహితం.
2) భగవంతుడు నిర్గుణుడు, నిరాకరుడు. అందువల్ల విగ్రహారాధన చేయరాదు.
3) భగవంతుని దృష్టిలో మానవులంతా సమానమే.
4) సర్వమత సారాంశము ఒక్కటే.
5) కర్మకాండ, మూఢవిశ్వాసాలు, మత విభేదాలకు మూలము.
6) చిత్తశుద్ధి, సత్ప్రవర్తన, ప్రార్థన, నిర్మలమైన మనస్సు, భక్తి మానవులను మోక్షార్హులను చేస్తుంది.
7) హిందూమతం అందులో ప్రవేశించిన విగ్రహారాధన, మూఢవిశ్వాసాలు, కర్మకాండలను తొలగించి వేదమతాన్ని పునరుద్ధరించుట ద్వారా మన దేశము తొల్లింటి ఆధ్యాత్మిక ఘనతను పొందగలదు.
8) హిందూ సమాజములోని సాంఘిక దురాచారాలను నిర్మూలించాలి.
9) పాశ్చాత్య విద్య, విజ్ఞానాలను స్వీకరించటం ద్వారానే మనం ముందుకు వెళ్ళగలం.

రాజరామమోహనరాయ్ తన సిద్ధాంతాలను వ్యాపింపచేయుటకు పట్టుదలతో కృషి చేశాడు. 1828లో 'బ్రహ్మమందిరం' అనే భవనం నిర్మించాడు. అక్కడ సమావేశమై ప్రార్థన చేసుకుని వ్యక్తులంతా కలిసి ఏర్పరచిన సంఘమే పిదప 'బ్రహ్మసమాజం' అయినది.

## సంఘ సంస్కరణ :

కులవ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ జనోద్ధరణకు ఆయన ఎంతో కృషి సల్పాడు. బహు భార్యాత్వం, బాల్యవివాహాలు, సతీసహగమనం నిషేధించవలెనని ఆందోళన చేసినాడు. దీని ఫలితంగా గవర్నర్ జనరల్ విలియం బెంటింక్ 1829లో సతీసహగమనాన్ని నిషేధిస్తూ చట్టం చేశాడు. స్త్రీలకు ఆస్తి హక్కు ఇవ్వవలెనని, వితంతు పునర్వివాహాలను అనుమతించాలని కూడా ప్రచారం చేశాడు.

## ఆంగ్ల విద్య :

పాశ్చాత్య విద్యావ్యాప్తికి 1817లో ఒక కళాశాలను స్థాపించాడు. మనలో మధ్యయుగ ఛాందస భావాలు పోగొట్టి, ఆధునిక ప్రపంచ పోకడలు, పెరుగుతున్న విజ్ఞానాన్ని తెలుసుకోవటానికి, ఆంగ్ల భాషా అధ్యయనం అవసరమని విలియం బెంటింక్, మెకాలే లతో సహకరించి ఆంగ్ల విద్యను భారతదేశంలో ప్రవేశపెట్టాడు.

**పత్రికలు :**

బ్రహ్మసమాజ సిద్ధాంతాల ప్రచారం కోసం ఒక వేదాంత కళాశాలను స్థాపించి 'సంవాద కౌముది' అనే పత్రిక ద్వారా ప్రచారం చేశాడు. ఇది మన దేశంలో స్థాపించిన మొదటి ప్రముఖ పత్రికలలో ఒకటి. పత్రికా స్వాతంత్ర్య రక్షణకు ఆయన తీవ్రపోరాటం సలిపాడు. భారతీయ పత్రికలపై ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలకు వ్యతిరేకంగా పోరాడాడు.

న్యాయస్థానాలలో క్రైస్తవులను విచారించేటప్పుడు హిందువులు, మహమ్మదీయులు జ్యూరీ సభ్యులుగా ఉండరాదని 1827లో చేయబడిన చట్టానికి వ్యతిరేకంగా ఆయన ఎంతో ఆందోళన చేశాడు. 1833 'ఛార్టర్ చట్టం' రూపొందిస్తున్న 'సెలక్ట్ కమిటీ' కి మన దేశంలో ఆధునిక రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టవలసిన అవసరము తెలియచేస్తూ అనేక మహజర్లు పంపినాడు. రైతులపై పన్నుల భారం తగ్గించాలని కోరాడు. 1832లో నామమాత్రపు మొఘల్ చక్రవర్తి అయిన 2వ అక్బర్ రాజారామమోహనరాయ్‌కి 'రాజా' అనే బిరుదు నిచ్చి తన తరుపున రాయబారిగా తన భరణం ఎక్కువ చేయమని కోరుతూ బ్రిటన్ రాజు వద్దకు పంపాడు. అతడు ఇంగ్లండులోనే 1833 సెప్టెంబర్‌లో 'బ్రిస్టల్' నగరంలో మరణించెను. ఆయనను ఆధునిక భారతదేశం పునర్ వికాసానికి నాంది పలికిన నవయుగ వైతాళికునిగా మనం భావించవచ్చు.

## 26.2.2. మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్ :

రాజారామమోహనరాయ్ తర్వాత బ్రహ్మసమాజ ఉద్యమం నడిపిన వారిలో ముఖ్యుడు. ఇతడు రవీంద్రనాథ్ ఠాగూర్ తాత. బాల్యంలోనే రాజారామమోహనరాయ్ ప్రభావానికి గురైనాడు. విద్యార్థిగానే బెంగాలీ, ఇంగ్లీషు, పార్సీ, సంస్కృతాలలో ప్రావీణ్యుడయ్యెను. 1839లో 'తత్వబోధినీ సభ' అనే వేదాంత సంస్థను స్థాపించెను. తత్వబోధినీ అనే పత్రిక ద్వారా ప్రజలలో ఆధ్యాత్మిక భావాలు ప్రచారం చేశాడు. అనంతరం రాజారామమోహనరాయ్ స్థాపించిన 'బ్రహ్మసభ' ను పునరుద్ధరించి తన తత్వబోధినీ సభను అందులో విలీనం చేశాడు. వేదాంత శాస్త్రాలు బోధించుటకు తత్వబోధినీ పాఠశాలను స్థాపించెను. 1843లో బ్రహ్మసభకు 'బ్రహ్మసమాజ' రూపాన్నిచ్చాడు. బ్రహ్మసమాజం ఇతని నాయకత్వంలో ఒక మత సంస్థగా వెలిసింది. బ్రహ్మసమాజం వారు పాటించవలసిన ధర్మ సూత్రాలను క్రోడీకరించుచూ 'బ్రహ్మధర్మ' మనే గ్రంథం రచించెను. ఇది బ్రహ్మసమాజం వారికి ప్రమాణగ్రంథం అయినది. ఇతడు సత్ప్రవర్తనకు, ప్రార్థనకు, జ్ఞానానికి అధిక ప్రాధాన్యత నిచ్చెను. ఇతడు సమాజ ప్రచారాన్ని సంఘసంస్కరణను పట్టించుకోలేదు. ఈ విషయమై ఇతని ముఖ్య శిష్యుడైన కేశవ చంద్రసేన్‌తో విభేదాలు వచ్చి బ్రహ్మసమాజం రెండు శాఖలుగా చీలింది. ఠాగూర్ ఆధ్వర్యంలోని శాఖ ఆది బ్రహ్మసమాజంగాను, కేశవచంద్రసేన్ నాయకత్వాన ఉన్న శాఖను అఖిల భారత 'భారత వర్షీయ బ్రహ్మసమాజం' గా ఏర్పడ్డాయి. ఠాగూర్ బ్రహ్మసమాజానికి ఒక నిర్మాణ వ్యవస్థను, ఒక ప్రామాణిక గ్రంథాన్ని సృష్టించాడు.

## 26.2.3. కేశవచంద్రసేన్ :

కేశవచంద్రసేన్ 24 సంవత్సరాల వయస్సులోనే బ్రహ్మసమాజం ఆచార్యునిగా నియమించబడ్డాడు. 1856లో దేవేంద్రనాథ్ హిమాలయ ప్రాంతాలకు వెళ్తూ బ్రహ్మసమాజ మత కార్యకలాపాలు నిర్వహించే భారం ఇతడికి అప్పగించాడు. ఇతడు దేశమంతా తిరిగి అనేక నగరాలతో సమాజ శాఖలను ఏర్పరిచాడు. మత బోధకుడిగా గొప్ప ప్రజ్ఞ కనబరిచాడు. తన అద్భుత బోధనలతో శీలభ్రష్టులను కూడా సమాజంలోకి ఆకర్షించాడు. ఇతడు భావావేశపరుడు, గొప్ప వక్త. హిందూమతంలోని దురాచారాలను తీవ్రంగా ఖండించాడు. దేవేంద్రనాథుని వలె కాక సంఘసంస్కరణ కూడా అత్యావశ్యకము అని బోధించాడు. వీరిరువురి మధ్య విభేదాల వల్ల బ్రహ్మసమాజం రెండుగా చీలి ఇతను 'భారత వర్షీయ బ్రహ్మసమాజాన్ని' స్థాపించాడు. ఈ సమాజ ప్రార్థనలలో వివిధ మత గ్రంథాల నుండి ముఖ్య భాగాలను చేర్చారు.

ఇతడు గొప్ప సంఘసంస్కర్త. మద్యపాన నిషేధానికి అనుకూలంగా ప్రచారం చేశాడు. స్వదేశీయుల వివాహచట్టం (Native Marriage Act) అమలులోకి రావటానికి ఇతడే బాధ్యుడు. ఈ చట్టం ద్వారా మత ప్రమేయం లేకుండా వివాహం చేసుకోవటానికి వీలు అయినది. దీని వల్ల బాల్య వివాహాలు కూడా నిషేధించబడ్డాయి. బహుభార్యాత్వం శిక్షార్హమైనది. వితంతు వివాహాలు, వర్ణాంతర వివాహాలు చట్టబద్ధమైనాయి. అయితే బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన కేశవచంద్రసేన్ తన కుమార్తెకు 14 సంవత్సరాల లోపునే వైదిక సాంప్రదాయం ప్రకారం వివాహం జరిపి తన ప్రచారాలకు, ఆదర్శాలకు విరుద్ధంగా వ్యవహరించి విమర్శకు గురైనాడు. ఫలితంగా బ్రహ్మసమాజంలో చీలిక వచ్చింది.

## 26.2.4. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ :

1820లో బెంగాల్‌లో 'వీరసింగ' గ్రామంలో ఇతను జన్మించాడు. కలకత్తాలోని సంస్కృత కళాశాలలో షడ్దర్శనాలు, కావ్యాలంకారాలు, వేదాంతం అధ్యయనం చేశాడు. హిందూ ధర్మశాస్త్ర ప్రత్యేక పరీక్షలో ఉత్తీర్ణుడై విద్యాసాగర్ అనే పట్టాను పొందాడు.

తర్వాత కొంతకాలం ఉపాధ్యాయుడుగాను, కొంతకాలం ప్రాంతీయ విద్యాశాఖాధికారిగాను పనిచేసెను. పిదప సంస్కృత కళాశాలకు ప్రిన్సిపాల్ అయ్యెను. తన ఆత్మగౌరవానికి భంగం వాటిల్లగా ఆ పదవికి రాజీనామా చేసాడు. ఇతడు విద్యావ్యాప్తికి విశేషమైన కృషి సల్పాడు. విద్యాశాఖాధికారిగా ఉన్నప్పుడు 40 పాఠశాలలను స్థాపించాడు. కలకత్తాలో మెట్రోపాలిటన్ కళాశాల స్థాపించాడు. స్త్రీల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అనేక బాలికల పాఠశాలలు స్థాపించాడు. ప్రజలలో విజ్ఞానాభివృద్ధికి అనేక రచనలు చేశాడు. వీటిలో ముఖ్యమైనవి సీతా వనవాసము, బెంగాల్ చరిత్ర, సత్పురుషుల జీవిత చరిత్ర, కాళిదాసు శాకుంతలాన్ని బెంగాలీలోకి అనువదించాడు. అనేక పాఠ్యపుస్తకాలను సులభ శైలిలో రచించాడు.

విద్యావ్యాప్తికే కాక స్త్రీజనోద్ధరణకు ఇతడెనలేని కృషి చేశాడు. ఆ కాలంలో సమాజంలో అనేకమంది బాలవితంతువులు దయనీయమైన స్థితిలో ఉండేవారు. అనేక ప్రాచీన గ్రంథాలను పరిశీలించి వితంతు పునర్వివాహం శాస్త్ర సమ్మతమని వాదించాడు. 1855లో 'వితంతు వివేకం' అనే గ్రంథం రచించాడు. ఈ గ్రంథంపై పెద్ద అలజడి చెలరేగింది. కాని చాలామంది విద్యాధికులు ఈయన వాదనను సమర్ధించారు. ఫలితంగా 1856లో డల్‌హౌసీ వితంతువులను వివాహమాడిన వారికి ఆస్థి హక్కు ఉంటుందని చట్టం జారీ చేశాడు. 1865లో విద్యాసాగర్ మొట్టమొదటిసారిగా ఒక వితంతు పునర్ వివాహాన్ని తన ఇంటిలో జరిపించాడు. ఎన్ని కష్టాలు ఎదురైనా తన ఉద్యమాన్ని కొనసాగించాడు. బాల్యవివాహాలను, బహుభార్యాత్వాన్ని నిషేధించాలని ఆందోళన చేశాడు. ఇతడికి తను చెప్పింది ఆచరించే చిత్తశుద్ధి కలదు. తన కుమారునికి ఒక వితంతువుతో వివాహం జరిపాడు. తన కుమార్తె యుక్తవయస్కురాలయ్యే వరకూ వివాహం చేయలేదు. ఇతడు గ్రంథరచన, ప్రచురణ ద్వారా తాను ఆర్జించిన ధనాన్నంతా సంఘసంస్కరణోద్యమాలకు వెచ్చించాడు. సంస్కరణకు ఇతడు వేగుచుక్క.

## 26.2.5. కందుకూరి వీరేశలింగం :

బెంగాల్‌లో రాజారామమోహనరాయ్ వలె ఆంధ్రదేశంలో సంఘసంస్కరణోద్యమాలకు, సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికిన యుగపురుషుడు వీరేశలింగం. ఈయన 1848లో రాజమహేంద్రవరంలో బీద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. మెట్రిక్యులేషన్ తర్వాత న్యాయవాద పరీక్షలోను, తెలుగు, సంస్కృత భాషా పరీక్షలలోను ఉత్తీర్ణుడయ్యాడు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరాలలో పాఠశాలల్లో అధ్యాపకునిగా పనిచేసి 1876లో రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా చేరాడు. 1898 నుండి మద్రాసు రెసిడెన్సీ కళాశాలలో 7 సంవత్సరాలు పనిచేశాడు. 1905లో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి తన శేష జీవితాన్ని సంఘసేవలోను, గ్రంథరచనలోను గడిపాడు. ఇతడు 1919లో మరణించాడు. చిన్నతనం నుండి ఈయనకు ధైర్యసాహసాలు, పట్టుదల, జ్ఞానతృష్ణ, న్యాయంకోసం పోరాడటం, సంస్కరణాభిలాష కలిగి ఉండేవాడు. ఆనాటి సమాజంలోని అవినీతి, లంచగొండితనం,

మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, నిర్బంధ వైధవ్యం మొదలగు సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా జీవితాంతం అవిశ్రాంత పోరాటం సలిపిన యోధుడు వీరేశలింగం పంతులుగారు.

ఆయనపై బెంగాల్ సంస్కర్తల ప్రభావం పడటంతో ఆయన మతదృక్పథంలో మార్పు వచ్చింది. 1887లోనే ప్రార్థనా సమాజాన్ని, సంఘసంస్కరణ సమాజాన్ని స్థాపించాడు. ఆంధ్రదేశంలో దేవదాసీ విధానం, వేశ్యావృత్తి, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా తన ప్రసంగాలు, రచనలు ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేశాడు. పంతులుగారికి అఖిలభారత ప్రాచుర్యం లభించుటకు కారణం ఆయన జరిపించిన వితంతు పునర్ వివాహాలు. ప్రాచీన గ్రంథాల నుండి ప్రామాణాలను చూపుతూ వితంతు వివాహాలు ధర్మబద్ధమేనని వాదించాడు. సనాతనుల మూఢఅభిప్రాయాలను తీవ్రంగా ఖండించినాడు. పైడా రామకృష్ణయ్య వంటి మిత్రులు, విద్యార్థుల సహాయంతో 1881లో వీరేశలింగం తన నివాసంలో మొదటి వితంతు వివాహాన్ని వైభవంగా జరిపించాడు. తరువాత తన జీవితకాలంలో ఇతడు అనేక వితంతు పునర్ వివాహాలను జరిపించాడు. వితంతువులను రక్షించి వారికి విద్యగరిపి రక్షణనిచ్చి పునర్వివాహాలు జరిపే నిమిత్తం రాజమండ్రిలో వితంతు శరణాలయాన్ని స్థాపించాడు.

విద్యారంగంలో కూడా ఆయన కృషి ఎనలేనిది. విద్యావిధానంలో హేతువాదాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని, లలితకళలను ప్రోత్సహించాలని భావించాడు. రాజమండ్రిలో పిఠాపురం మహారాజా సహాయంతో ఒక ఉన్నత పాఠశాలను స్థాపించాడు. స్త్రీల విద్యకై ఆయన ఎంతో కృషి చేశాడు. 1874లోనే ఆంధ్రదేశంలోని మొదటి బాలికా పాఠశాలను ధవళేశ్వరంలో ఆరంభించినాడు. 1881లో రాజమండ్రిలో మరొకటి నెలకొల్పాడు. ఇవేకాక రాత్రి పాఠశాలలు, ఉచిత పాఠశాలలు నిర్వహించేవాడు. తెలుగులో విద్యార్థుల ఉపయోగ నిమిత్తం శరీర, జంతు, ఖగోళశాస్త్రం మొదలైన శాస్త్రీయ గ్రంథ రచనలు చేశాడు.

పత్రికారంగంలో కూడా ఆయన సేవలు బహుముఖమైనవి. అవినీతి నిర్మూలనకు, హేతువాద ప్రచారానికి తన ఆశయాల సాధనకు ఆయన 'వివేకవర్ధిని', 'హాస్యసంజీవని', 'సతీహితబోధిని' వంటి పత్రికలు నడిపాడు. వీటి ద్వారా అప్పటి అధికార వర్గాల్లో పేరుకుపోయిన అవినీతి నిర్మూలానికి ఎంతో కృషిచేశాడు. తెలుగు భాషా సాహిత్యాలకు కూడా అనేక ప్రహసనాలు, వ్యాసాలు, నాటకాలు, కావ్యాలు, వచన గ్రంథాలు, నవలలు, వ్యాకరణ గ్రంథాలు రచించి గద్యతిక్కన అనే బిరుదు పొందాడు. తెలుగులో మొదటి నవల రాజశేఖర చరిత్రను రచించాడు. తెలుగు కవుల జీవిత చరిత్రలను పరిశోధించాడు. బ్రహ్మసమాజంలో చేరి దాని ప్రచారం కోసం 'హితకారిణీ' సమాజమును స్థాపించాడు. తన యావదాస్తినీ సంఘసంస్కరణోద్యమాలకు దానం చేసి 1919లో మరణించాడు. నవ్యాంధ్ర యుగపురుషుడుగా ఈయన కీర్తి పొందారు.

### 26.2.6. రఘుపతి వెంకటరత్నం నాయుడు :

ఆధునిక ఆంధ్ర పునరుజ్జీవనానికి ఎంతో కృషి సలిపిన మహనీయుడు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు. ఆయన 1862 మచిలీపట్నంలో జన్మించాడు. ఈయన తండ్రి సైనికోద్యోగి అయినందున చిన్నతనంలోనే ఉత్తర భారతదేశమంతా పర్యటించాడు. ఉన్నతవిద్య అభ్యసించిన అనంతరం, ఈయన ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నాలలో ఉన్నత పాఠశాలల్లో పనిచేసాడు. తరువాత మద్రాసు పచ్చయ్యప్ప కళాశాలలోను, మచిలీపట్నంలోని నోబుల్ కళాశాలలోను పనిచేసి అనంతరం 1905 నుండి 1919 వరకు కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి కాకినాడ పట్టణాన్ని తన కార్యకలాపాలకు కేంద్రంగా చేసుకున్నాడు. 1881లో బ్రహ్మసమాజ నాయకుడైన పండిత శివనాథశాస్త్రి ఉపన్యాసాలతో ప్రేరణ పొంది, పిదప మద్రాసులోని మన్నవ బుచ్చయ్య పంతులు అనే బ్రహ్మసమాజకుని ప్రభావం కిందకు వచ్చి బ్రహ్మసమాజంలో చేరాడు. వీరేశలింగం గారితో కలిసి ఆంధ్రదేశంలో బ్రహ్మసమాజ వ్యాప్తికి నిర్విరామ కృషి చేశాడు. పిఠాపురం మహారాజా విరాళంతో కాకినాడలో బ్రహ్మసమాజ మందిరం నిర్మించాడు. ఆంధ్ర బ్రాహ్మధర్మ ప్రచారక నిధి అనే ఒక నిధిని కూడా ఏర్పరిచాడు. రాజమండ్రిలోని హితకారిణీ సమాజానికి అధ్యక్షునిగా కొంతకాలం పనిచేశాడు.

ఈయన సాంఘిక శుద్ధి సంఘంను (Social Purity Association) స్థాపించి యువకులను సన్మార్గంలోకి మరలించాడు. భోగం మేళాలను, వేశ్యావృత్తిని నిషేధించాలని ఎంతో ఆందోళన చేశాడు. మద్యపాన నిషేధానికి కూడా ఎనలేని కృషి చేశాడు. ఉపాధ్యాయునిగా, ఆచార్యునిగా, ప్రిన్సిపాల్‌గా వేలాది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాడు. ఆంధ్రవిశ్వవిద్యాలయం అవతరణకు కృషిచేశాడు. మద్రాసు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టాడు. ప్రాచ్య భాషలను, చరిత్రను, వేదాంత గణిత శాస్త్రాలను ప్రోత్సహించాడు.

కుల ధర్మాలను నిరసించి, నిమ్నజాతులను ప్రోత్సహించాడు. వారికి ఉచితంగా విద్యాదానం చేశాడు. విద్యార్థులను నీతిపరులుగా, జాతీయ పౌరులుగా రూపొందించుటకు అన్ని ప్రయత్నాలు చేశాడు. వర్ణాంతర వివాహాలను జరిపించి అనాథలకు ఆశ్రయం కల్పించి, బాల్యవివాహాలను అరికట్టి, వితంతు వివాహాలను, స్త్రీ విద్యను ప్రోత్సహించి, అస్పృశ్యత నివారణకు చాలా కృషి చేశాడు. బ్రహ్మసమాజం వారు ఈయనకు గౌరవ పూర్వకంగా 'బ్రహ్మర్షి' అనే బిరుదును ప్రసాదించారు. ఈవిధంగా ఆంధ్రదేశ పునరుజ్జీవానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు.

## 26.3. ఆర్యసమాజము : స్వామి దయానంద సరస్వతి :

19వ శతాబ్దంలో బ్రహ్మసమాజం వలెనే మత సంస్కరణకు పాటుపడిన మరొక సంస్థ "ఆర్యసమాజం". దీనిని స్థాపించిన వ్యక్తి స్వామి దయానంద సరస్వతి. ఇతని అసలు పేరు మూల్‌చంద్ శంకర్. ఇతడు గుజరాత్‌లో మోర్వీ ప్రాంతంలో 'టంకారా' అనే గ్రామంలో 1824లో ఒక సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. బాల్యంలోనే తండ్రి వద్ద వేదాలు, వ్యాకరణాది శాస్త్రాలు అభ్యసించాడు. అతడు పాశ్చాత్యవిద్య, ఆంగ్లభాషను నేర్చుకోలేదు. ఇతనికి జ్ఞానతృష్ణ, ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉండెడిది. తన 22 వ ఏట తల్లిదండ్రులు నిర్ణయించిన వివాహాన్ని నిరాకరించి ఇల్లు వదిలి ముక్తి మార్గాన్వేషకుడై వెళ్ళాడు.

అపుడు అనేక పుణ్యక్షేత్రాలను, ఎంతోమంది పండితులను సందర్శించి సత్యశోధనకై ప్రయత్నించాడు. నర్మదానదీ సాగర సంగమంలో పూర్ణానంద సరస్వతీ స్వామి వద్ద సన్యాసాశ్రమం స్వీకరించి దయానంద సరస్వతిగా మారినాడు. 1860లో అతడు మధురా నగరానికి వెళ్ళి విరజానందుడు అనే ప్రసిద్ధ అంధయోగి వద్ద శిష్యరికం చేసి వేదాలు, వేదాంగాలు, శాస్త్రాలు, స్మృతులు కూలంకషంగా అధ్యయనం చేశాడు. గురుదక్షిణగా వేదధర్మం, ఆర్యగ్రంథాలను, సత్యశాస్త్రాలను ప్రచారం చేయుటకు పూనుకున్నాడు. దయానందుడు విగ్రహారాధనను పూర్తిగా ఖండించాడు. వేదం ఒక్కటే ప్రమాణగ్రంథం అనీ, సమస్త సత్యాలు అందులో ఉన్నాయనీ, పురాణాలు, స్మృతులు మొదలగునవి మూఢనమ్మకాలు పెంచుతూ సత్యాన్ని కప్పిపుచ్చుతున్నాయని చెప్పాడు. ప్రపంచంలో వేదాలకు మించిన విజ్ఞాన సాహిత్యం మరొకటి లేదని విశ్వసించాడు. కాబట్టి "వేద కాలానికి మరలండి" (Back to the Vedas) అను పిలుపు నిచ్చాడు. తన శేష జీవితాన్ని హిందూమత వైదిక ధర్మ ప్రచారం కోసం అంకితం చేశాడు. 1875లో తన సిద్ధాంతాలను వ్యాపింపచేయుటకు బొంబాయిలో ఆర్యసమాజము అనే సంస్థను స్థాపించాడు. తన సిద్ధాంతాలను వివరిస్తూ ఆయన "సత్యార్థ ప్రకాశిక" అనే గొప్ప గ్రంథాన్ని రచించాడు. ఆయన ప్రతిపాదించిన ముఖ్య సిద్ధాంతాలు -

1) భగవంతుడు ఒక్కడే.
2) విగ్రహారాధన చేయరాదు.
3) వేదాలు సత్యానికి మార్గము.
4) పురాణాలు ప్రమాణ గ్రంథాలు కాదు.
5) మానవులంతా దేవుని బిడ్డలే. కనుక వారిలో ఎట్టి వర్ణ వ్యత్యాసాలు కూడదు.
6) మానవులు చెడును విడనాడి మంచిని గ్రహించాలి. అందరనూ ప్రేమతో చూడాలి.

7) అజ్ఞానాన్ని విసర్జించి జ్ఞానాన్ని స్వీకరించాలి.

8) బాల్యవివాహాలు, అస్పృస్యత వేదసమ్మతాలు కావు.

9) స్త్రీ విద్య, వితంతు వివాహాలు, విదేశ పర్యటన నిషిద్ధాలు కావు.

ఇతడు తన సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ దేశమంతటా పర్యటించాడు. మంచి వాదనాపటిమతో కాశీ, కలకత్తా, కాన్పూర్, హరిద్వార్ వంటి నగరాలలో మత చర్చల్లో అనేకమంది పండితులను ఓడించాడు. ఇతర మతాలలో చేరిన భారతీయులు తిరిగి హిందూమతంలో చేరుటకు వీలుగా "శుద్ధి'' అనే సంస్కరణను ప్రవేశపెట్టి అనేకులు ఇతర మతస్థులను తిరిగి హిందూమతంలోకి మార్చాడు. వైదికమతం విదేశీ మతాల దాడులకు గురైన ప్రాంతాలలో ఆర్యసమాజ శాఖలను ఏర్పరిచాడు. ఇతడు కూడా సంఘ సంస్కరణకు ఎంతో పాటుపడ్డాడు. ప్రజలంతా వేద అధ్యయనానికి అర్హులని అది బ్రాహ్మణులకే పరిమితం కాదనీ బోధించాడు. వర్ణ వ్యవస్థను ఖండించి వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాడు. స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కు ఉండాలని, వారు 16 సంవత్సరాలలోపు వివాహం చేసుకోరాదని ప్రబోధించాడు. సముద్రయానం చేయటం తప్పు కాదని, మనం విదేశాలకు వెళ్ళకపోవటం మూలంగా మూఢవిశ్వాసాలు ప్రబలి మన దేశం వెనుకబడిందనీ చెప్పాడు. ఈ రకంగా హిందువులలో ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం కలిగించి, వేదముల ఔన్నత్యమును చాటిన దయానందుడు 1883లో మరణించాడు. ఇతను రచించిన 'సత్యార్థ ప్రవేశిక' లో దేశదేశాలలో నున్న మతాలన్నింటినీ సున్నితంగా విమర్శించి, వైదిక ధర్మ ఔన్నత్యాన్ని నిరూపించాడు.

ఇతని మరణానంతరం స్వామి శ్రద్ధానంద, లాలా లజపతిరాయ్, పండిత గురుదత్త వంటి వారు ఆర్యసమాజాన్ని వ్యాపింపచేసారు. కాలక్రమంలో ఆర్యసమాజంలో భేదాభిప్రాయాలు ఏర్పడి రెండుగా చీలింది.

## 26.4. రామకృష్ణ మఠము :

భారతీయ ఆధ్యాత్మిక సంపదను బయటపెట్టి ప్రజలలో నూతన చైతన్యం కల్గించి, మత సాంఘిక సంస్కరణోద్యమాలకు పాటుపడిన సంస్థలలో రామకృష్ణ మఠం కూడా ఒకటి. దీనిని రామకృష్ణ పరమహంస పేరుమీద అతని శిష్యుడైన స్వామి వివేకానందుడు స్థాపించాడు.

### 26.4.1. రామకృష్ణ పరమహంస (1836 - 86) :

రామకృష్ణుని మొదటి పేరు గదాధరుడు. ఇతడు 1836లో బెంగాల్‌లోని 'కామార్పుకూర్' అనే గ్రామంలో ఒక నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆది నుండి ఆధ్యాత్మిక చింతనతో ఉండి, లౌకిక విషయాలు పట్టించుకునేవాడు కాదు. యోగులు, సాధువుల సాంగత్యంలో ఉంటుండేవాడు. "బియ్యం, అరటిపళ్ళు మూటకట్టుకునే విద్య తనకు అక్కరలేదని సత్యాన్ని సాక్షాత్కరింపచేసే యదార్ధ జ్ఞానాన్ని ప్రసాదించే విద్య'' మాత్రమే కావాలని అనేవాడు. బాల్యం నుండి ఇతడికి పూనకాలు వచ్చేవి. ఆ స్థితిలో తను దేవునితో మాట్లాడినట్లు చెప్పుకునేవాడు. తరువాత కలకత్తాకు 5 మైళ్ళ దూరంలో ఉన్న దక్షిణేశ్వరంలో గంగానదీ తీరాన రాసమణి జమిందారిణి కట్టించిన ఆలయానికి అర్చకుడిగా అతడు నియమింపబడ్డాడు. గదాధరుడు కాళీమాత భక్తుడైనాడు. ఎల్లప్పుడూ కాళీమాతను ప్రార్ధించుచూ తరచూ ధ్యానంలో మునిగిపోయేవాడు. కాళికాదేవి నిర్జీవ శిలావిగ్రహం కాదని, అనేక సాధనలు చేసి ఆమెను ప్రత్యక్షంగా చూడగలిగాడు. ఆమె ఆరాధనలో అలౌకిక ఆనందాన్ని పొందుతూ, దేవితో సంభాషిస్తూ తన్మయాన్ని పొందేవాడు. వివిధ మతాల్లోని ప్రత్యేక పద్ధతులన్నీ ఆచరించి, వాటి విశిష్టతను బోధించగల గురువులతో సాంగత్యం చేసి ఆ మతాలలోని రహస్యాలను తెలుసుకున్నాడు.

**రామకృష్ణుని బోధనలు :**

భగవంతుడు ఒక్కడే. ఆయన సర్వాంతర్యామి. భగవంతుని గూర్చిన సంపూర్ణ జ్ఞానం మానవుడు పొందాలి. కోరికల్ని విడనాడి అహాన్ని అరికట్టి సత్ప్రవర్తన ద్వారా మోక్షం సాధించాలి. మానవ సేవయే మాధవ సేవ. ప్రతి వ్యక్తి తన సంపదను ఇతరులతో పంచుకోవాలి. వివిధ మతాలు భగవంతుని సన్నిధిని చేరుటకు ఏర్పడ్డ భిన్న మార్గాలు. ద్వేషాన్ని విడనాడి ప్రేమతో భగవంతునికి అంకితం కావాలి. ఇతను అద్వైత తత్వాన్ని అభిమానించాడు. విగ్రహారాధన తప్పు కాదు. వివిధ దేశాలవారు, వివిధ కాలాల్లో భగవంతుని వేర్వేరు పేర్లతో, భావాలతో పూజిస్తుంటారు. అవన్నీ ఆమోద యోగ్యమే.

పరమహంస ఉపదేశాలు ప్రజలలో జ్ఞానాన్ని, నూతన వికాసాన్ని, జాతీయ భావాన్ని కలిగించినాయి. అతడు విద్యావంతుడూ కాదు, పండితుడు కాడు. బెంగాలి తప్ప ఇతర భాషలేవీ రావు. పాశ్చాత్య విజ్ఞానం లేదు. తాను మహాజ్ఞానిననీ చెప్పుకోలేదు. మహోపన్యాసాలు చేయలేదు. అతి సామాన్యునిగా నిరాడంబర జీవితాన్ని గడిపాడు. గొప్ప సాధకుడు. తనలో కోరికలు పెరుగుతాయని డబ్బు ముట్టుకునేవాడు కాదు. మానవులంతా సమానులేనని చెప్పి ఛండాలులతో కలిసి కొంతకాలం జీవించాడు. ప్రతివారు తమ మతాన్ని సంస్కృతిని గౌరవించాలని, ఇతర మతాలకు మారవలసిన అవసరం లేదని బోధించాడు. ఇతడు తన బోధనలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేటట్లు చిన్న చిన్న నీతి కథల రూపంలో వివరించేవాడు.

ఇతడు వివాహం చేసుకున్నప్పటికీ తన భార్య శారదామాయిలోనే దేవిని చూడగలిగాడు. ఆమెను పీఠంపై కూర్చుండబెట్టి పూజ చేసేవాడు. క్రైస్తవమత ప్రచారకులు భారత సంస్కృతిని హేళన చేయగా వారిని తన దివ్యజ్ఞానంతో తపస్సంపన్నతతో ఎదుర్కొన్నాడు. మన దేశ ఆధ్యాత్మిక సంపదను వెలికి తీయుటలో ఇతడు నిర్వర్తించిన పాత్ర అమోఘమైనది. తన బోధనలను ప్రపంచమంతా వ్యాపింపచేసే బాధ్యతను తన ప్రియ శిష్యుడైన స్వామి వివేకానందునిపై వదలి రామకృష్ణ పరమహంస 1886లో స్వర్గస్థుడైనాడు.

## 26.4.2. స్వామి వివేకానంద (1862 - 1902) :

భారతీయ సంస్కృతీ ప్రాభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానందుడు రామకృష్ణ పరమహంస శిష్యులలో ముఖ్యుడు. ఇతని అసలు పేరు నరేంద్రనాధ్‌దత్. ఇతడు 1863లో కలకత్తాలో ఒక కాయస్థ కుటుంబంలో జన్మించాడు. ఆంగ్ల విద్యాభ్యాసం చేసి 1884లో పట్టభద్రుడైనాడు. ఇతను ఏకసంతగ్రాహి, కానీ ప్రాపంచిక విషయాలు కాని, ఆంగ్ల విద్య కాని ఇతనికి ఎలాంటి సంతృప్తిని కలిగించలేదు. ఇతనికి బ్రహ్మసమాజ ప్రభావంతో విగ్రహారాధన పట్ల నమ్మకం సడలినది. భగవంతుడు ఉన్నాడా లేడా అనే సందేహం కూడా తలెత్తింది. తండ్రి హఠాన్మరణం వల్ల ఈయన కుటుంబం కటిక దరిద్రం అనుభవించింది. కుటుంబాన్ని దరిద్ర బాధ నుండి విముక్తి చేయుటకు విఫల ప్రయత్నం చేశాడు. ఆ దశలోనే ఆయనకు రామకృష్ణ పరమహంసతో పరిచయమేర్పడింది. పరమహంస ప్రభావం వల్ల నరేంద్రుడు ఆస్తికుడుగా, గొప్ప వేదాంతిగా మారాడు. సన్యాసాశ్రమం స్వీకరించి వివేకానందుడైనాడు. రామకృష్ణుడు వివేకానందునికి యోగసాధన నేర్పి భగవత్ సాక్షాత్కారాన్ని పొందే మార్గం బోధించాడు.

వివేకానందుడు స్ఫురద్రూపి. మంచి సాధకుడు, వక్త. చక్కని కంఠం గల గాయకుడు. పాండిత్య ప్రకర్షకల మత బోధకుడు. రామకృష్ణ పరమహంస చూపిన మార్గంలో మన దేశపు ఆధ్యాత్మిక గొప్పతనాన్ని పునరుద్ధరించవలెనని తన జీవితాంతం కృషి చేశాడు.

1886లో రామకృష్ణుని మరణానంతరం వివేకానందుడు అతని మిత్రులు రామకృష్ణుని బోధనలను ఆదేశాలను ఆచరించుటకు రామకృష్ణ మఠాన్ని నెలకొల్పారు. 1887లో 'బారా' నగర్‌లో తొలి రామకృష్ణ మఠం నెలకొన్నది. భారతదేశ ఆధ్యాత్మిక సంపద భారతీయులకే పరిమితం కాక ప్రపంచ వ్యాప్తి పొందాలని వివేకానందుడు వాంఛించాడు. 1893లో అమెరికాలోని 'చికాగో' నగరంలో విశ్వమత సభలు (Parliament of religions) జరుగనున్నవని ఆయనకు తెలిసింది. హిందూ మతానికి ఆ సభలో ప్రాతినిధ్యం

లేనందుకు వివేకానందుడు ఎంతో చింతించి తానే ఆ సమావేశంలో పాల్గొని హిందూమత ఔన్నత్యాన్ని గూర్చి ప్రసంగించవలెనని నిర్ణయించుకున్నాడు. నిర్ధనికుడైనా స్వామి చందాలు పోగుచేసి అమెరికా వెళ్ళాడు. చికాగో సభలో అద్భుతమైన ఉపన్యాసాన్ని ఇచ్చాడు. ఇతర మతాలవలె హిందూమతం ఒక వ్యక్తి చేత స్థాపించబడ్డది కాదని, అనాది నుండి అనేక ఆధ్యాత్మిక ప్రవాహాలను తనలో ఇముడ్చుకుంటూ సాగిపోయే జీవనది వంటిదని, అన్ని మతాలకు తల్లి వంటిదని, సర్వమత సమానత్వాన్ని గురించి ఆయన వాదించాడు. వివేకానందుని వాగ్ధాటికి భారతీయ వేదాంతతత్వ విశిష్టతకు విశ్వమత మహాసభ పరవశించింది. వివేకానందుని జ్ఞానసంపత్తికి నీరాజనం పలికింది. భారతీయ ఆధ్యాత్మిక సూర్యుడుగా వివేకానందుని అమెరికా పత్రికలు కీర్తించాయి. ఆధ్యాత్మిక జ్ఞానసంపత్తి కల భారతదేశానికి పాశ్చాత్యులు తమ మత ప్రచారం కోసం ప్రచారకులను పంపటం తెలివి తక్కువతనమని పత్రికలు వ్రాశాయి.

చికాగో సభల తర్వాత అమెరికాలోని అనేక నగరాలలో ఇతడు ఉపన్యసించాడు. ఐరోపా, ఈజిప్టు, చైనా, జపాన్ దేశాల నుండి కూడా ఆహ్వానాలు అందుకున్నాడు. 3 సంవత్సరాలు విదేశాలలో తన ఉపన్యాసాల ద్వారా హిందూమత ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ప్రచారం చేసి 1897లో తిరిగి స్వదేశానికి వచ్చిన వివేకానందుడికి మన దేశీయులు అపూర్వ స్వాగతం పలికారు. భారతదేశమంతటా పర్యటించి తన ఆధ్యాత్మిక సందేశం అందించాడు. అధిక శ్రమవల్ల ఆయన ఆరోగ్యం చెడి 1902లో 40 వసంతాలు నిండకనే కీర్తిశేషుడైనాడు.

**బోధనలు :**

వివేకానందుడు భారతదేశ ఆధ్యాత్మిక పునరుజ్జీవనము కోసం కృషిచేశాడు. వర్ణవిభేదాలను నిర్మూలించి వర్ణాంతర వివాహాలు చేసుకోవాలి. సామాన్య ప్రజల స్థితిగతులు మెరుగుపర్చాలి. అందుకు ప్రజలను విద్యావంతులను చేయాలి. సంస్కృతాన్ని బోధించాలి. బలిష్టులను, మేధావులను తయారుచేసే విద్యాలయాలు కావాలి. త్యాగము, సేవ రెంటినీ పాటించాలి. మానవ సేవయే మాధవ సేవ అని అందరూ గుర్తించాలి. పాశ్చాత్యులను గుడ్డిగా అనుకరించక వారిలో ఉన్న మంచిని మాత్రమే స్వీకరించాలి. హిందూజాతి సమైక్యతతో నిలిచినపుడు ఆధ్యాత్మ స్వేచ్ఛతోపాటు భౌతిక స్వేచ్ఛను కూడ పొందగలదు. ప్రబుద్ధ భారతి అనే పత్రిక ద్వారా తన భావాలు ప్రచారం చేశాడు.

## 26.4.3. రామకృష్ణ మిషన్ :

రామకృష్ణుని సందేశాన్ని అందరకూ అందచేయడానికి, వివేకానందుడు "రామకృష్ణా మిషన్" (రామకృష్ణ మఠము) అనే సంస్థను స్థాపించాడు. కలకత్తా దగ్గర ఉన్న బేలూరులో ఈ సంస్థ కేంద్రాన్ని స్థాపించి, దాని శాఖలను భారతదేశంలోను, ఇతర దేశాలలోను స్థాపించాడు. ఈ మఠాలు మానవ సేవయే మాధవ సేవ అన్న ఉక్తి ననుసరించి అద్భుతమైన సేవలు చేస్తున్నవి. అనేక విద్యాలయాలు, అనాధ శరణాలయాలు, వైద్యశాలలు మొదలైన సేవాసంస్థలు స్థాపించడం, దేశవిదేశ భాషలలో మత, వేదాంత, వైజ్ఞానిక గ్రంథాలు, పత్రికలు ప్రచురించడం వంటి పనులే గాక, తుఫానులు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, క్షామాలు, అంటురోగాలు వచ్చినప్పుడు రామకృష్ణ మిషన్ సభ్యులు ఎంతో ఆదర్శనీయమైన సేవలు చేస్తున్నారు. ఈ విధముగా భారతీయుల పునరుజ్జీవనానికి, ఆధ్యాత్మిక ప్రచారానికి, దీనజనోద్ధరణకు, జాతీయ చైతన్యానికి వివేకానందుడు అమోఘమైన కృషి చేశాడు.

## 26.5. దివ్యజ్ఞాన సమాజము (Theosophical Society) :

19వ శతాబ్దంలో ప్రజలలో సరైన జ్ఞానాన్ని కలిగించుటకు సంఘసేవాదృక్పథంతోను, అంతర్జాతీయ సోదరభావాన్ని పెంపొందించటానికి స్థాపించబడిన మరొక సంస్థ దివ్యజ్ఞాన సమాజం. థియోస్ అంటే దైవము. సోఫియా అంటే జ్ఞానము. కనుక దీనిని తెలుగులో దివ్యజ్ఞాన సమాజమని పిలిచారు. దీనిని 1875లో రష్యన్ మహిళ మేడమ్ "బ్లావట్స్కీ", అమెరికాకు చెందిన కల్నల్ 'ఆల్‌కాట్' లు న్యూయార్క్ నగరంలో నెలకొల్పారు. దీని ప్రధాన ఆశయం అంతర్జాతీయ సోదరభావాన్ని పెంపొందించుట, మానవుడిలోని

అజ్ఞానాన్ని రూపుమాపి అతనిలో అంతర్గతంగానున్న శక్తులను వెలికితీయుట, సర్వమత సామరస్యాన్ని, తత్వ విజ్ఞానాల అధ్యయనాన్ని ప్రోత్సహించుట.

1879లో దీని స్థాపకులు భారతదేశాన్ని దర్శించి ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమనదగిన భారతదేశంలో తమ శాఖను నెలకొల్పారు. ఆ సంవత్సరమే ఈ సమాజ ముఖ్య కార్యాలయం న్యూయార్క్ నుండి బొంబాయికి, 1882లో మదరాసులోని అడయార్‌కు మార్చడమైనది. అప్పటి నుండి అడయార్ దివ్యజ్ఞాన సమాజానికి అంతర్జాతీయ కేంద్రమైనది.

## 26.5.1. అనీబీసెంట్ :

ఐర్లండ్ వనిత అయిన అనీబీసెంట్ వల్ల మనదేశంలో ఈ సమాజానికి ఎంతో ప్రాచుర్యం లభ్యమైనది. ఈమె దివ్యజ్ఞాన సమాజ భావాలతో ప్రభావితమై అందులో సభ్యురాలై 1893లో భారతదేశానికి వచ్చి, అడయార్ సమాజశాఖ కార్యకలాపాలను తనపై వేసుకుని నిర్వహించింది. 1907లో ఆల్ కాట్ మరణానంతరం ఈ సమాజానికి ఆమె అధ్యక్షురాలైనది. ఈమె ప్రభావంతో ఎందరో విద్యాధికులు, రాజకీయవేత్తలు, సంఘసంస్కర్తలు ఈ సమాజ సభ్యులై మన దేశ పునర్వికాసానికి పనిచేయసాగారు. ఈమె వేదాలు, ఉపనిషత్తులచే ఆకర్షించబడి హిందూమత ఔన్నత్యాన్ని దిశదిశలా ప్రచారం చేసింది. ఈ ప్రచారం వల్ల హిందువులకు వారి మత సంస్కృతులపై గౌరవం పెరిగింది.

అనీబీసెంట్ నాయకత్వంలో ఈ సమాజం సంఘసంస్కరణా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నది. అణచివేయబడిన జాతుల ఉద్ధరణకు కృషి చేసింది. విద్యా వ్యాప్తికై ఆమె విద్యాసంస్థలను అడయార్‌లోను, కాశీలోను స్థాపించినది. కాశీలో ఈమెచే స్థాపించబడిన హిందూ కళాశాల తర్వాత మదన్‌మోహన్ మాలవియా నేతృత్వంలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంగా రూపొందింది. ఇంకా పలుచోట్ల ఈ సమాజంవారు జాతీయ పాఠశాలలు స్థాపించారు. అనీబీసెంట్ సాంఘిక విద్యా కార్యకలాపాలే కాక మన దేశ స్వాతంత్ర్య పోరాటంతో కూడా పాల్గొని దాని సాధనకు ఆంతరంగిక స్వపరిపాలనా (Home Rule) ఉద్యమాన్ని నడిపింది. ఈమె కాంగ్రెస్‌కు అధ్యక్షురాలైనది. ఈమె కృషికి తిలక్ తోడ్పడ్డాడు. ఈవిధంగా అనీబీసెంట్ విదేశీ మహిళ అయినప్పటికీ హిందూమతోద్ధరణకు, భారతీయుల సాంఘిక, రాజకీయ ఉన్నతికి తన జీవితాన్ని అంకితం చేసింది.

## 26.6. ప్రార్థనా సమాజము :

బెంగాల్‌లో వలెనే మహారాష్ట్రలో మత సాంఘిక సంస్కరణలకు కృషిసల్పిన సంస్థ ప్రార్థనా సమాజము. 1867లో ప్రార్థనా సమాజాన్ని "ఆత్మారాం పాండురంగ" అను వ్యక్తి స్థాపించెను. మత, సాంఘిక రంగాలలో కృషి చేయుట ఈ సమాజ లక్ష్యం. వీరు నామ్‌దేవ్, తుకారాం, రామదాస్ మొదలయిన మధ్యయుగాల మహారాష్ట్ర భక్తుల సాంప్రదాయాన్ని బ్రహ్మసమాజ మార్గాన్ని సమన్వయం చేసి కొత్త ఆధ్యాత్మిక జీవిత విధానం అవలంభించారు. హిందూమతం నుండి తాము వేరని వారెన్నడూ భావించలేదు. ప్రార్థనా సమాజికులు సంఘసంస్కరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. శ్రామికులకు రాత్రి పాఠశాలలు ఏర్పాటు చేయటం, వర్ణాంతర వివాహాలను, వితంతు పునర్వివాహాలను జరపటం, వివిధ కులాల మధ్య సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేయటం, నిమ్నజాతుల ఉద్ధరణ మొదలగునవి వీరు చేపట్టిన కార్యక్రమాలు. అనేక అనాథ శరణాలయాలను కూడా ఏర్పరిచారు. స్త్రీ విద్యను ప్రోత్సహించారు.

R.G. భండార్కర్, మహదేవ గోవింద రనడేలు ఈ సమాజ నాయకులు. ముఖ్యంగా రనడేను మహారాష్ట్ర వైతాళికుడని చెప్పవచ్చు.

## 26.6.1. మహాదేవ గోవిందరనడే :

రనడే 1842లో మహారాష్ట్రలో జన్మించాడు. ఇతడు న్యాయమూర్తిగాను, బొంబాయిలో ఎల్ ఫిన్‌స్టన్ కళాశాలలో అధ్యాపకునిగాను

పనిచేసి 1893లో హైకోర్టు జడ్జిగా నియమితుడై ఆ పదవిలో ఉండగనే 1901లో మరణించెను. ఈయన గొప్ప విద్వాంసుడు, సంస్కర్త, ఆదర్శవాది, దేశాభిమాని. 1861లో ఈయన వితంతు వివాహసంస్థను స్థాపించి ఎంతో సంఘసేవ చేసెను. రనడే విద్యా వ్యాప్తికి కూడా కృషిచేశాడు. ప్రసిద్ధ డక్కన్ విద్యా సంఘం (Deccan Education Society) స్థాపకులలో ఇతను ముఖ్యుడు. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపకులలో కూడా ఆయన ఒకరు. సంఘ సంస్కరణలతో పాటు దేశ రాజకీయాల్లో కూడా గణనీయమైన పాత్ర నిర్వహించాడు. ప్రతి సంవత్సరం జరిగే కాంగ్రెస్ మహాసభలతో పాటు అఖిలభారత సంఘ సంస్కరణ సభ కూడా జరిపే పద్ధతిని ఈయన ఆరంభించాడు. బెంగాల్‌లో రాజారామమోహనరాయ్ ఎట్టి కృషి చేశాడో మహారాష్ట్రలో రనడే కూడా మన దేశ పునరుజ్జీవనానికి అంతే కృషి చేసినాడు.

## 26.7. మహమ్మదీయులలో సాంస్కృతిక పునర్వికాసము :

భారతదేశంలోని మహమ్మదీయులు తమ నుండి ఆంగ్లేయులు రాజ్యాధిపత్యాన్ని చేపట్టటం సహించలేక పోయినారు. ఆంగ్లేయుల మతానికి వారి భాషకు, వారి సంస్కృతికి దూరంగా ఉండిపోయారు. 1857 సిపాయిల తిరుగుబాటు వైఫల్యంతో వారు మరింత కుంగిపోయారు. హిందువులు ఆంగ్ల విద్య ద్వారా వృద్ధిచెందుతుండగా ఆంగ్లేయులను ద్వేషించిన మహమ్మదీయులు ఇంగ్లీషును అభ్యసించక వెనుకబడిపోయారు. మారుతున్న పరిస్థితులను అర్థంచేసుకోలేకపోయారు. వారి దృక్పథంలో మార్పు తేవాలని ప్రయత్నించిన వారిలో 'సర్ సయీద్ అహ్మద్ ఖాన్' ముఖ్యుడు.

## సర్ సయీద్ అహ్మద్ ఖాన్ (1817 - 1898) :

మహమ్మదీయులలో సాంస్కృతిక పునరుజ్జీవన రథసారధిగా ఇతనిని చెప్పవచ్చు. పాశ్చాత్య విద్యనభ్యసించి ఇంగ్లండ్ నుండి మరలి వచ్చిన సర్ సయ్యద్ ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతులను సమన్వయం చేయవలెనని, దానికి అనుగుణంగా మహమ్మదీయుల దృక్పథంలో మార్పు తేవాలని ఎంతో కృషి చేశాడు. తన మతం వారు మూర్ఖత్వంతో అజ్ఞానంతో ఆంగ్లవిద్యను వ్యతిరేకిస్తున్నారని ఇతడు గ్రహించి మహమ్మదీయులలో ఆంగ్లవిద్యా వ్యాప్తికై పూనుకున్నాడు. అందుకు నాందిగా ఇంగ్లీషువారి సహకారంతో ఆలీఘర్‌లో ఆంగ్లో - ఓరియంటల్ కళాశాలను స్థాపించాడు. 1920 నాటికి అది ఆలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందింది. ఇతను ఎన్నో ఆంగ్ల గ్రంథాలను ఉర్దూ భాషలోకి తర్జుమా చేయించాడు. 'తహ్‌జిబ్ ముల్క్ - అకలక్' అనే పత్రిక ద్వారా తన సంస్కరణ భావాలను ప్రచారం చేశాడు. మహమ్మదీయులలో మత దురహంకారం తగ్గించుటకు ప్రయత్నించాడు. ముస్లింలలో పరదా పద్ధతి పోవలెననీ, స్త్రీలు కూడా విద్యను అభ్యసించాలనీ, వారిలో బహుభార్యాత్వం కూడదనీ ప్రచారం చేశాడు. ఈవిధంగా సర్ సయ్యద్ ముస్లిం ప్రజల పునర్వికాసానికి ఆరంభించిన ఉద్యమాన్ని 'ఆలీఘర్ ఉద్యమ' మని పిలిచారు. ఇతని పిదప సయ్యద్ అమీర్ ఆలీ, మోర్వీ చిరాగ్ ఆలీ, సర్ షేక్ మహమ్మద్ ఇక్బాల్ లు ఈయన కృషిని కొనసాగించారు. అనేక ముస్లిం సేవాసంఘాలను, అంజుమన్‌లను స్థాపించారు. అనేక పత్రికలు కూడా ప్రారంభించారు.

## 26.8. ముగింపు :

ఈవిధంగా 19వ శతాబ్దంలో పలువురు మత సంస్కర్తలు, సంఘ సంస్కర్తలు తమ రచనల ద్వారా, బోధనల ద్వారా, సంస్థల ద్వారా నిస్తేజమై ఉన్న భారతీయ సమాజానికి కొత్త జీవాన్ని పోసి వారిలో నూతన ఉత్తేజాన్ని, చైతన్యాన్ని, వికాసాన్ని కలిగించారు. ఈ సంస్కరణోద్యమాల వలన భారతీయులు మేల్కొని స్వాతంత్ర్య ఉద్యమానికి పూనుకొనిరి. ప్రజలలో మతమౌఢ్యం తొలగి, ఆధ్యాత్మిక చింతన, విశుద్ధ ప్రవర్తన, ఉన్నత ఆదర్శాలు ఏర్పడినవి. మన దేశపు ఔన్నత్యాన్ని గుర్తింపచేసి, మన వ్యవస్థలు పాశ్చాత్యుల వ్యవస్థలకు ఏమాత్రం తీసిపోవనే ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. పాశ్చాత్యులు మనకన్నా అధికులనే బానిస భావం తొలగింది. అలాగే ఈ ఉద్యమాలు

వెనుకబడ్డ వర్గాల ఉద్ధరణకు ఎంతగానో కృషి చేశాయి. అస్పృశ్యతా నివారణకు, వర్ణ వ్యత్యాసాలు తొలగించుటకు, సాంఘిక సమానత్వానికి పాటుపడినాయి. అట్లే ఈ సంస్కర్తలు స్త్రీజనోద్ధరణకు వేశ్యావృత్తి నిర్మూలనకు, వితంతు పునర్వివాహాలకు, బాల్య వివాహాలను మాన్పించుటకు, స్త్రీవిద్యను ప్రోత్సహించుటకు కృషి సలిపినారు. బ్రహ్మసమాజము, ఆర్యసమాజము, రామకృష్ణ మిషన్, దివ్యజ్ఞానసమాజం, ఆలీఘర్ ఉద్యమం భారతీయుల సాంస్కృతిక వికాసానికి ఎంతగానో తోడ్పడ్డాయి. అనేక పాఠశాలలు, కళాశాలలు, పఠనాలయాలు ఏర్పడ్డాయి. గ్రంథాలు, పత్రికలు విరివిగా వెలువడినవి. సంస్కర్తలు దేశమంతా తిరిగి ఉపన్యసించేవారు. వీటి ఫలితంగా భారతీయ సమాజంలో నెలకొన్న మూఢవిశ్వాసాలు, సాంఘిక దురాచారాలు తొలగి మన దేశం పునరుజ్జీవనం పొందినది.

**మాదిరి ప్రశ్నలు :**

1) 19వ శతాబ్దములో భారతదేశములో జరిగిన మత, సాంఘిక సంస్కరణోద్యమములను వివరింపుము.
2) సంస్కర్తగా రాజారామమోహనరాయ్ చేసిన కృషిని వివరింపుము
3) స్వామి దయానంద సరస్వతి జీవితము, కృషిని వివరింపుము

**లఘు ప్రశ్నలు :**

1) దేవేంద్రనాథ్ ఠాగూర్
2) కేశవచంద్రసేన్
3) ఈశ్వరచంద్ర విద్యాసాగర్
4) కందుకూరి వీరేశలింగము
5) రఘుపతి వెంకటరత్నంనాయుడు
6) రామకృష్ణ పరమహంస
7) స్వామి వివేకానందుడు
8) దివ్యజ్ఞాన సమాజము
9) సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్

**చదువదగిన గ్రంథాలు :**


1) B.S.L. Hanumantha Rao & K. Basaveswara Rao - Indian History and Culture Vol - II
2) పాటిబండ ఝూన్సీలక్ష్మి & అల్లాడి వైదేహి - భారతదేశ చరిత్ర, సంస్కృతి, ద్వి. భా. (తెలుగు అకాడమి)
3) ఎ. సత్యనారాయణ, శ్రీకృష్ణయ్య, ఎం.వి. సుబ్బారావు, శేషన్ - భారతదేశ చరిత్ర (1526 - 1964)
4) P. Mujumdar - Political thought from Rama Mohan to Dayananda
5) D.S. Sarma - The Renaissance of Hinduism
6) Vyas - Social Renaissance in India.


రచయిత : **కె.సి. గాంధీబాబు**

పాఠం - 27

# భారత జాతీయతాభావ ఆవిర్భావం - జాతీయోద్యమం (1858 - 1919)

**విషయసూచిక**

27.0. లక్ష్యం
27.1. ఉపోద్ఘాతం
27.2. జాతీయభావం ఆవిర్భవించడానికి దారితీసిన పరిస్థితులు
27.3. మితవాద జాతీయోద్యమం
27.4. అతివాద జాతీయోద్యమం
27.5. ముగింపు

## 27.0 లక్ష్యము :

19వ శతాబ్దంలో భారతదేశంలో జాతీయతాభావం ఆవిర్భవించడానికి దారితీసిన పరిస్థితులు, భారత జాతీయోద్యమాన్ని నడిపిన భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన, క్రీ.శ. 1885 నుండి 1919 వరకు భారతదేశంలో సాగిన జాతీయోద్యమంలో గల వివిధ దశలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 27.1. ఉపోద్ఘాతం :

భారతదేశానికి ఆరువేల మైళ్ళదూరంలో ఉన్న ఒక చిన్న దేశానికి చెందిన ఆంగ్లేయులు ఇంతదూరం వచ్చి భారతదేశాన్ని జయించి పాలించడం అత్యంత ఆశ్చర్యకరమైన విషయం. భారతీయులలో ఐకమత్యం, పరిపాలనాదక్షత, నిర్మాణ కార్యక్రమాలలో ఆసక్తి మరియు జాతీయత లోపించడమే ఆంగ్లేయుల విజయానికి కారణాలు. అందువల్లనే తొలిప్రయత్నంగా 1857 - 58లో భారతీయులు తిరుగుబాటు చేసినా విఫలమైంది. 1858 తరువాత భారతీయులలో మార్పు వచ్చింది. వారిలో జాతీయ భావం మొలకెత్తింది. వివిధ మతాలకు చెందిన వారు, వివిధ రాష్ట్రాలకు చెందినవారు, వివిధ భాషలు మాట్లాడేవారు, వివిధ కులాలవారు ఒకే దేశంలో ఉన్నప్పుడు వారందరూ కలిసికట్టుగా ఉండి, సాముదాయక నిర్మాణశక్తిగా పనిచేయడమే జాతీయత గొప్పతనము. ఈ జాతీయత ఏ విధంగా అంకురించి వృద్ధిచెందినదో ఈ పాఠంలో తెలుసుకొంటాము. అంతేగాక జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో 1885 నుండి 1919 వరకు సాగిన జాతీయ ఉద్యమాన్ని గురించి ఈ పాఠంలో తెలియజేయడం జరిగింది.

## 27.2. జాతీయభావం ఆవిర్భవించడానికి దారితీసిన పరిస్థితులు :

### 27.2.1. ఉపోద్ఘాతం :

19వ శతాబ్దంలో ఆంగ్లపాలనా కాలంలో భారతదేశంలో జాతీయతాభావం ఆవిర్భవించినది. ఈ జాతీయభావమునకు నిర్దుష్టమైన రూపమే జాతీయ కాంగ్రెస్. ఈ జాతీయ కాంగ్రెస్ భారతదేశాన్ని ఆంగ్లపాలన నుండి విముక్తి చేసింది. అట్లా జాతీయతాభావన ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు ఈ క్రింది వివరించడమైనది.

### 27.2.2. రాజకీయ కారణాలు :

ఆంగ్లేయులు రాజకీయంగా దాదాపు దేశాన్నంతా ఏకంచేసి ఒకే ప్రభుత్వం, ఒకే న్యాయం, ఒకే విద్యా విధానం ప్రవేశపెట్టారు. ఈ విధంగా సిద్ధించిన రాజకీయ ఐక్యత భారతీయులందరిలో తామంతా ఒకటే అనే భావాన్ని జనింపజేసింది. ఈ భావం భారతీయులలో జాతీయతా భావాన్ని రూపొందించింది. కావున భారతీయులలో జాతీయతా భావాన్ని జనింపజేసిన మొదటి అంశం ఆంగ్లేయుల సామ్రాజ్యవాదతత్వము. పాశ్చాత్య దేశాలలో ప్రజలు విప్లవాలు లేవదీసి స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం నెలకొల్పుకోవడం మొదలగు విషయాలు భారతీయులపై గొప్ప ప్రభావాన్ని ప్రదర్శించినవి. ఆంగ్లేయులు తమ నిరంకుశత్వాన్ని భారతీయులపై రుద్దడం భారతీయులు నిరసించి రాజకీయ విప్లవాన్ని ప్రారంభించడానికి ప్రయత్నించారు.

### 27.2.3. ఆర్థిక కారణాలు :

భారతదేశ సంపదను ఆంగ్లేయులు కొల్లగొట్టిరి. ప్రభుత్వంలోని ఉద్యోగాలకు భారతీయులకు అవకాశమివ్వకుండ, పరిశ్రమలు మూతపడుట వలన భారతీయులలో కనీవినీ ఎరుగని నిరుద్యోగ సమస్య తలెత్తెను. ఆంగ్లేయులు అధిక వ్యయంతో కూడిన యుద్ధాలు చేసి ఆయుధాలకు అయిన ఖర్చు ప్రజలపై రుద్దారు. ఆదాయం పన్ను రెండింతలయింది. స్థానిక పన్నులు పెంచబడినవి. ప్రజాసౌకర్యం కోసం గాని, క్షేమానికి గాని ఆంగ్లేయుల ఆ ధనాన్ని వినియోగించలేదు. 1858 తరువాత దేశంలో సంభవించిన క్షామాలు ప్రజల పరిస్థితిని మరీ దిగజార్చాయి. తత్ఫలితంగా ఆంగ్లేయుల పట్ల భారతీయులకు జుగుప్స, జాతీయ భావము పట్ల ఆసక్తి పెంపొందినవి.

### 27.2.4. మత, సాంఘిక కారణాలు :

19వ శతాబ్దిలో భారతదేశంలో ఉద్భవించిన సాంఘిక - మత ఉద్యమ ప్రవక్తలు భారతీయులలో జాతీయతా భావాభివృద్ధికి దోహదం చేసిరి, దయానందసరస్వతి భారతదేశం భారతీయులదని చాటాడు. వివేకానందుడు భారతీయులలో ఆత్మవిశ్వాసమును, దేశభక్తిని కలిగించాడు. రాజారామ్మోహనరాయ్, రామకృష్ణ పరమహంస మొదలగువారు తమ బోధనల ద్వారా భారతీయ సంస్కృతి రక్షణకు స్వదేశపాలన అవసరమని పాశ్చాత్య సంస్కృతి కంటే భారత సంస్కృతి ఉన్నతమైనదని ఉద్ఘాటించిరి. అనీబీసెంట్ తన రచనలచే భారతీయులలో జాతీయాభిమానాన్ని పురికొల్పింది. ఈ విధంగా 19వ శతాబ్దపు మత సంఘ సంస్కర్తలు హిందూమతంలోని దురాచారాలను, మూఢ విశ్వాసాలను క్షాళనం చేసి భారతీయులలో మాతృభూమి, నాగరికతపట్ల ప్రేమాభిమానాలు పెంపొందింపజేసి ఉత్తేజితులను జేశారు.

### 27.2.5. పాశ్చాత్య విజ్ఞాన ప్రభావం :

భారతదేశం బహు భాషలు గల సువిశాలదేశం. అందువలన ఒకరి భావాలు మరొకరు తెలుసుకొనుట కష్టము. 1835 లో ఆంగ్లేయులు ఆంగ్లభాషను అధికారభాషగా ప్రకటించారు. భారతీయులు ఉద్యోగం కోసం ఆంగ్లభాష నభ్యసించిరి. ఈ భాష ఒకరినొకరు అర్థము చేసుకొనుటకు తామందరి ప్రయోజనాలు ఒకటేయని గ్రహించుటకు ఉపకరించినది. ఆంగ్లభాష ద్వారా పాశ్చాత్య విజ్ఞానమును వాల్టేర్, స్పెన్సర్, బెంథామ్ మున్నగువారి రచనలు భారతీయులను ఉత్తేజ పరచినవి. వారి రచనలలోని స్వేచ్ఛ, జాతీయత, స్వపరిపాలన మున్నగు అంశాలు భారతీయులను చైతన్యవంతులుగా చేసి, స్ఫూర్తినిచ్చి, దేశం కొరకు ఎలాంటి త్యాగాలు చేయుటకైనా సిద్ధపరచినవి.

### 27.2.6. రవాణా సౌకర్యములు :

19వ శతాబ్దపు ద్వితీయార్ధ భాగంలో ప్రయాణ సౌకర్యాలలో విప్లవాత్మకమైన మార్పులొచ్చినవి. డల్హౌసీ ప్రభువు రైల్వేలు, రహదారులు, తంతితపాలా సౌకర్యాలు ప్రవేశపెట్టుట వలన దూరప్రయాణం సులభతరమయింది. వార్తలు ఒక ప్రాంతం నుండి

మరొక ప్రాంతానికి సులువుగా, చౌకగా, శీఘ్రంగా ప్రయాణించాయి. ఒక ప్రాంతం వారు మరొక ప్రాంతం వారితో కలియుటకు ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకొనుటకు తామంతా ఏక జాతీయులమని గ్రహించుటకు ఇవి దోహదం చేసాయి.

## 27.2.7. దేశభాషల అభివృద్ధి :

19వ శతాబ్దంలో హిందీ, బెంగాలీ, ఉర్దూ వంటి దేశభాషలు దేశభక్తిపూరిత రచనలచే సుసంపన్నం చేయబడినాయి. వందేమాతరం అనుభక్తి గీతము ఉన్న ఆనంద్‌మఠ్‌ను బంకించంద్రుడు బెంగాలీ భాషలో రచించాడు. ఈ నవల బ్రిటీష్‌పాలన వలన కలిగిన రాజకీయ, ఆర్థిక దుష్ఫలితాలను భారతీయులలో దేశభక్తిని జాతీయ భావమును కలిగించింది.

## 27.2.8. వార్తాపత్రికలు :

భారతీయులలో జాతీయతా భావమును పెంపొందించుటలో వార్తాపత్రికలు ప్రముఖపాత్ర వహించాయి. బెంగాలులో భారత దర్పణం, అమృతబజార్ పత్రిక, హిందూ, బెంగాలి, కేసరి, మరాఠీ, బాంబే సమాచార్, మున్నగునవి, హిందూ, స్వదేశమిత్రన్, మద్రాసులో ఆంధ్రప్రకాశిక ప్రజలను విశేషముగా ప్రభావితం చేశాయి. తమ అసంతృప్తిని తొలగించుటకు, దోపిడిని నిరోధించుటకు ప్రభుత్వంపై పోరాటం సాగించవలసినదిగా ప్రజలను ప్రేరేపించాయి.

## 27.2.9. ఆంగ్లేయులు జాతి విచక్షణా విధానం :

ఆంగ్లేయులు భారతీయులను తక్కువ జాతిగా ఎంచి వారి యందు ప్రతిభలేదని, ఉద్యోగములందు అవకాశాలు కల్పించలేదు. జాతి విచక్షణా విధానము ననుసరించి భారతీయులను అవమానించారు. అట్టి అవమానమును భరింపలేక భారతీయులు ఆంగ్లేయుల అహంకారం అణచ దృఢ సంకల్పులైరి.

## 27.2.10. చారిత్రక పరిశోధనలు :

భారతదేశానికి సంబంధించిన గత చరిత్ర అధ్యయనం పాశ్చాత్యులు ప్రారంభించారు. కన్నింగ్ హోమ్, సర్ విలియం జోన్స్, మాక్స్‌ముల్లర్ మొదలగువారు భారతీయ చరిత్ర సమకాలీన నాగరికతకు తీసిపోదని తమ రచనల్లో పేర్కొన్నాడు. ఈ రచనలు భారతీయులలో జాతీయభావాన్ని పెంపొందించాయి.

## 27.2.11. రాజకీయ సంఘాలు :

19వ శతాబ్దంలో స్థాపించబడిన అనేక రాజకీయ సంఘాలు ప్రజలలో జాతీయ, చైతన్యాన్ని కలిగింపజేయడానికి ఎంతో దోహదం చేసినాయి. 'బాంబే ప్రెసిడెన్సీ అసోసియేషన్', 'మద్రాస్ నేటివ్ అసోసియేషన్', 'ఇండియన్ అసోసియేషన్' మొదలగు సంఘాలు ప్రజాభిప్రాయాలను వెల్లడించి ప్రజాభిప్రాయ రూపకల్పనలో కీలకమైన పాత్రను నిర్వహించాయి.

## 27.2.12. లిట్టన్, రిప్పన్ విధానాలు :

లార్డ్ లిట్టన్ అనుసరించిన భారతీయ వ్యతిరేక విధానాలు, క్షామ సమయములో ఢిల్లీ దర్బారు ఏర్పాటు చేయుట, ఆఫ్ఘనిస్థాన్‌తో యుద్ధం, దేశభాషల, ఆయుధాల చట్టాలు భారతీయులలో ప్రతీకార ధోరణులను రెచ్చగొట్టినాయి. లార్డ్ రిప్పన్ ప్రవేశపెట్టిన ఇల్బర్టు బిల్లు వివాదాలకు దారితాసి భారతీయుల కళ్ళు తెరిపించినది.

## 27.2.13. భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం :

భారత జాతీయ వాదులందరినీ ఏకం చేయగల అఖిల భారత సంస్థను నెలకొల్పే ఘనత ఎ.ఓ. హ్యూమ్ అను ఆంగ్లేయునికి దక్కింది. ఇతని కృషి ఫలితంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ అను సంస్థ ఏర్పడినది. ఈ కాంగ్రెస్ మొదటి సమావేశం 1855 డిసెంబర్ 28న బొంబాయిలో జరిగింది. ఈ సమావేశమునకు డబ్ల్యు.సి. బెనర్జీ అధ్యక్షత వహించాడు. దేశం నలుమూలల నుండి ప్రతినిధులు ఇందు పాల్గొన్నారు.

### 27.2.14. ముగింపు :

పై విధంగా భారతీయ ప్రజలలో జాతీయ చైతన్యం కలగడానికి రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత కారణాలు, పాశ్చాత్య విజ్ఞానం, పత్రికలు, జాతి వివక్షణ విధానం మొదలగునవి దోహదం చేశాయి. ఈ జాతీయ చైతన్యమే జాతీయోద్యమ పుట్టుక, అభివృద్ధికి కారణమైంది.

## 27.3. మితవాద జాతీయోద్యమం (1885 - 1905) :

### 27.3.1. ఉపోద్ఘాతము :

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయులలో పెల్లుబుకు అసంతృప్తిని జాతీయభావమును సక్రమ మార్గంలో నడిపించి ప్రజాభిమానాన్ని బ్రిటీష్ ప్రభుత్వానికి తెలియజేయుటకు ఒక సంస్థ అవసరమని ఎ.ఓ. హ్యూమ్, సురేంద్రనాధ్ బెనర్జీ మొదలగువారు భావించారు. వారి కృషి ఫలితంగా భారత జాతీయ కాంగ్రెస్ అను సంస్థ యేర్పడింది. ఈ జాతీయ కాంగ్రెస్ మొదట సమావేశం 1885 డిసెంబరు 28న బొంబాయిలో గోకుల్‌దాస్ తేజ్‌పాల్ సంస్కృత కళాశాలలో జరిగింది. ఈ సమావేశానికి డబ్ల్యు.సి. బెనర్జీ అధ్యక్షత వహించెను. ఈ సమావేశానికి దేశ నలుమూలల నుండి 72 మంది ప్రతినిధులు హాజరైరి. వారిలో వివిధ వృత్తులవారు, వివిధ ప్రాంతాలవారు, వివిధ మతాలవారున్నారు. ఈ సంస్థ అచిరకాలముననే బలీయమైన ప్రజాసంస్థగా మారెను. సాతంత్ర్యం కొరకు భారత జాతీయ కాంగ్రెస్ జరిపిన పోరాటాన్ని మూడు ఘట్టాలుగా విభజించవచ్చును. మొదటి దశలో (1885 - 1905) మితవాదుల ప్రాబల్యం ఎక్కువగా వుంది. రెండవదశలో (1905 - 1919) అతివాదులు రంగంలోకి వచ్చారు. మూడవ దశలో (1919 - 1947) జాతీయ ఉద్యమానికి గాంధీ సారధ్యం వహించి భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించిపెట్టాడు.

### 27.3.2. మితవాద యుగం (1885 - 1905) :

1885 నుండి 1905 వరకు సాగిన జాతీయోద్యమానికి మితవాదులు నాయకత్వం వహించారు. మితవాదులలో ముఖ్యమైనవారు. దాదాబాయ్ నౌరోజీ, సురేంద్రనాధ్ బెనర్జీ, ఫిరోజ్ షామెహతా, గోపాలకృష్ణ గోఖలే, మహాదేవ గోవింద రనడే మొదలగువారు.

### ఎ) మితవాదుల భావాలు - పద్ధతులు :

మితవాదులు భారతదేశమునకు స్వాతంత్ర్యము కావలెనని కోరలేదు. దేశ క్షేమం దృష్ట్యా కొన్ని రాజకీయ, సాంఘిక, ఆర్థిక సంస్కరణలు అవసరమని కోరారు. వీరు ఆంగ్లేయులకు వ్యతిరేకులు కారు. భారతదేశ పురోగతికి ఆంగ్లపాలన అవసరమని వీరు భావించారు. వీరికి బ్రిటీష్‌వారి పట్ల విశ్వాసము కలదు. అందుకే వారు తమ కోర్కెలను రాజ్యాంగబద్ధమైన శాంతియుత మార్గాల ద్వారా బ్రిటీష్ వారికి విన్నవించి ప్రజాహిత సంస్కరణలు పొందుటకు ప్రయత్నించారు. ఇవి పొందుటలో వారు ప్రార్ధన, విజ్ఞప్తి, నిరసన మొదలగు విధానాల ననుసరించారు.

### బి) మితవాదుల కోర్కెలు :

మితవాదుల కోర్కెలలో ముఖ్యమైనవి కేంద్ర, రాష్ట్ర కార్య నిర్వాహక మండలులలో భారతీయులను నియమించుట, వాయవ్య సరిహద్దు రాష్ట్రంలోను, అయోధ్య, పంజాబు రాష్ట్రాలలోను శాసనసభలను నిర్వహించుట, కేంద్ర, రాష్ట్ర శాసనసభలలోని సభ్యులు ప్రజలు ఎన్నుకొన్నవారై ఉండుట, సైన్యంలో భారతీయులకు ఉన్నత స్థానం కల్పించుట, భారతదేశంలో పరిశ్రమలు అభివృద్ధి చేయుట, భూమిశిస్తు సమంగా విధించుట, వెట్టిచాకిరి రద్దుచేయుట, ప్రభుత్వ ఉద్యోగాలు భారతీయులను ఎక్కువగా వచ్చేటట్లు చూడటం మొదలగునవి.

## సి) మితవాదులు సాధించిన విజయాలు :

ఈ దశలో కాంగ్రెస్ నాయకులు బ్రహ్మాండమైన విజయాలు సాధించలేకపోయినా కొంత నిర్మాణాత్మక కృషి చేసారు. ఈ దశలో కాంగ్రెస్ ప్రజలకు రాజకీయ శిక్షణ నిచ్చింది. ప్రజలలో జాతీయాభిమానాన్ని పెంపొందించినది. కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 72 నుండి 1,248 కి పెరిగింది. భారతీయుల అసంతృప్తిని తొలగించుటకు బ్రిటీష్ ప్రభుత్వం 1892లో ఇండియా కౌన్సిల్ చట్టం చేసింది.

## డి) మితవాదుల పట్ల బ్రిటీష్ వైఖరి :

బ్రిటీష్‌వారు మితవాదుల పట్ల మొదట స్నేహమును తదుపరి వ్యతిరేకతను ప్రదర్శించిరి. జాతీయ కాంగ్రెస్ స్థాపింపబడిననాడు డఫ్రిన్ కాంగ్రెస్ నాయకులకు విందులు చేసి సత్కరించెను. అయితే చివరకు కాంగ్రెస్‌ను తీవ్రముగా విమర్శించుచూ, ఇది అల్పసంఖ్యాక వర్గ ప్రాతినిధ్య సంస్థ అని అభివర్ణించెను. నాటినుండి ఆంగ్లేయులు జాతీయ కాంగ్రెస్‌పై శత్రుభావము ప్రదర్శించిరి. 1890లో బ్రిటీష్ ప్రభుత్వం కాంగ్రెస్ సమావేశాలకు ఏ బ్రిటీష్ ఉద్యోగి హాజరు కారాదని కాంగ్రెస్ నాయకులతో ఎట్టి సంబంధాలు పెట్టుకొనరాదని ఆదేశించెను. బ్రిటీష్‌వారు జాతీయ కాంగ్రెస్‌ను బలహీన పరచుటకు ముస్లింలను, స్వదేశ సంస్థానాధీశులను వేరుచేసి వారితో మైత్రిని పొందడానికి ప్రయత్నించారు. కాని వీరి చర్యలు ఎటువంటి ప్రయోజనాలు చేకూర్చలేదు. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నా జాతీయ కాంగ్రెస్ బలపడటమే జరిగింది.

## 27.4. అతివాద జాతీయోద్యమం (1905 - 1919) :

### 27.4.1. ఉపోద్ఘాతము :

భారత జాతీయోద్యమ స్వభావంలో 1905 నుండి మార్పు వచ్చింది. అప్పటి వరకు కాంగ్రెస్ మహాసభ ఆంగ్లేయులకు సహకరిస్తూ, తీర్మానాల రూపంలో తమకు కావలసిన రాజకీయ, ఆర్థిక అవసరాలను ప్రభుత్వానికి తెలియజేస్తూ ప్రభుత్వ దయ కోసం పనిచేసేది. కాని రెండవదశలో మితవాదుల ప్రాధాన్యత తగ్గి జాతీయోద్యమానికి అతివాద నాయకులు నాయకత్వం వహించినారు. తత్ఫలితంగా ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఈ దశలోనే ముస్లిం మతతత్వం, విప్లవపక్షం ఆవిర్భవించాయి. అతివాద నాయకులలో ముఖ్యులు బాలగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్.

### 27.4.2. అతివాద జాతీయతా భావము జనించుటకు కారణాలు :

1892 కౌన్సిళ్ళ చట్టం భారతీయులను తృప్తిపరచలేదు. దీనివలన భారతీయులకు పరిపాలనలో తగు అవకాశము లభించలేదు. అందువలన కాంగ్రెస్‌లోని ఒక వర్గం మాటల ద్వారా గాక చేతల ద్వారా మాత్రమే తమ కోర్కెలను సాధించవచ్చునని భావించినది. 1896 - 97లో కరువు - ప్లేగు వ్యాధి సంభవించి అనేక మంది ప్రజల ప్రాణాలు బలిగొన్నది. ఆంగ్ల ప్రభుత్వం సరయిన చర్యలు తీసుకొనక పోవుట వలన భారతీయులకు ఆంగ్లపాలన పట్ల ద్వేషభావము పెచ్చుపెరిగెను. భారతీయ విద్యావంతులలో రోజురోజుకు పెరిగిపోవు నిరుద్యోగ సమస్య, కార్మికవర్గం అనుభవించు ఇక్కట్లు వారిలో ఆంగ్లపాలన పట్ల తీవ్ర అసంతృప్తిని కలిగించెను. ఇంగ్లండు

దక్షిణాఫ్రికా మొదలగు దేశములందు భారతీయులను ఆంగ్లేయులు హీనముగా చూచుటవలన భారతీయులు ఆగ్రహించారు. వివేకానందుని బోధనలు భారతీయులలో ఆత్మవిశ్వాసము, ఆత్మాభిమానము పెంపొందించెను. బాహ్య పరిణామాలు కూడా భారతీయులను ప్రభావితం చేశాయి. అబిసీనియనులు 1896లో ఇటాలియన్‌లను తరిమివేయుట, 1905లో జపాన్ రష్యాను ఓడించుట మున్నగు విదేశీ సంఘటనలు భారతీయులను ఉద్రేక పూరితులుగా చేసినవి. కలకత్తా కార్పోరేషన్ చట్టం,విశ్వవిద్యాలయాల చట్టము, బెంగాలు విభజన మొదలగు కర్జన్ చర్యలు భారతీయులను ఆగ్రహావేశులను చేసినవి.

### 27.4.3. అతివాదుల విధానము :

అతివాదులు భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యము కావలెనని కోరారు. ఈ లక్ష్యాన్ని సాధించుటకు వారు సహాయనిరాకరణోద్యమమును ప్రారంభించారు. విదేశీ వస్తు బహిష్కరణ, ప్రభుత్వ ఉద్యోగాలను విడనాడుట, స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యతమిచ్చుట, బ్రిటీష్ విద్యాసంస్థలందు విద్య నభ్యసింపకుండుట, ఆంగ్ల న్యాయస్థానాలను బహిష్కరించుట, అవసరమైన పన్నులు చెల్లింపకుండుట, జాతీయ విద్య మున్నగునవి అతివాదుల విధానములలోని ముఖ్యాంశాలు. జాతీయతా భావమును ఒక మతముగా వ్యాప్తి చేయుటకు తిలక్ మహారాష్ట్రలో గణేశ్ ఉత్సవములను, శివాజీ ఉత్సవములను నిర్వహించెను.

### 27.4.4. బెంగాల్ విభజన :

కర్జన్ బెంగాల్‌ను 1905లో రెండు భాగాలుగా విభజించి పరిపాలనా సౌలభ్యం కోసం అలా చేశానని ప్రకటించాడు. తమను బలహీనపరచుటకు కర్జన్ ఈ చర్య తీసుకున్నాడని భావించిన బెంగాల్ వారు విభజనకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు. వారు అతివాదుల మార్గాలను అనుసరించుట వలన బెంగాల్ విభజనకు వ్యతిరేకముగా బెంగాల్ వారు ప్రారంభించిన ఉద్యమం అఖిల భారత ఉద్యమంగా మారింది.

### 27.4.5. వందేమాతరం ఉద్యమం (1905 - 1911) :

ఎ) 1905 నుంచి 1911 వరకు సాగిన స్వాతంత్ర్య సమర ఘట్టానికి వందేమాతర ఉద్యమం అని పేరు వచ్చింది. బంకించంద్రుడు రచించిన వందేమాతరం గేయాన్ని పాడటం, వందేమాతరం అనే నినాదాన్ని ఉపయోగించడం, వందేమాతరం బిళ్ళలు ధరించడం పరిపాటి అయింది. ఈ ఉద్యమానికి వందేమాతరం ఊతపదమై ఒకరి నొకరు పలకరించుకోవడానికి అభినందించుకోవడానికి ఈ మాటను ఉచ్చరించేవాడు. అందువల్ల ఈ ఉద్యమానికి వందేమాతరం అను పేరు లభించింది.

బి) 1905లో కర్జన్ తలపెట్టిన బెంగాల్ విభజనతో వందేమాతరం ప్రారంభమయింది. ఈ ఉద్యమం విజ్ఞాపనలకు మారుగా ఆందోళన అనే సాధనాన్ని ఉపయోగించింది. ఈ ఉద్యమాన్ని నిర్వహించుటలో, విజయవంతం చేయుటలో యువకులు, మేధావులు, నాయకులు, పత్రికలు గణనీయమైనపాత్ర వహించాయి. తిలక్, బిపిన్ చంద్రపాల్, రవీంద్రనాథ్ ఠాగూర్, సురేంద్రనాథ్ బెనర్జీ నాటి ప్రముఖ నాయకులు. నాటి పత్రికలలో ముఖ్యమైనవి వందేమాతరం, అమృతబజార్ పత్రిక, సంధ్య, యుగంధర్.

సి) వందేమాతరం ఉద్యమంలో స్వాతంత్ర్య సాధనకు సాయుధ పోరాటం సబబు కాదని అహింసాత్మకమైన పద్ధతులను ఉపయోగించడానికి నిర్ణయించుకొన్నారు. వాటిలో ప్రధానమైనవి 1. విదేశీ వస్తువుల బహిష్కరణ 2. స్వదేశీ వస్తువులను మాత్రమే వాడటం 3. ప్రభుత్వ పాఠశాలలను, విద్యాలయాలను బహిష్కరించి, జాతీయ విద్యాలయాలు స్థాపించి, స్వదేశాభిమాన పూరితులుగా చేయడం 4. ఆంగ్లేయులు స్థాపించిన న్యాయస్థానాలను బహిష్కరించి పంచాయతీలను స్థాపించడం 5. చట్ట ధిక్కారణ చేసి పన్నుల చెల్లింపు మానివేయడం.

డి) 1905 అక్టోబర్ 16న బెంగాల్ విభజన అమలులోకి వచ్చిన రోజునే బెంగాల్ వారు హర్తాళ్, నిరాహార దీక్షలు, రక్షక

బంధన్‌ను జరిపారు. విదేశీ వస్త్ర బహిష్కరణను, స్వదేశీ వస్తువుల వాడుకను కొనసాగించారు. విద్యార్థులు ఆంగ్ల విద్యా సంస్థలను బహిష్కరించారు. విదేశీ వస్తువులను అమ్మే దుకాణాల వద్ద పికెటింగ్ జరిపారు. దీనివలన ఇంగ్లండ్ నుండి దిగుమతియగు వస్తువులు పడిపోయి ఆంగ్లేయుల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. అతివాద నాయకులు ఈ ఉద్యమము నందు జేరి దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని వ్యాప్తిచేసారు. ఈ విధంగా మహారాష్ట్రలో తిలక్, పంజాబ్‌లో లాలా లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ ఉద్యమం వ్యాప్తిచేసారు. ఆంధ్రలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ముట్నూరి కృష్ణారావు, భోగరాజు సీతారామయ్య, కౌలా శ్రీరామమూర్తి మొదలగు వారు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంలోనే కోపల్లె హనుమంతరావు నాయకత్వాన మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపించబడింది.

ఇ) అతివాదులు ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని అణచడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొన్నది. అనేక చట్టాలు జారీచేసి ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడే హక్కు, విమర్శించే హక్కులను ప్రభుత్వం రద్దు చేసింది. ఊరేగింపులు, సమావేశాలు, ప్రదర్శనలు రద్దు చేయబడ్డాయి. బెంగాల్‌లోని నాయకులను దేశాంతరం పంపారు. తిలక్, అరవింద ఘోష్, సురేంద్రనాథ్ బెనర్జీలను ప్రభుత్వం ఖైదు చేసింది. పత్రికలపై అనేక ఆంక్షలు విధించింది. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా ఉద్యమం ఆగలేదు.

ఎఫ్) ఆంగ్ల ప్రభుత్వ అణచివేత చర్యల వలన భీతావహోద్యమం జనించింది. సాయుధ పోరాటం ద్వారా స్వరాజ్యమును సాధింపవలెనను ధ్యేయంతో వి.డి. సవార్కర్, భూపేంద్రనాథ్ దత్, వీరేంద్ర కుమార్ ఘోష్ మొదలగు వారు సాగించిన భీతావహ ఉద్యమ ఫలితంగా అనేక మంది ఆంగ్ల ఉద్యోగులు దౌర్జన్యం దాడులకు గురిఅయ్యారు.

జి) మింటో అనంతరం 1910లో హార్డింజ్ భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా వచ్చాడు. ఇతని సలహా మేర ఇంగ్లాండ్ రాజు ఐదవ జార్జి 1911 డిసెంబర్ 11న బెంగాల్ విభజన రద్దును ప్రకటించాడు. ఈ ప్రకటనతో వందేమాతరం ఉద్యమం నిలచిపోయింది.

హెచ్) వందేమాతరం ఉద్యమ ఫలితంగా - (1) 1911లో బెంగాల్ విభజన రద్దుచేయబడింది. బెంగాల్ సమైక్యం చేయబడింది. (2) 1907లో సూరత్ సమావేశమును భారత జాతీయ కాంగ్రెస్ మితవాద, అతివాద అను రెండు పక్షాలుగా చీలుటకు దోహదం చేసింది. అతివాదులు కాంగ్రెస్ నుండి బహిష్కరింపబడ్డారు. (3) ఆంగ్ల అణచివేత చర్యల వలన జనించిన భీతావహోద్యమం చాలాకాలం కొనసాగుటకు దోహదం చేసింది. (4) ఈ కాలంలో బ్రిటీష్‌వారు అనుసరించిన విధాన ఫలితంగా దేశంలోని కొంతమంది మహమ్మదీయులు జాతీయోద్యమాన్ని బలపరచకుండా బ్రిటీష్ ప్రభుత్వాన్ని బలపరిచారు. ముస్లింలు తమ ప్రయోజనాల రక్షణార్థమై 1906లో ముస్లింలీగ్ అను సంస్థను ఏర్పరచుకొన్నారు. సర్‌సయ్యద్ అహమ్మద్ ఖాన్ బోధించిన వేర్పాటువాద ఫలితమే ఈ సంస్థ. (5) మితవాదులను అతివాదుల నుండి వేరుచేయుటయేగాక, ముస్లింలను సైతం అతివాదులకు దూరంగా నుంచుటకు బ్రిటీష్ ప్రభుత్వం 1909లో మింటో - మార్లే సంస్కరణలను ప్రకటించింది. భారతీయులు ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా తీవ్రమైన నిరసనను తెలియజేసారు. (6) బ్రిటీష్ వారి రాజధాని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చటం జరిగింది. (7) వందేమాతరం ఉద్యమం తాత్కాలికంగా అంతమైందే కాని, నాటినుంచి ఆంగ్లేయులపై భారతీయులు తిరుగుబాటు చేయడానికి తయారయినారు. తన ఉద్యమాలను గాంధి విజయవంతంగా నడపడానికి ఈ వందేమాతరం ఉద్యమం ఎంతో సహాయపడిందని చెప్పక తప్పదు.

## 27.4.6. స్వయం పరిపాలనా (హోమ్‌రూల్) ఉద్యమం (1916 - '18) :

ఎ) జాతీయ ఉద్యమ చరిత్రలో వందేమాతరం తరవాత హోమ్‌రూలు ఉద్యమము ముఖ్య ఘట్టం. బ్రిటీష్ సామ్రాజ్యాధిపత్యం కింద దేశీయులకు స్వీయ ప్రభుత్వం లభింపజేయడం ఈ ఉద్యమ ఆశయం. ఈ ఉద్యమానికి నాయకులు అనీబీసెంట్, బాలగంగాధర తిలక్.

బి) 1911లో బెంగాలు రాష్ట్ర విభజన రద్దయిన తర్వాత 5 సం॥ల కాలం స్వాతంత్ర్యోద్యమం కొంతవరకు చల్లబడింది.

వందేమాతరం ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించిన నాయకులు శిక్షకు పాలయినారు. కాని 1914లో ప్రథమ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంలో జాతీయోద్యమానికి జీవం పోసినట్లైంది. ఈ యుద్ధంలో బ్రిటన్ ముస్లిం రాజ్యాధినేత, టర్కీ సుల్తాన్ అయిన ఖలీఫాతో పోరుసలపటం వల్ల భారతీయ ముస్లింల వైఖరిలో మార్పు వచ్చింది. ఆంగ్లేయుల యెడల వైముఖ్యంతో కాంగ్రెస్ సంస్థకు సన్నిహితులయ్యారు. దాని ఫలితంగా 1916లో లక్నో ఒప్పందం జరిగింది. దీని ప్రకారం కాంగ్రెస్ - ముస్లింలీగ్‌లు బ్రిటీష్ వారితో పోరాడుటకు నిర్ణయించారు. ఆంగ్లేయుల విభజించి పాలించు విధానమును గ్రహించిన కాంగ్రెస్ మితవాద, అతివాద నాయకులు అందలి ప్రమాదమును గ్రహించి తమ విభేదములను విస్మరించి సమైక్యంగా పోరాడుటకు 1916లో నిర్ణయించారు.

సి) మొదటి ప్రపంచ యుద్ధంలో ఆంగ్లేయులు ప్రజాప్రభుత్వాన్ని స్వల్పజాతుల స్వాతంత్ర్యాన్ని నిలబెట్టడానికి యుద్ధంలో ప్రముఖపాత్ర వహిస్తున్నారని బ్రిటీష్ మంత్రులు ప్రకటించారు. అందువలన భారతీయులకు కూడా స్వపరిపాలన లభించవచ్చునని భారతీయులు భావించారు. కాని ప్రభుత్వ చర్యలు దానికనుగుణంగా కనిపించకపోవడంతో భారతదేశంలో స్వయం పరిపాలనా ఉద్యమం ప్రారంభమయింది. తిలక్ జైలు నుండి విడుదలయి తన కార్యక్రమాలను ప్రారంభించాడు. అనీబీసెంట్ భారత రాజకీయాల్లో ప్రవేశించింది. అనీబీసెంట్ కృషి ఫలితంగా 1916లో జరిగిన లక్నో సమావేశంలో మితవాదులు అతివాదులు కలిశారు. 1916లో తిలక్, అనీబీసెంట్ లు స్వయం పరిపాలనా ఉద్యమాన్ని ప్రారంభించారు.

డి) గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయివరకు స్వపరిపాలనా సంస్థలను నెలకొల్పుటయే ఈ ఉద్యమ లక్ష్యము. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత స్వపరిపాలనా సంస్థలను నెలకొల్పవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తన 'న్యూ ఇండియా', 'దికామన్ వీల్' అను పత్రికల ద్వారా అనీబీసెంట్ మద్రాసులో 'కేసరి', మరాఠా' అను పత్రికల ద్వారా తిలక్ మహారాష్ట్రలో స్వయం పరిపాలనా ఉద్యమ లక్ష్యాలను, కార్యక్రమాన్ని ప్రజలకు అందజేసేవారు. కాంగ్రెస్ కార్యకర్తలు వీరికి తోడ్పడినారు. స్వమం పరిపాలనా ఉద్యమం ప్రజలలో నూతన చైతన్యాన్ని రేకెత్తించింది. ఉద్యమ కార్యకర్తలు నిర్వహించే బహిరంగ సభలలోను, ప్రదర్శనలలోను వారు విరివిగా పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

ఇ) ప్రభుత్వము ఈ పరిణామానికి భయపడి ఉద్యమాన్ని అణిచివేయడానికి పూనుకొన్నది. స్వయం పరిపాలన ఉద్యమ వార్తలను ప్రకటించరాదని పత్రికలపై ఆంక్షలు విధించింది. తిలక్‌పై నేరారోపణ చేసి 20 వేల రూపాయలు, ఇద్దరు హామీలను కోరెను. అతని పర్యటనలపై ఆంక్షలు విధించెను. అలాగే అనీబీసెంట్ వద్దనుండి 12 వేల రూపాయలు ధరావతుని వసూలు చేయడమే గాక 1917లో ఆమెను అరెస్టు చేసిరి. ఆమెను విడుదల చేయాలంటూ దేశంలో అనేకులు ఆందోళన చేసినారు.

ఎఫ్) ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఆందోళనకారులపై కఠిన చర్యలు తీసుకోవడం వల్ల పరిణామాలు మరీ దారుణంగా మారడం ప్రభుత్వాన్ని కలవర పరచింది. ఒకప్రక్క యుద్ధం భయంకరంగా జరుగుతుంది. యుద్ధంలో భారతీయుల సహాయం ఆంగ్లేయులకు చాలా అవసరమైంది. అందువల్ల భారతీయులను తమకు సుముఖంగా చేసుకోవడానికి రాజ్యాంగ కార్యదర్శి మాంటేగ్ పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేసాడు (1917). భారతీయులకు బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆంగ్లేయులు కృతనిశ్చయులై ఉన్నారు. కాని వెంటనే అటువంటి ప్రభుత్వం పూర్తిగా ప్రవేశపెడితే భారతీయులు అంతటి బాధ్యత వహించే స్థితిలో లేరు కాబట్టి క్రమేపి మెట్టుమెట్టుగా వారికి అధికారాలు సంక్రమింప చేసెదనని వాగ్దానం చేసాడు. మాంటేగ్ భారతదేశానికి వచ్చి వైస్రాయి ఛేమ్స్‌ఫర్డుతో కలిసి భారతదేశములోని వివిధ ప్రాంతాలలో పర్యటించి నాయకులతో సంప్రదించినాడు. మాంటేగ్ ప్రకటన తనకు సమ్మతంగా ఉందని అనీబీసెంట్ ఉద్యమాన్ని విరమించింది. మరికొంతకాలం పొడిగించి తిలక్ కూడా ఉద్యమాన్ని విరమించుకొన్నాడు. ఈ విధంగా హోమ్‌రూలు ఉద్యమం ముగిసింది.

జి) హోమ్‌రూల్ ఉద్యమం వందేమాతరం ఉద్యమంవలె తమ లక్ష్యసాధనలో విజయం సాధించింది. ఈ ఉద్యమం భారతీయులనే కాక విదేశీయులను గూడా ప్రభావిత మొనర్చి స్వయంపాలనా సూత్రమును ఆంగ్లేయులచే ఒప్పించింది. భారతదేశమున జాతీయ శక్తులు ఒకే త్రాటిపై నడుచుటకు ఈ ఉద్యమం దోహదం చేసింది.

## 27.5. ముగింపు :

ఆంగ్లేయులు భారతదేశంలో కొనసాగించిన ఆర్థిక దోపిడికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమం ప్రారంభమయింది. తొలిదశలో ఈ ఉద్యమంలో మితవాదులు ప్రముఖ పాత్ర వహించి ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేసిరి. రెండవ దశలో అతివాదులు ప్రముఖ పాత్ర నిర్వహించి వందేమాతరం ఉద్యమం నడిపి బెంగాల్ ను ఏకం చేయుటయే గాక హోమ్‌రూల్ ఉద్యమం ద్వారా స్వయంపాలనాధికారం పొందారు.

## మాదిరి ప్రశ్నలు :

1) 19వ శతాబ్దంలో భారతదేశంలో జాతీయతాభావం జనించడానికి గల కారణాలు పరిశీలించండి.
2) జాతీయోద్యమంలో అతివాద దశ గూర్చి విశదీకరించండి.
3) మితవాద జాతీయోద్యమాన్ని గురించి వివరింపుము.
4) వందేమాతరం ఉద్యమ ప్రాధాన్యత వివరింపుము.
5) హోమ్‌రూల్ ఉద్యమంలో తిలక్, అనీబీసెంట్ పాత్రను వివరింపుము.

## లఘు ప్రశ్నలు :

1) భారత జాతీయ కాంగ్రెస్
2) తిలక్
3) అనీబీసెంట్

## చదువదగిన గ్రంథాలు :


1) పాటిబండ ఝాన్సీలక్ష్మి - భారతదేశ చరిత్ర - సంస్కృతి, ద్వితీయభాగం - అల్లాడి వైదేహి
2) Tarachand - History of the Freedom Movement in India
3) R.C. Rajundar - History of Freedom Movement
4) Bipin Chandra - Modern India.


రచయిత : **వి.కె. మోహన్**

పాఠం - 28

# గాంధీజీ శకము (1919 - 1947)

విషయసూచిక


28.0. లక్ష్యం
28.1. ఉపోద్ఘాతం
28.2. గాంధీజీ రాజకీయాల్లో ప్రవేశం
28.3. 1919 రాజ్యాంగ చట్టం
28.4. రౌలట్ చట్టాలు
28.5. జలియన్ వాలాబాగ్ దురంతాలు
28.6. ఖిలాఫత్ ఉద్యమం
28.7. సహాయనిరాకరణోద్యమం
28.8. స్వరాజ్య పార్టీ
28.9. సైమన్ కమీషన్
28.10. పూర్ణ స్వరాజ్ తీర్మానం
28.11. శాసనోల్లంఘన ఉద్యమం
28.12. అఖిలపక్ష సమావేశాలు
28.13. కమ్యూన్యల్ అవార్డ్
28.14. రెండవ ప్రపంచ యుద్ధం
28.15. క్విట్ ఇండియా ఉద్యమం
28.16. స్వాతంత్ర్య సముపార్జన
28.17. ముగింపు


## 28.0 లక్ష్యం :

క్రీ.శ. 1919 మొదలు 1947 వరకు భారతదేశంలో గాంధీజీ నాయకత్వంలో సాగిన జాతీయోద్యమంలో గల వివిధ దశలను వివరించి, 1947 నాటికి భారతదేశానికి ఏవిధంగా స్వాతంత్ర్యం లభించిందో తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## 28.1. ఉపోద్ఘాతం :

క్రీ.శ. 1919 నుంచి భారత జాతీయోద్యమంలో నూతన శకం ఆరంభమైంది. గాంధీజీ జాతీయోద్యమానికి నాయకత్వం వహించి అహింస, సత్యాగ్రహం సిద్ధాంతాలు ఆయుధాలుగా ఉద్యమాలు నిర్వహించి భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించగలిగినాడు. గాంధీజీ నాయకత్వంలో కాంగ్రెస్ సంస్థ పటిష్టమైంది. గాంధీజీ కృషి ఫలితంగా అన్ని వర్గాలకు చెందినవారు జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

## 28.2. గాంధీజీ రాజకీయాల్లో ప్రవేశం :

మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ గుజరాత్ రాష్ట్రంలోని పోర్‌బందర్‌లో జన్మించాడు. ఇంగ్లండ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించి పట్టభద్రుడయి దక్షిణాఫ్రికాలో కొంతకాలం న్యాయవాదిగా పనిచేశాడు. ఈ కాలంలోనే ఆ దేశ ప్రభుత్వం అనుసరిస్తున్న జాతి విచక్షణ విధానానికి వ్యతిరేకంగా సత్యాగ్రహ ఉద్యమం నిర్వహించాడు. 1915లో భారతదేశం వచ్చి రెండు సంవత్సరాలపాటు దేశమంతా పర్యటించి పరిస్థితులను అవగాహన చేసుకొన్నాడు. 1917లో బీహార్‌లోని చాంపరాన్ జిల్లా నీలిమందు రైతుల హక్కుల పరిరక్షణకు, గుజరాత్‌లోని కైరా జిల్లా రైతుల హక్కుల రక్షణకు రెండు సత్యాగ్రహాలను జయప్రదంగా నిర్వహించాడు. 1918లో అహమ్మదాబాద్ జౌళి కార్మికుల సత్యాగ్రహాన్ని విజయవంతంగా నిర్వహించాడు. దీనితో ఆయన పేరు ప్రఖ్యాతులు దేశమంతా వ్యాపించినాయి. జాతీయ కాంగ్రెస్‌ను స్థాపించి వృద్ధిలోకి తీసుకొని వచ్చిన చాలామంది నాయకులు మరణించారు. తిలక్ ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. సురేంద్రనాధ్ బెనర్జీ ప్రజా ఉద్యమాలకు దూరమైనాడు. దీనికితోడు తనకు గల కార్యదీక్ష, త్యాగనిరతి, ప్రతిభవలన 1918 నాటికి జాతీయోద్యమ నాయకుడుగా ఆవిర్భవించగలిగాడు.

## 28.3. 1919 రాజ్యాంగ చట్టం :

కాంగ్రెస్ - ముస్లింలీగ్‌లు సన్నిహితమగుట, మితవాదులు - అతివాదులు ఏకమగుట, హోమ్‌రూల్ ఉద్యమం మున్నగు వాని వలన ప్రజలలో జాతీయ చైతన్యం పెల్లుబికింది. వారిని తృప్తిపరుచుటకు మాంటేగ్ భారతదేశంలో క్రమక్రమంగా బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని 1918లో ప్రకటించినాడు. వాటికే మాంటేగ్ - ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలని పేరు. వాటిని శాసించిన చట్టాన్ని 1919 రాజ్యాంగ చట్టం అంటారు. కానీ ఈ చట్టం భారతీయులకు సంతృప్తి కలిగించలేకపోయింది.

## 28.4. రౌలట్ చట్టాలు :

1919 రాజ్యాంగ చట్టం భారతీయుల తీవ్ర విమర్శలకు గురి అయినది. జాతీయ నాయకులు ఆందోళన చేయసాగారు. ఈ పరిస్థితులలో బ్రిటీష్ ప్రభుత్వం ఆందోళనను అణచివేయడానికి 1919లో రౌలట్ చట్టాలు చేసింది. ఈ చట్టాల వలన విచారణ జరపకుండా ఎవరినైనా శిక్షించే అధికారం అధికారులకు సంక్రమించింది. రౌలట్ చట్టాన్ని ప్రజలు, నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశంలో పెద్ద ఆందోళన ప్రారంభమైంది. ఈ ఆందోళనలోనే గాంధీజీ జాతీయోద్యమానికి నాయకత్వం వహించాడు. చట్టాన్ని ఉపసంహరించుకోమని చేసిన విన్నపాలను ప్రభుత్వం ఖాతరు చేయకపోవడంతో గాంధీజీ రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించాడు. 1919 ఏప్రియల్ 6న నిరసనదినంగా ప్రకటించాడు. గాంధీజీ ఆదేశానుసారం ఆరోజు దేశ నలుమూలలా హర్తాళ్ జరిగింది. బహిరంగ సభలు, ఊరేగింపులు జరిగాయి. ఈ ఉద్యమంలో హిందువులు, ముస్లింలు కలిసి పాల్గొన్నారు.

## 28.5. జలియన్ వాలాబాగ్ దురంతాలు :

1919 రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా అమృతసర్‌లో హర్తాళ్ ప్రశాంతంగా జరిగినపుడు సత్యపాల్, కిచ్లూలను పంజాబ్ ప్రభుత్వం నిర్బందించింది. అందుకు నిరసనగా జరిగిన ప్రదర్శనపై పోలీసులు కాల్పులు జరపగా 20 మంది మరణించారు. చాలా మంది నిర్బంధించబడ్డారు. మృతుల సంస్మరణార్ధము, పోలీసుల చర్యలకు నిరసనగా 1919 ఏప్రియల్ 13న జలియన్ వాలాబాగ్‌లో సమావేశ మేర్పాటయింది. సమావేశాలను నిషేధిస్తూ పంజాబ్ ప్రభుత్వం చేసిన ప్రకటన తగినంతగా ప్రచారం చేయబడలేదు. సమావేశం ప్రారంభం కాగానే డయ్యర్ సేనాని తన సైనికులతో వచ్చి ఎలాంటి హెచ్చరిక చేయకుండా కాల్పులు జరిపించాడు. బాగ్ గోడలు కోట గోడలు లాగ ఉండి ఒకే మార్గం ఉండటం వలన ప్రజలు తప్పించుకొని పారిపోలేక పోయారు. 379 మంది అక్కడికక్కడే మరణించగా

1200 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర సంఘటనను గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ మున్నగు నాయకులు తీవ్రంగా ఖండించారు. తన నిరసనను తెలియజేస్తూ రవీంద్రనాథ్ ఠాగూర్ సర్ బిరుదును త్యజించాడు. డయ్యర్‌ను శిక్షించాలని దేశ ప్రజలంతా ఆందోళన చేశారు. ప్రభుత్వం ప్రజలను శాంతింపచేయడానికి 1919లో హంటర్ అధ్యక్షతన ఒక విచారణ సంఘాన్ని నియమించింది. ప్రభుత్వం డయ్యర్‌మీద ఎటువంటి చర్య తీసుకొనలేదు. అతనిని సర్వీస్ నుండి మాత్రమే తొలగించింది. పంజాబ్ దురంతాలకు నిరసనగా గాంధీజీ సత్యాగ్రహ ఉద్యమం ప్రారంభింప నిశ్చయించాడు.

## 28.6. ఖిలాఫత్ ఉద్యమం :

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత మిత్ర రాజ్యాల వారు టర్కీ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేశారు. అంతేగాక టర్కీ సుల్తాన్‌ను ప్రపంచ మహమ్మదీయ అధికారిగా (ఖలీఫా) వ్యవహరించరాదని నిర్ణయించారు. దీని ఫలితంగా ఖలీఫా వ్యవస్థ రద్దయింది. ఈ చర్యకు ఇతర దేశాల మహమ్మదీయులతో బాటు భారతదేశంలోని మహమ్మదీయులు కూడా తీవ్ర నిరసన తెలియజేసారు. ఖలీఫా పదవి నిలబడాలని వారు ఆందోళన ప్రారంభించారు. దీనినే ఖిలాఫత్ ఉద్యమం అంటారు. దేశ వ్యాప్తంగా ఒక ఉద్యమాన్ని నిర్వహించడానికి నిర్ణయించారు. హిందువులు మహమ్మదీయులు ఐక్యం కావడానికి ఒక అవకాశంగా భావించి ఈ ఉద్యమంపట్ల గాంధీజీ మద్దతు ప్రకటించాడు. ఖిలాఫత్ విషయంలో భారతీయ ముస్లింల కోరికలు నెరవేర్చడానికి ఒక జాతీయ సహాయనిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభిస్తానని గాంధీజీ ప్రకటించాడు.

## 28.7. సహాయనిరాకరణోద్యమం లేదా ఖిలాఫత్ ఉద్యమం (1921 - 22) :

ఎ) జలియన్ వాలాబాగ్ దురంతాలకు వ్యతిరేకంగా, ఖిలాఫత్ ఉద్యమానికి అనుకూలంగా స్వరాజ్య సాధన కొరకు గాంధీజీ సహాయనిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించాడు.

బి) 1920 సెప్టెంబర్‌లో జాతీయ కాంగ్రెస్ లజపతిరాయ్ అధ్యక్షతన కలకత్తాలో ప్రత్యేక సమావేశం జరిపి గాంధీజీ ప్రతిపాదించిన సహాయనిరాకరణ కార్యక్రమాన్ని ఆమోదించింది. ఆ తదుపరి 1920 డిసెంబరు 26 - 31 తేదీలలో విజయ రాఘవాచారి అధ్యక్షతన నాగపూర్ నందు జరిగిన కాంగ్రెస్ సాంవత్సరిక సమావేశంలో ఈ సహాయ నిరాకరణోద్యమాన్ని ఆమోదించింది. ఈ సమావేశము నందే కాంగ్రెస్ మొదటిసారిగా తన ధ్యేయం 'స్వరాజ్య'మని ప్రకటించింది. దీనిని శాంతియుత పద్ధతుల ద్వారా అనగా సహాయ నిరాకరణోద్యమం ద్వారా సాధించుటకు ప్రయత్నిస్తామని ప్రకటించారు.

సి) సహాయ నిరాకరణోద్యమంలో చేరినవారు ఏమేమి చేయవలెనో 1920లో జాతీయ కాంగ్రెస్ తీర్మానాలు చేసింది. వాటిలో ముఖ్యమైనవి (1) గౌరవ ఉద్యోగాలను, బిరుదులను త్యజించడం, స్థానిక సంస్థలలో నామ నిర్దేశం వల్ల పొందిన సభ్యత్వాలకు రాజీనామా ఇవ్వటం. (2) ప్రభుత్వాధికారుల గౌరవం కోసం ఏర్పాటయ్యే దర్బారులకు గాని సన్మానాలకు గాని హాజరు కాకపోవడం. (3) ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలో గాని, ప్రభుత్వ సహాయం పొందుతున్న సంస్థలలో గాని పిల్లలు చేరకుండా, వాటిస్థానే జాతీయ పాఠశాలలను అన్ని రాష్ట్రాలలోను ఏర్పాటుచేసుకోవడం. (4) న్యాయవాదులూ, ఇతరులూ ప్రభుత్వ న్యాయస్థానాలను బహిష్కరించడం, వాటిస్థానే ప్రజల తగాదాలను తీర్చడానికి గ్రామ పంచాయతీలను స్థాపించుకోవడం. (5) విదేశాలలో పనిచేయడం కోసం సైనికులు గాని గుమస్తాలు గాని వెళ్ళకపోవడం. (6) నూతన శాసనసభల ఎన్నికలకు ఎవరూ అభ్యర్థులుగా నిలబడక పోవడం, నిలబడిన వారు ఉపసంహరించుకోవడం. (7) విదేశీ వస్తువులను బహిష్కరించడం.

డి) సహాయ నిరాకరణోద్యమం మూడు రీతులలో కొనసాగింది అవి : (1) నిర్మాణ కార్యక్రమం (2) బహిష్కరణ కార్యక్రమం (3) శాసనోల్లంఘనం. నిర్మాణ కార్యక్రమంలో రాట్నంపై నూలువడకటం, ఖద్దరు వస్త్ర ఉత్పత్తి, ఖద్దరు వస్త్రధారణం, త్రాగుడు నిర్మూలన, అస్పృశ్యతా నివారణ, హిందూ - ముస్లిం సఖ్యత ముఖ్యమైనవి. గాంధీజీ అనేక ప్రాంతాలలో పర్యటించి ఈ ఉద్యమం గురించి ప్రచారం చేశాడు. బహిష్కరణ కార్యక్రమంలో విదేశీ వస్తువుల బహిష్కరణ, ఆంగ్ల పాఠశాలలను, కళాశాలలను

బహిష్కరించుట, ప్రభుత్వ న్యాయస్థానాల బహిష్కరణ, ప్రభుత్వమిచ్చిన బిరుదులను త్యజించుట, ఎన్నికలను బహిష్కరించుట, ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా చేయుట ముఖ్యమైనవి, శాసనోల్లంఘన కార్యక్రమంలో పన్నుల చెల్లింపకుండుట ముఖ్యమైనది.

ఇ) 1921లో సహాయ నిరాకరణోద్యమం గాంధీజీ నాయకత్వాన ప్రారంభమయ్యింది. గాంధీజీ ఆదేశం మేరకు వందలాది న్యాయవాదులు వారి వృత్తి మానుకున్నారు. శాసనసభలలో ప్రవేశించదలచినవారు వారి అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకొన్నారు. విద్యార్థులు విద్యాలయాలను బహిష్కరించి రాజకీయ రంగంలో ప్రవేశించి ప్రజలను ఆవేశపూరితులుగా చేశారు. విదేశీ వస్తువులను విక్రయించే దుకాణాలవద్ద, సారాయి దుకాణాల వద్ద పికెటింగ్ చేసారు. వారిమీద పోలీసులు అత్యాచారాలు చేసినా లక్ష్యపెట్టలేదు. అనేకులు కారాగార శిక్షకు గురి అయినారు. ప్రభుత్వం అంటే భయపడుతూ ఉండే ప్రజలు భయాన్ని వీడి అధికారులపై ఎదురు తిరిగారు. ఈ సందర్భంలో గుంటూరు జిల్లాలోని చీరాల - పేరాల గ్రామంలోను, పల్నాడు తాలూకాలోను, పెదనందిపాడులోను ఆంధ్రులు ప్రభుత్వాన్ని ధిక్కరించారు. అటులనే బీహార్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, కేరళలో అనేకులు ఉద్యమాలు నిర్వహించారు. ఇట్టి పరిస్థితులలో వేల్స్ రాకుమారుడు భారతదేశం రాగా హర్తాళ్ళు జరిగెను. ఈ ఉద్యమాన్ని అణచుటకు బ్రిటిష్ ప్రభుత్వం జాతీయ కాంగ్రెస్, ఖిలాఫత్ సంస్థలను నిషేధించి జాతీయ నాయకులను జైలుకు పంపింది.

ఎఫ్) జాతీయ కాంగ్రెస్ 1921 డిసెంబరులో అహ్మదాబాద్‌లో చిత్తరంజన్ దాస్ అధ్యక్షతన సమావేశమై ఉద్యమాన్ని తీవ్రతరం చేయుట ద్వారానే 'స్వరాజ్యం' సాధించుట సులభమను తీర్మానమును ఆమోదించెను. బార్డోలీ నందు గాంధీజీ పన్నుల నిరాకరణోద్యమం ప్రారంభించదలచెను. ఇంతలో గోరక్‌పూర్ జిల్లాలోని చౌరీచౌరాలో 1922 ఫిబ్రవరి 5న రైతుల ఊరేగింపుపై పోలీసులు కాల్పులు జరిపారు. దానికి ప్రతీకారంగా అక్కడ జనసమూహం పోలీస్ స్టేషన్‌ను తగలబెట్టగా ఒక ఇన్‌స్పెక్టర్ 25 మంది పోలీసులు సజీవదహనమయ్యారు. ఈ సంఘటన జరిగిన వెంటనే ప్రజలు శాంతియుత పోరాటమునకు సంసిద్ధులుగా లేరని సహాయ నిరాకరణోద్యమాన్నే గాక తాను నిర్వహించ తలపెట్టిన బార్డోలీ సత్యాగ్రహమును కూడా గాంధీ నిలుపుదల చేసాడు.

జి) ఉధృతంగా సాగుతున్న సహాయ నిరాకరణోద్యమాన్ని గాంధీజీ హఠాత్తుగా నిలిపివేయడం మిగతా కాంగ్రెస్ నాయకులకూ ఆశాభంగం కలిగించింది. సి.ఆర్.దాస్, మోతీలాల్, లజపతిరాయ్ మొదలగు నాయకులు తమ తీవ్ర నిరసన తెలిపారు. ముస్లింలు కూడా గాంధీజీ చర్యను వ్యతిరేకించారు. ఉద్యమాన్ని నిలుపుదల చేయడం వల్ల గాంధీజీ అపఖ్యాతి పాలయ్యాడు. దీనినాసరాగా తీసుకొని బ్రిటీష్ ప్రభుత్వం గాంధీజీపై రాజద్రోహం నేరం మోపి కారాగార శిక్ష విధించింది. దీనితో సహాయ నిరాకరణోద్యమం ముగిసిపోయింది.

హెచ్) ఈ కాలంలోనే ఆంధ్ర ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు విప్లవ ఉద్యమం జరిగింది. ఉద్యమం హఠాత్తుగా నిలిపివేయడం వల్ల చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు మొదలగువారు విప్లవ ఉద్యమాలు నడిపి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించారు.

ఐ) సహాయ నిరాకరణోద్యమం (ఖిలాఫత్ సమస్య, పంజాబు దురంతాలు, స్వరాజ్యం) విఫలమైనా ఈ ఉద్యమం వల్ల కొన్ని లాభాలు లేకపోలేదు. ఇది జాతీయోద్యమాన్ని పటిష్టం చేసింది. ఈ ఉద్యమ కారణంగానే కాంగ్రెస్ ప్రజా ఉద్యమ సంస్థ అయింది. ఇది భారతీయుల్లో ధైర్యాన్ని, దేశభక్తిని పెంపొందించింది. కాలక్రమాన గాంధీజీ ఆశయాలు ఫలప్రదం కావడానికి కావలసిన పునాదులు ఏర్పరచడానికి ఈ ఉద్యమం సహాయపడిందని చెప్పవచ్చు.

## 28.8. స్వరాజ్య పార్టీ :

సహాయ నిరాకరణ ఉద్యమ ఉపసంహరణ దేశ ప్రజలను నిస్పృహలో ముంచివేసింది. సి.ఆర్. దాస్, మోతీలాల్ నెహ్రూ వంటి ప్రముఖ కాంగ్రెస్ నాయకులు గాంధీజీ చర్యను తీవ్రంగా విమర్శించారు. అయినా గాంధీజీ చలించలేదు. ఆయన సహాయ నిరాకరణ ఉద్యమ కార్యక్రమాలు నిర్మాణాత్మక అంశాలపై కేంద్రీకరించారు. రాజగోపాలాచారి వంటి నాయకులు ఈ కార్యక్రమాన్ని బలపరిచారు.

వీరిని మార్పు ప్రతికూలవాదులంటారు. సి.ఆర్. దాస్, మోతీలాల్ నెహ్రూ వంటి నాయకులు కాంగ్రెస్ తన వైఖరి మార్చుకొని శాసనసభలో ప్రవేశించి ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టాలని వాదించారు. వీరిని మార్పునకు అనుకూల వాదులంటారు. వీరు కాంగ్రెస్‌లోనే ఉంటూ తమ లక్ష్య సాధనకోసం 'స్వరాజ్య పార్టీ' ని స్థాపించి దాని ద్వారా ఎన్నికలలో పోటీ చేసారు (1923). వారు కేంద్ర శాసనసభలలో అధిక స్థానాలు సంపాదించగలిగారు. రాష్ట్రాలలో కూడా ఈ పార్టీ అనేక స్థానాలను గెల్చుకొన్నది. వీరు శాసనసభల ప్రభుత్వ విధానాలలోని లోపాలను బహిర్గతం చేస్తూ గణనీయమైన కృషి చేశారు. సహాయ నిరాకరణ ఉద్యమం హఠాత్తుగా నిలిపివేసిన సమయంలో ఈ పార్టీవారు కొత్త విధానాలలో ప్రజలను ఉత్తేజ పరచడానికి ప్రయత్నించారు. కాని కాలక్రమేణా జయకర్, మూంజీ వంటి స్వరాజ్య వాదులు ప్రభుత్వ అనుకూలురుగా మారడంలో ఆ పార్టీ అభాసుపాలై 1926 నాటికి క్షీణించింది.

## 28.9. సైమన్ కమీషన్ :

1919 భారత ప్రభుత్వ చట్టం ఆచరణలో ఏవిధంగా పనిచేస్తున్నదో పరిశీలించడానికి బ్రిటీష్ ప్రభుత్వం సైమన్ అధ్యక్షతన ఒక కమీషన్ భారతదేశం వచ్చింది. ఆ సంఘ సభ్యులందరూ ఆంగ్లేయులే. అందువలన సైమన్ కమీషనును బహిష్కరించుటకు భారతీయులు నిశ్చయించారు. ఆ సంఘము ఎక్కడకు వెళ్ళినా 'సైమన్ గోబ్యాక్' అను నినాదములతో నల్లజెండాలు చేబూని ప్రజలు ప్రదర్శనలు జరిపారు. ప్రదర్శకులపై ప్రభుత్వం హింసాకాండను ఉపయోగించింది. మద్రాసులో ప్రకాశం నాయకత్వాన, అలహాబాద్‌లో నెహ్రూ నాయకత్వాన, లాహోర్‌లో లజపతిరాయ్ నాయకత్వాన జరిగిన ప్రదర్శనలపై జరిపిన లాఠీచార్జీలను ప్రజలు తీవ్రంగా నిరసించినారు. లాహోర్‌లో సాండర్స్ అనే పోలీస్ ఉద్యోగి లజపతిరాయ్‌ని లాఠీలతో బాదగా తీవ్రమైన గాయాలు కలిగి మరణించాడు. సాండర్స్‌ను భగత్ సింగ్, రాజగురులు కాల్చిచంపారు. ఎంత వ్యతిరేకత ఉన్నా సైమన్ కమీషన్ తన పనిని పూర్తి చేసుకొని 1930లో తన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రాతిపదికనే 1935లో భారత ప్రభుత్వ చట్టం రూపొందింది.

## 28.10. పూర్ణ స్వరాజ్ తీర్మానం :

అఖిల పక్షముల సమావేశ అభ్యర్థన మేరకు మోతీలాల్ నెహ్రూ 1928లో భారత రాజ్యాంగ సంబంధమైన నివేదిక తయారు చేసినాడు. ఈ నివేదికను దాదాపు అన్ని పార్టీలవారు వ్యతిరేకించారు. నెహ్రూ నివేదికలో సూచించిన బాధ్యతాయుత పాలన కాంగ్రెస్‌లోని యువకులైన జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌లకు నచ్చలేదు. వారు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరారు. మోతీలాల్ పంపిన నివేదిక విషయంలో భారత నాయకులలో ఏకీభావం కుదరకపోవటంతో బ్రిటీష్ ప్రభుత్వం ఈ నివేదికను గుర్తించలేదు. 1929 డిసెంబరులో లాహోర్‌లో రావీనదీ తీరాన జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ సమావేశం జరిగింది. అచట సంపూర్ణ స్వాతంత్ర్యమే కాంగ్రెస్ తక్షణ ధ్యేయమని ప్రకటించింది. దీని సాధనకై పన్నుల నిరాకరణతోబాటు శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రారంభించడానికి నిర్ణయం తీసుకోబడింది. 1929 డిసెంబర్ 31న రాత్రి 12 గంటలకు రావినదీ తీరంలో పింగళి వెంకయ్యచే తయారు చేయబడిన మూడు రంగుల పతాకాన్ని ఎగురవేశారు. 1930 జనవరి 26 స్వాతంత్ర్యదినంగా ప్రకటించింది.

## 28.11. శాసనోల్లంఘన ఉద్యమం లేక ఉప్పు సత్యాగ్రహం (1930 - 34) :

ఎ) సంపూర్ణ స్వరాజ్య సాధనకు గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని, ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభించాడు. ఉప్పు అందరికీ కావలసిన వస్తువు. దానిని తయారు చేసుకొనే స్వేచ్ఛ ప్రజలకు లేకపోవడం గర్హించదగ్గ విషయం. ఉప్పు తయారు చేసుకోరాదు, అని నిషేధించే ప్రభుత్వ చట్టాలను ధిక్కరించి, సముద్ర జలం తెచ్చి ఉప్పు తయారు చేయడమే ఈ సత్యాగ్రహంలో ముఖ్య కార్యక్రమం. ఇది సామాన్య ప్రజనీకాన్ని ఎంతో ఆకర్షించింది.

బి) గాంధీజీ 1930 మార్చి 12న సుశిక్షితులైన తన ఆశ్రమ వాసులతో 79 మంది అనుచరులతో 200 మైళ్ళ దూరం ప్రయాణం చేసి 24 రోజుల తరవాత ఏప్రిల్ 5న సముద్ర తీరాన ఉన్న దండి గ్రామం చేరి అక్కడ ఉప్పు శాసనోల్లంఘనం చేసాడు.

దీనికి దండి సత్యాగ్రహం అని పేరు. ఈ ఉద్యమం దేశంలో నలుమూలలా ఎంతో తీవ్రంగా జరిగింది. దేశం అంతా ఒక పెద్ద ఉప్పు సత్యాగ్రహ శిబిరం అయింది.

సి) ఉప్పు తయారుచేయడంతో బాటు ఈ ఉద్యమంలో ప్రజలు అనుసరించవలసిన కార్యక్రమాన్ని గాంధీజీ వివరించాడు. అందులో ముఖ్యాంశములు (1) ఉప్పు కోటారుల మీద దాడిచేయడం (2) కల్లు సారాయి దుకాణాల వద్ద పికెటింగ్ చేయడం (3) మద్యపాన నిషేధాన్ని అమలు చేయడం, ఆబ్కారీ వేలంపాటలో పాల్గొనకుండా ఉండటం (4) విదేశ వస్త్రాలను అమ్మే దుకాణాలను పికెటింగ్ చేసి వాటిని బహిష్కరించే ఉద్యమాన్ని విజయవంతం చేయడం, రాట్నాలపై నూలు వడకడం, ఖద్దరును విరివిగా ఉత్పత్తి చేయడం, అస్పృశ్యతను నివారించడం, హిందూ ముస్లిం ఐక్యతను బలపరచడం మొదలైనవి.

డి) ఈ ఉద్యమం దేశమంతటా అతి తీవ్రరూపం దాల్చింది. ఈ ఉద్యమంలో వేలసంఖ్యలో స్త్రీలు కూడా పాల్గొన్నారు. విదేశీ వస్త్ర బహిష్కరణ బాగా విజయవంతమైంది. దీని ఫలితంగా ఇంగ్లండ్‌లోని ఫ్యాక్టరీలు మూతపడి వేలకొలది ఆంగ్ల కార్మికులు నిరుద్యోగులైనారు. ఈ ఉద్యమంలో భాగంగా అనేక రాష్ట్రాలలో పన్నుల నిరాకరణోద్యమం కూడా భారీ ఎత్తున సాగింది.

ఇ) ఈ ఉద్యమం ప్రజాదరణ పొంది బలం పుంజుకునే సమయంలో ఆంగ్ల ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్ర చర్యలు తీసుకొన్నది. గాంధీజీతోబాటు అనేకమంది నాయకులను ప్రభుత్వం నిర్బంధించినది. 90 వేలకు పైగా కాంగ్రెస్ కార్యకర్తలు నిర్బంధింపబడినారు. బహిరంగ సభలు, ఊరేగింపులు నిషేధించారు. లాఠీచార్జీలు, కాల్పులు నిత్య సంఘటనలయినాయి.

## 28.12. అఖిలపక్ష సమావేశాలు :

1930లో ఉప్పు సత్యాగ్రహం తీవ్రస్థాయిలో ఉన్నదశలో సైమన్ కమీషన్ నివేదిక ప్రాతిపదికగా భవిష్యత్ భారత రాజ్యాంగ సూత్రాలను చర్చించి ఆమోదించే నిమిత్తం భారతీయ ప్రతినిధులతో బ్రిటీష్ ప్రభుత్వం లండన్‌లో అఖిలపక్ష సమావేశాలను ఏర్పాటుచేసింది. ఈ సమావేశమునకు జాతీయ కాంగ్రెస్ తరఫున ఎవ్వరూ పాల్గొనలేదు. చివరకు జయకర్, తేజ్ బహదూర్ సప్రూల చొరవమేరకు 1931 మార్చిన గాంధీజీ - ఇర్విన్‌కు మధ్య ఒప్పందము కుదిరింది. ఈ ఒప్పందము ప్రకారము గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమమును నిలుపుదల చేసి రెండవ అఖిలపక్ష సమావేశమునకు హాజరగుటకు అంగీకరించెను. ఇర్విన్ రాజకీయ ఖైదీలను విడుదల చేయుటకు, వ్యక్తులు ఉప్పును తయారుచేయుటకు అనుమతి నిచ్చుటకు అంగీకరించెను. 1931లో గాంధీజీ రెండవ అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నాడు. కాని జిన్నా మొండి వైఖరి వలన ఈ సమావేశంనందు ఎట్టి రాజకీయ పరిష్కారం కుదరలేదు. గాంధీజీ నిరాశతో స్వదేశమునకు తిరిగివచ్చాడు. గాంధీజీ స్వదేశమునకు రాగానే 1932 జనవరి 4 నుండి శాసనోల్లంఘనోద్యమాన్ని పునరుద్ధరింపదలచటంతో అరెస్టు చేయబడినాడు. కాని గాంధీజీ పిలుపు మేరకు ప్రజలు మరల ఉద్యమాన్ని ఆరంభించారు. ఈ ఉద్యమాన్ని అణచుటకు మరల ప్రభుత్వం పక్కా అణచివేత చర్యలు గైకొనవలసి వచ్చింది.

## 28.13. కమ్యూనల్ అవార్డ్ :

రెండవ అఖిలపక్ష సమావేశంలో ప్రత్యేక నియోజక వర్గాల సమస్యపై వివిధ పక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే బ్రిటీష్ ప్రభుత్వమే ఆ సమస్యపై ఒక నిర్ణయం తీసుకొని దానిని అమలు జరుపుతుందని బ్రిటీష్ ప్రధాని మాక్డోనాల్డ్ ప్రకటించాడు. ఈ ప్రకటనను అనుసరించి 1932 ఆగష్టున మాక్డోనాల్డ్ తన తీర్పును ప్రకటించాడు. దీనినే 'కమ్యూనల్ అవార్డ్' అంటారు. మహమ్మదీయులకు, క్రిస్టియన్‌లకు, శిక్కులకు, స్త్రీలకు, వెనుకబడిన జాతులవారికి, భారతదేశంలో నివసిస్తున్న ఐరోపావారికి ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని ఈ అవార్డ్ సూచించింది. వెనుకబడిన జాతుల వారికి ప్రత్యేక నియోజక వర్గాలను ఏర్పాటు చేయడం గాంధీజీ వ్యతిరేకించాడు. కాని నిమ్నజాతుల సమస్యపై 1932లో గాంధీజీ - అంబేద్కర్‌ల మధ్య పూనా ఒప్పందం కుదిరింది. 1932లో జరిగిన మూడవ అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ ప్రతినిధులు హాజరు కాలేదు. ఈ సమావేశంలో తీసుకొన్న నిర్ణయాల ప్రాతిపదికన భారతీయులను

సంతృప్తిపరచే ఉద్దేశ్యంతో 1935లో రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా ఆ సంస్కరణలు అమలు జరిగాయి. భారతీయులు ఆశించిన స్వరాజ్యం ఈ చట్టం సూచించలేదు. అందువల్ల భారతీయులు దీనిని వ్యతిరేకించారు. పూనా ఒడంబడిక తర్వాత గాంధీజీ హరిజన ఉద్ధరణకు కృషిచేసాడు. 1934లో పాట్నా కాంగ్రెస్ సమావేశములో శాసనోల్లంఘనోద్యమం అధికార పూర్వకంగా నిలుపుదల చేయబడింది.

## 28.14. రెండవ ప్రపంచ యుద్ధం :

1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం 1937లో ఎన్నికలు జరిగి పెక్కు రాష్ట్రాలలో కాంగ్రెస్ మంత్రి వర్గాలు ఏర్పడ్డాయి. కానీ ఆ మంత్రివర్గాలు రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయినపుడు (1939) ప్రభుత్వం తమను సంప్రదించకుండా యుద్ధం ప్రకటించినందుకు నిరసనగా రాజీనామా చేశాయి. కాని తొందరపడి ఎటువంటి ఆందోళనలు ప్రారంభించలేదు. ఈ విధానాన్ని సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో స్థాపితమైన 'ఫార్‌వర్డ్ బ్లాక్' తీవ్రంగా విమర్శించింది. కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేసినందుకు ముస్లింలీగ్ సంతసించినది. 1940లో లాహోర్‌లో జరిగిన ముస్లింలీగ్ సమావేశంలో జిన్నా 'ద్విజాతి' సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈ సమావేశం భారతదేశంలోని ముస్లింలకు పాకిస్తాన్ ఏర్పాటు కావాలని తీర్మానించింది.

## 28.15. క్విట్ ఇండియా ఉద్యమం (1942) :

జపాన్ రెండవ ప్రపంచ యుద్ధంలో ప్రవేశించుటతో ఇంగ్లండ్ పరిస్థితి విషమించి భారతీయుల సహకారం పొందుటకు 1942లో క్రిప్పు నాయకత్వంలో ఒక రాయబార సంఘమును పంపెను. యుద్ధం ముగిసిన తరువాత భారతీయుల సమస్యల పరిష్కారమును ఆ సంఘము ప్రతిపాదించగా దానిని గాంధీజీ తిరస్కరించాడు. క్రిప్పు రాయబారం విఫలమైన తరవాత దేశంలో తీవ్రమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. దేశ ప్రజలలో నిరుత్సాహం, నిస్పృహ ఏర్పడ్డాయి. భారతీయులకు స్వాతంత్ర్యం ఇవ్వాలని లేదా త్వరలోనే సత్యాగ్రహం ప్రారంభించబోతున్నామని కాంగ్రెస్ కార్యవర్గం ఆంగ్లేయులకు తుది హెచ్చరిక చేసింది. కాని ఆంగ్లేయులు ఈ హెచ్చరికను లెక్కచేయలేదు. అందువలన 1942 ఆగస్టు 8న జాతీయ నాయకులంతా సమావేశమై 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని చేశారు. ఈ సందర్భంగా గాంధీజీ గొప్ప ఉపన్యాసాన్ని ఇస్తూ 'చేయి' లేక 'చావు' అనే మాటలతో ముగించాడు. మరుసటిరోజే గాంధీజీతో సహా నాయకులందరినీ ప్రభుత్వం నిర్బంధించింది. అయినా ఉద్యమం ఆగలేదు. నాయకత్వం లేని ప్రజలు రెచ్చిపోయి విధ్వంసకాండ జరిపారు. బ్రిటీష్ ప్రభుత్వం క్విట్ ఇండియా ఉద్యమాన్ని అతి క్రూరంగా అణచివేసింది. ఈ సమయంలోనే సుభాష్ చంద్రబోసు, భారతదేశము వదిలి 'ఆజాద్ హింద్ ఫౌజ్' అనే భారత జాతీయ సైన్యాన్ని నిర్మించి జపాన్ వారి సాయంతో ఆంగ్లేయులను పారద్రోలుటకు విఫల ప్రయత్నం చేసి విమాన ప్రమాదంలో మరణించాడు.

## 28.16. స్వాతంత్ర్య సముపార్జన :

రెండవ ప్రపంచయుద్ధం తరువాత లేబర్ పార్టీ ఇంగ్లండ్‌లో అధికారములోనికి వచ్చింది. ప్రధానిగా అట్లీ ఎన్నిక అయ్యాడు. ఈ ప్రభుత్వం అట్లే భారత స్వాతంత్ర్య ఉద్యమము పట్ల సానుభూతి వహించి భారతీయులకు స్వాతంత్ర్యం ఇచ్చుటకై 1946లో ఒక రాయబార వర్గాన్ని భారతదేశానికి పంపినది. ఈ రాయబార వర్గం భారత నాయకులతో చర్చించి కొన్ని సూచనలు చేశారు. అవి : దేశ విభజన కూడదు, కాంగ్రెస్ ముస్లింలతో కూడిన తాత్కాలిక భారత ప్రభుత్వ ఏర్పాటు, రాజ్యాంగ నిర్మాణమునకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు చేయుట, ఆ తదుపరి ఆంగ్లేయులు భారతదేశమును వదిలివెళ్ళుట. ఈ రాయబార వర్గ సూచనల మేరకు 1946లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ముస్లిం సభ్యులతో కూడిన తాత్కాలిక ప్రభుత్వం, రాజేంద్రప్రసాద్ అధ్యక్షుడుగా రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేయబడినాయి. ఇటువంటి పరిస్థితులలో పాకిస్తాన్‌కు అవకాశం లేదని జిన్నా బలప్రయోగం ద్వారా పాకిస్తాన్ సాధన కొరకు ప్రత్యక్ష చర్యలను పురికొల్పెను. తత్ఫలితంగా హిందూ - ముస్లిం అలజడులు, హత్యలు దేశమంతటా ప్రబలినవి. ఇట్టి స్థితిలో దేశ విభజన తప్ప భారతదేశానికి వేరొకమార్గము లేదని బ్రిటీష్ రాజప్రతినిధియైన లార్డ్ మౌంట్ బాటన్ 1947 జూన్ 3న ఒక ప్రమాళికను

తయారు చేసెను. ఈ ప్రణాళిక ఆధారంగా బ్రిటీష్ పార్లమెంట్ 1947 జూలై 18న భారత స్వాతంత్ర్య చట్టం చేసెను. ఈ చట్టం ప్రకారం 1947 ఆగస్టు 15న భారతదేశం ఇండియన్ యూనియన్, పాకిస్తాన్ అను రెండు దేశాలుగా విభజింపబడెను. ఆ రోజునే రెండు దేశాలకు స్వాతంత్ర్యం లభించెను.

## 28.17. ముగింపు :

1919 తరువాత గాంధీజీ జాతీయ కాంగ్రెస్‌కు నాయకత్వం వహించి, అహింసా పద్ధతుల ద్వారా జాతీయోద్యమము నడిపి భారతీయులకు స్వాతంత్ర్యం సంపాదించి పెట్టెను. 1919 నుండి 1947 వరకు స్వాతంత్ర్యోద్యమున గాంధీజీ నిర్వహించిన పాత్ర గణనీయమైనది. ప్రశంసనీయమైనది.

**మాదిరి ప్రశ్నలు :**

1) సహాయ నిరాకరణోద్యమము ప్రారంభించుటకు దారితీసిన పరిస్థితులు, ఉద్యమ స్వభావ స్వరూపములను వివరింపుము.
2) శాసనోల్లంఘన ఉద్యమం గురించి వివరింపుము.
3) 1919 - 29 మధ్య కాలంలో కొనసాగిన జాతీయోద్యమాన్ని గూర్చి వివరింపుము.
4) క్విట్ ఇండియా ఉద్యమాన్ని గురించి వర్ణింపుము.

**లఘు ప్రశ్నలు :**

1) జలియన్ వాలాబాగ్
2) సైమన్ కమీషన్
3) కమ్యూనల్ అవార్డ్

**చదువవలసిన గ్రంథాలు :**


1) మామిడిపూడి వెంకట రంగయ్య - భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర
2) Tara Chand - History of Freedom Movement in India
3) R.C. Majumdar - History of Freedom Movement
4) Bipin Chandra - Modern India
5) Alladi Vaidahi - Freedom Movement in India


రచయిత : **వి.కె. మోహన్**

పాఠం - 29

# స్వతంత్ర భారతదేశ పరిణామాలు (1947 - '50)

**విషయసూచిక**


29.0 లక్ష్యం

29.1. ఉపోద్ఘాతం

29.2. కాందిశీకుల సమస్య

29.3. స్వదేశ సంస్థానాల సమస్య

29.3.1. హైదరాబాద్ సమస్య

29.3.2. జూనాగఢ్ సమస్య

29.3.3. కాశ్మీర్ సమస్య

29.4. నూతన రాజ్యాంగము

29.5. కేంద్ర - రాష్ట్ర సంబంధములు

29.5.1. శాసన సంబంధములు

29.5.2. పరిపాలనా సంబంధములు

29.5.3. ఆర్థిక సంబంధములు

29.6. పంచవర్ష ప్రణాళికలు


## 29.0. లక్ష్యం :

భారతదేశమునకు స్వాతంత్ర్యము లభించిన తదుపరి దేశం ఎదుర్కొన్న కాందిశీకుల సమస్య, స్వదేశీ సంస్థానాల సమస్య, నూతన రాజ్యాంగాన్ని నిర్మించుకోవటం మొదలగు సమస్యలను, నూతన రాజ్యాంగం ప్రకారం కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వ సంబంధాలను, అటులనే పంచవర్ష ప్రణాళికను - వాని ప్రాముఖ్యతను మొదలగు అంశములను గురించి తెలుసుకొనుటయే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 29.1. ఉపోద్ఘాతం :

భారతీయులు చిరకాలంగా వాంఛించిన స్వాతంత్ర్యం క్రీ.శ. 1947, ఆగస్టు 15వ తేదీన భారతదేశానికి లభించెను. స్వతంత్ర భారతదేశమునకు పండిత జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగానూ, లార్డ్ మౌంట్ బాటన్ గవర్నర్ జనరల్‌గాను భారత ప్రభుత్వము రూపొందెను. భారతదేశానికి స్వాతంత్ర్యము లభించినప్పటికి, స్వతంత్ర భారతదేశం ముఖ్యంగా మూడు గడ్డు సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చెను. అవి ఏమనగా

1) కాందిశీకుల సమస్య
2) స్వదేశ సంస్థానాల సమస్య
3) నూతన రాజ్యాంగాన్ని నిర్మించుకోవడం

పైన పేర్కొనబడిన ఈ మూడు సమస్యలను భారతదేశపు మేధావులే పరిష్కరించుకోవడం వలన త్వరలో భారతదేశము సంపూర్ణ స్వాతంత్ర్య ఫలితాలను అనుభవించడం జరిగింది. అది ఎట్లా జరిగిందో వివరంగా తెలుసుకుందాము.

## 29.2. కాందిశీకుల సమస్య :

క్రీ.శ. 1947, ఆగస్టు 15న భారతదేశం రెండు భాగాలుగా విడిపోయి, భారతదేశం, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర రాజ్యాలు ఏర్పడెను. పాకిస్తాన్ మత ప్రాతిపదికపై ఏర్పడిన రాజ్యం. తత్ఫలితంగా ఎన్నో వందల సంవత్సరాలుగా ఆస్తి పాస్తులను ఏర్పరచుకొని జీవిస్తున్న హిందువులకు, సిక్కులకు పాకిస్తాన్‌లో స్థానం లేకుండాపోయింది. పాకిస్తాన్ - ఇండియాల మధ్య సరిహద్దు నిర్ణయించిన 'లాడ్‌క్లిఫ్' పరిష్కారం మేరకు పంజాబ్ రెండు భాగాలుగా చీలిపోయింది. భారత విభజన ముందు, ఆ తరువాత ప్రజ్వరిల్లిన మత కల్లోలాలలో మహమ్మదీయేతరులు పాకిస్తాన్ పంజాబ్‌లో నిలవలేకపోయిరి. అందువలన వారందరు ఆస్తిపాస్తులను వదులుకొని, ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకొని సరిహద్దు దాటి, భారతదేశానికి వచ్చారు. ఇక భారతదేశంలోని పంజాబ్‌లో నివశిస్తున్న ముస్లింల పరిస్థితి కూడా భయంకరంగానే ఉన్నది. కానీ, మతాతీత లౌకిక రాజ్యస్థాపననే స్వతంత్ర భారతదేశ ప్రభుత్వ లక్ష్యం కాబట్టి భారతదేశంలోని ముస్లిం సోదరులను, వారి ఆస్తిపాస్తులను కాపాడటం తన నైతిక బాధ్యతగా భావించి తదనుగుణంగా ప్రభుత్వం వ్యవహరించెను.

ఇటువంటి పరిస్థితే బెంగాల్‌లో కూడా ఏర్పడింది. పంజాబ్, బెంగాల్‌లలో మత కలహాలు చెలరేగాయి. వీటిని అణచేసి, పాకిస్తాన్ నుండి వచ్చిన కాందిశీకులకు పునరావాసం కల్పించడం, స్వతంత్ర భారతదేశం ఎదుర్కొన్న మొదటి సమస్య.

కాందిశీకులకు తగిన జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వం చేయగలిగిందంతా చేసింది. వారికి గృహవసతులు కల్పించటం జరిగింది. వ్యాపారం చేసుకోవడానికి పెట్టుబడులు దొరికాయి. ప్రభుత్వోద్యోగాలలో రిజర్వేషన్‌లు కల్పించటం జరిగింది.

ఈ భారీ సమస్యను ఎదుర్కోవడంలో ప్రభుత్వం నూటికి నూరుపాళ్ళు విజయం సాధించిందని చెప్పడానికి వీలుపడదు. కానీ, మతాతీత లౌకిక విధానం అనుసరిస్తూ, స్వతంత్ర భారత ప్రభుత్వం అన్ని మతాలవారికి సమానమైన ప్రతిపత్తి, అవకాశాలు కలిగించడానికి అన్నివిధాలా గట్టి కృషి చేసింది. ఆనాటి గడ్డు కాలంలో సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకిక విధానాలలో రాజీ ఎరుగని జవహర్‌లాల్ నెహ్రూ భారతదేశానికి ప్రధానమంత్రి కావడం, ఆ విధానాలలో నమ్మకమున్న వారికి గొప్ప విజయం.

## 29.3. స్వదేశ సంస్థానాల సమస్య :

క్రీ.శ. 1947, ఆగస్టు 15న బ్రిటీష్‌వారు భారతదేశాన్ని వదిలిపోయేనాటికి, దేశంలో 554 స్వదేశ సంస్థానాలున్నాయి. చారిత్రకంగా పరిశీలిస్తే వాటన్నింటిని కాపాడుతూ వచ్చింది బ్రిటీష్ రాజరికం. ఈ సంస్థానాలలో కొన్ని చాలా పెద్దవి, మరికొన్ని చాలా చిన్న జమీందారీల వంటివి. సంస్థాన ప్రభువులలో చాలామంది ప్రజాశ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని పాలించినవారు కాదు. కొందరు ప్రజల నుండి అధిక పన్నులను వసూలుచేసి, ఆ ధనంతో విదేశాలలో విలాసవంత జీవితం గడిపెడివారు. మరికొందరు మధ్యయుగాలనాటి పాలనా యంత్రాంగంతో ప్రజల జీవితాలతో చెలగాటాలాడేవారు. అందువల్ల సంస్థానాలలో జీవించే ప్రజలు స్వతంత్ర భారతదేశంలో విలీనం కావటానికి, జాతీయ జీవనస్రవంతిలో కలిసిపోవడానికి ఉవ్విళ్ళూరారు. నాటి పరిస్థితులలో భారతదేశం ఐక్యతతో, పటిష్ఠవంతముగా ఉండాలన్నా, తంతి, తపాలా, రైల్వే రక్షణ మొదలగు వాటికి అంతరాయం కలగకుండా ఉండాలన్నా స్వతంత్ర భారతదేశంలో సంస్థానాలన్ని చేరిపోవలసిందే.

మధ్యయుగాల భావాలతో కృంగదీస్తున్న సంస్థానాధీశుల కబంధ హస్తాలనుండి, ఆ ప్రజలను రక్షించి, జాతీయ జీవన ప్రవంతిలో వారిని కలిపివేయడం స్వతంత్ర భారతదేశం ఎదుర్కొన్న మరొక సమస్య.

స్వదేశ సంస్థానాలను ఇండియాలో విలీనంచేసిన ఘనత హోంమంత్రి అయిన స్వతంత్ర భారత ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు దక్కుతుంది. పటేల్ 1947 జూలై 25వ తేదీన స్వదేశ సంస్థానాధీశులందరిని ఉద్దేశించి ప్రసంగిస్తూ విదేశ వ్యవహారాలు, దేశ

రక్షణ, ప్రయాణ సౌకర్యాలు ఇండియన్ యూనియన్‌కు అప్పగించి మిగతా విషయాలలో తమ ఇష్టం వచ్చినట్లు, తాత్కాలికంగా వ్యవహరించుకోవచ్చునని పేర్కొనెను. ఈ ప్రతిపాదనకు అంగీకరించుకోవచ్చునని పేర్కొనెను. ఈ ప్రతిపాదనకు అంగీకరించిన సంస్థానాల ప్రభువులు రాజ్యాంగ పరిషత్తుకు ప్రతినిధులను కూడా పంపవచ్చునని పటేల్ ప్రకటించెను. పటేల్ ప్రతిపాదనను అంగీకరించి ఆగస్ట్ 15 నాటికి హైదరాబాద్, కాశ్మీర్, జూనాగఢ్ మినహా మిగిలిన సంస్థానాలన్నీ ఇండియన్ యూనియన్‌లో చేరిపోయాయి.

అయితే భారతదేశంలో విలీనం కానటువంటి హైదరాబాద్, కాశ్మీర్, జూనాగఢ్ సంస్థానాలు పెద్ద సమస్యగా ప్రభుత్వమునకు తయారయ్యెను.

## 29.3.1. హైదరాబాద్ సమస్య :

భౌగోళికంగా హైదరాబాద్ భారతదేశంలో కీలకమైన సంస్థానము. ఇచ్చట అత్యధిక సంఖ్యాక ప్రజలు హిందువులు. రాజ్యాధినేత నిజాం మహమ్మదీయుడు. నిజామ్ తన సంస్థానమును పాకిస్తాన్‌లో గాని, ఇండియన్ యూనియన్‌లో గాని చేర్చక స్వతంత్రుడుగా ఉండదలచెను. నిజామ్ ఇండియాతో సైనికంగా తలపడటానికి కూడా సిద్ధపడెను. అంతేగాక నవాబు 'మజ్లీస్ ఇత్తేహాద్ - ఉల్-ముస్లిమీన్' అనే మతసంస్థ చేతుల్లో పడిపోయెను. ఈ సంస్థ నాయకుడు 'కాశీం రజ్వీ'. ఇతడి అనుచరులు 'రజాకార్' లు. వీరు హిందువులపైన అత్యాచారాలు, దారుణ హింసాకాండ ప్రదర్శించిరి. మధ్యయుగాలనాటి 'భూస్వామ్య వ్యవస్థ' నిజామ్ భూభాగాలలో ఏర్పరచడం 'కాశీం రజ్వీ' ధ్యేయం. రజ్వీ, రజాకార్‌ల అత్యాచారాలు నానాటికి మితిమీరగా భారత ప్రభుత్వం హైదరాబాద్ నిజాంపై తగిన చర్య తీసుకోవడానికి నిశ్చయించుకొనెను. 1948, సెప్టెంబరు 13వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదేశానుసారము మేజర్ జనరల్ చౌదరి హైదరాబాద్‌పై పోలీస్ చర్య జరిపి శాంతి భద్రతలు నెలకొల్పెను. తదుపరి 1948, సెప్టెంబరు 17వ తేదీ నాటికి నిజాం తన సర్వస్వమును కోల్పోయి, యుద్ధ విరమణచేసి, ఇండియన్ యూనియన్‌లో చేరుటకు అంగీకరించెను. హైదరాబాద్ సంస్థానము నిజాం పాలన నుండి విముక్తిచెంది స్వేచ్ఛా వాయువును పీల్చుకొనెను. రజ్వీ పాకిస్తాన్‌కు పారిపోయెను. రజాకార్ల సంస్థ నిషేధింపబడెను. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు నెలకొనెను.

నిజాం పాలన అంతమైన తదుపరి జనరల్ చౌదరి 1949 డిశంబరు వరకు మిలటరీ గవర్నరుగా హైదరాబాద్ పాలనా బాధ్యతలు నిర్వహించెను. తదుపరి 1950లో సీనియర్ సివిల్ ఉద్యోగియైన 'వెల్లోడి' హైదరాబాద్ ముఖ్యమంత్రి పాలనా బాధ్యతలు స్వీకరించెను. నూతన రాజ్యాంగము ననుసరించి జరిగిన మొదటి సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యంత మెజారిటీతో అఖండ విజయమును సాధించెను. 1952, మార్చిలో 'బూర్గుల రామకృష్ణారావు' హైదరాబాద్ తొలి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించెను.

## 29.3.2. జూనాగఢ్ సమస్య :

జూనాగఢ్ కథియడ్ ప్రాంతములో నున్న ఒక చిన్న సంస్థానము. ఇందు అత్యధిక సంఖ్యాక ప్రజలు హిందువులు. కాని వారి పాలకుడు మహమ్మదీయుడు. అధికారం బదిలీ చేయడమంటే అతడు తన సంస్థానాన్ని పాకిస్థాన్‌లో కలిపివేస్తున్నట్లు ప్రకటించెను. కానీ అతడి చర్యను ప్రజలు తీవ్రముగా ఖండించి, తిరుగుబాటు చేసిరి. దానితో అతడు పాకిస్తాన్‌కు పలాయనం చిత్తగించెను. సంస్థాన 'రిలాన్' (ముఖ్యమంత్రి) పరిపాలనను స్వీకరించి శాంతిభద్రతలను నెలకొల్పమని ఇండియాను కోరెను. 1948లో జూనాగఢ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో ఇండియాలో చేరిపోవాలనే తమ వాంఛను ప్రకటించారు. ప్రజాభిప్రాయమును అనుసరించి 1949 జనవరిలో జూనాగఢ్ భారతదేశంలో విలీనమయ్యెను.

## 29.3.3. కాశ్మీర్ సమస్య :

భారతదేశంలోని అతిపెద్ద సంస్థానాలలో కాశ్మీర్ ఒకటి. కాశ్మీర్‌లో అధిక సంఖ్యాకులు ముస్లింలు. కానీ పాలకుడు హరిసింగ్, హిందువు. ఇండియా, పాకిస్తాన్‌లలో ఎటూ చేరకుండా ఉండడానికి హరిసింగ్ మొదట నిశ్చయించుకొనెను. కానీ, కాశ్మీర్‌ను

ఆక్రమించుకొనేందుకు పాకిస్తాన్ పరోక్షముగా 1947 అక్టోబరులో సైన్యాలను పంపెను. చేయునదిలేక హరిసింగ్ 1947 అక్టోబరు 24వ తేదీన కాశ్మీర్ ఇండియాలో విలీనం చేయనున్నట్లు ప్రకటించెను. 'నేషనల్ కాన్ఫరెన్స్' నాయకుడు 'షేక్ అబ్దుల్లా' హరిసింగ్ చర్యను సమర్థించెను. హరిసింగ్ అభ్యర్థనను మన్నించి వెంటనే భారత సైన్యము పాకిస్తాన్ సైన్యమును తరిమికొట్టి కాశ్మీర్‌ను రక్షించినది. కాశ్మీర్ ఇండియన్ యూనియన్‌లో అంతర్భాగమైనది. కాని అప్పటికే పాకిస్తాన్ కాశ్మీర్‌లో 1/3 వంతు నాక్రమించి యుండింది. దీనినే 'అజాద్ కాశ్మీర్' అందురు. ఈ ఆక్రమిత భాగము నుండి పాకిస్తానీయులను ఆనాడే తరిమికొట్టినా, నేడు కాశ్మీర్ అను సమస్య ఉండెడిది కాదు. అట్లుచేయక అనవసరముగా, 'నెహ్రూ' ఈ సమస్యను ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసెను. ఇది నేటికి సమస్యగానే మిగిలిపోయెను.

భారతదేశంలో స్వదేశీ సంస్థానాలు విలీనంగావటంతో ప్రజలకెన్నో ప్రయోజనాలు చేకూరెను. చాలా కాలముగా ముక్కలు చెక్కలైపోయినా భారతదేశం తిరిగి సమైక్యత సాధించింది. మధ్యయుగాల నిరంకుశత్వం క్రింద అణగారిపోయిన ప్రజలకు ప్రజాస్వామ్యం లభించింది. వారు స్వేచ్ఛా వాయువులు పీల్చసాగారు. దేశం మొత్తంలో ప్రజాహిత కార్యాలు చేపట్టడానికి భారత ప్రభుత్వానికి దీనివల్ల వీలుకలిగింది.

## 29.4. నూతన రాజ్యాంగము :

స్వతంత్ర భారతదేశం సాధించిన విజయాలలో మూడోది నూతన రాజ్యాంగమును తయారుచేసి, ప్రజలకివ్వడం. స్వరాజ్యం రాగానే దేశానికి రాజ్యాంగం ఏర్పడలేదు. తాత్కాలికంగా కొద్దిమార్పులతో 1935 రాజ్యాంగ చట్టం ప్రకారమే ప్రభుత్వం నడిచేటట్లు ఏర్పాటు చేయడమయింది.

డా॥ బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షుడుగా, పండిత జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా తాత్కాలిక నూతన మంత్రివర్గం ఏర్పడెను. ఈ నూతన ప్రభుత్వం నూతన రాజ్యాంగ నిర్మాణమునకు తగిన ఏర్పాట్లు చేసెను.

క్రీ.శ. 1946 డిశంబరు 9వ తేదీన (మనకు స్వాతంత్ర్యము రాకమునుపే) రాజ్యాంగ పరిషత్తు, రాజ్యాంగ నిర్మాణమునకు ఏర్పడెను.

నూతన రాజ్యాంగ నిర్మాణ పరిషత్ యొక్క డ్రాఫ్టింగ్ కమిటీకి డా॥ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షుడుగాను ఎన్నుకొనబడెను. జవహర్‌లాల్ నెహ్రూ, డా॥ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, కె.యం. మున్షి, బి.యన్. రావు, డా॥ సచ్చిదానంద సిన్హా మొదలగువారి నేతృత్వములో నూతన రాజ్యాంగము తయారుచేయబడెను.

1950 జనవరి 26వ తేదీన నూతన రాజ్యాంగము అమలులోనికి వచ్చెను. ఆనాటి నుండి ఇండియా 'సర్వస్వతంత్రమైన ప్రజాస్వామిక రిపబ్లిక్' గా అవతరించెను. ప్రతి సంవత్సరం భారతీయులు జనవరి 26వ తేదీన రిపబ్లిక్ దినోత్సవం జరుపుకొంటున్నారు. భారతదేశం మొదటి రిపబ్లిక్ అధ్యక్షుడుగా డా॥ బాబు రాజేంద్రప్రసాద్ ఎన్నుకొనబడెను.

భారత రాజ్యాంగము 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర వ్యవస్థ. భారత రాజ్యాంగం ప్రపంచములోకెల్లా అతి పెద్దదైన, సవివరంగా వివరింపబడిన, లిఖిత రాజ్యాంగం' (The Largest and most detailed in the world) . భారత రాజ్యాంగంలో 395 ప్రకరణలు (Articles), 12 వివరణ పట్టికలు, షెడ్యూల్డ్ కలవు. భారత రాజ్యాంగమును ఇష్టం వచ్చినట్లు మార్చడానికి వీలులేదు. అందువల్లనే ఇది దృఢ (rigid) రాజ్యాంగం. విభిన్న జాతులు, భాషలు, సంప్రదాయాలు భారతదేశంలో ఉండటం మూలాన భారత రాజ్యాంగాన్ని సమాఖ్య (Federal) రాజ్యాంగంగా రూపొందెను.

భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, వివరించడం జరిగింది. అవి ఏమనగా

1) సమానత్వపు హక్కు (Right of equality)
2) స్వాతంత్ర్యపు హక్కు (Right to freedom)
3) పీడనాన్ని నిరోధించే హక్కు (Right to against exploitation)
4) మత స్వాతంత్ర్యపు హక్కు (Right to freedom of religion)
5) సాంస్కృతిక విద్యా విషయక హక్కు (Culture and educational rights)
6) ఆస్తి హక్కు (Right to property)
7) రాజ్యాంగ రక్షణ హక్కు (Right to constitutional remedies)

పైన పేర్కొనబడిన ప్రాథమిక హక్కులు రాజ్యాంగములో మూడవ భాగంలో వివరంగా ఉన్నాయి. భారతదేశంలోని ప్రతి పౌరుడు ఈ హక్కులను స్వేచ్ఛగా అనుభవించవచ్చు. వాటికి భంగం వాటిల్లినప్పుడు హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా రక్షణ పొందవచ్చును. ప్రాథమిక హక్కులలో గల ఆస్తిహక్కు ప్రస్తుతం న్యాయపరమైన హక్కుగా గుర్తింపబడెను.

భారత రాజ్యాంగంలోని మరో లక్షణము 'నిర్దేశక నియమాలు', లేదా 'ఆదేశిక సూత్రాలు' (directive principles of state policy) పేర్కొనుట. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, శ్రేయోరాజ్య స్థాపనకు రాజ్యాంగ నిర్మాతలు వీటిని పొందుపరచిరి. ఆదేశిక సూత్రాలలోని ముఖ్యాంశములు ఏమనగా

1) పౌరులందరికి జీవనోపాధి కలిగించడం.
2) దేశ సంపదను న్యాయంగా పౌరులందరికి పంచడం.
3) సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సమానత్వాన్ని కల్పించడం.
4) నైతికంగా, ఆర్థికంగా, దోపిడీకి గురికాకుండా యువజనులను, బాలబాలికలను రక్షించడం.
5) ప్రజలందరికి ఉచిత, నిర్బంధ, విద్య సమకూర్చడం.
6) నిరుద్యోగులకు, వికలాంగులకు, వృద్ధులకు, దీర్ఘరోగులకు, ఉచిత సలహా అందించడం.
7) హరిజనులకు, ఆదిమవాసులకు, వెనుకబడిన తరగతుల వారికి తగిన సహాయం చేయడం.
8) అంతర్జాతీయ రంగములో శాంతిభద్రతలను ప్రోత్సహించడం మొదలగునవి, వీటిని ఆయా రాష్ట్ర ప్రభుత్వములు తమశక్తి, సామర్ధ్యమును బట్టి అమలు జరుపవలెను.

భారత రాజ్యాంగములోని మరో ముఖ్యలక్షణం 'సమన్యాయ పాలన' (Rule of Law). ప్రభుత్వ దృష్టిలో అందరూ సమానులే. అటులనే అర్హత ననుసరించి ఎవరైనా, ఎటువంటి ఉన్నత పదవులనైనా పొందవచ్చును. ఏ పదవి వంశపారంపర్యం కాదు. వయోజన ఓటింగ్ ద్వారా మాత్రమే ఎన్నుకొనబడుదురు. దీనినే గణతంత్ర వ్యవస్థ అందురు. భారతదేశంలో వివిధ భాషలు, మతాలవారు సహజీవనం చేస్తున్నారు. అంటే భారతదేశం లౌకిక వ్యవస్థను కల్గి ఉన్నది.

భారత రాజ్యాంగంలో 'పార్లమెంటు' విధానమును మనదేశం అమలు జరుపుతున్నట్లు పేర్కొనబడెను. ఇట్లు పైన పేర్కొనబడిన లక్షణములను భారత రాజ్యాంగము కల్గి ఉంది.

## 29.5. కేంద్ర - రాష్ట్ర సంబంధములు :

కేంద్ర, రాష్ట్ర సంబంధములు మనదేశములో ఒక ప్రత్యేకతను కల్గియున్నవి. కేంద్ర రాష్ట్రముల మధ్య అధికారములను పంపిణీ చేయునప్పుడు, మన రాజ్యాంగ నిర్మాతలు కేంద్రమునకు ఎక్కువ అధికారములు కల్పించిరి. కేంద్ర ప్రభుత్వమునకు ఎక్కువ అధికారములు కల్పించుటకు ప్రధాన కారణం దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమాధికారములను పరిరక్షించుట.

### 29.5.1. శాసన సంబంధములు :

కేంద్ర ప్రభుత్వమునకు, రాష్ట్ర ప్రభుత్వములకు సంబంధించిన శాసనసంబంధములను కొన్ని ప్రత్యేక సందర్భములలో ఈ క్రింది విధముగా ఉన్నవి :

ఎ) అత్యవసర పరిస్థితి కాలములో పార్లమెంట్ రాష్ట్రాల జాబితాలోని ఏ అంశమునందైన శాసనము (250 నిబంధన ప్రకారం) చేయుటకు అధికారము కల్గి యున్నది.

బి) కేంద్ర పార్లమెంటు ఎటువంటి ఒప్పందమైన లేక సంధియైన లేక సాంప్రదాయబద్ధమైన అంగీకారమైన కొన్ని రాష్ట్రములకు గాని లేక దేశము మొత్తమునకు గాని అమలులో ఉండునట్లు శాసనము చేయవచ్చును.

సి) రాష్ట్రములలో రాష్ట్రపతి అధికారము అమలులో ఉన్నప్పుడు కేంద్ర పార్లమెంటు, ఆయా రాష్ట్రములకు అవసరమైన రాష్ట్ర జాబితాలోని అంశముల మీద శాసనము చేయుటకు అధికారము ఉన్నది.

డి) అవశిష్టాధికారములకు సంబంధించిన శాసనములు చేసినప్పుడు, , కేంద్రము చేసిన శాసనములు అన్ని రాష్ట్రాలకు కూడా వర్తించును.

ఇ) రాష్ట్ర ప్రభుత్వములు చేసిన కొన్ని చట్టములకు రాష్ట్రపతి అనుమతి అవసరము.

ఎఫ్) రెండు లేక మూడు రాష్ట్రాలు తమకు ఉమ్మడిగా ఒక శాసనము చేయమని కేంద్ర ప్రభుత్వమును కోరినప్పుడు కేంద్ర పార్లమెంటు అట్టి శాసనము చేయవచ్చును.

జి) మెజారిటీ రాజ్యసభ సభ్యులు రాష్ట్రంలో అంశమైనప్పటికీ అట్టి అంశముమీద శాసనము చేయమని కోరినచో ఒక సంవత్సరముపాటు అమలులో ఉండు శాసనమును పార్లమెంటు ఆమోదించును.

### 29.5.2. పరిపాలనా సంబంధములు :

ఎ) రాష్ట్ర ప్రభుత్వములు, కేంద్ర ప్రభుత్వము యొక్క చట్టములకు అనుగుణముగా కొన్ని పరిపాలనా విధానములను అమలుపరచవలసిన అవసరముండును.

బి) కేంద్ర ప్రభుత్వము, రవాణా సౌకర్యములు, వార్తా సౌకర్యములు, సైనిక కేంద్రములు మొదలగువానికి సంబంధించిన పరిపాలనా సూచనలను రాష్ట్రములకు అందజేసినప్పుడు, దానికి అనుగుణముగా పరిపాలనా చర్యలను రాష్ట్రములు నిర్వహించవలెను.

సి) రాష్ట్రములకు సంబంధించిన నీటి మార్గములను కాని, లేక రోడ్డు మార్గములను గాని, పార్లమెంటు శాసనముల ద్వారా 'జాతీయ జలవనరులు', 'జాతీయ రోడ్డు మార్గములు' గా ప్రకటించి, ఎటువంటి బాధ్యతనైనను తీసుకొనవచ్చును.

డి) రాష్ట్రములకు అవసరమగు I.A.S., I.P.S. ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వము ఎన్నిక చేసి, రాష్ట్రములకు కేటాయించును. అటులనే అవసరమైనప్పుడు రాష్ట్రములోని సీనియర్ I.A.S., I.P.S. ఉన్నతోద్యోగుల సేవలను కేంద్ర ప్రభుత్వము తీసుకొనవచ్చును. అదేవిధముగా రాష్ట్ర ప్రభుత్వము అవసరమని భావించినప్పుడు కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సేవలను తమ రాష్ట్రములకు వినియోగించుకొనును.

ఇ) కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్రములలో కార్య నిర్వహణాధికారుడైన గవర్నర్‌ను నియమించుటకు, బదిలీ చేయుటకు, కేంద్రమునకు అధికారము కలదు. అటులనే రాష్ట్రముల గవర్నర్ల నివేదికలను అనుసరించి, రాష్ట్రములలో పరిపాలన సక్రమముగా లేనప్పుడు, ఆయా రాష్ట్రములలో, రాష్ట్రపతి పాలనను విధించి, రాష్ట్రముల గవర్నర్లకు, రాష్ట్రపతి పాలనాకాలములో, పరిపాలనలో సహాయపడుటకు ఇద్దరు సలహాదారులను, రాష్ట్రపతి నియమించును. ఆ కాలములో రాష్ట్రపతి సూచనల మేరకు రాష్ట్ర గవర్నర్ పరిపాలనా సంబంధమైన నిర్ణయములు ప్రధానాంశములుగా తీసుకొనును.

ఎఫ్) రాష్ట్రముల మధ్య వివాదములు ఏర్పడినప్పుడు 'అంతర్ రాష్ట్ర సలహా సంఘమును' నియమించును. ఆ సంఘమువారికి ఆ వివాదములను సమీక్షించి తీర్పులిచ్చుటకు అధికారమున్నది.

జి) రెండు లేక మూడు రాష్ట్రములు తమకు ఉమ్మడిగా ఒక 'పబ్లిక్ సర్వీస్ కమీషన్' ను ఏర్పాటు చేయమని కోరినచో, అటువంటి కమీషన్‌ను నియమించును.

హెచ్) రాష్ట్రములలో శాంతి భద్రతల లోపించినప్పుడు C.R.P. ని లేక సైనిక దళములను వినియోగించును.

### 29.5.3. ఆర్థిక సంబంధములు :

కేంద్ర రాష్ట్రముల మధ్య ఆర్థికపరమైన సంబంధములు ఈ క్రింది విధముగా నున్నవి.

ఎ) కేంద్ర ప్రభుత్వము కొన్ని రకములైన పన్నులను ముఖ్యముగా ఆదాయపు పన్నును (Income Tax) విధించి, వసూలు చేయును. అలా సేకరించిన ఆదాయపుపన్ను మొత్తమును రాష్ట్రముల మధ్య పంచిపెట్టును.

బి) 'స్టాంపు డ్యూటీ' గా విధించు పన్నును కేంద్రప్రభుత్వము నిర్ణయించును. దానిని వసూలుచేయు అధికారము రాష్ట్రములకు కల్పించబడును. ఆయా రాష్ట్రములు స్టాంపు డ్యూటీని తమ అవసరములకు వినియోగించుకొనవచ్చును.

సి) జూట్ (జనుము) పండించు రాష్ట్రములైన అస్సాం, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా రాష్ట్రములకు వాని ఎగుమతులకు అనుగుణముగా "గ్రాంట్ - ఇన్ - ఎయిడ్" (Grant-in-aid) లను ప్రత్యేకముగా ఆ రాష్ట్రములకు మంజూరు చేయును. వానికి Grant in aid లను మంజూరు చేయునపుడు ఆర్థిక సంఘ సలహాలకు అనుగుణముగా వ్యవహరించును.

డి) కేంద్ర ప్రభుత్వము అన్ని రాష్ట్రములకు ఋణములను మంజూరు చేయును.

ఇ) రాష్ట్ర ప్రభుత్వముల అవసరము ననుసరించి, అవసర సమయములలో లేక ప్రత్యేవ పరిస్థితులలో సహాయక గ్రాంటులను అందించును.

ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వముల ఆదాయ, వ్యయములను కేంద్ర ప్రభుత్వ కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తనిఖీ చేయును.

జి) భారత రాష్ట్రపతి ఆర్థిక అత్యవసర పరిస్థితిని ప్రకటించినచో, అన్ని రాష్ట్రములకు వర్తించును. ఆ సమయములో రాష్ట్రములు ఆర్థిక నిర్ణయములు, విధానములలో కేంద్ర ప్రభుత్వ సూచనలమేరకు నిర్ణయించవలెను.

హెచ్) రాష్ట్రపతి 5 సం॥లకు ఒక పర్యాయము ఆర్థిక సంఘమును నియమించి, రాష్ట్రముల ఆర్థిక స్థితిగతులను తెలిసికొని, వానికి తగిన సూచనల మేరకు రాష్ట్రములకు వివిధ రకములైన ఆర్థిక సహాయములను కేంద్రము అందించును.

ఐ) రాష్ట్రముల ప్రణాళికల మొత్తములను కేంద్ర ప్రభుత్వము యొక్క ఆమోదమునకు పంపబడును. దాని ఆమోదమునకు అనుగుణముగా రాష్ట్ర ప్రభుత్వము తమ ప్రణాళికా మొత్తములను ఉపయోగించుకొనవలెను.

ముఖ్యంగా ఆర్థికాంశములలో కేంద్ర, రాష్ట్రముల సంబంధములలో మార్పులు రావలెనని, ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వములు కోరుచున్నవి. శ్రీమతి ఇందిరాగాంధి ప్రధానిగా ఉన్నప్పుడు కేంద్ర, రాష్ట్ర సంబంధములను పరిశీలించుటకు "సర్కారియా సంఘము" ను నియమించెను.

'R.S. సర్కారియా' అధ్యక్షతన ఏర్పడిన సర్కారియా సంఘము 1500 పేజీలకు పైగా 247 సలహాలను లేదా అంశములను అక్టోబరు 1987లో కేంద్రప్రభుత్వమునకు తన నివేదికను సమర్పించెను. 'సర్కారియా సంఘము' వారి ప్రధాన సలహా ఏమనగా 'రాజ్య నిర్వహణకు సంబంధించిన' అంశములలో కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వములు సత్ సంబంధములను కల్గి ఉండవలెను.

## 29.6. పంచవర్ష ప్రణాళికలు :

భారతదేశమునకు స్వాతంత్ర్యము లభించిన తదుపరి, ఏర్పడిన నూతన ప్రభుత్వ దృష్టిని మొట్టమొదట ఆకర్షించింది ప్రజల పేదరికము. ఈ పేదరికాన్ని రూపుమాపి ప్రజలకు కావలసిన అవసరాలు తీర్చి, ప్రజల రాబడిని పెంచి, వారు సుఖంగా జీవించేటట్లు చేయడానికి భారత ప్రభుత్వము కంకణం కట్టుకొని క్రీ.శ. 1950లో ఒక "జాతీయ ప్రణాళికా సంఘాన్ని" ఏర్పాటు చేసెను.

దీనికి ప్రధాని అధ్యక్షుడుగాను, ఆర్థిక మంత్రి మరియు నలుగురు ఇతర సభ్యులు చేరి మొత్తం ఆరుగురితో కూడిన సంఘము ఏర్పాటయింది.

మనకు స్వాతంత్ర్యం రాకపూర్వం నుండి జాతీయాభివృద్ధి ప్రణాళికలను తయారుచేయవలెనని, మన నాయకులు తలంచిరి. "సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య" మైసూరు సంస్థానానికి 'దివాను'గా ఉన్న కాలంలో "భారతదేశానికి ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థ" (Planned Economy for India) అనే పుస్తకంలో 1934లోనే ప్రణాళికా విషయాన్ని పేర్కొనెను. 1938లో జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన అఖిలభారత కాంగ్రెస్ "ప్రణాళికా సంఘం" (Planning Commission) ను ఏర్పాటు చేసింది. అయితే అంతలో రెండవ ప్రపంచ యుద్ధము (1939) ప్రారంభమగుట, తదుపరి స్వాతంత్ర్యోద్యమము జరుగుట మొదలగు కారణముల వలన ప్రణాళికా సంఘము పనిచేయలేదు. తదుపరి కూడా చాలామంది వర్తకులు పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను తయారు చేయించినారు, వాటిలో 'బొంబాయి ప్రణాళిక' (Bombay Plan) ముఖ్యమైనది. 15 సం॥ల కాలంలో 10.000 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రణాళిక అమలులోనికి రావలెనని, అట్లా జరిగే పక్షంలో మనదేశము పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని అంచనా. కాని ఈ ప్రణాళికలేవీ అమలులోకి రాలేదు.

భారతదేశము స్వాతంత్ర్యం పొంది నూతన రాజ్యాంగము అమలులోకి వచ్చిన తరువాత మొదటి పంచవర్ష ప్రణాళిక (1951) తయారు చేయబడెను. మనదేశమును వ్యవసాయకంగాను, పారిశ్రామికంగాను, ఆర్థికంగాను అభివృద్ధి చేయటం, అన్ని రంగాలలో దేశాన్ని స్వయం పోషకంగా చేయడం, ఆహారధాన్యాలు, ముడిసరుకులు, ఇతర ఉపయోగ వస్తువు ఉత్పత్తి చేయడం, ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడం, గ్రామాలను అభివృద్ధి చేయడం, సాంఘిక సంక్షేమం పెంపొందించడం, జాతీయ ఆదాయంను పెంచటం మొదలగు అంశములు ఈ జాతీయ ప్రణాళికల ముఖ్యాశయాలు.

## మాదిరి ప్రశ్నలు :

1) స్వతంత్ర భారతదేశము ఎదుర్కొన్న సమస్యలు వివరింపుము
2) భారత యూనియన్‌లో స్వదేశీ సంస్థానాల విలీనీకరణ ఎట్లు జరిగెను
3) హైదరాబాద్ సంస్థాన సమస్య
4) కేంద్ర - రాష్ట్ర సంబంధములు
5) పంచవర్ష ప్రణాళికలు

## చదువదగిన గ్రంథములు :


1) భారతదేశ చరిత్ర - సంస్కృతి (ద్వితీయ భాగము) - డా. పాటిబండ్ల ఝాన్సీలక్ష్మి & డా. శ్రీమతి అల్లాడి వైదేహి
2) Advance History of India Vol. II & III - Ray Chowdary, R.C. Muzumder and Gupta
3) History of Freedom Struggle in India - Tarachand
4) Bharata Swatantrodyama Charitra - Mamidipudi Venkata Rangayya


- C. RAVINDRA RAJU

పాఠం - 30

# జవహర్‌లాల్ నెహ్రూ

**విషయసూచిక**

30.0 లక్ష్యం
30.1. ఉపోద్ఘాతం
30.2. తొలిజీవితం
30.3. జాతీయోద్యమములో నెహ్రూ నిర్వహించిన పాత్ర
30.4. దేశ విభజన (1947)లో నెహ్రూ పాత్ర
30.5. ప్రధానిగా స్వతంత్ర భారతదేశమునకు నెహ్రూ చేసిన సేవ
30.5.1. నెహ్రూ దేశీయాంగ విధాన ఆశయాలు
30.5.2. నెహ్రూ సాధించిన అంతరంగిక ప్రగతి
30.6. నెహ్రూ విదేశాంగ విధానము
30.6.1. అలీన విధానము (Non - Alignment)
30.6.2. పంచశీల (Pancha Seela)
30.6.3. ఇతర అంశములు
30.7. ఘనత

## 30.0. లక్ష్యం :

భారత జాతీయోద్యమ నాయకులలో ఒకరైన శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తొలి జీవితం, స్వాతంత్ర్యోద్యమములో ఆయన పాత్ర మరియు స్వతంత్ర భారతదేశ ప్రథమ ప్రధానిగా ఆయన మనదేశమునకు చేసిన సేవ మొదలగు అనేకాంశములు తెలుసుకొనుటయే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## 30.1. ఉపోద్ఘాతం :

భారత స్వాతంత్ర్యోద్యమములో శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వహించిన పాత్ర విశిష్టమైనది. మహాత్మాగాంధీ వారసునిగా, భారత రాజకీయ రంగమున ధృవతారగా రాణించి, విశ్వశాంతియే, విశ్వకళ్యాణమునకు రాచబాటయని విశ్వసించిన మానవతావాది నెహ్రూ. జీవితాంతము మాతృభూమికి, భారతీయులకు నిర్విరామసేవ చేసి, తన జీవితమునే అంకితము చేసిన మహనీయుడు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ. ఈ మన ప్రముఖ జాతీయవాది, దేశభక్తుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు, రచయిత, మానవతావాది, విశ్వశాంతి కాముకుడు, అహింసావాది. అందుచేతనే ఆయన మరణమునకు నివాళులర్పించుచూ లోక్‌సభ "అతడు భారతదేశముననే గాక, విశ్వమానవకోటికి చెందిన వ్యక్తి'' అన్నమాటలు అక్షరాల సత్యము (Nehru belonged to all mankind as much to India - Lok Sabha). నెహ్రూ నవభారత తొలి ప్రధానిగా మనదేశమును అన్ని రంగములందు అభివృద్ధి పరచుటయే గాక, భారతదేశమునకు అంతర్జాతీయ రంగములో సముచిత గౌరవస్థానమును కల్పించుటకు అత్యంత కృషిచేసెను.

## 30.2. తొలి జీవితం :

జవహర్‌లాల్ నెహ్రూ క్రీ.శ. 1889 నవంబరు 14వ తేదీన అలహాబాద్ నందు సంపన్న కాశ్మీర్ బ్రాహ్మణ కుటుంబమున సుప్రసిద్ధ న్యాయవాదియగు మోతీలాల్ నెహ్రూకు - స్వరూపరాణికి జన్మించెను. ప్రాథమిక విద్య ముగిసిన పిదప నెహ్రూ ఇంగ్లండ్ దేశమునకు వెళ్ళి న్యాయశాస్త్రములో 'పట్టాను' (Bar-at-law) సంపాదించి స్వదేశమునకు 1912లో తిరిగి వచ్చెను. 1916లో ప్రముఖ కాశ్మీర్ వ్యాపారస్తుని కుమార్తెయగు 'కమలాకౌల్' ను వివాహమాడెను. వివాహానంతరము న్యాయవాద వృత్తిని పరిత్యజించి, జాతీయోద్యమములో పాల్గొనెను.

## 30.3. జాతీయోద్యమములో నెహ్రూ నిర్వహించిన పాత్ర :

జాతీయోద్యమములో నెహ్రూ మొదట 1917లో శ్రీమతి అనిబిసెంట్, తిలక్‌లు నిర్వహించిన 'హోమ్‌రూల్' (Home Rule) ఉద్యమములో పాల్గొని, అలహాబాద్ హోమ్‌రూల్ లీగ్ శాఖకు ఉపకార్యదర్శిగా ఉండి, నిర్మాణాత్మకమైన పాత్ర వహించి, తద్వారా తన దేశభక్తిని, బహిర్గత మొనర్చెను. తదుపరి భారతదేశ చరిత్రలో అత్యంత విషాదాంత సంఘటనగా పేర్కొనబడిన 'జలియన్ వాలాబాగ్' దురంతములతో ఆంగ్లేయులను ద్వేషించి, ఆ విషాద సంఘటన విచారణలో 'చిత్తరంజన్ దాస్' కు సహాయపడెను. అంతేగాక ఆంగ్లపాలన నుండి భారతీయులు విముక్తి చెందాలని, అందుకు సామూహిక ఐక్యత ఎంతో అవసరమని ఆయన పేర్కొనెను.

1920లో జాతీయోద్యమ చరిత్రలో అనేక పరిణామములు జరిగెను. ముఖ్యంగా 1920 నాటికి జాతీయోద్యమమునకు సారధి అయిన తిలక్ మరణం, గాంధీజీ జాతీయోద్యమములో రంగ ప్రవేశము చేయుట జరిగెను. 1920 గాంధీజీ ప్రారంభించిన సహాయనిరాకరణోద్యమమందు నెహ్రూచేరి లక్నోజైలులో నిర్బంధింపబడెను తద్వారా నెహ్రూ అనతికాలంలోనే గాంధీజీ, మరియు జాతీయ నాయకుల అభిమానమునకు పాత్రుడై 1929లో 'లాహోర్' జాతీయ కాంగ్రెస్ సమావేశమునకు అధ్యక్షుడయ్యెను. ఈ సమావేశమునందే "సంపూర్ణ స్వరాజ్య" సాధనే జాతీయ కాంగ్రెస్ లక్ష్యమని ఉద్ఘాటించెను. తదుపరి జాతీయోద్యమంలో కీలక సంఘటనలైన 1942 క్విట్ ఇండియా ఉద్యమము నందు, 1946లో మంత్రిత్రయ రాయబారము భారతదేశమునకు వచ్చిన సందర్భములో కీలకపాత్ర వహించి, తన వాక్చాతుర్యమును ప్రదర్శించెను. అటులనే 1946 సంవత్సరంలో రూపొందిన తాత్కాలిక ప్రభుత్వమునకు ప్రధానిగా పాలనా బాధ్యతలు చేపట్టి సమర్ధవంతముగా నిర్వహించి, పలువురి ప్రశంసలు పొందెను.

నెహ్రూ జాతీయోద్యమములో గాంధీజీ శిష్యరికం, జాతీయ కాంగ్రెస్‌లో ఎనలేని కృషిచేసెను. ముఖ్యముగా యువకులను కమ్యూనిస్ట్ సిద్ధాంతములకు లోనుకాకుండా, వారిని జాతీయవాదులుగా మార్చి, వారి శక్తియుక్తులను జాతీయోద్యమమునకు వినియోగించెను. 'స్వాతంత్ర్య సముపార్జనే' జాతీయ కాంగ్రెస్ లక్ష్యము కాదని, సాంఘిక, ఆర్థిక సంస్కరణల ద్వారా నవభారత సమాజ నిర్మాణము కూడ కాంగ్రెస్ లక్ష్యమని, ఆయన తన ఉపన్యాసములలో పేర్కొనెను. జాతీయోద్యమము సంకుచిత గర్వ అహంకారములకు లోనుగాకుండా కాపాడి అంతర్జాతీయ దృక్పధము ఏర్పడునట్లు చేసెను. అంతేగాకుండా 'Discovery of India' అను పుస్తకం ద్వారా భారతీయుల స్వాతంత్ర్య పోరాటమును పాశ్చాత్య మేధావి వర్గమునకు తెలియచేసి వారి సానుభూతిని మద్దతును సంపాదించెను. తత్ఫలితంగానే భారతీయుల స్వాతంత్ర్య పోరాటముపై అమెరికా మేధావి వర్గము, నాటి ఇంగ్లండ్‌లోని లేబర్‌పార్టీవారు సానుభూతి వహించింది.

యింకను జవహర్‌లాల్ నెహ్రూ రాజ్యాంగ నిర్మాణసభ సభ్యునిగా, తాత్కాలిక ప్రభుత్వ ప్రధానిగా, దేశ విభజన మొదలగు సమస్యలందు గణనీయమైన పాత్ర వహించెను. నెహ్రూ తన ఆధ్వర్యములో జాతీయ కాంగ్రెస్‌కు, నూతన శక్తిని చేకూర్చి, స్వాతంత్ర్య సముపార్జనతోపాటు, సాంఘిక, ఆర్థిక రంగములందు విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి, నవభారత సమాజ నిర్మాణమునకు కారకుడై " భారతదేశ ముద్దుబిడ్డ'' గా దేదీప్యమానముగా వెలుగొందెను.

### 30.4. దేశ విభజన (1947) లో నెహ్రూ పాత్ర :

1946లో రాజ్యాంగ పరిషత్ ఎన్నికలు జరిగెను. అందు ముస్లింలీగ్ పరాజయము పొందెను. జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వమున ముస్లింలీగ్‌తో జాతీయ తాత్కాలిక ప్రభుత్వ మేర్పడెను. కాని అప్పటికే నిరాశ చెందిన ముస్లింలీగ్ మత కల్లోలములను రెచ్చగొట్టి 1946 ఆగష్ట్ 16వ తేదీన 'ప్రత్యక్షచర్యా దినము' లేదా 'నిరసనదినము'ను (direct action day) పాటించుటతో కలకత్తా, నౌఖాలీ, బీహార్, పంజాబ్, మొదలగు ప్రాంతములలో మత కలహములు ప్రజ్వరిల్లెను. ఈ కలహములు అనతి కాలములోనే దేశ నలుమూలలా వ్యాపించి దాదాపు సంవత్సరముపాటు అరాచకము ప్రబలెను. అనేక అమాయకుల ప్రాణములను, స్త్రీల మానములను బలిగొనెను. జాతీయ నాయకులు ఈ కలహములను నిలుపుదలచేసి, శాంతిని పునరుద్ధరించుటకు చేసిన విజ్ఞాపనలు మతోన్మాదులైన ప్రజలు శిరసావహింపలేదు. ఇట్టి స్థితిలో కాంగ్రెస్ నాయకులు అమాయకులైన ప్రజల వధకంటే దేశవిభజన ఉత్తమము అని భావించిరి.

అయితే గాంధీజీ దేశ విభజనను తీవ్రముగా వ్యతిరేకించెను. ఒక సమయములో గాంధీజీ 'నా శవంపై దేశ విభజన' జరుగవలెను అని తీవ్రముగా నిరసన వ్యక్తము చేసెను. అట్టి సమయమున నెహ్రూ గాంధీజీ శిష్యునిగా, ఆయనను దేశ విభజనకు ఒప్పించుటకు అనేక విధములుగా ప్రయత్నించెను. ముస్లిం అభిమతమునకు విరుద్ధముగా, బలవంతముగా వారిపై ఐక్యత విధించుట, వారికి హిందువులతో కలిసి, మెలిసి ఉండమనుట అవాంఛనీయము, అటువంటి ఐక్యత 'ఒకరంటే, ఇంకొకరికి ఇష్టములేని భార్యాభర్తల సంబంధము' లాంటిది, కనుక ఆ సంబంధము చిరకాలముండదు, అటులనే ముస్లింల అభిమతమునకు విరుద్ధముగా ఐక్యత విధించుట ప్రజాస్వామ్య విరుద్ధము. అటువంటిది భారతదేశ ప్రగతికి అవరోధము, రాబోవు కాలమున దేశశ్రేయస్సుకు ముప్పు. అంతేగాక, వారిని బలాత్కారముగా భారతదేశంలో ఉండమనిన ఎట్టి పురోగతి సాధింపశక్యము కాదని నెహ్రూ గాంధీజీకి దేశవిభజనకు ఒప్పించెను.

### 30.5. ప్రధానిగా స్వతంత్ర భారతదేశమునకు నెహ్రూ చేసిన సేవ :

నవభారత రాజ్యాంగ నిర్మాణమునకు నెహ్రూ చేసిన సేవలు అపూర్వము. స్వతంత్ర భారతదేశమునకు ప్రథమ ప్రధానియై దాదాపు 14 సం॥లు అనగా ఆయన తన జీవితాంతము ఆ పదవిని చేపట్టి, భారతదేశ అభ్యున్నతికి, అంతర్జాతీయ రంగంలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ఎగురవేయుటకు అవిరళ కృషిచేసెను. సమర్ధవంతమైన పాలనను నిర్వహించి, రాజకీయ సుస్థిరతకు, ఆర్థికాభ్యుదయమునకు, ప్రపంచశాంతికి ఆయన గావించిన కృషి అపూర్వము.

### 30.5.1. నెహ్రూ దేశీయాంగ విధాన ఆశయాలు :

ప్రధానపదవిని స్వీకరించిన తదుపరి నెహ్రూ దేశీయాంగ విధానములో కొన్ని లక్ష్యములను సాధింపనెంచెను. అవి ఏమనగా:

1) ఆర్థిక స్వయం సమృద్ధిని సాధించుటకు వ్యవసాయ, పారిశ్రామిక నిర్మాణ కార్యక్రమములను చేపట్టుట.

2) ఆర్థిక అసమానత్వమును తగ్గించుట.

3) సాంఘిక న్యాయమును అందుబాటులో ఉండునట్లు చేయుట.

### 30.5.2. నెహ్రూ సాధించిన అంతరంగిక ప్రగతి :

1) దేశ విభజన వలన ఉత్పన్నమైన కాందిశీకుల సమస్యను పరిష్కరించుటకు, వారికి కనీస జీవన మనుగడ సౌకర్యములను కల్పించి, కుటీర, చిన్నతరహా సమస్యలను స్థాపించి, వారి జీవనము సుఖప్రదముగ సాగుటకు నెహ్రూ చేసిన కృషి విశిష్టమైనది. వారికొరకు తూర్పు పంజాబ్, హర్యానా, రాష్ట్రములలో వ్యవసాయ, పారిశ్రామిక రంగములను అభివృద్ధి పరచెను.

2) ప్రాంతీయ, కుల, మత తత్వములను నిర్మూలించి, స్వదేశ సంస్థానముల ఇండియన్ యూనియన్‌లో విలీనము చేయుటకు సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో సహకరించి, సమైక్య భారతదేశ నిర్మాణమునకు కృషిచేసెను.

3) భారతదేశ పురోగతికి 'సామ్యవాదము' అవసరమని నెహ్రూ భావించెను. భారతదేశాన్ని లౌకిక, ఆధునిక దేశముగా తీర్చిదిద్ది, ఆర్థిక అసమానత్వమును తగ్గించి, సోషలిస్టు సమాజమును హింసాయుత మార్గాన్ని గాక, శాంతియుత, ప్రజాస్వామ్య విధానముల ద్వారా సాధించాలని ప్రయత్నించి, భారతీయులను ఆధునిక జాతిగా రూపొందింపనెంచెను.

4) వయోజనులందరికి ఓటుహక్కు కల్పించి, ప్రజాస్వామ్య విధానమును దేశంలో సుస్థిరపరచి, ఫెడరల్, పార్లమెంటరీ పరిపాలనా వ్యవస్థలను సమన్వయముచేసి, అవి సమర్థవంతముగ తమ విధులను నిర్వహించుటకు పటిష్టమైన కేంద్ర ప్రభుత్వమును రూపొందించెను.

5) భూస్వామ్య, జాగీర్దార్, జమీందారీ విధానములను రద్దుచేసి, జమీందారుల భూములను కౌలుదార్లకు నష్టపరిహారము లేకుండా పంచియిచ్చి, ఆర్థిక అసమానతలను తగ్గించుటకు ప్రయత్నించెను.

6) నెహ్రూ దేశీయాంగ విధానంలో అత్యంత విశిష్టమైన అంశము దేశాభ్యుదయ సాధనకు పంచవర్ష ప్రణాళికలను రూపొందించి, దానికి అనుగుణముగ ప్రణాళికా సంఘమును రూపొందించుట, తద్వారా ఆర్థిక వ్యవసాయ పారిశ్రామిక రంగములందు అభ్యున్నతిని సాధించుటకు కృషి చేయుట. ఈ ప్రణాళికల ద్వారా నీటిపారుదల సౌకర్యములను కల్గించుటకు హిరాకుడ్, దామోదరలోయ, భాక్రానంగల్, నాగార్జునసాగర్ మొదలగు ప్రాజెక్టులను నిర్మించి, వానికి అనుబంధముగా విద్యుత్ కేంద్రములను నెలకొల్పెను. రైతులకు రసాయనిక ఎరువులను సరఫరా చేయుటకు, ఎరువుల కర్మాగారములను నిర్మించెను.

7) పారిశ్రామికాభివృద్ధికై అనేక పరిశ్రమలను నెలకొల్పెను. విదేశీ సాంకేతిక సహాయముతో రూర్కెలా, (జర్మనీ), భిలాయ్ (రష్యా) లందు ఉక్కు కర్మాగారములను స్థాపించెను. శాస్త్రీయ పరిశోధనకు అనేక భారీ పరిశోధనాలయములను నెలకొల్పెను.

8) గాంధీజీ ఆశయమైన గ్రామీణ ప్రాంతముల అభివృద్ధికి నెహ్రూ కృషిచేసెను. "సామాజిక అభివృద్ధి ప్రణాళిక"ల ద్వారా గ్రామీణ ప్రాంతమునందలి ప్రజల సాంఘికాభివృద్ధికి పాటుపడెను. ఈ ప్రణాళిక ముఖ్య లక్ష్యమేమనగా గ్రామీణులే స్వయంకృషి ద్వారా గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమములను అమలు జరుపుకొనుట. వారికి ప్రభుత్వము వ్యవసాయము, రవాణా, పారిశుద్ధ్య, స్త్రీ జనాభ్యుదయ, పశువుల, కోళ్ళ పెంపకము మొదలగు విషయములలో కార్యనిర్వాహణ, సాంకేతిక సహాయము నందించును. దీనిని అమలుపరుచుటకు పంచాయితీ రాజ్య విధానము అమలు చేయబడెను.

9) వెనుకబడిన జాతుల సముద్ధరణకు నెహ్రూ ప్రభుత్వము చేసిన సేవలు అపారము. హరిజనుల, ఆటవిక జాతుల, సంచార జాతులవారిని సమాజములో ఇతర కులా వారితో సమానస్థాయికి తీసుకొని వచ్చుటకు విద్యాలయములలో, ఉద్యోగములలో, శాసనసభలలో, ప్రత్యేక స్థానములు కేటాయించబడెను. అస్పృశ్యత నివారణకు ప్రత్యేవ చట్టములు చేయబడెను.

10) స్వాతంత్ర్య సముపార్జన తదుపరి, రాష్ట్ర పునర్నిర్మాణ కార్యక్రమములను చేపట్టి, రాష్ట్రముల అభివృద్ధికి కృషిచేసెను.

## 30.6. నెహ్రూ విదేశాంగ విధానము :

భారతదేశ తొలి ప్రధానిగా నెహ్రూ దేశీయాంగ విధానములో ఎంతటి సమర్ధతను ప్రదర్శించెనో, విదేశాంగ విధానమున కూడా అంతటి నైపుణ్యమును ప్రదర్శించెను. నెహ్రూ విదేశాంగ విధానంలోని ముఖ్యాంశాలు ఏమనగా :

### 30.6.1. అలీన విధానము (Non - Alignment) :

రెండవ ప్రపంచ యుద్ధానంతరము అంతర్జాతీయ రాజకీయములు కలుషితమై, ప్రపంచములోని దేశములు రెండు ప్రత్యేక కూటములుగ రూపొందెను. అవి ఏమనగా,

1) అమెరికా కూటమి

2) రష్యా కూటమి

ఇందు మొదటి కూటమివారు కమ్యూనిస్ట్ వ్యతిరేక రాజ్యాలకు, రెండవ కూటమిమైన రష్యా కమ్యూనిస్ట్ రాజ్యాలకు నాయకత్వము వహించెను. ఈ రెండు కూటముల మధ్య ఏర్పడిన స్పర్ధలు ఫలితముగా ప్రపంచమున ప్రచ్ఛన్న యుద్ధము ప్రారంభమయ్యెను. ఇట్టి సమయమున నెహ్రూ నాయకత్వములో భారతదేశము ఏ కూటమిలోను చేరక తటస్థ విధానమును లేక అలీన విధానమును అనుసరించెను. అలీన విధానమున ప్రపంచములో ఏమిజరిగినా ఉపేక్షించి ఉండుటయని, గోడమీద పిల్లివాటముయని భావించుట పొరపాటు. తటస్థమనగా మంచి, చెడులను సమానముగా ఎంచి మిన్నకుండుట కాదు. తటస్థమనగా ప్రపంచ రాజకీయములలో చురుకుగా పాల్గొని, ప్రచ్ఛన్న యుద్ధ తీవ్రతను తగ్గించి, ఎచట మంచియున్నా బలపరచుట, అటులనే ఎచట చెడు జరిగినా వ్యతిరేకించుట అని అర్థము. మనదేశ అలీన విధానము 'చైతన్య వంతమైన తటస్థవిధానము' (Dynamic Neutrality) అని మన విదేశాంగ విధాతలు నిర్వహించిరి. ఒకసారి నెహ్రూ అమెరికా ప్రతినిధుల సభలో మాట్లాడుతూ మన విదేశాంగ విధానమును గూర్చి 'మేము వాస్తవికతను గుర్తించని అంధులము కాదు, స్వేచ్ఛకు ఎవరు ప్రమాదము కల్గించినా, న్యాయానికి హాని కల్గించినా, ఎక్కడ దురాక్రమణ జరిగినా మేము తటస్థముగా ఉండబోము', అని పేర్కొనెను.

### 30.6.2. పంచశీల (Pancha Seela) :

పంచశీల అనగా ప్రపంచ రాజ్యములు అంతర్జాతీయ శాంతిసాధన కృషిలో అనుసరింపదగు కనీస నీతి, న్యాయ నియమావళి. నెహ్రూ తన జీవితాంతము సామ్రాజ్యవాదమును ఖండించి, మానవ హక్కుల రక్షణకు కృషిచేసెను. అందుచేతనే నెహ్రూ, చైనా ప్రధాని చౌ - ఎన్ - లైతో కలిసి 1954లో టిబెట్ నందు ఒక ఒప్పందమును కుదుర్చుకొనెను. ఈ నియమావళిలో ఐదు సూత్రములుండుటచే అది 'పంచశీల'గా గణనకెక్కెను. ఆ సూత్రములు ఏమనగా,

1) ఒకదేశము మరొకదేశము యొక్క ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వమును గౌరవించుట.
2) ఒక దేశము మరొక దేశముపై దురాక్రమణ చేయరాదు.
3) ఒక దేశము మరొక దేశము యొక్క అంతరంగిక వ్యవహారములలో జోక్యము చేసుకొనరాదు.
4) సమానత్వము, పరస్పర శ్రేయో దృష్టితో ఒకరినొకరు సహకరించుచూ అభివృద్ధిని సాధించుట.
5) శాంతియుత సహజీవనమును ఒక దేశము మరొక దేశముతో సాగించుట.

### 30.6.3. ఇతర అంశములు :

1) బ్రిటీష్ రాజ్య నేతృత్వములో నిర్వహింపబడు స్వతంత్ర రాజ్యముల సంస్థయగు 'కామన్‌వెల్త్'లో భారతదేశమునకు సభ్యత్వమును కలిగించి, బ్రిటన్ ద్వారా భారత ఆర్థిక పురోగతి మార్గములను చేపట్టెను.

2) ప్రపంచ శాంతి స్థాపనకు నెహ్రూ ఐక్యరాజ్యసమితి కార్యకలాపములందు సమితికి ఎంతగానో సహకరించెను. కొరియా, కాంగో, సూయజ్ మొదలగు ప్రదేశములందు శాంతిని నెలకొల్పుటకు సైన్యములను తరలించెను.

3) సోషలిస్టు సిద్ధాంతములలో విశ్వాసము కలిగిన నెహ్రూ సోవియట్ రష్యాతో, ప్రత్యేక మైత్రి సంబంధాన్ని ఏర్పాటు చేసికొనెను. అలాగే అమెరికా మరియు తదితర దేశములతో సత్సంబంధములు ఏర్పరచుకొనెను.

4) మారణాయుధముల తయారీ నిలుపుదల, నిర్యుద్ధసంధులు రూపొందించుకొనుట. ఐక్యరాజ్య సమితి ద్వారా వలస రాజ్యముల విముక్తికి గణనీయమైన సేవచేసెను.

5) క్రొత్తగా స్వాతంత్ర్యం పొందిన ఆఫ్రో - ఆసియా రాజ్యాధినేతల సమాఖ్యను 'బాండుంగ్' లో ఏర్పాటుచేసి ఇండోనేషియా స్వాతంత్ర్య సాధనకు తోడ్పడెను.

**30.7. ఘనత :**

నెహ్రూ గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త, పరిపాలనాదక్షుడే గాక, గొప్ప రచయిత, చరిత్రకారుడు, విమర్శకుడు, అతని రచనలలో 'Discovery of India, Glimpses of World HIstory' ముఖ్యమైనవి.

స్వతంత్ర భారతదేశమునకు నెహ్రూ చేసిన సేవ గణనీయమైనదైనను, ఆయన విధానములు పూర్తిగా విజయవంతము కాలేదు. 1962లో చైనా దురాక్రమణతో ఆయన 'అలీన విధానము' చావుదెబ్బతిని మనదేశ మనుగడకే ముప్పు వాటిల్లెను. శాంతి, అహింస అను నెపముల ద్వారా పాకిస్తాన్ కాశ్మీర్‌పై జరిపిన దురాక్రమణను ఐక్యరాజ్య సమితికి విన్నవించి, అనవసరముగా దానిని క్లిష్టసమస్య అగునట్లు చేసెను. ప్రణాళికలను రూపొందించుటలో అత్యాశకు వెళ్లి, నేటి దేశ ఆర్థిక దుస్థితికి పరోక్షముగా బాధ్యుడయ్యెను. ఏమైనను శ్రీ నెహ్రూ భారతదేశమునకు తనదంటూ ఒక విదేశాంగ విధానమును, ప్రజాస్వామ్య వాదనలను, అలీన విధానమును రూపొందించి దేశాభ్యుదయ సాధనకు కృషి చేసెను. శ్రీ నెహ్రూ గొప్ప ఆదర్శవాది కారని, కార్య సాధకుడు కారని, నేటి దేశములో పెక్కు అరిష్టములకు ముఖ్య కారణము ఆయన ఆలోచనా రహిత చర్యలని, అధికార వ్యామోహము కలవాడని, శత్రుశేష నిర్మూలనయే అతని ధ్యేయమని విమర్శకుల అభిప్రాయము. ప్రతి వ్యక్తికి విమర్శలు ఉండుట సహజము. నెహ్రూ తన కార్యదీక్షతో స్వాతంత్ర్యానంతరము భారతదేశమును "నవభారతదేశము" గా రూపొందించిన ఘనత ఆయనకే దక్కుతుంది. చాచా నెహ్రూగా పేరుగాంచి 1964 మే 27వ తేదీన ఆయన విశ్వములో విలీనమయ్యెను.

**మాదిరి ప్రశ్నలు :**

1) స్వాతంత్ర్యోద్యమములో శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ పాత్ర ఎట్టిది ?
2) స్వతంత్ర భారతదేశమునకు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవ ఎట్టిది ?
3) దేశ విభజనలో నెహ్రూ పాత్ర
4) అలీన విధానం
5) పంచశీల

Author

**C. Ravindra Raju M.A.,**